# శ్రీ కళ్యాణీయం

ఆత్మకథ

- సింగీతం లక్ష్మీ కళ్యాణి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 212

కౌముది మాసపత్రికలో

జనవరి 2016 సంచిక నుంచి ఫిబ్రవరి2018 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

విశేషమైన ఖ్యాతి గడించిన సినీదర్శకుడి భార్య ఐనప్పటికీ ,

సాధారణ గృహిణిగా ఎదుగుతూ

కుటుంబాన్ని అందంగా తీర్చిదిద్దుకున్న ఓ మహిళ స్ఫూర్తిదాయకమైన ఆత్మకథ..!!

(ప్రారంభం)

ఓ భర్త రియాక్షన్



ఒకరోజు కల్యాణి నా దగ్గరికొచ్చి మా రెండవ అమ్మాయి ఒక మంచి ఐడియా ఇచ్చిందనీ, దాన్ని పెద్దమ్మాయి కూడా సపోర్ట్ చేసిందనీ చెప్పింది. తన జీవిత విశేషాలను ఒక పుస్తకంగా రాస్తే బాగుంటుందంటున్నారట. నాకు బ్రహ్మాండంగా నచ్చేసింది. "ఈరోజే మొదలెట్టెయి" అన్నాను. అసలు నేను దాన్ని ప్రోత్సహించడానికి వేరే కారణం ఉంది. కల్యాణి నాలుగైదు మేజర్ ఆపరేషన్లను ఎదుర్కొంది. ఎన్నో హెల్త్ ప్రోబ్లమ్స్. అయినా ఏ రోజూ లోని బాధను బయటకి చెప్పే తత్వం కాదు. నేను దానికి పూర్తిగా ఆపోజిట్. రవ్వంత తలనొప్పి వస్తే కొండంత ఆర్భాటం చేస్తాను. ఇలా పుస్తకం రాస్తే, ఆ వ్యాపకంలో పడితే తన హెల్త్ ప్రాబ్లమ్స్ కొంతవరకు మరచిపోతుందని నా ఉద్దేశ్యం. కానీ స్ట్రెయిన్ అవుతుందేమోనని భయం. రెండు రోజులు రాసి చెయ్యి నొప్పని, నడుము నొప్పని మానేస్తుందనుకున్నాను. కానీ జరిగింది వేరు.

ఐడియా వచ్చిన తక్షణం ఆవేశం ఉప్పెనలా పొంగింది. వాడకుండా ఉన్న టి.టి.డి డైరీని తీసుకుని రాయడం మొదలెట్టింది. పది పేజీలు రాసి, చదివి వినిపించింది. స్టన్ అయ్యాను. ఇదేదో నాలుగు వాక్యాలు చేరదీసిన పుస్తకం కాదు ఒక అనుభవం. అర్ధరాత్రి లేచి ప్రక్కన చూస్తే ఉండేదికాదు. లౌంజ్‌లో రాసుకుంటూ ఉండేది. మధ్యాహ్నం నిద్రరాకపోతే, వెంటనే పుస్తకం తీసి రాసేసేది. ఆరునెలలకు పుస్తకం పూర్తయింది. కల్యాణి కళ్ళల్లో సెన్స్ ఆఫ్ అఛీవ్‌మెంట్ కనిపించింది. చాలామంది నా జీవిత చరిత్రను రాయమని సలహా ఇచ్చారు. బద్ధకమో, మరెందువల్లనో అది ఇంతవరకు జరగలేదు. అయినా నా జీవిత కథలో ఏముంటుంది గనుక - ఎక్కువ భాగం నా సినిమా వృత్తిలోని విశేషాలు, సెలబ్రిటీల పేర్లు. అక్కడక్కడా వినోదాన్ని పంచే సన్నివేశాలు. సరదాగా చదువుకోవడానికి బాగుండవచ్చు. ఎంతసేపూ ఒకే రంగు కనిపిస్తుంది. కానీ జీవితంలోని అన్ని రంగులను ఆస్వాదించాలంటే కల్యాణి రాసిన పుస్తకంలో అవన్నీ నాకు కనిపించాయి. దీన్ని చదివిన వాళ్ళు కూడా నాలాగే ఫీలౌతారనుకుంటున్నాను.

**సింగీతం శ్రీనివాసరావు**

***

**మనసులోని మాట**



ఇదంతా మొత్తం నా యద్దార్ధ గాధ. కల్పితాలేవీ లేవు. అతిశయోక్తులంతకన్నా లేవు. ఎటొచ్చీ నా ఆత్మ సంతృప్తి కోసం, నా జీవితాన్నంతా ఒక సింహావలోకనం చేసుకున్నానంతే. అసలు నా ఈ జీవిత చరిత్ర రాయమని ఐడియా ఇచ్చినది నా రెండవ కూతురు సుధ. చెల్లెలు చెప్పిన సలహా కరెక్టని చెప్పింది మా శకుంతల. వెంటనే మావారు బాగా ప్రోత్సహించారు. దీంతో నాకు ఏనుగు బలం వచ్చింది. నాలో ఏం చూసి నన్ను రాయడానికి పురికొల్పారో నాకిప్పటికీ అర్ధం కావడంలేదు. మా సుధ చెప్పడం ఏమిటి? ఈయన తందానతానంటూ నన్ను ప్రోత్సహించడం ఏమిటి? నాకైతే ఇదంతా వింత స్వప్నంలా అనిపిస్తోంది. నేనేనా ఈ ఆరునెలలూ ఇదంతా రాసినదీ అనిపించింది. కానీ ఇది రాస్తున్నంతసేపూ కొన్నిసార్లు బాధ వేసి కన్నీళ్ళూ వచ్చాయి. కొన్నిసార్లు నాలో నేనే నవ్వుకున్నాను. ఒకటి రెండు సార్లు కోపం కూడా వచ్చింది.

పెళ్ళికి ముందు మా నాన్నగారు కొన్ని విషయాలలో నన్ను ఉత్సాహపరిచి చిన్న మొక్క వేసి దాన్ని చిగురింపచేసారు. పెళ్ళయి వచ్చిన తర్వాత మా వారు తనతో కూడా ఆయన రచన, వ్యాసాలు, మాటలు, సంభాషణలలో శిక్షణ ఇచ్చి, చేయూతనిచ్చి, మా నాన్నగారు నాటి చిగురించిన మొక్కని పెంచి, పెద్దచేసి, పెద్ద పెద్ద కొమ్మల్ని తయారుచేశారు. తర్వాత నా జీవితం మూడు పువ్వులూ ఆరుకాయలుగా తయారై, భర్త ప్రోత్సాహంతో నాలో దాగి ఉన్న ఆత్మ విశ్వాసాన్ని వెలుపలికి రప్పించి, నన్ను ఎంతో పరిజ్ఞానం ఉన్న మనిషిలా తీర్చిదిద్దింది. నేను రాసిన దాంట్లో ప్రత్యేకత ఏమీ లేకపోయినా, ఎందుకో మావారిచ్చిన ప్రోత్సాహం వలన నాలో ఉత్సాహం, ఆత్మబలం వచ్చి, నా కలం నన్ను ఈ విధంగా రాసేటట్లు చేసింది. ఇది చదివే పాఠకులందరికీ నా ధన్యవాదాలు. ఇదేకాదు పెళ్ళికి ముందర, పెళ్ళయిన తర్వాత మాతో కొంతకాలం గడిపిన మా చెల్లెలు చి.సౌ రఖుమకి, నా కూతుళ్ళకి, నేను మర్చిపోయిన కొన్ని సంఘటనలు గుర్తుచేసినందుకు వాళ్ళకి నా ఆశీర్వాదములు.

**సింగీతం లక్ష్మీ కల్యాణి.**

శ్రీ - కల్యాణీయం



**పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మ రతాయచ**

**భజతాం కల్ప వృక్షాయ నమతాం కామధేనవే**

నేను కల్యాణిని. పూర్తిపేరు లక్ష్మీ కల్యాణి. 1936 సంవత్సరంలో అక్టోబరు 9 కాకినాడలో పుట్టాను. నా తల్లిదండ్రులు యలమర్తి విఠల్‌రావుగారు, శ్రీమతి ప్రఫుల్ల. కాని చాలామందికి మా అమ్మ పేరు తెలీదు. మేము కన్నడ మధ్వులం. మా అమ్మమ్మకి పిల్లలు పుట్టి పుట్టి నలుగురైదుగురు చనిపోవడం వల్ల మా అమ్మని పుల్లమ్మ అని పిలిచేవారు. కానీ మా నాన్నగారు మాత్రం పుల్లీలూ అని పిలిచేవారు. నా బాల్యమంతా కాకినాడ, రాజమండ్రి, బెజవాడలో గడిచింది. నాకు అయిదారు సంవత్సరాలు వచ్చేసరికి నెల్లూరు జిల్లా అల్లూరికి వచ్చాము. అక్కడ మా నాన్నగారు స్కూల్ మాస్టరుగా పనిచేసేవారు. రెండు మూడేళ్ళు అక్కడ గడిచిపోయింది. తర్వాత నెల్లూరికి వచ్చాము. నెల్లూరులో సెంట్ పీటర్స్ హైస్కూల్లో మా నాన్నగారు ఉద్యోగం చేసారు. మా పెద్ద చెల్లెలు సుశీల 1939లో నరసీపట్నంలో పుట్టింది. తర్వాత మూడేళ్ళకి ఒక ఆడపిల్ల పుట్టి దానికి మూడేళ్ళ తర్వాత లివర్ జబ్బుతో చనిపోయింది. ఆ తర్వాత మూడేళ్ళకి మా అమ్మకి మగపిల్లవాడు పుట్టాడు. అపురూపంగా మనవడు పుట్టాడన్న సంతోషంతో మదరాసులో టీచరుద్యోగం చేస్తున్న మా తాతగారు అదేపనిగా సెలవు పెట్టి మదరాసు నుంచి వచ్చారు. నామకరణం మా నాన్నగారు ఉన్నంతలో చాలా వైభవంగా చేశారు. మా నాన్నగారి స్టూడెంట్స్ ఒక్కొక్కళ్ళు ఇళ్ళనుండి అరటికాయలు, అరటిపండ్ల గెలలు, పండ్లు, పాలు పెరుగు అన్నీ పంపించారు. అవన్నీ వాళ్ళ ఇళ్ళల్లోవే. ఎందుకంటే ఆ కాలంలో చాలామంది ఆవులు, గేదెలు, పాడి, పంట ఇంట్లోనే పెట్టుకునేవారు. నామకరణం అయిన తరువాత అందరూ చాలా సంతోషించాం. కానీ ఆ సంతోషం ఎన్నాళ్ళో మిగలలేదు. ఆ పసివాడు పధ్నాలుగురోజులకే చనిపోయాడు. ఆ బెంగతో మా తాతగారికి క్రమేపి ఆరోగ్యం క్షీణించసాగింది. మదరాసుకు పిల్చుకు వెళ్ళి వైద్యం చేయించినా ఫలితం లేక కొన్నాళ్ళకి చనిపోయారు. నా చిన్నతనంలోనే నేనీ కష్టాలన్నీ చూడవలసి వచ్చింది.

మా తాతగారి పేరు పార్థీ వెంకోబరావుగారు, మా అమ్మమ్మ పేరు పార్థీ కమల. మా నాన్నగారి తండ్రిపేరు యలమర్తి సుబ్బారావుగారు, తల్లి లక్ష్మీబాయమ్మ. కానీ వారిద్దరినీ నేను చూడలేదు. మా నాన్నగారి తండ్రి మా నాన్నగారి చిన్నతనంలోనే పోయారట. తల్లి ఇంకొన్నాళ్ళుండి పోయిందట. మా తాతగారికి నేనన్నా, నాకు తాతగారు, అమ్మమ్మలన్నా చాలా ఇష్టం. అసలు నిజానికి ఆయన బ్రతికుండగా కలలు కనేవారు. నన్ను వాళ్ళ దగ్గర పెట్టుకుని మదరాసులోనే చదివించాలని ఆయన కోరిక. నేను పెద్దయిన తర్వాత నాకు పెళ్ళయి మదరాసుకు రాగానే మా తాతగారే జ్ఞాపకం వచ్చేవారు. ఈ విధంగానైనా ఆయన ఆత్మకి శాంతి లభించిందనుకునేదాన్ని. మా

అమ్మమ్మ, తాతగారు మదరాసులో ఉంటూ ఉండేవారు. అంతకు ముందు నర్సీపట్నంలో చాలా సంవత్సరాలుండి ఆఖరుకి మదరాసు చేరారు. వాళ్ళకి మగపిల్లలు లేరు. మా అమ్మా నాన్నలకు కూడా మగపిల్లలు లేరు. నాకు మగపిల్లలు లేరు. మా అమ్మకి ముగ్గురాడపిల్లలు. నాకు ఇద్దరాడపిల్లలు. మా పెద్ద చెల్లెలికి మాత్రం ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి. మా చిన్న చెల్లెలికి ముగ్గురూ ఆడపిల్లలే. ఆఖరుకి దాని ముగ్గురు కూతుళ్ళకీ ఆడపిల్లలే. మా చెల్లెలికి నలుగురు మనవరాళ్ళు. మా తాతగారు, అమ్మమ్మ అప్పుడప్పుడు నెల్లూరు వచ్చి మాతో గడుపుతూ ఉండేవారు.

మా నాన్నగారి సొంత చెల్లెలి పేరు సీత. మా నాన్నగారి పెద్దమ్మ కూతురు పేరు కల్యాణి. కానీ, కల్యాణి అంటే మా నాన్నగారికి పంచప్రాణాలు. "నాకన్నా ఆ కల్యాణే నీకెక్కువా అన్నయ్యా?" అంటూ మా అత్త అసూయపడేదట. కల్యాణి అత్తవారు విశాఖపట్నం. కల్యాణి ముగ్గురు కూతుళ్ళని కని చిన్నతనంలోనే చనిపోయిందిట. అందువలన మా నాన్నగారు తన తల్లిగారి పేరు లక్ష్మి, చెల్లెలు కల్యాణి పేరు రెండూ జత చేసి లక్ష్మీకల్యాణి అని నాకు పెట్టారుట. కానీ, పెళ్ళికి ముందు నేను లక్ష్మిగా చలామణి అయ్యాను. అందరూ నన్ను లక్ష్మీ అని పిలిచేవారు. పెళ్ళయిన తరువాతనే కల్యాణినయ్యాను. పెళ్ళి చూపులయింతరువాత మా మామగారు బయలుదేరేటప్పుడు "సరేనమ్మా కల్యాణి, వస్తాం" అన్నారు. ఈ విషయం మా అమ్మమ్మతో చెబితే "అయితే మీ అత్తవారింట్లో నిన్ను కల్యాణి అనే పిలుస్తారన్నమాట" అంది చిరునవ్వుతో.

మా అమ్మమ్మ తాతగారి తరాలలో వారందరిది ఉమ్మడి కుటుంబం. మంచి అయినా చెడు అయినా అందరూ ఒకచోట కలవాల్సిందే పైగా ఆకాలంలో తల్లీ కూతుళ్ళు ఒక్కసారిగా ప్రసవించేవారట ఇంట్లో రెండు పురిటి మంచాలుండేవిట. చాకిరీ చెయ్యలేక మిగతా వాళ్ళ పని అయిపోయేదిట. అప్పట్లో ఆస్పత్రి సౌకర్యాలు లేవుగా. ఇంట్లో పురుళ్ళు పోసేది మంత్రసానులే. ఇలా ఒకసారి మా తాతమ్మగారు పోతే అందరూ బెజవాడలో చేరవలసి వచ్చింది. ఆ కాలంలో పార్థీవారంటే చాలా పేరున్న కుటుంబం. మా తాతగారి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, వాళ్ళ కుటుంబాలు అందరూ బెజవాడలో ఉన్న మా చినతాతగారు పార్థీ శేషగిరిరావు గారి ఇంట్లో చేరేవారు. వాళ్ళంతా మైలవాళ్ళే. మా నాన్నగారు యలమర్తి కుటుంబం వలన మాకు మైల లేదు. కానీ నేను పిల్లలతో కలిసి ఆడుకోడానికి నా గౌన్లు కొన్ని వాళ్ళ దగ్గర పెట్టి ఆడుకునేదాన్ని. ఆడుకునేంతవరకు ఆడుకుని ఆ తర్వాత కొట్టుకుని దెబ్బలాడే వాళ్ళం. కానీ ఆ చిన్నతనపు రోజులు మళ్ళీరావుకదా. కష్టాలు తెలీదు, నష్టాలు తెలీదు. నిజానికి అది ముసలావిడ చనిపోయిన ఇల్లయినా, ఇల్లంతా చాలామంది ఉండడం వలన పెళ్ళిల్లు లాగా ఉండేది.

నెల్లూరులోనే మా నాన్నగారు సెంట్ పీటర్స్ హైస్కూల్లో టీచర్‌గా ఉండేవారు కదా, నేను నెల్లూరులోని ట్రైనింగ్ స్కూల్‌లో చదివేదాన్ని. నేను 5 వ తరగతో, ఏడవ తరగతో గర్ల్స్ ట్రైనింగ్ స్కూల్లో చదువుతున్నప్పుడు, ఒకరోజు నా ఇంగ్లీషు టెక్స్ట్ బుక్ పోయింది. స్కూల్లో, ఇంట్లోను అన్ని చోట్లా వెతికాను. ఇంట్లో చెప్పాను. మా అమ్మ, నాన్నగారు, నాకు నిర్లక్ష్యమని, అందువలన పుస్తకం పోగొట్టుకున్నానని కాస్త చీవాట్లు పెట్టారు. మూడవరోజున నేను, నా స్నేహితురాలు సరోజని, మేమిద్దరం స్కూలు కాంపౌండులోంచి క్లాసుకి వెళ్తుంటే ప్లే గ్రౌండ్‌లో ఒక పుస్తకం నుంచి తీసేసిన అట్ట కనిపించింది. ఎందుకో మాకు సందేహం వచ్చి, నేను వెంటనే పరుగెత్తికెళ్ళి ఆ కవరు చూస్తే, దాంట్లో పుస్తకం లేదు. నా పుస్తకం కవరు లాగుందే అనుకుని చూస్తుంటే దానిపైన అంటించిన లేబుల్ కనిపించింది. ఆ లేబుల్ మీద వై. లక్ష్మీ కల్యాణి అని పేరుంది. "సరోజనీ! ఇది నా పుస్తకం అట్టేనే, చూడూ! "అని దానికి చూపిస్తే, సరోజిని, "అయితే నీ పుస్తకం ఆ పుష్పే తీసి ఉంటుంది" అంది. ఈ విషయం నేను టీచరుతో చెప్పడానికి భయపడ్డాను.

ఇంటికి వచ్చి జరిగిన విషయమంతా చెపితే "టీచరుకు చెప్పావా?" అనడిగారు. లేదన్నాను. మర్నాడు మాములుగా స్కూలుకెళ్ళి తలవంచి ఏదో రాసుకుంటున్నాను. టీచరు కుర్చీ దగ్గర నిల్చుని ఉంది. ఉన్నట్టుండి మా అమ్మ గొంతుక వినిపించింది. తలెత్తి చూస్తే మా

అమ్మ. స్కూలుకి వచ్చింది, తనకెలా తెలుసు మా క్లాసు. టీచరేదో అడుగుతోంది మా అమ్మని "మీ అమ్మాయంటే ఎవరు? ఏం పేరు?". మా అమ్మ "లక్ష్మీ కల్యాణి.. అదుగో" అంటూ నావైపు చూపించి, "మూడు రోజుల కిందట దాని పుస్తకం పోగొట్టుకుంది, నిన్న పుస్తకానికి వేసుకున్న అట్ట కనిపించిందిట" అని చెప్పింది.

అప్పుడు టీచరు ఒక్కొక్కళ్ళ పుస్తకాలనీ చెక్ చేస్తూ పుష్ప అనే అమ్మాయి దగ్గరకు వచ్చింది. అప్పటికే ఆ అమ్మాయి కొన్ని దొంగతనాలు చేసేదని కొంతమంది అమ్మాయిలకి తెలుసు. టీచర్ ఆ అమ్మాయినడిగితే "నాదే ఈ పుస్తకం" అని వాదించింది. టీచరు పేజీలు తిరగేస్తూంటే మధ్యలో ఒక పేజీలో లక్ష్మీ కల్యాణి అని రాసి ఉంది. టీచరప్పుడు ఆ అమ్మాయిని తిట్టి పుస్తకం తీసి నాకిచ్చింది. కానీ నాకు మాత్రం ఇంటిలో అంత బెరుకుగా ఉంటున్న మా అమ్మ ఇంత ధైర్యంగా స్కూలుకివచ్చి, పైగా నాక్లాసు ఎక్కడుందో తెలుసుకుని ఎలా వచ్చిందో? ఆవిడ చిన్నతనంలో పట్టుమని కొన్నాళ్ళు కూడా చదువుకోలేదు. స్కూలుకి అంతకన్నా వెళ్ళలేదు. పిల్లలు పోయిపోయి పుట్టడంతో మా అమ్మమ్మ, తాతగారు, మా అమ్మని, పిన్నిని, స్కూలుకి కూడా పంపేవారు కాదుట.

అప్పుడు, అంటే 1947లో మా మూడో చెల్లెలు పుట్టింది. దాని పేరు రఖుమ. నాకూ దానికీ పదకొండు సంవత్సరాలు తేడా అందుకని చిన్నప్పటినుంచి అది నాతో దెబ్బలాడకుండా కొంచెం గౌరవంగా చూస్తుండేది. క్రమంగా పెరిగి పెద్దవాళ్ళయిన కొద్దీ మా చెల్లెళ్ళిద్దరూ దెబ్బలాడుకునేవారు. నేను కొంచెం పెద్దదాన్ని కనుక వాళ్ళ తగువులు తీర్చేదాన్ని. మా సుశీల "అక్క ఏమైనా అంటే ఊరుకుంటావు. నేనేమైనా అంటే అలా గింజుకుంటావు అన్నిటికీ ఏడుస్తావేం? పైగా అమ్మావాళ్ళకి చాడీలు కూడా చెప్తావ్" అనేది.

ఇక్కడ ఒక సంగతి. మా చిన్న చెల్లెలు రఖుమ పుట్టినప్పుడు ఇరవై రోజులకి మా అమ్మకి జబ్బుచేసింది. ఆమెకి ప్రసవం అయిన అమెరికన్ హాస్పటల్‌లోనే ట్రీట్‌మెంటుకి చేరింది. ఒక నెల్లాళ్ళు ఉండవలసి వచ్చింది. రెండురోజులు నోటమాట పడిపోయింది. ఎడమవైపు వాతం వచ్చి స్వాధీనం తప్పిపోయింది. ఊరివాళ్ళు, మా చుట్టాలు అంతా పిల్ల పుట్టిన వేళావిశేషం వాళ్ళమ్మకి జబ్బు చేసింది అని ఆడిపోసుకున్నారు. క్రమేపి జబ్బు నయమై, మాట్లాడ్డానికొచ్చి ఆరోగ్యం చేకూరి ఇంటికి రాగానే, ఆ తిట్టిన నోళ్ళే "పుట్టిన పాప అదృష్టం, తల్లిని బతికించుకుంది" అన్నారు. అలా మా చెల్లెలు పెద్దదవుతూ ఉంది. నేను ట్రైనింగ్ మిడిల్ స్కూల్ నుంచి సెంట్ జోసెఫ్స్ గరల్స్ హై స్కూల్‌కి మారాను. పదవ తరగతి వరకు అక్కడే చదివాను. అంటే మేము నెల్లూరులో చాలా సంవత్సరాలు ఉండిపోయాము.

మా నాన్నగారు M.B.ED, అయినా ఇంకా హై స్కూల్లోనే చెయ్యడం, లెక్చరర్ షిప్ రాకపోవడం ఆయనని చాలా వేధించేది. అక్కడా, ఇక్కడా ట్రై చేస్తూ వచ్చారు. కొన్నాళ్ళకి 1951లో భీమవరం కాలేజీలో లెక్చరర్‌గా జాయిన్ అయ్యారు. అప్పుడు దాని పేరు W.G.B.College అంటే West Godavari Bhimavaram College కొన్నేళ్ళ తర్వాత D.N.R.Collegeగా మారింది. దంతులూరి నారాయణ రాజు కాలేజ్. కానీ నాది, మా సుశీల చదువుల వల్ల మకాం నెల్లూరు నుండి భీమవరంకి మార్చలేకపోయాము. ఒక సంవత్సరం మా నాన్నగారు భీమవరంలో ఒంటరిగానే ఉంటూ వచ్చారు. నా పదవతరగతి వేసవి సెలవులకి మొత్తం మీద నెల్లూరు నుంచి భీమవరంకి మకాం మార్చాము. అప్పటికింకా మా చిన్న చెల్లెల్ని నాలుగేళ్ళేకదా అని స్కూల్లో చేర్పించలేదు. ఆ రోజుల్లో అయిదు సంవత్సరాలకి కానీ పిల్లల్ని స్కూల్లో చేర్పించేవాళ్ళు కాదు. ఇంటి దగ్గరే అయిదవ క్లాసు వరకు మాష్టర్ని పెట్టి చదివించారు. S.S.L.C నేను భీమవరం U.L.C.M.(Christian) Schoolలో చదివాను.

స్కూల్ ఫైనల్ అవగానే కాలేజీలో చేరాలి కదా! ఆ కాలేజీ కో - ఎడ్యుకేషన్ అయినందువలన మా నాన్నగారికెందుకో నన్ను కాలేజీలో చేర్పించడానికి ఇష్టం లేకపోయింది. ఆయన కొన్ని విషయాలలో స్ట్రిక్ట్‌గా ఉండేవారు. ఇరుగుపొరుగు మగపిల్లలతో చనువుగా మాట్లాడరాదు. వెకిలి నవ్వులు నవ్వరాదు. ఇలా ఆంక్షలు విధించేవారు. మళ్ళీ బజార్లకి, మా అమ్మ వాళ్ళతో సినిమాలకి పంపించేవారు. స్నేహితులతో కలిసి వెళ్ళడం అవేవీ జరగలేదు. కానీ కొన్ని విషయాలలో ఎంకరేజ్ చేసేవారు. మహిళా మండలిలో చేరి మేము టైపు,

మ్యూజిక్, మా చిన్న చెల్లెలు డ్యాన్స్ ఇవన్నీ నేర్చుకునేవాళ్ళం. మా రఖుమ డాన్స్ ప్రదర్శనలు ఇచ్చేది. భీమవరం చుట్టుపక్కల ఉన్న వీరవాసరం మొదలైన ఊళ్ళలో అది కన్యకా పరమేశ్వరిగా, అప్పటి A.C.T.O కూతురు కల్యాణి శివుడుగా, డ్యాన్సు ప్రదర్శనలు ఇచ్చేవారు. వాళ్ళిద్దరికీ చాలామంచి పేరొచ్చింది. నేను, మా సుశీల మహిళా మండలి ఆధ్వర్యంలో సంగీత కచేరీలు - కర్ణాటక సంగీతం కూడా చేసేవాళ్ళం. అప్పటి మా సంగీతం మాష్టారు ఉప్పలపాటి సూర్యనారాయణగారు. చెంబై వైద్యనాధన్ భాగవతార్‌గారి శిష్యుడు. ఇంటివద్ద కూడా రెండేళ్ళు ఆయన చేత సంగీత పాఠాలు చెప్పించుకున్నాము. నేను మహిళా మండలిలో కొన్నాళ్ళు జాయింట్ సెక్రటరిగా కూడా వెలగబెట్టాను.

ఇవన్నీ ఇలా ఉండగా మా నాన్నగారికి సడన్‌గా ఒక ఆలోచన తట్టింది. హైదరాబాదులో మాకు వరుసకి మేనమామ పి.ఎస్.రావ్ ఆంధ్రజనతా డైలీ పేపర్‌లో పనిచేసేవారు. అతనితో మాట్లాడి నన్ను భీమవరం కరస్పాండెంట్‌గా చెయ్యాలని ప్రోత్సహించారు. నేను మాత్రం పెద్ద పెద్ద సభలకి, పొరుగూర్లకి వెళ్ళకుండా ఇన్‌ఫర్మేషన్ రాబట్టి, ఊళ్ళోని మీటింగ్స్‌కి, ఫంక్షన్స్‌కి మా లేడీస్ క్లబ్ మీటింగ్స్, ఫంక్షన్స్ అటెండు అయి అవన్నీ ఆంధ్ర జనతా పేపర్‌కి పంపేదాన్ని. అవన్నీ పబ్లిష్ అయ్యేవి. నాకు స్టాంపుల ఖర్చు అయింది. కానీ అఫీషియల్‌గా హైదరాబాదు నుండి ఒక్క పైసా కూడా రాలేదు. మా నాన్నగారు మాత్రం "డబ్బు కోసమా? నీకు జర్నలిజం అలవాటవుతోంది కదా!" అనేవారు. కానీ ఆయన ప్రోత్సాహంతో నా ముందు లైఫ్‌లో నా రచనలకు దారితీస్తుందని అప్పుడు ఊహించలేకపోయాను.

2

**సరే, కాలేజీలో** చేర్పించలేదు కదా.. నాకు పాఠాలు చెప్పందే మా నాన్నగార్ని వదిలేదాన్ని కాదు. బనీను, పంచె పర్వాలేదా? లేక షర్టు, పాంటు వేసుకోవాలా అని నవ్వేవారు. ఇంటికి కొంతమంది విద్యార్థులు మగపిల్లలు ట్యూషన్‌కి వచ్చేవాళ్ళు. నేను తలుపు వెనకాలనుంచి వాళ్ళకి చెప్పే నోట్సు రాసుకునేదాన్ని. కొంతకాలం వరకు మా నాన్నగారికి విషయం తెలియలేదు. మా అమ్మ చెప్పింది. ఇక అప్పట్నుంచి కొంచెం పెద్ద గొంతుతో పాఠాలు చెప్పేవారు వాళ్ళకి. కాలేజీలో ప్రతి పరీక్షకు అక్కడ క్వొశ్చెన్ పేపర్ తెచ్చి, నా చేత జవాబులు రాయించి, ఆ పేపరును తీసుకెళ్ళి వాటికి చెందిన లెక్చరర్ల చేత దిద్దించేవారు. హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్ నా సబ్జెక్ట్స్. ఇవి తన సబ్జెక్ట్స్ అయినా కూడా, కాలేజీకే తీసుకెళ్ళి హిస్టరీ లెక్చరర్ ఆంజనేయులుగారి చేత, ఎకనామిక్స్, పాలిటిక్స్ హనుమంతరావుగారిచేత, పట్నాయక్‌గారి చేత దిద్దించేవారు.

ఆ లెక్చరర్లు, నా పేపరు చూసి, "మన స్టూడెంట్స్ కన్నా మీ అమ్మాయి చాలా బెటరండి" అనేవారని నాతో వచ్చి చెప్పేవారు మా నాన్నగారు. బహుశా నేను కాలేజీలో చేరలేదని బాధపడ్తున్నానని ఆయనని బాధించేదేమో ఎప్పుడైనా మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిలైనా ఏమీ తిట్టేవారు కాదు.

మా క్లాస్ మేట్సందరూ కాలేజీ నుంచి మా యింటికొచ్చి, నాతో, "మీ నాన్నగారు ఎంత పంక్చుయల్ మనిషో, ఒక్కరోజు కూడా కాలేజీకి సెలవు పెట్టరు. అది సరే కానీ బాయిస్, గర్ల్స్ సమానంగా చదవాలి, వాళ్ళలాగే ఉద్యోగాలు చెయ్యాలి, మంచి ఆదర్శాలు కలిగి వుండాలని చెప్తుంటారు కదా, నిన్ను, మీ చెల్లెళ్ళి ఎందుకు కాలేజీలో చేర్పించలేదు?" అని అడిగేవారు.

నాకది వినగానే ఏడుపొచ్చేది, కానీ ఏదో చెప్పి సర్దేసేదాన్ని. నేను సరే ఆర్ట్స్, హిస్టరీ మెయిన్.. పాపం మా సుశీల ఇంగ్లీష్ లిటరేచర్ మెయిన్. అది కూడా ప్రైవేట్‌గానే చదివి పాసయింది. "అది చాలా గ్రేట్ కదూ!" అనుకునేదాన్ని. పైగా నేను బి.ఏ పాసవ్వగానే

మా నాన్నగారు తెలుగు బి.ఏ కూడా చెయ్యమని అడిగారు. మా నాన్నగారి కంటే చిన్నవారైన తెలుగు లెక్చరర్ దిగుమర్తి సీతారామయ్యగారు తానే తెలుగు కోచింగ్ ఇస్తానని ముందుకు వచ్చారట. పైగా మీ అమ్మాయిని, మా తమ్ముడికిచ్చి పెళ్ళిచేయమని, ఈరోజుల్లో మధ్వులు, తెలుగు బ్రాహ్మణులు కలిసిపోతున్నారని పదే పదే అనేవారట. మా నాన్నగారు నన్ను 'తెలుగు బి.ఏ చేస్తావా? ' అనడిగితే నేనన్నాను, 'ఈ నాలుగేళ్ళు ఇంటర్ రెండు సంవత్సరాలు, బి.ఏ రెండు సంవత్సరాలు ప్రైవేటుగా చదివి సతమతమైపోయింది. నాకు ఎక్స్ట్రా ఏ డిగ్రీ వద్దు' అన్నాను. ఎందుకంటే బి.ఏ (ఇంగ్లీషు) ఫస్ట్ పేపర్‌లో ఫెయిల్ అయ్యాను. దాంతో విసుగెత్తి పోయింది. నా పెళ్ళయి వచ్చేశాక మా రఖుమని డి.ఎన్.ఆర్ కాలేజ్ హైస్కూల్‌లో చదివించి ఆటోమేటిక్‌గా కాలేజీలో చేర్పించారు. "దానినెలా చేర్పించారు?" అనడిగే ధైర్యం లేకపోయింది నాకు పెళ్ళైనా కూడా. బి.ఏ అవగానే పెళ్ళైంది నాకు. మా సుశీల, రఖుమలని మాత్రం గుంటూరు బి.యిడి కోర్స్‌కి హాస్టల్లో చేర్పించి చదివించారు.

మా నాన్నగారు కొన్ని కొన్ని విషయాల్లో ఎంత స్ట్రిక్ట్‌గా వుంటారో కొన్ని విషయాల్లో సరదాగా ఉండేవారు. సాధారణంగా ఊళ్ళల్లో పెళ్ళిళ్ళకి గాని, హిస్టరీ కాన్ఫరెన్స్‌కి గానీ ఒక్కరే వెళ్ళి వస్తూ ఉండేవాళ్ళు. ఒక రోజు ఆయన భోజనం చేస్తున్నారు. ఆయన భోజనం చేస్తున్నంతసేపు మా పిల్లల భోజనాలు అయినా కూడా ఆయన ఎదురుగుండా కూర్చుని కబుర్లు చెప్తూ వుండాలి. అలాగే పొద్దున్నే ఏదో ఊరి నుంచి వచ్చి మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు.

మా రఖుమ "నాన్నగారూ, ఎప్పుడూ మీరొక్కరే ఊరెళ్తున్నారు. మమ్మల్ని పిల్చుకెళ్ళరేం?" అని అడిగింది.

వెంటనే మా నాన్నగారు "మిమ్మల్ని మీ మొగుళ్ళు పిల్చుకెళ్తారులే" అన్నారు.

"మరి మా అమ్మని పిల్చుకెళ్ళడం లేదే" అని అడిగింది వెంటనే.

మేం ఎవ్వరం అలా అడుగుతుందని ఊహించలేదు. మా అమ్మ, నేను, సుశీల నిర్ఘాంతపోయాం. విపరీతమైన టెన్షన్ ఫీలయ్యాం. అది ఆఖరుది కదా, గారాబంగా పెరిగింది, దానికి చాలా ధైర్యం. ఏం తిడతారో అని మేమంతా ఆయననే చూస్తున్నాం.

వెంటనే మా నాన్నగారు పక్కున నవ్వారు. దాంతో మేమంతా కలిసి నవ్వాం. 'ఎంత గడుసుదానివే!' అన్నారాయన. ఇంకేం చేస్తారు. ఏమైనా మా చెల్లెలికి మా నాన్నగారిచ్చిన సమాధానం నా పెళ్ళైన తర్వాత నా విషయంలో వాస్తవమయ్యింది.

మా నాన్నగారు హార్మోనియం బాగా వాయించేవారు. అది ఆయన హాబీ. సరదాగా కాలేజీ కల్చరల్స్ ఆర్కెస్ట్రాతో వాయిస్తూ వుండేవారు. ఆయన కల్చరల్స్‌కి కన్వీనర్‌గా వుండేవారు. అలా పోనీకదా అని వాయిస్తుంటే హార్మోనిస్టు అని, ఈయనని తెలియని వాళ్ళు, అనేవారుట. దాంతో కాలేజీలో వాయించడం మానేశారు. మా అమ్మకూడా బాగా హార్మోనియం వాయించేది. కానీ మా రఖుమ పుట్టినపుడు జబ్బు చేసింది కదా, దాంతో ఎడం చేయి, స్వాధీనం పోయింది. దాంతో హార్మోనియం వాయించడం మానేసింది. ఆ సరదా చంపుకోలేక మేమెవ్వరైనా హార్మోనియం bellows నొక్కితే తను రీడ్స్ నొక్కి వాయించేది. పాటలు కూడా పాడేది. ఆమె వాయించడం చూసి వాళ్ళ చిన్నాన్నగారు ఆయన దగ్గరున్న హార్మోనియం అలాగే గిఫ్ట్‌గా ఇచ్చేశారు మా అమ్మకి.

రోజూ కాలేజీ నుంచి రాగానే, సాయంత్రం పూట మా నాన్నగారు రిక్రియేషన్స్‌కి హార్మోనియం పెట్టుకుని కూర్చునేవారు. మా సుశీల, పాటలు (ముఖ్యంగా హిందీ పాటలు) బాగా పాడేది. మంచి కంఠం. ఆయన మాకు కొన్ని ఆనాటి హిందీ పాటలు, కె.ఎల్.సైగల్, పంకజ్ మల్లిక్, అన్మోల్‌ఘడి పాటలు, బాబుల్‌మేరా, పియామిలన్ కో జానా, అన్మోల్‌ఘడిలోని ఆజా ఆజా మొదలైన పాటలు నేర్పిస్తూ, రాగాల పేర్లు చెప్తూ గుర్తుకి యమన్ కల్యాణి అయితే దానికి తగ్గపాట "రాధా సమేతా కృష్ణా", భాగేశ్వరి అయితే "జాగ్ దర్ద్ ఇష్క్‌జాగ్" అనేపాట నేర్పించారు. పెళ్ళైన తర్వాత నేను, మా వారు కూడా కొన్ని క్లాసికల్ సినిమాలు చూసినపుడు రాగాలు డిస్కస్ చేసేవాళ్ళం. మా నాన్నగారు హార్మోనియం వాయిస్తూ మా సుశీల చేత 6,8 పాటలు పాడించి నన్ను పిలిచేవారు. నన్ను ఐ వాష్‌కి పిలిచారని

ఉడుకుమోత్తనంతో లేచిపోయేదాన్ని. అమాయకురాలు మా అమ్మ. "ఆయనలా ఆశగా పిలిస్తే లేచి వెళ్ళిపోతావేమే?" అనేది. నే కూడా బాగా పాడతాననుకోండి.

"మా నాన్నగారి కాలేజీలో ప్రతియేటా కాలేజి కల్చరల్స్ జరుగుతుంటాయి.. మా నాన్నగారు కన్వీనర్" అని చెప్పానుగా. ఒకసారి ఏమయిందంటే మా చిన్న చెల్లెలు రఘుమకి ఏడు, ఎనిమిది సంవత్సరాలు వున్నప్పుడు మా నాన్నగారు, కెమిస్ట్రీ లెక్చరర్ వీరభద్రాచారిగారు కలిసి దానికి ఒక పాటను ట్యూన్ కట్టి నేర్పించి ప్రాక్టీస్ చేయించారు. కాలేజి ఫంక్షన్‌లో పాడటానికి.

"చందమామ రావే ఓ జాబిలీ రావే" అని అది స్టేజి ఎక్కి పాడింది. వెంటనే స్టూడెంట్స్, అక్కడ వున్న ప్రేక్షకులంతా వన్స్‌మోర్ అని కేకలు పెట్టారు.  మొదటి సారి స్టేజి ఎక్కి పాడింది. వెంటనే స్టూడెంట్స్, అక్కడ వున్న ప్రేక్షకులంతా వన్స్‌మోర్ అని కేకలు పెట్టారు. అసలే అది మొదటిసారి స్టేజ్ ఎక్కిపాడడం, మళ్ళీ పాడమనే సరికి దానికి ఏం చేయాలో తోచక అక్కడే నిలబడిపోయింది. వెంటనే వీరభద్రాచారిగారు వెళ్ళి "మళ్ళీ పాడమ్మా" అని అడిగితే పాడింది.

ఆడియన్సులోంచి "ఎవర్రా ఆ పాప? చాలా బాగా పాడింది" అని కొందరు, "మన విఠల్ రావుగారి అమ్మాయిరా" అని కొందరు.

ప్రేక్షకులలో నేనూ వున్నాను. నాకెంత సంతోషం వేసిందో. జరిగిందంతా ఇంటికొచ్చి మా అమ్మ, అమ్మమ్మకి చెపితే వాళ్ళ ఆనందానికి అవధులులేవు. మా అమ్మమ్మ అయితే దానికి దిష్టితీసి వేసింది. అసలా పాటలో ఒక లైను "ప్రకృతికంతకీ అందం ప్రతి జీవికి సౌందర్యం" అని వుంది. కానీ మా రఘుమకి ప్రకృతి అనేమాట నోరు తిరగక 'పరుకుతి' అని పాడేది ప్రాక్టీసు చేయించేటప్పుడు. మా నాన్నగారు, వీరభద్రాచారిగారు 'లోకమంతకీ అందం' అని మార్చేశారు. ఈ పాటకి కాలేజీవారు రఘుమకి వెండి పతకం బహూకరించారు. తరువాత పెరిగి పెద్దదయి కాలేజీలో చదువుతూండగ వ్యాసాల పోటీలో మొదటి బహుమతి సంపాదించుకుంది.

ఇక స్ట్రిక్ట్‌నెస్ విషయానికి వస్తే మా నాన్నగారు మమ్మల్ని స్కూలుకు శెలవు పెట్టి ఏ వూరికీ, ఫంక్షన్స్‌కు గానీ పంపేవారు కాదు. అధవా పంపినా పెళ్ళి అయిన మరుసటి క్షణమే వచ్చేసెయ్యాలనీ, అలా రాని పక్షంలో స్కూలుకెళ్ళి టీచర్‌తో మాట్లాడి రిజిష్టరులోంచి పేరు కొట్టించేస్తానని బెదిరిస్తూ ఉత్తరాలు రాసేవారు. ఒంట్లో చికాకు చేసినా, జ్వరం వస్తే తప్ప స్కూలుకు సెలవు పెట్టడానికి వీల్లేదు. కానీ నన్ను మాత్రం ప్రతి శెలవలకి మా పిన్నిగారి (మా అమ్మ చెల్లెలు) ఊరికి పంపేవారు. వాళ్ళకి పిల్లలు లేరు, నన్ను వాళ్ళ స్వంత కూతురిలా చూసుకునేవాళ్ళు. మా బాబాయిగారు కామేశ్వరరావుగారు, A.C.T.O చేసేవారు. మా పిన్ని సరస్వతి. ప్రతి మూడేళ్ళకీ వాళ్ళకి ట్రాన్స్‌ఫర్ అవుతూ ఉండేది. నేను వాళ్ళతో పాటు ఎంచక్కా అన్ని వూళ్ళు తిరిగేదాన్ని. కొంతమంది, వాళ్ళ ఊళ్ళోవాళ్ళు, స్వంతకూతురనే అనుకునేవారు. మా పిన్ని, బాబాయి అంత బాగా చూసుకున్నారు నన్ను.

మా అమ్మ జబ్బు మనిషి అయినందున మా తాతగారు పోయిన తర్వాత మా అమ్మమ్మ ఎక్కువ మా దగ్గరే ఉండేది. దాంతో నాకు, మా చిన్న చెల్లెలికి మా అమ్మకన్నా మా అమ్మమ్మ దగ్గరే బాగా చనువు. నేను నెల్లూరులో 5వ తరగతో, ఏడవ తరగతో చదువుతున్న రోజులవి. ఒకరోజు నా కాలి ఏంకిల్ మీద తేలు కుట్టింది. రాత్రి నిద్రలో కుట్టిన మూలాన వెంటనే ఆ బాధనాకు తెలియలేదు. తెల్లారేసరికి నొప్పి, మంట యెక్కువవడం మొదలుపెట్టింది. మా అమ్మా, అమ్మమ్మ ఇంటివైద్యాలెన్నో చేశారు. తగ్గడం మొదలెట్టలేదు సరికదా కాలు వాచి ఎర్రగా తయారైంది. మా అమ్మా వాళ్ళకి చాలా భయం వేసింది. నేను పడక వేసేశాను. వారం రోజులు లేచి నడవలేకపోయాను. సాధారణంగా నెల్లూరులో తేళ్ళ బాధ యెక్కువని, చాలా మంది తేలు కుట్టిన విషం కారణంగా చనిపోయారని విన్నాను. మా అమ్మమ్మ మడితో వంటచేసి అందరి భోజనాలైన తర్వాత తాను కూడా తిని మైలపడి నా దగ్గరికి వచ్చి నా కాలు తన తొడమీద పెట్టుకుని కూర్చునేది. నాకు, నే తీసుకున్న మందులకన్నా, మా అమ్మమ్మ వొళ్ళో కాలు పెట్టుకోవడమే చాలా

హాయనిపించేది. నన్ను చూడ్డానికి ఆ వూళ్ళోనే వుంటున్న మా చిన్నమ్మమ్మ నాగరాజమ్మ రోజూ మా ఇంటికి వస్తూపోతూ వుండేది. నిజానికి నాకు తేలు కుట్టినా కూడా చాలా పెద్దగండమే తప్పిందన్నమాట. నేను లేచి నడవడానికి ఒక వారం పట్టింది. ఈవారం రోజులు నేను స్కూలుకి సెలవు పెట్టాను.

మా నాన్నగారు ఏదో నోట్సు రాసుకుంటూ గైడ్లు ప్రింటు చేయిస్తూ ఉండేవారు. ఆ నోట్సు డిక్టేట్ చేసి నన్ను రాయమనేవారు. కొంత వరకు రాసేదాన్ని. అదేపనిగా రాయాలంటే ఎవరికైనా విసుగుకదా. అక్కడ మా అమ్మ పని సహాయానికి పిలిచేది. ఇద్దరి మధ్యా నలిగేదాన్ని. నేనే పెద్దదాన్ని కనుక అయిందానికి, కానిదానికి నన్ను పట్టుకు తిట్టేవారు. మా ముద్దు పేర్లు తెలుసా! నేను - పెద్దమ్మలు, సుశీల చిన్నమ్మలు, రఖుమ - పాపలు. మా నాన్నగారు అమ్మలూ అని పిలిచేవారు. మేం ఎవరెళ్ళాలి? మా సుశీల "పెద్ద దానివి నువ్వే వెళ్ళు" అని నన్నే పంపేది. ఇప్పటికీ మా బంధువులలో చాలామందికి మా అసలు పేర్లు తెలియవు. ఇంకోటేమిటంటే మా ఇళ్ళల్లో కల్యాణిలు, రఖుమలు చాలామంది వున్నారు. నేనెవరికైనా ఫోన్ చేస్తే "ఏ కల్యాణి?" అనేవారు. ఇప్పటికీ ఫోన్‌చేసి "నేను మద్రాసు నుంచి" అనగానే అటునుంచి "ఓహో పెద్దమ్మలువా!?" అంటారు.. నేనే మా నాన్నగారికి, మా అమ్మకి యిద్దరికీ జవాబుదారిగా వుంటూ వచ్చానా, ఇవన్నీ మా అమ్మమ్మ చూస్తూ, "ఇది పెళ్ళైం తర్వాతన్నా సుఖపడ్తుందో లేదో" అనుకునేది.

మా అమ్మ అమాయకురాలు. ఆ కాలంలో స్కూల్లో చదువుకోలేదు. కానీ పరిజ్ఞానం బాగా ఉండేది. నవలలు, డిటెక్టివ్ నవలలు, మా నాన్నగారి హిస్టరీ పుస్తకాలు అవన్నీ చదివేది. అప్పుడప్పుడు హ్యూమరస్‌గా మాట్లాడేది. ఆ హ్యూమర్‌లో కూడా ఆవిడ అమాయకత్వం వుట్టిపడేది. తెల్లనివన్ని పాలు, నల్లనివన్ని నీళ్ళు అనుకునే మనస్తత్వం ఆమెది. మా నాన్నగారి దగ్గర భయపడ్తూనే ఉండేది. అల్పసంతోషి. కానీ మనసు నిబ్బరం, ధైర్యం ఎక్కువ. ఎవరేది చెపితే అది నమ్మేది. ఇంకొకళ్ళకి ధైర్యం చెప్పేది. కానీ తనకేదైనా బాధకానీ, దిగులు కానీ, చికాకేదైనా వస్తే మనసులో కుమిలిపోయేది. పైకెవ్వరికీ చెప్పేదికాదు. "పుల్లమ్మ చాలా అమాయకురాలు, చాలా మంచిది, ఆవిడ మంచితనమే ఆవిడని పుణ్యవతిగా, పసుపు కుంకుమలతోనే దాటుకుంది" అన్నారంతా. 1983 వ సంవత్సరం కార్తీక మాసంలో దీపావళి అయింతర్వాత పోయింది. 1947వ సంవత్సరంలో మా చిన్న చెల్లెలు పుట్టిన తర్వాత చేసిన జబ్బుకి ఇంతకాలం మా అమ్మ బతుకుతుదని ఎవ్వరూ అనుకోలేదు. అప్పుడు నాకు పదకొండు సంవత్సరాలు. ఆస్పత్రికి చేర్చిన మర్నాడు మా అమ్మకి వేడినీళ్ళు, పాలు తీసుకుని వెళ్ళాం నేను, మా నాన్నగారు. ఎప్పుడంటే అప్పుడు మగవాళ్ళని వార్డుకి పంపరుగా! మా నాన్నగారు హాలు బయట నుంచుని నన్ను లోపలికి వెళ్ళమన్నారు. హాలు దాటగానే వార్డు రూములోనికి వెళ్ళేసరికి మా అమ్మనోట్లో ఏవో గుడ్డలు చుట్టి రెండు వైపులా ఇద్దరు నర్సులు మా అమ్మని ఒత్తిపట్టుకుని ఉన్నారు. నేనది చూడగానే బెంబేలెత్తి పోయాను. నర్సులు చిన్న పిల్లలిక్కడికి రాకూడదని నన్ను బయటికి తరిమేశారు. నేను ఏడుస్తూ పాలసీసా పగిలినది కూడా చూసుకోకుండా హాల్లో దారిపొడుగునా పారపోస్తూ విషయం చెప్పేసరికి మా నాన్నగారు నాకు ధైర్యం చెప్పి లోపలికి పరుగెత్తారు. మా అమ్మ ఆస్పత్రిలో ఉన్నంతకాలం ఆమెని చూసుకోవడానికి మా అమ్మమ్మకి తోడుగా ఆమె చెల్లెలుండేది. ఆమె మా చిన్నమ్మమ్మ. పేరు నాగరాజమ్మ. వేరొక రూములో (బేబీ రూమ్) చూస్తే పాపని పడుకోబెట్టారు. నర్సులు పాలలో, నీళ్ళు కలిపి పట్టేవారని మా అమ్మమ్మ గోలపెట్టేది. ఇంటినుంచి పాలు తేనిచ్చేవారు కాదు నర్సులు. మా రఖుమని మూడేళ్ళవరకు మా అమ్మమ్మ డబ్బా పాలతో, సగ్గుబియ్యం జావతో పెంచింది. సగ్గుబియ్యాన్ని తిరగలిలో తిప్పి ఆ నూకతో జావ చెయ్యడమన్నమాట. ఆ కాలంలో మిక్సీలు లేవుకదా. అందుకే మా రఖుమని మా నాన్నగారు, మా అమ్మమ్మ గారాబం చేశారు. చాలా సన్నగా ఉండేది. పైగా ఒక ఏడాది పాపగా ఉన్నప్పుడే దానికి పెద్దమ్మవారు వచ్చి తగ్గింది. గండాల గౌరీదేవి అనేది మా అమ్మమ్మ.

నా పెళ్ళైన తర్వాత మా వారి మంచితనం, వారి నెమ్మది, మంచి మనసు చూసింది మా అమ్మమ్మ. మా చెల్లెలు ఒకసారి మా అమ్మమ్మ ఒళ్ళో తల పెట్టుకుని పడుకుని ఉండగా, అమ్మమ్మ ఈ కబుర్లు, ఆ కబుర్లు చెపుతూ మాటల్లో "మీ పెద్దక్క పూర్వజన్మలో బంగారపు పువ్వులతో పూజ చేసి వుంటుంది, అందుకే దానికి మంచి మొగుడు దొరికాడు, మీ బావగారెంత మంచివారో!" అంటే అది అందిట "అమ్మమ్మా నాక్కూడా ఆ బంగారపు పువ్వులు కొనిపెట్టవా? నాకు కూడా పెద్దయింతర్వాత పెద్ద బావగారిలాంటి మొగుడు కావాలిగా" దానికి మా అమ్మమ్మ ఆ చిన్నపిల్ల అమాయకత్వానికి నవ్వుకుందిట.

మా అమ్మ, నాన్నగారు మేనరికం అవడంవలన చుట్టాలందరూ వాళ్ళిద్దరికీ దగ్గరే. చాలా మంది బంధువులు మా ఇంటికి తరుచూ వస్తూ పోతూనే ఉండేవారు. మా పిన్నికన్నా అందరికీ మా అమ్మ అంటేనే అభిమానం. మా పిన్ని 1981లో చనిపోవడం వలన రెండేళ్ళు ఆ బెంగతోనే మా అమ్మ 1983లో 62వ ఏట చనిపోయింది.

మా నాన్నగారు ఎం.ఎ మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చదివారు. బి.ఇ.డి కూడా చేసారు. 1978లో ఆయన చేసిన రీసెర్చికి కర్ణాటక యూనివర్శిటీ ఆయనకు డాక్టరేట్ (పి.హెచ్.డి) ప్రధానం చేసింది. ఎటొచ్చీ ఇది ఆయన వయస్సుకి చాలా ఆలస్యంగా వచ్చింది. అదే ఆయనను బాధిస్తూ ఉండేది. ఈ రీసెర్చి థీసీస్‌ని ఆయన ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ ఇన్ ఆంధ్ర అండర్ ది ఈస్ట్ ఇండియా కంపెని అనే పేరుతో పుస్తకంగా పబ్లిష్ చేసారు. ఇందుకుగాను ఆయనకు ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం 5,000 రూపాయలను గ్రాంటుగా ఇచ్చింది. మా చిన్న చెల్లెలు రఖుమ అప్పటికే బి.ఇ.డి పూర్తిచేసుకుంది. అదీ, వాళ్ళాయన ఎ.వి.రామకృష్ణారావుగారు ఈ పుస్తకం ప్రూఫ్ కరెక్షన్‌లో చాలా సహాయపడ్డారు.

ఆ కాలంలో కొంతమంది వారలబ్బాయిలను పోషించేవారు. ఆ రోజుల్లో మా నాన్నగారి సంపాదన అంతంత మాత్రమే. అయినా కూడా ఆయన కనీసం ఇద్దరు, ముగ్గురు చదువుకునే అబ్బాయిలను పోషిస్తుండేవారు. అంటే ఒకొక్కరోజుకి ఒక్కొక్కరు వారానికి ఒకసారి మా యింట్లో భోజనం చేసేవారు. ఇంట్లోవాళ్ళమాట ఎలా వున్నా, ఆ వచ్చిన వాళ్ళకు రకరకాల కూరలు, వంటలతో తృప్తి పరచాలని మా అమ్మని పురమాయించేవారు. ఇదేకాక, కొంతమంది విద్యార్థులకు డబ్బుల రూపంగానో, పుస్తకాల రూపంగానో సహాయం చేసేవారు. కొంత మందికి ఫ్రీగా ట్యూషన్లు చెప్పేవారు. ఒకసారి I.A.Sకు ట్యూషన్ చెప్పించుకునే కుర్రాడు రాకపోయేసరికి, తనే అడ్రసు వెతుక్కుంటూ అతని ఇంటికి వెళ్ళారు. చిన్నతనంలోనే తల్లితండ్రులను పోగొట్టుకుని చదువుకోడానికి ఎంత కష్టపడ్డారో. ఆ అనుభవంతో 'చదువు' అంటే చాలు. ఎవరు సహాయం కోరినా తనకు మాలిన ధర్మంగా సహాయం చేసేవారు.

మా నాన్నగారు పూజలు, సత్యనారాయణ వ్రతాలు, జపాలు, సంధ్యావందనాలు అన్నీ చేసేవారు. క్రమం తప్పకుండా సాయంత్రం పూట రామకృష్ణ మఠానికి వెళ్ళి అక్కడ భజనలలో పాల్గొంటుండేవారు. ఆ భజనలలోనే కొన్ని అంశాలు, పాటలు మా యింట్లో కూడా సాయంత్రంపూట అమలు జరిపేవారు. మేమే కాక పక్క ఇంటి కామర్స్ లెక్చరర్ శేషావతారం గారి పిల్లలు, గరిమెళ్ళ వారి పిల్లలు కూడా జాయినయ్యేవారు. గరిమెళ్ళ సూర్యనారాయణగారు ఆయుర్వేద మందుల్ని బంగారంతో స్వర్ణ కల్పభస్మ అని తయారుచేసేవారు. మా నాన్నగారు ఆయన పర్మినెంటు పేషంట్. కలకత్తానుంచి శ్రీతక్ష్యరానంద స్వామిజీ అని ఏటేటా రామకృష్ణ మఠానికి భీమవరానికి వచ్చేవారు. ఆయన వచ్చినప్పుడల్లా మా నాన్నగారు ఆయనని భిక్షకు పిలిచి సాయంత్రం పాటకచేరి అరేంజ్ చేసేవారు. మా అక్క చెల్లెళ్ళం పాడేవాళ్ళం. రెగ్యులర్‌గా వచ్చే భద్రయ్య అనే అతను తబలా, మా నాన్నగారు హార్మోనియం. స్వామిజీ నన్ను చూసి ఆనందమయి అనేవారు. మా అమ్మ, నాన్నలకి చాలా సంతోషం వేసేది.

నా ఈ ఇరవైరెండేళ్ళ జీవితగాథ ఇదన్నమాట. నా ఇరవై మూడవయేట పెద్దవాళ్ళంతా మా నాన్నగారితో 'పెద్దమ్మాయికి సంబంధాలు చూస్తున్నావటా? ఫలానా వాళ్ళున్నారు, విశాఖపట్నంలో ఫలానా అబ్బాయి ఉన్నాడు' అంటూ పోరేవాళ్ళు. నాది ఆశ్లేష

నక్షత్రం. అంటే నాకు కాబోయే భర్తకి తల్లి ఉండకూడదన్నమాట. మా నాన్నగారి ఉద్దేశం ఏ అబ్బాయికి తల్లిలేదో ఆ సంబంధం చూడాలని. సిన్సియర్‌గా ఆలోచించేవారు. కానీ మా నాన్నగారు కష్టపడకుండా సంబంధం తానే వచ్చింది. ఎలాగంటే విశాఖపట్నంలో ఎవరో నా జాతకం పంపమంటే మా నాన్నగారు పంపించారు. కానీ అబ్బాయికి తల్లి ఉందట. ఈ సంబంధం చేసుకోడానికి ఆవిడ చాలా ఇష్టపడిందట. మా నాన్నగారి గురించి తెలుసట. సాంప్రదాయమైన కుటుంబం కదా, పిల్ల బి.ఏ పాసయిందికదా అని. కానీ ఆమె భర్త నా ఆశ్లేషా నక్షత్రానికి ఒప్పుకోలేదు. తర్వాత తెలిసింది ఆ అబ్బాయి కొంచెం లావుగా ఉంటాడని. దేవుడు మేలు చేశాడు. ఈ విషయాలన్నీ ఆ ఊళ్ళోనే వుంటున్న సింగీతం శేషగిరిరావుగారికి తెలిసిందట. మా నాన్నగారు ఆంధ్రా యూనివర్శిటీ పనుల మీద తరచూ వాల్తేరు వెళ్తూండేవారు. శేషగిరిరావుగారు మా నాన్నగారికి చాలా పరిచయం. వాళ్ళ కోడలు సింగీతం రాధాబాయి, ఆవిడ బెజవాడ ఆల్ ఇండియా రేడియోలో చాలా లలిత సంగీతం పాటలు పాడి ప్రోగ్రాములిచ్చిది. ఆ రాధకి మాకు నెల్లూరులో పరిచయం. రాధ పుట్టిల్లు నెల్లూరు. నా గురిచి రాధ వాళ్ళ మామగారికి చెప్పిందట.

శేషగిరిరావుగారు మా నాన్నగారికి ఒక ఉత్తరం రాశారు. "మీ అమ్మాయికి సంబంధాలు వెతుకుతున్నారని విన్నాను. మా అన్నగారు సింగీతం రామచంద్రరావుగారు గూడూరులో వుంటారు. ఆయన ఒక రిటైర్డ్ హెడ్‌మాస్టరు, ఆయన రెండో కొడుకు మద్రాసులో సినిమాలో అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేస్తున్నాడు. మీ కభ్యంతరం లేకపోతే మా అన్నకు ఉత్తరం రాస్తాను. ఏ విషయము నాకు తెలియ చెయ్యండి" అని. ఆ కాలంలో ఫోనుల సౌకర్యం లేదుగా.

ఒకరోజు ఉన్నట్టుండి మా నాన్నగారు నన్ను పిలిచి, "విశాఖ పట్నంలో నేననుకున్న సంబంధం కుదరలేదమ్మా. ఈ విషయం తెలిసి శేషగిరిరావుగారు నాకు ఉత్తరం రాశారు. ఇదిగో చూడు" అనిచ్చారు. దాని గురించి ప్రస్తావన కానీ, డిస్కషన్ కాని ఏమీ చెయ్యకుండా సైలెంట్‌గా వెళ్ళిపోయారు. ఉత్తరం చదివాను. అబ్బాయి బి.ఎస్‌సి పాసయి మద్రాసులో కె.వి.రెడ్డిగారనే డైరెక్టర్ వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్నాడు. పేరు శ్రీనివాసరావు. చదివాక నా బుర్రలో ఏ ఆలోచనా రాలేదు. నాన్నగారికి ఏమని చెప్పాలో! ఆ రోజుల్లో సినిమాల బాగోగులు నాకు తెలియదు. మా అమ్మ, అమ్మమ్మ వాళ్ళు రకరకాలుగా చెప్పుకునేవారు. మా బంధువుల్లో ఒకాయన సినిమాల్లో పనిచేస్తుండగా కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటే సినిమా వాళ్ళే ఇల్లు కట్టించి ఇచ్చారని, వేరొక డైరెక్టరు తన కూతురి పెళ్ళికి బాగా ఖర్చు పెట్టి బ్రహ్మాండంగా చేసి అప్పుల పాలయేరని రకరకాలుగా చెప్పుకునేవారు. అప్పుడు వాళ్ళ మాటలు నేను పట్టించుకునేదాన్ని కాను. కానీ ఇప్పుడు మా నాన్నగారిచ్చిన ఆ ఉత్తరం చూసి ఏం చెయ్యాలో తెలియలేదు.

మా అమ్మమ్మ నా పరిస్థితి చూసి ఏమాలోచించావే అని అడిగింది.

"ఏమో అమ్మమ్మ నాకేం తెలియడంలేదు" అన్నాను.

మా అమ్మమ్మ "ఆ అబ్బాయి సినిమాలో పనిచేస్తున్నాడని కాకపోతే వాళ్ళ నాన్నగారు సింగీతం రామచంద్రరావుగారు చాలా మంచి వారు. వాళ్ళది చాలా సాంప్రదాయమైన కుటుంబం. వాళ్ళు మాకు దూరపు బంధువులు. ఇక నువ్వు ఆలోచించుకో" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆవిడ చెప్పిన దాంట్లో మైనస్ పాయింట్లకన్నా ప్లస్ పాయింట్లే నాకు కనిపించాయి. అతను కూడా గ్రాడ్యుయేట్ కదా. ఈ సంబంధం సరి అనిపించింది. మా నాన్నగారికి ఓ.కె. చెప్పగానే ఆయన సంతోషించి నా జాతకం - బయోడేటా మా మామగారికి పంపించారు.

ఆ సమయంలో నేనొక మాంటిస్సోరి కాన్వెంట్ టీచర్‌గా పనిచేస్తున్నాను. ఈ స్కూల్ డి.ఎన్.ఆర్ కాలేజ్ అథారిటీస్ ఆధ్వర్యంలో నడుస్తోంది. నేను బి.ఏ పాసవగానే వాళ్ళకి టీచర్ కావాలని మా నాన్నగారిని రిక్వెస్ట్ చేసి "మీ అమ్మాయిని చేర్పించండి" అంటే సరేనని

చేర్పించారు. నిజానికి నన్ను గుంటూరులో బి.యిడి చదివించాలని ఆయన కోరిక. కొన్నాళ్ళలా స్కూలుకి వెళ్తూ వచ్చాను. తరువాత స్కూలు కమిటీ మెంబర్స్ మా టీచర్స్‌లో ఇద్దరిని మాంటిస్సోరి ట్రైనింగ్‌కి మదరాసుకి 6 నెలలు పంపుతామని నిశ్చయించుకున్నామని మీ అమ్మాయిని, వేరే టీచర్ను పంపుదామనుకుంటున్నామని దానికి మా నాన్నగారి పర్మిషన్ కావాలని కోరారు. నన్ను బి.యిడి చదివిద్దామనుకుంటున్న మా నాన్నగారు వెంటనే ఒప్పేసుకున్నారు. ఇంతలో జాతకాలు మార్చుకోవడం, ఇరువైపుల నుంచి జాతకాలు కలిసాయనే సంతృప్తి కలిగాయి. సింగీతం రామచంద్రరావుగారు పెళ్ళిచూపులు ఏర్పాటు చెయ్యమని మా నాన్నగారికి ఉత్తరం రాశారు.

పెళ్ళి చూపులకు ముందు మా నాన్నగారు ఏం చేశారంటే, మద్రాసులో నాకు వరుసకి మేనమామ ఉండేవారు. మా నాన్నగారికి స్వయానా మేనమామ కొడుకు, మా అమ్మకి కజిన్ బ్రదర్, పి.ఎస్.జి రావు ఒక అడ్వర్‌టైజింగ్ కంపెనీ మానేజర్‌గా పనిచేసేవారు. చాలా పెద్ద హోదాలో ఉండేవారు. ఆయనకి ఉత్తరం రాసి అబ్బాయి గురించి, ఉద్యోగం గురించి పర్సనల్‌గా కలుసుకుని మాట్లాడమని, సినిమాలో పనికదా! మంచి చెడు తెలుసుకోమని కోరారు. ఆ పెద్ద మనిషి మా నాన్నగారిపై ఉండే ఆప్యాయతా, గౌరవం వలన ఆ ఫలానా శ్రీనివాసరావుగారిని ఒకటి రెండుసార్లు పిలిపించి అన్ని విషయాలు కూపీ చేసి మా నాన్నగారికి గ్రీన్ సిగ్నల్ సూచిస్తూ జాబు రాసారు.

ఇక పెళ్ళిచూపులు ఏర్పాటు చేయాలి కదా, అబ్బాయి భీమవరం రావడానికి కుదరదన్నారు. మాకా తిన్నగా మద్రాసుకి వెళ్ళడానికి అక్కడ మాకు దగ్గర బంధువులెవరూ లేరు. పి.ఎస్.జి రావుగారిల్లు మాకలవాటు లేదు. నెల్లూరులో మా చిన్నమ్మమ్మగారింట్లో పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాము. వాళ్ళిల్లు కొంచెం చిన్నది. ముందు గది, అనుకుని రెండవ గది, వెనకాల వంటిల్లు, వంటగదిలోంచి చూస్తే అందరూ కనపడతారు. మగవాళ్ళంతా ముందు గదిలో, ఆడవాళ్ళంతా మధ్యగదిలో కూర్చున్నారు. మా దూరపు చుట్టం మా అత్త ఒకావిడ అబ్బాయిని చూద్దామని వచ్చింది. ఆవిడ నా దగ్గరికి వచ్చి "అమ్మలూ! అక్కడికి వెళ్ళక ముందు ఇలా వంటింట్లోంచి చూడు అబ్బాయిని, సరిగా చూడు" అని ప్రోత్సాహించింది. నేను సిగ్గుతో అలాగే చూశాను. తర్వాత మధ్య గదిలో కెళ్ళి కూర్చున్నాను. ఆ కూర్చోవడం పెడకాలేసి కూర్చున్నాను. మరుసటి రోజు మా నాన్నగారు చెప్పారు, అలా పెడకాలేసి కూర్చోరాదన్నారు. అయినా పెళ్ళయిన తరువాత ఇప్పటి వరకు చెడు ఎఫెక్ట్స్ ఎలాంటివీ నాకు కనిపించలేదు. కాసేపైన తర్వాత నన్నొక పాట పాడమన్నారు. చిన్నపాట కదా అని బిళహరి రాగంలో "ఇతకన్నా ఆనందమేమి" అనే త్యాగరాజు కీర్తన పాడాను. నా అమాయకత్వం చూడండి.

❦❦❦

**మా మామగారు** "విఠల్‌రావుగారు, ఇంటికి వెళ్ళి మా అబ్బాయి అభిప్రాయం తెలుసుకుని ఏ విషయమూ చెప్తాను" అన్నారు.

మా నాన్నగారు కూడా "అలాగేనండి నేనుకూడా మా అమ్మాయిని కనుక్కుంటాను. మ్యూచ్యుల్ కదండి" అన్నారు. ఇంకో గంటలో మా మామగారు మా అబ్బాయి ఒప్పుకున్నాడని వచ్చి చెప్పారు. మా అమ్మాయికూడా ఒప్పుకుంది అన్నారు మా నాన్నగారు. అపుడు మా మామగారు "మీ అమ్మాయి తన అభిప్రాయం పాటలోనే చెప్పేసిందిగా. ఇంతకన్నా ఆనందమేమని" అని నవ్వారు.

పెళ్ళయ్యాక తెలిసింది నాకు, మా వారు చెప్పారు. పెళ్ళి చూపులవగానే ఎవ్వరి నోటినుండి మాట రాకమునుపే తనకి అమ్మాయి నచ్చిందని తనవాళ్ళందరికి చెప్పేశారట. సాయంత్రం రంగనాయకుల స్వామి గుడికెళ్ళి వచ్చి రాత్రి బయల్దేరి మద్రాస్ వెళ్ళి పి.ఎస్.జిరావు యింటికి వెళ్తామని మా నాన్నగారు మా మామగారితో చెప్పారట. పి.ఎస్.జి రావుగారింటికి మీరు కూడా వస్తారా, మద్రాసు వస్తే బాగుండునని మా నాన్నగారన్నారు. అంటే ఆయన చేసేది మొదటి పెళ్ళికదా, కట్నకానుకలు విషయం మాట్లాడాలికదాని. మా మామగారన్నారు, "పెళ్లికూతురి తండ్రి మీరు, అబ్బాయి తండ్రి నేను. మనిద్దరం తప్పితే మూడో వ్యక్తి మాట్లాడ్డానికేముంది? మా సింగీతం వాళ్ళకి కట్నం తీసుకునే అలవాటు లేదు. పోతే అప్పగింతలంటారా? నాకు, పీటల మీద కూర్చుంటారు కనుక నా పెద్ద

కొడుక్కి, కోడలికి, పెళ్ళి కొడుక్కి యిస్తే చాలు. తర్వాత అబ్బాయికి మీరేం చేయాలనుకుంటారో మీ శక్త్యానుసారం చెయ్యండి, అమ్మాయికి మేమనుకున్నది చేస్తాము.'' అన్నారుట. మా నాన్నగారు బాగా ఊపిరి పీల్చుకున్నారు.

మద్రాసు వెళ్ళి అనుకున్న ప్రకారం పి.ఎస్.జిరావుగారింట్లో దిగి అన్ని విషయాలు చెప్పారు మా నాన్నగారు. మా మేనమామ చాలా సంతోషించారు. నెల్లూరికి మా అమ్మ రానందున ''సంబంధం సక్సస్ అయిందని మా చెల్లెలికి తెలియవద్దా'' అని భీమవరంకి ఫోనోగ్రాము చేశారాయన. ఆవేళ నాకో చీర కొని వెంటనే కట్టుకొమ్మని ''నేను నీ మేనమామనే, నిన్ను పెళ్ళి కూతుర్ని చేసేశా.'' అన్నారు. నాకు ఆ సమయంలో అమ్మ, అమ్మమ్మ దగ్గర లేరే అనిపించింది నా సంతోషం పంచుకోడానికి. మా అమ్మమ్మే కదా నన్ను ప్రోత్సహించింది. మద్రాసు నుండి భీమవరం వచ్చేదారిలో గుంటూరుకి వెళ్ళాం మా సుశీలని కలుసుకుని ఈ విషయం చెప్పడానికి. అది గుంటూరులో బి.యిడి చెయ్యడానికి హాస్టలులో ఉంటోంది. నేనవాళ దానిగెస్ట్గా లంచ్ తీసుకున్నాను. భీమవరం వచ్చింతర్వాత మా అమ్మావాళ్ళకి చెప్తే వాళ్ల సంతోషానికి అవధులు లేవు.

స్కూల్కి వెళితే టీచర్సంతా నేను మాంటిసోరి ఇంటర్వ్యూకి మద్రాసుకి వెళ్ళేననుకున్నారుట. కానీ పెళ్లికి వెళ్లానని అబద్ధం ఆడాను.

పెళ్లిచూపులలో యిప్పటిలాగ అప్పుడు ఇద్దరం సపరేట్గా మాట్లాడ్డం అవన్నీ లేదు. నాకు మళ్లీ అతన్ని చూడాలనిపించింది. నాన్నగారితో ఎలా చెప్పనూ? మద్రాసు నుంచి మేము తిరిగి వెళ్ళేటప్పుడు మా నాన్నగారతన్ని స్టేషనుకు రమ్మంటే తప్పకుండా వస్తానన్నాడట. మా నాన్నగారు మద్రాసు సెంట్రల్లో ఎదురు చూశారు. కానీ రానేలేదు. నిరాశే మిగిలింది. పెళ్ళైంతర్వాత ఎందుకురాలేదని అడిగితే మా వారు చెప్పిన సమాధానమేమిటో తెలుసా? పెళ్లి చూపులకని ఒక చొక్కా కొనుక్కున్నారుట. ఆ తర్వాత మార్చడానికి వేరే చొక్కా లేదట. అందుకని రాలేదట. సో సిల్లీ!

ఆ తర్వాత కూడా మా యిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. మా మామగారు, మా నాన్నగారి మధ్య మాత్రం ఉత్తరాలు రాసుకోవడం జరుగుతూనే ఉన్నాయి. మా మామగారు ఆవేళ నెల్లూరులో చెప్పినట్లే కట్నకానుకలు వద్దని - ఇది - అది - మీకు తోచినట్లు చెయ్యమని రాశారు. మా నాన్నగారికిపుడు నెత్తి నుంచి బండదిగినట్లయింది. ''ఈ కాలంలో కూడా రామచంద్రరావుగారిలాంటి మంచి వాళ్ళుంటారా!'' అన్నారు. కానీ మా నాన్నగారికి ఆస్తిపాస్తులున్నాయో లేదో, ఆయన హోదాకి, గౌరవానికి తగ్గట్టుగా చెయ్యాలి కదా, అలాగే ఆయన మర్యాదకి తగ్గట్టు చేశారనుకోండి.

పెళ్ళి చూపుల తతంగం ఇదంతా 1959 సంవత్సరంలో జరిగింది. ఇక ముహూర్తాలు పెట్టుకోవాలిగా! ఇంతలో మా మామగారు ఆయన పెద్ద కోడలికి ఆక్టోబరు ప్రాంతంలో ప్రసవించే రోజులని, అదయితే కాని ముహూర్తాలు పెట్టుకోడానికి వీలవదని రాశారు. బహుశా మా పెళ్ళిచూపులు జనవరిలోనో, ఫిబ్రవరిలోనో జరిగి వుంటుంది. సరే, 6,8 నెలలే కదా అని మా నాన్నగారు రిప్లయి యిచ్చారు. కొన్ని నెలల తరువాత అక్టోబరు నెలలో మా మామగారు చాలా ప్రాంప్ట్గా కోడలు ప్రసవించిందని, ఆడపిల్ల అని ఉత్తరం రాసారు. ఆ పాప నరక చతుర్దశినాడు పుట్టింది. అందుకనే దానిపేరు సత్యభామ అని పెట్టారు. ఇక మీరు ఫిబ్రవరిలోగాని, మార్చిలోగాని ముహూర్తాలు పెట్టుకోవచ్చని రాసారు. మొత్తం మీద 1960 మార్చి 20వతేదీన పెళ్ళి ముహూర్తం నిశ్చయించారు. ఈ మధ్యే మా మనవరాలు అడిగింది. అది ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతోంది మద్రాసులోనే. ''అమ్మమ్మా! మీ పెళ్ళిచూపులైంతర్వాత నువ్వు, తాత లవ్లెటర్స్ రాసుకున్నారా?'' అని.

''నా మొహం ఆ కాలంలో అవేం లేదే, పైగా మీ తాతని పెళ్ళిరోజు వరకు మళ్ళీ చూడలేదు'' అన్నాను.

సరే మొత్తం మీద మా నాన్నగారు, మా మామగారు ఉత్తరప్రత్యుత్తరాలు రాసుకుని 1960 మార్చి 20వ తారీఖున పెళ్ళి నిశ్చయించారు. తిరుపతిలో చేస్తే ఎలా ఉంటుందని మా అమ్మా, నాన్నగారు ఆలోచించి మొదటమ్మాయి పెళ్ళికదా ఉన్న ఊళ్ళోనే చేస్తే అందరూ వస్తారు కదా, ఊళ్ళోని వాళ్ళు, స్నేహితులు అందరూ తిరుపతికి రాలేరుకదా, పైగా మనం అన్ని పెళ్ళిళ్ళకీ వెళ్ళి వచ్చాంకదా, మన అమ్మాయి పెళ్ళికి అందరూ రావక్కర్లేదా అని ఆలోచించారు. భీమవరంలోనే పెళ్ళి చేసి పెళ్ళైం తర్వాత వధూవరులని తిరుపతికి పిలుచుకెళితే సరి అని అనుకున్నారు.

మొత్తం మీద పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతోంది. భీమవరంలో వర్తకసంఘంవారి త్యాగరాజ భవనంలో నిశ్చయించారు. పెళ్ళి ఏర్పాట్లు చెయ్యడం మొదలు పెట్టారు. పెద్ద పెద్ద అప్పులు చెయ్యకుండా ఎలాగో స్వయం సంపాదన వలన, కొంతమంది లెక్చరర్ల సహాయం వలన మా నాన్నగారికి కొంత కుదుట పడింది.

సౌత్ నుంచి భీమవరం రావడానికి తాడేపల్లిగూడెంలో కానీ, నిడదవోలులో కాని రైలు మారాలి. ఎలాగో పెళ్ళివారు నిడదవోలు నుండే మా నాన్నగారు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో వచ్చారు. ముహూర్తం రోజు ముందు రోజున ప్రధానం జరుగుతుంది. మా ఇళ్ళల్లో దాన్ని జానవాసం అంటారు. అప్పుడు అమ్మాయి  తండ్రి అబ్బాయికి, అబ్బాయి తండ్రి అమ్మాయికి కొన్నికానుకలు, బట్టలు ఇవ్వడం రివాజే కదా. అలాగే వాళ్ళు నాకొక పట్టుచీర, కొన్ని నగలు పెట్టారు. ఫంక్షన్ అయినతరువాత నేను లోపలికి వచ్చిన తర్వాత కళ్ళనీళ్ళు పెట్టుకున్నాను.

మా వాళ్ళు పెద్దమ్మ, పిన్ని, "ఆ కన్నీళ్ళేంటే ఈ శుభసమయంలో?" అన్నారు.

"కాదు పిన్నీ,  నాకు మా తాతగారు జ్ఞాపకం వచ్చారు. ఆయన ఉండి వుంటే ఎంతో సంతోషించేవారు. అసలు నన్ను మద్రాసులోనే చదివించాలని ఆయన కోరిక కదా. ఇన్నేళ్ళ తరువాత నేను మద్రాసు స్థిరనివాసానికే వెళ్తున్నానని, ఈ సమయానికి ఆయన లేరే అని బాధపడ్తున్నాను" అని చెప్పాను. మరుసటి రోజు పెళ్ళైపోయింది. దేవుడి దయవలన అంతా సవ్యంగా జరిగింది. మా నాన్నగారు, అమ్మ చేసుకున్న పూర్వజన్మ సుకృతం ఏమో, మగపెళ్ళివారు పేచీ, చికాకు పెట్టడం కానీ ఏమీ లేకుండా ఉన్నారు. మా నాన్నగారికి చాలా రిలీఫ్ అయింది మా మామగారి మంచితనానికి మా నాన్నగారు చాలా మెచ్చుకున్నారు. అంతా పిల్ల అదృష్టం అన్నారు. ఆ సాయంత్రం స్కూలు విడిచాక మా స్కూలు టీచర్లు, కొంతమంది పిల్లలు వచ్చి నాకొక చిన్న సూట్‌కేస్ బహుమతిగా ఇచ్చారు. మా వారికి పరిచయం చేశాను. వాళ్ళని చూచి మా వారు మాటల్లో "మీకంతా కోపంగా ఉందా? నేను మీ ఫ్రెండుని తీసుకెళ్ళి పోతున్నా"ని జోక్ చేశారు. వాళ్ళంతా పక్కుమని నవ్వారు. ఆ చిన్న పిల్లలని వారి పేర్లు అడిగి పలకరించారు మా వారు. మేం నెల్లూరులో ఉండగా నందగిరి రామచంద్రరావుగారని ఒక ఫ్లూటు వాయిద్యకారులు మాకు కర్ణాటక సంగీతం నేర్పేవారు. ఆయన్ని ఫ్లూట్ రామచంద్రరావు అనేవారు. నా పెళ్ళి నిశ్చయమైందని తెలిసి ఆయనంతటఆయనే మా నాన్నగారికి ఉత్తరం రాశారు. నా పెళ్ళికి వచ్చి తన కచేరి చేస్తానని. మా నాన్నగారు ఆయనకు రానూపోనూ ఖర్చులిచ్చి మర్యాద చేసారు.

పెళ్ళవగానే మా అమ్మమ్మ, "అమ్మలూ! మీ ఆయనని నేను సరిగ్గా చూడలేదే" అంది.

ఆవిడ మొదటిసారి "మీ ఆయన" అనడం విని నాకు కొంచెం థ్రిల్‌వుండింది.

వెంటనే మా వారి దగ్గరికెళ్ళి "మా అమ్మమ్మ మిమ్మల్ని చూడాలంటోంది. ఆవిడ చాలా మొహమాటపు మనిషి. చటుక్కున అందరి ఎదుటారాదు. ఆవిడ విడో" అన్నాను.

వెంటనే "రా! మనమే ఆవిడ దగ్గరికి వెళ్దాం" అని వెళ్ళి మేమిద్దరం ఆవిడకి నమస్కారం చేసాము. ఆవిడ సంతోషానికి అవధులు లేవు. అది చూసి మా పెద్ద బామ్మ గింజుకుంది. తన దగ్గరికి పిలుచుకెళ్ళలేదని. ఆవిడకేం. పొద్దున్నంతా మండపం దగ్గరే కూర్చుంది.

ఈవిడ స్వభావమే వేరు. మగరాయుడిలా అందరితోనూ మాట్లాడుతుంది. బట్లర్ ఇంగ్లీషు కూడా మాట్లాడుతుంది. చిన్నతనంలోనే భర్తపోయినందు వలన ఆవిడ అన్నగార్లు చాలా గారాబం చేశారు.

పెళ్ళికి మద్రాసు నుంచి మావారి స్నేహితులు 6-8 మంది వచ్చారు. రాజమండ్రి నుంచి శ్రీకృష్ణ, సూళ్ళూరుపేట నుంచి ఆయన శిష్యుడు కె.వి.కృష్ణయ్య వచ్చారు. కొంతకాలం మావారు స్కూలు మాష్టరుగా పనిచేశారు లెండి. పెళ్ళికి వచ్చిన వాళ్ళ స్నేహితులలో ఇంకా మూర్తిరాజు, చిన్ననాటి స్నేహితుడు మృత్యుంజయరెడ్డిగారు వచ్చారు. మృత్యుంజయరెడ్డి వచ్చినది పెళ్ళికి కాదట. భీమవరం అనే పేరు చాలాకాలంగా వింటూ ఆ ఊరు ఎలా ఉంటుందో చూడ్డానికి వచ్చాడట. ఇంకా శంకరరెడ్డి, అల్లాడి వెంకట నారాయణ, నాయుడు, మధుసూదనరావులు కూడా వచ్చారు. భీమవరానికి రావడానికి సరైన రూట్ తెలియక కొంత రైలు, కొంత బస్సు, కొంత రెండెడ్ల బండి ఇన్ని ప్రయాసలు పడి వచ్చారట. కానీ, నాకాశ్చర్యం ఏమిటంటే వాళ్ళ స్నేహితుడు శీను పెళ్ళికి ఎలాగైనా రావాలని వాళ్ళ పట్టుదల పాపం. వాళ్ళ స్నేహితులలో మద్రాసు నుంచి వచ్చిన అల్లాడి వెంకట నారాయణ ఒకరు. తర్వాత తర్వాత తెలిసింది, అతను నెల్లూరులో మా నాన్నగారి శిష్యుడట. పెళ్ళయిన తర్వాత నన్ను వాళ్ళ ఊరు పిలుచుకెళ్ళాలిగా? మా మామగారి ఊరైన గుడూరుకి వెళ్ళాలి. భీమవరం నుండి నిడదవోలు వరకు బస్సు మాట్లాడారు. ఒక్కొక్కరూ ఎక్కుతున్నారు. ఫ్రంట్ సీట్లో మా వారు ఎక్కి కూర్చున్నారు. పక్కసీటు నేచురల్‌గా నాదనుకున్నాను. కానీ పెళ్ళివారు నన్ను వెనుక సీట్లో యెక్కి కూర్చోమని చెప్పారు. మెల్లిగా ఎక్కి కూర్చున్నాను. అదేమిటి ఇక్కడ ఎక్కమన్నారు నన్నూ. తీరా అటు చూస్తే మా వారి పక్కన వారి ఫ్రెండ్ డిసపాయింట్ అయ్యాను. సరే, రైలెక్కిన తర్వాత కూడా నేనిక్కడ, ఆయన బెర్తు ఎక్కడో. పోనీ, ఆయనైనా వచ్చి పలకరిస్తారా అంటే అదీలేదు. సరే మర్నాడు పొద్దున్న గుడూరు చేరాము.

పెళ్ళికి భీమవరం రాని బంధువులు నెల్లూరు నుంచి కొంతమంది గుడూరు వచ్చారు. ఆవేళ ఫంక్షన్ చేశారు. ఆ మర్నాడు తిరుపతికి వెళ్ళాలి. ఒక టాక్సీ చేయించుకుని తిరుపతికి వెళ్ళాం. దర్శనం అంతా బాగా జరిగింది. తిరిగి గూడూరుకి వచ్చేశాం. మూడు, నాలుగు రోజులనుండి, నేను భీమవరం, ఆయన మద్రాసు వెళ్ళాలి. కానీ ఆయన మద్రాసు రైలు మధ్యాహ్నం, మాది రాత్రి. మర్నాడు అనుకున్న ప్రకారం మా వారు 3గంటలకి బయల్దేరారు. నాకు ఎవ్వరితోనూ చెప్పలేని ఫీలింగ్. ఆయన వెళ్ళిపోతున్నారనే అని. స్కూలు గొడవలేకపోతే ఆయనతో మద్రాసు వెళ్ళి ఉండేదాన్నికదా, వారు బయలుదేరాక ఒక అరగంట అయిన తర్వాత మా తోడికోడలు సేతమ్మక్క, "కళ్యాణీ! ఈ వీధి చివరికెళ్తే రైలు బాగా కనిపిస్తుంది. పిల్లలు నిన్ను పిలుచుకు వెళ్తారు. వెళ్ళు, శీనుని చూడు" అన్నారు. నా మనస్సు, ఫీలింగ్స్, అర్థం చేసుకున్నారు. ఆవిడకూడా ఆ వయసు దాటేకదా వచ్చారు. అలాగే వెళ్ళాను. మా వారు రైలు తలుపు దగ్గరనుంచి రుమాలు ఊపుతూ కనిపించారు. నాకు దుఃఖం ఆగలేదు. రైలు వెళ్ళిపోయింది. పిల్లలేకదా అని కళ్ళు తుడుచుకుని యింటికి వచ్చేశాను. నేను యింటికి వెళ్ళేసరికి మా సేతమ్మక్కతో ఆవిడ స్నేహితురాలు, సీతారావమ్మ అని రెడ్డమ్మ మాట్లాడుతోంది. అసలే నేను మూడ్ అవుట్‌లో వుంటే ఆవిడ, "ఏం కళ్యాణి శీను బాబుకి టాటా చెప్పి వచ్చావా!?" అని నవ్వింది. ఆమెకది జోక్‌గా వుంది కాని, నా ఫీలింగ్స్ ఎక్కువైపోయాయి. బాత్‌రూం కెళ్ళి కళ్ళు తుడుచుకుని వచ్చాను. రాత్రే నేను, మా అమ్మ బండెక్కాం.

భీమవరం వచ్చిన తర్వాత పగలంతా స్కూలు, పిల్లలు, టీచర్లు కాలక్షేపం ఉన్నందువలన నాకంత దిగులనిపించలేదు. ఏం చెయ్యను. తిరిగి రావల్సి వచ్చింది చిన్న పిల్లల కాన్వెంట్ అయినా స్కూలు స్కూలేకదా. ఇపుడు స్కూలు వదలంగానే ఇంటికొచ్చేయడం చేశాను. మునుపైతే ఆ స్కూల్లో అథారిటీస్ స్కూలు అవంగానే హాస్టల్ పిల్లలతోపాటు టీచర్లకి కూడా సాయంత్రం బిస్కెట్లు, అరటిపళ్ళు, కాఫీ ఇచ్చేవారు. అది టీచర్లకి కంపల్సరీ అన్నమాట. పెళ్ళయి ఒకనెల రోజులలో నెలకి 30రోజులైతే మా వారి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాలు 40. ఒక్కోసారి ఆదివారం ఎక్స్‌ప్రెస్ డెలివరీ కూడా వచ్చేవి. అవి చూసి మా నాన్నగారు ముందు ముందు భయపడేవారు. తరువాత తరువాత అవి మాములు ఉత్తరాలని తెలిసి ముసిముసి నవ్వులు నవ్వుకునేవారు. నేను గంట కొట్టగానే అక్కడ కాఫీ తాగకుండా ఇంటికి

వచ్చేసేదాన్ని, మిగతా టీచర్లు గేలిచేసేవారు. "కల్యాణి మిస్ ఇదివరకు మనతో కాఫీ తీసుకుని వెళ్ళేవారు. ఇపుడు బెల్ కొట్టడం తడువు పరుగెత్తుతున్నారు వాళ్ళాయన ఉత్తరం చదవడానికి". మార్చి నెలాఖరులో పరీక్షలు అయినతర్వాత, పేపరు కరెక్షన్స్ అయిన తర్వాత, శెలవులిచ్చిన తర్వాత మద్రాసుకి పరుగెత్తాలి.

ఈలోగా మా వారు అక్కడ ఇళ్ళవేటలో మునిగి తేలుతున్నారు. అద్దె ఎక్కువ అని కొన్ని యిళ్ళు, సినిమా వాళ్ళకి ఇవ్వమని కొందరు, ఇలా ఎన్నో కారణాలుగా ఎంతకీ ఇల్లు దొరకలేదు. నాకా యిక్కడ టెన్షన్. ఎలాగబ్బా ఇల్లుదొరక్కపోతే, గూడూరులోనే కొన్నాళ్ళు ఉండవలసి వస్తుందేమో. పైగా అప్పుడు మా వారి నెలజీతం ఎంతో తెలుసా నెలకి 175రూపాయలు. దాంతో ఇంటి అద్దె, ఖర్చులు అన్నీ గడవాలికదా, నేవెళ్ళిన తర్వాత మహా 200రూపాయలు ఇస్తానన్నారుట. మొత్తం మీద నే వెళ్ళేలోగానే ఇల్లు దొరికింది. చిన్న ఇల్లు, నెలకి నలభై రూపాయలు అద్దె, కానీ ఒక అభ్యంతరం రాసారు. నాకు నచ్చుతుందో లేదోనని. అదేమిటంటే ఇంటిముందు, ఇంటివాళ్ళు పెంచుతున్న ఆవులు, గేదెలు ఉన్నాయని.

సరే నేను, మా అమ్మ ముందు గూడూరుకి వెళ్ళాం. మదరాసు నుంచి మా వారు వచ్చారు. మా యిద్దరి చేత సత్యనారాయణ వ్రతం చేయించారు. ఆ మర్నాడు మద్రాసు ప్రయాణం మేమిద్దరం, మా అమ్మ ముగ్గురం అయ్యామని, మా సేతమ్మక్క వాళ్ళ పెద్దబ్బాయి పూర్ణని పంపించింది. మా అమ్మ మా చేత కాపురం పెట్టించి, వాళ్ళన్నయ్య పి.యస్.జి రావుగారి ఇంటికెళ్ళి, అక్కడ్నుంచి భీమవరం వెళ్ళిపోయింది.

మదరాసు చేరగానే, గేటు ఎదురుగా ఆవులు, గేదెలున్నాయి. ఇంట్లోకి వెళ్ళి, నేను మా వారితో "యింటి ముందు లక్షణంగా ఆవు వుంటే, పైగా బయట నుంచి వచ్చే వాళ్ళకి ఆవు ఎదురుగా ఉంటే మీరలా నసుగుతూ ఉత్తరం రాసారేం?" నేనా మాటనేసరికి మా వారి ముఖంలో ఆనందం, కళ్ళలో వెలుగు కనిపించింది. పాపం, ఆయన భయం ఆయనది. పట్నంలో ఇలాంటి వాతావరణం ఉండదుగా, నేనెలా రియాక్టు అవుతానోనని ఆయనకి భయం వేసింది. చిన్న యిల్లుకాదుకదా, ఒకే ఒక గది వున్నా నేను రావడానికి సిద్ధమయ్యానని ఆయనకేం తెలుసు? ఇరవైమూడు సంవత్సరాలక్కడ ఉన్న నాకు ఈ నెల రోజులలో ఎంత మార్పో చూడండి.

నేను భీమవరం నుండి వచ్చేటప్పుడు పెళ్ళికి తెప్పించిన కిరాణా సామానులు, బియ్యం, పిండ్లు మొదలైనవన్నీ మా వాళ్ళు ప్యాక్ చేసి యిచ్చారు. ఈలోగా ఆయన వదిన కొన్ని సామాన్ల లిస్ట్ రాసి మా వారిని కొని పెట్టమని ఉత్తరం రాశారట. మేము ఆరునెలల వరకు ఏమీ కొనవసరం లేకపోయింది. నేను మద్రాసు చేరేసరికి ఇంటి కిటికీలకి కర్టెన్స్ సహితం రెడీగా వున్నాయి. నాకాశ్చర్యం వేసింది. ఇవన్నీ ఎలా వచ్చాయి? మీకు ఇవన్నీ చేయించడానికి తెలుసా అని అడిగితే నాకేం తెలుసు? వెంకట నారాయణ భార్య రోహిణి కుట్టించి అలంకరించింది అన్నారు. పైగా నాకు తెలుగు మాట్లాడే ఒక పనమ్మాయిని కూడా కుదిర్చి పెట్టిందావిడ.

కూరగాయలు కొనుక్కోవడానికి మార్కెట్టుకి ఇద్దరం వెళ్ళేవాళ్ళం. నాకు భాష సమస్యకదా! పైగా ఊరికి కొత్త. కూరగాయలు కొంటూ బేరమాడితే, "నో బార్గెయిన్. మనం కొనే అయిదు పలాలికి బేరం ఏమిటి?" అనేవారు. ఆ అమ్మేవాడు తనలో తానే నవ్వుకునేవాడు. వెర్రి ముఖాన్ని పెద్ద పట్టణం కదా యిక్కడ బేరమాడకూడదేమో అనుకునేదాన్ని. పక్కయింట్లో ఒక తెలుగావిడ ఉండేది. ఆవిడతో మాటవరస కంటే ఆమె నవ్వుతూ "మీ వారు మిమ్మల్ని బోల్తా కొట్టించారండీ.. బేరం ఆడందే ఎలా కొంటాం" అన్నది.

మొదట్లో వంటంతా చేసి ఆయన ఒంటిగంటకి వచ్చిన తర్వాత కంచాలు పెట్టి వంటంతా దగ్గర పెట్టుకున్న తర్వాత, చూస్తే పెరుగు వుండేదికాదు. బజారు దగ్గర కనుక అప్పటికప్పుడు ఇల్లు తాళం పెట్టి ఇద్దరం పరుగెత్తేవాళ్ళం. పెరుగుకి అరవంలో ఏం చెప్తారో తెలీదు. కొన్ని సంవత్సరాల నుండి మద్రాస్‌లో వుంటున్నారన్న మాటే కానీ ఆయనకీ తెలీదు. ఆ అమ్మేవాళ్ళు "మీకు కొత్తగా పెళ్ళైందా?" అనడిగేవాళ్ళు. అప్పుడప్పుడు వాళ్ళ స్నేహితులని భోజనానికి పిలుస్తూ వుండేవాళ్ళం. ఆయన బెస్ట్ ఫ్రెండ్ గణపతిరావు నాకు పెద్ద

కామెంట్ ఇచ్చారు. Mrs.Srinivas Rao is a very good host అని. కానీ చాలా విషాదం ఆయన తన 42వ ఏటనే మరణిచారు. ఇంకొక క్లోజ్ ఫ్రెండ్ ఉండేవారు. డా.పంపాపతిరావు అని, వెంకటేశ్వర యూనివర్సిటీలో ప్రిన్సిపాల్. ఆయన ఎప్పుడైనా మద్రాసుకు వస్తే మా యింటికి భోజనానికి వచ్చి, నేపెట్టిన పప్పుచారు చాలా మెచ్చుకునేవాడు. ఇతను కూడా ఇప్పుడు లేడు. పంపావతిరావు ఎప్పుడూ సూటుతోనే వుండేవాడు. ఆయన్ని మా రఖుమ కూడా చూసింది. అది చాలాసార్లు అంది నాతో, "అక్కా! గణపతిరావుగారు, పంపాపతిరావుగారిని - 'ఆ కోటాయన' అనేవారు కదూ!" ఒకసారి పంపాపతిరావు జపాన్ నుంచి మూడు జతల శ్రేష్టమైన ముత్యాలు తెచ్చాడు. ఒకటి భార్యకి, ఒకటి చెల్లెలికి, మూడవది నాకు. నన్నుకూడా చెల్లెలుగా చూసుకునేవారు.

ఒకరోజు మధ్యాహ్నం ఒంటిగంటవేళ "అమ్మా పాల్" అని వినిపించింది. "పొద్దున్నే వేశావుకదా" అని విసుక్కుంటూ తలుపు తీశాను. ఎదురుగుండా నవ్వుతూ మా వారు. "మీరా!?" అన్నాను. పక్కావిడ కూడా తలుపు తీసి అసలు విషయం తెలుసుకుని నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఇలాంటి చిలిపి చేష్టలు ఎన్నో చేసి నన్ను ఏమరిచేవారు.

మా యిల్లు టి నగర్‌లోని మేడ్లీ రోడ్డులో ఉండేది. బస్ టెర్మినస్‌కి చాలా దగ్గర. మావారు జయంతీ పిక్చర్స్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గా కె.వి.రెడ్డిగారి దగ్గర పనిచేసేవారు కదా. అసిస్టెంట్ నుంచి అసోసియేట్‌గా ప్రమోషన్ అయింది. జయంతి ఆఫీసు, బస్ స్టాండు ఎదురుగా వుండేది. ఆయన ఆఫీసు, బస్‌స్టాండ్ బజార్లు, మార్కెట్టు అన్నీ దగ్గరే. మా వారి స్నేహితులు "ఒరేయ్ మీ ఆవిడ గట్టిగా నిన్ను పిలిస్తే నీకు వినబడుతుందిరా" అనేవారు. ఆ రోజుల్లో యిక్కడ ఆటో రిక్షాలుండేవికాదు. టాక్సీలే. మేము ఎక్కడికివెళ్ళాలన్నా పబ్లిక్ బస్సులలోనే వెళ్ళేవాళ్ళం. టెర్మినస్ దగ్గరే కనుక ట్రిప్లికేన్‌లో మావారి బావగారు నారాయణస్వామి రావుగారుండేవారు. బర్మాషెల్‌లో పనిచేసేవారు. రాయపేట బాలాజీ నగర్‌లో మా వారి పెద్దమ్మగారి భర్త పెదనాన్నగారుండేవారు. పేరు భీమారావు. ఆయన అప్పటికే రిటైర్డ్ పోస్టు మాస్టరు జనరల్, ఆయన కొడుకు డి.శ్రీనివాసరావు (దొడ్డ శీను) మా వారు చిక్కశీను అన్నమాట. తరుచూ వీళ్ళిద్దరిళ్ళకే వెళ్తుండేవాళ్ళం. బీచ్‌కి, తమిళ భాష నాకు రాదు కనుక హిందీ, ఇంగ్లీషు సినిమాలకి వెళ్ళేవాళ్ళం. కన్నెమెరా, యూనివర్సిటీ లైబ్రరీలకి వెళ్తుండేవాళ్ళం. మావారు ఎక్కడికెళ్ళినా అక్కడికి నన్ను పిల్చుకెళ్ళేవారు. అసలైతే నన్ను భీమవరం మరిపింపచేసేవారు.

కొన్నాళ్ళకి ముందే - అంటే మా పెళ్ళికి ముందే మావారు అసోసియేట్‌గా పనిచేసిన 'పెళ్ళినాటి ప్రమాణాలు' రిలీజయింది. కానీ అదే టైములో 'మాంగల్యబలం' సినిమా వచ్చినందున మేమంతా యిదే చూశాం. మా నాన్నగారు సెలక్టెడ్‌గా మంచి సినిమాలే చూసేవారు. కె.వి.రెడ్డిగారి, బి.యన్.రెడ్డిగారి సినిమా, యస్.రాజేశ్వరరావుగారు సంగీతం సమకూర్చిన సినిమాలు చూసేవారు. మేమంతా కామెడీ సినిమాకదా అని భానుమతి గారి సినిమా 'చక్రపాణి' చూస్తే, మా నాన్నగారు మాత్రం కె.వి.రెడ్డిగారి 'పెద్ద మనుష్యులు' చూచి దానిని చాలా మెచ్చుకున్నారు. అప్పటికింకా మా వారి గురించి తెలియదండోయ్. 'పెద్ద మనుషులు' సినిమాకి అవార్డు వచ్చిందని తరువాత తెలిసింది నాకు. తర్వాత మావారు చెపారు. 'పెళ్ళినాటి ప్రమాణాలు'కి కూడా అవార్డు వచ్చిందని. నా పెళ్ళయి వచ్చింతర్వాత ఈ సినిమా చూశావా అనడిగారు, అదే టైములో వచ్చిన మాగల్యబలం చూశాము, ఇది చూడలేదు అని కొంచెం మొహమాటపడ్తూ ఇబ్బందిగా చెప్పాను. మావారు ఒక చిన్న నవ్వు నవ్వారు.

పెళ్ళయి మదరాసుకు రాగానే కొన్ని ఆనవాయితీలు ఉంటాయికదా, పెద్ద మనుష్యుల యిళ్ళకి, ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళడం. మొదట కె.వి.రెడ్డిగారింటికి పిల్చుకువెళ్ళారు. వాళ్ళు మర్యాద చేసి కూర్చోపెట్టి కాసేపు మాట్లాడినతర్వాత వచ్చేశాం. తర్వాత కవిగారు మాటలు, పాటలు రచయిత పింగళి నాగేంద్రరావుగారింటికి పిల్చుకెళ్ళారు. అక్కడాయన టిఫిను, కాఫీ యిచ్చారు. అప్పుడపుడు అమ్మాయిని పిల్చుకొస్తూ ఉండండి అన్నారు. కొన్నాళ్ళయిన తర్వాత మా ఫ్రెండ్ రత్నమ్మతో కె.వి.రెడ్డిగారింటికి వెళ్ళాను. మావారు రాలేదు. శంకర

రెడ్డిగారూ, ఆయన మరెక్కడికో వెళ్ళారు. కె.వి.రెడ్డిగారి భార్య నాతో "ఎలావుందీ మీకొత్తకాపురం? అన్నం వండడానికి ఒక చటాకు యెక్కువ, అరచటాకు తక్కువ" అని నవ్వింది. నాకు వాళ్ళంతా కొత్తకదూ! పైగా యెక్కువ మాట్లాడేదాన్నికాదుకదా, నవ్వి ఊరుకున్నాను.

కొన్నాళ్ళకి శ్రావణమాసం వచ్చింది. మంగళగౌరి వ్రతం చేసుకోడానికి భీమవరం వెళ్ళాలి. పోస్టల్ స్ట్రైక్ వల్ల మాకు భీమవరంకి ఉత్తర ప్రత్యుత్తరాలు కలగలేదు. పెళ్ళికి ముందు మా క్లాస్‌మేట్స్ కాని, స్నేహితులు కానీ ఈ నోము నోచుకుంటే వెళ్తుండేదాన్ని. అప్పుడనిపించేది. నేనుకూడా పెళ్ళయి అందర్నీ నోముకి పేరంటానికి పిలవ్వచ్చు కదా అని. కానీ నాకు దూరాభారాం వలన భీమవరంకి వెళ్ళటానికి కుదరలేదు. అధవా మొదటి వారం వెళ్ళినా, మళ్ళీ ఆఖరివారానికి అత్తవారింటికి రావాలని రూల్సు. చివరికి గుడూరులోనే నాలుగు వారాలు పూజ చేసుకున్నాననుకోండి. కానీ పుట్టింట్లో జరిగే సంతోషం అక్కడ వుంటుందా? భీమవరం అయితే అంతా తెలిసినవాళ్ళు, స్నేహితులు. గుడూరులో నాకెవ్వరూ తెలియదుగా, మొదట్లో కొంతకాలం వరకు బాధిస్తూ వుండేది. నే వెళ్ళకముందే మామగారు మా వారికి ఉత్తరం రాసారు కల్యాణి గూడూరికి మంగళగౌరి వ్రతానికి రావాలని, పూజకి కావలసిన వెండి సామాన్లు, చీర, జాకెట్టుకొని పంపమని, నేనలాగే అన్ని కొనుక్కుని వెళ్ళాను. ఈ నిరాశ, బాధ నా మారీడ్ లైఫ్‌లోని సంతోషం, ఆనందంలో ఏ మూలో పోయిందనుకోండి. పెళ్ళయిన 50 సంవత్సరాలకి ఒక స్వర్ణోత్సవం అంటారు. కానీ నా పెళ్ళయిన దగ్గర్నుంచీ స్వర్ణయుగమే. జీవితం అన్న తరువాత కొన్ని ఒడుదుడుకులు ఉంటాయనుకోండి. కానీ మా యిద్దరి మధ్యాకాదండోయ్. పరిస్థితులలా వచ్చాయి. అయితే నాకేలోటూ రాకుండా మాతోటికోడలు చూసుకున్నారనుకోండి. ఆ నెల్లాళ్ళలో మా వారు ఒకట్రెండుసార్లు గూడూరుకి వచ్చి వెళ్ళారు. అక్కడందరూ "శీను యిదివరకెల్లా దీపావళిలాంటి పండక్కి వస్తూండేవాడు. ఇప్పుడు తన భార్య ఇక్కడుందని, నా పెళ్ళాం నా పెళ్ళాం అని తరుచూ వస్తున్నాడని" గేలిచేసేవారు. నాకు ఉడుకుమోత్తనంగా ఉండేది.

నాది ఆశ్లేష నక్షత్రం మూలాన నాకు పెళ్ళయ్యే నాటికి మా అత్తగారు లేరు. కానీ క్రమేణ తెలిసింది ఆవిడకు కర్ణాటక సంగీతంలో మంచి ప్రవేశం వుందనీ, వయొలిన్ బాగా వాయించేవారనీ, మహిళా మండలిలో పిల్లలకు సంగీతం నేర్పేవారని. ఇదేకాక గూడూరులో ఒక పెద్ద బైండు పుస్తకం చూసాను. దానినిండా ఆవిడ రాసుకున్న పూజపాటలు, మంగళగౌరీ, శ్రీనివాస కళ్యాణంలాంటి కొన్ని కథలు ఉన్నాయి. నేను రెండవసారి గూడూరు వెళ్ళినప్పుడు మా తోటికోడలు సేతమ్మక్క "కల్యాణీ, అత్తగారి పుస్తకమిదిగో. ఇది నువ్వు మద్రాసుకి తీసుకెళ్ళు" అని ఇచ్చారు. అప్పటినుండి ప్రతి పండక్కీ, నోములకీ, కథలకి మా అత్తగారి జ్ఞాపకార్థం దానినే అనుసరిస్తున్నాను. ఆ పుస్తకం పేజీలు తిప్పిచూస్తే, చిన్న చిన్న పిచ్చిగీతలు కనిపించాయి. పిచ్చిగీతలేకాదు. ఒక ఏనుగు ఆకారంకూడా కనిపించింది. ఇది ఏమటని సేతమక్కను అడిగితే, ఆవిడ నవ్వుతూ "ఇది శీను, అంటే మీ ఆయన మూడేళ్ళప్పుడు వేసిన డ్రాయింగులు" అంది. "ఓహో! ఆయనకి అప్పటినుంచే డ్రాయింగ్ జ్ఞానం వుందన్నమాట" అనుకున్నాను. ఆ పుస్తకం సంవత్సరాలయ్యేకొద్దీ పేజీలు చిరిగిపోతూ వచ్చాయి. కొన్ని పేజీలు అప్పడం ముక్కల్లాగా అవుతూ వచ్చాయి. అప్పుడు మావారు ఆయన కాలేజ్ మేట్, రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మద్రాసు మ్యూజియం. హరినారాయణగారి పర్యవేక్షణలో దాన్ని శాస్త్రీయ పద్ధతిలో లేమినేట్ చేయించి బైండ్ చేయించారు. దాన్ని జాగ్రత్తగా భద్రపరిచి, నేను వాడుకోవడానికి ఒక జిరాక్స్ కాపీ తీయించారు.

**అంతే. రాగానే** మంగళ గౌరీ పూజకి కొత్త చీర కొన్నానా! రెండు మూడేళ్ళవరకు మా స్వంత డబ్బుతో కొత్తబట్టలు కొనుక్కునే అసరంలేకపోయింది. భీమవరం వెళ్తే మా అమ్మ, అమ్మమ్మ, రాజమండ్రి వెళ్తే మా పిన్ని మా యిద్దరికీ బట్టలు కొనేవారు. కానీ మూడవ సంవత్సరం దీపావళి నుంచి మేమే కొనుక్కోవడం మొదలుపెట్టాము. మొత్తం మీద సంతోషంగా గడుస్తున్న సమయంలో మాకొక ఇబ్బంది

పడే న్యూస్. ఇల్లు ఖాళీ చెయ్యమని, ఇల్లుగలవాళ్ళు ఆ ఇల్లు అమ్మేస్తున్నారట. అక్కడ మేము కాక ఇంకా రెండు కుటుంబాలు వున్నాయి. అందులో ఒకరు సినిమా యాక్టరు పెరుమాళ్ళు. ఉన్నట్టుండి మాకు ఇల్లెలా దొరుకుతుంది? మావారి గూడూరు స్నేహితుడు బరోడా బ్యాంక్‌లో పనిచేసే విశ్వేశ్వరయ్య సిఫార్సు వలన టి.నగర్‌లోనే సరోజిని వీధిలో ఒక ఇల్లు దొరికింది. గేటు పక్క సందులోంచి వెళ్తే వెనక నుంచి మా ఇంట్లోకి వెళ్ళేదారి. ఒక వంట యిల్లు, ఒక గది. ఏం చేస్తాం. సమయానికి దొరికింది కదా. ఆ యిల్లు కూడా అన్నిటికీ దగ్గరే. కానీ వీధి ముఖం కనిపించదు. కిటికీలోంచి చూస్తే పక్కవాళ్ళ యిల్లు కనిపిస్తుంది. వాళ్ళు మాట్లాడిస్తూ వుండేవారు. మా యిల్లుగలావిడ అదో మాదిరి. జబ్బు మనిషి. అందర్నీ విసుక్కుంటూ ఉండేది. ఆయన మాత్రం చాలా మంచివాడు. పక్కవాటాలో మా అమ్మమ్మ పుట్టిల్లు అంజూరువాళ్ళ తాలూకు ఉండేవారు. వాళ్ళు మమ్మల్ని బాగా చూసుకునేవాళ్ళు. వాళ్ళకొక్కర్తే అమ్మాయి. అస్తమానం మా యింటికొచ్చి నాతో కబుర్లు చెపేది. నేను వచ్చీ రాని తమిళ భాషలో మాట్లాడేదాన్ని. వాళ్ళమ్మ వచ్చి, "రా! కల్యాణిని యిబ్బంది పెట్టకు" అని పిల్చుకు వెళ్ళిపోయేది. ఇల్లు చిన్నదైనా చుట్టాలు చాలా మంది వచ్చేవారు. ఇంతకు ముందున్న ఇంట్లో కూడా మా మామగారు ప్రతి సెలవులకి మనవళ్ళని పిల్చుకుని గుడూరు నుంచి వస్తూండేవారు.

ఒకసారి కె.వి.రెడ్డి గారు మావారితో 'పెళ్ళినాటి ప్రమాణాలు' ఎక్స్‌ట్రా ప్రింట్ ఒకటుంటే చెక్ చేయమన్నారు. అప్పుడు ఆ పిక్చర్‌కి నన్ను జయంతి వారి థియేటరుకు పిల్చుకెళ్ళారు. ఆ థియేటర్‌లో మేమిద్దరమే. రాయల్ షో లాగా అయింది. ఇలాగ మేమిద్దరమే కలిసి చూసే యోగం వుందన్నమాట.

పెళ్ళయిన కొన్నాళ్ళకి నాకు బోర్ కొడ్తుందని మా వారికి రేడియో కొనాలనిపించింది. కానీ డబ్బెక్కడిది? ఆ! జ్ఞాపకం వచ్చిందాయనకి. ఆయన చిన్ననాటి స్నేహితుడు మృత్యుంజయరెడ్డి కావలిలో రేడియో షాపు పెట్టుకున్నాడుగా. వెంటనే మా వారు ఒక సెట్ వాయిదా పద్ధతిలో కొన్నారు. అతను మద్రాసు వస్తే మా యింట్లో భోంచేసేవాడు. రేడియోలో ఏదైనా మిస్టేక్ వస్తే అతన్ని చూడమనేవారు. అతను రిపేర్ అయ్యాక "శీనూ! నువ్వు పెట్టిన భోజనం వేస్ట్ అవలేదు" అనేవాడు. అతను పాటలు బాగా పాడేవాడట. చిన్నప్పుడు వీళ్ళిద్దరూ లవకుశ నాటకం వేసారుట.

ఒకసారి రాత్రి 9గంటలకి రేడియో వైర్‌లోంచి పొగ వచ్చింది. ఆయనింట్లో లేరు. నాకేం చెయ్యాలో తోచలేదు. ఎవర్ని పిలవనూ? వెంటనే ప్లగ్ ఊడపెరికి ఇంటికి తాళం పెట్టి జయంతి ఆఫీసుకి పరిగెత్తాను. గుండె దడ దడ కొట్టుకుంటోంది. సడన్‌గా నన్ను చూసి మావారు స్టన్ అయ్యారు. అప్పుడు ఆయన 'రాజాదేసింగ్' అనే తమిళ పిక్చరు తెలుగులోకి అనువదించడానికి వాయిస్ రికార్డింగ్ పనిలో వున్నారు. డబ్బింగ్ ఆర్టిస్ట్ డైలాగులు చెప్తున్నారు. నాకు అంతా కొత్తగా అనిపించింది.

ఆ డబ్బింగ్ పిక్చర్ వెనుక ఒక కథ వుంది. సూదిరెడ్డి శంకర రెడ్డి మావారి స్నేహితుడు. ఆనాటి కర్నూలు యం.ఎల్.ఏ శేషశయనారెడ్డి గారి బావమరిది. మావారితో కలిసి కె.వి.రెడ్డిగారి సినిమాలకి, జయంతి పిక్చర్స్‌కి ప్రొడెక్షన్ మేనేజరుగా పనిచేసేవారు. ఆయన భార్య రత్నమ్మ కూడా చాలా మంచిది. నాకు సన్నిహితురాలుగా వుండేది. చాలా సంవత్సరాల తరువాత మా పెద్దమ్మాయి శకుంతల పెళ్ళికి కూడా వచ్చింది. జయంతీ పిక్చర్స్ నిర్మాత పి.యస్.రెడ్డిగారు, శంకరరెడ్డిగారి ఆధ్వర్యంలో ఈ డబ్బింగ్ సినిమా బాధ్యత శంకర రెడ్డికి వదిలారు. 'రాజాదేసింగ్' సినిమాలో యం.జి.ఆర్, భానుమతి, పద్మిని నటించారు. శంకర రెడ్డి డబ్బింగ్ నిర్వాహకం మా వారి చేతిలో పెట్టాడు. తెలుగు మాటల రచయిత, పాటలు శ్రీశ్రీగారు. మా వారు ఆ సినిమా తెలుగులోకి తర్జుమా చేసిన తరువాత దాని పేరు 'దేసింగ్ రాజు కథ', టైటిల్స్‌లో 'డైలాగు డైరెక్షన్' సింగీతం శ్రీనివాసరావు అని వుంటుంది.

ఆంధ్రాలో పెళ్ళయిన సంవత్సరం సంక్రాంతి ఎంత ప్రాముఖ్యమో దక్షిణాన దీపావళి అంత ముఖ్యం.. మా వారి డబ్బింగ్ పని వుండడం వలన దీపావళికి వెళ్ళడం కుదరదని, మేమిద్దరం దసరా పండక్కి భీమవరం వెళ్ళాము. దీపావళికి వుండకుండా ఆయన మాత్రం మద్రాసు వచ్చేసారు. నేను దీపావళి అయిన తర్వాత వచ్చాను.

కొన్నాళ్ళకి నేను నెల తప్పాను. మాకు లేడి డాక్టర్స్ ఎవరూ తెలియదుగా. కె.వి.రెడ్డిగారు మావారికి చెప్పినట్లు డాక్టర్ శాంత సుందరి చేత చెకప్ చేయించుకోడానికని వెళ్తుండేదాన్ని. అలాగ ఒకసారి ఒకావిడతో పరిచయం అయ్యింది. నా పేరు, మా వారి పేరు, ఉద్యోగం అన్నీ అడిగింది. చెప్పాను. నేను ఆవిడని అడిగాను. ఆవిడ పేరు కృష్ణజ్యోతి అని, ఆమె భర్త డబ్బింగ్ ఆర్టిస్ట్ పి.జె.శర్మ అని చెప్పింది. ఆయన సినిమాల్లో యాక్టింగ్ కూడా చేసేవారు. వాళ్ళ పెద్దబ్బాయే ఈనాటి సాయికుమార్. ప్రముఖ నటుడు, హీరో, 'వావ్' ప్రోగ్రామ్ ఏంకర్ కూడా, అసలు అతన్ని కన్నడ వాళ్ళు కర్ణాటక సినిమాలకి ప్రోత్సహించిన తరువాతే తెలుగు చిత్రసీమలోకి వచ్చాడు.

నేనలా అప్పుడప్పుడు లేడి డాక్టర్ దగ్గర చెకప్‌కు వెళ్తూ వస్తుండేదాన్ని. ఒకసారి నేను, మావారు ఒక పెళ్ళికి రాజమండ్రికి వెళదామనుకుని ప్లాను చేసుకున్నాము. మావారి బాబాయిగారి అమ్మాయిని వారి మేనత్త కొడుక్కి యిచ్చి. రెండువైపులా విధాయంకం కనుక వెళదామనుకున్నాము. అంటే ఏడవ నెలలో ఎటూ పురిటికి భీమవరం వెళ్ళాలి. రెండుసార్లు ప్రయాణం మంచిది కాదని మామగారు ఉత్తరం వ్రాసారు. అదీ నిజమేగా! వచ్చే నెలలో ఎటూ భీమవరం వెళ్తున్నాగా అని ఊరుకున్నాము.

ఏడవ నెల రాగానే గూడూరు పిలిపించారు మా తోటికోడలు. ఇక్కడ వాళ్ళగురించి చెప్తాను చూడండి. మా తోటికోడలి పేరు సేతుబాయి. అందరూ సేతమ్మ అని పిలుస్తారు. మా బావగారి పేరు ఉడిపి కృష్ణమూర్తిగారు. వాళ్ళకి ఇద్దరు అబ్బాయిలు, ఐదుగురు అమ్మయిలు. ఇవికాక మా సేతమ్మ అక్కకి కొన్ని అబార్షన్లు, ప్రిమెచ్యూరు చైల్డ్ బర్త్, డెత్స్‌లాంటివి జరిగాయి. మా బావగారు గూడూరులో రకరకాల బిజినెస్‌లు చేశారు. మా మామగారు సింగీతం రామచంద్రరావుగారు రిటైర్డ్ హెడ్ మాస్టర్ అని ముందే తెలిపాను. ముందు నాకు గూడూరులో పండగ చేయాలని అక్కడికి రప్పించారు. మేమెళ్ళిన మరుసటి రోజున భీమవరం నుండి మా అమ్మ ఆనవాయితీ ప్రకారం మా తోటికోడలుకు, నాకు చీరలు మొదలైనవన్నీ తెచ్చింది నన్ను పురిటికి పిల్చుకెళ్ళడానికి. మా సేతమ్మక్క నాకన్నా పెద్దది. అత్తగారి స్థానంలో వుండి అన్నీ ఆవిడే జరిపించింది. కొత్తలో ఆవిడ దగ్గర ఎందుకో నేను ఫ్రీగా వుండలేక పోయేదాన్ని. ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు చూడాలి మమ్మల్ని. స్వంత అక్క చెల్లెళ్ళుగా గంటల తరబడి మాట్లాడుకుంటాం. అప్పటి నా జంకు చూసి ఆవిడే అర్థం చేసుకుని నన్ను బాగా చూసుకునేవారు. నా పెళ్ళయి వచ్చేసరికి ఇద్దరు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. నే వచ్చిన తరువాత మరి ఇద్దరు అమ్మాయిలు. ఆ మూడో అమ్మాయే నా పెళ్ళికి చంటిపాప. అది పెరిగి పెద్దదై, అది కూడా మద్రాసు వాసి అయిపోయింది. పేరు సత్యభామ. ఇప్పుడు యంజి.ఆర్ హాస్పటల్ కాలేజీలో వర్క్ చేస్తోంది. నేను దాంతో అంటుంటాను. "నువ్వు పుట్టి నా పెళ్ళిచేయించావు. నేను ఈ వూరు సంబంధం చూసి నీ పెళ్ళి చేయించాను" అని.

గూడూరులో గాజులు తొడిగించి, పువ్వులు ముడిచే ఫంక్షన్ అయిన తర్వాత మా అమ్మ నన్ను భీమవరం పిల్చుకు వెళ్ళింది. మా నాన్నగారు మధ్య తరగతి కుటుంబం వారైనా కూడా నేను గర్భవతి కదా అని రైలుకి ఫస్ట్‌క్లాస్ బెర్త్ బుక్ చేయించారు. స్టేషన్‌కి మావారు వచ్చారు. మరునాడు ఆయన మదరాసు ప్రయాణం. రైలు కదిలేసరికి నాకు దుఃఖం ఆగలేదు. మళ్ళీ నే రావడానికి అయిదు నెలలు పడుతుంది కదా, మాకా ఎడబాటు తప్పదుకదా! అని, కానీ మా అమ్మ బాధపడ్తుందని అది కనబర్చలేదు.

అన్నట్టు ఒక విషయం మర్చిపోయాను. భీమవరం ప్రయాణం కట్టే ముందు మద్రాసులో మా వారిని ఒకటి రిక్వెస్టు చేశాను షూటింగ్ చూపించమని. అంతకు ముందు భీమవరం వెళ్ళినప్పుడే అందరూ అడిగారు. "షూటింగ్ చూశారా? వాహిని స్టూడియో చూశారా?" అని. వాళ్ళకి జవాబు చెప్పుకోడానికయినా చూడాలికదా. మావారు "అవునుకదూ, మర్చిపోయా"న్నారు. అప్పుడు

కె.వి.రెడ్డిగారు విజయా వారి బ్యానర్‌లో ఒక జానపద చిత్రం తీస్తున్నారు. "జగదేకవీరుని కథ." ఆ పిక్చరుకి కూడా మావారు స్క్రిప్టుకి పనిచేశారు. ఆ షూటింగ్‌కి వెళ్ళాము. రెడ్డిగారు మమ్మల్ని సాదరంగా మర్యాద చేసి కూర్చోబెట్టారు. ఋష్యేంద్రమణి అత్తగారు – బి.సరోజాదేవి, జయంతి, యల్. విజయలక్ష్మి, బాల కోడళ్ళు. "ఆదిలక్ష్మి వంటి అత్తగారివమ్మా" అనే పాట చిత్రీకరణ జరుగుతోంది. అది చూసి తృప్తిపడ్డాను.

సరే, భీమవరం వెళ్ళినతర్వాత మా అమ్మవాళ్ళు కూడా పండగ చేశారు. ఎలాగో కాలం వెళ్ళబుచ్చేదాన్ని. ఇరవై మూడేళ్ళు గడిపిన ఆ యింట్లో ఇప్పుడు పొద్దుపోయేదికాదు. మా వారి దగ్గరనుంచి ఉత్తరాలు, నా ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయనుకోండి. చుట్టుపక్కల పిల్లలు వస్తూండేవారు. మా సుశీల గుంటూరులో బి.యిడి చదివేది కదా, అది వస్తూ పోతూ ఉండేది. అక్కడి విషయాలు చెప్తుండేది. మా రఘుమ చిన్నది కదా, దాని స్కూలేదో గొడవేదో దాంతో సరిపోయేది దానికి.

నాకు తొమ్మిదో నెల వచ్చింది. ఒకరోజు పొద్దున్న స్నానం చేసి వచ్చి బొట్టు పెట్టుకుంటుంటే మా నాన్నగారు వచ్చి "అమ్మలూ, త్వరగా బొట్టు పెట్టుకునిరా. నా ఫ్రెండ్ ఒకాయన వచ్చారు. ఆయనకు నిన్ను పరిచయం చెయ్యాలి" అని ఆయన రూమ్‌కి పిల్చుకెళ్ళారు. మా నాన్నగారి గది ఒక పక్కగా సపరేట్‌గా వుండేది. ట్యూషన్ పిల్లలు, స్నేహితులు వచ్చినా, ఆయన నోట్స్ రాసుకోడానికైనా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా ఆ రూమే. నేను ఆయన వెనకాలే చీర పైట సవరించుకుంటూ వెళ్ళాను. "ఈ అమ్మాయి మా పెద్దమ్మాయండి", అంటూ నన్ను లోపలికి రమ్మన్నారు. ఆశ్చర్యం మరెవరో కాదు. సాక్షాత్తు మా వారే. నాకు ఆశ్చర్యం, ఆనందం రెండూ మిళతమై పోయింది. "ఆ! మీరా" అంటూ పక్కనే కూర్చున్నాను. "అదేమిటీ, నిన్న వచ్చిన వుత్తరంలో కూడా మీరు వస్తున్నట్టు లేదే! ఓహో! ఇది మీ ప్లానా" అన్నాను నవ్వుతూ. మా నాన్నగారు లోపలికి వెళ్ళిపోయారు. "అనుకోకుండా వచ్చాను. నాకే తెలీదు వస్తానని. బెజవాడలో ఒక ఫ్రెండ్ పెళ్ళి వుంటే అటెండ్ అవుదామని బయలుదేరాను. పంపాపతిరావుండి ఎటూ బెజవాడ వరకు వెళ్తున్నావు కదా, అలాగే భీమవరంకు వెళ్ళి నీ వైఫ్‌ని చూసిరా! ఇటువంటి సమయంలో భర్తను చూడాలని అనిపిస్తుంది అని చెప్పాడు" అన్నారు. అబ్బా! ఆయనకి ఎంతైనా థాంక్స్ చెప్పాలి. అప్పటికే అతని పెళ్ళై పోయింది. అతనికా అనుభవం ఏమో అనుకున్నాను. "ఎలాగైతేనేం నాకు ప్లెజెంట్ సర్‌ప్రైజ్‌నిచ్చారు" అన్నాను. మా రఘుమకైతే బావగారు వస్తే ఖుషి, కబుర్లు చెబుతుంటారు. నవ్విస్తూ వుంటారు. సినిమా ప్రోగ్రామ్‌లు వేస్తారు. వాళ్ళిద్దరూ బావా మరదళ్ళైనా తండ్రి కూతుళ్ళ అనుబంధంలా వుండేవారు. అల్లుడొచ్చారని మా అమ్మ, నాన్నగారికి చాలా సంతోషం. మా అమ్మమ్మకయితే చెప్పడమే అవసరం లేదు. అమితానందం మనవడు వచ్చాడని. మా అమ్మ ముందు గదికి వెళ్ళి మా వారికి కాఫీ ఇచ్చేది. "మీ నాన్నగారేరీ?" అనడగేవారు. "వంటింట్లో కాఫీ తాగుతున్నారు" అని చెప్పాను. "నేనూ అక్కడికే వెళ్తాను" అంటూ వంట యింట్లోకి వెళ్ళి, గుమ్మం మీద కూర్చునేవారు. అప్పుడు మా అమ్మా వాళ్ళు కాఫీలు, వంటలు పీట మీద కూర్చుని, కిందే చేసేవారు. ఈయనక్కడికి వెళ్ళగానే మా అమ్మ సిగ్గుతో పైట సవరించుకుంటూ, మా అమ్మమ్మ విడో కదా, తలమీద ముసుగు చీర సవరించుకుంటూ వుండేవారు. అల్లుడైనా కూడా భేషజాలేవీ లేవని సంతోషించేవారు.

అంతకు ముందొకసారి మేము భీమవరం వెళ్ళినపుడు మా రఘుమ కాలేజీ చదివే రోజులు. ముందు నేను వెళ్ళాను. తరువాత వారు వచ్చారు. వారు వచ్చే విషయం దానికి తెలీదు. మా చెల్లెలు కాలేజీ నుంచి వచ్చే టైం తెలుసుకుని మావారు లుంగీ బనీను వేసుకుని తలకు తువ్వాలు తలపాగా కట్టుకుని బయటికి వెళ్ళారు. అర్థం కాక మేమంతా చూస్తున్నాము. ఆయన ట్రిక్కులు నాకు తెలుసు కనుక ఆయనేం చేస్తారో చెప్పాను. కాలేజికి వెళ్ళాలంటే ఒక వంతెన దాటాలి. కింద నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అది ఒక కాలువ. ఈయన వంతెన మీద నిల్చుని కింద నీళ్ళు చూస్తున్నట్లు నటిస్తూ, వెనక్కి తిరిగి గుంపులు గుంపులుగా వచ్చే కాలేజీ విద్యార్థులను చూస్తున్నారు. మా చెల్లెలు తన స్నేహితురాలు కామేశ్వరి అనే అమ్మాయితో మాట్లాడుతూ అప్పుడప్పుడు వెనక్కి తిరిగి చూస్తూ వస్తోందిట. ఆ

అమ్మాయి "అదేమిటే అలా అస్తమానం వెనక్కి చూస్తున్నావు" అని అడిగిందిట. "కాదే, అక్కడ చూడు ఆ లుంగీ కట్టుకున్నాయన్ని చూస్తే ఏదో పరిచయం వున్న ఆయనలా కనిపిస్తున్నాడే" అని అందిట. ఆ కామేశ్వరి ఎవరో కాదు యిప్పటి యువదర్శకుడు వి.యన్.ఆదిత్య అమ్మ. ద్రోణంరాజు బుచ్చినారాయణ మూర్తిగారమ్మాయి. తన భర్త వి.వి.సత్యప్రసాద్ గారు ఎస్.బి.ఐ. ఆఫీసర్‌గా రిటైరయ్యారు. ఆయన కవి, సాహిత్యాభిలాషి. మావారంటే ఆయనకు చాలా గౌరవం. వాళ్ళబ్బాయి ఆదిత్య 'మనసంతా నువ్వే'లాంటి ఎన్నో హిట్ సినిమాలకు దర్శకత్వం వహించాడు.

రఘుమ ఇంటికొచ్చేసరికి మా వారు ఇంటికొచ్చేసారు. దాన్ని చూడగానే మేమంతా ఘొల్లుమని నవ్వాము. "అదే నేననుకుంటానే వున్నా బావగారిలా వున్నారే అని. కానీ ఇలా లుంగీతో వంతెన మీద ఎందుకుంటారో అనుకున్నా" అంది. ఇలా దాన్ని బాగా ఆటపట్టించేవారు. కామేశ్వరి కూడా నన్నూ వారినీ అక్క, బావగారనే పిలిచేది. ఇప్పుడు కూడా అంతే. పక్కింటి శేషావతారం గారమ్మాయి మంగతాయారు, అలివేలు కూడా అలాగే పిలిచేవారు. కామేశ్వరి కూడా హైదరాబాదు కనుక అప్పుడప్పుడు కలుస్తూవుంటాను. అలివేలుని చాలా సంవత్సరాల తరువాత మా చెల్లెలి కూతురి పెళ్ళిలో చూసాను. ఇప్పటికీ కూడా భీమవరం వాళ్ళనెవరినైనా చూస్తే నాకా ఊరిని చూచినంత సంతోషంగా వుంటుంది.

పెళ్ళయిన తర్వాత అందరు ఆడపడుచుల లాగే నేను కూడా పచ్చళ్ళు, ఆవకాయలు, పొడులు, వడియాలు, భీమవరం నుంచి తెచ్చేదాన్ని. దార్లో గూడూరులో దిగినప్పుడు అక్కడ్నించి కూడా తెచ్చేదాన్ని. నేను పెళ్ళికి ముందు కారం బాగా తినేదాన్ని. పెళ్ళయిన తర్వాత నేను, మావారు భోంచేస్తున్నప్పుడు ఆవకాయ అన్నానికి కలుపుకుని తింటున్నాను. మావారు ఉన్నట్టుండి "అబ్బా ఎంత ఎర్రగా కలుపుకున్నావు, అంత కారం ఎలా తింటున్నావు" అని అడిగారు. ఆవకాయ అన్నం ఎర్రగా కాక ఎలాగుంటుంది? ఆయన చాలా కాలంగా మద్రాసులో వుంటున్న మూలాన అంత కారం తినేవారు కాదు. నాకు ఏడుపు వచ్చింది. కళ్ళల్లో నుంచి నీరు కారుతున్నాయి. తలదించుకున్నాను. అన్నంలో కన్నీళ్ళు పడతాయేమోనని కంచం ముందుకు జరిపాను. ఇవేమీ ఆయన గమనించలేదు. కాసేపుండి అన్నం కదలకపోవడం గమనించి నన్ను చూసారు. కళ్ళ వెంట నీళ్ళు! "అరె! ఏడుస్తున్నావా! నేనేం అన్నాననీ" అని బెరుకుపోయినట్లు, తానేదో తప్పు చేసినట్లు మొహం పెట్టి చాలా నొచ్చుకున్నారు.

నాకు మొదట్లో తెలియలేదు. రాను రాను తెలిసొచ్చింది. ఈయనకి పరధ్యానం ఎక్కువ. అంటే ఎప్పుడూ ఏదో స్టోరీ స్క్రిప్టు ఆలోచిస్తూ వుంటారు. అప్పుడప్పుడు చేతులు ఆడిస్తూ, తానే ఆర్టిస్టులాగా యాక్షన్లు చేస్తూ వుంటారు. ఏదైనా చెపితే వినిపించుకున్నారో లేదో తెలీదు. చెపితే ఎప్పుడు చెప్పావు. నాకు చెప్పనేలేదు అంటారు. మళ్ళీ మళ్ళీ చెబితే ఎన్నిసార్లు చెబుతావు ఒకసారి చెప్పావుగా అంటారు. ఒకసారి భీమవరం వెళ్ళినపుడు మావారు ఎలా చేసేవారో మిమిక్రీ చేసి చూపించాను. మావారక్కడికి వచ్చినపుడు మాటల్లో మా నాన్నగారు "మా కల్యాణి మిమిక్రీ బాగా చేస్తుంది. ఎవరెలా మాట్లాడ్తారో అలా చెప్తుంది" అనగానే మావారు "నన్ను కూడా మిమిక్రి చేసి చూపించి వుంటుందే" అన్నారట.

అలాగే ఒకసారి దసరాకి వెళ్ళి దీపావళి వరకు వుండి వచ్చేసానని చెప్పానుగా. దసరా కొలువులో మా చెల్లెలితో పాటు పార్కు కట్టడానికి సహాయం చేస్తూ వుండేవారు. మా అమ్మవాళ్ళకి కూడా దసరాకే బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీ. పేరంటాళ్ళు వచ్చి కూర్చున్నా కూడా బావామరదళ్ళకి ఆ బొమ్మల దగ్గర పార్కు అలంకారం అయ్యేది కాదు. మా వారలా కలిసి మెలిసి అందరితో కలివిడిగా తిరగడం మావాళ్ళకి చాలా సంతోషం.

మా పెళ్ళిరోజున మావారు మా రఘుమని మంచినీళ్ళు అడిగారట. అది తెచ్చి చేతికి ఇచ్చింది. తర్వాత మా నాన్నగారిని "మీ రఘుమ డ్యాన్సు నేర్చుకుందా?" అని అడిగారట. మా నాన్నగారు ఆశ్చర్యంగా "అవును, ఎందుకలా అడుగుతున్నారు", అనడిగితే "అహో!

మంచినీళ్ళగ్లాసు ఇచ్చేటప్పుడు ముంచేయి మాత్రం వంగింది తనకి" అన్నారట. ఇది నాకు పెళ్ళయి మదరాసుకొచ్చిన తర్వాత మావారు చెప్పారు నాకు. ఎంత shrewdz, ఎలా కనిపెట్టారో అనుకున్నా.

నేను రెండవసారి భీమవరం వెళ్ళినప్పుడు నాలో వచ్చిన మార్పును చూసి లెక్చరర్స్, మా నాన్నగారి స్నేహితులు ఆశ్చర్యపోయారు. "విఠల్‌రావుగారూ మీ పెద్దమ్మాయి యిపుడు చాలా బాగా మాట్లడ్తోందే" అనేవారట. ఎందుకంటే పెళ్ళికి ముదు నేను చాలా రిజర్వ్‌డ్ ఎవ్వరితోనూ మాట్లాడను. పేరంటానికి మా నాన్నగారి ప్రోద్భలంతోనే వెళ్ళేదాన్ని. అందుకనే నా మార్పు వాళ్ళకు ఆశ్చర్యం వేసింది. మా నాన్నగారు ఆ క్రెడిట్ అంతా వాళ్ళ అల్లుడికి ఇచ్చారు. "మా అల్లుడు దాన్ని లైబ్రరీకి, అతనెక్కడికెళ్తే అక్కడికి పిల్చుకెళ్తారుట. దాంతో దానికి బెరుకుతనం పోయింది" అని గొప్పగా చెప్పుకునేవారు. వీధిలో మెట్ల మీద కూర్చుని చిన్న చిన్న పిల్లల్ని మాట్లాడిస్తే కూడా మా సుశీల "అదేమిటే, ముంగిలా ఉండేదానివి ఇలా మాట్లాడ్తున్నావు ఇదంతా మా బావగారి మహిమే! నిన్ను భలే మార్చేశారే!" అనేది.

నేను పురిటికని ఏడవ నెలలో వెళ్ళానా, మూడు నెలలు ఎలాగో గడిచిపోయింది.. పదవ నెల రాగానే ఫాల్స్ నొప్పులు వచ్చి ఒకరోజు ఆస్పత్రిలో ఉండి వచ్చాను. అది మిషన్ హాస్పిటల్. ఎన్నో డెలివరీలు చేసిందా డాక్టరు. అందుకని నిజమైన నొప్పులొచ్చిన తర్వాత మళ్ళీ చేరాను. ఈసారి నొప్పులెక్కువై ఒక రోజంతా నొప్పులుండి ఆగిపోయాయి. నానా అవస్థలు పడ్డాను. కూర్చోడానికి రాదు, నిల్చోడానికి రాదు. మొత్తం మీద నార్మల్ డెలవరీ అయి చూస్తే స్టిల్ బార్న్ చైల్డ్. మగపిల్లవాడు. అదే సిటీ హాస్పటల్ అయివుంటే ఏ సిజేరియన్ ఆపరేషనో చేసి ఉండేవారు. డాక్టర్లు అనుభజ్ఞులు కానందున నాకలా జరగలేదు. కానీ నా గురించి భయపడిన డాక్టర్లకి తల్లి బ్రతకడం రిలీఫ్ ఇచ్చింది. నాకో గండం గడిచిందన్నమాట. చంటిపిల్లాడి కోసం ఎదురుచూస్తున్న మా అమ్మ వాళ్ళకి పెద్ద నిరాశ, వాళ్ళ దుఃఖానికి అంతులేదు. మునిమనవడిని చూస్తానని ఆశ పెట్టుకున్న మా అమ్మమ్మకి తీరని దుఃఖం. అక్కడ మద్రాసులో ప్రసవం అయిందని టెలిగ్రాం వస్తుందన్న మా వారికి ఈ విషయం ఒక కార్డు ద్వారా చూసి, పక్షిలా రెక్కలు కట్టుకుని వాలేరు, తిన్నగా ఆసుపత్రికే వచ్చేశారు. అక్కడున్న మా అమ్మకి ధైర్యం చెప్పారు. మర్నాడు మద్రాసు వెళ్ళి పుణ్యాజనానికి పదకొండవ రోజున వచ్చారు. బిడ్డవున్నా లేకపోయినా జరిగే తంతంగాలన్నీ జరగాలి కదా, ఈ సంఘటన 1961 జూన్‌లో జరిగింది. మూడవ నెల రాగానే మద్రాసు వచ్చేశాను. నాతోపాటు మా నాన్నగారు, మా అమ్మమ్మని తోడిచ్చి పంపారు.

నేను మొదటిసారి నెల తప్పినప్పుడు Madly Roadలో ఉండేవాళ్ళం. నేను భీమవరం నుంచి సామాన్లు తీసుకుని వెళ్ళిన గోనెసంచులు అవి ఒక గది అటక మీద వుంచాము. ఆ యింట్లో రెండు మూడు పిచ్చుకలు తిరుగుతూ వుండేవి. మా వారి పెదనాన్నగారు భీమారావుగారు పిచ్చుకలు తిరుగుతూ అవి పిల్లల్ని పెడ్తూంటే ఆయన ముచ్చటపడేవారు. ఇది చాలా మంచి శకునం, శుభసూచకం అనేవారు. ఆయన కొడుకు దొడ్డశీనుకి పిల్లలు కలగలేదు. మేము కొత్త పెళ్ళైన వాళ్ళం కదా, అస్తమానం పిచ్చుకలని మెచ్చుకుంటూ వుండేవారు.

ఒకరోజు నేను ముందు గదిలో కూర్చుని ఏదో వారపత్రిక చదువుకుంటున్నాను. మా వారు యింట్లో లేరు. పుస్తకం చదువుతున్న నేను అటక మీద నుంచి ఒక గోనెసంచి చివర్లు వేలాడ్డం చూశాను. ఊరుకోక నేను ఒక కర్ర తీసుకుని గోనెని పైకి తోస్తుంటే గోనె జారి దానిలోంచి ఒక పిచ్చుక గుడ్డు కింద పడిపోయి చితికిపోయింది. నాకదోలా అనిపించింది. మా వారికి చెప్పేనో లేదో జ్ఞాపకం రాలేదు. తరువాత ఒక తెలుగు వార పత్రికలో "పిచ్చుక శాపం" అనే కథ చదివాను. అప్పుడనిపించింది, నాకు కూడా పిచ్చుక శాప ఫలితమే బిడ్డ బతకలేదు అని. అప్పట్నుంచి యిప్పటివరకు ఎక్కడ ఏ గూడున్నా దాని జోలికి వెళ్ళను, ఎవ్వరినీ వెళ్ళనియ్యను. శత్రువులకి కూడా ఇలాంటి దుర్ఘటన రాకూడదనుకున్నాను.

నేను పురుడయి వచ్చినా కుడా ఇంకా పిక్చరు మొదలుపెట్టలేదు. కథ కోసం వెతుకుతూనే వున్నారు. నేను మా వారితోపాటు కొన్ని పుస్తకాలు చదివేదాన్ని. కొన్ని పద్యకావ్యాలు కూడా చదువుతూ ఉండేదాన్ని. కొన్నాళ్ళకి నాకెందుకో టీచరు ఉద్యోగం చెయ్యాలనిపించింది. సరే, దగ్గర్లో వున్న పార్క్ మాంటిస్సోరి స్కూల్లో చేరాను. ఆ రోజుల్లో జీతాలు కూడా పెద్ద ఏమి ఉండేవి కావు. ఆ కాలంలో రెండేళ్ళ కొక పిక్చరు, ఇప్పటిలా కాదు. టపాసాసరాలలాగ టపా టపా రిలీజు చెయ్యడానికి. కథ కోసరం వెతుకుతునే ఉన్నారు. మేమున్న ఇల్లు అచ్చిరాలేదని బస్టాండుకి చాలా దూరంలో ఉన్న సి.ఐ.టి నగర్‌లోని ఒక చిన్న ఇండిపెండెంట్ ఇంట్లో చేరాము. నెలకి 65రూ అద్దె, ఆ కాలంలో బస్ స్టాండు నుంచి సి.ఐ.టి నగరకి ఒక బస్సు కూడా లేదు. నడిచి వెళ్ళాల్సిందే ఆ యింటికి వెళ్ళేసరికి పిక్చరు "శ్రీ కృష్ణార్జున యుద్ధం" అని తెలిసింది. ఇల్లు దూరమని స్కూలు మానేశాను. కొన్నాళ్ళకి ఉన్నట్టుండి మా నాన్నగారు వచ్చారు. మా సుశీల పెళ్ళి నిశ్చయమైందని, నన్ను పిల్చుకుని వెళ్ళడానికొచ్చానని అన్నారు. సడన్‌గా ఈ విషయం చెప్పేసరికి నాకేం చెప్పాలో పాలుపోలేదు. "నాన్నగారూ, రేపు మా వెడ్డింగ్ డే థర్డ్ యియర్. మొదటిసారి నే కాన్పుకు భీమవరంలో ఉన్నప్పుడు మీ అల్లుడు రాలేదు. రెండవసారి అబార్షనయి ఆస్పత్రిలో ఉన్నాను. వెడ్డింగ్‌డే చూసుకుని ఎల్లుండి వెళ్దామ"ని అన్నాను. ఆయన సరేనన్నారు. పెళ్ళి తిరుపతిలో అని చెప్పారు. ఈ విషయం అల్లుడితో చెపితే వారు పిక్చరు ప్రారంభించామని, భీమవరం రావడానికి కాదని, తిన్నగా తిరుపతికే వస్తానని అన్నారు. మా నాన్నగారు సరేనన్నారు.

మా చెల్లెలి పెళ్ళికి తిరుపతికి రావడానికి దగ్గర బంధువులు ముందుగానే భీమవరంకే వచ్చారు. మరి కొందరు పెళ్ళి కూతుర్ని చేసేనాటికే వచ్చారు. అక్కడ్నుంచి అందరం కలిసి ప్రయాణం చేశాము. ఒక కంపార్టుమెంటు అంతా మేమే. ఆ రోజుల్లో రిజర్వేషనులు అవీ లేవు. బావగారు, తోడికోడలు మాకందరికీ టిఫిన్లు, కాఫీలు ఏర్పాటు చేసారు. అది పొద్దున్న మూలాన చాలా మెచ్చుకున్నారు. ఇక అక్కడ్నుంచి ఒక స్పెషల్ బస్సు మాట్లాడారు తిన్నగా తిరుపతికి. రైల్లో అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. నాకు మాత్రం మా వారు పెళ్ళికి వస్తారో రారో అని దిగులుగా ఉండేది. ఎందుకంటే చెల్లెలు పెళ్ళి మార్చి 30, కానీ మదరాసులో మా వారికి పాట రికార్డింగ్ 31న. ఎలా వస్తానో అని నాకు ఉత్తరం రాసారు. పైగా కె.వి.రెడ్డిగారి పిక్చరాయే. ఆయన చాలా స్ట్రిక్ట్. అసిస్టెంట్స్ ఎవ్వరూ ఆయనకెదురుగా కూర్చోరు. మావారూ అంతే, ముఖ్య అసోసియేట్ అయినా కూడా. అది 'శ్రీ కృష్ణార్జున యుద్ధం' మొదటి పాట రికార్డింగ్ అన్నమాట.

మా రైలు భీమవరం నుండి నిడదవోలు మీదుగా వెళ్ళి మర్నాడు పొద్దున్న గూడూరు చేరుకుంది. నేను యధాలాపంగా మా బావగారు వచ్చి వుంటారని కిటికీలోంచి తొంగి చూశాను. అరె! మావారు. వాళ్ళ అన్న పక్కనే నిల్చొని దిగే జనాన్ని చూస్తున్నారు. కిందకి దిగి "అమ్మయ్య వచ్చారా! మీరు వస్తారో లేదో అని దిగులు పడ్డాను." అంటూ సంతోషం అణచుకోలేక గడగడ మాట్లాడేస్తున్నాను. ఇంతలో మా నాన్నగారు "అమ్మలూ! సామాన్లన్నీ వచ్చాయో లేదో చూడు!" అన్నారు. మా వారిని చూసిన సంతోషంలో ఆ మాటే మర్చిపోయాను.

తిరుపతిలో పెళ్ళి అవగానే మావారు మద్రాసుకి వెళ్ళిపోయారు. మా నాన్నగారు అందరినీ కొండపైకి పిల్చుకెళ్ళే ఏర్పాట్లు చేసారు, దర్శనం అయ్యాక ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. నేను, మా అమ్మ మాత్రం సుశీలతో అత్తవారింటికి కర్నూలు జిల్లాలో ఉన్న ఆలూరికి వెళ్ళి, అక్కడ ఫంక్షన్ చూసుకుని మంత్రాలయం వెళ్ళాము. అక్కడ శ్రీ రాఘవేంద్ర స్వాములవారి దర్శనం చేసుకుని తిరిగి పెళ్ళి కూతుర్ని, పెళ్ళి కొడుకుని పిల్చుకుని భీమవరంలో మర్నాడు రిసెప్షన్ పెట్టుకున్నాము. రెండు రోజుల తర్వాత నేను మద్రాసుకు వచ్చేశాను.

అసలొక విషయం చెప్పడం మర్చిపోయాను. మా పెళ్ళైన దగ్గర్నుంచి మా వారిది ఒకటేమాట. నెలనెలా వచ్చే జీతంలో కొంతైనా ఆస్పత్రి ఖర్చులకోసమని బ్యాంక్‌లో వేస్తుండాలి. జబ్బులు ప్లాన్ చేసి రావుకదా. ఈ విషయం మా వాళ్ళకి చెపితే "ఇదేమిటే, శుభమా అని పెళ్ళి అయిన దగ్గర్నుంచి ఆస్పత్రి ఏమిటే" అనేవారు. కాని మొదటి డెలివరి అయిన తర్వాత నుంచి ఆస్పత్రికి తిరగడంతో

సరిపోయింది కదా, ఆయన చాలా ప్రాక్టికల్‌గా అన్నారు. ఇదేకాదు ఆయనకి ఇంకో ఆశయం కూడా వుండేది తెలుసా, ఎలాగైనా స్వంత ఇల్లు కట్టుకోవాలని. ఈ విషయము మా చిన్నాన్నగారికి చెప్తే "అమ్మలూ! మీ వారికి మొదటే ఈ ఆలోచన ఉండడం ఎప్పటికైనా మంచిదే!" అన్నారు. తరువాత ఒకటేమిటి అయిదిళ్ళు కట్టుకున్నాం.

మా సుశీల పెళ్ళికి ముందు సంఘటనలు కొన్ని చెప్పాలి. సి.ఐ.టి నగర్ ఇల్లు మారినపుడు మా అమ్మమ్మ మాతోనే వుండేది కదా! ఆవిడనొకసారి తెలిసిన వాళ్ళింటికి పిల్చుకు వెళ్ళాను. అలాగే కొన్ని పళ్ళు, కూరగాయలు కొని పేవ్‌మెంటు మీద నడుస్తుంటే కొంతమంది బొమ్మలమ్ముతున్నారు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు రెండు రోజుల్లో దసరా వస్తోంది కదా  అని. వెంటనే మా అమ్మమ్మ నాలుగు బొమ్మలు కొనిచ్చి "అమ్మలూ! చిన్న బొమ్మల కొలువు పెట్టవే" అంది. సీత, రాము, లక్ష్మణ, ఆంజనేయస్వామి బొమ్మలన్నమాట. యాభైఏళ్ళ నుంచీ నేనింకా ఆ బొమ్మల్ని దసరా కొలువులో పెడ్తూనే వున్నాను ఆవిడ జ్ఞాపకార్థంగా. మధ్యలో ఒకసారి పెయింట్ చేయించాను. కొన్నాళ్ళకి మా అమ్మ, చెల్లెళ్ళిద్దరూ మద్రాసు వచ్చారు. వాళ్ళు మద్రాసు చూడలేదు. ముఖ్యంగా మా చెల్లెళ్ళిద్దరూ మద్రాసు ముఖమే ఎరుగరు. మావారు ఖాళీగా వున్నప్పుడు మ్యూజియం, జూ, బీచ్ అన్నీ చూపించాం. వాళ్ళకికి షూటింగు, స్టూడియో చూపించాలి. మా వారికి ఖాళీలేదు. ఎలా? ఉన్నట్టుండి సూళ్ళూరుపేట నుండి మావారి పాత స్టూడెంట్ కె.వి.కృష్ణయ్య వచ్చాడు. అతన్ని చూచి మా వారు "మా వాళ్ళని షూటింగుకు పిల్చుకెళ్ళవోయ్" అన్నారు. సరే మేమంతా టి.నగర్‌లోని ఎలక్ట్రిక్ ట్రైన్ (లోకల్) ఎక్కి కోడంబాకం స్టేషనులో దిగాము. నేను ఇది రెండవసారి స్టూడియోకి వెళ్ళడం. అక్కడ నుంచి విజయవాహిని ఎంత దూరమో నాకు ఐడియా లేదు. కృష్ణయ్య నాతో "అమ్మా! టాక్సీ చేయించుకుందామా!" అంటే "ఎందుకూ, నడిచేవెళ్దాం" అన్నాను. పాపం గురువుగారి సతీమణి ఒద్దంటే అతనేం చేస్తాడు? మేమంతా నడిచి మొత్తానికి స్టూడియో చేరుకున్నాం. మా చెల్లెళ్ళిద్దరూ ఈ నడకలోనే అలసిపోయారు. ఎలాగైతేనేం, వాళ్ళు షూటింగు చూశారు మొత్తానికి. మా చెల్లెళ్ళు "అక్కా! ఇక మేము షూటింగు చూసింది చాల్లే. ఒక వేళ వెళ్ళినా కృష్ణయ్యగారిని మాత్రం పంపొద్దు" అన్నారు. జరిగింది విని మావారు అతన్ని పట్టుకుని చీవాట్లు పెట్టారు. "నా భార్యకైతే కొత్త, నువ్వెందుకలా చేశావ్?" అనడిగారు. పాపం నిజంగా అతను తను చేసిన పనికి చాలా బాధపడ్డాడు.

ఓసారి నాకు మూడవ నెల అబార్షన్ అయింది. మైలాపూర్ లోని కల్యాణి మిషన్ ఆస్పత్రిలో చేరి ట్రీట్‌మెంటు తీసుకున్నాను. డి.యన్.సి ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది. ఒక వారం రోజులు ఆస్పత్రిలో ఉన్నాను. కానీ నాకు భోజనం ఎలా వస్తుంది? ఇంటి దగ్గర ఎవ్వరూ లేరే. మా అమ్మమ్మ మా అమ్మా వాళ్ళతో వెళ్ళిపోయింది. పొద్దున్న టిఫిను, మధ్యాహ్నం, రాత్రి భోజనం. ఒక మధ్యాహ్నం ఉన్నట్టుండి ఒక భూతంలాంటి క్యారియర్ పట్టుకుని మావారు నాకు భోజనం తెచ్చారు. అక్కడున్న మిగతా వాళ్ళంతా ఇంత పెద్ద క్యారియర్‌లో భోజనం ఏ పేషంటుకు తెస్తున్నారని నిర్ఘాంతపోయారు. నాకు నవ్వొచ్చింది. ఇదేమిటి? ఇంత పెద్ద క్యారియర్ ఎక్కడిది? అనడిగాను. ఆ నవ్వుతో మాటరాలేదు నాకు. మనింట్లో క్యారియర్ లేదుకదా షూటింగులలో ఉపయోగించే క్యారియర్‌ని తెచ్చాను అన్నారు మా వారు. ఈ విషయం తెలిసిన మావారి స్నేహితుడు అమ్మన్న చౌదరి తన అత్తవారిల్లు దగ్గర్లోనే ఉందని చెప్పి భోజనాలు అతనే ఏర్పాటు చేశాడు. అప్పుడప్పుడు అతని భార్య వచ్చి నాకు కంపెనీ ఇచ్చి కాసేపు మాట్లాడి వెళ్తూ వుండేది. మా రెండవ వెడ్డింగ్ డే ఈ గొడవలతోనే సరిపోయిది.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన ఈ విషయం గూడూరుకి తెలిసి మా తోటికోడలు మా మామగారిని పంపించింది. నన్ను గుడూరుకి పిల్చుకురమ్మని. ఈ స్థితిలో దూరప్రయాణం భీమవరం వెళ్ళడం కష్టం అని. కానీ నాకు గూడూరు వెళ్ళడం ఇష్టంలేదు. యిక్కడ కాని, పుట్టింట్లో కాని జరిగినట్లు, నాకు గూడూరులో ఎలా జరుగుతుంది? వెళ్ళనన్నాను. కానీ మా వారు నా మనసు అర్థం చేసుకోలేదు. తనకి పగలంతా ఆఫీసులోనే సరిపోతుంది, వండివార్చడానికి, నన్ను చూసుకోడానికి ఎవ్వరూ ఉండరని

వారి బాధ. కానీ నేనిక్కడ ఫ్రీగా వుండాలంటే నువ్వు వెళ్ళకపోతే నేనాఫీసులో నిశ్చింతగా ఎలా పనిచేసుకుంటాను, వెళ్ళి తీరాల్సిందే అన్నారు. తప్పనిసరిగా వెళ్ళాను. వీలున్నప్పుడల్లా ఆయన కూడా వస్తుండే వారనుకోండి.

**కొన్నాళ్ళయిన తర్వాత** మళ్ళీ ఏదో ప్రాబ్లమ్ వస్తే డాక్టరు దగ్గరికి వెళ్ళాను. నా కేసు హిస్టరీ అంతా వాళ్ళకి చెప్పాను. ఆవిడిలా చెప్పింది. మొదటి Still born delivery సమయంలో servix (child bag) puncture అయిందని, దానికి కుట్లు వేస్తే కానీ గర్భం నిలవదని అన్నారు. డా.పురుషోత్తం అనే లేడీ డాక్టరు కుట్లు వేసి ట్రీట్‌మెంటు ఇచ్చింది. కొన్నాళ్ళకి మళ్ళీ అదే ప్రాబ్లమ్ వచ్చి ఆవిడ దగ్గరకె వెళితే టెస్ట్ చేసి, కుట్లు అతుక్కోలేదనీ, మళ్ళీ వెయ్యాలనీ, వేరొక డాక్టరు తన స్నేహితురాలి దగ్గరికి పంపింది. కానీ మాకెందుకో వెళ్ళడానికిష్టమవలేదు.

ఈ విషయమంతా విన్న కొందరు ఫ్రెండ్స్, ఆ తర్వాత, కె.వి.రెడ్డిగారు, డా. ఇ.వి.కల్యాణి చాలా పేరున్న డాక్టరనీ, హస్తవాసి మంచిదని అన్నారు. కానీ ఆవిడ దగ్గర ఖర్చు అవుతుందని మాకు తెలిసింది. మాకు ఏం చెయ్యాలో తోచలేదు. మా వారు డబ్బుమాట ఎలా ఉన్నా ఆరోగ్యం ముఖ్యం కదా, ఖర్చైతే అయింది ఇ.వి కల్యాణి దగ్గరకి వెళ్దామని నిశ్చయించుకుని ఆవిడ దగ్గరికి వెళ్ళేసరికి ఆవిడ ట్రీట్‌మెంట్ చేసింది. పదిరోజులు తర్వాత డిశ్చార్జి బిల్ ఇచ్చింది. మా వారికి చూపించాను "కొంచెం తగ్గిస్తుందేమో అడిగి చూడు" అన్నారు. మరుసటి రోజున ప్రొద్దున్న ఆవిడ వచ్చింది. "చూడండీ మా వారు అసిస్టెంట్ డైరెక్టరు. ఇంత బిల్లు ఇచ్చుకోలేము. కొంచెం తగ్గించుకుంటారా! ఇంకో విషయం. నేవున్నది పదిరోజులైతే దానిలో తొమ్మిది రోజులని వేశారు బిల్" అని ఇంగ్లీషులో చెప్పాను. ఆవిడ "oh, yes! Clever girl you are" అని బుగ్గ గిల్లి వెళ్ళిపోయింది.

కొన్నాళ్ళకి "శ్రీకృష్ణార్జున యుద్ధం" షూటింగు ప్రారంభమైంది. రెండు షెడ్యూల్సు అయింది. మావారికి చేతిమీద అంటే జబ్బ కింద కురుపు వచ్చి అది సెగ గడ్డగా మారి దాంతో చాలాబాధపడేవారు. నొప్పి రాను రాను ఎక్కువ అవుతుండే కానీ తగ్గే సూచనలు కనబడటంలేదు. చివరికి డాక్టరు దగ్గరికెళితే దాన్ని ఓపెన్ చేసి కట్టు కట్టారు. మెల్లగా సైకిల్ రిక్షాలో ఇంటికి వచ్చాము. రెండు మూడు రోజులుగా ఆఫీసుకు రానందున విషయం తెలుసుకున్న కె.వి.రెడ్డిగారు, మా యింటికి కారు వేసుకుని వచ్చారు మావారిని చూడడానికి. సడన్‌గా ఆయన్ని చూడగానే నాకు ఏమీ తోచలేదు. హార్లిక్స్ కలిపి ఇచ్చాను. ఆయన చాలా సంతోషించారు. కాసేపుండి వెళుతూ"శ్రీనివాసరావు కురుపు పూర్తిగా తగ్గేంత వరకు ఆఫీసుకు రావద్దు. బాగా రెస్ట్ తీసుకో" అని చెప్పి వెళ్ళారు.

సి.ఐ.టి నగర్ దూరం అన్నమాటే గాని అక్కడ వెనక ఇంటి వాళ్ళతో పరిచయమై వాళ్ళతో మ్యాట్నీ షోలకు సినిమాలకు వెళుతుండేదాన్ని. శ్రావణ మంగళవారం నోములు చేసుకుంటే అయిదు మంది ముత్తయిదువులకు వాయినం ఇచ్చుకోవాలి. అక్కడ ఉన్న తమిళ వాళ్ళకు ఈ పద్ధతులు తెలియవు కదా. నాకు ఏరియా కొత్త. అప్పుడొక తెలుగామె ఇంటింటికీ పిల్చికెళ్ళేది నన్ను. ఆవిడ యస్.వి.యస్‌గారని కల్కి పత్రికలో ఎడిటర్‌గా పనిచేసేవారు, ఆయన భార్య నన్ను అయిదుమంది ఇళ్ళకి పిల్చుకు వెళ్ళేది. యస్.వి.యస్ గారు ముప్పై సంవత్సరాలుగా రాజాజీ గారికి సెక్రటరీ. ఆ యస్.వి.యస్ గారే ముందు ముందు మావారొక తమిళ్ పిక్చరు, రాజాజీగారి "దిక్కెట్ర పార్వతి" కథని చిత్రంగా మలచడానికి రాజాజీగారి దగ్గరకు పిల్చుకెళ్ళి సహాయం చేశారు.

"కృష్ణార్జున యుద్ధం" షూటింగు ప్రారంభించేముందు స్క్రిప్టు అంతా రెడీ అయి, పాటలు అన్నీ కంపోజ్ చేసి రాసి రికార్డింగులకు సిద్ధంగా ఉన్న టైములో శాంతారాం గారి హిందీ పిక్చరు 'స్త్రీ' రిలీజయింది. అది ఒక పురాణ గాథ శకుంతల దుష్యంతల కథ. ఈ సినిమా ఎందుకో కె.వి.రెడ్డిగారికి చూడాలనిపించిందట. ఆయన, పింగళిగారు, పెండ్యాలగారు, మావారు థియేటరు కెళ్ళి చూసి వచ్చారు. నాలుగైదు రోజులయిన తర్వాత మా వారు టికెట్ బుక్ చేసి నన్ను కూడా పిల్చుకెళ్ళారు. బాగా ఇంట్రెస్టింగ్‌గా, ఖుషీగా,

సంతోషంగా చూస్తూ వున్నాను. కణ్వమహాముని శకుంతలను అత్తవారింటికి పంపే సీను శాంతారాంగారు ఎలా చిత్రీకరించారో? మరి ఎవ్వరికి సాధ్యం కాదు. "జావో లాడ్లీ" అనే పాటతో శకుంతల బయలుదేరుతుంది. చెలికత్తెలు ఒక్కొక్కరు కన్నీళ్ళు పెట్టుకోవడం చూపిస్తారు శకుంతల పెంచిన చెట్లకి ఆవిడ మేలిముసుగు కొనలు చిక్కుకుంటాయి. మమ్మల్ని పెంచి, పెద్ద చేసి, పూలు పూయించి మమ్మల్ని వదిలి వెళుతున్నావా అన్నట్లు. కొంత దూరం పోయిం తర్వాత జింకలు వెంటాడుతాయి. అంతా ఒక మనస్సు కదిలించే సన్నివేశం. నాకు ఏడుపు రావడం, కన్నీళ్ళు కారడం జరిగాయి. సైలెంట్‌గా చూస్తున్నాను. కానీ రాను రాను దుఃఖం ఎక్కువై ఏడుస్తూ వుంటే అప్పుడు తెలిసింది మావారికి. "నీకు భీమవరం జ్ఞాపకం వచ్చిందా? " అని అడిగారు. "కాదు ఈ సీను చాలా ఎమోషనల్‌గా వుందంతే" అని సర్ది చెప్పాను. నేను ఇక్కడికి వచ్చాక భీమవరం మరిపింప చేసారే. కానీ ఇలాంటి సంఘటనలు చూచినపుడు అమ్మా, నాన్నలు గుర్తుకు రావడం ప్రతి ఆడపడుచుకు సహజం కదా!

కొన్నాళ్ళకి "శ్రీ కృష్ణార్జున యుద్ధం" విడుదలైయింది. దాంట్లో సుభద్రని అత్త వారింటికి పంపినపుడు సత్యభామ పాత్రధారి యస్.వరలక్ష్మి "వేయి శుభములు కలుగు నీకు పోయి రావే మరదలా" అని అంటూ పాడారు. భానుమతి గారి వలెనే వరలక్ష్మి గారి పాటలూ, వారి కంఠం చాలా శ్రావ్యంగా వుంటుంది. నాకు చాలా ఇష్టం. ఈ నా 75 సంవత్సరాలలో పాత హిందీ పాటలతో పాటు యస్. వరలక్ష్మి పాటలు కూడా నా సెల్ ఫోన్‌లో రికార్డు చేసుకుని వింటుంటాను.

మేము సి.ఐ.టి. నగర్‌లో వున్న ఇల్లు కూడా ఖాళీ చేయవలసి వచ్చింది. అప్పుడు మామగారి కాలేజ్ మేట్ పట్టాభిరామన్ గారింట్లో ఇల్లు ఖాళీగా వుంది. అక్కడ చేరాము. మేము బర్కిట్ రోడ్డు ఇంటికి 1964లో వచ్చాము.

బర్కిట్ రోడ్డు ఇంట్లో వున్నప్పుడే అప్పుడప్పుడు స్నేహితులని, ఆఫీసులో ఆయన కూడా పనిచేసే స్నేహితులని భోజనానికి పిలుస్తూ వుండేవాళ్ళం. అలాగే మార్చి నెల 20 వ తేదీన అంటే మా వెడ్డింగ్ డే. జయంతి, విజయాలో మావారితో పనిచేసే స్టాఫ్‌ని రాత్రి డిన్నర్‌కి పిలిచాము. థాంక్స్ చెప్పి వెళ్తూండగా వారి కో - అసిస్టెంట్ కె.బాబూరావు మాత్రం మా ఇద్దరి దగ్గరకు వచ్చి 'డిన్నర్ చాలా బాగుంది' అని చెప్పి ఇంకొక మాట “Have a child” అని wish చేసారు. నాకెంత సంతోషం వేసిందో అతనలా దీవిస్తే. తమాషా చూడండి, ఆయన ఆ మాటన్న కొన్నాళ్ళకే నే నెల తప్పాను. మా శకుంతల పుట్టింది. నేను ఎప్పుడూ ఆయన్ని తలుచుకుంటూ వుంటాను. అయితే ఆయన తన చిన్న వయసులోనే కన్ను మూశారు. 'జరిగిన కథ', 'తల్లిదండ్రులు'లాంటి సినిమాలకి దర్శకత్వం వహించారు. ఒక్కోసారి కొందరి వాక్కులు అలా ఫలిస్తూ వుంటాయి.

పట్టాభిరామన్ మా మామగారి క్లాస్‌మేట్. వీరిద్దరూ కలిసి షేక్స్‌పియర్ నాటకాలు వేసారట. ఆయన ఇంట్లో ఫోటోలు కూడా వున్నాయి. మా మామగారు వయసులో కలరుండి చాలా బాగుండేవారట. ఆయన Bassanino, ఇల్లుగలాయన Shylock వేసారట. పట్టాభిరామన్ భార్య కూడా చాలా మంచావిడ. ఆవిడ భర్తంటే భయపడుతూ అణిగిమణిగి వుండేది. మేము చిన్న దంపతులము కదా అని మమ్మల్ని కనిపెట్టుకుని వుండేది. ఈ యింట్లో మా జీవితం చాలా బాగా సంతోషంగా వుండేది. దీపావళి రోజు మన ఆంధ్రాలోలాగే మేమిద్దరం టపాసులు కాలుస్తుంటే రావుకు, కల్యాణికి ఇది తొలి దీపావళి అని ఇంటి వారి కోడలు ఎగతాళి చేసేది. ఇవన్నీ రాస్తుంటే మా పెద్ద చెల్లెలు సుశీలను గురించిన ఒక సంఘటన జ్ఞాపకం వస్తోంది.

అది ఏడవ నెల పురిటికి భీమవరం వచ్చింది. నాకింకా పిల్లలు లేరుకదా, ఖాళీగానే వున్నాను కదా అని అమ్మ నన్ను సహాయానికి రమ్మని రాసింది. సరేనని నేను భీమవరం వెళ్ళాను. నా డెలివరీలు ఎంత కాంప్లికేటెడో, దాని డెలివరీలు అంత సుళువు. మూడు పురుళ్లు ఇంట్లోనే మంత్రసాని చేత అయ్యాయి.

ఒక సాయంత్రం నుంచి మా సుశీలకి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. మంత్రసానిని పిలిపించారు. ఆ గదిలో మంత్రసాని, మా చెల్లెలు, మా అమ్మ. రాత్రి భోజనాలు అయిన తర్వాత నుంచి తెల్లవార్లు నొప్పులు వస్తూనే వున్నాయి. కానీ ఇంకా ప్రసవం అవ్వలేదు. తొలికాన్పుకదా కొంచెం కష్టపడుతోంది. మంత్రసానికి చాలా అనుభవం వుంది. చాలా కాన్పులు చేసింది. ఇక మా నాన్నగారు రాత్రి తెల్లవార్లు మంత్రసాని మేల్కొన్నందున గంట గంటకి ఆమెకు కాఫీ ఇవ్వమని నాకు పురమాయించారు. మా చిన్న చెల్లెలు మాత్రం నిద్రపోయింది. అమ్మమ్మ, నాన్నగారు, నేను గది బయట వుండి మేల్కొనే వున్నాము మొత్తం మీద తెల్లవారు ఝామున ఒక మగపిల్లవాడిని కన్నది మా సుశీల. తల్లి పిల్లాడు కులాసాగా వున్నారు. నాకెందుకో ఒక పక్క సంతోషంగా వున్నా, మరో పక్క ఏదో దుఃఖం కడుపులో తొలిచేసే బాధ, గొంతులో వుండబెట్టినట్టు వుండడం, ఏడుపు అన్నీ మిళితమైయాయి. అప్పుడు నా ప్రసవం still born child గుర్తుకు వచ్చింది. కానీ ఆ సమయంలో నేను బయటపడితే, నాకు అసూయ అనుకుంటారేమోనని భయం. ఎంత అమ్మా, నాన్నగారైనా వాళ్ళ దగ్గర ఎలా బయటపడను. ఆ సమయంలో మావారు అక్కడ వుండి వుంటే షేర్ చేసుకునేవారు. మావాళ్ళందరూ బిడ్డ ఏడుపు వినగానే సంతోష పడ్డారే. నా ఫీలింగ్స్ వాళ్ళకు ఎందుకు తెలియాలి? రాత్రంతా నేను కాఫీలు విసుక్కుంటూ చేసాను. కానీ ఇప్పుడు మాత్రం వంటింట్లో నేను ఒక్కదాన్నే వున్నందున నా కన్నీళ్ళు తుడుచుకునేందుకు మంచి అవకాశం ఎలాగో దుఃఖం దిగమింగుకుని బయటికి వచ్చాననుకోండి. ఇవన్నీ నేను మద్రాసు వచ్చిన తర్వాత మా వారికి చెప్పుకున్నాను.

కానీ తర్వాత తెలిసింది ఆ రోజున మా చెల్లెలు దాని కొడుకు బయటికి రాగానే "అమ్మా! పాపం అక్క బిడ్డ" అందిట. మా అమ్మ "అది యిప్పుడు తలుచుకోకు" అన్నదట. నాకైతే సరే ఆ టైములో మా చెల్లెలలా ఫీల్ అవ్వడం విని నేను చాలా మూవ్ అయ్యాను. ఆ వేళ నేపడ్డ ఫీలింగ్స్ మా అమ్మ, నాన్నగారు, అమ్మమ్మ అందరూ అనుభవించారట. కానీ వాళ్ళు కూడా నాలాగే బయటపడలేదు.

AIRనుండి మద్రాసు - బి లో మధ్యాహ్నం 1నుంచి 1.30 వరకు మహిళామండలి తెలుగు ప్రోగ్రామ్ వచ్చేది. వున్నట్టుండి ఎ.ఐ.ఆర్ నుంచి నాకు ఒక లెటర్ వచ్చింది పదినిమిషాల పాటు తెలుగులో ఫలానా సబ్జెక్ట్ గురించి తయారు చేసుకుని అది AIRలో చదవాలని. అది రికార్డెడ్ కాదు, లైవ్ బ్రాడ్కాస్ట్. పిలుపు ఎలా వచ్చిందో నాకు గుర్తులేదు. అలా కొన్నాళ్ళు నాకు ప్రిపేర్ అవ్వడానికి టైమిస్తూ అప్పుడప్పుడు నన్ను పిలిచేవారు. అప్పుడు మొసలికంటి రమణమ్మగారు దాని ఇన్ఛార్జ్, రేడియో భానుమతిగారు కూడా ఇన్ఛార్జ్. వరుసగా ప్రోగ్రామ్‌లు వచ్చేవి. మేముండేది టి.నగర్. AIR బీచ్ రోడ్డులో. మైలాపూర్ కెళ్ళి అక్కడి నుంచి వేరే బస్సు ఎక్కి వెళ్ళాలన్నమాట. మొదట్లో మావారు నాతో కూడా వచ్చేవారు. తరువాత ఆయన పని ఒత్తిడి వల్ల నాకు బస్సు దారులు కొంచెం అలవాటు అవ్వడం వలన నేనే వెళ్తూ వచ్చాను. ఒకసారి మా అమ్మ ఈ వూళ్ళో వుండగా ఆవిడని కూడా పిల్చుకెళ్ళాను. ఆవిడ వేరే గదిలో ఉంది. అక్కడున్న స్పీకర్ కనెక్ట్ చేయమని వాళ్ళను కోరాను. ఎ.ఐ.ఆర్ నాకిచ్చే పారితోషికం పదిహేను రూపాయలు. అయినా ఆల్ ఓవర్ ఇండియా నా వాయిస్ వింటుందిగా అని సంతోషం.

'పొదుపుగా ఉండాలా లేదా' 'కృష్ణతరంగాలు' ఇలా కొన్ని సబ్జెక్ట్స్ మీదడిగేవారు. ఇన్ఫర్మేషన్ చేకూర్చడానికని కన్నెమెర లైబ్రెరీకి మావారు కూడా నాతోపాటు వస్తుండేవారు. అలాగ మొదటి అమ్మాయి పుట్టిన తరువాత కూడా దాన్ని మావారి దగ్గర ఇంట్లో వదిలి వెళ్ళేదాన్ని. ఒక్కోసారి పక్కవాటా అంబుజ మామి దగ్గర వదిలేసి వెళ్ళేదాన్ని. వెళ్ళి రావడానికి మూడుగంటలు పట్టేది. ఆ రోజుల్లో ఆటో రిక్షాలు వుండేవికావు. పుల్లింగ్ రిక్షాలు, సైకిల్ రిక్షాలు ఎక్కువగా వుండేవి. అందువలన బస్సులోనే తిరగవలసి వచ్చేది.

పక్కవాటాలో మామి. ఆవిడ పేరు అంబుజం. భర్త రంగనాథన్. వాళ్ళకు ఇద్దరు ఆడపిల్లలు, జయశ్రీ జయంతి. ఆవిడ నాతో చాలా ఫ్రెండ్లీగా వుండేది. మేమిద్దరం అక్కా, చెల్లెళ్ళుగా వుండేవాళ్ళం. ఆవిడతో నేను ఎప్పుడైన వాళ్ళ పుట్టింటికి వెళితే వాళ్ళ నాన్నగారు

"కల్యాణి! నువ్వే ఇంటికి వెళ్తే పక్కనే మా అంబుజంకి కూడా ఇల్లు చూడు. ఎక్కడికి వెళ్ళినా మీరు ఇద్దరూ ఒకే చోట వుండాలి" అనేవారు. ఇప్పుడు అంబుజమామి, భర్త ఇద్దరూ లేరు. నేను టీచరుగా పనిచేసేటప్పుడు నాకంటే ముందు మా శకుంతల సైకిల్ రిక్షాలో ఇల్లు చేరుకునేది. అంబుజమామి వాళ్ళ పిల్లలతోపాటు మా శకుంతలకు కూడా టిఫిను ఇచ్చేది. ఇప్పటికీ వాళ్ళ అమ్మాయిలు మాతో టచ్‌లో వుంటున్నారు. జయశ్రీ వాళ్ళు కొన్నాళ్ళు బ్యాంకాక్‌లో వుండేవాళ్ళు. మేము అక్కడికి వెళ్ళినపుడు జయశ్రీ ఇంట్లో మూడురోజులు వున్నాము. వాళ్ళ ఇల్లు ఊరికి దూరం వలన Manhatten Hotel హోటల్‌లో ఒక వారం వుండి వచ్చాం. మొన్న వేసవిలో వాళ్ళ అమ్మాయి నిశ్చితార్థానికి హైదరాబాదుకు వెళ్ళివచ్చాము. ఈ మధ్యనే పెళ్ళికి కూడా వెళ్ళివచ్చాం. రెండో అమ్మాయి జయంతి బొంబాయిలో వుంటుంది. మా యిద్దర్నీ వాళ్ళు తల్లిదండ్రుల్లా చూస్తారు.

'శ్రీకృష్ణార్జున యుద్ధం' రిలీజ్ అయిన తరువాత జయంతీ వారు 'భాగ్యచక్రం' మొదలు పెట్టారు. అదే సమయానికి విజయా వాళ్ళు 'హరిశ్చంద్ర' అనే సినిమా కూడా రెండూ ఒకేసారి మొదలుపెట్టారు. అందువలన పొద్దున పూట జయంతి పిక్చర్స్, సాయంత్రం పూట విజయాలో. నెలతిరిగేసరికి రెండు ఆఫీసుల నుంచి జీతాలు వచ్చేవి. పైగా విజయా వాళ్ళు ప్రతి దీపావళికి బోనస్ ఇచ్చేవారు.

కొన్నాళ్ళకి మళ్ళీ నెల తప్పాను. ఈసారి పురిటికి భీమవరం రావద్దని అమ్మని పంపుతానని మద్రాసులోనే డెలివరీ చేసుకోమని మా నాన్నగారు ఉత్తరం రాసారు. దానికి నేను, మీ అల్లుడు కూడా ఆ అభిప్రాయంలో వున్నామని, ఇక్కడ డాక్ట ఇ.వి కల్యాణి అనే అనుభవంగల లేడీ డాక్టరు నర్సింగ్ హోమ్ వుందని నేను రాసాను. మా అమ్మ నా ఎనిమిదవ నెలలోనే వచ్చింది. రెండు నెలలకి కల్యాణి నర్సింగ్ హోమ్‌లో చేరాను. ఆసుపత్రికి వెళ్ళడానికి కె.వి.రెడ్డిగారు తన పర్సనల్ కారు ఇచ్చారు. హాస్పటల్ చేరిన తరువాత నొప్పులు ఎక్కువ రాలేదని సిజేరియన్ ఆపరేషన్ చేయడానికి సిద్ధమయ్యారు డాక్టర్లు. ఆపరేషన్ థియేటర్ బయట స్ట్రెచర్‌లో సిద్ధంగా వుంచారు నన్ను. అప్పుడు నాకు పాత జ్ఞాపకాలు వచ్చాయి. భయం వేసింది. ఆ రోజే తమిళ సినిమాలో నటించే వి.యస్. గోపాలకృష్ణన్ అనే ఆయన భార్యకి ఆపరేషన్ అయ్యిందని, మగపిల్లవాడు పుట్టాడని, మరేం భయపడవద్దని ఆయన మావారికి చెప్పారట. అవన్నీ మావారు నాకు చెప్తుంటే "అబ్బా, నాకేం భయంలేదు. ముందు నన్ను ఆపరేషన్ థియేటరుకి పిల్చుకెళ్ళమని చెప్పండి" అన్నాను. ఆలస్యం చేస్తే బిడ్డకు ప్రమాదమేమోనని నా భయం. కింద వార్డులో మా అమ్మ బిక్కుబిక్కుమంటూ కూర్చుందట.

మర్నాడు ప్రొద్దున మత్తు వదిలి నా కళ్ళు తెరిచి చూసుకునేసరికి నా రూములో వున్నాను. ఆసుపత్రిలో మావారు, మా అమ్మ ఆందోళనగా నావైపే చూస్తున్నారట. నేను నా చేతులతో సైగచేసానట, బిడ్డ ఏదీ అని. మా వారు చెప్పారట, ఆడపిల్ల అని. కాసేపటికి ఒక నర్సు చూడచక్కని మంచి రంగు, నల్లని ఒత్తు జుట్టుపాపని అడ్డంగా పడుకోబెట్టుకుని నాకు చూపించింది. నాకు ఆనందం, ఆశ్చర్యం. అసలు మన పాపేనా, ఇంత అందంగా తెల్లగా వుందే అని సందేహం వచ్చింది. మా మామగారి, అంటే వాళ్ళ తాతగారి కలరు.

ఆసుపత్రిలో వున్న పదిరోజులు మా అమ్మ పథ్యం అక్కడే వెనకవైపే వున్న స్టౌవ్ మీద అందరూ వండుకుంటుంటే తాను కూడా అన్నం, చారు వండేది. రెండు మూడురోజుల కొకసారి ఇంటికెళ్ళి కరివేపాకు పొడి, కొన్ని బాలింతకు కావలసిన తయారీలు తెస్తూండేది. మావారు మాతోనే ఎంతవరకు గడపగలరో వుంటూ తనకి, మా అమ్మకి హోటల్ నుంచి భోజనం తెస్తూ, ఇద్దరు అక్కడే తింటూ కాలం గడిపేవారు. మాతోపాటు వుండే మామగారిని ఇంట్లో అంబుజమామి కనుక్కుంటూ వుండేది. ఎన్నడు కూడా ఇతరులను బాధ పెట్టకూడదనే గొప్ప మనసు మా మామగారిది. అందుకనే ఆయన కూడా వుంటే అందరికి ఇబ్బందిని గూడూరుకు వెళ్ళిపోయారు. పాప పుట్టిన తేదీ డిశంబరు 13, 1965. వాళ్ళింటికి వచ్చిన తరువాతే మాకు పాప పుట్టిందని ఇల్లుగలవాళ్ళు చాలా సంతోషించారు.

పదవరోజున ఇంటికి వచ్చాము. పదకొండవ రోజు సాయంత్రం ఉయ్యాల్లో పెట్టాము. దక్షిణాన పదకొండవ రోజున ఉయ్యాల ఫంక్షన్ చేస్తారు. పక్కింటమ్మాయిలిద్దరు మా వీధిలో వాళ్ళను పేరంటం పిలిచి వచ్చారు. ఆ రోజున పొద్దున్నే గూడూరు నుంచి వచ్చిన

మా మామగారు ఈ అమ్మాయిలిద్దరిని పిల్చుకుని మా బంధువుల ఇళ్ళకు వెళ్ళి ఆహ్వానించి వచ్చారు. అన్నింటికి మా అమ్మ ఒక్కతే అయిందని అంబుజమామి, ఆ యిద్దరు అమ్మాయిలు సహాయం చేశారు. అందులో ఒక అమ్మాయి పక్కింటి మార్వాడీలమ్మాయి బేబి, ఇంకొకమ్మాయి ఇల్లుగలవారి మనవరాలు శశి. పక్కింటి మార్వాడీల అబ్బాయి మున్నాకి ఏడాది నుంచే మా యింట్లో బాగా అలవాటు. వాణ్ణి పార్కుకు పిల్చుకు వెళ్తూండేవాళ్ళం. అలాగే జయశ్రీ, జయంతిలను కూడా షికారుకి, పార్కుకి పిల్చుకు వెళ్తూండేవాళ్ళం.

ఒకరోజు సాయంత్రం మావారికేం తోచిందో ఏమో రేడియో ట్యూన్ చేసి ఉయ్యాల రేడియోకి దగ్గరగా జరిపి దాంట్లో పాపని పడుకోపెట్టారు. నాతో "కల్యాణీ! మన పాపకి సంగీతమంటే ఇష్టమే చూడు పాటలు బాగా వింటోంది" అన్నారు. ఆయన తాపత్రయం చూడండి మష్టానికి పదిహేను రోజులు అయింది. ఈలోగా తన కూతురికి సంగీతం అంటే ఇష్టం ఉంటుందో లేదోనని తపన. ఎందుకంటే ఇటు మా అమ్మ వాళ్ళింట్లో, అటు అత్తవారింట్లో అందరూ సంగీత ప్రియులే.

అసలు మా అమ్మ భీమవరం నుంచి వచ్చేటప్పుడు నాకు ప్రసవం అవ్వగానే నెలలోపుగా నన్ను, బిడ్డను భీమవరం పిల్చుకెళ్దామని అనుకున్నది. కానీ ఆపరేషన్ అయినందువలన డాక్టరు అభ్యంతరం చెప్పింది. అందువలన రెండవ నెలలో వెళ్ళాను. అక్కడ భీమవరంలో పాపకోసరం మా నాన్నగారువాళ్ళు ఎదురు చూసేవారు. మా నాన్నగారు దాన్ని "మద్రాస్ రాణి" అని పిలిచేవారు.

మా అమ్మ యిక్కడ ఉన్న నాలుగు నెలల మా చిన్న చెల్లెలు ఒక్కటే ఉత్తరాలు మా అమ్మకి. వినాయక చవితి, దసరా, దీపావళి పండగలన్నింటికి మా అమ్మ అక్కడ లేదని దానికి చాలా తీరని లోటుగా వుందని బాధ పడుతూ రాసేది. దాని ఉత్తరాలు చూసి మా అమ్మ కళ్ళవెంట నీళ్ళు పెట్టుకుంటే నాకు ఏడుపు వచ్చేది. కానీ నాకు ప్రసవం అయి నాకు పాపపుట్టగానే మా చెల్లెలి బాధ అంతా పటాపంచలైపోయింది. పాప ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూసేది. చిన్నతనం నుంచి మా రఘుమని పెంచిన అమ్మమ్మ, మా నాన్నగారు అక్కడ వున్నా కూడా దానికి మా అమ్మ తర్వాతే కదా మిగతావాళ్ళు.

మేము భీమవరం చేరగానే మద్రాస్ రాణిగారొచ్చారు అని మా నాన్నగారికి, మా చెల్లెలికి విపరీతమైన సంతోషం. మా అమ్మమ్మ ముని మనవరాలిని చూచి పొంగిపోయింది. చుట్టుపక్కల అమ్మాయిలు అక్క పాపను ఎత్తుకుని వచ్చిందని వచ్చేవారు. ముఖ్యంగా కామర్స్ లెక్చరర్ శేషావతారంగారమ్మాయిలు అలివేలు, రంగనాయకి. పాపకి మూడవ నెల రాగానే నామకరణం చేశాము. మా వారు మద్రాసు నుంచి వచ్చారు. మా మామగారి కోరిక ప్రకారం శకుంతల అని పేరు పెట్టాము. అది మా అత్తగారి పేరు. అసలు నేను, మా వారు మద్రాసులో ఆసుపత్రిలో వున్నప్పుడే ఏవేవో పేర్లు అనుకున్నాము. కానీ అది జరగలేదు. పాపకి నాల్గవ నెలరాగానే తిరిగి మద్రాసు వచ్చేశాను.

మద్రాసులో వేరే వ్యాపకం లేకపోడంతో పాపని చూసుకుంటూ కూరగాయలకు వెళ్ళాలంటే ఆ కాసేపు అంబుజామామికి ఇస్తూ, దాని ఆటపాటలు చూస్తూ కాలక్షేపం చేసుకుంటూ వచ్చాను. మావారు ఇంట్లో వున్నప్పుడల్లా దాన్ని వదిలేవారు కాదు. పదవ నెలలో ఆనవాయితీ ప్రకారం తిరుపతి కొండ మీద తలనీలాలు తీయించడం, చెవులు కుట్టించడము జరిగాయి. అన్నప్రాసన కూడా తిరుపతి కొండమీదనే, నే ప్రార్థించుకున్నందున. అదికూడా స్వామివారి ప్రసాదము చక్కెర పొంగలిదాని నోటిలో పెట్టి అన్నప్రాసన శాస్త్రం చేశాము. మా నాన్నగారు శకుంతలకి ఒక వెండిగిన్నె బహూకరించారు. మా అమ్మ తిరుపతికి రాలేదుకదా. శకుంతల పుట్టిన రోజు పండగ భీమవరంలో చేస్తానంటే మావారు సరేనని ఒప్పుకున్నారు. డిశంబరు పదమూడున కదాని వారం ముందుగా భీమవరం వెళ్ళాను. కానీ అక్కడికి వెళ్ళాక మా మామగారి దగ్గరినుంచి ఉత్తరము వచ్చింది. మొదటి పుట్టిన రోజు తెలుగు తారీఖుల ప్రకారం చేయాలని. మా అమ్మావాళ్ళు కూడా అదే అన్నారు. అది డిసెంబర్ 30న పడింది. ఆ సమయంలో నా పెద్ద చెల్లెలు సుశీల దాని మూడవ కాన్పుకు భీమవరం వచ్చింది. దానికి ఇద్దరు మగపిల్లల తరువాత ఆడపిల్ల పుట్టింది. ఆ సమయంలో అది కని 21వ రోజున డిసెంబర్ 30న

పడింది. ఆంధ్రాలో 21 వ రోజున పాపని ఉయ్యాల్లో వేసే ఆనవాయితీ కదా. మా చెల్లెలి కూతురు ఉయ్యాల పండగ, మా శకుంతల మొదటి పుట్టినరోజు రెండూ ఒకే రోజున పడినందున జతగా పండగ చేసుకున్నాం. అందరినీ పేరంటానికి పిలిచాము. ఒక వారం అయిన తరువాత నేను మద్రాసు వచ్చేసాను. పుట్టినరోజు పండగకి మావారు రావడానికి కుదరలేదు.

ఆడపిల్ల పుట్టింది కదా అని నేను అప్పటినుంచి దసరా కొలువు పెట్టి అందరిని పేరంటానికి పిలుస్తూ వచ్చాను. రెండవ పుట్టినరోజుకు కూడా అందరిని పిలిచి గ్రాండ్‌గా మద్రాసులో చేసాను. మొదటిసారి మా వారు భీమవరం లేదుకదా!

భాగ్యచక్రం షూటింగ్ సమయంలోనే విజయా వారి ఉమాచండీ గౌరి శంకరుల కథ రికార్డింగులు, షూటింగులు కూడా జరుగుతున్నాయి. ఆ సమయంలో మా చిన్న చెల్లెలు రఖుమ బి.ఏ ఫైనల్ యియర్ పరీక్షలు వ్రాసి మద్రాసు వచ్చింది. మా అమ్మాయి శకుంతల సౌమ్యంగా వుండేటప్పుడు దానిని ఉమా అనేది. ముభావంగా వున్నప్పుడు గౌరీ అనేది, అల్లరి చేసినపుడు చండీ అని పిలిచేది అంటే ఆ సినిమాలో బి.సరోజాదేవి మూడు క్యారెక్టరులు అన్నమాట. అందుకే ఆ సినిమాకు ఉమాచండీ గౌరిశంకరుల కథ అని పేరు. శంకరుని పాత్రధారి ఎన్.టి.రామారావుగారు. అందుకు మావారు ఈ సినిమాలో శివతాండవం డ్యాన్సు రామారావు గారికి ప్రాక్టీస్ చేయించడానికి డ్యాన్సు డైరెక్టర్ పసుమర్తి కృష్ణమూర్తి గారితో తెల్లవారుఝామున 3.30 గంటలకి రామారావుగారింటికి వెళ్ళేవారు.

అలాగే ఒకరోజు రాత్రి అంటే మరునాడు రామారావుగారింటికి వెళ్ళాలన్నమాట. మా చెల్లెలు భోజనాలు అయింతర్వాత, "బావగారు! నాకు ఆ పాట ఒకసారి వినిపించరా?" అని అడిగింది. ఆ కాలంలో రౌండుగా పెద్దగా వుండే రికార్డింగ్ మిషన్లు కదా? దాని మీద ప్లేయర్ పిన్ వేసి ప్లే చేయాలి. మావారు ఏం చేసారంటే "రఖుమ నువ్వే ప్లే చెయ్యి" అన్నారు. అది ఏంచేసిందంటే పెట్టె ఓపెన్ చేసి పిన్ పెడ్తుంటే అది జారి సందులో పడిపోయింది. ఎంత ప్రయత్నించినా చేయి దూరే సందు కాకపోవడం వలన అది రాలేదు. మా రఖుమ బిక్కమొఖం వేసి వాళ్ళ బావకు చెప్పింది. ఆయన కూడా ట్రై చేశారు. రాలేదు. ఎలాగ? మర్నాడే అది తీసుకుని తెల్లవారుఝామున రామారావుగారింటికి వెళ్ళాలి. ఇంతలో కమేడియన్ సారధి వచ్చాడెందుకనో. సారధికి ఏమీ చెప్పకుండా "పిన్ దాంట్లో పడిపోయిందయ్యా. రేపు ఉదయాన్నే రామారావుగారి ఇంటికి వెళ్ళాలికదా? దగ్గర్లో మెకానిక్ దొరుకుతాడేమో చూద్దాం. నాతోరా!" అని అతన్ని వెంట వేసుకుని వెళ్ళారు. కాసేపటికి డ్యాన్సు డైరెక్టరు పసుమర్తి కృష్ణమూర్తిగారు వచ్చారు. లోపలి నుంచి మా చెల్లెలు బిక్కుబిక్కుమంటూ చూస్తోంది. దానికి ఏడుపు వస్తోంది ఒక మూల. మా మామగారు వీధికెదురుగుండా హాల్లో కుర్చీలో కూర్చున్నారు. పసుమర్తిగారు రాగానే అంతా పూసగుచ్చినట్టు "మా కోడలు చెల్లెలు ఇలా చేసింది, సారధితో మావాడు మెకానిక్ కోసరం వెళ్ళాడు" అని చెప్పారు. నాకూ, మా చెల్లెలికి ఒళ్ళు మండిపోయింది వున్నదున్నట్టు చెబుతుంటే. ఆయన చాల స్ట్రైట్ ఫార్వర్డ్ మనిషి.

**మా రఖుమకి తమిళం రానందున** మేము తమిళ సినిమాలకి వెళ్తే శకుంతలని దాని దగ్గర వదిలి అంబుజ మామితోనైనా, మావారితో నైనా వెళ్తూ వుండేదాన్ని. అప్పటికింకా సుధ పుట్టలేదు. హిందీ, ఇంగ్లీషు సినిమాలైతే మా రఖుమ కూడా వచ్చేది.

అలాగే ఒకసారి Alfred Hitechcock English picture "BIRDS" కి వెళ్ళి వచ్చాము. దాంట్లో పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతూ వుంటాయి. ఇంటికి రాగానే రఖుమకి బాత్‌రూంకి ఒంటరిగా వెళ్ళడానికి భయమేసి నన్ను తోడు రమ్మంది. నాకు కూడా భయమేసి మావారిని పిలిచాను. ఆ రోజుల్లో బాత్ రూములన్నీ వెనకాలవైపు దూరంగా వుంటూండేవిగా.

నేను, మా శకుంతలని ఎప్పుడైనా కొట్టినా, తిట్టినా మా రఖుమకి చాలా కోపం వచ్చేది. దాన్ని చేరదీసేది. "ఈ అయిదేళ్ళూ పిల్లలు లేరు కదా, దాన్ని అలా కొడ్తావేం" అని నా మీద చిరాకు పడేది. దాన్ని అంత బాగా చూసుకునేది, మా దగ్గర ఉన్నన్నాళ్ళు.

ఒక్కోసారి కొన్ని విచిత్రాలు జరుగుతూ వుంటాయి. ఒకరోజు సాయంత్రం మావారు ఉంట్లో లేరు. వీధిలో ఒక టెంపో ఆగింది. దాంట్లో నుంచి ఒక స్టీల్ టేబుల్, నాలుగు కుర్చీలు దింపుతున్నారు. నాకు అర్థం కాలేదు. ఎవరింటికో అనుకున్నాను. వాళ్ళు తిన్నగా మా యింటి వైపే చూస్తూ వస్తున్నారు. ఇంతలో ఒక కారు నుంచి పింగళి నాగేంద్రరావుగారు దిగి మా ఇంట్లోకి వస్తూ వాళ్ళని లోపలికి రమ్మని పురమాయించారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఏమి చేయాలో తెలియలేదు. "అమ్మాయ్! మీకేనమ్మా ఈ టేబులు, కుర్చీలు. మీ పెళ్ళికి నేను ఏమీ ఇయ్యలేదుగా" అని అన్నారు. ఆయనకి థాంక్స్ చెప్పి ఒక నిమిషం వుండండి అని లోపలికి వెళ్ళి అల్లం, కరివేపాకు దంచి ఉప్పు కలిపి మజ్జిగ చేసి ఇచ్చాను. ఆయన చాలా సంతోషించారు. తరువాత మా వారితో చెప్పారట, "మీ ఆవిడ మంచి మజ్జిగ ఇచ్చిందయ్యా. చాలా బాగుంది ఇతకన్నా ఏం కావాలి" అని. యాభై ఏళ్ళు అయినా ఇప్పటికీ ఆ టేబుల్ అలాగే వుంచుకున్నాము ఆయన జ్ఞాపకార్థంగా. కుర్చీలు మాత్రం రెండే మిగిలాయి. ఇప్పుడూ నా యీ జీవిత చరిత్ర అంతా రాసినది ఆ టేబుల్ మీదే

'శ్రీ కృష్ణార్జున యుద్ధం' పిక్చరుకి తోట వెంకటేశ్వరరావు గారు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసారు. మేము సి.ఐ.టి నగర్‌లో వుంటుండగా మా వారు ఆఫీసు నుంచి వచ్చే కారులో తోటగారు కూడా వుండేవారు. ఆయన నన్ను 'చిలకమ్మా' అని అనేవారు. మా వారు కారునుంచి దిగుతూ వీధి తలుపులు వేసి వున్నాయే అనుకుంటే "ఆ చూడండి! పక్క గది కిటికీలో నుంచి తొంగి చూస్తుంటుంది చిలకమ్మ" అనేవారట.

మా వారు టైమింగ్స్ ప్రొద్దున 9నుంచి 1.00 మధ్యాహ్నం భోజనానికి వచ్చి మళ్ళీ 4.00 గంటలకి వెళ్ళి రాత్రి 9.00గంటలకు వచ్చేవారు. కె.వి.రెడ్డిగారికి విజయా వాళ్ళు ఒక కారు ఇచ్చారు. ఆ కారు ముందు మా వారిని ఎక్కించుకుని పింగళి నాగేంద్రరావు గారింటికి వెళ్ళి, ఆయన్ని ఎక్కించుకుని మరీ కె.వి.రెడ్డి గారింటికి వెళ్ళేది. స్క్రిప్టు, స్టోరి డిస్కషన్‌లో కూడా వాళ్ళిద్దరితో పాటు మా వారు కంపల్సరీగా వుండాల్సిందే

షూటింగ్ రోజుల్లో తెల్లవారుఝామునే వెళ్ళేవారు. ఆ సమయానికి మా శకుంతల చిన్నపిల్ల అయినందున నిద్రలేచేదికాదు. మధ్యాహ్నం భోజనానికి రాకుండా ఒక రాత్రికే వచ్చేవారు. ఆ టైంకు అది నిద్రపోయేది. మొత్తానికి కొన్నాళ్ళు అది నాన్నగారిని చూసేదేకాదు.

కె.వి.రెడ్డిగారి దగ్గర పనిచేసినంత కాలం మావారు షూటింగు టైములో చాలా కష్టపడి పనిచేసేవారు. ప్రొద్దున్నుంచి షూటింగ్ అయ్యేంత వరకు నిల్చుని వుండాల్సిందే. డైరెక్టరు ఎదురుగా కూర్చునే వారే కాదు. షూటింగై ఇంటికి రాగానే మా వారి పిక్కలకి కొబ్బరి నూనె రాసి మర్దనా చేసి, వేడి వేడి నీళ్ళు పోస్తూ రుద్దేదాన్ని. తరువాత వేడి వేడి నీళ్ళు స్నానం చేసి వచ్చి కొంచెం తమాయించుకునేవారు. ఆ కాలంలో వేడినీళ్ళ హీటర్లు లేవుగా! కట్టెల పొయ్యి మీద ఒక కుండ పెట్టి కాచుకోవడమేగా. కానీ వారి బాధలో వేడినీళ్ళు కాచడం నాకేం కష్టం అనిపించేదికాదు. అసిస్టెంట్ డైరెక్టర్ల పని ఇదేనేమో. ఇలా కష్టపడాలేమో అనుకునేదాన్ని.

'ఉమాచండి గౌరీ శంకరుల కథ' సినిమా విడుదలైంది. అంతకు ముదు 'హరిశ్చంద్ర' సినిమా ఫెయిలయింది. 'భాగ్యచక్రం' సినిమా కె.వి.రెడ్డిగారు ఇంకా పూర్తి చేయలేదు. అది విడుదల అవ్వలేదు. 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' కూడా ఫ్లాప్ అయింది. దాంతో విజయావాళ్ళు పిక్చరు తియ్యలేదు. జయంతీ వారి భాగ్యచక్రం కూడా వాళ్ళు ఎలాగో పూర్తిచేసి విడుదల చేస్తే అది కూడా బాగా పోలేదు. తరువాత రెడ్డిగారికి పిక్చర్లేమీ రాలేదు. శంకర్ రెడ్డిగారు ఒక పార్టీని పిల్చుకు వచ్చారు. వాళ్ళు కర్నూలు, బళ్ళారికి చెందిన పారిశ్రామిక వేత్తలు. హెచ్.వి.సంజీవ రెడ్డిగారు, యం. లక్ష్మీకాంతరెడ్డిగారు. వాళ్ళు మొదటి సారిగా సినిమా నిర్మాణం మొదలెడ్తున్నారు. అందుకు సింగీతం శ్రీనివాసరావు గారి డైరెక్షను, దానికి కె.వి.రెడ్డిగారి పర్యవేక్షణ అని నిర్ణయించుకున్నారు. అది కె.వి.రెడ్డి గారికి కూడా తెలుసు. ఆయన సూపర్‌విజన్‌కి ఒప్పుకున్నారు. కానీ ఆయనకి వరుసగా సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. వచ్చిన నిర్మాతలు మా వారిని

కలుసుకోడానికి ముందు పెద్దాయన కదా అని కె.వి.రెడ్డిగారిని మొదటిసారిగా కలిస్తే మర్యాదగా వుంటుందని వెళ్ళేసరికి, మీ రెండో పిక్చరు శ్రీనివాసరావుకి యిద్దురు కాని, మీ మొదటి సినిమా నేనే చేస్తానని అన్నారు. అనుకున్నదొకటి, అయిందొకటని వాళ్ళు వెనక్కి వెళ్ళిపోయారు. ఇంతలో యన్.టి.రామారావుగారు "శ్రీకృష్ణసత్య" సినిమాకి రెడ్డిగారిని పిలవడంతో ఆయన అక్కడికి వెళ్ళిపోయారు. మా వారికి వచ్చిన మొదటి డైరెక్షన్ ఛాన్స్ పోయిందే అన్న బాధ నా మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయింది. కానీ మావారు మాత్రం స్టేజిమీద ఎప్పుడైనా మాట్లాడినప్పుడెల్లా "మా గురువుగారు. నేను కె.వి.రెడ్డిగారి స్కూలు నుంచి వచ్చాను" అని ఆయన్ని తలచుకుంటారు.

ఈ సమయంలో పటాభిరామిరెడ్డిగారు ఒకరోజు కన్నడ స్క్రిప్టు తీసుకుని మా యింటికి వచ్చి మా వారితో చాలా సేపు మాట్లాడారు. పట్టాభిరామిరెడ్డిగారు జయంతీ పిక్చర్స్‌కి అసోసియేట్ ప్రొడ్యూసర్, "పఠాభి పంచాంగం" మొదలగునవన్నీ రాసిన ప్రఖ్యాత కవి. ఆయన నెల్లూరుకి చెందినవారు. జయంతి పిక్చర్స్‌లో మా వారు పనిచేసినప్పట్నుంచీ ఆయనతో బాగా పరిచయం. మా వారి గురించి అన్నీ తెలిసిన వారాయన. తాను కన్నడంలో "సంస్కార" అనే సినిమా తీస్తున్నాను అని, దాని కథ అనంతమూర్తిగారిదని, డైలాగులు రాయడం అయిపోయిందని, షూటింగు ప్రారంభించాలని, మా వారి సహాయం ఆయనకు ఎంతైనా కావాలని, డైరెక్షనులో సహాయం చేయమని, వీరికి కె.వి.రెడ్డిగారి సినిమాలు చేయడం వలన ఎంతైనా అనుభవం వుంది కదా అని కోరారు. మా వారికి ఉన్నట్టుండి ఆయన వచ్చి అలా అడిగేసరికి ఆశ్చర్యం వేసింది. ఆనందమమాట ఎలా వున్నా మహానుభావుడు, కవి. నిర్మాణంలో ఎంతో అనుభవం వున్నవాడు. అలాంటి ఆయన అడిగితే ఎలా కాదంటారు? అంతకన్నా భాగ్యం ఏముంది? పైగా అది శృంగేరీలో తీయాలని గిరీష్ కర్నాడ్, రెడ్డిగారి భార్య స్నేహలతా రెడ్డి హీరో హీరోయిన్లని, చాలామంది మద్రాసు ఇంగ్లీషు ప్లేయర్స్ యాక్ట్ చేస్తున్నారని చెప్పారు. అయితే చివరికి మొత్తం సినిమా మా వారే డైరెక్ట్ చేయవలసి వచ్చింది.

కాని మా వారు ఆలోచించారు. ఆయన అనుకున్నారట. రెడ్డిగారే కథ డిసైడ్ చేసి, డైలాగులు రాయించి, ఆర్టిస్టులని బుక్ చేసి మరీ వచ్చారు. డైరెక్షన్ సైడ్‌లో నన్ను సహాయం చేసి పెట్టమని అడిగారు. అందుకని డైరెక్టరు పేరు పట్టాభిరామిరెడ్డిగారు అనీ, మా వారు ఎక్సెక్యూటివ్ డైరెక్టరుగా వుంటాననీ నిర్ణయించుకున్నారు.

"సంస్కార" సినిమాకి డైరెక్టరు పట్టాభిరామిరెడ్డిగారు. ఎక్సెక్యూటివ్ డైరెక్టరు సింగీతం శ్రీనివాసరావు. ఈ సినిమాకి నేషనల్ అవార్డు, రాష్ట్రపతి బంగారు పతకం వచ్చింది. ఒక నెల్లాళ్ళలో షూటింగ్ పూర్తి చేసుకుని మద్రాసుకి తిరిగి వచ్చారు. నేను స్కూల్లో పనిచేయడం వలన వెళ్ళలేకపోయాను. చూసారా? మొత్తం మీద విండ్‌ఫాల్‌లాగా ఎలా కలిసి వస్తుందో? గాడ్ ఈజ్ గ్రేట్.

మా వారు విజయా, జయంతీలలో పని చేస్తున్నప్పుడు, మా శకుంతల పుట్టక మునుపు, ఎటూ తోచక మా యింటికి దగ్గరగా వున్న Shrine Velankani Schoolలో టీచరుగా పని చేస్తానంటే మావారు వద్దనేవారు. మనకి ఏం తక్కువ అని ఉద్యోగంలో చేరడానికి? ఇప్పుడు నాకు రెండు పిక్చర్లు కదా, పైగా విజయా వాళ్ళు దీపావళికి అంతో ఇంతో వేరే బోనస్ ఇస్తున్నారు కదా స్కూల్లో చేరక్కరలేదు అనేవారు. ఇప్పుడు నెల తిరిగేసరికి రాబడి లేదు. విజయావాళ్ళు, అటు జయంతీ జీతాలు ఇవ్వడం మానేశారు. నిజమే కదా, పిక్చర్లు లేనప్పుడు వాళ్ళు ఎందుకు ఇవ్వాలి. అప్పటికీ జయంతీ వాళ్ళకు సినిమాలు లేకపోయినా కూడా కొన్ని నెలలు ఇచ్చేవారు.

మావారు ఏమీ తోచక పొద్దున్న కాసేపు, సాయంత్రం కాసేపు బస్సులో పింగళి నాగేంద్రరావుగారింటికి వెళ్ళి వస్తుండేవారు. వాళ్ళింట్లో వంటావిడ అనసూయమ్మ వుండేవారు. ఆవిడ సంతానం బొచ్చెడు. వాళ్ళంతా ఈయనని కనిపెట్టుకుని వుంటున్నారని దానర్థం. బ్రహ్మచారికదా! అనసూయమ్మ కొడుకు రాముడి భార్య భీమవరం అమ్మాయి. పేరు శమంతకమణి. అందుకని కవిగారు "శ్రీనివాసరావుగారూ, అమ్మాయిని కూడా అప్పుడప్పుడు పిల్చుకొస్తుండండి. వాళ్ళ భీమవరం అమ్మాయి మా మణి వుందిగా" అనేవారు. మావారు రెండు మూడురోజులు వెళ్ళకపోతే రాలేదేమండి అని అడిగేవారు.

ఇలా పొద్దున్న, సాయంత్రం కవిగారింటికి వెళ్ళి వస్తూ ఆయన ఇతర సినిమాలకి రాసే మాటలు, పాటలు గురించి చర్చిస్తూవుండేవారు. విజయాలో ప్రొడక్షన్ మేనేజరుగా పని చేస్తున్న జగన్నాథ్ గారు ఎవరికో స్క్రిప్టు సహాయం కావాలిట అని పిల్చుకెళ్తూ బాగా ఎంటర్‌టైన్ చేస్తూ, స్నేహితులను మామూలుగానే భోజనాలకి పిలుస్తూవుండేవాళ్ళం. ఈయన ముఖ్యమైన స్నేహితుడు గణపతిరావు. "వీళ్ళకి సినిమాలు లేకపోయినా వీళ్ళ స్టయిల్ మాత్రం కొంచెం కూడా తగ్గలేదు" అనేవాడు.

"నీతి నిజాయితీ"కి మాటలు, ఒక పాట పింగళిగారు రాసారు. అప్పటికే ఆయన క్యాన్సర్ వ్యాధి బాగా ముదిరిపోయింది. ఆయన తన జాతకం గురించి ఎప్పుడూ అంటుండేవారంట "నాకు ఎప్పుడూ డబ్బుకు కొరవ వుండదు. ఎప్పుడైతే నా దగ్గర డబ్బులుండవో, అప్పుడు నేను పోతానట" అని. అలాగే అయింది. చివరి దశలో ఆయన్ని రోజా హాస్పిటల్‌కి పిల్చుక వెళ్ళే పనంతా మా వారూ, శంకరరెడ్డిగారూ చేసేవారు. ఒక సాయంత్రం మావారు ఒక పాట రికార్డింగులో వుండగా, రాత్రి ఎనిమిది గంటలప్పుడు పింగళిగారి ఇంట్లో వున్న కన్నప్ప మావారి దగ్గరకొచ్చి "కవిగారికి అర్జెంటుగా డబ్బు కావాలి. మీ దగ్గర ఏమైనా వుంటే సర్దమని చెప్పి పంపించారు" అన్నాడు. మావారికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వెంటనే తన పర్సులోనే కాకుండా, ఇంట్లో, మొత్తం ఎంతుందో చిల్లరతో సహా ఇచ్చి పంపించారు. ఆ రాత్రే ఆయన పోయారు. "మీరిచ్చిన డబ్బు చూసి కవిగారు చాలా సంతోషించారు" అని మర్నాడు కన్నప్ప మావారితో చెప్పాడు. ఈ విషయాన్ని అప్పుడు హైదరాబాదులో వున్న నాకు మా వారు ఫోన్ చేసి చెప్పారు.

మావారు మంచి పెయింటరు కూడా. నా పెళ్ళయి వచ్చేసరికి ఆయన ముఖ్య స్నేహితుడు అల్లాడి వెంకట నారాయణ గారింట్లో ఒక పెయింటింగ్, గూడూరులో కొన్ని పెయింటింగులు చూసాను. నాకు కోపం వచ్చింది. "అందరిళ్ళలో పెయింటింగులు వున్నాయి. మనకు పెళ్ళై ఇన్నాళ్ళైనా మన ఇంట్లో ఒక్క పెయింటింగ్ లేదే" అన్నాను. మా వారు వెతికి వెతికి మొత్తం మీద ఒక కాశ్మీరీ ఓల్డ్ మ్యాన్ పెయింటింగ్ ఫ్రేమ్ కట్టించి మా డ్రాయింగు రూములో వేసారు.

మావారికి సడన్‌గా గ్రీటింగ్ కార్డులకి పెయింటింగ్ వేసి బిజినెస్ చేయాలని ఆలోచన వచ్చింది. ఇది సడన్‌గా వచ్చిన ఆలోచన కాదు. 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' అయింతర్వాత విజయా ప్రొడక్షన్ స్టాఫ్‌లో అందరితోపాటు మా వారికి కూడా ఉద్వాసన లేఖ వచ్చింది. అది నన్ను కలవర పెట్టింది. కానీ ఆయన నవ్వుతూ "వాళ్ళు ఉద్యోగంలోంచి తీసేస్తే మనము సంపాదించుకోలేమా? చూడు? నేను ఏమి చేయగలనో" అంటూ ఈ గ్రీటింగ్ కార్డుల ఆలోచన చెప్పారు. ప్రతి విషయంలోనూ ఆయన ధైర్యం, ఆత్మవిశ్వాసం అలాంటిది. దాని కోసరం కొన్ని ప్రింటింగు ప్రెస్ క్లబ్‌కి, హిందీ ప్రచార సభ ప్రెస్‌కి, వెళ్ళి విషయాలు అన్నీ తెలుసుకుని మొత్తం మీద 1969 అనే గ్రీటింగ్ కార్డు పెయింట్ చేసి ప్రింటింగ్‌కి ఇచ్చారు. చాలామంది అది చాలా బాగుంది అని కొనుక్కున్నారు. భీమవరంలో మా నాన్నగారు కొంత వ్యాపారం చేసి మాకు పైకం పంపారు. సూళ్ళూరు పేటలోని కె.వి.కృష్ణయ్య బిజినెస్ చేసి డబ్బు పంపాడు. ఆ వ్యాపారం బాగానే కలిసివచ్చింది మాకు. కానీ 1969 సంవత్సరం అయిన మూలాన మళ్ళీ అది పనికిరాలేదు. మా నాన్నగారు మళ్ళీ సంవత్సరానికి "మళ్ళీ గ్రీటింగ్ కార్డులు వేయించరే" అని అడిగారు నన్ను. "లేదు" అన్నాను. ఆయనకి కోపం వచ్చింది. "డబ్బు కోసరం కాకపోయినా చేతిలో విద్య వున్నప్పుడు అది వినియోగించుకోవచ్చు. ప్రొఫెషన్ కోసరమైనా అది కంటిన్యూ చేసి వుండవచ్చు కదా" అన్నారు.

భీమవరం వెళ్ళిన తరువాత అమ్మమ్మ నా దగ్గరికి వచ్చి అవీ ఇవీ మాట్లాడి "మీ ఆయనకి ఉద్యోగం లేదని విన్నాను. చాలా బాధపడ్డాను. నేను నిన్ను ఈ పెళ్ళికి ప్రోత్సహించాను. నాకు తెలియదు కదమ్మా సినిమాలోని సాధక బాధకాలు" అని అంది. ఆవిడలా అనగానే నేను బోరున ఏడవాలనుకున్నాను. కానీ తమాయించుకుని "సినిమాలు లేదన్నమాటేకానీ మీ మనవడి తెలివితేటల వలన కొన్ని పనులు జరుగుతున్నాయి. ఒక కవిగారు ఈయనకి కొంత స్క్రిప్టు పనులు ఇచ్చి ఆదుకుంటున్నారు అమ్మమ్మా" అని చెప్పాను. మా వారు

దర్శకుడు అయిన తరువాత డైరెక్షన్ ఛాన్స్ వచ్చిందని తెలిసి ఆవిడ చాలా సంతోష పడింది. తీరా షూటింగ్ మొదలు పెట్టడానికి ముందే పోయింది.

నేను మదరాసుకి తిరిగి వచ్చేసాను. మా శకుంతలని రెండున్నర సంవత్సరంలో స్కూలులో చేర్పించాలి. నేను టీచరుగా చేరతాను అంటే ముందు వద్దన్నాయన ఒప్పుకున్నారు. అందుకు మా శకుంతలకి అక్షరాభ్యాసం, నా ఉపాధ్యాయాభ్యాసం ఒకేసారి జరిగింది. దానిది వేరే స్కూలు మూలాన సైకిల్ రిక్షా ఏర్పాటు చేసాను. నేను పని చేసే మెయిన్ స్కూల్ దగ్గర వున్న Shrine Velankani School. దాని బ్రాంచే మా శకుంతల స్కూలు. మొదట దాన్ని స్కూల్లో చేర్పించిన రోజు ప్రిన్సిపల్ మాలతీ పనీక్కర్. దాన్ని ఏదో వంకన లోపలికి పంపారు. మేము వెంటనే తిరిగి వచ్చేసాము. మాలతీ చాలా మంచావిడ, పిల్లలని బాగా చూసుకుంటుందని పేరు ఆవిడకి. శకుంతలని మేము లోపలికి పంపి మేము తిరిగి వచ్చేస్తుంటే నాకు చాలా ఏడుపు వచ్చేది. అది ఇంటి దగ్గర అల్లరి చేస్తుంటే ఒక్కోసారి ఓపిక నశించి కొట్టేదాన్ని. మా వారు మాత్రం కొట్టకపోవడము కాదుకదా, ఒక మాట కూడా అనేవారు కాదు దాన్ని.

ఇంకోసారి ఏమి జరిగిందంటే నేను, వారు, శకుంతల తిరుపతి నుంచి మదరాసు సెంట్రల్లో దిగి బస్టాండుకి వెళ్ళి నిల్చున్నాం. ఎంతసేపటికీ బస్సు రాలేదు. "పోనీ కల్యాణీ టాక్సీలో వెళ్దామా? ఎక్కువవదు. పాపకి లేటవుతుంది" అన్నారు మావారు. నే వద్దన్నాను. మొత్తం మీద బస్సు వచ్చింది. బస్సు ఎక్కి కూర్చుని చొక్కా జేబులో చెయ్యి పెడితే పర్సు కనబడలేదు. "ఎక్కడ పెట్టుకున్నారో సరిగా చూడండి" అన్నాను. కండెక్టర్ టిక్కెట్టు డబ్బులకి తొందర పెడుతున్నాడు. "లేదు చొక్కా జేబులో పెట్టాను" అన్నారు. నాకు ఒళ్ళుమండింది. "చొక్కా జేబులో పెట్టుకుంటే అది ఇతరులకు బాగా కనబడుతుంది కదా అలా పెట్టుకుంటారా" అని కోపంగా అన్నాను. ఏం చేస్తాం చివరికి టాక్సీ చేయించుకుని ఇంటికి వచ్చాం. ఏ దురదృష్టవశాన్నో ఆ టాక్సీ మధ్యలో ఆగిందంటే మా గతి ఏంకాను?

ఇలా చాలా సార్లు ఆయన పర్సులు, నా పర్సులు పోవడం మూలాన అప్పటి నుంచి ఒక పెద్ద హ్యాండ్ బ్యాగ్ పెట్టుకుంటూ మా వారి పర్సుకూడా నా బ్యాగ్‌లోనే పెట్టుకుని దాన్ని గుండెలకు హత్తుకుని నడిచేదాన్ని. వారు పిల్లల్ని చిన్నతనాల్లో ఎత్తుకుని నడిచేవారు కదా. ఆ పిల్లల్ని ఎత్తుకున్న బరువు వల్ల ప్యాంటు జేబులోంచి పర్సు మాయమవడం తెలిసేది కాదు.

మా పిల్లలకు పెళ్ళైన తరువాత ఇంటర్ నేషనల్ టూర్‌కి వెళ్ళే అవకాశం వచ్చింది. డబ్బులు పాస్‌పోర్టులు, వీసాలు అన్నీ జాగ్రత్తగా తీసుకెళ్ళాలిగా. అటువంటప్పుడు వీటితోపాటు మా వారి పర్సుకూడా నా హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని మార్చి మార్చి పట్టుకునే వాళ్ళం ఆ బ్యాగ్‌ని.

నేను పెళ్ళైన దగ్గర నుంచి డైలీ అకౌంట్సు రాసుకుంటూ వుండేదాన్ని ఎంత ఖర్చు అయిందా అని. ఆ రోజుల్లో మూడు రూపాయలు తేడా వచ్చినా కూడా లెక్కతేలేంత వరకు పడుకునేదాన్నికాదు. రాను రాను మూడు రూపాయలు కాదుకదా ముప్పైవేలు తేడా వచ్చినా లెక్కా పక్కా వుండటం లేదులెండి.

మా వారి నొప్పించి Shrine Velankani Schoolలో టీచరుగా చేరాను. ఆ సమయంలో తెలుగు టీచర్లు సరిగా దొరికేవారు కాదు. అక్కడ ఒక మాష్టారు వుండేవారు. ఆయన ప్రశ్నాపత్రం తయారు చేసి వాటికి జవాబులు ప్రాక్టీస్ చేయించేవారు. ఫెయిల్ అయినా కూడా పాస్ మార్కులు వేసేవాడట. కొన్నాళ్ళు కరెక్షన్ డిపార్టుమెంట్‌లో పనిచేసాను. అప్పుడు సూపర్‌వైజర్ శారదా రమణి నా వద్దకు వచ్చి ప్రశ్నాపత్రాలు చేయమని, పరీక్షలు అవగానే జవాబుల పేపరు కూడా నన్నేదిద్దమనేది. ఆ మాష్టరు మీద నమ్మకం లేక. నేనలాగే చేసేదాన్ని. మిగతా టీచర్లంతా "ఆ! కల్యాణి మిస్ తరువాత సంవత్సరము మీకే ఆ తెలుగు క్లాసులు ఇస్తారు చూడండి" అనేవారు .అలాగే మళ్ళీ సంవత్సరం తెలుగు క్లాసులు ఇచ్చారు. నాకు చాలా మంచి పేరు వచ్చింది. నాకు కూడా చాలా సంతోషం వేసేది. తెలుగు గ్రామర్, కాంపోజిషన్ ఒకటేమిటి? అన్నీ నేర్పేదాన్ని తమిళ ప్రార్థన శ్లోకాలు తెలుగులో తర్జుమా చేసి నా తెలుగు క్లాస్‌లలో పిల్లల చేత

చెప్పించేదాన్ని. కల్చరల్స్‌లో పిల్లల చేత ఒక తెలుగు కామెడీ నాటకంకూడా వేయించాను. నా స్కూలు జీవితం చాలా సంతోషంగా గడిచిపోయేది. మెల్లగా మా వారిని ట్యూషన్స్‌కి కూడా ఒప్పించి, వారు మొదట వద్దన్నా ఇటు ఇంటి దగ్గర, అటు స్కూల్లోనూ ట్యూషన్స్ చెప్పేదాన్ని. ఇలా జరుగుతున్నప్పుడు మళ్ళీ ప్రెగ్నెన్సీ మొదలైంది. అలాగే 6-7 నెలల వరకు స్కూలుకి పోతూనే వున్నాను. నెలనెలా డాక్టరు చెకప్‌కి వెళ్తున్నప్పుడు ఆవిడ జాగ్రత్తలు చెప్పి వూరికి వెళ్ళేట్లయితే ఏడవ నెలలోనే వెళ్ళమని ఆలస్యం చెయ్యొద్దని చెప్పింది. నేను ఆవిడనే ప్రసవం చెయ్యమని కోరాను కానీ ఆవిడ నర్సింగ్ హోమ్‌లో సిజేరియన్‌కు సంబంధించిన పరికరాలు లేవని చెప్పింది. భార్యా, భర్తలిద్దరూ పక్కపక్కనే క్లినిక్స్ పెట్టుకున్నారు. ఆయన డా.సౌందర్ రాజన్, ఆవిడ రుక్మిణీ సౌందర్ రాజన్. ఎందుకంటే శకుంతలకు చేసిన డా. ఇ.వి కల్యాణి రిటైర్ అయిందని, అసిస్టెంట్స్ చేత చేయిస్తోందని విన్నాము. నాకక్కడికి వెళ్ళడానికి ఇష్టం లేకపోయింది. ఆ విషయాలన్నీ మా నాన్నగారికి ఉత్తరం రాస్తే ఆయన జవాబు రాశారు.

మా అమ్మగారికి హైదరాబాదులో యుటెరస్ ఆపరేషన్ అయిందని, అంటే గర్భసంచి తొలగించడం. డా కనకదుర్గ అని పేరున్న డాక్టరుందని, ఆవిడ సూపరింటెండెంట్ అని, మా అమ్మ ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని, ఆవిడ చాలా అనుభవంగల డాక్టరు అని కావలిస్తే హైదరాబాదుకు రావచ్చని మా నాన్నగారు రాసారు. మా నాన్నగారు భీమవరం కదా, హైదరాబాదని రాస్తున్నానని అనుకుంటున్నారా!

అది ఎలాగంటే మా నాన్నగారు భీమవరం కాలేజీలో పనిచేస్తుండగా డిప్యూటేషన్ వలన మూడు సంవత్సరాలు వాల్తేరు ఆంధ్రా యూనివర్శిటీలో పనిచేసారు. ఆ సమయంలో నేను, పిల్లలు వేసవి శెలవులకి విశాఖపట్నం వెళ్ళాం. తరువాత మా వారు వచ్చి అందరం కలిసి వచ్చేశాం. మా నాన్నగారు వాల్తేరులో మూడేళ్ళు వుండి తిరిగి వెనక్కి భీమవరం వెళ్ళారు. ఆయన రిటైరుమెంటు తీసుకుని హైదరాబాదులో స్థిరపడిపోయారు కానీ ఇక్కడ ఖాళీగా కూర్చోలేదు. తెలుగు అకాడమీలో పనిచేస్తుండేవారు. తరువాత ప్రైవేటు ట్యుటోరియల్ కాలేజీలో, ఐ.ఏ.యస్ కాలేజీల్లో ట్యూషన్లు తీసుకునేవారు. అందువలన మా అమ్మ ఆపరేషన్ హైదరాబాదులో జరిగింది.

మా నాన్నగారు రాసిన ఉత్తరం చూడగానే మా ఇద్దరికి కొండంత ధైర్యం వచ్చింది. ఒకవైపు నాకేమో సుధని కడుపుతో వున్నప్పుడే మా వారు డైరక్టరయ్యారనే సంతోషం. ఏడవ నెల రాగానే మా శకుంతలని తీసుకుని హైదరాబాదుకి వెళ్ళాను. కానీ మా శకుంతలకి ఐదు నెలల స్కూలు పోతుందనే బాధ. కానీ ఏం చేయాలి? దాన్ని ఎవరు చూసుకుంటారు? ఈ బరువు ఎవరిపైన పెట్టాలి? మా బావగారమ్మాయి పద్మ ఏదో ఉద్యోగం కోసం వచ్చి, నే పనిచేసే స్కూల్లోనే టీచరుగా చేరింది. అంటే ఒక సీనియర్ టీచరుకు నా పోస్టు ఇచ్చి దీనికి చిన్న తరగతులు ఇచ్చారు. అది కూడా చిన్నదే కదా! మా శకుంతలని వదిలిపెట్టి ఎలా వెళ్ళను. నేను హైదరాబాదుకు వెళ్ళి హాస్పిటల్‌కు వెళ్ళి అక్కడ డా. కనకదుర్గగారిని కలిసాను. నా పాత చరిత్ర అంతా చెప్పి మదరాసులో డా.రుక్మిణి రాసిన కేస్ హిస్టరీ కూడా ఇచ్చాను. ఆవిడ అది చూసి డెలివరి సిజేరియన్ అని చెప్పి, దానికి ఒక తేదీ ఇచ్చి, వారం రోజులు ముందుగా చేరమంది. అప్పుడు ఆసుపత్రికి, ఇంటికి తిరగడానికి ఇంకో మనిషి వుంటే బాగుంటుందని ఆ వూళ్ళో వుంటున్న మా అమ్మ చిన్నాన్నగారి కూతురుని పిలిపించారు మా నాన్నగారు. దాని పేరు కూడా రఘుమ. అది పెద్ద రఘుమ, మా చెల్లెలు చిన్న రఘుమ అన్నమాట. ఆవిడ రోజూ మా శకుంతలకి చిన్న చిన్న జడలు రెండు వేసి, పూలుపెట్టి అలంకరించి, ఆసుపత్రికి భోజనం తీసుకుని వస్తూ దాన్ని పిల్చుకుని వచ్చేది. మా శకుంతలకి పూలు అంటే ఎలర్జీ. ఒప్పుకునేదికాదు. పైగా దానిది హేర్‌కట్. అతికష్టం మీద జడలు వేసి, పూలు పెట్టేది. అది నస చేస్తుంటే "ఆసుపత్రికి వెళ్ళి మీ అమ్మ చూసేంతవరైనా పెట్టుకోమ్మా" అనేది. అంతే ఆసుపత్రికి వచ్చి నాకు చూపించిన తక్షణం పూలు పీకేసేది. అందుకే దాని పెళ్ళి చూపులకి దానికి కాబోయే అత్తగారితో "మా అమ్మాయికి పూలు సరిపడవు" అని చెప్పేసాము. అందుకు

ఆవిడ "పరవాలేదు. మాకు కూడా అంత పట్టింపు లేదు" అన్నారు. కానీ పెళ్ళిలో పూలజడ పెట్టించుకుని పూలతో అలంకరించుకుంది అనుకోండి.

ఇలా రోజా వస్తుంటే నర్సులు అందరూ దాన్ని ఎంటర్‌టైన్ చేసేవారు. దీంతో కాలక్షేపం అయ్యేది. వాళ్ళని అడిగేది "అందరికి బుజ్జిపాప వచ్చారు. మా అమ్మకు ఎప్పుడు వస్తుంది" అని. "మేరే సప్నోంకి బుజ్జిపాప ఆయేగితో" అనే ఆరాధనలోని పాట ఇలా మార్చి పాడేది. కొన్ని పాటలు ఇలా కల్పన చేసుకుని పాడేది అంత చిన్న వయసులో. తమిళంలో ఒక పాట మనోరమ పాడినది "జాం బజార్ జగ్గూ - నా సైదాపేట కొక్కు" దానికి మా శకుంతల "జాం బజార్ జగ్గు నా బర్కిట్ రోడ్డు శక్కు" అని పాడేది. ఎందుకంటే దాని స్నేహితులంతా దాన్ని 'శక్కు' అని పిలిచేవారు.

సరే, నే ఆసుపత్రిలో చేరేటప్పుడు పది రోజుల్లో దీపావళి పండగ వస్తుంది కదా! ఆ ఒక్కరోజు ఇంటికెళ్ళి సాయంత్రం రావచ్చా? అని డాక్టరని అడిగితే అనుమతి ఇచ్చింది. కానీ మా నాన్నగారు ఒప్పుకోలేదు. ఎందుకంటే ఆసుపత్రి ఇంటి నుంచి చాలా దూరం. చార్మినార్‌లో ఒకమూల వుంది. అయితే చాలా మంచి ఆసుపత్రి. సడన్‌గా నొప్పులు వస్తే అంత దూరం రావడం కష్టమని, ముందుగా చేరి ఏం ప్రయోజనం అని అన్నారు. అదీ నిజమే కదా! నా బాగు, నా బిడ్డ బాగోగూ కోరి చెప్పారని ఊరుకున్నాను. దీపావళి నాడు మా అమ్మమ్మ మడితో పండగ వంట అంతా చేసి, తాను భోజనం చేసి, క్యారియర్‌లో పెట్టి తానే స్వయంగా తీసుకొచ్చింది. మా అమ్మ ఐతే అక్కడే వుండి అప్పుడప్పుడు ఇంటికి వెళుతుండేది. అందువలన ఎంతో సాంప్రదాయంగా నాకు నూనె, సీకాయ పొడి, కొత్త చీర, జాకెట్టు ముందే ఆసుపత్రికి తెచ్చి పెట్టింది. నాకీ దీపావళి ఆసుపత్రిలోనే జరిగింది. ఒక వారం రోజులకి మా సుధ పుట్టింది. 1971 అక్టోబరు 27వ తేదీన.

**ఒకరోజు ఒకావిడ** "21వ వార్డు ఏదీ?" అంటూ వెతుక్కుంటూ వచ్చింది. ఏమి అనడిగితే "ఆ వార్డులో ఒక ఆడపిల్ల పుట్టిందట. చాలా అందంగా వుందిట" అని మనవడిని పిల్చుకుని వచ్చింది నా రూముకి.

"మా అమ్మాయి ఆడపిల్లని కోరుకుంటే మగపిల్లాడు పుట్టాడు మళ్ళీ" అందావిడ.

"నాక్కూడా మొదట ఆడపిల్ల. మగపిల్లవాడు అయితే బాగుంటుంది అనుకున్నాను. కానీ ఆడపిల్లే పుట్టింది" అన్నాను.

"మా పెద్ద పాప కూడా చెల్లెలే కావాలని అంటుండేది. దాని కోరిక నెరవేరింది" అన్నాను.

రోజా పిల్లల డాక్టరు వచ్చి దాన్ని ముద్దు పెట్టుకుంటూ "చిన్న ముక్కే నీది" అని బుగ్గగిల్లి వెళ్ళేది. నాకు చాలా ఆనందం వేసేది. గుండ్రని ముఖం, నాలాగే వుండేది. అందరూ "చిన్న కల్యాణి" అనేవారు. కానీ క్రమేపి పోలిక మారి వాళ్ళ నాన్నగారి పోలిక తిరిగింది.

మా సుధ పుట్టిన టెలిగ్రాం చేరగానే మా వారు వెంటనే హైదరాబాదుకు వచ్చి తిన్నగా హాస్పటల్‌కి వచ్చేశారు. అక్కడే స్నానం చేసి, మా అమ్మ తెచ్చిన క్యారియర్ భోజనం ఆయన కూడా తిని, సాయంత్రం వరకు వుండి వెళ్ళారు ఇంటికి. రెండు రోజులు వుండి మద్రాసుకి బయలుదేరుదామని పెట్టె తీసుకుని తిన్నగా హాస్పటల్‌కి వచ్చారు. ఆయన వున్నంతకాలం ఆసుపత్రిలో శకుంతల వాళ్ళ నాన్నని వదలలేదు. ఇంట్లో ఆ రెండు రోజులు ఆయన పక్కనే పడుకునేదిట. సాధారణంగా వాళ్ళ నాన్నగారి దగ్గరే బాగా అలవాటు దానికి. ఆయన తిట్టరు, కొట్టరు, విసుక్కోరు. సహనం చాలా ఎక్కువ. పైగా పెళ్ళయిన ఐదేళ్ళకి పుట్టినదాయె. చాలా ముద్దుగా చూసేవారు. ఇక మధ్యాహ్నం పెట్టె తీసుకుని బయలుదేరుతూ మా సుధని దూరం నుంచి చూసి, అంటే ఆయన డైరెక్టుగా పాపలని తాకరు. ఇన్‌ఫెక్షన్ వస్తుందని. మా అమ్మకు, నాకు నామకరణానికి వస్తానని చెప్పి బయలుదేరారు. వెనకాలే మా శకుంతల కూడా వెళ్ళింది. మా అమ్మ దాన్ని వెనక్కి పిలుస్తూనే వుంది. "అహ! వద్దు. నాన్నతో నేను కూడా మద్రాసు వెళ్తా"నంటూ పరుగు లంకించుకుది. కానీ మా అమ్మ దాని

వెనకాలే ఎలా పరిగెత్తగలదు? నా రూముకి హాస్పిటల్ గేటుకి చాలా దూరం. మా అమ్మ ఏం చేయలేక కొంచెం దూరం వెళుతోంది. గేటు దగ్గర మా వారు ఎందుకో వెనక్కి తిరిగి చూస్తే శకుంతల ఆయన్ని వెంబడిస్తోంది. షాక్ అయ్యారు. గబగబా దాన్ని తీసుకుని గదిలో వదిలి మరీ వెళ్ళిపోయారు. కొంతసేపు ఏడ్చి ఏడ్చి ఒక నర్సు పిలిచి మరిపింప చేస్తే వూరుకుంది.

మూడవ నెల రాగానే మా పాపకి సుధ అని నామకరణం చేసాము. ఆసుపత్రిలో వుంటుండగా మా పిన్ని వస్తుండేది. నేను, మా పిన్ని కలిసి ఆ పేరు నిశ్చయించుకున్నాము. ఆ విషయమే ఉత్తరం రాస్తే సరేనన్నారు. మా వారు నామకరణానికి వచ్చి మూడు, నాలుగురోజులుండి వెళ్ళిపోయారు. కొన్నాళ్ళ తరువాత మూడవ నెల నిండకుండా నేను మా సుధని ఎత్తుకుని మదరాసుకి వచ్చేసాము. అందరూ "ఇప్పుడు ఎలా వెళతావు చలిలో" అన్నారు. కాని ఐదు నెలలు అయ్యిందికదా! అని నేను సంక్రాంతి పండుగలు అవగానే మదరాసుకి వచ్చేసాను. మా నాన్నగారు శకుంతలని రాణి అనేవారు కదా! అందుకు ఆ రాణి పేరు చేర్చి సుధారాణి అని నామకరణం చేశాము. కానీ పిలవడం సుధా అనే.

కె.వి.రెడ్డిగారిని కలుసుకుని వెళ్ళిన కర్నూలు నిర్మాతలు కె.వి.గారికి 'శ్రీకృష్ణసత్య' సినిమా వచ్చిందని తెలిసి, మళ్ళీ శంకరరెడ్డిని పిల్చుకుని మదరాసు వచ్చి వాళ్ళ మొదటి సినిమా మావారిని డైరెక్ట్ చెయ్యమని కోరారు. సినిమా హీరో మూగవాడైనందున బొంబాయి నుంచి సతీష్ అరోరా అనే అతన్ని పిలిపించారు. కాంచన హీరోయిన్. సినిమా పేరు "నీతి - నిజాయితీ". సూళ్ళూరుపేట నుంచి కె.వి.కృష్ణయ్యని తన అసిస్టెంట్‌గా పని చేయడానికి పిలిపించుకున్నారు.

సినిమా విడుదల అయిన తరువాత అన్ని పత్రికల్లో ప్రశంసలు చాలా బాగా వచ్చాయి. కొంతమంది క్లీన్‌గా వుంది నీట్‌గా వుందని అన్నారు. ఎప్పుడూ రెండు, మూడు రీళ్ళు చూసే చక్రపాణిగారు ఈ సినిమా ప్రింటుని అదేపనిగా తెప్పించుకుని, మొత్తం ఒకేదాటున చూసి చాలా మెచ్చుకున్నారు. బాపుగారు, రమణగారు ఈ సినిమా గురించి చాలా మందితో చెప్పారు. మా నాన్నగారయితే అన్ని పత్రికల్లో వచ్చిన ప్రశంసలను కత్తిరించి ఒక చిన్న పార్శిల్లో పోస్టు చేసారు. ఆయన సంతోషానికి అవధులు లేవు. అల్లుడు మొదటి సినిమాకి మంచి పేరు వచ్చిందని. కానీ బిజినెస్ పరంగా డబ్బులు రాలేదు. డిస్ట్రిబ్యూటర్లు శ్రీ ఫిలింస్ వాళ్ళు.

నవతా కృష్ణంరాజు గారని ఒక ప్రసిద్ధ నిర్మాత. చాలా ఏళ్ళ క్రితం స్వతంత్ర వార పత్రికలోని మావారు రాసిన వ్యాసాలు చదివి, మావారి గురించి విని, నీతీ నిజాయితీ రిలీజుకు ముందే ఆయన నిర్మాణంలో ఒక సినిమా డైరెక్ట్ చేయడానికి మా వారిని బుక్ చేసారు. తర్వాత రిలీజైన సినిమాయే 'జమిందారుగారమ్మాయి'. షర్‌రోబ్ మౌడీ సినిమా, శీష్‌మహల్ కథ ఆధారంగా కథ మలిచారు.

ఇంతలో మా వారు శ్రీరాజాజీగారు రాసిన FATAL CART అనే కథ చదివి చాలా ఇంప్రెస్ అయ్యారు. దాన్ని తమిళంలోకి ఆర్ట్ పిక్చరుగా తీయాలని కోరిక. కానీ రాజాజీగారికి సినిమాలంటే ఇష్టంలేదు. కానీ ఎలా పర్మిషన్ ఇస్తారు? కల్కి అనే తమిళ మ్యాగ్‌జైన్‌లో ఎడిటర్‌గా పనిచేస్తున్న యస్.వి.యస్.గారు ఎలాగో పరిచయం అయ్యారు. ఆయన రాజాజీ గారి సెక్రటరీ. ఆయన సహాయంతో రాజాజీగారితో మాట్లాడి ఆయన పర్మిషన్ లెటర్ తీసుకున్నారు. దాని తరువాత మా వారు లెటర్ ఫ్రేం కట్టించారు. ఇప్పటికింకా అది మా డ్రాయింగు రూములో గోడకి తగిలించి వుంది. రాజాజీగారు అన్నారట, "సినిమాలెందుకు ఇష్టంలేదు? చెడ్డ పిక్చర్లు ఇష్టం లేదంతే" ఆయనకి కొద్దిగా సుస్తీగా వున్నా కూడా అతి కష్టం మీద సంతకం పెట్టారట పర్మిషన్ లెటర్‌లో. అదే ఆయన ఆఖరి సంతకం. రాను రాను ఆయన సుస్తీ ఎక్కువై, వారం రోజులకే మరణించారు. ఒక వారం ఆలస్యమై వుంటే మా వారు ఆయన పర్మిషన్ మిస్ అయ్యేవారు. సినిమా తీసి వుండే వారే కాదు. ఇక చూడండి. రాజాజీ గారి కథ కనుక పత్రికల వాళ్ళు, ప్రెస్ వాళ్ళు ఎంతోమంది మా ఇంటి చుట్టూ తిరగడం మొదలు పెట్టారు. ఒకొక్కప్పుడు మా వారు ఇంట్లో లేనప్పుడు వచ్చి నన్ను ఏవేవో ప్రశ్నలు అడిగేవారు. కానీ నేనేం చెప్పగలను?

పెద్ద సెన్సేషనల్ న్యూస్ అయ్యింది. పత్రికల వాళ్ళు అందరూ మా వారిని ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసారు. పెద్ద గాలి దుమారంలా చెలరేగింది.

స్క్రిప్టు డిస్కషన్ జరగాలి. రాజాజీగారి కథ తమిళంలో అసలు పేరు "దిక్కెట్ర పార్వతి" అంటే "దిక్కులేని పార్వతి" అని అర్థం. దానికి కూడా కె.వి.కృష్ణయ్య పని చేసాడు. తమిళ అసిస్టెంట్స్ ఇద్దరు. ఒక్కరు కారైకూడి నారాయణన్ అసిస్టెంటు రాజశేఖరు, మరొకరు త్యాగరాజన్ అనే అతను. టి.యం. సంతానం ప్రొడక్షన్ చూసుకున్నాడు. రవివర్మ కెమెరామేన్, ఇతడు కూడా అవార్డు విన్నర్. డైలాగులు కారైకుడి నారాయణన్. శ్రీకాంత్ హీరో, లక్ష్మి హీరోయిన్. తమిళంలో ఇప్పటి ఫేమస్ కమేడియన్, వై.జి.మహేంద్ర దీంట్లో విలన్ పాత్రధారి. ఇది అతని తొలి పరిచయం. కానీ మా వారే నిర్మాత. ఫిలిం ఫైనాన్స్ కార్పోరేషన్ నుంచి ఒకటిన్నర లక్ష అప్పు తీసుకున్నారు. ఇది లో బడ్జెట్ సినిమా. మొత్తం సినిమా బడ్జెట్టు రెండు లక్షలు.

షూటింగు చెయ్యడానికి లొకేషన్ చూడ్డానికని తమిళనాడులో వున్న హోసూర్‌కు వెళ్ళారు. తీరా అక్కడికి వెళితే హోసూరుకి 4,5 కిలోమీటర్ల దూరంలో తొరపల్లి గ్రామం వుందనీ, రాజాజీగారు అక్కడే పుట్టి కొంతకాలం పెరిగారు అని తెలిసింది. సరే, ఇంత దూరం వచ్చాం కదా అని తొరపల్లికి వెళ్ళి చూసారు. ఆ స్థలాన్ని, అక్కడ ఆయన పుట్టిన ఇల్లు, ఆ వాతావరణం ఒక పెద్ద చెట్టు అన్నీ చూసిన తరువాత చాలా ఆశ్చర్యం, ఆనందం కలిగింది. ఎందుకంటే రాజాజీగారు రాసిన కథలోలాగే వుంది. కానీ ఒక విషమ పరిస్థితి ఎదురైంది. ఆ హోసూరు, తొరపల్లి తమిళనాడుకి, కర్నాటకాకి బార్డర్‌లో వుంది. ఆ కాలంలో కర్నాటకలో షూటింగ్ చేస్తే ఏ భాషా పిక్చరు అయినా సరే కర్నాటకా గవర్నమెంటు 50 వేల రూపాయలు సబ్సిడీ ఇచ్చేది. కానీ రాజాజీగారి వూరు తమిళనాడులో కలిసిపోయింది. మరెలా? సబ్సిడీ రాదే! సబ్సిడి వస్తే మా వారికి సినిమా ఖర్చు కొంత తగ్గుతుంది. ఇలాంటి ఆర్ట్ సినిమా సహజ వాతావరణంలో తీస్తేనే బాగుంటుంది. ఏమి చేయాలో మా వారు ఆలోచిస్తున్నారు. ఇక ఏదైనా ఆలోచించి డిసైడ్ చేయడానికి మేమిద్దరమేగా? నన్నడిగారు ఏమి చేస్తే బాగుంటుందని, కానీ నాకు ఆ రోజుల్లో సినిమా పరిజ్ఞానం అంతలేదు. నాకు తోచింది నేను చెప్పాను. "ఇది కమర్షియల్ సినిమా కాదు. ఆర్ట్ పిక్చరు. సహజంగా వుండాలి. డబ్బంటారా, అప్పయినా చేయవచ్చు. ఎలాగైనా సంపాదించవచ్చు.. కానీ పేరు సంపాదించడం కష్టం. సహజంగా వుండాలంటే ఆయన వూళ్ళోనే షూటింగ్ జరపాలి. అప్పుడే నేటివిటీ వుంటుంది" అన్నాను. ఈ సలహాకి మా వారి ఆనందానికి అంతులేదు. అదే నిశ్చయించారు. నా మటుకు ఎంత విలువనిచ్చారో చూడండి. వారికి నెత్తి నుంచి ఒక బరువు దింపినట్లు ఫీలయ్యారు. సరే లొకేషన్ డిసైడ్ అయింది కానీ, డబ్బు విటమిన్లు రెడీ చేసుకోవాలిగా. యఫ్.యఫ్.సి వాళ్ళకి అప్లై చేసినా కూడా దానికి చేయవలసిన ప్రొసీజర్ అయి డబ్బు రావడానికి కొంతకాలం పట్టింది. 'నీతి - నిజాయితీ' ఫ్లాప్ అవ్వడం వలన, నిర్మాతలకి డబ్బు రానందున వాళ్ళని అప్రోచ్ కాలేదు మావారు. ఆయన ఉద్దేశ్యం ఈ తమిళ సినిమా తీసి దాంట్లో కొద్దో గొప్పో వచ్చిన పైకం నిర్మాతలకు ఇద్దామని. మొత్తం మకాం హోసూరులో పెట్టారు. అది ఒక పెద్ద ఇండిపెండెంట్ ఇల్లు. కొత్తగా కట్టారు. దాంట్లో ఐదు ఆరుగదులు వున్నాయి. ఒక ఆయా, పనివాడు అందరూ వున్నారు. అక్కడ్నుంచి తొరపల్లికి షూటింగుకి ప్రొద్దున్నే లేచి మధ్యాహ్నం భోజనాలు కూడా అక్కడే కానిచ్చి, సాయంత్రానికల్లా హోసూరు రావటం వాళ్ళ దినచర్య. మా రెండో అమ్మాయి సుధా ఎనిమిది పది నెలల పిల్ల. శకుంతల చిన్న క్లాసు వలన స్కూలుకి సెలవు పెట్టించి నేను, పిల్లలిద్దరము కూడా వెళ్ళాము హోసూరు, రోజూ పిల్లలిద్దరిని పిల్చుకుని షూటింగుకి వెళ్ళేదాన్ని. కానీ రోజూ వెళితే బోరు కదా, నాకైతే వంట పనిలేదు. చాలా కంఫర్టబుల్‌గా వుండేది. షూటింగ్ స్పాట్స్‌కి వెళితే కరణంగారి కుటుంబం, మునసబుగారి కుటుంబం మమ్మల్ని చాలా బాగా చూసుకునేవారు. పిల్లల్ని వాళ్ళ మంచం పడకల మీదే పడుకో పెట్టమనేవారు. కానీ నేను అలా చేయలేదు అనుకోండి. నాకు చాలా మొహమాటం వేసేది. షూటింగుకి వెళ్ళినప్పు పిల్లలితో నేను హోటల్‌కి వెళితే డబ్బులు తీసుకునేవారు కాదు. అందుకే హోటల్‌కు

వెళ్ళడం మానేశాను. మెస్ నుంచే మాకు భోజనం వచ్చేది. అప్పటికి కొన్ని నెలల క్రితం నేను ఆంధ్రజ్యోతి పత్రికకి ఒక కథ రాసి దానికి "తప్పెవరిది" అని పేరు పెట్టాను. తరువాత దాన్ని పట్టించుకోలేదు. 'దిక్కెట్ర పార్వతి' షూటింగ్ సమయంలో హోసూర్‌కి పత్రికవాళ్ళు లెటర్ రాసి పంపుతూ 200రూపాయల చెక్ పంపించారు. దాన్ని పెట్టి నాకొక రేడియో (పోర్టబుల్) కొనిచ్చారు మావారు. దానిలోని పాటలు వింటూ వంట పని చేసుకునేదాన్ని.

ఒకరోజు నాకు తెలిసింది. ఎదురుగుండా సినిమా హాలుందని. మూడురోజులకొక సినిమా మారుతూ వుంటుంది. నాకు సినిమాకి వెళ్ళాలనిపించేది. కానీ తాళం పెట్టి వెళితే ఏ యాక్టర్లు ఏ సమయానికి మదరాసు నుంచి వస్తారో. మా వారికి చెపితే "అందరికోసరం నువ్వెందుకాగాలి? తాళాలు ఆయాకిచ్చి వెళ్ళు. నీకు నమ్మకం లేకపోతే దాన్ని థియేటర్‌కు రమ్మని చెప్పు" అనేసరికి నాకు సంతోషం వేసి సినిమాకి వెళ్ళేదాన్ని. ఆయాని మంచితనం చేసుకోడానికి దానికి అప్పుడప్పుడు వక్కాకుకి డబ్బులు ఇచ్చేదాన్ని. పైగా దానికి కావలిస్తే అదే అడిగేది. ఇవ్వక తప్పుతుందా? డైరెక్టరు భార్యని కదా ఇవ్వకపోతే నామోషీకదా. నా మర్యాద నాకు.

అలాగే ఒకరోజు థియేటర్లో వుండగా ఆయా వచ్చి సంజీవరెడ్డిగారు వచ్చారని చెపితే, నేనే స్వయంగా వెళ్ళి, ఆయనకి తాళాలిచ్చి మరీ థియేటరుకి వచ్చేదాన్ని. ఎప్పుడైనా షూటింగ్ స్థలానికి వెళితే అక్కడ లైట్‌బాయ్స్, కెమెరా అసిస్టెంట్సు అందరూ మా పిల్లల్ని బాగా చూసుకునేవారు. మా పిల్లలు నిద్రపోతే, వాళ్ళ దగ్గరున్న కాస్ట్యూమ్స్ డిపార్టుమెంటులో వున్న బట్టలతో కప్పేవారు. షూటింగ్ అవగానే అసిస్టెంట్లు, బాయ్స్ "అమ్మా! మీరూ, పిల్లలు ముందు కార్లో ఎక్కి కూర్చోండి. డైరెక్టరుగారు మిమ్మల్ని మర్చిపోయి వెళ్ళిపోతారు" అనేవారు. ఆ టైములో మా శకుంతలకి సాధనా హెయిర్ కట్ వుండేది. బెల్ బాటమ్స్ ఫ్యాషన్. అందరూ దాన్ని "హలో, బెల్ బాట్స్" అనేవారు. ముఖ్యంగా స్టిల్ ఫోటోగ్రాఫర్ ఓ. యం. భద్రి బాగా చేరదీసేవాడు. దాన్ని "హలో! బెల్‌బాట్స్, కమ్ హియర్" అంటూ.

ఆ సినిమాకి సంగీతం కంపోజ్ చెయ్యడానికి వీణ చిట్టిబాబుగారిని బుక్ చేశారు మావారు. ఆయన తన వీణని ఎవరి చేతికీ యిచ్చేవారు కారు. తానే స్వయంగా వేరే రూములో పెట్టి గదికి తాళం పెట్టి తాళాలు నాకిచ్చి అవి ఎవరికీ ఇవ్వద్దని, ఎవర్నీ ఆ గదిలోకి వెళ్ళనివ్వకని చెప్పి మరీ వెళ్ళేవారు. ఆ సినిమాలో రెండు పాటలున్నాయి. అందులో ఒకటి రాజాజీగారే రాసిన పాట. ఆ రెండు పాటలూ వాణీజయరాంగారి చేత రికార్డింగులు చేయించారు. హిందీ సినిమా గుడ్డీలో "బోలేరే పప్పీ" పాటను పిక్చర్‌లో చూసి ఈమెని బుక్ చేసారు మావారు.

ఒకరోజు షూటింగ్ ముగించుకుని అక్కడే భోజనాలు చేసి హోసూరు ఇంటికి వచ్చారు. అందరూ ముందు హాలులో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నాకొక ఐడియా తట్టింది. ఆయాచేత టమేటా పళ్ళు, వుప్పు, మిరియాలు తెప్పించి, టమేటాలను ముక్కలు ముక్కలుగా చేసి వుప్పు, మిరియాలు దంచి పొడిచేసి ముక్కలమీద చల్లి వాళ్ళకివ్వాలి. మరి ప్లేట్లు లేవే. ఆయాని అడిగితే మట్టితో చేసే దొప్పలులా దొరుకుతాయని చెప్పింది. అవి తెప్పించి దాంట్లో టమేటా ముక్కలు పెట్టి వాళ్ళందరికీ ఇచ్చేదాన్ని. వాళ్ళందరూ చాలా సంతోషించారు. ముఖ్యంగా కెమెరామెన్ రవివర్మ ఈ దొప్పలలో టమేటా ముక్కలని పెట్టడం చాలా మెచ్చుకున్నారు. అది చూసి సంజీవరెడ్డిగారు చాలా ఇంప్రెస్ అయి ఈ ఐడియా బాగుందని డ్రైవర్ చేత బోలెడు టమేటాలు, మిరియాలపొడి, వుప్పు డబ్బాలు తెప్పించారు. ఇవేనా! మా పిల్లలు చిన్నవాళ్ళు కదా అని వాళ్ళకి బిస్కెట్లు, చాక్లెట్‌లు, బ్రెడ్‌లు, కేకులు, పండ్లు కొని యివి పిల్లలికివ్వండమ్మా అని నా చేతికిచ్చేవారు. అందరూ నిజంగా మమ్మల్ని ఎంత బాగా చూసుకునే వారో, లేకపోతే ఇల్లూ, వాకిలీ వదిలి నేనక్కడ వుండగలనా? అసిస్టెంట్సు మా శకుంతలని మాతో షూటింగ్‌కిరా! అమ్మతో యిక్కడుండి ఏం చేస్తావ్ అని పిలిచినా అది కొత్త వలన నాతోనే వుండేది. మా సుధ పెళ్ళికి లక్ష్మి వచ్చినపుడు నే చెప్పానావిడకి, 'దిక్కెట్ర పార్వతి' టైములో చిన్నపాపే, అదే యిది అని.

దిక్కెట్ర పార్వతి షూటింగు ఇరవైరెండురోజుల్లో ముగించుకుని అంతా మద్రాసుకి వచ్చేశారు. రీరికార్డింగు, డబ్బింగ్ మిగతావన్నీ పూర్తి చేసుకుని 1974లో రిలీజయింది. ఇది కూడా ఫైనాన్షియల్‌గా దెబ్బతింది. కానీ నేషనల్ అవార్డు వచ్చింది. 5,000రూపాయలు నగదు బహుమతి కూడా వచ్చింది. కానీ బాండ్ రూపంలో వచ్చింది. తెలుగు డైరెక్టరు తమిళ సినిమా తీసి నేషనల్ అవార్డు సంపాదించుకున్నారని పేరు వచ్చింది. కానీ యఫ్.యఫ్.సికి మావారు తీసుకున్న లోన్ ఇవ్వలేకపోయారు. అప్పుడు అలనాటి ముఖ్యమంత్రి యం.జి.రామచంద్రన్‌గారు. ఆయనని అప్రోచ్ అయి మా వారు రిక్వెస్ట్ చేస్తే, ఆయనర్థం చేసుకుని, సినిమా ఒక అర్థం పరమార్థం వున్న సబ్జెక్ట్ అని, ఎన్నో ఆశయాలు నిండి వున్న పిక్చరని మెచ్చుకున్నారు. ఎఫ్.యఫ్.సికి ఇయ్యవలసిన పైకం తమిళనాడు గవర్నమెంటు తీర్చేసి ఆ పిక్చర్ని కొనేసింది. కలలో కూడా వూహించని భాగ్యం మా వారికి దక్కింది. ఇపుడా సినిమా తమిళనాడు గవర్నమెంటు ఆధీనంలో వుంది. సినిమా చరిత్రలో ఒక రాష్ట్ర ప్రభుత్వం సినిమాను కొనడం ఇదే మొదటిసారి.

దిక్కెట్ర పార్వతి సినిమాకి ప్రీమియర్ షో రాష్ట్ర గవర్నరుకి, సినిమా పరిశ్రమలో, రాజకీయ రంగంలోని ప్రముఖులకి, ప్రెస్ వాళ్ళకి వేసి చూపించారు. నవతా కృష్ణంరాజుగారు ఆయన పిక్చరు 'జమిందారుగారమ్మాయి'కి మావారిని బుక్ చేసారని చెప్పానుగా! ఆయన ప్రతి ప్రీవ్యూ షోకీ హాజరయ్యేవారు. ఒక ఆప్తునిలాగా సంతోషపడేవారు. "మీ ఆయన చాలా ఎత్తుకి ఎదిగిపోయేరమ్మా! పెద్ద డైరెక్టరయ్యారు" అంటూ పొంగిపోతూ నాతో చెప్పేవారు.

ఇదిలా వుండగా 'నీతి - నిజాయితీకి' డబ్బు రానందున శ్రీ ఫిలిమ్స్, లక్ష్మీ పిలిమ్స్, నవతా కృష్ణంరాజు గారి పిక్చరు మావారి డైరెక్షన్‌లో తీసుకోడానికి కొంచెం వెనకాడారు. కానీ కృష్ణంరాజుగారు మాత్రం వెనకాడక పట్టుపట్టి, డిస్ట్రిబ్యూటర్నన్నా మారుస్తాను కానీ డైరెక్టర్ని మార్చనని పట్టుదలతో అన్నపూర్ణా పిక్చర్స్‌ని ఒప్పించారు. ఇంకా కొంతమంది, వూళ్ళో ఆయన స్నేహితులు కూడ్ ఫ్లాప్ డైరెక్టర్ని పెట్టుకుంటున్నారేమిటి అని కూడా అడిగారు. కానీ 'నీతి - నిజాయితీ' పేరుకు తగ్గట్టుగా మావారి సిన్సియారిటీ వున్నంత కాలం ఎదురు తిరగదు. 'జమిందారుగారమ్మాయి'లో రంగనాథ్, శారద నటించారు. ఈ సినిమా వందరోజులు ఆడింది. సక్సెస్ అయింది. జి.కె.వెంకటేష్ గారి సంగీతం బాగుంది. 'జమిందారుగారమ్మాయి' సినిమా పరిచయంతో నవతా వాళ్ళ కుటుంబ సభ్యులు మాకు బాగా సన్నిహితులయ్యారు. ఈ సినిమాలో చాకలి వాళ్ళపాట రాజబాబు - గిరిజారాణి మీద చిత్రీకరణ. "మంగమ్మా నువ్వు వుతుకుతుంటే అందం" అని రాజబాబు పాడ్తాడు. దీని ట్యూన్ "హమ్‌తుమ్ ఏక్ కమెరేమె బంద్‌హొ" బాబీ పాట ట్యూన్. ఇది చాలా పెద్ద హిట్ అయింది. దీనికి చాకలి వాళ్ళంతా కేసు పెట్టారు, కానీ కోర్టు దాన్ని కొట్టిపారేసింది. ఈ సినిమా ప్రీవ్యూ చూసిన మావారి ముఖ్య స్నేహితుడు గణపతిరావు తిన్నగా కృష్ణంరాజు గారి వద్దకి వెళ్ళి "సార్! మా వాడిచేత ఇలాంటి పిక్చర్లే తీయించండి" అని వెళ్ళిపోయాడు.

'జమిందారుగారమ్మాయి' తర్వాత జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తిగారొచ్చి మావారితో తనకొక సినిమా డైరెక్టు చెయ్యమని అడిగారు. అదే "ఒక దీపం వెలిగింది" రంగనాథ్, చంద్రకళ హీరో, హీరోయిన్లు. ఆ సినిమా కథ, మాటలు, పాటలు రికార్డింగులూ అన్నీ పూర్తి చేసుకుని షూటింగు కూడా ఒకటి రెండు షెడ్యూల్స్ జరిగింది. బందా సూర్యనారాయణరావుగారని ఒక పారిశ్రామికవేత్త. చాలాకాలం నుంచి మా వారి డైరెక్షన్లో సినిమా తియ్యాలని ఆయన కోరిక. కథ కోసరం వెతుకుతున్నారు. ఎవరో చెపితే తమిళంలో కమలహాసన్, సుమిత్ర నటించిన "మేల్‌నాటి మరుమగళ్" ("విదేశపు కోడలు" అని అర్థం). దానిని బందావారు, నవతావారు, మేము అందరం చూశాము. మావారికి, నవతా కృష్ణంరాజుగారికి నచ్చింది. కానీ బందా సూర్యనారాయణ గారికి నచ్చలేదు. వెంటనే దానిని కృష్ణంరాజుగారు తెలుగులోకి తియ్యడానికి రైట్స్ కొనేశారు. మావారికి అడ్వాన్సు కూడా ఇచ్చి బుక్ చేసేశారు. ఆ సమయంలోనే మాకు డైరెక్టర్స్ కాలనీ గృహప్రవేశం జరిగిపోయింది. ఆ సినిమాకి 'అమెరికా అమ్మాయి' అనే పేరు పెట్టారు. కొత్త యింటికి, పైగా స్వంత ఇంటికి వెళ్ళగానే కొత్త సినిమా వచ్చిందని మాకందరికీ చాలా సంతోషమైంది. 'ఒక దీపం వెలిగింది', 'అమెరికా అమ్మాయి' ఒకేసారి

షూటింగులు జరిగాయి. అమెరికా అమ్మాయికి ఫారిన్ హీరోయిను. ఆమె చేత డ్యాన్సు షూటింగు నిమిత్తం చిదంబరం వెళ్ళి అక్కడ గుడిలో షూటింగు జరిపారు. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అయింది. చిత్రీకరణలో, పాటల్లో, సినిమా యాక్షన్‌లో, ఒరిజినల్ తమిళ సినిమాకి, తెలుగులో మావారు తీసిన సినిమాకి సంబంధమే లేదు. కథ థీమ్ మాత్రం బేసిక్‌గా తీసుకున్నారు. దీనికి గొల్లపూడి మారుతీరావుగారు స్క్రిప్టు రాశారు.

అమెరికా అమ్మాయి సినిమాకి సంగీతం జి.కె.వెంకటేష్ కెమెరా బాలు మహేంద్ర. శ్రీధర్, అమెరికా పిల్ల, రంగనాథ్, దీప. దానికి జి.కె వెంకటేష్‌గారు ఒక పాటకి ట్యూన్ కట్టారు. సాధారణంగా రికార్డింగులు అవగానే ఆ పాటలన్నీ ఇంటికి వచ్చి నాకు వినిపించేవారు మావారు. అలాగే ఒక పాట విన్నాను. "ఒక వేణువు వినిపించెను అనురాగ దీపిక". ఈ పాటని జి. ఆనంద్ చేత పాడించారు. ఇదే అతని తొలి పరిచయం. ఈపాట విని "నేను వెంకటేష్ గారికి ఫోన్ చెయ్యనా?" అని మా వారినడిగాను. నన్ను జి.కె "వదినగారు" అనేవారు. వెంటనే ఆయనకి ఫోన్ చేసి "మీరు ట్యూన్ చేసిన ఆ పాట చాలా బాగుందండీ. చాలా మెలోడియస్‌గా వుందండి. ఆపాటని కవి గోపిగారు ఎలా సహజంగా రాసారో దానికి తగ్గట్టు స్వరపరిచారు చాలా సంతోషంగా వుందండీ" అన్నాను. దానికి వెంకటేష్‌గారేమన్నారో తెలుసా! "వదినగారూ మీకు సంగీత జ్ఞానం వుంది కనుక నచ్చింది. కానీ కొంతమంది పాట స్లోగా వుంది, ఇలా వుంది, అలా వుంది అని కామెంట్ చెయ్యవచ్చు" అన్నారు.

రెండు రోజులు తర్వాత నవతా కృష్ణంరాజుగారబ్బాయి అచ్యుత రామరాజు, అందరూ అచ్చిబాబు అంటారు. ఇప్పుడు ఆయన పాడుతాతీయగా ప్రొడక్షన్‌లో పనిచేస్తున్నారు. ఆయన నాకు ఫోను చేసి "అమ్మా! ఇవాళ ఒక వేణువు పాట పిక్చరైజేషన్ వుంది డైరెక్టర్ గారితో మీరూ వస్తారా? ఆ పాట మీరు ఇష్టపడ్డారట కదా" అన్నారు. వెంటనే అచ్చిబాబు ఫోన్ చేశారని, నేనూ వస్తానని మావారితో అన్నాను. మరి నేవెళ్ళకుండా వుంటానా!

నిజంగా ఆ పాట పిక్చరైజేషన్ ఎలా వుందంటే. మా వారి స్థానంలో మరే డైరెక్టరు వున్నా ఇలాగే వర్ణించేదాన్ని. పిక్చర్లో శ్రీధర్ సితార్ వాయిస్తూ పాడుతూ వుంటాడు. లోపల్నించి బెడ్‌రూములో దుప్పట్లు సవరిస్తూ, దిళ్ళు సవరిస్తూ, అమెరికా అమ్మాయి అచ్చు తెలుగింటి ఆడబడచుగా చీరకట్టుకుని, వదులుగా జడవేసుకుని, ఒక పూలపళ్ళెం పట్టుకుని, భర్త పక్కన కూర్చుని మల్లెపూలదండ కట్టుకుంటూ తరువాత పూలమాలని జడలో తురుముకుంటూ, ప్రేమతో భర్తనానుకుని పాట తన్మయంతో వింటూ కూర్చుంటుంది. ఇలాంటి విషయం సినిమా చూసిన వాళ్ళకి అర్థం అవుతుంది.

తరువాత అమెరికా అమ్మాయి "పాడనా తెనుగు పాట" దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రాసినది, పాడుతుంటే ఎదురుగా ప్రేక్షకులలో ముందు వరుసలో కూర్చున్న శ్రీధర్, నిజ జీవితంలో ఒక భార్య పాటపాడితే భర్త ఎలా తన్మయిస్తాడో అలాంటి ఎక్స్‌ప్రెషన్ ఇచ్చారు. అదింకా నాకు కళ్ళకు కట్టినట్లుంటుది. దర్శక, నిర్మాతలు ఆ సినిమాని అలా మలిచారు. ఆ అమెరికా అమ్మాయి చేత అలా నేచురల్‌గా చేయించారు. ఆ అమ్మాయి కూడా బాగా సహకరించి వుండాలి. నిర్మాతల సహకారం లేనిదే ఏ దర్శకులైనా తాననుకున్నది ఏమీ చెయ్యలేడు. మా వారి తత్వం కాంప్రొమైజ్ అయ్యే మనిషి కాదు. కానీ పరిస్థితులను బట్టి అప్పుడప్పుడు కొంచెం కాంప్రమైజ్ అయినందువలన కొన్ని సినిమాలు కమర్షియల్‌గా రాణించలేదు.

**ఇదిలా వుండగా** బందా సూర్యనారాయణగారికి ఒక సబ్జెక్ట్ చూడాలి కదా! ఫిలిమ్ ఫెస్టివల్ పిక్చర్స్ వరుసగా చాంబర్‌లో వేస్తుంటే రోజూ చూసే వాళ్ళం. ఒకరోజు చూసిన దాంట్లో హీరోది డబుల్ రోల్. ఒకడు డాక్టరు, మరొకడు వేరే వూళ్ళో వుంటాడు. కథ ప్రకారం ఇద్దరూ తారుమారు అవుతారు. ఇంటికొచ్చిన తర్వాత మావారన్నారు. కమల్‌హసన్ డబుల్ రోల్‌తో ఈ పిక్చరు కథ మనం ఎందుకు

రాయకూడదూ అని. మా వారు కథను నన్నే రాయమన్నారు. సినిమాకి కథ రాయడం అంటే మాటలా? అయినా రాసాను మా వారి సహకారంతో. కమల్‌హాసన్‌కి వినిపించారు. అతనికి నచ్చింది. బందా సూర్యనారాయణ గారిని కూడా పిలిపించి వినిపిస్తే ఆయనకి కూడా నచ్చింది. అదొక కామెడీగా వుంటుంది. మావారు ఆ కామెడీని ఇంకా ఎక్కువ చేశారు. కామెడీ డైలాగులు రాయాలంటే ఆ కాలంలో నరసరాజుగారి తర్వాత జంధ్యాల గారేగా!

సంగీతానికి రాజన్-నాగేంద్రగార్లని బుక్ చేశారు. కెమెరా బాలు మహేంద్రగారే. ఈ పిక్చరు కామెడీ పరంగా, సంగీత పరంగా కమల్‌హాసన్ యాక్షన్ పరంగా సూపర్ హిట్ అయింది. ఇదే "సొమ్మొకడిది-సోకొకడిది". దీని తరువాత నవతా వారి "పంతులమ్మ" తీశారు. ఈ సినిమాలో వేటూరి వారి రచన "మానసవీణా" అనే పాట హైలైట్ అయింది. సింగీతం వారి సినిమాల్లో సంగీతం మెండు అని పేరు వచ్చింది.

అమెరికా అమ్మాయి జరుగుతుండగా బెజవాడ నుంచి రాధాకృష్ణమూర్తి అనే ప్రొడ్యూసరు మా వారి దగ్గరకు వచ్చారు. ఆయనకొక సినిమా డైరెక్టు చెయ్యాలని. అంతకుముందే నాగేశ్వరరావుగారితో "శ్రీమంతుడు" అనే సినిమా తీశారు. ఆయన, మా వారు తీసిన పిక్చర్లు గురించి విన్నారు. "అమెరికా అమ్మాయి"కి ముందే మొదలుపెట్టిన "ఒక దీపం వెలిగింది", "అమెరికా అమ్మాయి" ఒకేసారి జరగడంతో ఇంచుమించు ఈ రెండు సినిమాలు ఒకే సంవత్సరంలో విడుదలయ్యాయి. ఒక దీపం వెలిగింది కూడా సక్సెస్ అయింది. రాధాకృష్ణమూర్తిగారు, మా వారు కథకోసరం వెతుకుతూ ఒక సబ్జెక్టు అనుకున్నారు. దానికి కొంత పని చేసారు. అది నచ్చలేదు. తర్వాత హిందీలో "దోస్తీ" అనే పిక్చర్ హిట్ అయిందని, దానిని తియ్యాలని డైలాగులు సహితం తయారు చేసుకున్నారు. అదీ నచ్చలేదు నిర్మాతకి. దాని రైట్స్ బాపూగారు కొని "స్నేహం" పేరుతో విడుదల చేశారు. ఆనాటి బాలనటుడు సాయికుమార్, రాధాకృష్ణలతో తీశారు. అది ఇద్దరి బాలుర కథ.

ఇక ఏం చెయ్యాలి? కథ ఎంతకీ కుదరలేదే? తర్వాత మాదిరెడ్డి సులోచనగారి నవల "తరం మారింది" చదివి అది బాగున్నదని తీర్మానించుకుని అదే పేరుతోనే సినిమా తీసారు. అందరూ కొత్తవాళ్ళే, లో బడ్జెట్ సినిమా. ఆంధ్రాలో ముక్త్యాల మున్నగు వూళ్ళలో షూటింగ్ జరిగింది. కొత్త హీరోయిన్‌ని పరిచయం చేశారు. ఆమె పేరు పల్లవి. హీరో శ్రీధర్. అప్పటి నటి శోభ. ఆంధ్రప్రదేశ్ అవుట్ డోర్‌లో జమిందారుల బంగళాలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ నంది అవార్డు వచ్చింది. "తరం మారింది" సినిమాకి వాళ్ళ అన్నగారబ్బాయి పూర్ణని గూడూరు నుంచి అసిస్టెంట్ డైరెక్టరుగా పని చెయ్యడానికి పిలిపించుకున్నారు. ఈ సినిమా అయినతర్వాత రాధాకృష్ణమూర్తిగారు, మా వారు రషస్ నాకు చూపించారు. దాంట్లో హీరో, హీరోయిన్ల రొమాంటిక్ సీన్లు చాలవని చెపితే మరి రెండు సీన్లు షూటింగ్ జరిపారు.

మా శకుంతల, సుధ చిన్నతనంలో, వాళ్ళ స్కూలు రోజుల్లో నేనెప్పుడైనా మా వారితో షూటింగులకీ, ఏటేటా ఇంటర్ నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కి వెళ్తూండేదాన్ని. మా వారికి ఆయన చేసిన పిక్చర్లలో కొన్ని అవార్డు వచ్చేవి. కొన్ని ఇండియన్ పెనోరమాకి తీసుకునేవారు. అటువంటప్పుడు మా వారి ఖర్చులు వాళ్ళే భరించేవారు. నా ఖర్చులు మాత్రం నేనే భరించేదాన్ని, షూటింగులకి వెళ్ళినా కూడా నా విమానం ఖర్చులు నావే. అటువంటప్పుడు మా శకుంతల ఏమీ అడిగేది కాదు. సుధా యింకా చిన్న పిల్ల మూలన "ఎప్పుడూ మీరిద్దరే వెళ్తారేం? మమ్మల్ని పిల్చుకుని వెళ్ళరేం?" అనడిగేది. ఇది సరిగ్గా కొన్ని సంవత్సరాల క్రితం మా రఘుమ మా నాన్నగారిని అడిగిన విషయం జ్ఞాపకం వచ్చింది. నేను మా సుధతో "మీకు స్కూళ్ళు కదమ్మా పెద్దవారయ్యాక, మీకు కూడా పెళ్ళిళ్ళయ్యాక మీ మొగుళ్ళతో వెళ్దురుగానిలే" అని చెప్పేదాన్ని. మా సుధ విషయంలో మాత్రం ఇది అక్షరాలా జరుగుతోంది. ప్రతి డిశంబరుకి, ప్రతి వేసవి సెలవులకి ఎక్కడికో అక్కడికి టూర్ ప్రోగ్రామ్ వేస్తారు. లేకపోతే నా మనవడు ఊర్కోడు. ఈ సంవత్సరం అమెరికా వెళ్ళారు.

మా శకుంతల చిన్నతనంలో సినిమాలకి పిల్చుకెళితే బాగానే చూసేది. ఎప్పుడైనా బోర్ కొడితే ఏడుపు మొదలుపెట్టేది. మా ఒప్పందం ప్రకారం ఇంగ్లీషు సినిమా ఐతే దానిని నేను బయటికి పిల్చుకెవెళ్ళాలి. తమిళ సినిమా అయితే వారు పిల్చుకువెళ్ళాలి. కానీ మా సుధ అలాకాదు. సినిమా చూస్తూనే వుండేది. దాంట్లో హీరోయిన్ ఏడుస్తూ వుంటే దానికి సందర్భం ఎలా అర్థం అయ్యేదో ఆశ్చర్యం. యిది కూడా గట్టిగా ఏడుస్తూ "చూడు సినిమాలో ఆ అక్క ఏడుస్తుంది. దానికి ఆ అన్నకావాలిట" అని ఏడ్చేది. దానికి సందర్భం ఎలా అర్థం అయిందా అని ఆశ్చర్యం. సంతోషం కలిగేది.

మా సుధ పుట్టక మునుపు మా శకుంతల చిన్న వయసులో ఆట సామాన్లు పెట్టుకుని ఆడుకుంటూ వుండేది. నా హ్యాండ్‌బ్యాగ్ ఒకటి కొద్దిగా చిరిగిపోవడం వల్ల దానికి ఆడుకోవడానికిచ్చేశాను. అది ఆ బ్యాగ్‌ను ఒక కోట్ స్టాండుకు తగిలించింది. ఆ కోటు స్టాండు కెదురుగా ఒక కిటికీ వుండేది. ఒక రోజు రాత్రి దొంగతనం జరిగింది. తరువాత చూస్తే కోటు స్టాండుకు తగిలించి వున్నబ్యాగ్ కనిపించలేదు. ఇంకా మా వారి చొక్కా కూడా లేదక్కడ. అవి టెర్లిన్ చొక్కాలు కొత్తగా వచ్చిన రోజులు అంతకు ముందు మా వారు వాడ్తున్నవి కాటనే. మా వారు ఏరికోరి కొనుక్కున్న చొక్కా అది. ఒక బనీను కూడా వుంది కోటుస్టాండుకి. కానీ మర్నాడు చూస్తే పక్కయింటి ఆవరణలో ఆ పాత హ్యాండ్ బ్యాగ్, పాత బనీను మాత్రం వున్నాయి. చొక్కా మాత్రం లేదు. మావారికి నవ్వొచ్చింది. "వాడికి ఆ చిరిగిన పర్సు, బనీను కావలసి రాలేదు. కొత్త టెర్లిన్ చొక్కా మాత్రం తీసుకెళ్ళాడు. పాపం ఆ పర్సులో డబ్బుకి బదులు శకుంతల ఆటకి పెట్టుకున్న బస్సు టికెట్లు వున్నందువలన వాడికాపర్సు అవసరం లేకపోయింది, బనీను కావలసి రాలేదు" అన్నారు జోక్‌గా. నా కసలే కొత్త టెర్లిన్ చొక్కా పోయిందని బాధగా వుంటే మావారి జోక్సూ, నవ్వూ. నాకు ఒళ్ళుమండిపోయింది. ఆయనకంతా హ్యూమరే.

మా శకుంతలని స్కూల్లో చేర్పించాకి మా వారు అప్పుడపుడు దాని స్కూలుకి వెళ్ళి వస్తుండేవారు. ఆ స్కూలు ప్రారంభించిన కొత్తలో క్లాస్‌రూమ్‌లు తడికెలతో వుండేది. అందువలన సందులోంచి దాని క్లాసు చూస్తుండేవారు. అలాగ ఒకసారి తెలుగు క్లాసు చూసారు. ఆ తెలుగు టీచరు శకుంతలలాంటి కొంతమంది పిల్లలకు అర్థం అవ్వడం లేదని తమిళంలో మాట్లాడేది. తరువాత ఆమెను కలుసుకుని "మా శకుంతలతో తెలుగే మాట్లాడండి, దానికి తెలుగు బాగారావాలి. తమిళంలో మాట్లాడవద్దు" అని చెప్పారు. ఇంట్లో దాన్ని మేము "అరటి" రాయవే అంటే "అర" అని తెలుగులో రాసి ఇంగ్లీషులో T రాసి చేర్చేది. మేము నవ్వుకునేవాళ్ళం. "అర T" చూసి.

మా సుధ యింకా పుట్టలేదు. మా శకుంతలకి మూడేళ్ళో, రెండేళ్ళో, వుంటాయి. ఆ సమయంలో ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ వచ్చింది. మా బావగారు వాళ్ళ పెద్దమ్మాయి పద్మని, వాళ్ళ చుట్టాలమ్మాయిలని పిల్చుకుని గూడూరు నుంచి వచ్చారు. వాళ్ళు ఒకరోజు నాలుగైదు ప్రోగ్రాంలు వేసుకుని పొద్దున్నే టిఫిను తిని వెళ్ళారు. మా వారు సాయంత్రం కొంచెం ముందుగా ఆఫీసు నుంచి వచ్చి, "ఇవాళ సిట్టింగ్ లేదు. మనం కూడా ఎగ్జిబిషన్‌కు వెళదామా" అని అడిగారు. నేను సరే అనగానే మేమందరం వెళ్ళాం. అక్కడ అవీ ఇవీ కొని మా వారు ఇంకేదో కొందామంటే, నేను "ఎందుకు డబ్బు దండగ. మనం ఇంటికి వెళ్ళడానికి డబ్బులుండొద్దూ" అని అన్నాను. ఇంకో చోట వెళ్తున్నాము. మా వారు శకుంతలని ఎత్తుకుని నడుస్తున్నారు. విపరీతమైన జనం. ఆ గుంపులోంచి నడుస్తూ ఒక చోట ఒక చిన్న వస్తువు ధర ఎక్కువలేనందున మా శకుంతలకైనా కొందామని పర్సు తీద్దామని ప్యాంటు జేబులో చెయ్యి వేసారు, జేబు ఖాళీ. పర్సు లేదు. ఎవరో కొట్టేశారు. మిగతావి ఏమైనా కొనేమాట ఎలా వున్నా, మేము ఇల్లు చేరుకునేది ఎలా? నేను హ్యాండ్ బ్యాగ్ కూడా తీసుకెళ్ళలేదు. నాకు మూడ్ అవుట్ అయిపోయింది. అంతవరకూ సంతోషంగా తిరిగిన దాన్ని ఠపీమని బెలూన్ పగిలినట్లయింది. మెల్లిగా గుంపును తప్పించుకుంటూ ఇవతలకు వచ్చాం. ఇంటికి ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాం. అరే! మా బావగారు వాళ్ళుకూడా ఇంకో గేటు బయట నిల్చున్నారు. మావారు "మీరు లోపలికి వెళ్తున్నారా, అక్కణ్ణుంచి వస్తున్నారా" అని అడిగితే "మేము ఇప్పుడే లోపలికి వెళుతున్నాము,

టికెట్లు కొన్నాం అన్నారు." మా ప్రాణాలు లేచి వచ్చాయి. జరిగినదంతా చెప్పి మా బావగారి దగ్గర నుంచి బస్సు చార్జీలకి డబ్బులు తీసుకుని ఇల్లు చేరాము మొత్తానికి. మా బావగారు కనుక లోపలికి వెళ్ళిపోయివుంటే మా సంగతి అంతే.

మా సుధ పుట్టిన తరువాత హైదరాబాదులో దాన్ని చాలా అపురూపంగా చూసుకుని ముద్దాడేవారు. ఇక మదరాసు ప్రయాణం దగ్గర పడే కొద్దీ నాకు భయం. ఈసారి కూడా ఆడపిల్లే అని దాన్ని మామగారు వాళ్ళు సరిగ్గా చూసుకుంటారో లేదో అని భయపడేదాన్ని. పైగా మా మామగారికి గూడూరులో మనవరాళ్ళే ఎక్కువ నంబరు కదా అని ఆలోచించేదాన్ని. రైలు ఎక్కిన తరువాత కూడా మా నాన్నగారితో అదే అభిప్రాయాన్ని వెల్లడించాను. మా మామగారు దీన్ని చేరదీస్తారో లేదో అని ఏడ్చేదాన్ని.

మా నాన్నగారు "అలా ఎందుకు అనుకుంటావు. ఇది కూడా ఆయన మనవరాలే కదా. ఆయన అటువంటివారు కాదు. నాకు తెలుసుగా, వూరికే ఏదో మనసులో ఊహించుకుని బాధపడవద్దు" అని నన్ను ఊరడించారు.

మదరాసుకు రాగానే నేను చెడుగా ఊహించుకున్నాను అనుకుని సిగ్గుపడ్డాను. నిజానికి మా సుధ ఆయనకి నెత్తిమీద దేవతే అయింది. మా శకుంతల, సుధ దెబ్బలాడుకుంటుంటే సుధనే వెనకేసుకొచ్చేవారు. పైగా అది గట్టిగా ఏడ్చి సాధించేది. అలాగని ఆయనకి శకుంతల మీద ఆప్యాయత లేకపోలేదు. అది స్కూలు నుంచైనా, కాలేజి నుంచైనా ఆలస్యంగా వస్తే కిటికీ దగ్గర నుంచొని దానికోసమే ఎదురు చూసేవారు. "పాపం దానికి బస్సు దొరకలేదేమో" అనేవారు.

మా పిన్నిగారు, మా బాబాయి, ఆయన ఎ.సి.టి.ఓ.గా చేసి రిటైర్డ్ అయ్యాక హైదరాబాదులోనే ఇల్లు కట్టుకుని అక్కడే సెటిల్ అయిపోయారు. అప్పుడప్పుడు సెలవుల్లో నేను పిల్లలిద్దరినీ పిల్చుకుని హైదరాబాదుకు వెళ్ళినప్పుడల్లా మా పిన్నిగారింటికి వెళ్ళి రెండు మూడు రోజులుండి వస్తుండేదాన్ని. ఒకరోజు రాత్రి భోజనాలు అయినతర్వాత 9.30 గంటలకు మేమంతా ముందున్న వరండాలో, అది వేసవి అవటంవలన ఆరు బయట కొంతమంది కుర్చీలు వేసుకుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాము. మా సుధ రెండు సంవత్సరాల పిల్ల. అది నిద్రపోయింది. ఉన్నట్టుండి మా శకుంతల గట్టిగా ఏడుస్తూ గదిలోంచి వస్తూంది. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. హడలిపోయి ఒక్క ఉదుటున లోపలికి పరిగెత్తాము. మా పిన్ని అయితే చాలా బెంబేలు పడిపోయింది. ఏ పిల్లినో చూసి చీకటిలో భయపడిందేమో. అసలది లోపలికి ఎప్పుడు వెళ్ళిందో ఎవ్వరూ గమనిచలేదు. మా పిన్ని "ఏమ్మా నీళ్ళు కావాలా తాగడానికి. లోపలికి ఎందుకు వెళ్ళావు? భయపడ్డావా?" అని కంగారుగా అడిగింది. మా శకుంతల గట్టిగా నవ్వుతూ, కళ్ళనీళ్ళు తుడుచుకుని "అబ్బే! వుత్తినే. ఇవి కన్నీళ్ళు కావు. నీళ్ళు రాసుకున్నా ముఖానికి. మిమ్మల్నందరిని ఆట పట్టిద్దామని ఇలా చేసాను" అంది. మా పిన్ని "అబ్బా" అని ఊపిరి వదిలింది. మా అమ్మమ్మ "మీ నాన్న సినిమాల్లో నువ్వు నటించవచ్చే. బలేదానివే. అందరిని ఏమార్చేసావు" అంది. ఇలా చిన్నతనంలో చాలా అల్లరి చేసేది. ఒకసారి మా రఖుమ మదరాసులో వున్నప్పుడు నేను కూరగాయలకి వెళ్ళి వచ్చేసరికి ఇంటి తలుపులు బార్లా తెరిచి వున్నాయి. ఎవ్వరూ కనిపించలేదు. సరే కాళ్ళు కడుక్కుందామని వెనకవైపు వున్న బాత్‌రూంకి వెళ్తే, అక్కడ బావామరదళ్ళు శకుంతలని ముందుపెట్టుకుని, దాని ముఖం రుద్దుతూ కుస్తీ పడుతున్నారు. విషయమేమిటంటే అది ముఖం నిండా కాటుక పూసుకుందట. అక్క వచ్చి ఏమంటుందోనని మా రఖుమకి భయమేసిందంట.

మా సుధ అయితే "అమ్మా, నీకు నేను సహాయం చేస్తా"నంటు పనిమనిషి తోమి బయటపెట్టిన గిన్నెలు అన్నీ వంటింట్లోకి పరిచిపెట్టేది. అసలు అది నాకు డబుల్ పని అని దానికి తెలిసేదికాదు. దానికి రెండున్నర సంవత్సరాలు వచ్చిన తర్వాత ఎదురుగా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు స్కూలు బ్రాంచిలో యల్.కెజికి చేర్పించాము. దాన్ని దిగపెట్టడానికి మేమెవరైనా వెళ్తే గేటు లోపలికి రానిచ్చేదికాదు, "గంట కొట్టేస్తారు వెళ్ళిపోండి" అనేది.

రెండేళ్ళకే మేము టి.నగర్ నుంచి కోడంబాకంలో వున్న మా స్వంత ఇంటికి అంటే డైరెక్టర్స్ కాలనీ ఇంటికి మారాము. మా సుధాని దగ్గరలో వున్న డి.ఏ.వి స్కూల్లో చేర్పించాం. టి.నగర్‌లో యు.కె.జి చేసినా కూడా వయస్సు చాలదని మళ్ళీ యు.కె.జిలోనే చేర్చుకున్నారు. అది ఇంటికొచ్చాక ఎడమ చేత్తో ఒక పుస్తకం పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ ఏదో చెప్తుండేది. మేమెవరైనా యధాలాపంగా ఆ సైడు వెళితే కుయ్యో మొర్రో అని అరుస్తూ " మా పిల్లల్ని, వాళ్ళ పుస్తకాలని తొక్కుకుంటూ వెళుతున్నారు. మీరు ఎవ్వరూ ఇటు రావద్దని" గోలెత్తేది. మొదట్లో మాకేం అర్థం కాలేదు. తర్వాత తెలిసింది దాని ఐడియాలో అది క్లాసు టీచరు, దాని ఎఉరుగుండా పిల్లలు వరుస తీర్చి కూర్చుని పుస్తకాలు ముందేసుకున్నారు. మేమంతా వాళ్ళని తొక్కుకుంటూ వెళ్తున్నామని దాని బాధ. మాకు ఆశ్చర్యం వేసింది దాని ఊహకి. దానికి క్రియేటివ్ నాలెడ్జి చాలా ఎక్కువ. వాళ్ళక్క శకుంతల లాగే. సుధా క్రియేటివ్ నాలెడ్జి అది పెరిగి పెద్దది అవుతున్న కొద్దీ డెవలెప్ అయ్యి, పెళ్ళికి ముందు కొన్ని వుద్యోగాలు చేసినా, పెళ్లైన తరువాత, కొడుకు పుట్టాక కూడా వాళ్ళ నాన్నగారికి స్క్రిప్టులో సహాయం చేస్తూ స్క్రిప్టు అసిస్టెంట్ గా చలామణి అవుతోంది. అందువలన మావారి వయస్సు 70 దాటిన తరువాత ఇది స్క్రిప్టులో సహాయానికి చేరేసరికి వారికి చాలా రిలీఫ్‌నిచ్చింది. 'ఘటోత్కచ' సినిమా టైటిల్స్‌లో 'స్క్రిప్టు అసిస్టెంట్ సుధా కార్తిక్' అని వుంటుంది. కొడుకును స్కూల్లో చేర్పించి, కథ డిస్కషన్‌కి పదిగంటలకు వచ్చి మూడుగంటలకల్లా ఇంటికి వెళుతూ వుంటుంది.

మా నాన్నగారు భీమవరంలో రిటైర్ అయి వచ్చింతరువాత, హైదరాబాదులోనే తాము అద్దెకు వున్న ఇంటి పక్కనే రెండు గ్రౌండ్లు స్థలముంటే కొన్నారు. ఇల్లు మొదలు పెడదామంటే మా చిన్న చెల్లెలు రఖుమ పెళ్ళికి రెడీగా వుంది. దానికి సంబంధాలు చూడాలి. ప్రస్తుతానికి అది స్కూలు టీచరుగా పనిచేస్తోంది. అందుకే అది మదరాసు తరచూ రావడం కూడా మానేసింది. దానికి సంబంధాలు చూస్తున్నారు. మా నాన్నగారు రిటైర్ అయిన తరువాత వచ్చిన డబ్బు వుంది కదా అని మెల్లిగా ఇల్లు ప్రారంభించారు. కట్టడమే రెండు వాటాల వీలుగా కట్టించారు. మధ్య రూములో మాత్రం ఒక ద్వారబంధం పెట్టించారు. అద్దెకు ఇస్తే అది మూసి తాళం పెట్టవచ్చని గోడలు మాత్రం లేచాయి. మిగతా పనులు ఇంకా అవలేదు. ఇంతలో మా చెల్లెలికి ఒక సంబంధం నిశ్చయమైంది. 1975 మే నెల 30 వ తేది నిశ్చయమైంది. వేసవి సెలవులకి పిల్లలు, నేను మా నాన్నగారు రమ్మంటే వెళ్ళాము. పెళ్ళి మండపం వెతకాలి. మావారు, ఒక నిర్మాత రాధాకృష్ణమూర్తిగారికి కూడా సబ్జెక్ట్ మీద పని చేయడానికి, అంటే ఆ సమయంలో హిందీ సినిమా 'దోస్తీ'? తెలుగులో తీయడానికి పని చేయడానికి హైదరాబాదులో అన్నపూర్ణ హోటల్‌లో వుంటూ వచ్చారు. అప్పుడప్పుడు నేను, మా వారు కల్యాళమండపానికి ఫోన్లు, చేస్తూ వుండేవాళ్ళం. వ్యవధి ఎక్కువ లేనందున ఏ మండపం దొరకలేదు. మావారు హోటల్లో వుంటూ ఇంటికి వచ్చి భోజనం చేసి మళ్ళీ హోటల్‌కు వెళ్ళి అక్కడే పడుకునేవారు. మావారు ఖాళీగా వుంటున్న సమయంలో ఫోన్లు చేసి ఆఖరికి కాచిగూడాలో వున్న నటరాజ్ హోటల్లోనే కళ్యాణమండపాన్ని అరేంజ్ చేసి రెండుమూడు గదులు వున్నందున సర్దుబాటు చేసి పెళ్ళి జరిపించడానికి నిశ్చయించుకున్నాము.

ఇక మా నాన్నగారికి పెద్ద మొత్తం ఇంటికి పెట్టడం వలన పెళ్ళి ఖర్చులకు చాలా ఇబ్బంది అయింది. మా వారు తనకు తోచిన సహాయం తాను చేస్తాను అన్నారు. అన్నపూర్ణ హోటల్లో డిస్కషన్ అయిపోయిన తరువాత మా వారు మదరాసు వెళ్ళిపోయారు. పెళ్ళి ఇక రెండు నెలలేకదా? అందుకని నేను పిల్లలు హైదరాబాదులోనే వుండిపోయాము. ఆ రోజుల్లో మాకు మాత్రం అంత డబ్బు ఎలా వుంటుంది? మా వారు 'దిక్కోట పార్వతి' అవార్డు పైకము ఐదువేలు వుంది కదా అనే ధైర్యంలో వున్నారు. కానీ దాని ప్రొసీజరు బొంబాయికి వెళ్ళి ఆ బాండ్స్ క్యాష్ అయి రావడానికి ఆరునెలలు పడుతుందట. ఎలాగా? ఆ కాలంలో అది పెద్ద మొత్తం కదా! ఎవర్ని అడుగుతారు? డి.వి.నరసరాజుగారి దగ్గరికి వెళ్ళి ఆయనకి బాండ్స్ విషయము చెప్పి ఐదువేలు లోన్ తీసుకుని, మా నాన్నగారికి ఇన్‌స్టాల్‌మెంట్లలో పంపుతూ వుండేవారు. తాను పడ్డ ప్రయత్నాలు మావారు వుత్తరాలు రాస్తూ, మా నాన్నగారికి చెప్పొద్దని రాసేవారు.

వారి దగ్గర నుండి రిజిష్టరు పోస్టు వచ్చినప్పుడల్లా పెళ్ళికి పదిరోజులు ముందుగానే వచ్చిన మా మేనత్త ఎలాగో పసికట్టి "అమ్మలూ, మదరాసు నుంచి ఏదో రిజిష్టరు పోస్టు వచ్చినట్టుంది. మీ ఆయనే డబ్బు పంపివుంటాడ"ని ఆరా తీసేది.

మళ్ళీ సినిమా డిస్కషన్‌కు మావారు హైదరాబాదుకు రావలసి వచ్చింది. మా యింటికి వచ్చి, పెళ్ళికొడుకు, అదే మా చెల్లెలికి కాబోయే భర్త వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన ఒక పి.జి అనీ, యల్.ఐ.సిలో పనిచేస్తున్నారనీ, బ్రాంచ్ ఆఫీసు బషీర్‌బాగ్‌లో వుందని చెప్పారు. "నేను వారి ఆఫీసుకు వెళ్ళి చూడొచ్చా" అని అడిగారు.

"దానికేం వెళ్ళి చూడండి" అన్నారు మా నాన్నగారు.

మొదటి నుంచీ మా చెల్లెలి కోరిక ఏమిటంటే పెళ్ళికి ముందే ఆయనను వాళ్ళ బావగారు చూసి ఓ.కే చేసిన తరువాతనే అది పెళ్ళి చేసుకోవాలని. కానీ అవకాశం రాలేదు. దాని పెళ్ళిచూపులకి వెళ్ళలేకపోయాము.

సరేనని, మా వారు వెళ్ళిపోయారు. రెండు మూడు గంటలైన తరువాత మా చెల్లెలు ఇంట్లోకి, బయటికి, వీధిలోకి తారాట్లాడుతోంది. బావగారు వచ్చి ఏమి చెప్తారో ఏమో అని. అలా అది వాళ్ళ బావకోసరం ఎదురు చూస్తుంటే నాకు నవ్వు వచ్చింది. దానికి తెలుసు మా వారు బస్సుల్లో తిరగరు. ఆటోలో వస్తారని. ఇంకొంతసేపటికి ఆటోదిగి లోపలికి వస్తూనే మా నాన్నగారిని కలుసుకోకుండా "రఘుమా, కంగ్రాచ్యులేషన్స్.. నీ సెలక్షన్ చాలా బావుంది" అని ఆయన్ని ఎలా కలుసుకున్నారో చెప్పారు. "మొదట నేను వెళ్ళాను. ఎవరో ముందు రూములో స్టాఫు వుంటే ఏ.వి.రామకృష్ణారావు ఎవరు అని అడిగితే, ఆయన నన్ను రామకృష్ణారావుగారి దగ్గరకి తీసుకెళ్ళి ఆ పెద్దమనిషి వెళ్ళిపోయారు. "హలో, రామకృష్ణరావుగారు, నేను విఠల్‌రావుగారి పెద్ద అల్లుడిని సింగీతం శ్రీనివాసరావు" అని పరిచయం చేసుకున్నాను. ఆయన్ని చూడకపోయినా, ఆయన గురించి, ఆయన చేసిన సినిమాల వల్ల తెలిసిన మూలాన ఆయన్ని వెంటనే రామకృష్ణారావుగారు గుర్తుపట్టారు. "రఘుమ నాకు మరదలు అయినా, మాకు తను పెద్దమ్మాయిలాగా. మిమ్మల్ని కలుసుకునేందుకు వచ్చాను అని చెప్పాను" అని అన్నారు మా చెల్లితో. అప్పుడు దాని మనసు కుదుటపడింది. తరువాత మా వారు మదరాసు వెళ్ళిపోయి పెళ్ళి వేళకు వచ్చారు.

ఇక పెళ్ళి రెండు నెలలు వుందా, మెల్లమెల్లగా బజారుకి వెళ్ళడం, మా నాన్నగారితో కోఠీకి వెళ్ళడంలాంటివి మొదలుపెట్టాము. మా పెద్ద చెల్లెలు సెలవుల మూలాన వాళ్ళాయన వుండే వూరికి వెళ్ళింది. పెళ్ళికి కొన్నిరోజులు ముందు వచ్చింది. అది వచ్చాక మా పిల్లలిద్దరూ వాళ్ళమ్మాయి తులసితో ఆడుకుంటూ వుండేవాళ్ళు. మా శకుంతలకన్నా తులసి ఒక ఏడాది చిన్న. వాళ్ళలా ఆడుకుంటూ వుంటే మా అమ్మ సుధ చిన్నపిల్లకదా అని "సుధా మీ అమ్మ తాతగారితో బజారు వెళ్ళిందమ్మా వచ్చేస్తుంది నువ్వు ఆడుకో అక్కావాళ్ళతో" అనేది.

"ఫరవాలేదు అమ్మమ్మా, మా అమ్మని మెల్లిగా రాని. నేను ఆడుకుంటున్నానుగా" అనేది. మా అమ్మకి ఆ చిన్నదాని మాటలకి జాలివేసేది.

ఇక పెళ్ళి ముహూర్తం రోజు దగ్గర పడ్తోంది. 1975వ సంవత్సరం మే 30 న పెళ్ళి. పెళ్ళివారు - వారి కుటుంబం కొంచెం పెద్దది. ఆరుగురు మగపిల్లలు. మా చెల్లెలు పెద్దబావగారు పెళ్ళిచేసుకోలేదు. రెండవ ఆయనకు పెళ్ళయింది. మూడవ కొడుకు భార్య నా చెల్లెలు. కానీ దాని పెళ్ళి అయి అప్పగింతలయ్యేసరికి మా నాన్నగారికి కొంచెం బాధ అనిపించింది. ఇంత పెద్ద కుటుంబంలో వేసానే దాన్ని అని. కానీ భగవంతుడి నిర్ణయం తప్పించలేము కదా. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుందని ఆయనే సమాధానపరచుకున్నారు. మా పెద్దచెల్లెలు సుశీల మేనరికం అయితే, పెళ్ళిలో మా వారు, మా నాన్నగారు కలిసి మాట్లాడుకుంటూ వుండడం, పైగా పెళ్ళి కూతురితో దాని అత్తవారింటికి మా అమ్మతో కూడా మేమిద్దరం వెళ్ళడం చూచి మేమే మేనరికం అని మగపెళ్ళివారు అనుకున్నారట.

మా వారు మదరాసుకు వెళ్ళాలని మగ పెళ్ళివారింట్లో ఒకేరోజు వుండి మరునాడు ఇంటికెళ్ళి మా నాన్నగారితో పెళ్ళికొడుకు తల్లి చాలా మంచిదని, చాలా నెమందస్తురాలని రఘుమ గురించి మీరేమీ దిగులు పడవద్దని చెప్పేసరికి అల్లుడి మాటలు విని మా నాన్నగారికి దిగులు తగ్గి ధైర్యం వచ్చింది. మా చెల్లెలింట్లో ఏ పండగ వచ్చినా అందరూ ఒకచోట కలవాల్సిందే ఇప్పటికీ అలాగే వున్నారు. మా చెల్లెలు జీవితం సంతోషంగానే గడిచింది. నేను సెలవలకి పిల్లల్ని పిల్చుకుని హైదరాబాదుకు వెళ్ళినప్పుడల్లా మా చిన్న చెల్లెలు కూడా పిల్లల్ని పిల్చుకుని అమ్మ యింటికి వచ్చేది. వాళ్ళది యల్.ఐ.సి బదిలీ వుద్యోగం అయినందున అది వేరే వూళ్ళో వున్నా కూడా, నేను హైదరాబాదుకి వెళ్ళినప్పుడల్లా వాళ్ళత్తగారిని చూసి వచ్చేదాన్ని. "మీ చెల్లెలు ఈ వూళ్ళో లేకపోయినా నన్ను చూడ్డానికి వస్తున్నావు. చాలా సంతోషం అమ్మా" అనేది ఆవిడ. మా శకుంతల పెళ్ళికి ఆవిడ, పెద్దకొడుకు వచ్చి వెళ్ళారు. ఇప్పుడు ఆవిడ లేరు.

**1972వ** సంవత్సరంలో మా నాన్నగారి దగ్గర్నుండి ఒక వుత్తరం వచ్చింది. మా అమ్మమ్మగారికి జబ్బు చేసిందని. ఆవిడ పరిస్థితి ఎలా వుంటుందో, ఒకరి వచ్చి వెళ్ళమని రాసారు. వెంటనే నేను, పిల్లలు హైదరాబాదు వెళ్ళాము. ఒక వారం వుండి వచ్చాము. మేము మదరాసుకు తిరిగి వచ్చేటప్పుడు మా చిన్న చెల్లెలు రఘుమ కూడా పదిరోజులుండి వెళ్దామని, స్కూలుకి శెలవులు కదా అని మాతో మద్రాసు వచ్చింది. అది బి.యిడి పాసయి హైదరాబాదులో సెంట్ ఆన్స్ స్కూల్లో టీచరుగా పనిచేసేది. మా అమ్మమ్మగారు బాగానే వున్నారు కదా అని వచ్చింది. కొన్నాళ్ళుండి ఎందుకో దానికి వెళ్ళిపోవాలనిపించి వారం పదిరోజులుండి వెళ్ళిపోయింది. కానీ హైదరాబాదు చేరిన ముందురోజే మా అమ్మమ్మ చనిపోయింది. మా నాన్నగారు ఇచ్చిన టెలిగ్రాం మాకు సరిగ్గా చేరలేదు. కానీ మా శకుంతల స్కూలు వలన, మావారి పనుల ఒత్తిడి వలన వెళ్ళలేకపోయాను. అందుకని సంవత్సరికాలకి వెళ్ళాను. మూడు రోజులు చేస్తారు కదా? రెండవ రోజు రాత్రి మావారి దగ్గర నుంచి, కర్నూలు నుండి మా బాబాయిగారింటికి ఫోను వచ్చింది. బాబాయి ఇంటి నుంచి అమ్మ ఇంటికి నాలుగైదు కిలోమీటర్లు దూరం. ఆయన స్కూటరులో వచ్చి నన్ను పిల్చుకెళ్ళారు. మా నాన్నగారికి ఇది తెలిసి "అమ్మలూ, మీ ఆయన్ని వీలుంటే వెంటనే బయలుదేరి రమ్మన్నానని చెప్పు" అని అన్నారు.

నేను మా బాబాయిగారింటికి వెళ్ళి అన్ని మాటలు మాట్లాడి నాన్నగారు హైదరాబాదుకి రమ్మన్నారని, ఈ రాత్రికే బయలుదేరి వస్తే రేపు అమ్మమ్మ సంవత్సరీకం మూడవ రోజు అని చెప్పాను. ప్రయత్నిస్తానని చెప్పారు. మరునాడు ప్రొద్దున్నే కర్నూలు నుంచి దిగారు. మా కందరికి చాలా సంతోషం అయింది. పైగా మా అమ్మమ్మకి ఈయన అంటే చాల ఇష్టం కూడా. ఆవిడ అభిమానానికి తగ్గట్టుగా వచ్చినందుకు చాలా సంతోషంగా వుంది.

అసలు ఏం జరిగిందంటే, మా వారు రాకముందు నేనూ, పిల్లలూ వెళ్ళాము కదా. నేనూ, మా నాన్నగారు మాట్లాడుకుంటూ కూర్చున్నాము. మావారి ప్రాజెక్టు గురించి యధాలాపంగా అడిగారు. మా నాన్నగారు. మామూలుగా మాట్లాడుతూ ఫిలిం ఇండస్ట్రీకి హౌసింగ్‌బోర్డ్ లోన్ ఇస్తుందనీ, రెండు బెడ్ రూముల ఫ్లాటు కట్టి ఇన్‌స్టాల్‌మెంట్ బేసిస్‌లో వసూలు చేస్తారని, దానికి మంత్రి రాజారాం సహాయం చేసారు గనుక  దానికి రాజారాం ఫిలిం డైరెక్టర్సు కాలనీ అని పేరు పెడ్తారని, ఇనీషియల్ పేమెంటు 2,500రూపాయలు కట్టాలని చెప్పాను. "మీరు కట్టారా?" అని అడిగారు. "సర్దుబాటు కాలేదు పైగా పిక్చర్సు ఎలా వస్తాయో తెలీదుకదా" అన్నాను.

మా వారు కర్నూలు నుంచి రాగానే మా నాన్నగారు ఆయన్ని పిలిచి, హౌసింగ్ బోర్డు విషయమంతా కల్యాణి చెప్పిందని, ఈ అవకాశం వదులుకోకూడదు అని, ఆ పైకము తాను ఇస్తానని, వెంటనే అప్లయి చేయమని 2,500రూపాయలు ఇచ్చారు. మావారు మదరాసుకి వెళ్ళి వెంటనే అప్లయి చేసారు. కొంచెం ఆలస్యం అయినందున రెండవ లిస్టులోకి వచ్చింది.  కొన్నాళ్ళు దాని విషయం

మర్చిపోయాము. అంత పట్టించుకునే వాళ్ళం కాదు. ప్రొడ్యూసర్లు, డైరక్టర్లు కాక మిగతా టెక్నీషియన్స్ అందరూ అప్లయి చేసారు. వాళ్ళ కుటుంబ సభ్యులను మేము కలిసినప్పుడల్లా అనవసరంగా అంత డబ్బు కట్టాము, బ్యాంకులో వేసుకున్నా వడ్డీ వచ్చేది అని ఒకటే నస పెట్టేవారు. ఇలా రెండు మూడేళ్ళు గడిచిపోయాయి. ఒకరోజు డిశంబరు 13వతేదీన మా శకుంతల పుట్టిన రోజు అని మేము గుడికి వెళ్ళి వచ్చేసరికి హౌసింగ్ బోర్డు నుంచి మాకు ఒక ఫ్లాట్ అలాట్ అయిందని లెటరు వచ్చింది. ఏ నెంబరు ఫ్లాటు కావాలో వచ్చి చూసుకోమనీ, వెంటనే 50,000రూపాయలు కట్టమని వచ్చింది. మా ఆనందానికి అవధులు లేవు. పైగా మా శకుంతల పుట్టిన రోజున వచ్చింది. వెంటనే డబ్బు కట్టి వెళ్ళి ఫ్లాటు 5-డి అని సెలెక్ట్ చేసుకున్నాం. దానికున్న ప్రత్యేకత ఏమిటంటే సౌత్ ఫేసింగ్, ముందు వైపున ఖాళీ స్థలం. ఆ పక్కన రోడ్డు. క్రమంగా మా ఫ్లాటును ఆనుకుని ఒక గుడి వెలిసింది. మేము సెలెక్ట్ చేసుకున్న తరువాత చాలా మంది ఈ ఫ్లాటును అడిగేవారట. కానీ సింగీతం శ్రీనివాసరావుగారికి అలాట్ చేసామని చెప్పారట. అది ఆయన కోరుకున్నారు అని చెప్పారట. ఇది అంతా మా నాన్నగారి చలువ, ఆశీర్వాదం అనుకున్నాం.

మేము గృహప్రవేశానికి ముహూర్తాలు పెట్టుకున్నాము. నాలుగు రోజులు తరువాత హైదరాబాదులో మా నాన్నగారి ఇంటి గృహప్రవేశం కూడా వున్నందున మా నాన్నగారు రాలేదు. మా అమ్మ, మా చిన్న చెల్లెలు వచ్చారు. అంతక్రితమే మా రఖుమాకి పెళ్ళైయింది. గుడూరు నుంచి మా బావగారు, తోటికోడలు, మా పద్మ వాళ్ళు మొత్తం వచ్చారు. పద్మ కొడుకు పదినెలలవాడు. గృహప్రవేశానికి యస్.రాజేశ్వర రావుగారు వచ్చారు. ఆయన అప్పటికే మా వారికి రెండు సినిమాలకి సంగీతం కూర్చారు. ఆయన నాకు ఒక పట్టుచీర, మా వారికి జరీ పంచె చదివించారు. ఇంకా పసుమర్తి కృష్ణమూర్తిగారు, జాగర్లమూడి రాధాకృష్ణమూర్తిగారు, హీరో రంగనాథ్, వారి సతీమణిగారు, నవతా కృష్ణంరాజుగారు, వారి భార్య, కుటుంబం ఇంకా చాలామంది వచ్చారు. ఆ రోజుల్లో వరుసగా మా వారికి చాలా సినిమాల్లో హీరో రంగనాథ్‌గారే. గృహప్రవేశం బంధువులు, ఆ కాలనీవారు, స్నేహితుల సమక్షంలో రంగ వైభవంగా జరిగింది. మొత్తం మీద మావారి కల నెరవేరింది స్వంత ఇల్లు కొనాలని. మాకా ఇల్లు విశాలంగా వెలుతురుగా పెద్దదిగా కనిపించింది. ఇంద్రలోకంలో నివసిస్తున్న ఫీలింగ్ వచ్చింది.

మకాం మాత్రం ఇంకా మార్చలేదు. ఎందుకంటే అప్పుడు మేమున్నది టి.నగర్‌లో. మా శకుంతల స్కూలుకి రిక్షాలో వెళ్ళేది. మా సుధని మా యింటికెదురుగా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ స్కూలు బ్రాంచ్ వుంటే అక్కడ చేర్పించాము. మా కొత్త ఇల్లు కోడంబాకం. అందుకని శెలవులిచ్చిన తర్వాత మారాము. అంతవరకు శుక్రవారం వెళ్ళి కొత్త యింట్లో దేవుడి దగ్గర దీపం పెట్టి వచ్చేదాన్ని. సరే, సామాన్లు చేరదియ్యాలిగా, మా బావగారబ్బాయి పూర్ణని రమ్మన్నాము. బర్కిట్ రోడ్ ఇల్లుగలాయనికి మేము యిల్లు మారడం యిష్టం లేకపోయింది. అది అద్దెకిచ్చి, తన యింట్లోనే వుండమన్నారు. కానీ మేము కొత్త ఇల్లు వదులుకుంటామా! మా వల్ల ఆయనకి, ఇల్లుగల వారి వలన మాకు, ఏ యిబ్బందీ కలగలేదు. ఎటొచ్చీ వాళ్ళ కోడలి గొడవ తప్ప. అంబుజమామి వాళ్ళు కూడా కొత్త యిల్లుకొని మాకంటే ముందే గృహప్రవేశం చేసుకున్నారు. కానీ వాళ్ళింకా యిల్లు మారలేదు.

బర్కిట్ రోడ్ ఇంట్లో వున్నప్పుడే ఇల్లుగలవారు కూడా మేడ్మీద వుండేవారు కదా. వాళ్ళకి ఒకే ఒక కొడుకు, కోడలు. ఆడపిల్ల, ఇద్దరు మగపిల్లలుండేవారు. తరువాత ఒక ఆడపిల్ల పుట్టింది. ఒకసారి మా చెల్లెలు రఖుమ మా వూరొచ్చినప్పుడు వుతకడానికి వేసిన బట్టల్లో ఒక జాకెట్టు కనిపించలేదు. బట్టలు ఇంటి బయట ఆవరణలోనేగా ఆరేస్తాము. జాకెట్టు పోయింది అనుకుంటుంటే ఇంటి వారి కోడలు వచ్చి "పక్కింటి మార్వాడీ వాళ్ళ పనిమనిషి కాజేసి వుంటుంది. ఈ విషయం మేడమీద కొచ్చి మా మామగారికి చెప్పొద్దు. నిన్నే తిడతారు అంత అశ్రద్ధ అని" అంది. రెండురోజులు తర్వాత అదే జాకెట్టు పైవాళ్ళ పనిమనిషి కిందకు వచ్చి వుతుకుతుంటే, అది నేను తీసిపెట్టుకుని ఆవిడని అడిగితే, పనిమనిషి మార్చేసి వుంటుంది అని తడబడుతూ చెప్పింది. అలాగ మెల్లమెల్లగా బాత్ రూములోంచి

సామాన్లు ఒక్కొక్కటీ మాయమవుతూ వచ్చాయి. ఇత్తడి చెంబు సైతం. ఆ సామాన్లు పోయిన్నాడే ఆవిడొక సినిమా ప్రోగ్రాం పెట్టుకొనేది. ఈ సామాన్లు అమ్మిన డబ్బుతో సినిమాలు చూస్తూ వాళ్ళబ్బాయికి వాడి స్నేహితులు టికెట్లు యిచ్చారని అబద్ధం చెప్పేది. పైగా వాళ్ళ మామగారితో మీ అబ్బాయి ఆఫీసునుంచి పాసులు తెచ్చారు రండి అని అత్త, మామలని కూడా సినిమాకి పిల్చుకెళ్ళేది. క్రమేపి తెలిసింది ఆవిడకి దొంగ బుద్ధి వుందని.

ఒకసారి పెళ్ళికి గూడూరు వెళ్ళాలని బట్టలు సర్దుతూ వుంటే నా నెక్లెస్ ఒకటి కనిపించలేదు. దాని పేరు ఢిల్లీ నెక్లెస్. స్పెషల్‌గా ఆర్డరిచ్చి చేయించింది. మా మామగారు నా పెళ్ళిలో ఇచ్చిన నగ. ఇల్లంతా గాలించాము. దొరకలేదు. మర్నాడు ప్రయాణం. ఎలాగ? మూడౌట్ అయిపోయింది. మావారన్నారు, "వెంటనే పోలీస్ కంప్లైంట్ యిద్దాం. నువ్వు ఎటూ వారం అయిం తర్వాత వస్తావుగా! మీ అమ్మావాళ్ళు ఇచ్చిన నెక్లెస్ వుందిగా, అది తీసుకెళ్ళు" అన్నారు. గూడూరికి వెళ్ళేనని మాటేకానీ ప్రాణం అంతా నెక్లెస్ మీదే వుండేది. తిరిగొచ్చాక మళ్ళీ పోలీసు స్టేషన్‌కి వెళ్ళి ఆ నెక్లెస్ డిజైన్ వేసి ఇచ్చాం. మేడమీదాయన వచ్చి లక్షా తొంభై ప్రశ్నలు వేశారు. మీకు ఎవరి మీదనైనా అనుమానం వుందా అని. అసలైతే మాకు వాళ్ళ కోడలిమీదే అనుమానం వుంది. కానీ ఆయనకు ఎలా చెప్తాం? ఏం తోచక గింజుకుంటున్నాం. ఇంతలో మా వారికి ఒక ఐడియా వచ్చింది. "అది తీసిన వాళ్ళు డబ్బు కోసమని ఏ షాపులోనైనా అమ్మి వుంటారు. కరిగించి వుండరు. మనం వెళ్ళి కొన్ని షాపులలో చూద్దాం. అక్కడ నువ్వేం మాట్లాడకు" అన్నారు.

మొదట పాండె బజారులో కొన్ని చిన్న చిన్న బంగారు షాపులు, మార్వాడి షాపులు ఆఖరుకి రాజరాజేశ్వరి జ్యూయలరీలో చూశాము. మా వారు మేము కొత్త నెక్లెస్ కొనడానికెళ్ళిన కలర్ ఇచ్చి "ఫలాన ఢిల్లీ నెక్లెస్ వుందా? మూడు, రెండున్నర సవర్లలో" అనడిగేవారు. షాపు వాళ్ళు ఆ తూకంలో వున్న నెక్లెస్‌లన్నీ చూపించేవాళ్ళు. కాదని తిరిగి వచ్చేశాము. మా ఇంటినానుకుని ముందు వైపు ఒక కిరాణా కొట్టు వుండేది. అతను మద్రాసు తెలుగు మాట్లాడేవాడు. "సార్ అక్కడా ఇక్కడా ఎందుకండీ, దొంగతనం చేసిన వాళ్ళు అంతదూరం వెళ్ళరు. మన వీధి చివర్లలోనే వడ్డీ వ్యాపారం చేసే మార్వాడీ షాపులో - పాన్ బ్రోకర్ షాపులు అక్కడ అడిగి చూడండి" అన్నాడు. మేము తిన్నగా ఒక షాపుకి వెళ్తే లేదన్నాడు. పోనీ సెకండ్ హ్యాండ్ నగలున్నాయా అని అడిగితే పక్కషాపు చూపించాడు. వెళ్ళి చూస్తే ఆశ్చర్యం. వాడు అదే నెక్లెస్ చూపించాడు. నేను వారిని మెల్లిగా గిల్లాను. వెల ఎంత అనడిగారు మావారు. వాడెంతో చెప్పాడు. మావారు బేరమాడారు. ఆఖరి ధర 400రూపాయలు అని చెప్పాడు. మేమంత డబ్బు తీసుకురాలేదు, మా యిల్లు దగ్గర్లోనే వుంది. ఇప్పుడే ఒక్క గంటలో వస్తామని చెప్పి, ఎంతవరకు షాపు తెరిచి వుంటుందని అడిగితే, వాడు రాత్రి పదిగంటలవరకు అన్నాడు నేనెంత సంతోషించానో ఆ భగవంతుడికే తెలుసు. వెంటనే మేడ్లీరోడ్‌లో వున్న పోలీసు స్టేషన్‌కి వెళ్ళి కంప్లైంట్ చేసి, డిజైన్ వేసి యిచ్చిన నెక్లెస్ ఫలాన చోట వుందని, మాతో రండి అని పిలుచుకు వెళ్ళాము. పోలీసులని చూడగానే ఆ షాపతను బిత్తరపొయాడు. " నెక్లెస్ నీకెక్కడిది" అని అడిగితే అతను ఒక ఆవిడ వచ్చి అమ్మిందని, ఆవిడకి 400రూపాయలు ఇచ్చాననీ, పైగా ఆవిడ ఒక గొప్పింటి వారి కోడలని చెప్పాడు. ఆవిడిల్లు ఈ వీధిలోనే అన్నాడు. అప్పుడు షాపతను, మేము, పోలీసు వాళ్ళు యింటికెళ్ళి జరిగినదంతా పట్టాభిరామన్ గారితో చెపితే అంతా విని ఆయన లోపల్నించి 400రూపాయలు తెచ్చి షాపతనికిచ్చి సారీ చెప్తూ ఇదంతా నాకు తెలియకుండా జరిగిందని క్షమాపణ చెప్పుకున్నారు. మ వారు పోలీసులతో కేసు కొట్టివేసేయమని, నగ ఎటూ దొరికింది కదా, పైగా ఆ పెద్దాయన మా నాన్నగారి స్నేహితుడు అని చెప్పి కేసు వాపసు తీసుకున్నారు.

ఆ తరువాత పట్టాభిరామన్‌గారు తన ఇంట్లో వున్న నగలు కూడా కోడలు అమ్ముతుందనీ, డబ్బు చేసుకుంటుందనీ భయం వేసి ఆ నగలు తానే అమ్ముదామని వెళితే అప్పటికే అవి నకిలీ నగలట. ఇంకోసారి వాళ్ళ మనవడు చదివే స్కూలు ప్రిన్సిపాల్ కనబడి "ఇప్పుడెలా వుందండీ మీ ఆరోగ్యం" అని పట్టాభిరామన్‌ని అడిగారు. "ఆసుపత్రి నుంచి ఇంటికెప్పుడు వచ్చారు? డబ్బుకావాలని, మీరు

ఆసుపత్రిలో వున్నారని, డిశ్చార్చి అవడానికి బిల్లుకట్టాలని, మీరు నన్ను అడిగి తీసుకురమ్మన్నారని మీ కోడలు వెయ్యి రూపాయలు అడిగి తీసుకుందండీ" అన్నాడట. కోడలి విషయం తెలుసు కనుక ఆ పెద్దాయన కొంత తమాయించుకుని 'ఇప్పుడు ఆరోగ్యం బాగుందండి. నేనే మీ స్కూలుకి వచ్చి యిస్తాను" అన్నాడట. సినిమా కన్నా విచిత్రంగా వుంది కదూ! ఆయన కోడలి దొంగతనాల లీలలు. ఇలా ఎన్నో సంఘటనలు ఎదురయ్యాయి. పక్కయింటి మామి, పిల్లలతో ఎంత హాయిగా వుండేదాన్నో మేడమీద వారి కోడలితో అన్ని యిబ్బందులు ఎదురయ్యాయి.

ఇల్లు మారాక మా శకుంతలని 6వతరగతి శారదా హైస్కూల్లో చేర్పించాము. కొన్నాళ్ళు బస్సు, కొన్నాళ్ళు ఇంకొక అమ్మాయితో సైకిల్ రిక్షా, ఇంకొంత కాలం సినిమా నిర్మాత పి. ఏకాంబరేశ్వర రావుగారమ్మాయి రాణితో వెళ్తూ వచ్చేది. మా సుధని మాత్రము దగ్గరలో వున్న డి.ఎ.వి స్కూల్లో చేర్పించాము. దీని స్కూలు దగ్గర వలన నడిచే వెళ్ళొచ్చు. మధ్యాహ్నం భోజనం వళ్ళీ అనే పనమ్మాయి తీసుకెళ్ళేది. అదే భోజనం పెట్టేది. ఎప్పుడైనా వాళ్ళ అమ్మను పంపితే, "దాన్ని పంపొద్దు. అది వళ్ళీలాగా కాదు" అని మారాం చేసేది. అది భోజనం అక్కడి మిగతా పిల్లలతో కలిసి తినడం అలవాటు అవుతుంది కదా అని పంపేవారం.

మా బావగారమ్మాయి పద్మ కొన్నాళ్ళు అంటే రెండు మూడేళ్ళు మా యింట్లో వుండి, Shrine Velanakanni Schoolలో టీచర్‌గా పనిచేసేది. కొన్నాళ్ళకి వాళ్ళ మేనమామ కొడుకుతో పెళ్ళి నిశ్చయమై పెళ్ళికి ముందు ఆరు నెలలకే గూడూరుకి వెళ్ళిపోయింది. మా బావగారు దాని పెళ్ళి ఖర్చులకని చాలా ఇబ్బంది పడ్డారు. వాళ్ళబ్బాయిలిద్దరూ ఒక ఆటోమొబైల్ షాపులో పనిచేసేవారు. రెండో అబ్బాయి స్కూలు ఫైనల్ పాసయ్యాడు. ఆ కాలంలో మాకు తోచిన సహాయం చేసాము. మిగిలిన ఖర్చులు, ప్రజంటేషన్స్ అవీ వుంటాయి కదా. దానికి ఆ కాలానికి బట్టే అయింది. ఆ రోజుల్లో మాకు మాత్రం ఎలా వస్తుంది డబ్బు. పైగా మా శకుంతల పుట్టేంత వరకు నా ఆస్పత్రి ఖర్చులు, అబార్షను, మందులు, మాకులు చాలా ఖర్చైంది. మావారు మెడికల్‌కి నెలనెలా బ్యాంకులో వేస్కోవాలి అని మొదటి నుంచి మొత్తుకుంటున్నందుకు తగ్గట్లుగా ఖర్చయ్యేది. ఆయన ఈ మాట మొట్టమొదట నాతో ఏ సమయంలో చెప్పారో పాఠకులకు తెలిస్తే నవ్వుతారు. చెప్పనా! పెళ్ళయిన మర్నాడే

మా పద్మ మదరాసులో వున్నప్పుడే స్కూల్లో పనిచేసేది కదా! ఎప్పుడైనా టీచర్లతో సినిమా ప్రోగ్రాం పెట్టుకుంటూ వుండేది. అలాంటప్పుడు దాని ప్రోగ్రామ్ లేనప్పుడు, నేను, మావారు సినిమా ప్రోగ్రామ్ పెట్టుకునే వాళ్ళం. మా మామగారు కూడా వుండేవారు కదా పిల్లలను పద్మ చూసుకునేది. అలాగే ఇంటర్నేషనల్ ఫిల్మ్స్, ఏవైనా ఇంగ్లీషు పిక్చర్సుకి వెళుతుండేవాళ్ళం. నేను ఎప్పుడైనా పుట్టింటికి హైదరాబాదుకి పిల్లల్ని పిల్చుకుని వెళ్తే వంట తానే చేస్తూ అలవాటు చేసుకునేది. పద్మ వాళ్ళ చిన్నాన్నని, తాతగారిని చూసుకుంటూ వుండేది. ఎప్పుడైనా మా చెల్లెలు రఖుమా వస్తే ఇద్దరు కలిసి ఒకరినొకరు తోడుగా వుండేవాళ్ళు. మా రఖుమ పద్మ కన్నా రెండేళ్ళు పెద్దది. రాత్రి పన్నెండు గంటలవరకు కబుర్లు చెప్పుకుంటూ ఇకఇకలు, పకపకలతో గడిపేవారు. పద్మ మా శకుంతలని తన పక్కనే పక్కవేసి పడుకోపెట్టుకునేది. శెలవలకి గూడూరు వెళ్ళి వస్తుండేది. మా బావగారిది పెద్ద కుటుంబం. పైగా ఆయన బిజినెస్ రాణించక పోవడంతో డబ్బుకి చాలా యిబ్బంది పడేవారు. అప్పుడప్పుడు చిన్న చిన్న మొత్తము మావారు పంపుతూ వుండేవారు. దీనికొక కారణం వుంది. మా వారు హాస్టల్లో చదువుకుంటున్నప్పుడు మా మామగారు హెడ్‌మాస్టరు. ఆయనకు అప్పుడప్పుడు డబ్బు పంపడం ఇబ్బంది ఐనప్పుడల్లా మా బావగారు పంపేవారుట. మద్రాసులో విక్టోరియా హాస్టలంటే మాటలా! ఆ రోజుల్లో ఆయన వ్యాపారం బాగుండేదంట. అందుకనే బావగారికి డబ్బు అవసరం వచ్చినప్పుడల్లా మా వారు పంపుతూనే వుండేవారు. ఎటువంటి సహాయం కావాలన్నా ఆయన జీవితాంతం చేస్తూనే వుండేవారు. మా మామగారు పద్మని టైపు ఇన్‌స్టిట్యూట్‌కి పిలుచుకెళ్ళి టైపు, షార్ట్‌హ్యాండ్ నేర్చుకోడానికి అంతా మాట్లాడి ఇంటికొచ్చి మావారికన్ని విషయాలు చెప్పి, నువ్వు యిప్పుడు డైరక్టరయ్యావుకదా ఆ ఖర్చులు నువ్వే భరించమని మా వారి నెత్తిన రుద్దారు.

ఇంటి దగ్గర మా మామగారు మా శకుంతలని నేను కొట్టడం చూస్తే ఆయనకి కోపం వచ్చేది. సహజంగా ఆయన శాంత స్వభావులు. కోపం వచ్చేదికాదు. హ్యూమర్ ఎక్కువ ఆయనకి. జాలిమనిషి, ఎప్పుడైనా ఆయన పుట్టినరోజు నాడు మేము సినిమా ప్రోగ్రాం వేస్తే, అందరితోను యివాళ నా పుట్టినరోజు, నా కొడుకు, కోడలు సినిమాకి పిల్చుకెళ్తున్నారు నన్ను అని చిన్నపిల్లాడిలా చెప్పుకునేవారు. ఎప్పుడైనా మా బావగారి పిల్లలకి కొత్త బట్టలు కొని మీ బాబాయి కొన్నారు అంటే "అదేంటి వాడి పేరంటావ్. మేము కొన్నాము అని చెప్పు" అనేవారు. ఆయన ఎవ్వరినీ కష్టపెట్టేవారు కాదు, ముక్కుసూటి మనిషి, చాలా ప్రాక్టికల్ గా వుంటాయి ఆయన మాటలు, వున్నది వున్నట్టు చెప్పేవారు. ఆయన నిత్యకృత్యాలు ప్రొద్దున స్నానం, గుడి, టిఫిను, మధ్యాహ్నం భోజనం, పడక, సాయంత్రం పార్కుకు వెళ్ళి ఆయన వయసు వాళ్ళతో గడపడం, శని ఆదివారాలలో వాళ్ళ గూడూరు స్నేహితులు ఇళ్ళకు వెళ్ళిరావడం ఆయన కార్యక్రమాలు.

మా సుధ పుట్టిన తరువాత మదరాసుకి వచ్చేశాను. దాన్ని ఎత్తుకుని వేలాంకన్ని మాతను దర్శించుకోడానికి స్కూలుకి వెళ్ళాను. దానికింకా ఐదోనెల. మాతాకు పూలదండ వేసి పనిక్కర్ ఆఫీసులో వుంటే ఆయన్ని కలుసుకోడానికి వెళ్ళాను. కుశలమంతా మాట్లాడి ఆయన నన్ను మళ్ళీ స్కూల్లో చేరమని అడిగారు. దాన్ని చూడగానే చిన్న కల్యాణి వచ్చిందని అన్నాడు. అది చాలా చంటి పిల్ల. కుదరదని చెప్పాను మీ పాపని నా భార్య మాలతి చూసుకుంటుందని అన్నాడు. నేను జవాబు చెప్పకపోయేసరికి ఆయన సీరియస్ అయ్యాడు. ఆయనకి కోపం వచ్చిందని అర్థం అయ్యింది. నేను ట్రై చేస్తాను సార్ అని వచ్చేసాను. Velankanni Schoolకి కొంత దూరంలో Oxford English School వుంది. ఒక సాయంత్రం 6-8 ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి గుంపుగా వచ్చారు. "మీ పాపని చూడ్డానికొచ్చాము మిస్" అన్నారు. నేను నిజమేననుకున్నాను. వాళ్ళు Velankanni School వదిలేశారనీ Oxford చేరామనీ, అక్కడ కూడా తెలుగు, గ్రామర్ కాంపోజిషన్ ఎవ్వరూ చెప్పడం లేదని, Velankanni School లో మీరు చెప్పినవే మేము నేర్చుతామని, మీరు దయచేసి Oxford English Schoolలో చేరమని కోరారు. కాని మా పాప చాలా చంటిపిల్ల. దాన్ని చూస్కోవడానికెవ్వరూ లేరని, పనిక్కర్ గారు కూడా నన్ను రమ్మనమని కోరారు.

"సారీ.. నేను రాలేనని" చెప్పాను.

"పోనీ మీ పాప కొంచెం పెద్దదైం తర్వాత రెండు నెలల తర్వాత పాపని మాలతీ ఆంటీకి అప్పగించి వస్తారా?" అని అడిగారు. ఆ అమాయకపు పిల్లలు. నా సమస్యలు వాళ్ళకేం తెలుస్తాయి. నిరాశగా వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత మళ్ళీ నాలో ఆశ చిగురించి చేరనా అని మావారినడిగాను. అప్పుడు మావారు "చూడు! ఇది నువ్వు రెండోసారి అడగడం. చంటి పిల్లతో ఎలా అనుకున్నావ్? ఆ రెండొందల రూపాయలు నేనిస్తాను" అన్నారు. నిజానికి ఇప్పుడాయన డైరెక్టరు. నాకుద్యోగం చేసే అవసరం లేదు. అయినా ఇంటరెస్టు కొద్దీ అడిగాను.

బర్కిట్ రోడ్డు యింట్లో వున్నప్పుడే మేము ఫెస్టివల్ పిక్చర్స్ అవి చూస్తూండే వాళ్ళం కదా. పిల్లలు పుట్టడంతో, వాళ్ళని చూస్కోవడం, నేను, నా టీచరు పని, స్కూలు దాంతో వారితో స్క్రిప్టు చదవడం, వారితో కలిసి పనిచెయ్యడం రానురాను తగ్గుతూ వచ్చింది. ఒకసారి నేను 'అబలా సబలా', 'తప్పెవరిది?' అనే కథలు రాస్తూ వచ్చాను. "అబలా సబలా" కథలు. F.W.Bain ఇంగ్లీష్‌లో రాసిన కథల నుంచి అనువాదం చేసాను. 'తప్పెవరిది' నా స్వంత కథ. అది ఆడవాళ్ళ కష్ట సుఖాలు నిండిన ఒక కథ. ఆంధ్రజ్యోతికి కాంపిటీషన్‌కు పంపించాను. కొన్నాళ్ళు గడిచిపోయాయి. మేము "దిక్కెట్ల పార్వతి" షూటింగు నిమిత్తమై హోసూరు వెళ్ళినపుడు అక్కడికొక వార్త సడన్‌గా వచ్చింది. అది ఆంధ్రజ్యోతి వ్యాసంలో నా 'తప్పెవరిది' సెలెక్ట్ అయిందని, కాంపిటీషన్‌లో 200రూపాయలు బహుమతి వచ్చిందని. అరె! నాకెంతో సంతోషం వేసింది. ఏదో ట్రై చేసి రాసి పంపించాను. పైగా కాంపిటీషన్‌కి.

మదరాసుకి వచ్చాక ఆ డబ్బుకి గుర్తుగా ఏదైనా కోరుకో కొనిస్తాను బ్యాంకులో వెయ్యనన్నారు. నేను నాకొక పోర్టబుల్ రేడియో కావాలి, అది వంటింట్లో పెట్టుకుని వింటూ పన్లు చూసుకుంటుంటానన్నాను. వెంటనే కొనిచ్చారు.

పైగా Bain రాసిన ఇంగ్లీష్ కథలనే మరి కొన్ని అనువాదం చేసి వ్రాసి దానికి 'స్వప్నవర్తకుడు' అని పేరు పెట్టాను. సీరియల్‌గా నాలుగు వారాలు ఆంధ్ర వారపత్రికలో పబ్లిష్ అయ్యాయి. ఇదంతా పెళ్ళికి ముందు మా నాన్నగారు ప్రోత్సహించిన జర్నలిజం, పెళ్ళయిన తర్వాత మావారి ప్రోత్సాహం దోహదం చేశాయి. ఒక్కోసారి మా వారు ఒక సీను తాత్పర్యం చెప్పి, దాన్ని డైలాగులలో ఎలా రాస్తావో రాసి చూపించు అనడిగేవారు. ముందు ముందు వచ్చిన సొమ్మొకడిది - సోకొకడిది, అలాంటి కొన్ని కథలకి నే బాగా పనిచేసాను.

తరం మారింది సినిమా తర్వాత సుందర్‌లాల్ నహతా గారి సంస్థ రాజ్యలక్ష్మీ మూవీస్ బ్యానర్‌లో ఆయన కొడుకు శ్రీకాంత్ నహతా సారధ్యంలో "అందమే ఆనందం" తీయడం జరిగింది. ఒక తమిళ సినిమా రీమేక్. దానికి కూడా మంచి పేరు వచ్చి వందరోజులు ఆడింది. రంగనాథ్, జయప్రద. వాళ్ళు వెంటనే 'రామచిలుక' అనే సినిమాకి మళ్ళీ పిలిచారు. ఇది కూడా 'అన్నక్కిళి' తమిళ సినిమా రీమేక్. తమిళ సినిమా సంగీతం ఇళయరాజాగారు చేసారు. అది పెద్ద హిట్ అయింది. తెలుగులోకి సత్యంగారు సంగీతం చేసినా, తమిళం పాట ట్యూన్ తెలుగులో పెట్టారు. "రామ చిలుకా పెళ్ళి కొడుకెవరే" అనే పాట. ఈ పాట తెలుగులో కూడా పెద్ద హిట్ అయ్యింది. ఇటు రామచిలుకా, అటు "సొమ్మొకడిది - సోకొకడిది" డబుల్ - డబుల్‌గా జరిగాయి. సొమ్మొకడిది తరువాత కమలహాసన్ తన వందవ సినిమా, 'రాజపార్వై', తెలుగులో "అమావాస్య చంద్రుడు" నిర్మించాడు. హాసన్ బ్రదర్స్ బ్యానర్‌పై రెండు భాషల్లో, ఒకే టైములో జరిగాయి, 'తరం మారింది' టైములో వచ్చిన మావారి అన్నగారి అబ్బాయి పూర్ణప్రజ్ఞ అప్పటి నుంచి ఇప్పటి వరకు అసిస్టెంట్‌గా, అసోసియేట్, కో డైరెక్టరుగా అన్నింటికి పనిచేసాడు.

**తరువాత** 'జేగంటలు', అక్కినేని నాగేశ్వరరావుగారి అన్నపూర్ణ స్టూడియోస్ 'పిల్లజమిందారు' వచ్చాయి. 'మంగళతోరణాలు', ఏకాంబరేశ్వరావుగారి సారధ్యంలోని 'గమ్మత్తు గూఢచారులు', ఇలా కొన్ని సినిమాలు కమర్షియల్‌గా పోలేదు. కొన్నాళ్ళకు కర్ణాటకలో డా. రాజ్‌కుమార్‌గారితో ఒక సినిమా చేసే అవకాశం వచ్చింది. 'హాలు - జేను' దాని పేరు. పాలగుమ్మి పద్మరాజుగారి కథ, రాజ్‌కుమార్ గారు హీరో హీరోయిన్ మాధవి, రెండవ హీరోయిన్ రూప అనే అమ్మాయి. ఇది సిల్వర్ జూబ్లీ చేసుకుంది. మంచి పేరు వచ్చింది. కర్ణాటక ప్రభుత్వపు వుత్తమ చిత్రం అవార్డు వచ్చింది. అప్పట్నించి రాజ్‌కుమార్ గారే మా వారితో కొన్ని సినిమాలు వరుసగా నిర్మించారు. 'చెలుసువ మోడగుళు' కదిలే మేఘాలు అని అర్థం. మావారి కథ, సంగీతం, డైరెక్షను 'భాగ్యద లక్ష్మీ బారమ్మా', ఇవి రెండూ సిల్వర్ జూబ్లీ సినిమాలే. తరువాత వాళ్ళ చివరి అబ్బాయి, అప్పటి చైల్డ్ ఆర్టిస్ట్, పునీత్ రాజ్‌కుమార్ డబుల్ రోల్‌లో 'ఎరడు నక్షత్రగళు' (Prince & Pauper Story) చేసారు. తర్వాత పి.ఏకాంబరేశ్వరరావుగారు నిర్మాతగా రాజ్‌కుమార్ గారితో 'శ్రావణబంతు' చేసారు. ఆ సినిమా కథ కూడా మా వారిదే రంగారావుగారి సంగీతం. దానికి కూడా పేరు వచ్చింది. తరువాత 'జ్వాలాముఖి' సినిమాకి దర్శకత్వం మాత్రమే వహించారు. ఈ కన్నడ సినిమాలు చేసేటప్పుడు రాజ్‌కుమార్‌గారు ఆయనకి బాగా స్వేచ్ఛ ఇవ్వడం మూలాన, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తీసినందున అన్ని సూపర్ డూపర్ హిట్లు అయ్యాయి. 'దేవతా మనుష్య' అనే సినిమా కథ, డైరెక్షన్ మావారే. సగం సినిమా అయిం తర్వాత ఆయన విగ్గు పెట్టుకోకుండా ఒరిజనల్ జుట్టుతో కనిపిస్తారు. ఈ సినిమాలో రాజ్‌కుమార్ గారికి బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది. రాజ్‌కుమార్‌గారు తన పెద్ద కొడుకు శివరాజ్ కుమార్ మొదటి సినిమాకి పరిచయం చేయమని కోరగా 'ఆనంద్' అనే సినిమాకి దర్శకత్వం వహించారు. దీని కథ కూడా సింగీతం వారిదే రెండవ అబ్బాయి రాఘవేంద్ర రాజ్ కుమార్‌ని కూడా మా వారే పరిచయ చేసి, అతనితో రెండు సినిమాలు చేసారు. ఇవన్నీ చూస్తున్న అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి

బంగారప్పగారబ్బాయి కుమార్ బంగారప్ప వసంత్ కూడా సింగీతంని సినిమా చేయమంటే క్షీరసాగర అనే సినిమా చేసారు. కథ మా పెద్దమ్మాయి శకుంతల సతీష్‌ది. అమల హీరోయిన్. ఇది వందరోజులు ఆడింది. 'క్షీరసాగర' తరువాత కుమార్ బంగారప్ప ప్రొడక్షన్‌కి అతని హీరోగా మా వారి దగ్గర కో డైరెక్టరుగా పనిచేస్తున్న మా పూర్ణ, 'బెళ్ళియప్ప - బంగారప్ప అనే సినిమా డైరెక్ట్ చేసాడు. తరువాత కాలంలో తమిళంలో 'వైదేహి' అనే సీరియల్ డైరెక్ట్ చేసాడు. వసంత్ సినిమా వందరోజులు ఆడింది. అతని చెల్లెలి పెళ్ళికి కూడా వెళ్ళి వచ్చాము. అతని అక్కని రాజ్‌కుమార్ గారి పెదబ్బాయి శివరాజ్ కుమార్‌కి ఇచ్చి పెళ్ళి చేసారు. నేను, మా వారు కూడా వెళ్ళి వచ్చాము.

మా చెల్లెలు పెళ్ళైయిన తరువాత మా నాన్నగారికి ఎన్నాళ్ళకీ తన కొత్త ఇల్లు పూర్తి చేయడానికి డబ్బు కుదరలేదు. ఏదో చిన్న చిన్న పనులు ఫ్లోరింగ్ పూర్తి చేసి గృహప్రవేశ ముహూర్తం పెట్టుకున్నారు. మా గృహప్రవేశానికి నాలుగు రోజుల తరువాత అయినందున మా నాన్నగారు గృహప్రవేశానికి రాకుండా, మా అమ్మా, చెల్లెలిని పంపించారు. మా గృహప్రవేశం అవ్వగానే, నేను, నా పిల్లలు అమ్మా వాళ్ళతో హైదరాబాదు వెళ్ళాము. అక్కడ గృహప్రవేశము బాగా జరిగింది. ఇల్లు మంచి ఏరియాలో వున్నందున ఒకటి రెండు బస్సులకి స్టాపు దగ్గర్లో వున్నందున అనుకూలంగా వుండింది. ఇంకో కిలోమీటరు పోతే రెండో పక్క సరోజని హాస్పటల్ రోడ్డు. బజారు, అన్నీ దగ్గర్లోనే వున్నాయి. ఇంతలో ఒక పెద్ద మనిషి మా నాన్నగారి ఇల్లు చూసి ఆయన మంచితనం తెలుసుకుని రెండవ భాగం ఇల్లు తను అద్దెకు తీసుకుంటాననీ తలుపులు, కిటికీలు తానే పెట్టించుకుంటానని ఇంకేమైనా పనులు వుంటే తానే పూర్తి చేసుకుని తన కుటుంబముతో అద్దెకు వుంటానని, అడ్వాన్సు మొత్తం వీటికి వుపయోగించుకుంటానని చెప్పాడు. అప్పుడు నిజంగా మా నాన్నగారికి దేవుడే ఆయన రూపంలో వచ్చి తన్ను ఆదుకుంటున్నాడేమో అని ఫీలై వెంటనే ఒప్పుకున్నారు. తన వైపు భాగం కూడా ఎలాగో పూర్తి చేసుకుని అద్దె ఇల్లు ఖాళీ చేసి ఈ కొత్త ఇంటికి వచ్చేసారు. చూడండి మంచి వాళ్ళకెప్పుడూ మంచే జరుగుతుంది. మా అమ్మ కూడా చాలా సంతోషించింది. ఇంత త్వరగా వాళ్ళ సమస్య తీరుతుందని అనుకోలేదు. ఎటొచ్చీ మా అమ్మమ్మ ఈ ఇల్లు చూడలేదు అనిపించింది మా అమ్మకి. ఇలా కొన్నాళ్ళు ఆ రెండో వాటాలోని టెనెంట్స్ ఒకరు మార్చి ఒకరు ట్రాన్స్‌ఫర్ వల్ల మారుతూ వచ్చారు. మా చెల్లెలి రెండో కొడుకు బాలాజీ ఇంటర్ వరకు వాళ్ళ అమ్మా, నాన్న దగ్గర వుండి చదువుకునేవాడు. వాళ్ళ అన్నయ్య రాఘవేంద్రరావు అందరూ రాజా అంటారు. వీడు మాత్రం చిన్నప్పట్నుంచి వేరే వూళ్ళల్లో హాస్టల్‌లో వుంటూ చదువుకునేవాడు. వాళ్ళ నాన్న పోస్టు మాష్టరు వలన బదిలీలు వుంటాయి. చెల్లెలు తులసి ఇంకా చిన్నపిల్ల. మా చెల్లెలు బి.యిడి, అయినా కూడా పెళ్ళై చాలా సంవత్సరాలు వుద్యోగం చేయలేదు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. మా నాన్నగారు రెండు పూటలా ట్యుటోరియల్ కాలేజీలకు వెళ్ళి కష్టపడి సంపాదించేవారు. నేను మాత్రం అమ్మా, నాన్న పెద్ద వాళ్ళు అవుతున్నారు కదా, ప్రయాణాలు చేయలేరు కదా అని అప్పుడప్పుడు పిల్లలని వదిలి పెట్టి హైదరాబాదుకు వెళ్ళి వస్తుండేదాన్ని. సెలవులయితే పిల్లలు కూడా వచ్చేవారు.

ఇలా కొన్నాళ్ళకి మా నాన్నగారికి అప్పులెక్కువై రెండోవాటా ఇల్లు అమ్మకానికి పెట్టారు. అందరూ వచ్చి ఒక్కవాటా కాదు మొత్తం ఇల్లు యిస్తే కొంటామని అనేవారట. మా నాన్నగారు ఫోన్ చేసేవారు. డైరెక్టర్స్ కాలనీలోనికి వెళ్ళాక మాకు ఫోను వచ్చిందిలెండి. వాళ్ళు వున్న వాటా కూడా అమ్మడానికి మా అమ్మకి సుతరాము ఇష్టం లేకపోయింది. కష్టపడి కట్టించుకున్న ఇల్లు కొన్నాళ్ళయినా అనుభవించవద్దా! ఏం చేయాలో తోచడం లేదని, తనకి డబ్బులకి చాలా ఒత్తిడిగా వుందని మా నాన్నగారు వుత్తరం కూడా రాశారు. ఆయన వుద్దేశం వేరే వుంది. ఆఖరుకి ఆ భాగం పై వాళ్ళెవరూ కొనుక్కోవడం లేదని, మీకేమైనా అవుతుందా! అది మనలో వుంటేనే ఆయనకి తృప్తిగా వుంటుందని మా నాన్నగారు వుత్తరం కూడా రాశారు. ఆయన వుద్దేశం వేరే వుంది. మా వారు ఆలోచించి రెండురోజుల్లో ఏ విషయం చెబుతానని రాసారు. ఆ సమయానికి ఆయనకి 'సొమ్మొకడిది సోకొకడిది' షూటింగు జరుగుతూంది. తాను పూనుకుని నిర్ధారణకు వచ్చి, మా నాన్నగారికి మీరు ఏమి దిగులు పడవద్దని, మీ ఇల్లు కొంటామని, అది మనలోనే వుండాలని,

త్వరలోనే మీకు పైకం ఏర్పాటు చేస్తానని రాసారు. దాంతో మా నాన్నగారికి చాలా రిలీఫ్ అయింది. పైగా తన ఇల్లు కూతురు, అల్లుడుకే పోతుందని సంతోషం.

మా చెల్లెలి పిల్లలు కొంచెం పెదవాళ్ళైం తర్వాత మా నాన్నగారు మా సుశీలని పిలిపించి జ్యోతి బాలమందిర్‌లో వుద్యోగం ఇప్పించారు. మొదట అది మాత్రం కూతురు చిన్నపిల్ల అయినందున దాన్ని తీసుకుని వచ్చింది. తరువాత తరువాత దాని భర్త అంగర శ్రీనివాసరావు కూడా పోస్టు మాస్టరు అయినందున హైదరాబాదుకు బదిలీ చేయించుకున్నా కూడా, బొలారం - ఐ.డి.పి.ఎల్ లాంటి దూరపు చోట్లల్లో చేసేవారు. గవర్నమెంటు వుద్యోగం వలన అతనికి ఫ్యామిలీ క్వాటర్స్ ఇచ్చేవారు. వారి ఇల్లు మా అమ్మా వాళ్ళింటికి చాలా దూరం. రెండవ కొడుకు బాలాజీ కూడా హైదరాబాదు స్కూల్లోనే చేరాడు. బాలాజీ ఇంటర్ వరకు వాళ్ళ అమ్మా వాళ్ళతో వుండి, బి.ఏ చదవడానికి మా అమ్మా వాళ్ళింటికి వచ్చేసాడు. ముసలివాళ్ళు ఇద్దరే వున్నారు కదా అని వీళ్ళతోనే వుండేవాడు. పైగా వాడికి మా నాన్నగారు మంచి కోచింగ్‌లు కూడా ఇచ్చేవారు. బయట స్టూడెంట్స్‌లాగే వీడిని కూడా బాగా చదివించి ఐ.ఏ.ఎస్ కూడా చదివించి కలెక్టర్‌ను చేయాలని ఆయనకి కోరికగా వుండేది. చాలా సంవత్సరాలు అయిన తరువాత వాడి క్వాలిఫికేషన్స్ ఏమిటో తెలుసా! ఎం.ఏ, బి.యిడి, ఎం.ఫిల్, పి.హెచ్.డి, కురుక్షేత్ర యూనివర్సిటి నుంచి పి.హెచ్.డి పొందాడు. కానీ ఇవన్నీ చూడ్డానికి మా నాన్నగారు లేరుగా ఇప్పుడు. పైగా వాడు ఇప్పుడు కాలేజి ప్రిన్సిపాల్. భార్య టీచరు, ఒక అబ్బాయి. పెద్దవాడు మద్రాసులో ఐ.ఐ.టి చేసి బెంగుళూరులో ఒక పెద్ద వుద్యోగపు హోదాలో వున్నాడు. అమ్మాయి తులసి పి.జి కాలేజి లెక్చరరుగా వుంటోంది. భర్త నరసింహ ఒక పెద్ద కంపెనీలో పని. ఒక మగ పిల్లవాడు, ఒక ఆడపిల్ల. హైదరాబాదులో కొన్ని సంవత్సరాలు తరువాత మా పెద్ద చెల్లెలు సుశీల బ్రెస్ట్ కాన్సర్‌తో హాస్పటల్ పాలై రెండేళ్ళు బాధపడి చివరికి చనిపోయింది. అది స్కూల్లో పని చేసినన్నాళ్ళు ప్రతి శనివారం ఒక పూట మా అమ్మా వాళ్ళింటికి వచ్చి, అమ్మా, నాన్నగారిని చూసి మరీ వెళ్ళేది. "పిల్లలు మేము బాగా సంపాదిస్తున్నాము కదమ్మా? వుద్యోగం మానెయ్యి" అన్నా కూడా తను "టీచరు కదా, ఇన్నాళ్ళు పనిచేసాను, ఇంకా కొన్నాళ్ళు పనిచేస్తే నాకు పెన్షన్ వస్తుంది కదా!" అనేది. కానీ విషాదమేమిటంటే పెన్షన్ తీసుకోకుండానే దాని 58వ ఏటనే కన్నుమూసింది. చివరకు పెన్షన్ కళ్ళతో చూడలేదు. మా సుశీల భర్త పోస్టుమాస్టరుగా రిటైరయిన దగ్గర్నుంచీ రెండేళ్ళు తన భార్య జబ్బు వలన ఆస్పత్రిలోనే సరిపోయేదతనికి పాపం.

బాలాజీ మా అమ్మా వాళ్ళతో వుంటున్నపుడు కానీ, ఐ.డి.పి.ఎల్‌లో వుంటున్నప్పుడు కానీ మేము తీసుకున్న రెండో వాటా టెనెంట్స్ ఇచ్చే అద్దె డబ్బులు చూసుకోవడం, ఆ యింటి బాగోగులు చూడడం, ఆ యింటికి కావలిసిన రిపేరులు, మొదలైన పనులు చూసుకోవడం, మొత్తం అన్ని పనులు వాడి నెత్తిన వేసుకుని చూసుకునేవాడు. నాకు కొడుకులు లేరన్న కొరత తీర్చేవాడు. ఇటు అమ్మమ్మ, తాతగారి పనులు, ఇంకో పక్క నా యింటి పనులు మొత్తం చాలా ఓపికగా చేసేవాడు. నేను ఏమైనా మొహమాటపడి వాడిని వెనకేసుకుని వాడి నెత్తినంతా బరువు బాధ్యతలు వేస్తున్నానని బాధపడుతుంటే "పెద్దమ్మా ఈ చిన్న విషయానికి నీవు ఇంత బాధపడతావు" అనేవాడు.

హైదరాబాదులో వాళ్ళ అన్నయ్య, వాళ్ళ చెల్లెలు, కొత్త ఇంటి గృహప్రవేశం చేసుకునేటప్పుడు నాకు ఒంట్లో బాగోలేక వెళ్ళలేకపోయాను. కొన్నాళ్ళకి వాడు ఒక ఫ్లాటు కొన్నానని గృహప్రవేశానికి రమ్మని ఫోన్ చేసాడు. కానీ అప్పటికి ఇంకా నాకు ఒంట్లో బాగోలేదు. కానీ ఎందుకో వెళ్ళాలనిపించింది. మా సుశీల అప్పటికే చనిపోయింది. మా చిన్న చెల్లెలు హైదరాబాదుకి చేరుకుంది. నేను మూడ్ అవుట్‌గా వున్నాను. మా వారి ఒంట్లో బాగోలేదు. వెళ్ళడానికి వీల్లేదన్నారు. కానీ ఏడ్చేశాను నేను. నా విషయంగా, వాడిన్నాళ్ళు ఎంత శ్రద్ధ తీసుకున్నాడు? కన్నతల్లి లేడ, నేను వెళ్ళి నా పెద్దరికం నిలబెట్టుకోవాలన్నాను. సరే, రాత్రి నిద్రలో ఏదో కలవరిచానట. మర్నాడు పొద్దున్నే లేచి "రేపు నువ్వు హైదరాబాదుకి వెళ్తున్నావు. ఒక్కదానివే వెళ్తున్నావు. తిన్నగా అక్కడికే వెళ్ళకు. పద్మా, బాబు వాళ్ళ ఇల్లు సౌకర్యంగా వుంటుంది. అక్కడ దిగు. పద్మ కొడుకు శ్రీనాథ్‌ని ఎయిర్‌పోర్టుకు వచ్చి నిన్ను పిల్చుకెళ్ళమంటాను" అన్నారు. నా

సంతోషం చెప్పలేను. పద్మ ఇంటికి వెళ్ళి, అక్కడ ఒకరోజు వుండి, మా శ్రీనాథ్ నన్ను గృహప్రవేశం ఇంట్లో దింపి వెళ్ళాడు. ఎదురుగా మా సుశీల ఫోటో దండ వేసి వుంది. దాన్ని చూసి బోరుమన్నాను. మా మరిది (బాలాజీ నాన్న) అన్నాడు. "వాళ్ళిద్దరి గృహప్రవేశానికి రాలేదు నువ్వు. దీనికి మాత్రం వచ్చావు" అని దెప్పాడు. కానీ నాకూ, బాలాజీకి మధ్య వున్న అనుబంధం అతనికేం తెలుసు?

మా నాన్నగారి ఇల్లు హైదరాబాదులోని రెండవ వాటా కొన్నాము. కొన్ని నెలల తరువాత మాములు ప్రకారం మా వారు, పూర్ణ ఇంట్లో లేరు. ఏ షూటింగుకి వెళ్ళారో. ఒక రోజు రాత్రి 7.30 గంటలకు వున్నట్టుండి మా బావగారి దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. పూర్ణాని పిలిచారు. అతను లేడని వాళ్ళ బాబాయితో బయటికి వెళ్ళాడు అని చెప్పాను. అతను వచ్చిన తరువాత వాళ్ళ నాన్నకి ఫోన్ చేసాడు. వాళ్ళ నాన్న ఏదో చిక్కులో ఇరుక్కున్నానని, ఇల్లు తాళం పెట్టి స్నేహితుడి ఇంట్లోనే మొత్తం కుటుంబం వుంటున్నాము అని చెప్పారట. మా కందరికి ఏమీ అర్థం కాలేదు. వెంటనే రాత్రికి రాత్రి మా పూర్ణాని మా వారు గూడూరుకి వెళ్ళి విషయం కనుక్కుని రా అని ఖర్చులకు డబ్బులు ఇచ్చి పంపించారు. ఏమి జరిగిందో ఏమో, మరునాడు మా పూర్ణ గూడూరు నుంచి వాపసు వచ్చేసాడు. పూర్ణ నాన్న హౌసింగ్ బోర్డు ఇల్లు కట్టించుకున్న తాలుకు డబ్బు ఇకా బాకీ వున్నదని, కొత్తగా వచ్చిన రిజిస్ట్రారు వెంటనే 30,000రూపాయలు కట్టమని, లేకపోతే ఇల్లు ఖాళీ చేయమని వత్తిడి చేసాడట. మా బావగారు వెళ్ళి వుంటున్న ఇల్లు ఆయన స్నేహితుడుది అని, ఆయనొక డబ్బున్న బిజినెస్ మనిషి అని తెలిసింది. ఆయన చాలా మంచివారట. ఆ ఇంట్లోని గదులు, వంటగది వాళ్ళని వాడుకోమని సహాయం చేసాడట. అంతా విన్నాక మా వారు ఆలోచించడం మొదలుపెట్టారు. ఆయనకి నిద్రపట్టలేదు. రాత్రంతా ఆలోచిస్తూ పడుకున్నారు. అన్న ఏం అవస్తపడుతున్నాడో, తల్లిలాంటి ఆయన వదిన ఏం కష్టం పడుతున్నారో, పిల్లలు చూస్తే చిన్నవాళ్ళు, వాళ్ళని చూచి ఆవిడ ఏం బాధపడుతున్నారో? అక్కడ ఏం జరుగుతుందో అని. కానీ నా ఆలోచన వేరే. వారి బుర్ర ఎలా పనిచేస్తుందో, వారి మెదడు ఎక్కడ పాడైపోతుందో. పైగా మా వారి సంపాదన మీదే రెండు కుటుంబాలు ఆధారపడి వున్నాయి కదా అని నా ఆలోచనలతో నాకు నిద్రపట్టలేదు. మరునాడు మా వారు 30,000రూపాయలు మా పూర్ణకిచ్చి గూడూరు కెళ్ళి వాళ్ళ నాన్నకు ఇచ్చిరమ్మని పంపారు. అంత మొత్తం తీసుకెళ్తున్నాడని అతని భార్య రమని కూడా పంపారు దాంతో మా బావగారి ఇల్లు సమస్య తీరిపోయింది.

ప్రతి సంవత్సరం ఏదో ఒక కాపిటల్‌లో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ జరుగుతూ వుంటుంది. అన్ని దేశాల నుంచి అన్ని భాషల సినిమాలు, దానికి తగ్గ టెక్నీషియన్స్ వస్తూ వుంటారు. అలాగే నేను, మా వారు కూడా ప్రతి ఏటా జనవరి పది నుంచి ఇరవై ఒకటి వరకు ఫెస్టివల్‌కి హాజరయేవాళ్ళం. అన్నాళ్ళుండక పోయినా ఒక వారం రోజులైనా వుండి వచ్చేవాళ్ళం. పొద్దున్నే 8.30గంటలకి ప్రారంభించిన సినిమాలు రాత్రి 1.00గంట వరకు జరుగుతూనే వుంటాయి. మేము మాత్రం 8.30 గంటలనుంచి 1 - 2 గంటలవరకు వుండి రూముకు వచ్చి భోజనం చేసి రెండు గంటలు విశ్రాంతి తీసుకుని మళ్ళీ 3-4 గంటలకు వెళ్ళి రాత్రి 10.00గంటలవరకు చూసి వచ్చేవాళ్ళం. కొన్ని సినిమాలైతే వారికి To&Fro flight charges, hospitality ఇచ్చేవారు. అంటే వారి సినిమాలు ఎంపిక అయినప్పుడు, ఇండియన్ పెనోరమకి తీసుకున్నప్పుడు. అలా ప్రతి ఏడూ మారుతీరావుగారు, ఆయన భార్య, మేము నలుగురం థియేటర్‌లో కలిసి కూర్చుంటూ, కలిసి హోటల్‌లో భోజనం చేసేవాళ్ళం. అలాగే సి.యస్.రావుగారు, భార్య రాజసులోచనగారు కూడా వస్తుండేవారు. థియేటర్‌లో మాత్రం కలుసుకునేవాళ్ళం. జంధ్యాలగారు, సత్యానంద్‌గారు కూడా వచ్చేవారు. ఒక్కోసారి హోటల్స్‌లో కలుసుకుంటూ వుండేవాళ్ళం లంచ్‌కి. అలాగ కలకత్తా, త్రివేండ్రమ్, గోవా, బెంగుళూరు పలువ్వాళ్ళు, ఒకసారి హైదరాబాదులో కూడా జరిగింది. కానీ కేరళ అవీ చూసినప్పుడు చుట్టుపక్కల సైట్స్, దేవాలయాలు కూడా దర్శించుకుని ఫొటోలు కూడా తీయించుకునే వాళ్ళం. ఈ మధ్య ప్రతియేటా గోవాలోనే జరుగుతోంది. అలాగే త్రివేండ్రమ్ వెళ్ళినప్పుడు రాజేంద్రకుమార్, రాజ్‌కపూర్ మొదలగు హీరోలతో ఫోటోలు కూడా తీయించుకునేవాళ్ళం. వీళ్ళంతా నా చిన్నతనపు హీరోలు కదా. అయితే ముఖ్యమైన ఫేవరెట్ హీరో దేవానంద్. అతనితో ఫోటోలేదు.

లోకల్ థియేటర్‌లో దేవానంద్ పాటలు, కిషోర్ కుమార్, రఫీ పాటల కాన్సర్ట్ వున్నప్పుడు 500రూపాయలు, 1000రూపాయల టిక్కెట్లు కొని వెళ్తుంటాం. మా అమ్మాయి సుధ దేవానంద్ పాటల్ని సి.డి చేసిచ్చింది నాకు.

మా పిల్లలు వాళ్ళ స్కూలు, కాలేజీల వలన, వాళ్ళిద్దరిని ఇంటి దగ్గర మా పూర్ణ భార్య చూసుకునేది. మొదటి నుంచి వాళ్ళిద్దరిని వదిలి ఎక్కడికైనా వెళ్ళడం బాగా అలవాటు చేసాను. వాళ్ళతో వెళ్ళే స్థలాలకు మాత్రం తప్పకుండా పిల్చుకెళ్ళేవాళ్ళం.

ఒకసారి 'పంతులమ్మ' షూటింగు జరిగింది. మా వారు, ప్రొడెక్షన్ ట్రూప్ అంతా ముందుగానే వెళ్ళిపోయారు. ఒక వారం అయిన తరువాత కృష్ణంరాజుగారు పనుండి మదరాసుకు వచ్చారు. నాకు ఫోన్ చేసారు. "ఎల్లుండి నా భార్య, రంగనాథ్ గారి భార్య మేమంతా కార్లో వూటీకి వెళుతున్నాము. వస్తారా?" అని అన్నారు. అప్పుడు నాకు ఏం చెప్పాలో తెలియలేదు.

రాత్రి మా వారు ఫోన్ చేసారు. "కావలిస్తే నువ్వు కూడా రా. ఇది నీకు అవకాశం కదా" అని.

సరే అని ప్రయాణం అయ్యాను.

నన్ను పిల్చుకు వెళ్ళడానికి కారులోంచి కృష్ణంరాజుగారు దిగి మేడమీదకు వచ్చారు. "మీ ఇద్దరి పిల్లలకి కారులో స్థలం లేదు. పోనీ చిన్న పిల్లనైనా పిలుచుకు రండమ్మా. డైరెక్టరుగారు పిల్లలో అంటున్నారు" అన్నారు.

"కాదండీ, పిల్చుకోస్తే ఇద్దర్నీ పిల్చుకు రావాలి, వదిలేస్తే ఇద్దర్నీ వదిలేయాలి. వాళ్ళను చూసుకోవడానికి పూర్ణ భార్య వుందిలెండి" అన్నాను.

అలా కృష్ణంరాజుగారి భార్య, రంగనాథ్ గారి భార్య, వాళ్ళబ్బాయి చిన్నవాడు అయినందున వాడ్ని పిల్చుకు వచ్చారు కానీ ఒళ్ళోనే కూర్చోపెట్టుకుంది. నేను సరే సరి. అందరం వెళ్ళాం. అక్కడికి చేరేసరికి అర్థరాత్రి అయింది. మరునాడు షూటింగుకి వాళ్ళతో పాటు మేము వెళ్ళాం. నేను ఊటీకి వెళ్ళడం అదే మొదటిసారి. ఊటీలో చుట్టుపక్కల సైట్స్ చూడటం, దొడ్డ బెట్ట, షాపింగు, అక్కడ ఏలక్కాయలు, లవంగాలు, మిరియాలు, డ్రైఫ్రూట్సు, చాక్లెట్లు అన్నీ ఫేమస్. అవన్నీ కొనుక్కుని వచ్చాము ఒకరోజు. ఇంకోరోజు ఒక పాట పిక్చరైజేషన్ షూటింగు చేసారు. సగం పాట మొదట లక్ష్మి, రంగనాథ్ మీద చిత్రీకరించారట. నే వెళ్ళిన తరువాత రెండవ భాగం రంగనాథ్, దీప మీద చిత్రీకరించారు. ఆ పాట "మానస వీణా మధుమాసం" చాలా బాగుంది. క్లాసికల్‌గా వుండి చాలా మాధుర్యంగా వుంది. సంగీతం రాజన్ నాగేంద్ర. ఇది వేటూరిగారి రచనకి సంగీతం, మ్యూజిక్ డైరెక్టర్స్ శ్రావ్యంగా ట్యూన్ కట్టారు. వేటూరిగారికి ఈ పాట రచనకి మొట్టమొదటిసారిగా నంది అవార్డు వచ్చింది. సినిమా కూడా బాగా ఆడింది.

కొద్దికాల వ్యవధిలోనే మా వారు నవతా కృష్ణంరాజు గారికి మూడు సినిమాలు చేసారు. 'జమిందారుగారి అమ్మాయి', 'అమెరికాఅమ్మాయి', 'పంతులమ్మ'. ఈ మూడు సినిమాలు హిట్స్. మా శకుంతల హైస్కూలు అయిం తరువాత యస్.ఐ.ఇ.టి కాలేజీలో ఇంటర్, బి.కాం చదివి పాసైయింది. చిన్నమ్మాయి సుధని పీటర్స్ రోడ్డులో వున్న ఆదర్శ విద్యాలయంలో చేర్పించాము. ఇది పంజాబ్ అసోసియేషన్ వాళ్ళది. సుష్మా అహూజా అనే ఆమె మా వారికి కొన్ని హిందీ స్క్రిప్టులకి పనిచేసింది. ఆవిడ రికమెండేషన్‌తో మా సుధకి అక్కడ సీటు దొరికింది. తమాషా ఏమిటంటే అది పెద్దయి పెళ్ళి అయ్యాక ఢిల్లీలో 3 సంవత్సరాలు, పంజాబ్‌లో వున్న పాటియాలా దగ్గరున్న సంగ్రూర్‌లో మూడు సంవత్సరాలుంది. మా అల్లుడికి ఐ.ఓ.సి అంటే ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్‌లో పని.

సరే, మా సుధ, మా శకుంతల స్కూలుకి, కాలేజీకి వెళ్ళాలి కదా, ఆ సమయంలో రెండు మూడు పిక్చర్లు అయి మా వారు 'సొమ్మొకడిది - సోకొకడిది' ప్రారంభించారు. అలాంటి సమయంలో మాకొక కారు కొనిపెట్టాలని ఆయనకి అనిపించింది. సెకెండ్ హ్యాండ్ మంచి కండిషన్‌లో వుండే ఒక కారు కొన్నారు. కానీ కొత్తదైనా, ఉపయోగించిన కారైనా, ఏదో ఒక కారు మా స్వంతం అయినందుకు మాకందరికీ ఆనందాన్నీ, సంతోషాన్నీ, తృప్తిని ఇచ్చింది. ఇక మా పిల్లలకు వాహనం ఇబ్బంది వుండదు. ఆ కారు

వాళ్ళిద్దరికే పరిమితం చేసారు. నేనెక్కడికైన వెళ్ళాలంటే నాకు కూడా. మా వారికి కంపెనీ కార్లే వస్తుండేవి. ఆయనకి ఖాళీ వున్నప్పుడు అందరూ కార్లో బీచ్‌లకి, షాపింగు, ఒకటేమిటి ఎక్కడికెళ్ళాలన్నా వెళ్ళేవాళ్ళము. పాపం మా పిల్లలకి కారు రావడం ఒక థ్రిల్.

"తరం మారింది" సినిమా టైముకి వచ్చిన మా పూర్ణ. మా వారి అన్నగారి అబ్బాయి మాతోనే వుంటూ వచ్చి ఆ తరువాత 'అందమే ఆనందం' కూడా పనిచేసిన తరువాత అది రిలీజైపోయింది. తరువాత 1977 వ సంవత్సరం ఆగష్టు 19న నెల్లూరులో వున్న వాళ్ళ మేనమామ వెంకోజీగారి ఒకే ఒక కూతురు రమ అనే అమ్మాయితో పెళ్ళి జరిగింది. పెళ్ళైన తరువాత కూడా ఆ ఇద్దరూ మాతోనే వుంటున్నారు. తాను కూడా మా అందరితో కలిసి పోయేది. మా పిల్లలని కూడా తన స్వంత ఆడపడుచులుగా చూసుకునేది. ఆ అమ్మాయి వచ్చిన తర్వాత నేను అప్పుడప్పుడు వారం, పైరోజులు ఇలాగ మా వారితో వెళ్తూ వచ్చాను. మా పిల్లలు కూడా దాన్ని స్వంత వదినలా భావించి బాగా చూసుకునేవారు. ఆ అమ్మాయి దగ్గర మా పిల్లలు బాగా అలవాటు అయ్యారు.

**మామగారు రోజూ** సాయంత్రం పార్కుకి వెళ్ళేవారు. ఒకరోజు సాయంత్రం చీకటి పడుతుండగా కూడా ఇంటికి రాలేదు. మా సుధ బాల్కనీలో నుంచి "తాతా ఇంటికి రా. చీకటి పడుతూంది. కింద పడిపోతావ్" అంటూ పిలిచింది. ఆయన వచ్చేసారు. తరువాత రెండు మూడు రోజులకి ఆయన పార్కునుంచి వస్తుంటే ఒక ఆవు ఎదురై ఆయన్ను తోసేసిందట, కింద పడ్డారు. ఇంటి బాల్కనీలో నుంచి చూస్తున్న మా సుధ తాత కిందపడ్డారని కేకలు వేసేసరికి అందరం పార్కుకి పరిగెత్తాము. ఆయన కుడి చెయ్యిని ఎడం చేత్తో పట్టుకొని నొప్పి పుడుతోంది అన్నారు. నేను వెంటనే దగ్గరలో డాక్టరు విలాసిని రెడ్డి అనే ఫ్యామిలీ డాక్టరు వుంటే ఆటోలో పిల్చుకు వెళ్ళాను. ఏం చేయాలో నాకు తోచలేదు. నాకు తెలిసింది అది ఒక్కటే. మా వారు, పూర్ణ ఊళ్ళోలేరు. కన్నడ రాజ్‌కుమార్ గారి షూటింగ్ నిమిత్తం బెంగుళూరులో వున్నారు. డాక్టరు దగ్గరకి పిలుచుకెళ్ళి ఆవిడతో చెప్పాలంటే నాకు భయం, ఏడుపు రెండు వచ్చాయి. ఏడుస్తూ ఆవిడకి చెపితే ఆవిడ ఆయన జబ్బ మీద చేయి వేసి చూచి "ఇది ఫ్రాక్చర్ అయి వుండవచ్చు. నేను చేసేది ఏమీలేదు. ఈయనని రాయపేట హాస్పటల్‌కి పిల్చుకెళ్ళండి" అంది. ఆ హాస్పిటల్ ఎక్కడుందో తెలీదు. ఏం చేస్తాను? ఆయన్ని ఇంటికి పిల్చుకుని వచ్చేసాను. ఈ హడావుడంతా నాల్గవ బ్లాక్‌లో వుంటున్న పి. ఏకాంబరేశ్వర రావుగారనే ప్రొడ్యూసర్ 'ఏమయింది?' అని మా యింటికి వచ్చి అడిగారు.

మా వారు ఊళ్ళో లేరని ఆయనకి తెలుసు. తన సహాయం ఏమైనా కావాలా అని అడిగారు. జరిగినదంతా చెప్పాను.

"నేను వస్తాను పదమ్మా" అని ఒక టాక్సీ తీసుకువచ్చారు. నేనూ, ఆయన మామగారిని రాయపేట హాస్పటల్‌కి పిల్చుకెళ్ళాము. అక్కడ డాక్టర్ చూసి ఫ్రాక్చర్ కాదని, ఒక చిన్న క్రాక్ అయిందని భయపడవలసినది ఏమీలేదని, చేతికి బ్యాండేజి కట్టి పంపారు. దేవుడిలా వచ్చి ఆదుకున్న ఆ ఏకాంబరేశ్వరరావుగారికి కృతజ్ఞతలు చెప్పాను.

భోజనం మా రమ స్పూనుతో ఆయనకి పెడితే అది తీసుకుని ఎడమ చేత్తో తిన్నారు. మేమందరం ఎలాగో భోజనం చేసాం. మా పిల్లలు ఇద్దరూ పడుకున్నారు. కానీ నాకు, రమకు నిద్ర రాలేదు. మేము ఆసుపత్రి నుంచి 11.30 గంటలకు వచ్చాం. రాత్రి 10.00గంటలకు షూటింగు ముగించుకుని వచ్చి వుంటారని వచ్చిన తరువాత మావారికి జరిగినదంతా ఫోను చేసి చెప్పాను. అయినా, మా వారు ఏ వూరికి వెళ్ళినా రెండు రోజులకు ఒకసారి మేమైనా చేసేవాళ్ళం. ఆయన అయినా చేసేవారు. అప్పట్లో సెల్‌ఫోన్లు లేవు కనుక హోటల్ నుంచే చేసేవారు. ఇక మామగారు రాత్రంతా పక్కమీద పడుకోకుండా కుర్చీలోనే అలాగే కూర్చుని వున్నారు. కానీ విపరీతమైన భయం వేసింది. అప్పటికే ఆయన వయస్సు 80 ఏళ్ళు. చేయి చూస్తే అలాగైంది. ఏదో తెలియని భయం. ఇంట్లోని లైట్లంతా రాత్రి

తెల్లవార్లు ఆపకుండా అలాగే వుంచాము. నాకూ, రమకి కూడా పడుకోవాలనిపించలేదు. ఆయన్ని చూస్తూ ఆయనకి ఎదురుగుండా అలాగే కూర్చున్నాము.

తెల్లవారిన తరువాత ఎవరి పనుల్లో వాళ్ళు వెళ్ళిపోయాము. అందరి కాఫీలు అయిపోయాయి. ఏకాంబరేశ్వరరావుగారు వచ్చి "తాతగారు ఎలా వున్నారమ్మా?" అంటే "రాత్రంతా ఆయన నిద్రపోలేదండీ" అన్నాను. "డైరెక్టరుగారికి ఫోను చేసి చెప్పారామ్మా?" అంటూ మామగారి బెడ్‌రూములోకి వెళ్ళిచూస్తే ఏకాంబరేశ్వర రావుగారికి ఆశ్చర్యం వేసింది. మామగారు ఎడమ చేత్తో గడ్డం గీసుకుంటున్నారు. ఏకాంబరేశ్వర రావుగారు ఆయనకుండే బాధలో ఇప్పుడు గడ్డం గీసుకోకపోతేనేం అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఆ ఏకాంబరేశ్వర రావుగారే ముందు ముందు మా వారి డైరెక్షన్‌లో 'గమ్మత్తు గూఢచారులు', 'శ్రావణబంతు' సినిమాలు నిర్మించారు.

నాలుగైదురోజుల తరువాత మా వాళ్ళు బెంగుళూరు నుంచి షూటింగ్ ముగించుకుని వచ్చారు. నా ఫోన్ల వలన వాళ్ళకి తెలిసిన విషయం కనుక ఇప్పుడు కొత్తగా తెలుసుకోవలసినది ఏమీలేదు. మళ్ళీ వారానికి వెళ్ళాలి బెంగుళూరుకి. మా మామగారు కొడుకుతో "ఒరేయ్ శీనూ! ఈసారి నీతో కల్యాణిని కూడా పిల్చుకెళ్ళరా, కొన్నాళ్ళు రిలీఫ్ కావాలి. ఈ మధ్య తను చాలా నలిగిపోయింది" అన్నారు. మావారితో నేను కూడా ప్రయాణము కట్టానని వేరే చెప్పాలా.

మా వారు డైరెక్టరు అయిన తర్వాత కొన్ని నిర్వహించవలసిన బాధ్యతలు వుంటాయి కదా. లాయరంటే, ఆడిటర్ అంటే, ఇన్‌కం టాక్స్ ఈ వ్యవహారాలన్నీ వుంటాయి కదా. ఇవన్నీ ఆయన అన్నగారు కొడుకు పూర్ణ వీరి అసోసియేట్‌గా పనిచేయడమే కాక ఇలాంటి సొంత విషయాలు కూడా చూసుకుంటున్నాడు. మా బావగారు వున్నన్నాళ్ళూ ఈయన, మావారు రామలక్ష్మణుల్లాగా ఒకరికొకరు చేదోడువాదోడుగా వుండేవారు.

ఇక పూర్ణ భార్య రమ అంటారా! పేరుకి మా బావగారి కోడలు అయినా కూడా పెళ్ళైనప్పటి నుంచీ మాతోనే వుండడం వల్ల మా పిల్లలిద్దరికీ చేరువై, మా పెద్దవాళ్ళనిద్దరిని కనుక్కుంటూ అప్పుడప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్న నన్ను కనుక్కుంటూ, ఆసుపత్రిలో చేరి కొన్నాళ్ళు వున్నప్పుడు సహృదయంతో సేవలు చేస్తూ, అప్పటికీ ఇప్పటికీ అలాగే వుంది మా రమ. వంటవాళ్ళు కొంతకాలం వుంటూ, కొంతకాలం మానేస్తూ వుండేవాళ్ళుకదా అని పై పనికి దూరపు చుట్టాన్ని ఒకామెను పెట్టుకున్నాను. ఆమె కంటిన్యూస్‌గా 25 సంవత్సరాలు పనిచేసింది. 8,000 రూపాయలు సహాయం చేసి ఆమె కూతురు పెళ్ళి చేయించాము. పెళ్ళి కూతురిని చేసి వాళ్ళ బంధువులను పిలవడానికి కళ్యాణ మండపానికి డబ్బు ఇచ్చే స్థోమత లేకపోతే నా యిల్లే ఆశ్రయమిచ్చాను. మా పూర్ణ క్యాటరింగ్‌కి ఖర్చు పెట్టాడు. వంట వాళ్ళు రాకపోయినా, నిల్చిపోయినా కూడా రమే స్వయంగా వంట చేస్తూ, నాకు ఆర్థోపెటిక్ ప్రాబ్లం అని నా చేత బరువు పనులు చేయించకుండా మొత్తం వంటిల్లు తానే స్వయంగా చూసుకుంటోంది. రమ మాపిల్లలకే కాక నా మనవడు, మనవరాలుకి కూడా చేరువైంది. వాళ్ళకు ఏమైనా కావలిస్తే 'అమ్మమ్మా' అని నా దగ్గరకి రారు. 'రమత్తా' అని తన దగ్గరికే వెళ్తారు.

వాళ్ళ నాన్నగారు వెంకోజీరావుగారి వారసులనిపించుకుంది. మా నాన్నగారు ఆఖరి కాలములో నా దగ్గరే వుండేవారు. మా రమ ఆయనకి కూడా పూట పూట టిఫిను, కాఫీ భోజనం పెడుతూ ఆయన్ని తాతగారు అని కనుక్కుంటూ వుంటే "చూడు, ఏ రక్త సంబంధము లేని రమ చేత కూడా చేయించుకుంటున్నాను, తనకు ఏమి పట్టింది నాకు కూడా చేయడానికి?" అని బాధపడుతూ రమని మెచ్చుకునేవారు.

నాకేగాక మా చెల్లెళ్ళకు కూడా మా రమ అంటే మంచి ఆప్యాయత. బంధువులు సరే. నా స్నేహితురాలైన అంబుజ మామి పిల్లలు జయశ్రీ, జయంతి కూడా రమతో ఆప్యాయంగా మాట్లాడతారు. రమ పెళ్ళై వచ్చిన తరువాత మా అమ్మా వాళ్ళ ఊరికి కానీ,

మా వారితో షూటింగులకు కూడా వెళ్ళడానికి అవకాశాలు చాలా వచ్చాయి. చాలామంది మా స్వంత కోడలని అనుకుంటారు. మా నాన్నగారిలాగే నాకు కూడా స్వతంత్ర భావాలు ఎక్కువ. ఇంకొకరి చేత చేయించుకోవడం ఇష్టపడను. అటువంటప్పుడు నా మనసు కనిపెట్టి చేసేది. ఓహో! మా అత్త నన్నేమీ అడగరు కదా అని వాలంటీర్‌గా చేసేది. వాళ్ళమ్మాయి అంజనా జ్యోతి అందరం అంజు అంటాము. అంజూ పెళ్ళికూడా నేను, మా వారు దగ్గరుండి జరిపించడం తానెంతో సంతోషించింది. మా ఇద్దరికి కూడా వాళ్ళ పిల్లలు అంటే ఎనలేని వాత్సల్యం. మా ఇంట్లోనే మా కళ్ళముందరే పుట్టిపెరిగారు కదా. అందులో మా సుధ పుట్టిన తరువాత మా రమ కూతురు, కొడుకు అంజు, అనంతే కదా చంటి పిల్లలు. అంజూ మూడేళ్ళప్పుడు మా పెద్దమ్మాయి శకుంతల పెళ్ళయి 1990లో, 1991లో నా మనవరాలు స్నేహ పుట్టింది. ఆ తర్వాత మా సుధకి 1995లో పెళ్ళయి 1997లో సుధ కొడుకు మా మనవడు అభినవ్ పుట్టాడు. నాకు మగపిల్లలు లేరు, దౌహిత్రుడు కలిగాడు.

నేనప్పుడప్పుడు హైదరాబాదుకు వెళ్తుండేదాన్ని కదా. ఒకసారి వెళ్ళి పదిరోజులుండి వద్దామని ట్రైన్ బుక్ చేసుకుని వెళ్ళాను. నే వెళ్ళిన మర్నాడే మా అమ్మ వాళ్ళకి మైల వచ్చింది మా నాన్నగారి పినతల్లిపోయింది. నేను వెళ్ళాను కదా అని మా రఖుమ వచ్చింది. నా దురదృష్టం ఆ పదిరోజులూ మా అక్క చెల్లెళ్ళమే వంట పని చేయవలసి వచ్చింది. "మీ యింట్లో నీకు పనేలేదు. ఇక్కడికి వచ్చి కష్టపడ్తున్నావా" అని మా అమ్మ చాలా బాధ పడేది. ఇంకొకసారి పిల్లల్ని దసరాల్లో పిలుచుకునిరా అని అంటే అలాగేనని దసరా పండగకి వెళ్ళాను. మర్నాడే నేను, మా అమ్మ కలిసి దసరా కొలువు పెట్టాము. రెండు రోజుల తర్వాత అందర్నీ పేరంటానికి పిలుద్దామని అంది మా అమ్మ. తన మనవరాళ్ళు వచ్చారు కదా అని సంతోషం మా అమ్మకి. ఇంతలో 'ప్రతిబింబాలు' షూటింగ్ కోసం మా వారు హోటల్ రూంలో దిగారు. ఆ రాత్రి మావారు, మా అమ్మ ఇంటికి వచ్చి మా మామగారికి జ్వరంగా వుందని, రమ ఒక్కర్తే వుందని నన్ను వెంటనే మదరాసుకి వెళ్ళమని ఒత్తిడి చేశారు. నాకా వచ్చిన మర్నాడే ప్రయాణం కట్టడం చాలా బాధవేసింది. మా అమ్మ వచ్చి నన్ను సమాధానపరిచింది. "చూడమ్మా! అది కూడా కావలసిందే కదా, మీవారు కూడా మెడ్రాసులో లేరు. నువ్వెళ్ళి మీ మామగారిని చూసుకోవద్దా. మళ్ళీ రా ఏం?" అంది.

మావారన్నారు "రేపు ప్రొద్దున్న ఫ్లైటుకి బుక్ చేశాను. కంపెనీ కావలిస్తే అత్తిలి లక్ష్మి, యింకా కొంతమంది మద్రాసుకు వెళ్ళే ఆర్టిస్టులు వున్నారు. ఇపుడు నాతో రూంకి వచ్చేయ్" ఎందుకో నేను అయిష్టంగా వెళ్ళాను. హోటల్‌లో రాత్రి భోజనం సరిగా చేయలేదు. "నీకు ఇష్టమున్నా, లేకపోయినా నువ్వు వెళ్ళి తీరాలిసిందే నువ్వు వెళ్ళకపోతే ఇక్కడ నేను షూటింగ్ ఎలా కాన్సంట్రేట్ చేస్తాను" అన్నారు. పడుకుని రాత్రంతా ఏడుస్తూనే వున్నాను. ఎప్పుడూ ఆయన అంత ఖచ్చితంగా మాట్లాడరు. అమ్మతో ఒక్కరోజే గడిపాను. ఎందుకో చాలా దుఃఖం వేసింది. సరే వచ్చేసాను మద్రాసుకు. దసరా, దీపావళికి ఎన్నాళ్ళో తేడా వుండదు కదా, దీపావళి అయిన నెలలోపుగానే మా అమ్మ చనిపోయింది. మళ్ళీ వెళ్ళి చూడాలన్నా మా అమ్మ ఇంక లేదుగా. ప్రాణంతో చూస్తాన్న మా అమ్మని శవాన్ని చూడవలసి వచ్చింది. అందుకేనేమో క్రితం నెల హైదరాబాదులోనే నేను అలా ఫీల్ అయ్యాను. ఏదో తెలియని సందేశం బాధగా మారి నన్ను దుఃఖింప చేసింది అనుకున్నాను.

రాజ్‌కుమార్‌గారి సినిమాలలో"ఎరడు నక్షత్రగళు", "ప్రిన్స్ అండ్ ది పాపర్" కథ ఆధారంగా తీసిన చిత్రం. ఆయన మూడో కొడుకు పదిసంవత్సరాల అబ్బాయితో తీసిన సినిమా. అతనే పునీత్ రాజ్‌కుమార్ ఇప్పటి కన్నడ టాప్ హీరో. సాధారణంగా రిలీజ్‌కు ముందు స్నేహితులను పిల్చి ప్రివ్యూ చూపిస్తూ వుంటాము. మరుసటి రోజన ప్రివ్యూ అన్నమాట. ముందురోజున గూడూరు నుంచి మా బావగారు, తోటికోడలు సీతమ్మక్క సినిమా చూడటానికి వచ్చారు ఊళ్ళో బంధువులను, స్నేహితులను ఆహ్వానించాము. రాత్రి మా అందరి భోజనాలు అయ్యాయి. మా పూర్ణ మాత్రం నిర్మాత ఏకాంబరేశ్వర రావుగారితో "శ్రావణ బంతు" అనే సినిమా రాజ్‌కుమార్

గారు హీరోగా నటించే సినిమాకి హీరోయిన్ కోసరమని ఊర్వశిని బుక్ చేయడానికి వెళ్ళాడు. రాత్రి 9.30గంటలకు హైదరాబాదునుంచి ఫోన్ వచ్చింది. మా అమ్మకి ఒంట్లో బాగాలేదని, కొంచెం సీరియస్‌గా వుందని, ఆ వేళ ప్రొద్దున మా పిన్నిగారబ్బాయి డా.శశికుమార్ సహకారంతో సికింద్రాబాద్ గాంధీ హాస్పటల్‌లో చేర్పించామని, మమ్మల్ని వెంటనే బయలుదేరి రమ్మని శశికుమార్ తండ్రి, మా బాబాయి హనుమంతరావుగారు ఫోన్ చేసారు. మావారు వెంటనే పూర్ణాకి ఫోన్ చేసి ఇంటికి రమ్మన్నారు. ఎందుకైనా మంచిదని మా పిల్లలిద్దరికి కూడా టిక్కెట్లు బుక్ చేశాము. మర్నాడు పొద్దునే 6గంటలకు ఫ్లైట్ ఎక్కి బయలుదేరాము. ముందు రోజు రాత్రే మా పూర్ణకి మరునాడు సినిమా షోకి కావలసిన ఏర్పాట్లు, అందరిని రిసీవ్ చేసుకునే విషయాలు చెప్పారు.

మేము తొమ్మిదిగంటలకల్లా తిన్నగా సికిందరాబాద్ గాంధీ హాస్పిటల్‌కి వెళ్ళాం. మా అమ్మ ఆ రాత్రి (నిన్నరాత్రి) పన్నెండు గంటలకు చనిపోయిందని కండీషన్ చాలా బ్యాడ్‌గా వుండిందని, శవాన్ని ఇంటికి తీసుకుపోయారని ఒక నర్సు చెప్పింది. వెంటనే ఇంటికి వెళ్ళాం. అక్కడ మాకు తెలిసిన విషయము ఆదివారం (నిన్న) బాత్రూంకి వెళ్ళిన మనిషి ఎంతకీ రాకపోవడం చూసి మా నాన్నగారు, బాలాజి వెళ్ళి చూస్తే స్పృహ తప్పి పడివుందట. మా అత్తకూడా అక్కడ వుండడం వలన ముగ్గురూ ఎలాగో మోసుకొచ్చి బరువు వలన మంచంలో పడుకోబెట్ట లేక కిందనే పడుకోబెట్టారట. ఇవన్నీ జరిగేసరికి రాత్రి పన్నెండు గంటలు అయిందట మా నాన్నగారు దగ్గరున్న ఆస్పత్రికి వెళితే "నేను క్లినిక్ మూసేసి ఇంటికెళ్తున్నాను. రావడానికి కుదరద"న్నారట. ఏం చేస్తారు? వేరొక డాక్టరు వద్దకు వెళితే "నేను ఇంటికి రావడం కుదరదు పేషెంటుని పిలుచుకు వస్తే చూస్తాను" అన్నాడుట. సైకిల్ రిక్షాకానీ, ఆటో కోసరం కానీ చూస్తే ఎవ్వరూ దొరకలేదట. చేసేది ఏం లేక ఇంటికి వచ్చారుట. పోనీ మా అమ్మ చెల్లెలు కొడుకు శశికుమార్ డాక్టరు అతన్ని మేమంతా శేషు అని పిలుస్తాము. వాళ్ళిల్లు చిక్కడపల్లిలో వుంది, మా నాన్నగారిల్లు మెహదీపట్నం దగ్గర మాసాబ్ ట్యాంకులో వుంది. అప్పుడు వాడింకా చిన్నవాడే పెళ్ళికూడా కాలేదు. ఇంత అర్ధరాత్రి వాడ్ని రమ్మనడం సమంజసం కాదని మా నాన్నగారు వాళ్ళు రాత్రి తెల్లవార్లు నిద్రలేకుండా, తెల్లవారు ఝామున 5.30 ఆరవతూండగా డా.శేషుకి ఫోన్ చేస్తే వాడు వెంటనే వచ్చి సికింద్రాబాదు హాస్పటల్ వాడు పని చేసే ఆస్పత్రి అది, అక్కడికి తీసుకెళ్ళాడు.

మర్నాడు సోమవారమైంది. డ్రిప్స్ ఎక్కించారట, ఆక్సిజన్ పెట్టారట. స్కూలుకి వెళ్ళిన మా సుశీలని రప్పించారట. డాక్టర్లు మా నాన్నగారితో రేపు మాములు మనిషి అవుతుందని, మాట్లాడుతుందని, గాబరా పడవద్దని అన్నారుట. సరేకదా, నయమై ఇంటికి పిల్చుకెళ్తాము కదా? అనవసరంగా మద్రాసుకి ఫోన్ చేసి కల్యాణిని కష్టపెట్టడం ఎందుకని మా నాన్నగారు నాకు తెలపలేదట. మా వారికి మాత్రం చాలా కోపం వచ్చింది. ఏది ఏమైనా ఒక్కమాట ఫోన్ చేసి చెప్పివుండవచ్చు కదా అని. సుశీల చెప్పిన ప్రకారం మా అమ్మ కళ్ళు తెరిచి కాసేపు చూచిందట. ఆ వైర్లు అవన్నీ తీసిందట, మా సుశీల రెండు చేతులతో మా అమ్మని ఒత్తిపట్టుకుని వుందట. మా నాన్నగారు డబ్బు తీసుకురావడానికి అని ఇంటికి వెళ్ళి కాస్త ఆలస్యంగా ఆసుపత్రికి వెళ్ళారట. కాసేపటికి ప్రాణం విడిచిందట. కానీ మా నాన్నగారు ఆ అయోమయంలో భార్య చనిపోయిన విషయం ఆయన బుర్రకు ఎక్కలేదట. ఆయనకి అనిపించిందట ఆ రాత్రికే ఆసుపత్రికి పిల్చుకెళ్ళి వైద్యం ఇప్పించి వుంటే బ్రతికి వుండదేమోనని. కింద పడ్డం వల్ల తల నరాలు దెబ్బ తిని మెదడు హెమరేజ్ వల్ల పోయిందని డాక్టర్లు చెప్పారట.

మద్రాసులో మా అమ్మ సడన్‌గా పోయిన షాకు వలన మా మామగారికి సడన్‌గా జబ్బు చేసి విజయా హాస్పిటల్‌లో చేర్పించవలసి వచ్చింది. ఆ సమయంలో మా రమ, పూర్ణ తమ్ముడు నర్సింగరావు మదరాసులో వున్నాడు. పూర్ణ షూటింగ్‌కని ముందరే ఒక ట్రూప్‌తో వెళ్ళిపోయాడు. అమ్మ పోయిన తరువాత చూసుకుని మా వారు, పిల్లలు మదరాసుకు వచ్చిన వెంటనే మా వారు ఫ్లైట్లో బెంగుళూరుకు వెళ్ళిపోయారు. అక్కడ్నుంచి షూటింగ్ జరిగే ధర్మస్థల అనే వూరికి వెళ్ళాలన్నమాట. మళ్ళీ ఇంతలో మా మామగారి జబ్బు

విషయం ఫోన్ సమాచారం విని తిరుగు ఫ్లైట్‌లోనే మదరాసుకి రావాల్సి వచ్చింది మా వారికి. విజయా ఆసుపత్రిలో వున్న వాళ్ళ నాన్నగారిని ఒకసారి చూచి, డాక్టరుతో మాట్లాడి ఆయన ఫరవాలేదు, షుగర్ కొంచెం లో అయిందని భయపడదగినది ఏమీ లేదంటే మళ్ళీ కర్ణాటక వెళ్ళిపోయారు మావారు. ఈ గందరగోళం అంతా పదిరోజులలో జరిగింది.

మా అమ్మ పోయినపుడు మా సుశీల పెద్దకొడుకు రాజా. ఆ వేళ వాడికి గేట్ ఎగ్జామినేషన్ వుండింది. వాడికి ఫోన్ చేద్దామని మా సుశీల భర్త అంటే మా నాన్నగారు ఒప్పుకోలేదు. "ఈ ఎగ్జామ్ పాస్ అయితే వాడు మద్రాసులో ఐ.ఐ.టి చెయ్యాలి. పోయిన మనిషి ఎటూ పోయింది. వాడు వచ్చి చేసేది ఏమిలేదు" అని అడ్డుకున్నారు. ఆ ఎగ్జామ్ ముగించుకుని దిన వారాలకు వచ్చి లబోదిబోమన్నాడట. వాడు ఐ.ఐ.టి అయి క్రమేపి ఉద్యోగంలో ప్రమోషన్స్ వస్తూ మంచి హోదాలో వుంటూ బెంగుళూరులో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. యు.యస్.ఏకి ఆఫరు వస్తే వెళ్ళనన్నాడు. ఏదైనా టెంపరరీగా పనొస్తే అమెరికా, లండన్ వెళ్ళి వస్తుంటాడు. పెళ్ళై భార్య, ఇద్దరు పిల్లలు. అమ్మాయి, అబ్బాయి. వాడికెందుకో ఇండియాలోనే వుండాలని ఇష్టం.

నాకు ఒకసారి 45 యేళ్ళ తరవాత అందరాడవాళ్ళలా యూట్రస్ ప్రోబ్లమ్ వస్తే ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది. విజయా హాస్పటల్‌లో డా.సత్యభామా రెడ్డిగారు చేసారు. అందువలన పదిపదిహేను రోజులు ఆసుపత్రిలో వుండాలంటే గూడూరు నుంచి మా సేతమ్మక్క వచ్చి కొన్నాళ్ళు వుండి వెళ్ళారు. దాని తరువాత ఒక సంవత్సరానికి హెర్నియా ఆపరేషన్ జరిగింది. మావారే నాతో వుంటూ వచ్చారు. నేను ఎప్పుడున్నా ఏ.సి రూము వలన పడుకోడానికి దానికి ఇబ్బంది లేక ఆయనే వుంటూ వచ్చేవారు. షూటింగ్ వల్ల ఆయన ఊర్లో లేకపోతేనే ఎవరి సహాయం అయినా కావాలి. ఇంటి దగ్గర మా రమ వుంది కదా. మా యింట్లోనే కాపురం వుంటున్న సుబ్బయ్య అనే అతను ఆసుపత్రికి, ఇంటికి తిరిగేవాడు. అసలు నేను ఎప్పుడు ఆసుపత్రిలో ఎడ్మిటైనా తప్పని సరిగా మా వారే పగలు, రాత్రి నన్ను కనిపెట్టుకుని అక్కడే పడుకుంటారు.

అలా వుండగా మా వారు ఖాళీ గ్రౌండ్సు కోసరం గాలిస్తున్న సమయంలో వడపళని కుమరన్ కాలనీలో ఒకటిన్నర గ్రౌండ్ స్థలం దొరికింది. అది విజయా హాస్పటల్ వెనుక వీధిలో వుంది. ఇక మా సుధ, "అమ్మా నువ్వు విజయా హాస్పటల్‌కి కష్టపడి ఎంతో దూరం వెళ్ళక్కర్లేదు" అంది. అప్పటికే మేము విజయా హాస్పటల్‌కి ఆస్థాన విద్వాంసులం. బస్సు టర్మినస్‌కి దగ్గర. వడపళని సుబ్రమణ్యం స్వామికి దగ్గర, బజారుకి దగ్గర, అన్నీ అనుకూలాలు వున్నాయి. అందువలన ఆ స్థలాన్ని కొనాలని నిర్ణయించుకున్నాము. డైరెక్టర్స్ కాలనీ ఇల్లు మేము కొనుక్కుని వెళ్ళిన కొత్తల్లో విశాలంగా కనిపించేది. ఫర్నీచర్ ఒక్కొక్కటి కొనుక్కోవడం, మా పూర్ణ, రమలు అక్కడే వుండడం, మా పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతుండడం, మా మామగారు కూడా వుంటుండం ఇన్ని కారణాల వలన కూడా మాకు ఇల్లు సరిపోవడం లేదు. ఇదిలా వుండగా మా అమ్మ పోయిన తరువాత మా నాన్నగారిని ఒకసారి రప్పించుకున్నాం. ఆయన వచ్చి కొన్నాళ్ళు వుండి హైదరాబాదుకు వెళ్ళిపోయారు. కానీ మా మామగారు "విఠల్‌రావుగారూ, కల్యాణి మీ పెద్దమ్మాయి అయినందువలన, తరువాత మీ మూడో అల్లుడు యల్.ఐ.సి వలన బదిలీలు వుంటాయి కనుక మీరు ఇక్కడ వుండడమే శ్రేయస్కరం" అని మా నాన్నగారితో చెప్పారు. నాకు ఎంతైనా సంతోషాన్ని ఇచ్చింది.

ఇదిలా వుండగా ఉషాకిరణ్ మూవీస్ రామోజీరావుగారి దగ్గర్నుంచి పిలుపు వచ్చింది. ఆయనొక యదార్ధ గాధ పత్రికలో చదివిన ఆ ప్రింటెడ్ స్టోరి మా వారికి పంపి ఆ కథ సుధా అనే అమ్మాయి గురించి అని ఆ సినిమా సింగీతం గారే తియ్యాలని కబురు పంపారు. మా వారు ఒకసారి హైదరాబాదుకు వెళ్ళి రామోజీ రావుగారితో మాట్లాడారు. అది సుధాచంద్రన్ అనే అమ్మాయి నిజ జీవితంలో జరిగిన కథ. కారు ప్రమాదంలో కాళ్ళు పోగొట్టుకుని జయపూర్ కాలు పెట్టించుకుని మళ్ళీ చాలా నాట్య ప్రదర్శనలు ఇచ్చిన అమ్మాయి

యదార్ధగాథ. వేరే అమ్మాయి కాక ఆ అమ్మాయి చేస్తేనే హీరోయిన్ పాత్ర రాణిస్తుందని మావారు చెపితే రామోజీరావు గారు ఆ అమ్మాయిని పిలిపించి అంతా మాట్లాడి నిర్ధారణ చేసుకుని నిర్మాణంలో దిగారు. ఆ సినిమాయే "మయూరి"

ఇక మావారు హైదరాబాదు నుంచి వచ్చినప్పటి నుంచి అద్దె ఇల్లు వేట ఎక్కువైంది. కానీ మాకు స్వంత ఇల్లు వదిలి అద్దె ఇంటికి వెళ్ళడం చాలా బాధ వేసింది. ఏం చెయ్యం? ఇల్లు చాలా ఇరుకు అయిపోయింది. అక్కడ వున్నన్నాళ్ళు అందరం హ్యాపీగా వున్నాం. కాలనీ వాళ్ళందరూ కలిసి సినిమా ప్రివ్యూలకు వెళ్తూండడం, సాయంత్రంపూట కింద ఫ్లాట్ వాళ్ళ ఇళ్ళ ముందు కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకోవడం, ఎదురుగా వున్న పార్కులో పిల్లలందరూ ఆడుకోవడం, రోజూ పక్కనే వున్న గుడికి వెళ్ళి వస్తూ పండగలకి, పబ్బాలకి అభిషేకాలు, పూజలు జరిపించడం, రోజూ ప్రొద్దున్నే గుడికి వెళ్ళి దర్శనం చేసి వస్తే కాని టిఫిన్లు తినేవాళ్ళం కాదు. కొన్ని సంవత్సరాలు క్రితం బర్కిట్ రోడ్లో వున్నప్పుడు మా యింటి దగ్గరే వున్న టి.టి.డికి నేనూ, అంబుజమామి పొద్దున్న వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని వస్తే గానీ టిఫెన్లు తినేవాళ్ళం కాదు. ఆ అలవాటు ఇప్పుడు కూడా చేసుకున్నాను. ఇవన్నీ వదులుకుని వెళ్ళాలంటే కష్టంగా వుండదా మరి. పైగా స్వంత ఇంట్లో ఇన్నాళ్ళు వుండి అద్దె ఇంటికి వెళ్ళడమన్న దురదృష్టం వేరేది లేదు.

**అంతకుముందు** వారితో కలిసి కెమెరామెన్ సెల్వరాజ్ గారు 'పిల్లజమిందారు' 'శ్రావణబంతు', తెలుగులో 'వసంత గీతం' పని చేసారు. ఈ సినిమా భీమవరం బుచ్చిరెడ్డిగారు నిర్మించారు. తరువాత తిరుపతి నుండి డా.శ్యామలమ్మ అనే లేడి డాక్టరు నిర్మాణంలో వచ్చిన "సంగీత సామ్రాట్" పిక్చర్లో సెల్వరాజ్‌గారు పనిచేసారు. ఆ టైములో మా వారు అద్దె ఇల్లు వెతుకుతున్నారని తెలిసి తాను వుంటున్న ఇంటిపైన నాలుగు ఫ్లాట్లు కట్టిస్తున్నాను అని, మా వారికి కావలిస్తే తాను ఇస్తానని, ఈ మధ్యే గృహప్రవేశం అయిందని చెప్పారు. మేము ఇల్లు చూసి రెండు ఫ్లాట్స్ కలిపి ఒకే ఇల్లుగా కావాలని చెప్పాము. మధ్య గోడపెట్టకుండా తలుపు పెట్టించారాయన. అందువలన రెండు ఫ్లాట్లు కలిపి నాలుగు బెడ్ రూములు అయ్యాయి. ఒక భాగానికి వంట ఇల్లు ఇంకా మొదలు పెట్టలేదు. అదికూడా గదిగానే వుంచుకున్నాము. అదొక ఇండిపెండెంట్ ఇల్లుగా తయారయింది. ఈ కొస నుంచి ఆ కొస వరకు పెద్దదిగా వుండేది. మాకు చాలా సంతోషమైంది. అన్నిటికన్నా మించి ఆయన మంచితనం మాకు ఎంతో మేలు చేసింది. మా అవసరాలు, కోరికలు మన్నించి అలాగే చేసారాయన. ఇంతలో మా అమ్మ పోయి తామున్న ఇల్లు కూడా అమ్మనున్న మా నాన్నగారు కూడా మదరాసు వచ్చేసారు. అందువలన మాకు, మా పిల్లలిద్దరికీ, మా పూర్ణ, రమాకి, మా మామగారికి, మా నాన్నగారికి మొత్తం ఐదు బెడ్ రూములు ఇక మంచిరోజు చూసుకుని చేరాలి.

ఇంతలో హైదరాబాదులో 'మయూరి' షూటింగ్ మొదలెట్టడానికి కథ, డైలాగులు, పాటలు రికార్డింగులు అన్నీ రెడీ అయ్యాయి. దానికి ఎస్.పి.బాలసుబ్రమణ్యంగారు సంగీత దర్శకులు. మావారు ఇక రెండు రోజులలో హైదరాబాదుకు వెళ్ళాలి. వడపలనీలో స్థలం కొన్నాం కదా? దాని రిజిస్ట్రేషన్ అవ్వాలి. ఆ అమ్మే వాళ్ళు ఇదిగో అదిగో అంటూ వచ్చారు. ఆ స్థలం తమిళ కామిడీ యాక్టర్ బాలయ్య అనే అతనిది. అతనికి ఇద్దరు భార్యలు. ఆయన బతికి లేడు. అందరూ, అంటే ఇద్దరు భార్యల సంతానము సంతకాలు పెట్టాలి. మొత్తం మీద ఒకరోజు నిర్ణయించారు. సమయం పొద్దున అన్నారు. పొద్దున్న అన్నది సాయంత్రానికి వాయిదా పడింది. ఆ రాత్రి ఫ్లైట్‌కే మా వాళ్ళ ప్రయాణం. మర్నాడే 'మయూరి' షూటింగ్ ప్రారంభం. మాకందరికి చాలా టైము పట్టింది. రాగానే మా వాళ్ళు స్నానాలు, భోజనాలు చేసి విమానాశ్రయానికి పరుగులే పరుగులు.

మా వాళ్ళు 'మయూరి' షూటింగు పనుల్లో వుంటుండగానే, వాళ్ళు హైదరాబాదులో వుంటున్నప్పుడే మా అమ్మ సంవత్సరీకాలొచ్చాయి. దాని కోసరమని నేనూ, పిల్లలు హైదరాబాదుకి ప్రయాణం కట్టాలి కదా. మా రమని కూడా పిల్చుకెళ్ళాము.

సంవత్సరీకాలయ్యాక మేము నలుగురం వచ్చేశాము. మా వారు, పూర్ణా కూడా తరువాత వచ్చారు. అక్కడే వుంటున్న ములాన షూటింగ్ ముగించుకుని మధ్యాహ్నం భోజనాలకి మాత్రం వాళ్ళిద్దరూ వచ్చేవారు. మా నాన్నగారు మాకోసరమని తాజ్‌మహల్ హోటల్లో ఫ్యామిలీ రూము తీసుకున్నారు. మా చెల్లెళ్ళిద్దరూ, ఆ ఊరు బంధువులు, మా మేనత్త అందరం చేరాం. తమాషా ఏమిటంటే మా పిల్లలు, మా బాబాయి పిల్లలు, ఇంకో పిన్ని పిల్లలు అందరూ పన్నెండు పదిహేనుమంది చేరేసరికి వాళ్ళంతా సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. మేము వెళ్ళిన సందర్భం ఏమిటి? వాళ్ళ ప్రోగ్రాం ఏమిటి? పిల్లలు వాళ్ళేం పట్టించుకుంటారు?

మా అమ్మ పోగానే కొన్ని నెలల తరువాత వాళ్ళు వున్న వాటా వుండేదికదా, అది ఎవరు కొనుక్కుంటారు? అది మావారే కొంటానన్నారు. మా నాన్నగారు అల్లుడే కదా ఏదో రేటు చెప్పారు. కానీ మా వారు మాత్రం మా నాన్నగారిని నష్టపోవద్దని మార్కెట్టు రేటు ఎలా వుంటే అదే చెప్పమని అడిగారు. ఆ రేటుకే మేము కొన్నాం. అంటే రెండు వాటాలు మేము కొన్నామన్నమాట. రెండు అద్దెలకు ఇచ్చే వాళ్ళం. ఆ సమయంలో కూడా బాలాజీయే అన్నీ చూసుకునేవాడు. అద్దె వసూళ్ళు చేయడం, బ్యాంకులో వేయడం, ఎప్పటికప్పుడు మాకు ఫోన్లు చేయడం.

'సంగీత సామ్రాట్' రిలీజ్ అయింది. తరువాత 'మయూరి' పని జరుగుతున్నప్పుడు కొంచెం గ్యాప్ వచ్చి మావారు, మా పూర్ణ మద్రాసుకి వచ్చి కొన్నాళ్ళు వున్నారు. ఆ సమయంలో మేము డైరెక్టర్స్ కాలనీ ఇల్లు ఖాళీ చేసి సెల్వరాజ్ గారింట్లో సామానంతా చేర్చేసాము. అది అద్దె ఇల్లు అయినా ఇండిపెండెంట్‌గా వుండేదేమో, అదీను గృహప్రవేశం అవగానే మేమే మొదట టెనెంట్స్ అవ్వండవల్లనేమో మా స్వంత ఇల్లు భావనగానే వుండేది. అసలైతే మా స్నేహితులు, మా బంధువులలో కొందరు మేము ఇల్లు కొనేశామని అనుకునేవారు. సెల్వరాజ్‌గారు, భార్య కాకుండా వాళ్ళ కుటుంబంలో అందరూ మంచివారుగా కనిపించారు మాకు. 1985 మార్చి 20 వ తేదీన మా పెళ్ళిరోజు 25 సంవత్సరాలు సిల్వర్ జూబ్లీ వచ్చింది. తిరుపతిలో కళ్యాణోత్సవం చేద్దామని నిశ్చయించుకున్నాము. మా వారు టి.టి.డి.కి ఫోన్ చేసి కనుక్కుంటే వివరాలు చెప్పారు. 1000రూపాయలకి కల్యాణోత్సవానికి పదిమందిని అలాట్ చేస్తామని, 500రూపాయలు చిన్న కల్యాణోత్సవానికి 5మందికి కేటాయించబడిందని చెప్పారు. రెండవ కల్యాణం వాళ్ళ అన్న, ఒదినగార్ల చేత చేయిద్దామని నిశ్చయించారు మావారు. మా చెల్లెళ్ళిద్దరికి ఫోన్ చేసాము, గూడూరుకి ఫోన్ చేసాం. అందరూ ముందు మదరాసుకు వస్తే ఇక్కడనుండి రెండు కార్లు వేసుకుని వెళ్ళవచ్చని ఫోన్ చేసాను. మా అంబాసిడర్ కారుకి మంచి రంగు వేయించి కొత్త కారులా తయారు చేసాము. ఇంతవరకు మేము కొన్న సెకండ్ హ్యాండ్ కార్లలో ఇది మూడవకారు. ఇక అక్కడినుంచి కొత్తకార్లు కొంటూ వచ్చాం. మా చిన్న చెల్లెలు కుటుంబం వచ్చింది. దాని భర్త రామకృష్ణారావుగారు మా వారికిచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మా పెద్ద చెల్లెలు సుశీల కుటుంబం పాత పాటే. ఏమంటే ఉద్యోగాలు, స్కూళ్ళు, చదువులు కాబట్టి వాళ్ళు రాలేదు. మా డైరెక్టర్స్ కాలనీ గృహప్రవేశానికి కూడా రాలేదు. గూడూరు వాళ్ళు వచ్చారు. కొంతమంది మాత్రం తిన్నగా తిరుపతికి వచ్చారు. రెండు కార్లు వేసుకుని బయలుదేరాం. మా మామగారు వయసు అయినందువలన ప్రయాణం చేసే స్థితిలో లేరు. మా నాన్నగారు కూడా మద్రాసులో వుండడం వలన ఆయన కూడా వచ్చారు. ఇంట్లో మామగారిని చూసుకోడానికి మా బావగారి రెండోబ్బాయి నర్సింగరావుని గూడూరు నుంచి పిలిపించాం. ఆ సమయంలో మా నర్సింగ్ స్టేట్ బ్యాంకులో అప్పుడప్పుడు 6 నెలలు, 3 నెలలు టెంపరరిగా ఆత్మకూరు, మనుబోలులాంటి ఊళ్ళలో ఉద్యోగం చేసేవాడు. అతనికి కొన్ని రోజులు గ్యాప్ రావటం వలన అతన్ని పిలిపించుకున్నాం. అతనలా చేస్తూ మొత్తం మీద ప్రమోషన్ల మీద సోమశిల, మనుబోలు, వెంకటగిరి చివరికి గూడూరులోనే ఉద్యోగం అయి అక్కడే సెటిల్ అయ్యాడు. వాళ్ళ అమ్మ ఇంటి స్థలంలోనే పక్కన ఇల్లు కట్టుకున్నాడు. పెళ్ళయి ఇద్దరు పిల్లలు. మగపిల్లవాడు, ఆడపిల్ల. అబ్బాయి సుధీంద్ర ఇంజనీరింగ్ పాసై ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆడపిల్ల పావని యం.యస్.సి పాసై గూడూరులోనే హైస్కూల్‌లోనే టీచరుగా చెప్తుంది. 2012, సెప్టెంబరు 21న దాని పెళ్ళి.

తిరుపతి ట్రిప్పుకి వద్దాం. మేము రెండు కార్లు వేసుకుని బయలుదేరాం. మేము దార్లో తినడానికి పులిహోర, పెరుగన్నం, స్నాక్స్, ప్యాక్ చేసుకుని బయలుదేరాం. దార్లో తిరుతణి దగ్గర ఆగి, పొద్దున బ్రేక్‌ఫాస్ట్‌లాగ పులిహోర తిని మళ్ళీ బయలుదేరాము. మా కారు ముందుగా రెండవ కారు వెళుతూంది. మా కారులో ముందు సీట్లో మా మరిది, రెండో కూతురుని ఒళ్ళో కూర్చోబెట్టుకుని, ఇంకొకరెవరో, వెనక సీట్లో నేను, మా రఖుమ, మా వారు, మా నాన్నగారు కూర్చున్నాము. ముందు కారేమో వెళ్తోంది. ఇంతలో ఎదురు నుంచి ఒక కారు స్పీడుగా వస్తోంది. దాన్ని తప్పించుకోవడానికి మా కారు డ్రైవరు ప్రయత్నిస్తే మా కారు బాగా ప్రక్కకు ఒరిగి ఎదురుగా వున్న చెట్టుకు ఢీ కొంది. మా చెల్లెలి కూతురు గట్టిగా అరిచింది. ఆ పాపకు ఏమీ అవ్వలేదు. కానీ షాక్ అయింది. చేతికి కొద్దిగా దెబ్బ తగిలింది. వెనక సీటు చివర్లో కూర్చున్న మా నాన్నగారి చెవికి ఏదో కొద్దిగా తగిలింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏ హానీ జరగలేదు. కారు మాత్రం ముందువైపు చిత్తు చిత్తుగా సొట్టలు పడ్డాయి.

మేమంతా కిందికి దిగాం. అందరికీ సారీ చెప్పుకుని ఏడ్చేసాను. నాకు ఏమి చేయాలో తోచలేదు. ముందు వెళుతున్న కారు, మా కారు ఎంతసేపటికీ కనిపించక పోయే సరికి వెనక్కి తిప్పుకుని వచ్చింది. దాంట్లో మా పూర్ణ ఇంకా కొంతమంది వున్నారు. అందులోని వాళ్ళు కూడా కిందికి దిగారు. మా మరిది, మా పూర్ణా మాత్రం ఆ ప్రాంతం మెకానిక్ ఎవరైనా దొరుకుతారేమోనని వెళ్ళారు. నేను బాధపడుతుంటే మా తోటికోడలు సీతమ్మక్క వచ్చి ఓదార్చి "అలాంటి సారీలు అవి పెట్టుకోవద్దు. మేము పైవాళ్ళమా ఏదో ఇలా జరుగుతూ వుంటుంది. అందరం ప్రాణాలతో బయటపడ్డాం చూడు. వెంకటేశ్వర స్వామి దయ వుంది కనుకనే బయటపడ్డాం. నువ్వేం దిగులుపడకు" అంది.

కార్లోంచి ఒక జంపకాన తీసుకుని క్రింద పరుచుకుని పిల్లలు అందరం కూర్చున్నాం. నన్ను డైవర్ట్ చేయడానికి మా రఖుమ దాని పిల్లల చేత పాటలు పాడిస్తూ. డ్యాన్సులు చేయించింది. దాని ముగ్గురు ఆడపిల్లలు చాలా చిన్నపిల్లలు. మా పిల్లలూ, మా బావగారి పిల్లలు అంతా పాటలు పాడడం, అంత్యాక్షరీ ఆడడం మొదలు పెట్టారు. రోడ్లో వెళ్ళే వాళ్ళందరూ మా చిత్తుకారు చూడడం, మేము ఏదో పిక్‌నిక్ వచ్చినట్లు కులాసాగా పాడుతూ వుంటే, చూసి వాళ్ళు ఆశ్చర్యపోవడం, కొందరు వేరుశెనగలు అమ్మే వాళ్ళయితే మాకు కొన్ని పొట్లాలు ఇచ్చి డబ్బులు తీసుకోకనే వెళ్ళేవారు మా పరిస్థితి చూసి. కాసేపటికి పిల్లలకి, పెద్దలకి ఆకలవడం మొదలెట్టింది. కానీ మేము తెచ్చుకున్న ఆహారం అంతా ఆ రెండో కారులో వుండిపోయింది. ఆ కారు ఇక్కడ లేదాయే. కొంతమంది తిరుత్తణి వెళ్ళే బస్సు ఎక్కి ఒక కొట్టుకు వెళ్ళి బ్రెడ్, బిస్కెట్లు తెచ్చి పిల్లలకి ఇచ్చాము. అంతా కొంత తమాయించుకున్నారు. మెకానిక్‌ని పిలుచుకొచ్చిన తర్వాత మమ్మల్నందరిని ఆ రెండో కారులోకి పంపించేసారు తిరుపతికి. ఒకరి నెత్తిన ఒకరు కూర్చుని వెళ్ళాం. కాస్త దగ్గరే కదా తిరుపతి. కాటేజి బుక్ చేసాం. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. కాలం మించిపోతుంది ఏం చేస్తాం అలాగే వెళ్ళి చేరాం తిరుపతికి.

ఎన్ని అవాంతరాలైనా మేము తిరుపతికి చేరగానే అందరం స్నానాలు చేసుకుని అంతా సర్దుకునే సరికి రెండు గంటల తరువాత పూర్ణా, రామకృష్ణారావుగారు కూడా వచ్చేసారు. మా వారు టి.టి.డి ఆఫీసుకి వెళ్ళి మేము వచ్చిన విషయం చెప్పి మర్నాడు జరగవలసిన కార్యక్రమాల గురించి తెలుసుకుని వచ్చారు.

మర్నాడు అనుకున్న ప్రకారం కల్యాణోత్సవాలు, దేవుడి దర్శనాలు, తిరుపతిలో మిగతా ప్రదేశాలు తిరగడం అన్నీ అయ్యాయి. టి.టి.డి వాళ్ళు చాలా ప్రసాదాలు ఇచ్చారు. అవి మేమంతా తీసుకెళ్ళడానికి నిల్వవుండేవే ప్యాక్ చేసుకుని కాటేజి పక్కన వాళ్ళకు కూడా పంచితే ఇంకా చాలా మిగిలిపోయింది. ఏమి చేయాలో పాలుపోలేదు. ఇంతలో మా తోటి కోడలికి ఒక ఆలోచన వచ్చింది. అప్పటికే చాలా పొద్దు పోయింది. "కల్యాణీ గుడికి వచ్చేదారిలో చాలామంది కనబడ్డారు. అక్కడికెళ్ళి చూద్దాము" అంటే అవన్నీ కారులో పెట్టుకుని బయలుదేరాము. వెళ్ళి అలా వెతుకుతూ వుంటే చాలా మంది వున్న ఒక పెద్ద కుటుంబం గుంపుగా కూర్చుని వున్నారు. మేమొచ్చి

ప్రసాదం ఇచ్చేటప్పటికి వాళ్ళు పరమానందంతో "మేము వచ్చేటప్పటికే చాలా ఆలస్యం అయింది. ఎక్కడైనా భోజనాలు దొరుకుతాయా అని ఆలోచిస్తున్న సమయంలో దేవుడు పంపినట్టు మీరు వచ్చి ప్రసాదం ఇచ్చారు" అన్నారు. ఒకొక్కప్పుడు భగవంతుడు మా చేత ఇలాంటి పనులు చేయిస్తూ వుంటాడేమో.

తిరుగు ప్రయాణం కట్టాం. గూడూరు నుంచి వచ్చిన వాళ్ళు అలాగే వెళ్ళిపోయారు. మా చెల్లెలు వాళ్ళు తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళ్ళిపోయారు. మా నాన్నగారు కూడా వాళ్ళతోనే హైదరాబాదుకి వెళ్ళిపోయారు. మేము మదరాసుకి చేరేసరికి పదకొండున్నర అవుతుంది. మేడమీద అన్ని గదుల్లో లైట్లు వెలుగుతున్నాయి. ఇదేమిటి ఇంత రాత్రివేళ లైట్లు వెలుగుతున్నాయి అనుకున్నాం. నర్సింగ్‌ని ఏమైందని అడిగితే "ఆవేళ పొద్దున వాళ్ళ తాతగారు స్విచ్‌ఆఫ్ చేస్తూ తూలి  కిందపడ్డారట. నడుము నొప్పిగా వుందని చెప్పారు. ఆయన మంచం మీద పడక కుర్చీలో కూర్చున్నట్టు జారుగా కూర్చున్నారు" అని చెప్పాడు. జరిగిన దానికి అందరం బాధపడ్డాము. పాపం మా నర్సింగ్ ఒక్కడే ఎలా చేసాడో అనుకున్నాం.

మా వారు వెంటనే "విజయా హాస్పటల్‌కి వెళదాం రండి నాన్నా" అంటే

"రేపు ఉగాది కదరా, ఉగాది పచ్చడి తీసుకుని వెళ్తా" అన్నారు.

"నన్ను తిరుపతిలో తలచుకున్నారా?" అని అడిగారు.

కానీ విచిత్రం ఏమిటంటే ముందురోజు రాత్రంతా మేము ఆయన్నే తలుచుకుంటూ వున్నాం. తమాషాగా వుంది కదా. టెలిపతిలాగ. మా మామగారికి నడుముకి మెటల్ వేసి మేజర్ ఆపరేషనయింది. పదిహేనురోజులుండవలసి వచ్చింది. ఊపిరితిత్తులలో పస్ చేరిందన్నారు డాక్టర్లు. వైద్యం చేసారు. నాలుగైదు రోజులకి డిశ్చార్జయి ఇంటికి వచ్చేశారు. కానీ కొద్ది రోజులకే అంటే ఏప్రిల్ 10, 1985న ఆయన మరణించారు. చనిపోయేనాటికి ఆయన వయసు 88. మా నాన్నగారు ఈయనకంటే పదిహేనేళ్ళు చిన్నవారు.

అప్పట్లో రాజ్‌కుమార్‌గారు వాళ్ళు మద్రాసులోనే ఉంటుండేవారు. స్వంత ఇల్లు చాలా పెద్దది వుంది. కథ సిట్టింగ్స్ వాళ్ళ యింట్లోనే జరిగేవి. ప్రసిద్ధ కన్నడ రచయిత ఉదయ శంకర్‌గారుండేది కూడా మదరాసే. మా వారు రోజూ క్రమం తప్పకుండా ఉదయం 9.30గంటలకల్లా రాజ్‌కుమార్‌గారింటికి వెళ్ళేవారు. మా వారికి పంక్చువాలిటీ ఎక్కువ. మా మామగారు పోయిననాడు ఈయన చాలాసేపటి వరకు సిట్టింగ్‌కి వెళ్ళకపోవడం చూసి పార్వతమ్మగారన్నారట "సింగీతంగారింకా రాలేదే, ఎందువలనో, ఆయన ఆలస్యం చెయ్యరే" అంటే రాజ్‌కుమార్‌గారు భార్య చెప్పింది కరెక్ట్ అని వాళ్ళ రెండవ అబ్బాయి రాఘవేంద్ర రాజ్‌కుమార్‌ని మా యింటికి పంపారు. అతను వెళ్ళి విషయం చెప్పాడట - సింగీతంగారి నాన్నగారు పోయారని. అంతే వెంటనే భార్యాభర్తలిద్దరూ వచ్చి వాలారు. ఆవిడ మాత్రం కాసేపు వుండి వెళ్ళిపోయారు. ఆయన మాత్రం చాలాసేపుండి వెళ్ళారు. అరగంటకల్లా ఇద్దరు బాయ్స్ రెండు పెట్టెల నిండా కూల్‌డ్రింక్స్ బాటిల్స్ తెచ్చి 'సారు మీకిమ్మన్నారు' అని చెప్పి డైనింగ్ టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయారు. అన్నిటికన్నా చెప్పుకోదగ్గ విషయం. అద్దె యిల్లయినా శవాన్ని ఇంట్లోనే ఉంచడానికి సెల్వరాజ్‌గారు ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా అనుమతించారు.

మా బావగారి పిల్లల్లో పద్మ, పూర్ణ పెళ్ళి అయ్యింది కదా. రెండో అమ్మాయి లక్ష్మీ పెళ్ళికూడా అయింది. ఇక మూడో అమ్మాయి సత్యభామ పెళ్ళికి సంబంధాలు చూస్తున్నప్పుడు మదరాసులోనే ఒక సంబంధం వచ్చింది. సత్యభామ డిగ్రీ పూర్తయి కొన్నాళ్ళు స్కూల్లో, కొన్నాళ్ళు నాయుడు పేటలోని స్టేట్ బ్యాంకులో పనిచేస్తూ వుండేది. నేనూ, మా కజిన్ సిస్టర్ రుఖుమ కలిసి ఒక సంబంధాన్ని మాట్లాడాము. ఇంటిపేరు తాడూరి వారు. మాటల్లో తెలిసింది. ఈ అబ్బాయి తల్లి తాడూరి కమలగారు. మా నాన్నగారు సమకాలికులట. చిన్నప్పుడు బెజవాడలో ఆడుకునేవారట, చాలా సన్నిహితులట. ఆ అబ్బాయి పేరు శ్రీనివాసరావు. ఇక ఆ కమలమ్మగారు ఫలానా విఠల్‌రావు గారి కూతురు కల్యాణి తెచ్చిన సంబంధమే కావాలని పట్టుపట్టి పెళ్ళికి ఒప్పుకుంది. పెళ్ళిచూపులు మా యింట్లోనే జరిగాయి.

1985వ సంవత్సరం నవంబరు 1వ తేదీన గూడూరు టి.టి.డి కల్యాణ మండపంలో పెళ్ళి జరిగింది. ఈ హడావుడిలోనే దీని పెళ్ళికి ముందు మా నర్సింగ్ పెళ్ళి చూపులై అదే మాసం 24వ తేదీన ఏలూరులో జరిగింది. అమ్మాయి పేరు జయలక్ష్మి. ఈ అమ్మాయి తల్లి సుప్రసిద్ధ డైరెక్టర్ కమలాకర కామేశ్వరరావుగారి భార్య, స్వంత అక్కా చెల్లెళ్ళు.

సత్యభామ పెళ్ళవగానే మేమంతా ఏలూరుకు వెళ్ళాలి. నవంబరు 23వ తేదీన మదరాసు నుంచి వెళ్ళాము. వయా గూడూరు, నెల్లూరు వెళ్ళేవాళ్ళం. అందరికి ఒకే కంపార్టు మెంటులో మదరాసు నుంచే రిజర్వేషన్ చేయించుకుని వెళ్ళాం. రైల్లో అంతా మేమే కనుక పాటలు పాడుకుంటూ, అంత్యాక్షరీ ఆడుకుంటూ పొద్దు గడిచినదే తెలియలేదు. గూడూరు నుంచి బిసిబెళబాత్, పెరుగన్నం, చిప్సులాంటివి తెచ్చారు. ఆఖరికి కాఫీ క్యాన్ మొత్తం తెచ్చేసారు. పొద్దున్న ఎక్కినవాళ్ళం రాత్రి పదిగంటలకి ఏలూరు చేరాం. కానీ ఏలూరు వచ్చిందన్న విషయం ఎవరికీ తెలియలేదు. ప్రయాణం అంత బాగా సాగింది. మర్నాడు పెళ్ళి. ఆవేళ రాత్రి అమ్మాయిని తీసుకుని గుడూరుకు చేరాము. అందరం పాటలు పాడాం. మా పూర్ణ వీడియోలు కూడా తీసాడు. మర్నాడు సత్యనారాయణ వ్రతం చేసుకుని మధ్యాహ్నం మదరాసు వాపసు వచ్చేసాం.

ఇప్పుడు సత్యభామ, శ్రీనివాసరావుకి ఒక ఆడపిల్ల, ఒక మగపిల్లవాడు. ఆడపిల్ల పేరు అజంతా. 2001 ఆగస్టులో పెళ్ళయి భర్త గురురాజ్‌తో యిప్పుడు యు.యస్‌లో ఉద్యోగం చేస్తోంది. మగపిల్లవాడు అశ్విన్‌కుమార్ డిగ్రీ చదువుతున్నాడు.

మయూరి సినిమా రిలీజ్ అయిన తరువాత ఆ సినిమాకు మంచి పేరు వచ్చింది. బాగా ఆడింది కూడా. వందరోజులు పూర్తిచేసుకుంది. తరువాత ఫిలింఫేర్ అవార్డు కూడా వచ్చింది. ఈ ఫంక్షన్ మదరాసులోనే అయింది. మావారేమో అమెరికాలో వున్నారు. అవార్డు ఎవరు తీసుకుంటారు? మా రెండో అమ్మాయి సుధ స్టేజ్ మీదకు వెళ్ళి తీసుకుంది. ఆ అవార్డు నాట్యాకారంలో వుండే బూడిద రంగు కంచు బొమ్మ. కొంత బరువు వుంటుంది. కానీ సుధ చిన్నతనం వలన దానికి చాలా బరువే. దానికందించే compere నువ్వు "దీన్ని మోయగలవా" అందట. కన్నడ సినిమా కోసం వచ్చిన పార్వతమ్మగారు కూడా స్టేజి మీద వున్నారు. "నువ్వు మొయ్యలేవమ్మా ఎవరికైనా ఇయ్యి" అన్నారట.

కన్నడంలో తీసిన 'దేవతా మనుష్య' అనే సినిమాకి మా వారి కథ. రాజ్‌కుమార్‌గారు హీరో మిగతా వాళ్ళు గీతా, సుధారాణి. ఈమెను కూడా ఆనంద్ సినిమాకు పరిచయం చేసారు. "దేవతా మనుష్య"కు రాజ్‌కుమార్‌గారు మేకప్, విగ్గు లేకుండా ఒరిజనల్ గెటప్‌లోనే నటించారు. ఈ సినిమాలో ఆయన చాలా అద్భుతంగా నటించారు. ఆ సినిమా చూసిన తరువాత ఆయనకి పాదాభివందనం చేసాను. ఈ సినిమాకి ఆయనకి బెస్ట్ యాక్టర్ అవార్డు వచ్చింది.

సహజంగా నాకు కొంచెం కోపం ఎక్కువ. పెళ్ళైన తరువాత మా అమ్మమ్మ, మా పిన్ని అనేవారు. "నువ్వు కొంచెం కోపం తగ్గించుకోవే, పైగా తొందర ఎక్కువ. మీ ఆయన చూడు ఎంత శాంత స్వభావుడో, కోపం అన్నమాటే లేదు ఆయనకి" అనేది మా పిన్ని. మా అమ్మమ్మ అయితే మా వారిని ధర్మరాజు అనేది. మా పిన్నికి పంతులమ్మకి ఊటీకి వెళ్ళిన అనుభవం చెప్పాను. అక్కడ హీరో రంగనాథ్ అనేవారు, నవతా కృష్ణంరాజుగారు, భార్య బలరామ రేవతిలని, మావారూ నేనూ కృష్ణుడు, రుక్మిణి అని, రంగనాథ్, దీప శశిరేఖా అభిమన్యుడు అని అనేవారని మా పిన్నితో చెప్పాను. "రంగనాథ్ గారు తప్పు చెప్పారు. నువ్వు సత్యభామ అయితే ఆయన రుక్మిణి అని చెప్పాల్సింది. నీకు ముక్కుమీద కోపం వుంటుందని ఆయనకి తెలియదు కాబోలు" అనేది.

రంగనాథ్‌తో మా వారు చాలా సినిమాలు తీశారు. మా కుటుంబ స్నేహితుల ఇళ్ళకు వెళ్తే "ఇప్పుడూ మీ వారు ఏం సినిమా తీస్తున్నారు, హీరో రంగనాథ్ తెలిసిన విషయమే హీరోయిన్ ఎవరూ?" అని అడిగేవారు. చాలాకాలం అయిన తరువాత విజయా కంబైన్స్ నిర్మాణంలో మా వారు దర్శకత్వం వహించిన "బృందావనం" సినిమాలో ఒక క్యారెక్టర్ వేషంలో కనిపిస్తారు.

నెల్లూరులో వెంకోజి అనే మా బంధువు ఒకాయన వుండేవారు. ఆయన మా తోటికోడలు సీతమ్మక్కకి స్వంత అన్నగారు. అందువలన నేనుకూడా చెల్లెలు వరుసే అవుతానుగా. నేను ఆయన్ని అన్నా అని పిలిచేదాన్ని. పైగా మా వారు ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు నెల్లూరులో చదువుకున్నారు. దాంతో వారు ఆయనకి చాలా సన్నిహితుడు. దానిని బట్టి నన్ను కూడా స్వంత చెల్లెలులాగా ఆప్యాయంగా చూసుకునేవారు. ఆయన భార్య సత్యవతి కూడా మా నాన్నగారు నెల్లూరులో వుంటున్నప్పుడు చాలా పరిచయం. వెంకోజీగారి అసలు పేరు రఘోత్తమరావు. వాళ్ళ ఇంటిపేరు ఉదయగిరి. కానీ అందరూ వెంకోజి అని పిలిచేవారు. ఆయనకి స్వంత ఇల్లుకానీ, ఆస్తిపాస్తులుకానీ, ఉద్యోగం, సద్యోగం కానీ ఏమీలేదు. వయస్సులో వున్నప్పుడు ఎలక్ట్రిక్ మెకానిక్ పని చేస్తుండేవారు. అయితే చాలా పలుకుబడి గల మనిషి. కానీ మనిషికి కొంచెం కోపం ఎక్కువ. ఎక్కడ శుభకార్యం జరిగినా ఈయన తప్పక అక్కడ వుండాల్సిందే. ఏటేటా తానే పూనుకుని శ్రీరామనవమి కల్యాణోత్సవం జరిపించేవారు. ఆ కల్యాణోత్సవంలో కొన్ని వందల కంకణాలు, పసుపుతాడు, పసుపుకొమ్ములతో తయారుచేసి, సీతారాముల పాదాల మీద వుంచి ఆ కంకణాలని అందరికి పంచేవారు. పెళ్ళికాని పిల్లలకు పెళ్ళిళ్ళు, పిల్లలు లేని వారికి పిల్లలు, ఇలా ఎవరి కోరికలైనా తీర్చేవి యీ కంకణాలు అని ప్రజల నమ్మకం. ఆయన మీద గురి. అందుకే వెంకోజీ మామా అని కొందరు, తాతా అని కొందరు, అన్నా అని కొందరు వరుసలు పెట్టి పిలిచేవారు. మా రెండో అమ్మాయి సుధ కూడా దాని కొడుక్కి మూడేళ్ళవరకు మాటలు రాలేదని కంకణం కట్టింది. వాడు ఇపుడు బాగా మాట్లాడుతున్నాడు. స్కూల్లో మంచి మార్కులు సంపాదించుకుంటున్నాడు. వాడి పేరు అభినవ్ పదవతరగతి చదువుతున్నాడు. పదిహేను సంవత్సరాల వయస్సు. శ్రీరామ నవమికి ఏడాదికొక దంపతులని కూర్చోపెట్టేవారు సీతారాముల కల్యాణం చెయ్యడానికి. ఏటేటా రాఘవేంద్ర స్వామి ఆరాధనలు మూడురోజులు జరిపించడానికి ఇంటింటికి వెళ్ళి బియ్యము, డబ్బు, వగైరా వసూలు చేసి జరిపించేవారు.

కొన్నాళ్ళు నాకు ఆర్థోపెడిక్ సమస్య వలన ఒంట్లో బాగోలేక కూర్చోలేక పోయేదాన్ని. ఒకసారి శ్రీరామనవమి కల్యాణోత్సవానికి నన్ను, మా వారిని పిలిచారాయన. నాకు చేతకాదు, కూర్చోలేను, రాలేనని ఫోను చేసాను. కాదూ కూడదని శ్రీరాముడే పట్టుబట్టి పిలిపించి మొత్తం మీద మా చేత కల్యాణోత్సవం చేయించారు. ఆయన పట్టుదల, శ్రీరాముడు నాకిచ్చిన శక్తివలన నాకే కష్టమూ కలగకుండా జరిగిపోయింది. ఆయన దృఢ సంకల్పమే నాకు దోహదమిచ్చింది. నేనూ, ఆయనా స్వంత అన్నా చెల్లెళ్ళం కాకపోయినా మా యిద్దరి మధ్యా అనుబంధం వుండేది. ఆయన భార్య వయస్సయ్యేకొద్దీ జబ్బు మనిషిగా బాధపడేది. మందులకి దానికి ఆయనకి డబ్బు అవసరం వుంటుండేది. ఆఖరి రోజుల్లో ఆవిడ జబ్బు పరంగా ఆయనకి డబ్బు బాగా ఖర్చయ్యింది. కానీ నిజానిజాలు వెంకోజీ అన్నకు, నాకు మధ్య మాత్రమే తెలుసు, మా వారి సహకారంతో లెండి.

**మా పెళ్ళైన తరువాత** ఒకటి రెండేళ్ళకి నెల్లూరికి వెళ్ళాం. ఆయనింట్లో లక్ష్మీదేవి క్యాలెండర్ వుండేది. వెంకోజీ అన్న నన్ను పిలిచి "కల్యాణీ, నీకు ఆ క్యాలెండర్ కావాలా" అని అడిగారు. "సరే ఇవ్వండి.. అన్నా. నేను ఫ్రేమ్ కట్టించుకుని గోడకు తగిలించుకుంటా" నన్నా. తరువాత తెలిసింది నాకు అది రవివర్మ పెయింటింగ్ అని. ఆయన వెంటనే ఇచ్చేసారు నాకు. ఆయనకొక్కతే కూతురు. పేరు రమ. మేనరికం. తన చెల్లెలు సేతమ్మ కొడుకు పూర్ణాకిచ్చి పెళ్ళి చేసారు. పూర్ణ మొదటి నుంచి మాతోనే వుంటున్నందువలన ఆ అమ్మాయి పెళ్ళైయి మా యింటికే వచ్చింది. అన్నతో తమాషాకి అన్నాను. "ముందు లక్ష్మీదేవిని ఇచ్చారు. తరువాత మీ కూతురిని మా యింటికి పంపారు" అని. మా పిల్లలిద్దరికి వాళ్ళ వదిన అంటే చాలా ఇష్టం. తన దగ్గర వాళ్ళకు బాగా అలవాటు అయింది. రమ కూడా మా పిల్లల్ని సొంత ఆడపడుచులానే చూసుకుంటుంది. తన కూతురు శీను, కల్యాణీల చెంత పడడం వెంకోజీ అన్న చాలా సంతోషించేవారు.

మేము అప్పుడప్పుడు నెల్లూరుకు వెళ్తూండడం, వారు తరచూ మదరాసు వస్తూండడం జరిగేది. మా పిల్లల పెళ్ళికి వారిద్దరినీ ముందుగానే పిలిపించుకునేదాన్ని. ఇక శ్రీరామనవమి, రాఘవేంద్రస్వామి ఆరాధనలకి తరుచూ వెళ్తుండడం వలన చాలా దగ్గర అయ్యాం. ఆయన బలవంతం వలన మేము కల్యాణోత్సవం కూడా జరపడం జరిగింది. ఇటీవల మూడేళ్ళ క్రితమే ఆయన మరణించారు. అంతకు ముందు రెండేళ్ళ కిందట భార్య సుమంగళిగా చనిపోయారు. మా చెల్లెలు వాళ్ళు యల్.ఐ.సి బదిలీ అయి వచ్చిన తరువాత వాళ్ళ పెద్దమ్మాయి పెళ్ళి జరిగింది. ఆ అమ్మాయి పెళ్ళి వెంకోజిగారు తన భుజాల మీద భారం వేసుకుని నడిపించారు అంతటి మహానుభావుడు. కొంతమంది అన్ని పనులు తమ డబ్బుతోనే నడుస్తుందని అపోహ పడతారు. కానీ వెంకోజీ గారిలాంటి మహానుభావులు ఎంతమంది వుంటారు?

మేము వడపళని కుమరన్ కాలనీకి వచ్చిన తరువాత కొన్ని సంవత్సరాలకి ఖాళీ స్థలాలు ఎక్కడైనా వున్నాయేమో కొనుక్కోవడానికి వెతుకుతుండేవాళ్ళం. అప్పటికే మా శకుంతలకి పెళ్ళి అయిపోయింది. అన్ని చోట్లా వెతికి వెతికి చివరికి యం.జి.ఆర్ హాస్పటల్ వెనకాల చాలా స్థలాలు వుంటే దాంట్లో ఆరు గ్రౌండ్లు కొన్నాం. మా శకుంతలకి రెండు, మా సుధకి రెండు, మా పిల్లలతో పాటు సమానంగా మా పూర్ణకి రెండు గ్రౌండ్లు కొన్నాం. ముగ్గురికీ ఒకే చోట కొన్నాం. అది చూసి మా తోటికోడలు సేతమ్మక్క "అదేంటి మీ పిల్లలతో పాటు మా పూర్ణకీ సమానంగా కొన్నారంటూ" సంభ్రమాశ్చర్యం చెందింది. ఎప్పుడు మేము వాళ్ళ కుటుంబాలకి సహాయ సహకారం చేసినా ఆవిడ ఒక్కతే మా సహాయాన్ని గుర్తించి మమ్మల్ని ఎప్పుడూ ఆశీర్వదిస్తూ వుంటుంది. 1991వ సంవత్సరంలో మేము షష్టిపూర్తి చేసుకున్నప్పుడు కూడా ఆమె కంట ఆనంద భాష్పాలతో మమ్మల్నిద్దరిని దీవించింది.

మేము కొన్న యం.జి.ఆర్ దగ్గర స్థలాల్లో ఒక్క ఇల్లు కూడా వెలవలేదు. మా పెద్దల్లుడు సతీష్ ఎన్ని సంవత్సరాలైనా ఆ స్థలాలు వేస్ట్ అయిపోతున్నాయి కొబ్బరి, మామిడి చెట్లు వేసి ఒక వాచ్‌మెన్‌ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని అంటుండేవారు. చుట్టుపక్కల ఇళ్ళుకూడా లేకపోవడం వలన మేము ఇల్లు ప్రస్తావన తేలేదు. ఇంతలో విరుగంబాకంలో మూడు గ్రౌండ్ల స్థలాన్ని కొన్నారు మా వారు. మా ఇద్దరి అమ్మాయిలకి రెండు ఇండిపెండెంట్ ఇళ్ళు కట్టించడానికి. కానీ రెండేళ్ళవరకు ఆ స్థలం అలాగే వున్నందున చాలామంది రియల్ ఎస్టేట్ వాళ్ళు మేము ఫ్లాట్లు కట్టుకుంటామని రెండింతలు మొత్తం యిస్తామని రావడం మొదలుపెట్టారు. కానీ మా వారు ఒప్పుకోలేదు. అసలే అతి కష్టం మీద దొరికింది మాకీ ఖాళీస్థలం. అందరూ ఫ్లాట్స్ కట్టడం మరిగారు కదా, ఖాళీ ఇండిపెండెంట్ స్థలం దొరకడం చాలా కష్టం అయింది మాకు. దాన్ని మావారు వదులుకుంటారా? ఎంత డబ్బుంటే మాత్రం దొరకొద్దూ? మేము మా ఇద్దరి పిల్లల కోసం కొన్నాం. ఇవ్వను అనేసారు. మొత్తం మీద మా ఇద్దరి అమ్మాయిలకి రెండు ఇళ్ళు కట్టించడానికి రెండేళ్ళు పట్టింది. మేము యం.జి.ఆర్ హాస్పిటల్ వెనక స్థలాలు కొన్న పది పదిహేను సంవత్సరాల తరువాత పదింతల డబ్బు వచ్చేసరికి ఆ స్థలాలు అమ్మేసాం. ఆ డబ్బు వాళ్ళదే కనుక మా ఇద్దరి అమ్మాయిలకు, పూర్ణకి అలాగే ఇచ్చేసాము. వాళ్ళు ఆ డబ్బుని బ్యాంకులో వేసుకున్నారు. మా ఇద్దరు అమ్మాయిలు మాత్రం కొంత డబ్బు వాళ్ళ ఇళ్ళకి వుడ్ వర్క్‌కి వినియోగించుకున్నారు. రెండిళ్ళూ ఒకేలాగా, ఒకే డిజైన్‌తో కట్టించారు మావారు. ఇంకో విషయమేమిటంటే అవి రెండూ అక్కాచెల్లెళ్ళ ఇళ్ళు కదా. కావాలనే ఆ రెండిళ్ళ మధ్య అడ్డుగోడ కట్టించలేదు. మధ్య అడ్డుగోడ వుండకూడదని మా వారి నిశ్చితాభిప్రాయం.

మా వారు పెళ్ళికి ముందు గుడులు, గోపురాలకి వెళ్ళేవారు కాదట. నే వచ్చిన తర్వాత నాతోపాటు గుళ్ళకు వచ్చేవారు. నేను, మా అమ్మా వాళ్ళ ఊళ్ళో వుంటున్నప్పుడు మా నాన్నగారు మదరాసు యూనివర్సిటీలో ఏదో పనికి వచ్చి ఇక్కడికి వచ్చారు. మా నాన్నగారు ఆయనను గుడికి పిల్చారట. సరేనని మా వారు వెళ్ళారట. అక్కడ ఒకచోట ఒక దేవుడి దగ్గర చిటికెలు వేసారట. మా నాన్నగారు ఎందుకలా వేస్తున్నారు అని అడిగితే "ఏమో, కల్యాణి అలా వేస్తుంది" అన్నారట. మా నాన్నగారు భీమవరం తిరిగి వచ్చి చెప్పి

చెప్పి ఒకటే నవ్వడం. మా వారికి మెల్లి మెల్లిగా వయస్సు పెరిగే కొద్దీ దేవుడి భక్తి ఎక్కువ అవుతున్నది. స్నానం కాగానే రెండు పూటలా దేవుడి గదికొచ్చి నమస్కారం చేసేవారు. ఈ మధ్యన ఒక పుస్తకం చూసి అష్టోత్తరాలు, సహస్రనామాలు చదువుతున్నారు. వీలున్నప్పుడల్లా ఇంట్లోనే సత్యనారాయణ వ్రతం చేసుకుంటాం. కొన్ని సంవత్సరాలు నెలనెలా మా నాన్నగారు చేసినట్లే సత్యనారాయణ వ్రతం చేసేవాళ్ళం. కానీ నా హెల్త్ ప్రాబ్లం వలన, మధ్య మధ్య ఆయన ఊళ్ళో లేకపోవడం వలన క్రమంగా జరగడం లేదు. కానీ గుడిలో మాత్రం సంవత్సరానికే డబ్బు కట్టేస్తాం నెలనెలా చేయడానికి.

నాకు 50వ ఏట నుంచి అర్థోపెడిక్ సమస్య మొదలైంది. ఫిజియోథెరపి తీసుకుంటూ వుండేదాన్ని. విజయా హాస్పిటల్‌కి, హెల్త్ సెంటర్‌కి అందరి డాక్టర్లకి నేను పేషెంట్‌ని. నా యుట్రస్ ఆపరేషన్, రెండుసార్లు హెర్నియా ఆపరేషన్, అంతకుముందు మా అమ్మాయిలప్పుడు సిజేరియన్ ఆపరేషన్లు, అబార్షన్ వీటి అన్నిటి కారణాల వలన నా ఆరోగ్యం కొంచెం దెబ్బతింది. నా రెండు కళ్ళు అయిదు ఆరు సంవత్సరాల తేడాలో క్యాటరాక్ట్ ఆపరేషన్లు జరిగాయి. బి.పి, డయాబెటీస్, 25 సంవత్సరాలుగా వుంది. కానీ హెచ్చు తగ్గులు అవుతూ వుంటుంది. చాలా మట్టుకు బార్డర్ దాటకుండా వుంటుంది. రెండేళ్ళ క్రిందట పన్ను పీకడం వలన దాని ఎఫెక్ట్‌కు మైల్డ్ హార్ట్ అటాక్ వచ్చింది. యాంజోగ్రాం చేస్తే బ్లాక్స్ చాలా మైల్డ్‌గా వుందని బైపాస్ సర్జరీ అవసరం లేదని మా డాక్టరు విజయకుమార్ చెప్పారు. విజయా హాస్పటల్ డాక్టర్లు ఇచ్చిన మందుల వలన, వాళ్ళ వైద్యం వలన నా ఆరోగ్యం కొంచెం మెరుగై నా వయస్సు 70 దాటినా కూడా ఆరోగ్యంగా వుండి నా పనులు నేను చేసుకుంటున్నాను. జ్వరం మిగిలిన చికాకులు వస్తే మా ఫ్యామిలి డాక్టరు త్యాగరాజుగారు ఇంటికి రమ్మంటే ఆయనే వచ్చి చూస్తారు. ఆయన వైద్యం మాకే కాక మా అమ్మాయిలకి కూడా గురి.

మా ఇంటికి దగ్గరగా ఒక పార్కు వెలిసింది. నేనూ, మా వారు పార్కుకు వెళ్ళి ఒక అరగంట నడుస్తాం. పొద్దున పూట ఇంట్లో కూడా వాక్ చేస్తాము. నా వొంటి పరిస్థితి మా వారి సహకారం వలన, నా జాగ్రత్తల వలన కొంచెం మెరుగ్గానే వుంది.

1986వ సంవత్సరంలో మా వారు 'అమెరికా అబ్బాయి' షూటింగ్ నిమిత్తం అమెరికాకు వెళ్ళవలసి వచ్చింది. నిర్మాత దుక్కిపాటి మధుసూధనరావుగారు. నటీనటులంతా ఇండియానుంచే వెళ్ళారు. ఒక నెలరోజులు అక్కడ వుండవలసి వచ్చింది. మొత్తం షూటింగ్ అంతా ముగించుకుని వచ్చారు.

ఇక్కడ మా ఇంట్లో మా పూర్ణ భార్య రమ గర్భవతిగా వుండి ప్రసవించే రోజులవి. వాళ్ళ అమ్మ మాత్రం ముందుగా నెల్లూరు నుంచి వచ్చింది. ఇంతలో హైదరాబాదులో మా పిన్ని కొడుకు పెళ్ళి ఉండి వెళ్ళడానికి ముందుగానే టిక్కెట్టు కొన్నాను. వాడి పేరు డాక్టరు శశికుమార్. యం.బి.బి.యస్ పాసయ్యాడు. మేమంతా శేషు అని పిలుస్తాము. అప్పుడప్పుడు మా రమని విజయా ఆసుపత్రి డాక్టరు సత్యభామారెడ్డి దగ్గరకి చెకప్‌కి పిలుచుకెళ్తూ వచ్చేదాన్ని. అలాగే ఒకరోజు వెళ్ళేసరికి మా రమకు స్కాను చేసారు డాక్టరు. సిజేరియన్ చేయాలని, ఇక వారం రోజుల్లో ఆపరేషన్ చేస్తామని అన్నారు. నేను హైదరాబాదుకు పెళ్ళికి రెండురోజుల్లో వెళ్ళాలి, వెళ్ళవచ్చా అని అడిగితే "లేదు లేదు మీరు వెళ్ళవద్దు" అంది. ఎటూ ఆ వారంలోనే పెళ్ళై తిరిగి వచ్చేస్తాను. కానీ ధైర్యం చేసి ఎలా వెళ్ళగలను? మా ఆయన, రమ భర్త ఇద్దరూ అమెరికా వెళ్ళారే. దాని బాగోగులు నాదే కదా బాధ్యత. నా అవస్థ ఏమని చెప్పుకోను. ఒకవైపు పెళ్ళికి వెళ్ళాలనే ఆశ. మరొక వైపు మా రమ ప్రసవం. మా బంధువొకాయన ఈ ఊర్లోనే వుండేది. అతను అన్నాడు "అత్తగారూ, మామగారు వాళ్ళు కూడా ఊర్లో లేరు. మీరు ప్రయాణం మానుకుంటే మంచిది. లేకపోతే ఎటూ చేసేదంతా మీరు చేస్తూనే వున్నారు. మీరు దగ్గర లేరనుకోండి. ఇంతవరకు చేసినాంతా వృధా అవుతుంది. అనవసరంగా మాట పడకండి" అన్నాడు. చిన్నవాడైనా అతను కరెక్టుగానే అన్నాడు అనుకున్నాను. రెండు రోజుల తరువాత మళ్ళీ రమని పిల్చుకెళితే, అంతా సవ్యంగా వుంది, దిగులుపడనవసరం లేదని చెప్పింది డాక్టరు. ఇదే సమయమని "నేను పెళ్ళికి వెళ్ళొచ్చా? రేపు పెళ్ళి. ఎల్లుండి వచ్చేస్తాను. అంతగా అవసరమయితే దాన్ని అడ్మిట్ చేసుకోండి, ఫ్లైట్‌లో వచ్చేస్తాను"

అన్నాను. "ఏమీ అవసరం లేదు, నిశ్చింతగా వెళ్ళిరండి" అంది. ముందు ఆవిడ వద్దన్నప్పుడు వెళ్ళే టిక్కెట్టు మాత్రమే బుక్ చేసుకున్నాను. వచ్చే రైలు టిక్కెట్టు అలాగే ఉంచుకున్నాను. ఇంటికొచ్చి మా బావగారికి ఫోను చేసి జరిగినదంతా చెప్పి నాకు గుడూరు నుండి హైదరాబాదుకి ఒక రైలు టిక్కెట్టు కొనమని అలాగే పెళ్ళికి వెళ్ళి వచ్చాను. వచ్చిన తరువాత నాలుగైదు రోజులు అయిన తరువాత రమ వాళ్ళ అమ్మను పిల్చుకుని విజయా హాస్పటల్‌కి వెళ్ళింది. అన్నట్లు మర్చిపోయాను. నేను హైదరాబాదుకు వెళ్ళినప్పుడు మా బావగారు ఇక్కడికి వచ్చారు. ఆసుపత్రి నుంచి రమా వాళ్ళ అమ్మ ఫోను చేస్తూ ఏడుస్తూ రమాని వీల్ చైర్లో ఏదో టెస్టుకి తీసుకెళుతున్నారని, తనకు భయంగా వుందని చెప్పింది. నేను మా బావగారు ఆటో వేసుకుని బయలుదేరాం హాస్పటల్‌కి. ఆ వేళ అనగానే మా డ్రైవరు సెలవు పెట్టాడు. స్కాన్ చేసి విజయా హాస్పటల్ డాక్టరు బిడ్డ అడ్డం తిరిగిందని ఇవాళే ఆపరేషన్ చేయాలని చెప్పింది. మా బావగారితో వెంటనే మా సీతమ్మక్కని, రమా వాళ్ళ నాన్నగారిని బయలుదేరి రమ్మన్నానని ఫోను చేయమన్నాను. మళ్ళీ ఇంకో గంట తరువాత ఇవేళ కాదు రేపు సిజరియన్ చేస్తామని కానీ పేషంట్ ఇంటికి వెళ్ళడానికి వీలు లేదని అన్నారు.

ఇవన్నీ ఇలా వుండగా నే హైదరాబాదుకు వెళ్ళానా, ఆ పెళ్ళికి మా నాన్నగారు కూడా వచ్చారు. వచ్చి అక్కడ జ్వరం బారిన పడ్డారు. మా చెల్లెలికి చూసుకోవడం కష్టమని ఆయనకి కూడా కష్టపడి టిక్కెట్టు కొని నాతో పిల్చుకు వచ్చేసాను. జ్వరం ఇంకా కొన్ని కాంప్లికేషన్స్ వస్తే ఆయన్ని కూడా హాస్పటల్‌లో చేర్పించాను. డాక్టరు యం.ఆర్.రెడ్డిగారు మా నాన్నగారి డాక్టరు. మా వారు ఊళ్ళో లేకపోయినా నేను అందరి డాక్టర్లకి పేషంట్ అవ్వడం వలన, యం.ఆర్ రెడ్డిగారు మునుపే నాకు హెర్నియా ఆపరేషన్ చేసినందు వలన ఆ సమయంలో మా నాన్నగారికి ఆయన ట్రీట్‌మెంటు ఇచ్చేవారు. మా నాన్నగారికి బేరియం టెస్టు, మిగతా టెస్టులు అన్నీ చేసారు. డాక్టర్లు ఆయన కడుపు పరిక్ష చేసి "ఈయనకు చాలాసార్లు కాఫీ తాగే అలవాటు వుందా" అని అడిగారు.

"ఆహా! చాలా వుందండి" అనేదాన్ని.

కానీ వాళ్ళు ఎలా కనుక్కున్నారో అని ఆశ్చర్యం వేసేది నాకు. తరువాత యం.ఆర్ రెడ్డిగారు "కాఫీ, టీ ఇవ్వద్దమ్మా. మీ నాన్నకి హార్లిక్స్ ఇయ్యండి" అన్నారు.

నేను "ఆయన హార్లిక్స్ తాగరండి" అన్నాను. "మరి అయితే విస్కీ తాగుతాడా? ఆయన అల్లుడే తాగడే" అన్నారు డాక్టరు నవ్వుతూ.

మా నాన్నగారి వార్డు మూడవ ఫ్లోర్. లిఫ్టులో వెళ్ళినా కూడా చాలా నడవాలి. మా రమ మెటర్నిటి వార్డు కింద వుండేది. దాన్ని చేర్చిన మర్నాడు సత్యభామారెడ్డిగారు చెప్పిన ప్రకారం మర్నాడు పొద్దున సిజెరియన్ చేసారు, ఆడపిల్ల పుట్టింది. ఫోను చూసుకుని గుడూరు నుంచి, నెల్లూరు నుంచి రావలసిన వాళ్ళు వచ్చారు. రమతో రోజు ఒకరు విడిచి మరొకరు, వాళ్ళ అమ్మ, లేకపోతే అత్త వుంటూ వుండేవారు. మా నాన్నగారి దగ్గర మాత్రం నేను ఒక్కన్నే వుండేదాన్ని. ఇంకెవరుంటారు? మా చెల్లెళ్ళు ఇద్దరూ హైదరాబాదులో ఉద్యోగాలు చేస్తున్నారాయె. డాక్టరు సత్యభామారెడ్డి గారు రమ వార్డుకు చెకప్‌కి వచ్చినప్పుడల్లా "ఎక్కడ మీ ఆంటీ? నిన్ను చేర్పించిందంతే. మళ్ళీ ఆవిడ కనపడలేదు"అని అడిగితే అందుకు మా రమ "మా తాతగారు మూడవ ఫ్లోర్లో వొళ్ళు బాగోలేక అడ్మిట్ అయ్యారు. వాళ్ళ నాన్నగారి కోసమని ఆవిడ అక్కడే వుంటోందని" చెప్పిందట.

మా సుధ తరువాత చాలా సంవత్సరాలకి మా ఇంట్లో పూర్ణ, రమలకి కూతురు పుట్టడం, చంటి పాప వెలవడం మాకందరికీ చాలా సంతోషం వేసింది. ఇంటికొచ్చాక పాప ఏడుపును రికార్డు చేసి అమెరికాలో వున్న పూర్ణకి, మా ఆయనకి ఫోన్లో వినిపించేవారు మా పిల్లలు.

మా పూర్ణ ఊర్లో లేనందున తన కూతురికి ఇంకా నామకరణం చేయలేదు. మూడవ నెలలో చేయొచ్చు అనుకున్నాం. మా సీతమ్మక్క పాపని పదకొండవ రోజున ఉయ్యాల్లో పెట్టిన తరువాత గూడూరుకి వెళ్ళిపోయింది. మా రమా వాళ్ళ అమ్మ మాత్రం వుండి పోయింది. వాళ్ళ నాన్నగారు కూడా వెళ్ళిపోయారు. వంటపనికి అంతకు ముందునుంచే వంటామె వుండేది.

కొన్నాళ్ళకి మా నాన్నగారిని ఇంటికి పిల్చుకొచ్చాను. విషయం తెలిసిన మా చిన్న చెల్లెలు రఖుమ వాళ్ళ అయిదారేళ్ళ మూడవ అమ్మాయిని పిల్చుకు వచ్చింది. కానీ అది వచ్చిన రెండు రోజులకే డిశ్చార్జి అయ్యారు. మా నాన్నగారు ఆరోగ్యంగా వుంటున్నప్పుడు హైదరాబాదులో, మదరాసులో ట్యుటోరియల్ కాలేజీలో పనిచేస్తూ వుండేవారు. బ్యాంక్ బాలెన్స్ కొద్దో గొప్పో వుండేది. స్టేట్ బ్యాంకు నుంచి, ఆంధ్రాబ్యాంక్ నుంచి డ్రా చేసుకుంటూ వుండేవారు. ఆయనకు చేతనైతే వెళ్ళేవారు. లేకపోతే నేను కార్లో వెళ్ళి డ్రా చేసి తెచ్చి ఆయనకు ఇచ్చేదాన్ని అందువలన ఆయన చెక్ బుక్కు, బ్యాంకు పాస్ బుక్ నా దగ్గర వుండిపోయింది. ఆయన విజయా హాస్పటల్ నుంచి రాగానే "ఇదిగోనండి మీ బ్యాంక్ బ్యాలెన్స్ నాలుగొందల రూపాయలు మాత్రమే వుంది ఈ బ్యాంక్‌లో. జాగ్రత్తగా ఖర్చు పెట్టుకోండి" అన్నాను. నేను బ్యాంక్ విషయం చెప్పేసరికి ఇక చూసుకోండి

"ఆ! నువ్వు నాకు నీతులు చెబుతున్నావా, అనవసరమైన ఖర్చులు ఏమి చేసావని? హాస్పటల్ బిల్లు నువ్వేగా కట్టావు. ఎంత పొగరే నీకు. అన్ని పిక్చర్లు, అన్ని అవార్డులు తీసుకున్నా, అమెరికాకు వెళ్ళి వచ్చినా కూడా, మీ ఆయనకి కొంచమైనా గర్వం లేదు. నీకు వచ్చింది గర్వం. ఆయన అదే పనిగా హైదరాబాదులో నా దగ్గరకు వచ్చి నన్ను రమ్మంటే వచ్చాను తెలుసా. అలాగ ఇలాగ అని ఎన్నెన్నో మాటలు అన్నారు.

మా రఖుమని పిలిచి "రఖుమా! ఇవాళ భోజనం నువ్వే పెట్టు మీ అక్కవద్దని" ఆవేశంగా అన్నారు. ఆయనకు జబ్బు చేసినందువలన ఆయన మాట్లాడేది ఆయనకే తెలిసేది కాదు. నాకు చాలా ఏడుపు వచ్చింది. రాత్రింపగళ్ళు మొగుడూ పిల్లల్ని వదిలి ఆయనతో వుంటే ఇదేనా నాకు ఇచ్చిన ప్రతిఫలం? పైగా మా వారు ఊర్లో లేరు. అమెరికా నుంచి వచ్చేసారు కదా అనుకుంటే బెంగుళూరు వెళ్ళారాయే. మా చెల్లెలు వచ్చి ఓదార్చింది.

"నాన్నగారు తెలిసి అలా మాట్లాడటం లేదుగా? జబ్బు ప్రభావం వలన అలా అయ్యారు. ఎప్పుడూ ట్యుటోరియల్ కాలేజీకి వెళుతూ బిజీగా వుంటూ వచ్చారు కదా. ఇప్పుడు అవకాశం లేదని, ఆయన్ని బాధిస్తుందేమో" అని మేమిద్దరం అనుకున్నాం. ట్యుటోరియల్ కాలేజీకి ఫోన్లు చేసి నేను రేపటినుంచి వస్తున్నానని చెప్పేవారు. గంటల తరబడి ఉపన్యాసం ఇచ్చినట్లు ఇంగ్లీషులో ఏదో మాట్లాడుతుండేవారు. ఒకరోజు నిల్చున్న ఆయన సడన్‌గా కిందపడ్డారు. మా వారు చూస్తే కన్నడ సినిమా నిమిత్తం బెంగుళూరుకు వెళ్ళారు. నాకు భయం వేసి మా పెద్ద చెల్లెలు సుశీల ఫ్యామిలీని వెంటనే బయలుదేరి రమ్మన్నాను. మా చిన్న చెల్లెలు ఎటూ ఇక్కడే వుంది. వాళ్ళు రిజర్వేషన్ చేయించుకుని రెండోరోజుకల్లా వచ్చారు.

మా సుశీల స్కూలు టీచర్ కదా, "నాన్నగారు చూడు ఎంత మంచి ఇంగ్లీషు మాట్లాడుతున్నారో" అనేది.

"మంచి ఇంగ్లీషా పాడా! రెండు రోజులనుంచి ఆయనది ఇదే ధోరణి" అన్నాను.

వాళ్ళకు ఏం పాలుపోలేదు. ఈ భాగవతం కొన్నాళ్ళు జరిగి కొంచెం కొంచెం తగ్గుతూ వచ్చింది. ఆఫీసులకి సెలవు పెట్టిన వాళ్ళు ఎన్నాళ్ళు వుంటారు? మా చెల్లెళ్ళు ఇద్దరూ వెళ్ళిపోయారు. మళ్ళీ ఆయనతో నా తిప్పలు ఆరంభం, మెల్లి మెల్లిగా దారిలోకి వస్తున్నారు. నాకు దిగులు మెల్లిగా తగ్గుతోంది.

**రమ పాపను** చూచి ముద్దాడి పలకరించేవారు. రమా వాళ్ళ అమ్మ పాపని ఎత్తుకుని కూర్చుంటే "సత్యవతీ! పాపను అస్తమానం ఎత్తుకుని అలవాటు చెయ్యొద్దు. చంటి పాపలని పెరగనివ్వాలి" అనేవారు. కుమరన్ కాలనీ ఇల్లు ప్రారంభించిన తరువాత దాన్ని చూసుకోవడానికి వచ్చిన బావగారితో మామూలుగా మాట్లాడుతుండేవారు. మా నాన్నగారు ఎక్కడికైనా వెళతానంటే పంపడానికి భయం వేసేది. కారులోనే పంపేవాళ్ళం. మా అమ్మాయిలు వాళ్ళ వాళ్ళ కాలేజి, స్కూలు అనుభవాలు చెబుతుంటే విని ఆనందించేవారు అకెడమిక్ సైడ్ ఎంత చెప్పినా ఆయన తృప్తి పడేవారు.

బెంగుళూరుకి షూటింగ్ రీత్యా వెళ్ళి వస్తున్న సమయంలో మా వారు అయ్యప్ప స్వాములమాల వేసుకుని వాళ్ళ ట్రూపులతో శబరిమలై వెళ్ళి వచ్చారు. వారిలో కన్నడ ఎడిటర్ భక్త ఈయన పట్ల చాలా శ్రద్ధ తీసుకుని పిల్చుకువెళ్ళారు. పాప మూడవ నెలలో నామకరణం చేసాం. గూడూరు నుంచి, నెల్లూరు నుంచి రావలసిన దగ్గర వాళ్ళంతా వచ్చారు. పేరు నిర్ణయించుకున్నాం. మా తోటికోడలు సేతమ్మక్కకి కలలో ఆంజనేయ స్వామి కనపడ్డాడట. మావారేమో అయ్యప్ప కొండకి వెళ్ళివచ్చారు. పైగా తన ఇరుముడితో పాటు పాప ఇరుముడి కూడా కలిపి రెండు ఇరుముళ్ళను కొండపైకి మోసుకెళ్ళారు. జ్యోతి స్వరూపుడు కదా! నేనూ, మా సేతమ్మక్క మాట్లాడుకుని అటు ఆంజనేయస్వామి పేరు, ఇటు అయ్యప్ప స్వామి పేరు కలిసి వస్తుందని "అంజనా జ్యోతి" అని అనుకునే సరికి అది అందరూ ఆమోదించి ఆ పేరు పెట్టి నామకరణం చేసాం. కానీ మా సుధ మాత్రం దాన్ని అంజు అనే పిలవాలి అనేసరికి మేమంతా అంజూ అంటాం. అది పెరిగి పెద్దయ్యాక స్కూల్లో, కాలేజీల్లో, ఆఫీసుల్లో మాత్రం దాని స్నేహితులు అంజనా అని పిలుస్తారు. మా సుధ వాళ్ళ అత్తగారింట్లో జ్యోతి అని పిలుస్తారు.

మా శకుంతల, సుధాల డిశంబరు సెలవులలో మేము కలకత్తా ప్రోగ్రాం వేసుకున్నాం. మా రఘుమా వాళ్ళకి కలకత్తా బదిలీయ్యై వాళ్ళక్కడే ఉండేవాళ్ళు. రమా కూతురు అంజు చంటిపిల్ల. అనంత్ ఇంకా పుట్టలేదు. అందుకు నేనూ, మా వారు పిల్లలే కాక రమ, పూర్ణా కూడా వాళ్ళ పాప అంజనాను ఎత్తుకుని వెళ్ళాలని ప్లాను. రైలు టిక్కెట్లు పోవడానికి, రావడానికి బుక్ చేసుకున్నాం. మావారు, పూర్ణా మాత్రం రావడానికి మూడురోజులకే రిటర్న్ టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. ఎందుకంటే వాళ్ళు మదరాసు వచ్చి ఆ రోజే ఫ్లైట్ ఎక్కి బెంగుళూరు షూటింగుకు చేరుకోవాలి. మా కుమరన్ కాలనీ ఇల్లు కట్టడం అదీ మా బావగారు చూసుకుంటూ వుండడం వలన, మేము ఆయన భార్య సేతమ్మక్కను పిలిపించి వాళ్ళిద్దరూ ఇల్లు చూసుకునేలాగా ఏర్పాటు చేసాం. వంటావిడ ఎలాగూ ఉందనుకోండి.

మేం పొద్దున్నే సామాన్లు అంతా ప్యాక్ చేసుకుని ముందు హాల్లో పెట్టుకున్నాం. ఇక స్టేషన్‌కి బయలుదేరాలి. ఇన్ని సామాన్లతో ఆరున్నరకన్నా బయలుదేరాలి. ఇంతలో ఆరుగంటలకి మా పాలమ్మాయి పాలు తీసుకొచ్చి మా సామానంతా చూసి "అమ్మా! మీరు ఏదో ఊరు ప్రయాణానికికి బయలుదేరుతున్నట్టున్నారు ఎం.జి.ఆర్ చనిపోయారు. చూసుకుని బయలుదేరండి" అంది. మేము నమ్మలేదు. ఇంతకు ముందు ఇందిరాగాంధీ పోయినప్పుడే ట్రాఫిక్ అంతా కట్టుదిట్టం చేసి ఎం.జి.ఆర్‌గారు పోయారన్న వదంతలు పుట్టించారు. అప్పుడు మేము డ్రైవర్‌తో కారులో వెళ్ళి మా అమ్మాయిలను స్కూలు నుండి పిల్చుకొచ్చాం. ఏం గొడవ జరుగుతుందోనని భయపడి.

వెంటనే మా వారు టీ.వి ఆన్ చేసారు. నిజంగానే ఎం.జి.ఆర్ చనిపోయారు అన్న వార్త విన్నాం. ఆలస్యమయితే రోడ్డులో ఏమి గొడవ జరుగుతుందో. అయినా మన ప్రయత్నం చేద్దామని దేవుడు మీద భారం వేసి ఎలాగో స్టేషన్ చేరుకున్నాం. జనం, సామాన్లు ఉన్న మూలన ఒక అదనపు కారు కూడా మాట్లాడుకున్నాం. దారిలో అక్కడక్కడ అప్పుడే రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. మా డ్రైవర్లు రూట్ మార్చి ఎలాగో మమ్మల్ని స్టేషన్ చేర్చారు. అక్కడి నుంచి ఆ కార్లు వెనక్కి వెళ్ళడానికి కొంచెం కష్టం అయిందట. పన్నెండు గంటల వరకు మేము రైలులో అలగే కూర్చున్నాం. అందరికి ఏదో బెంగగా భయం భయంగా వుంది. కొందరు మాత్రం ఏం జరిగితే అది జరుగుతుంది అనే భావనలో కూర్చున్నారు. మేమంతా కంపార్టుమెంటులో కూర్చుని వుండగా ఒక 20 సంవత్సరాల యువకుడు గడ్డంతో అయ్యప్ప

దుస్తుల్లో వున్నాడు. మా కంపార్టుమెంటుకు వచ్చి రమతో "ఒదినా, ఏ ఊరుకెళుతున్నారు?" అడిగాడు. వాణ్ణి చూసేసరికి రమ అదిరిపోయింది. జవాబు చెప్పలేకపోయింది. "నేను ఒదినా. దుర్గాప్రసాద్‌ని" అన్నాడు. వాడు విశాఖపట్నం బావగారి కొడుకు".

"ఒరేయ్! నువ్వట్రా, ఎవరో అనుకున్నాను, అసలే గొడవ గొడవగా వుంది కదూ భయపడ్డాం, మేము కలకత్తా వెళుతున్నాం. అక్కడ మా చెల్లెలు రఖుమా వుంది. పిల్లలకి డిశంబరు సెలవులు కదా, అవును. నువ్వు అయ్యప్ప కొండకి వెళుతున్నవా" అని అడిగాను. "అవును, ఎం.జి.ఆర్ పోయారటగా, మా రైలు బయలుదేరడానికి ఆలస్యం అవుతుందట" అన్నాడు. ప్రయాణంలో తినడానికి తెచ్చుకున్న పులిహోర, పెరుగన్నం రైలులోనే తిన్నాం, ఇంకా మదరాసు సెంట్రల్‌లోనే వున్నాం. మొత్తం మీద రైలు ఒంటి గంటకి బయలుదేరింది. ఎప్పుడయితే తమిళనాడు బార్డర్ దాటిందో అప్పటి నుంచి స్పీడు పెంచింది. మేము ప్రయాణం చేస్తున్న రైలు కోరమండల్ ఎక్స్‌ప్రెస్. అది విశాఖపట్నం రాత్రి ఎనిమిదిగంటలకు చేరుతుంది. అనుకున్న ప్రోగ్రాం ప్రకారం విశాఖపట్నంలోని మా బావగారు, తోటికోడలు స్టేషనుకు వచ్చి మాకు భోజనం తెచ్చేట్టుగా, పైగా అంజు చంటి పిల్లకదా దానికి వేరుగా పెరుగన్నం తెచ్చేట్టుగా. మదరాసు నుంచి బయలుదేరిన విషయం వాళ్ళకి స్టేషన్ నుంచి ఫోన్ చేయడం ద్వారా రైలు ఆలస్యంగా వస్తుందని ముందుగానే తెలిసింది. రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో మా రైలు విశాఖపట్నం చేరింది. అనుకున్న ప్రకారం ఇద్దరు మగపిల్లల భోజనం తెచ్చి ఇచ్చి వెళ్ళారు. కానీ అంత అర్ధరాత్రి ఎలా తింటాం పైగా అందరూ మంచి నిద్రమత్తులో వున్నారు. మర్నాడు ప్రొద్దున్నే టిఫిను టైములో తిందామని చూస్తే అవి చెడిపోయాయి. పాపం వాళ్ళు అంత ఆప్యాయతతో అర్ధరాత్రి అయినా తెచ్చిన భోజనం చెడిపోయినందుకు మేమందరం చాలా బాధపడ్డాం.

కలకత్తాలో మా మరిది వాళ్ళు అప్పుడప్పుడు స్టేషనుకు ఫోన్ చేస్తూ రైలు వచ్చే సమయానికి ముందే స్టేషనుకు వచ్చి మమ్మల్ని ఇంటికి పిలుచుకెళ్ళారు. మొత్తానికి కలకత్తా చేరుకున్నాము. అది 'పుష్పక్' రిలీజైన సమయం. మా వారు థియేటర్ యజమానిని కలుసుకున్నారు. మేమంతా సినిమా చూసాము. మా వారి ప్రయాణపు రోజు ఆయన్ని స్టేషన్లో దింపడానికి కారు పంపుతానన్నారు. ఆ రెండు రోజులు చూసి షాపింగ్ అని వెళ్ళాం. మేమంతా బజారుకి వెళితే మా వారు, మా మరిది మాత్రం అంతర్జాతీయ ఖ్యాతి పొందిన సుప్రసిద్ధ దర్శకులు సత్యజిత్‌రే గారిని కలుసుకోవడానికి వాళ్ళింటికి వెళ్ళారు. ఇక మర్నాడు మా వాళ్ళ ప్రయాణం. ఆ ముందు రోజునే మా చిన్నతాతగారి కొడుకు రాఘవేంద్ర ఆ ఊర్లోనే ఉంటున్నాడు కనుక తాను కూడా స్టేషన్‌కి వస్తానన్నాడు. అన్నమాట ప్రకారం థియేటర్ యజమాని కారు వచ్చింది. స్టేషన్‌కి వాళ్ళతో నేను, మా మరిది కూడా వెళ్ళాం. కారు బయలుదేరింది. కలకత్తా చాలా రద్దీగా వుంది. అయినా మా కారు వెళ్ళి వెళ్ళి ఒక అరకిలోమీటరు దూరంలో ట్రాఫిక్ జాంలో ఇరుక్కుంది. అరగంటైనా కదలలేదు. నాకా టెన్షన్. టైం సమీపిస్తోంది. రైలు కదిలిపోతుందేమో, ఎలా అని దిగులుపడుతుంటే మా వారు "పోతే పోనీ. రైలు తప్పిపోతే ఫ్లైట్‌లో వెళ్తాం. దానికంత టెన్షన్ ఎందుకు?" అని నవ్వుతూ అన్నారు. నేను టెన్షన్ పడేకొద్దీ ఆయనలా జోకులు వేస్తూ నవ్వుతుంటే నాకు ఒళ్ళుమండిపోయింది. ఒకముల రైలు టిక్కెట్లు డబ్బుపోగా, పైగా ఫ్లైట్లు ఖర్చులు వేరేనా? ఇలాంటి సమయంలో కూడా ఆయనకు అదేం సెన్సాఫ్ హ్యూమరో?

హౌరా బ్రిడ్జి దగ్గరే వుండడం వల్ల కిందికి దిగిపోయాం. పాపం థియేటర్ ఆయన కారు పంపి కూడా ప్రయోజనం లేకపోయింది బ్రిడ్జి కిందున్న లాంచీ ఎక్కినది దాటి స్టేషన్ చేరేసరికి రైలు కదలడానికి రెండు నిమిషాల టైం వుంది వాళ్ళ కంపార్టుమెంటు వెతికే టైం లేక, గబగబా రెండు సూట్ కేసులు రైలులో పడేసి పూర్ణా ఒక కంపార్టుమెంటు, మా వారు వేరొక కంపార్టుమెంటు ఎక్కారో లేదో టక్కని రైలు కదిలింది. హమ్మయ్యా అని ఊపిరి వదులుకున్నాను. మాకన్నా ముందే వచ్చిన రాఘవేంద్ర ఎలాగో మావారిని కలుసుకున్నాడు. "ఇంత ఆలస్యం ఆయిందేం? నేను చాలాసేపటి నుంచి వెయిట్ చేస్తున్నాను" అన్నాడు. జరిగిన విషయమంతా చెప్పాను.

తరువాత మేమంతా ఇంకో వారం రోజులుండి చూడవలసిన ప్రదేశాలు చూసుకుని షాపింగంతా చేసుకున్నాం. అందరూ ఎందుకని, ఒక్కొక్కసారి ఇంట్లో చంటి పిల్ల వుందికదాని మొత్తం పిల్లలందరిని ఇంట్లోనే వదిలేసి మేం పెద్దవాళ్ళమంతా వెళ్ళేవాళ్ళం.

చాలా సంవత్సరాల క్రితం నాకొక చేదు అనుభవం ఎదురైంది మేము జక్రియా కాలనీలో ఉంటున్నప్పుడు మావారికొకసారి కె.వి.రెడ్డి అవార్డు వచ్చింది. హైదరాబాదులో బి.యన్.రెడ్డిగారని ఒక ఆర్కిటెక్ట్ అరేంజ్ చేశారు. డైరెక్టర్ బి.యన్.రెడ్డిగారు కాదీయన. అవార్డు హైదరాబాదులో అందుకోవాలి. సన్మానం చేసి అవార్డు ప్రధానం చేస్తారు. మావారు షూటింగ్ రీత్యా ఒక వారం ముందుగానే ఫ్లైట్‌లో హైదరాబాదు వెళ్ళిపోయారు. నేను, పిల్లలిద్దరూ, శకుంతల, సుధ రైలులో రిజర్వు చేసుకుని వెళ్ళాము. మా శకుంతల కాలేజీలో ఇంటర్ చదువుతోంది. మా సుధ ఆదర్శ్ విద్యాలయాలో హైస్కూలు స్టేజ్‌లో వుంది. ఆంధ్రాకి వెళ్ళే ప్రతి రైలు గూడూరు, నెల్లూరుల మీదుగా వెళ్తాయి. దానికి మేము రైలులో వెళ్ళినపుడల్లా గూడూరు స్టేషనుకి మా బావగారి పిల్లలు వచ్చి మమ్మల్ని కలుసుకోవడం, అవసరమయితే రాత్రి డిన్నర్‌కి తినడానికేమైనా తీసుకురావడం జరిగేవి.

మేము యెక్కిన రైలు గూడూరు చేరుకోగానే మాములు ప్రకారం స్టేషనుకి మా నర్సింగ్ కొడుకు నెత్తుకుని, పద్మ మగపిల్లలు శ్రీకాంత్, శ్రీనాథ్‌ని పిల్చుకుని వచ్చాడు. నర్సింగ్ కొడుకుని చూడ్డానికి నేను అప్పుడప్పుడు గుడూరుకి వెళ్తుండేదాన్ని, వాడంటే నాకు చాలా యిష్టంగా వుండేది. అందుకని వాణ్ణి యెత్తుకుని వచ్చాడు. స్టేషను రాగానే మా శకుంతల మమ్మల్నెవర్నీ దిగవద్దని, వాళ్ళని కూడా రైలెక్కనివ్వద్దని మొత్తుకుంటూనే వుంది. ఏ సమయానికి రైలు కదుల్తుందోనని దానికి భయం. సరే, మేమంతా వాళ్ళని కిటికీలోంచి పలకరించాం. కానీ నాకు చంటివాణ్ణి ఎత్తుకోవాలనిపించి, దిగి వాణ్ణి యెత్తుకున్నాను. ఆ బాబు పేరు సుధీంద్ర. మా అమ్మాయిలు తాగడానికి నీళ్ళు కావాలని శ్రీకాంత్ వాళ్ళకి సీసాయిచ్చి, కిటికీలోంచి దూర్చి ఇమ్మన్నారు. కాసేపైన తర్వాత "మేడమ్ రైలు కదుల్తోంది" అన్నారు ఫుట్ బోర్డు మీద నిల్చున్న కొంతమంది మగపిల్లలు. ఒక అనౌన్స్‌మెంటు కానీ, రైలు కూతగానీ, స్టేషనులో గంట కొట్టడం గాని ఏ లక్షణాలు, చడీ చప్పుడూ లేకుండా రైలు కదిలింది. అందుకనే రైలు కదిలిన విషయం నాకు తెలియలేదు వాణ్ణి ముద్దాడడంలో. కానీ ఏం చెయ్యాలో పాలుపోలేదు. చేతిలో పిల్లాడు. రైలెలా యెక్కనూ. అప్పుడే కదలడం వలన గబగబా రైలెక్కి ఆ మగపిల్లల సహాయంతో పిల్లాణ్ణి నర్సింగ్‌కి చేర్చాను ఆ సమయంలో గేమ్స్‌లో బాల్‌లాగా ఒకరి దగ్గరి నుండి మరొకరి దగ్గరికి వెళ్తూ తండ్రిని చేరుకున్నాడు. భగవంతుడా అనుకుని తలుపు దగ్గర్నుంచి నా సీటుకి చేరానుకదా? శ్రీనాథ్ కనిపించాడు రైలులో. దిగ్గుమంది నాకు. "ఎందుకురా నువ్వు రైలెక్కావు" అంటే మా పిల్లల్ని చూపించి "వీళ్ళు నీళ్ళ సీసా కిటికీలోంచి యిమ్మన్నారు" అది కిటికీలో దూరలేదు, అందుకని ఎక్కాను" అన్నాడు బిక్కముఖం వేస్తూ. వెంటనే ఆ అబ్బాయిలని "వీణ్ణి కొంచెం ప్లాట్‌ఫారం మీదికి దింపుతారా" అనడిగాను. "మేడమ్, చాలా రిస్క్ రైలు వేగం పుంజుకుని, ప్లాట్‌ఫారం దాటొచ్చు" అన్నారు. నాకు ఏడుపు వచ్చినంత పనైంది. అక్కడున్న పెద్ద మనుష్యులు "మాది నెల్లూరండీ. ఈ అబ్బాయిని మీ బంధువులెవ్వరైనా వుంటే చెప్పండి, మేము జాగ్రత్తగా దింపుతాము" అన్నారు. కానీ కొత్తవాళ్ళని ఎలా నమ్మనూ? వాళ్ళు మంచివారే కావొచ్చు. ఇంకొకళ్ళు "వచ్చేది నెల్లూరేనండీ. స్టేషనులో దిగి అక్కడి స్టేషన్ మాస్టరు సహాయంతో, గూడూరు స్టేషను మాష్టరుకి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి ఆ అబ్బాయి తాలుకు వాళ్ళు వచ్చేంత వరకు మేమక్కడే వుంటాం అన్నారు. మీరేం కంగారు పడకండి" అన్నాడు. ఇక వేరే దారిలేక ఒప్పుకున్నాం. ఇలా తలా ఒక రకంగా మాట్లాడారు. నేను బాత్‌రూం కెళ్ళి తనివి తీరా ఏడ్చివచ్చాను. బయటికి వచ్చి శ్రీనాథ్ జేబులో 25 రూపాయలు పెట్టాను. రైలు ఖర్చుకు కావాలి కదా. ఇంకేదైనా ఖర్చుకి కూడా వుంటుంది. వాణ్ణి, నర్సింగ్ మామ అయినా, మరెవరైనా గూడూరు నుంచి వచ్చేంతవరకు అక్కడే ఉండమని చెప్పాను. ఇప్పటిలా అప్పుడు ఫోను సౌకర్యాలు ఉండివుంటే ఏ యిబ్బంది లేకపోయేది. కనీసం ఒక్కరింట్లో కూడా లాండ్ ఫోను లేకపోయింది. ఎంతో సంతోషంగా అవార్డు ఫంక్షన్‌కి వెళ్తున్న మాకు ఈ అనుకోని సంఘటన ఎదురైంది మొత్తం మీద నర్సింగే గూడూరు నుంచి నెల్లూరు

స్టేషనుకి వెళ్ళి, స్టేషన్ మాష్టరు జాగ్రత్తలో ఉన్న శ్రీనాథ్‌ని వెనక్కి పిల్చుకెళ్ళాడు. గూడూరు స్టేషన్ మాష్టరు మా నర్సింగ్‌కి చాలా పరిచయం ఉన్నందువలన సమస్య తీరిపోయింది.

అసలు విషయం తర్వాత తెలిసింది. శ్రీనాథ్ మంచి నీళ్ళ సీసాని మా వాళ్ళకి ఎలా చేర్చాలో అనుకుంటుంటే ప్రయాణం చేసే ఒక ప్రయాణికుడు వీడుకూడా ప్రయాణం చేస్తున్నాడనుకుని చిన్నబ్బాయి కదా అని మా దగ్గరికి చేర్చాడట. అప్పటికి రైలు కదల్లేదు. అందువలన వాడు తిన్నగా మా అమ్మాయిలకి సీసా యిచ్చి, రైలు దిగాలనుకుంటూండగా రైలు కదిలిందిట. ఆ ప్రయాణీకుడూ వాణ్ణి మిస్‌లీడ్ చెయ్యడం వలన వాడు రైలెక్కాడట ఇదీ జరిగిన విషయం.

అంజూకి రెండేళ్ళు నిండేసరికి ఒక తమ్ముడు పుట్టాడు. వాడు అనంత పద్మనాభవ్రతంనాడు పుట్టాడు. అందుకు వాడి పేరు అనంత్. వాడికి ముద్దు పేరు ఏమీలేదు. అందరూ అనంత్ అనే పిలుస్తారు. వాడు పుట్టే సమయానికి మా వారికి తమిళంలో కమలహాసన్ నిర్మించిన "అపూర్వ సహోదరగళ్" అనే సినిమా జరుగుతోంది. అది తెలుగులో "విచిత్ర సోదరులు" హిందిలో "అప్పురాజా"గా వెలిసింది. అన్ని భాషల్లో సూపర్ డూపర్ హిట్లు అయ్యాయి. అప్పటికే మా వారికి "పుష్పక్"తో ఫేం వచ్చినందున బాగా హిట్స్ అయ్యాయి.

మా శకుంతల పెళ్ళయింది. సుధా యింక కాలేజి స్టేజిలో వుంది మా రమా, పూర్ణావాళ్ళ కొడుకు అనంత్ 5,6 తరగతులలో దేవీ అకాడమీ స్కూలులో చదివేటప్పుడు వాడి క్లాసులో ఏటేటా కర్ణాటక సంగీత పోటీలు పెట్టేవారు. నేను నాకున్న కొద్దిపాటి సంగీత పరిజ్ఞానంతో వాడికొక త్యాగరాజ కృతి 'ఎంత వేడుకొందు రాఘవా' అనే పాట రాగతాళాలతో నేర్పాను. ఒకే ఒక వారం ప్రాక్టీసు చేయించాను. వాడికి ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది. మళ్ళీ సంవత్సరం ఒక కన్నడ పురందరదాసుపాట. "కండేను గోవిందన" అనే పాట నేర్పాను. రెండు మూడు రోజులు నేను ప్రాక్టీసు చేయించి మా వారితో ఫిల్మ్‌ఫెస్టివల్‌కి ఏటేటా వెళ్ళినట్లే వెళ్ళిపోయాను. కానీ పాపం ఈసారి అనంత్‌కి రెండవ ప్రైజ్ వచ్చింది. నేను దగ్గరుండి ప్రాక్టీసు చేయించనందుకు చాలా బాధపడ్డాను. సహజంగా వాడు పాటలు బాగా పాడ్తాడు. చిన్నప్పట్నుంచీ వాడికి వంటలంటే చాలా యిష్టంగా వుండేది, ఆటలలో వంట చేస్తున్నట్టు ఆడుకునేవాడు. నేను హైదరాబాదు నుంచి వచ్చినపుడల్లా వాడికి స్టీలు, అల్యూమినియం బాండీలు, గరిటెలు చిన్నచిన్నవి కొని తెచ్చి యిచ్చేదాన్ని. మా చెల్లెలు రుఖుమ "ఛీ! అదేంటీ ఇవన్నీ తీసుకెళ్తున్నావూ?" అనేది. అయిదు సంవత్సరాలు హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, రెండు సంవత్సరాలు హాట్ బ్రెడ్స్‌లో ట్రైనింగ్ అవుతూ ఫ్రెంచ్ నేర్చుకున్నాడు. తర్వాత అమెజాన్ కంపెనీలో ఉద్యోగం చేసి, ఇప్పుడు మద్రాసులోనే టి.సి.ఎస్.లో చేరాడు.

నేను కూడా అప్పుడప్పుడు మా వారితో కన్నడ షూటింగుకు వెళ్ళి వస్తుండడం వలన రాజ్‌కుమార్ వాళ్ళ కుటుంబ సభ్యులు చాలా సన్నిహితులయ్యారు. రాజ్‌కుమార్‌గారు, పార్వతమ్మగారైతే "అమ్మ బందార" (అమ్మ వచ్చారు) అని నన్ను ఎంతో ఆదరించేవారు. వారలా వున్నారు కనుకనే నేను ఫ్రీగా తరచుగా బెంగుళూరుకు వెళ్ళేదాన్ని. రాజ్‌కుమార్ గారు నిర్మాత, హీరో అయినా టిఫిన్లకి, భోజనాలకి అందరితో కూడా సమానంగా కింద కూర్చుని భోజనం చేసేవారు. అంత పెద్ద పేరు వున్నాయన కదా ఒక ప్రత్యేక ఏ.సి రూములో భోజనం చేయడం అదీలేదు. "చెలువుస మోడగళు" అనే సినిమా సిల్వర్ జూబ్లి చేసుకుంటే ఆ ఫంక్షన్‌కి మా పిల్లల్ని, రమని కూడా కారులో పిల్చుకుపోయాము.

ఇలా ఉండగా వాళ్ళందరు ఒక టూర్ ప్రోగ్రాం వేసుకున్నారు. మమ్మల్నిద్దరిని వస్తారా అని అడిగారు. ముందు నేను మొహమాట పడ్డాను. వాళ్ళు మళ్ళీ అడగడంతో సరే వస్తామని చెప్పాం. మూడు, నాలుగు కార్లు వేసుకుని బయలుదేరాం. మాకే ఇబ్బంది కలగకుండా మేమెక్కిన కార్లో ఎక్కువ మందిని ఉంచకుండా ధర్మస్థళ, సుబ్రమణ్యం, మూకాంబిక, ఉడిపి ఇన్ని ప్రదేశాలకి పిల్చుకు వెళ్ళారు. ఉడిపి పర్యాయం టైంలో వెళ్ళాం. పర్యాయమంటే రెండేళ్ళకో మూడేళ్ళకో వస్తుంది. ఉడిపిలో వున్న కృష్ణుణ్ణి అలంకరిస్తారు. స్వాముల వారు

వస్తారు. జనం లక్షలమంది ఉంటారు. దీనికి సంబంధించిన పూర్వగాథ ఒకటుంది. కనకదాసుడనే భక్తుడు భగవంతుని చూడ్డానికి వస్తే అక్కడ పూజారులు అలవి కులస్తుడని అతన్ని గుడిలోకి రానివ్వలేదట. అతని భక్తికి మెచ్చి కృష్ణుడు పక్కకు తిరిగి అతనికి ప్రత్యేక దర్శనమిచ్చాడట. దీనికి 'కనకనకిండి' అని పేరు. వచ్చిన భక్తులంతా ఆ కిటికీలోంచే దేవుణ్ణి దర్శించుకోవాలి. ఆ కిటికీ దర్శనానికి వేలమంది ప్రజలుంటారు. అక్కడ స్వాములవారి దర్శనం లభించటం చాలా కష్టం. పార్వతమ్మగారే స్వయంగా పిల్చుకెళ్ళి కృష్ణుని దర్శనం ఇప్పిస్తే, రాజ్‌కుమార్‌గారే పేజావర స్వామి దర్శనానికి పిల్చుకెళ్ళి మా వారిని ఫలానా సింగీతం శ్రీనివాసరావుగారు నా పిక్చర్లు తీసారు అని చెబితే "తెలుసే, విన్నాను" - "చెలుసువ మోడగళు' ఈయన చేసిందేగా" అన్నారు. మావారికాశ్చర్యం వేసింది స్వాముల వారు సినిమా గురించి మాట్లాడుతుంటే. మామూలు ఉడిపి దర్శనమే కష్టం. అందులో పర్యాయంలో దర్శనం. పార్వతీ పరమేశ్వరులులాగా రాజ్‌కుమార్, పార్వతమ్మగార్లవల్లే లభించింది.

❦❦❦

**మా వారు ఒకరోజు** షవర్ కింద స్నానం చేస్తుండగా ఆయనకొక ఆలోచన వచ్చింది. ఎప్పుడూ ఏదో ఒక విషయం గురించి ఆలోచిస్తూ వుంటారు. తాను కె.వి.రెడ్డిగారితో, పింగళిగారితో పనిచేసేప్పుడు కె.విగారు అనేవారట, ఆర్టిస్టులు వారి భావాలను మాటలు, డైలాగులతోకాక హావభావాలతోనే తెలపాలని. మొత్తం సినిమా డైలాగులు, పాటలు లేకుండా ఇప్పుడు తాను తీస్తే వెరైటీగా వుంటుంది కదా అని ఆలోచించి "పుష్పకవిమానం" కథని కమలహాసన్‌ని దృష్టిలో పెట్టుకుని మలిచారు. మిడిమిడి జ్ఞానం ఉన్న నాకు 'అసలే ఈ కాలంలో మాటలు, మంచి సంగీతం వున్నా కూడా కొన్ని సినిమాలు ఫెయిల్ అవుతున్నాయి. మాటలు లేక, పాటలు లేక తీస్తానంటున్నారేమిటా! ' అని ఊరుకున్నాను. నేను అనుకున్న ఆలోచన ఆయనతో చెప్పలేదు.

ఈ కథని తెలుగులో నలుగురైదుగురు నిర్మాతలకి చెప్పారు. అందరూ బాగుంది బాగుంది అన్నారేకానీ తియ్యడానికి ఎవరూ ముందుకు రాలేదు. కమల్‌హాసన్‌కి సొమ్మొకడిది - సోకొకడిది (అమావాస్య చంద్రుడు), రాజపార్వై అయిన తర్వాత సింగీతం అంటే ఎనలేని గౌరవం, నమ్మకంగా వుండేది. అతనికి కూడా ఈ కథ నచ్చింది. అతనూ నిర్మించలేదు. తరువాత కర్నాటక నుంచి శృంగార్ నాగరాజ్ అనే ఆయన ముందుకు వచ్చి నిర్మించడానికి పూనుకున్నాడు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అవార్డుకి మావారికొక సినిమాకు అవార్డు వచ్చింది. అప్పుడు అమల compere చేసింది. అంతే, పుష్పక విమానంకి ఆ అమ్మాయిని హీరోయిన్‌గా బుక్ చేసారు. ఇది మాటలు, పాటలు లేనందున అన్ని భాషలలోకి ఆయా ప్రాంతీయ భాషల మెయిన్ టైటిల్స్ మార్చి రిలీజ్ చేసారు. షూటింగ్ ముహూర్తానికి నేను కూడా వెళ్ళాను. మా నాన్నగారికి చాలా సంతోషం వేసింది. మా రమని పిలిచి "రమా!, మీ ఆయన పూర్ణ కూడా మామలాగా పెద్ద డైరెక్టరై, నువ్వు కూడా అతనితో వెళ్తుండాలి మీ అత్తలాగా" అనేవారట.

మొత్తం షూటింగ్ బెంగుళూరులో Windsor Manor – Five Star Hotel లో జరిగింది. కొన్ని కొన్ని మట్టుకు Hotel Highlandsలో జరిగాయి. వేసవి సెలవులు అయినందున మా ఇద్దరి అమ్మాయిలు కూడా వచ్చారు. అందరం Windsor Manorలోనే ఉండేవాళ్ళం. మా రమకి చంటిపిల్ల అయినందున రాలేకపోయింది. ఈ పుష్పక విమానం సినిమా కీర్తిశేషులు అయిన హిందీ హీరో రాజేంద్రకుమార్ కొని హిందీలో 'పుష్పక్' అనే పేరుతో విడుదల చేసారు. పాటల, మాటల యుగంలో కూడా వెరైటీగా ఈ సినిమా తీసినందుకు చాలా ప్రశంసలొచ్చాయి మావారికి. దీనికి Best Wholesome Entertainment సినిమాగా నేషనల్ అవార్డ్ వచ్చింది. అప్పుడనిపించింది. మావారు పిక్చరు ప్రారంభించక ముందు నేను ఎంత ఫూలిష్‌గా ఆలోచించానో అని.

పుష్పక విమానం షూటింగ్ టైములో నేను పిల్లలతో ఒకసారి వెళ్ళి వచ్చిన తరువాత మా సుధ బెంగుళూరుకు వెళతానంది. అది అప్పుడు హైస్కూలు స్టేజిలో వుంది. సరేనని ఫ్లైట్‌కి బుక్ చేసాము. షూటింగ్ వలన వాళ్ళ నాన్నగారు వెళ్ళి అప్పటికే ఒక వారం పైగా

అయింది. అదే ఫ్లైటులో ఆ షూటింగ్‌లో పాల్గొనే కొంతమంది నటీనటులున్నారు. అందులో కమలహాసన్ కూడా వెళుతున్నాడు. మేము సుధతో చెప్పాము. "కావలిస్తే ఎటూ కమలహాసన్ వాళ్ళు కూడా వస్తున్నారుగా, నీకేమైనా సహాయం కావలిస్తే ఫలానా సింగీతం కూతురని చెప్పు. వాళ్ళ సహాయం అడుగు" అన్నాను.

"నేనెందుకు అడగాలి? అడగను" అంది. తీరా ఫ్లైటులో దాని క్యారీ బ్యాగ్ బాక్స్‌లో పెట్టబోతే దానికి అందలేదట. కమలహాసన్ అసిస్టెంట్ దీన్ని గుర్తుపట్టి సహాయం చేసాడట. తరువాత షూటింగ్ గ్యాప్‌లో అందరూ కుర్చీలలో కూర్చుని వుండగా కమలహాసన్ ఎవరిదో కళ్ళద్దాలు మా సుధకి పెట్టి "చూడండి కళ్ళద్దాలు పెడితే అచ్చు సింగీతంగారిలాగే వుందికదూ, ఎక్జాట్లీ సింగీతం కదా" అన్నాడట. ఇవన్నీ వచ్చి మా సుధ చెప్పింది. అది మొదటి నుంచి స్వతంత్ర భావాలు కలది. ఇప్పటికీ ఎక్కడికైన వెళితే ఫలానా వారి అమ్మాయి అని చెప్పుకోదు. దాని చిన్నతనంలో కూడా అంతే. ఎవరైనా అన్నం కలిపి నోట్లో పెడితే ఒప్పుకొనేదికాదు. అదే స్వయంగా తినేది.

మా చిన్న చెల్లెలు పెద్ద కూతురు మృదుల ఇంటర్ రెండు సంవత్సరాలు మదరాసులోనే చదివింది. మా సుధ Anna Adrash Collegeలో బి.ఎస్.సి చదవడం వలన అదే మృదులతో వెళ్ళి దానికి సీటు ఇప్పించింది. మృదుల ఇంటర్ కాగానే వాళ్ళ ఊరికి వెళ్ళిపోయింది. మా శకుంతల పెళ్ళయి వెళ్ళగానే కొన్నాళ్ళు కంపెనీ లేక బాధపడింది మా సుధ. ఇంతలో మృదుల రాకతో దానికి రెండేళ్ళు మంచి కంపెనీ వుంటూ వచ్చింది. కానీ అది కూడా రెండేళ్ళవగానే వెళ్ళిపోవడంతో, మళ్ళీ దాని రూములో ఒంటరిదైంది.

నేషనల్ అవార్డు అందుకోవడానికి మావారితో పాటు నేను, మా అమ్మాయిలిద్దరం ఢిల్లీకి వెళ్ళి వచ్చాము. ఆ సమయంలోనే ఢిల్లీలోని రాజ్‌ఘాట్, సైట్ సీయింగ్ ఆగ్రా కూడా వెళ్ళి వచ్చాము. అవార్డ్ ఫంక్షన్‌కి హిందీ నటుడు రాజ్‌కపూర్ కూడా వచ్చారు. ముందు సీట్లో కూర్చున్న ఆయనకి ఒంట్లో బాగోలేక స్టేజ్ ఎక్కలేకపోయారు. ప్రెసిడెంట్ వెంకట్రామన్ గారే కిందకి దిగి రాజ్ కపూర్‌కి దాదా సాహెబ్ పాల్కే అవార్డు ప్రదానం చేశారు. కొన్నాళ్ళకే రాజకపూర్ జీవితం ముగిసిపోయింది.

'పుష్పక్' ఇంటర్నేషనల్ ఫేమ్ అయింది. కేన్స్ ఫెస్టివల్‌కి హాజరైంది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కి ఎంపిక అయింది.

'పుష్పక్' పరిచయంతో రాజేంద్రకుమార్ గారు ఒక సినిమా మా వారి దర్శకత్వంలో హిందీలో ప్రొడ్యూస్ చేసి తన కొడుక్ కుమార్ గౌరవ్ హీరోగా, మాధురి దీక్షిత్ హీరోయిన్‌గా "ఫూల్" అనే సినిమా తీసారు. రాజేంద్రకుమార్, సునీల్ దత్తు తండ్రుల వేషాలు వేసారు.

'పుష్పక్ విమానం' షూటింగ్ బెంగుళూరులో జరుగుతోంది. నేను మళ్ళీ వెళ్ళలేదు. పిల్లలు చదువులు, మా నాన్నగారు వుండడం, రమకి తన పాపతో సరిపోవడం, కొన్ని ఇంటి బాధ్యతల వలన ఇక్కడే వుంటూ వచ్చాను. ఆ సమయంలో కొన్ని ఫిలిం నెగిటివ్ డబ్బాలు మా యింట్లో వుండేవి. సాధారణంగా రెండు రోజులకొకసారి నేను ఫోన్లు చేస్తుండేదాన్ని. రాత్రి పదిగంటలు అయిన తరువాత. ఆ సమయంలో అయితే షూటింగు ముగించుకుని రూములో వుంటారు కదా అని. ఫిలిం డబ్బాలు అవసరం వచ్చినప్పుడల్లా మా యింటికి వచ్చి తీసుకెళుతుండేవారు. ఆ విషయం మా వారు ముందే ఫోను చేసేవారు. ఒకరోజు ఒక అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజరు వచ్చి "నేను బెంగుళూరు నుంచి వచ్చాను. ప్రొడ్యూసర్ గారు, సింగీతంగారు ఫిలిం నెగిటివ్ డబ్బా తీసుకుని రమ్మని నన్ను పంపారు" అన్నాడు. నాకేం చెయ్యాలో తోచలేదు. అతను ఫలాన అని నాకు తెలుసు. షూటింగ్ వెళ్ళినప్పుడు చూసాను. మా వారు ఫోన్ చేసి చెప్పందే నేను ఎలా ఇవ్వను? ఆ కాలంలో మొబైల్స్ లేవు. బి.యస్.యన్.యల్ ఫోను హాల్లోనే వుంది. ఏం చేయాలో తోచలేదు.

"ఉండండి" అని ఆయన్ని కూర్చోబెట్టి ఆయనతో 'మేము ఒక ప్రాబ్లమ్‌లో వున్నాము. పొద్దునుంచే ఫోన్ చేస్తుంటే ఆయన షాట్‌లో ఉన్నారు. పిలవడానికి కుదరదని చెప్తున్నారు. ఇప్పుడైనా దొరుకుతారేమో ట్రై చేస్తా'నని చెప్పి మావారికి ఫోన్ చేసి కొన్ని విషయాలు చెప్పినట్లు మాట్లాడి ఫలానా మనిషి ఫిలిం నెగిటివ్ కోసరం వచ్చారు ఇస్తున్నాను అన్నాను.

మా వారు నా సందేహం గ్రహించి "నువ్వు ధైర్యంగా అతనికి ఇవ్వు మనవాడే" అని అన్నారు.

ఆ రాత్రి మా వారు ఫోన్ చేసి "అతని ఎదురుగుండా ఫోన్ చేసావు. భలే ఆలోచన చేసేవే, నీకు ఎలా తట్టింది. మా ప్రొడ్యూసర్‌గారికి నీ తెలివి తేటలు ఉపయోగించుకున్నందుకు చాలా ఆశ్చర్యం వేసింది" అని నవ్వారు.

కుమరన్ కాలనీలో ఒకటిన్నర గ్రౌండు స్థలం కొన్న తరువాత వెంటనే ఇల్లు కట్టడానికి మావాళ్ళు షూటింగుల రీత్యా ఊళ్ళో లేకపోవడం, డబ్బు సర్దుబాటు కాకపోవడం వలన ఆలస్యమైంది. కానీ మొత్తం మీద పూనుకున్నాము. ఆర్కిటెక్ట్‌ని పిలిచి ప్లాను వేసి అంతా సిద్ధం అయ్యాము. కానీ వాళ్ళు షూటింగుల రీత్యా బెంగుళూరు, హైదరాబాదు మధ్య తిరుగుతున్నారే, ఎవరు చూసుకుంటారు అని ఆలోచన కలిగింది మావారికి. కానీ స్వతంత్రంగా అడగడానికి వాళ్ళన్నగారే కదా! ఆయన్ని అడిగితే తాను చూసుకుంటానని మనఃపూర్వకంగా చెప్పారు. ఇంజనీరును అడిగితే ఎనిమిది నెలలకే అవుతుందని చెప్పారు.

భూమి పూజకి మా సేతమ్మక్క, బావగారు వచ్చారు. ఇల్లు ప్రారంభించి ఇలాగని, అలాగని దీపావళి అని, వానలని పలుకారణాల వలన ఒకటిన్నర సంవత్సరం పట్టింది. ఇల్లు కొంచెం పెద్దది అయినందున కింద ఎన్నిగదులు, హాలు వుందో, మేడమీద కూడా అన్ని గదులు వున్నాయి. బెడ్‌రూమ్స్ సైతం పెద్దవి. కింద ఒక బెడ్ రూమ్, పైన రెండు బెడ్ రూమ్స్ మధ్యలో ఒక ఎలివేషన్ రూమ్ వుంది. ఉడ్ వర్క్, పెయింటింగ్స్ అన్ని హంగులు అయ్యేసరికి రెండు సంవత్సరాలు పట్టింది. మా బావగారు ఇక్కడున్నప్పుడే మా సేతమ్మక్కని అప్పుడప్పుడు పిలిపించుకునేదాన్ని. పిల్లలు సెలవులకి వస్తుండేవారు. ముఖ్యమైన పండగలకి మా బావగారే గూడూరుకి వెళుతుండేవారు.

ఆ సమయంలో మా బావగారి మూడో అమ్మాయి సత్యభామకి ఈ ఊరులో ఒక సంబంధం కుదిరింది. పెళ్ళి చూపులు మా యింట్లోనే జరిగాయి. మా సేతమ్మక్క రెండో అబ్బాయి నర్సింగ్ వచ్చాడు. మా నర్సింగ్ సంబంధం కోసరం రెండేళ్ళుగా ఏలూరు వాళ్ళు వేచి వుండి, అతనికి స్టేట్ బ్యాంకులో ఉద్యోగం ఖాయమవగానే వాళ్ళమ్మాయి జయలక్ష్మి పెళ్ళి నర్సింగ్‌తో చెయ్యడానికి ఒత్తిడి చేసారు. జయ పెద్ద తల్లి భర్త సుప్రసిద్ధ దర్శకులు కమలాకర్ కామేశ్వరరావుగారింట్లో పెళ్ళి చూపులు జరిగి, మర్నాడు మా యింటికి వచ్చి పెళ్ళి ఖాయం చేసారు. సత్యభామ పెళ్ళి 1985 నవంబరు 17న అయితే, నర్సింగ్‌కి అదే 1985 నవంబరు 24న ఏలూరులో పెళ్ళి జరిగింది.

హైదరాబాదులోనే మా నాన్నగారి పినతండ్రి కొడుకు యలవర్తి వెంకటరమణగారని కర్నూలు మొదలైన ఊర్లు తిరిగి హైదరాబాదులోని సెక్రటేరియట్లో ఉద్యోగం చేసి రిటైర్ అయి వుంటున్నారు. వెంకట రమణారావుగారు మా బాబాయి. పిన్ని పేరు రుక్మిణి. మా అమ్మా నాన్నగారు ఉన్నంత కాలం కలిసిమెలిసి వస్తూ పోతూ ఉండేవారు. ఆఖరికి మా అమ్మ గర్భసంచి ఆపరేషన్ అయినపుడు మా రుక్మిణి పిన్ని మా అమ్మతో ఆసుపత్రిలో వుండి చాలా సహాయం చేసింది. మా అమ్మా, నాన్నగారు పోయిన తరువాత కూడా మా అక్కా చెల్లెళ్ళని కనుక్కుంటూ, మాకు ఫోన్లు చేస్తూ, మా బాగోగులు కనుక్కుంటూ, పండగ పబ్బాలకి మా బాబాయిగారు శుభాకాంక్షలు చెప్తుండేవారు. మా యింటి గృహప్రవేశానికి, మా యింటి ఫంక్షన్‌కి వాళ్ళు ఉభయులూ వస్తుంటారు. మా బాబాయిగారికిప్పుడు 86 సంవత్సరాలు ఉండడం వలన ప్రయాణాలు చేయలేకపోతున్నారు. మా పిన్ని కూడా మా పట్ల అభిమానంగా వుంటుంది. వాళ్ళ ఇంట్లో శుభకార్యాలకి మేము కూడా వెళుతూంటాము. వాళ్ళకి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కొడుకు, కోడలు యిద్దరు మనవళ్ళతో హైదరాబాదులో వుంటున్నారు. రెండో కొడుకు బెంగుళూరులో వుంటాడు. మూడో కొడుకు అమెరికాలో వుంటాడు. కూతురుది ఆ ఊరే. నేను ఎప్పుడైనా మా వారితో షూటింగుకి హైదరాబాదు వెళితే మా బాబాయిగారింటికి వెళ్ళకుండా

వుండను. ఒక్కోసారి మా వారు కూడా వాళ్ళింట్లోనే నాతో కూడా భోజనానికి వస్తూ వుంటారు. మా నాన్నగారు, అమ్మ తరువాత వీరిద్దరే నాకూ, మా చెల్లెళ్ళకి అమ్మా, నాన్నలు. యలమర్తివారు మా పుట్టింటివారు. వాళ్ళుకూడా అదే అభిమానంతో మమ్మల్ని వాళ్ళ స్వంత కూతుళ్ళలాగా చూస్తారు.

వడపళనిలోని ఇల్లు మూడొంతులు పూర్తి అయ్యాక మంచి రోజు చూసి గృహప్రవేశం చేయడానికి నిశ్చయించుకున్నాము. తరువాత శూన్య మాసం, మూఢాలు వస్తాయని గృహప్రవేశం అని ఒత్తిడి చేస్తే గాని ఇంటిపనులు పూర్తి చెయ్యరు. మేస్త్రీ పనుల వాళ్ళు ఏదో ఒక సాకుచెప్పి సెలవులు పెడ్తూంటారు. అందువలన 1989 సంవత్సరము అక్టోబరు 27న ముహూర్తం కుదిరింది. ఆ రోజునే మా సుధ పుట్టినరోజు అయింది. మాకు డబుల్ అట్రాక్షన్ అన్నమాట. మా సుధకైతే థ్రిల్. రావలసిన బంధువులు వచ్చారు మధ్యలో హైదరాబాదుకి వెళ్ళిన మా నాన్నగారు వచ్చారు. మా చిన్న చెల్లెలు కుటుంబము వచ్చింది. మా పెద్ద చెల్లెలు మామూలే కదా, రాలేదు. పంజాగుట్ట మా పిన్ని, బాబాయ్ కూడా వచ్చారు. ముందురోజు రాత్రి పదకొండు గంటలకు గృహప్రవేశం, భోజనాలు. రాత్రి అయినందున కొద్ది మంది మాత్రమే వచ్చారు. మా రమ అనంత్ మూడు నెలల బిడ్డయినందున రాలేదు. మరునాడు సత్యనారాయణ వ్రతం చేసాము. పగలు అయినందున మేము ఆహ్వానించిన వాళ్ళందరూ వచ్చారు. మధ్యాహ్నం భోజనాల టైములో కమలహాసన్ వచ్చారు. ఇతన్ని చూడగానే మా బంధువులకి, పిల్లలకి అందరికి ఒక థ్రిల్. అతన్ని చూడగానే వంటవాళ్ళు సహితం వాళ్ళ పనులు మానేసి అతన్నే చూస్తూ వుండేవారు. మొత్తం మీద గృహప్రవేశం అయిపోయింది. అప్పుడా ఇంటికి అన్ని తలుపులు లేనందున వెండి మిగతా సామాన్లు వున్నాయికదా అని మా సేతమ్మక్క, మా రమా తండ్రి వెంకోజి అన్న రాత్రి తెల్లార్లు మేల్కొనే వున్నారు.

ఇంకా చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నందున అవి ముగియడానికి మూడు నాలుగు నెలలు పట్టాయి. అద్దె ఇంట్లోనే సంక్రాంతి పండగ చేసుకుని జనవరి 18వ తేదీన ఇల్లు మారాము. మా వారికి, మా కుటుంబానికి 9వ అంకె శుభదాయకం. మావారు సెప్టెంబరు నెలలో పుట్టారు. నేను అక్టోబరు 9న పుట్టాను. మా డైరెక్టరు కాలనీలో ఫ్లాటు కూడా 5-డి, రాఘవేంద్రస్వామి మా కుల దైవం. మా యింటికి "గురుజ్యోతి" అని పేరు పెట్టాము. మేము సెల్వరాజ్ గారి ఇల్లు ఖాళీ చేయడం మంచి వాళ్ళను వదులుకున్నామే అని ఆయన బాధపడ్డారు

జనవరి పండగలు అయిన తరువాత 18వ తేదీన వడపళని కుమరన్ కాలనీలో వున్న మా యింటికి వెళ్ళాక అంతా సర్దుకోవడం చాలా మటుకు అయిపోయింది. మేము ఇంటికెళ్ళాక ఉగాది పండగ, మార్చి 20న మా పెళ్ళిరోజు జరిగాయి.

అది 1989వ సంవత్సరం మా శకుంతల బి.కాం కంప్యూటర్ డిప్లొమా పూర్తయి ఇన్ఫోటెక్ కంప్యూటర్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది. మా రమ కొడుకు 1988వ సంవత్సరం సెప్టెంబరు 24న పుట్టాడు. అందువలన 1989వ సంవత్సరంలో సెప్టెంబరు 24న వాడి పుట్టిన రోజు గ్రాండ్‌గా జరిపాము.

ఆ పార్టీకి మా వారి అక్క కూతురు మా మేనకోడలు వచ్చి "ఆంటీ ఇదివరలో శకుంతలకి ఒక సంబంధం చెప్పాను కదా? దాని గురించి మీరేమీ చెప్పలేదేమి" అని అడిగింది. అప్పుడు అది నేను పట్టించుకోలేదు. మేము కొన్ని అమెరికా సంబంధాల కోసం చూసాము కొంత మంది పి.జీలు కావాలని, మరికొన్ని సంబంధాలు అమెరికాలో వుండే అమ్మాయిల్నే చూస్తున్నామని అనేవారు. అప్పుడు మాకు తెలిసిన వాళ్ళ ద్వారా ఒక సంబంధం వచ్చింది. అబ్బాయి వాషింగ్టన్‌లో వరల్డ్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. వాళ్ళే ఇంట్రెస్ట్‌తో వచ్చారు. కానీ వాళ్ళది కాశ్యప గోత్రం. సగోత్రం అయినందువలన అది కుదర్లేదు. అప్పుడు ఈ రోజుల్లాగా లేదు. మా ఫ్రెండ్స్ అమెరికా సంబంధం చేసి రెండు సంవత్సరాలైనా భార్యను పిలుచుకుపోలేదు. ఇలాంటి సంఘటనలు చాలా చూసాం. అందుకని ఆ ప్రయత్నం మీద మేమంత మక్కువ చూపలేదు.

ఇప్పుడు మా మేనకోడలు అలా అడగ్గానే "నువ్వు ఆరుగురు అన్నదమ్ములు అని చెప్పావ్ కదే, అంత పెద్ద కుటుంబంలో మేము ఇవ్వము" అన్నాను.

"అయ్యో... ఆంటీ! ఆ వేళ మీరు సరిగ్గా వినిపించుకోలేదు. ఆ అబ్బాయి నాన్నగారువాళ్ళు ఆరుగురు అన్నదమ్ములు. వాళ్ళందరికీ తలా ఒక స్వంత ఇల్లు వుంది" అంది.

"అలాగా!" అని అన్ని విషయాలు అడిగితే

"ఆయన పేరు పాండురంగన్ అనీ, హిందుస్తాన్ పెట్రోలియంలో పని చేస్తున్నారని, భార్య గీతకూడా ఉద్యోగం చేస్తున్నది. వాళ్ళబ్బాయి ఇంజనీరింగ్ పాసయ్యాడు. పేరు సతీష్. ఒక్కడే కొడుకు, అక్కా చెల్లెళ్ళు ఎవ్వరూ లేరు. పైగా అతను కంప్యూటర్ చదివి, కంప్యూటర్ కంపెనీలోనే ఉద్యోగం చేస్తున్నాడు. మీ శకుంతల కూడా కంప్యూటర్ చదివిందిగా" అంది.

**అప్పుడు మేము** ఈ సంబంధానికి ఒప్పుకుని జాతకాలు జతపరచి చూపించి, కలిసాయి అని ఆచార్యులుగారు చెప్పిన తరువాత పెళ్ళి చూపులకి ఏర్పాటు చేసాము. ఇక్కడొక విషయం చెప్పాలి. మావారికి పెళ్ళి విషయాల్లో కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. కట్నాలు ఇవ్వడం, పుచ్చుకోడంలాంటి ఆలోచనలకు ఆయన విరుద్ధం. ఇరువైపుల వాళ్ళు వాళ్ళ శక్తి కొలది సంతోషంగా ఎంతైనా చెయ్యవచ్చు. కానీ ఏ వైపునుంచి కూడా డిమాండ్లు ఉండకూడదు. వీటికి సమ్మతమైతేనే పెళ్ళిచూపులు. ఆ తర్వాత అబ్బాయి, అమ్మాయిలది ఫైనల్ నిర్ణయం. ఈ విషయాన్ని మావారు స్పష్టంగా చెప్పారు. ఆయన ఫ్రాంక్‌నెస్‌ను వాళ్ళు మెచ్చుకున్నారు.

పెళ్ళిచూపులయ్యాయి. అబ్బాయి, అమ్మాయి ఒకరినొకరు చాలా ఇష్టపడ్డారు. 1990 ఫిబ్రవరి 14న ముహూర్తం అని తేల్చుకున్నాం. బుధవారం పెళ్ళి అయితే రెండురోజులు ముందే సోమవారం పెళ్ళి కూతురుని చేసాము. ఒక నెల ముందుగానే అందరికి పెళ్ళి విషయం, పెళ్ళి కూతురిని చేసే తేది రాసేసాము. విజయశేష్ మహల్ ఆ తేదీకి ఖాళీలేనందున విజయరాణి మహల్‌లో పెళ్ళి నిశ్చయించాము. చాలామంది బంధువులు ఇతర ఊర్ల వాళ్ళు కుటుంబ స్నేహితులు, సినీ ప్రముఖులు, మా పిల్లలిద్దరి స్నేహితులు, చాలామంది వచ్చారు. పొద్దున పెళ్ళి, సాయంత్రం రిసెప్షన్ పెట్టుకున్నాము. రిసెప్షన్‌కి మాములు సినిమా పాటలు కాక, కుమరేశ్ - గణేష్ వయోలిన్ ద్వయం పెట్టాము. వాళ్ళప్పుడు 14, 15 ఏళ్ళ వయస్సు వాళ్ళు. అప్పటికే వాళ్ళు పెద్ద విద్వాంసులు. అందరూ పెళ్ళికీ, రిసెప్షన్‌కీ వచ్చారు. ముఖ్యంగా మగ పెళ్ళివారు మేము చేసిన పెళ్ళికి చాలా తృప్తిపడ్డారు. కమలహాసన్ భార్య సారికతో వచ్చారు. ఇతను వచ్చినప్పుడు మదరాసు బంధువులు చుట్టుముట్టారు. చిరంజీవి వచ్చినప్పుడు ఆంధ్రానుంచి వచ్చిన జనం, పిల్లలు చుట్టుముట్టారు. పిల్లలంతా ఇద్దరి దగ్గర నుంచి ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు. చిరంజీవి అయితే 'జగదేకవీరుడు అతిలోక సుందరి' షూటింగ్ మధ్యలోనే వచ్చారు. వచ్చిన అతిధుల్లో ముఖ్యంగా ఒకటి చెప్పాలి. మా వారికి చాలాకాలం క్రితం తనతో స్కూల్లో, కాలేజీలో చదివిన క్లోజ్ ఫ్రెండ్స్. ఎక్కడెక్కడున్నారో వెతికి, వాళ్ళని పెళ్ళికి ఇన్వైట్ చేయాలని ఆరాటీశారు. ఒకరు కేరళలో జడ్జి, మరొకరు విజయవాడ దగ్గర రైల్వే టిక్కెట్ట్ కలెక్టరు, మరొకరు ఏ.పి. ఛీఫ్ ఇంజనీర్, ఇంకా లెక్చరర్లు, వ్యాపారవేత్తలు చాలామందిని కాంటాక్ట్ చేసారు. కొందరు ఆప్యాయంగా ఫోన్లో మాట్లాడితే, కొంతమంది వచ్చారు. ఇంత మంది బంధువులు, సినీ ప్రముఖులొచ్చినా, చిన్ననాటి స్నేహితులను చూడగానే మా వారి ఆనందమే ఆనందం. మొత్తం మీద మా పెద్ద చెల్లెలు కుటుంబం ఈ పెళ్ళికి వచ్చింది. మా నాన్నగారి సంతోషం చెప్పలేను. వచ్చిన వాళ్ళంతా పెళ్ళి కూతురు, పెళ్ళికొడుకు ఈడుజోడు బాగుందన్నారు.

పెళ్ళై మా శకుంతల, సతీష్ హనీమూన్ నుంచి వచ్చిన తరువాత ఎవరి పనులలో వాళ్ళుండిపోయారు. మా వాళ్ళు తెలుగు సినిమా షూటింగ్ అయితే హైదరాబాదు, కన్నడ షూటింగ్ అయితే బెంగుళూరు వెళుతుండేవారు. మా శకుంతల పెళ్ళి నాటికి మైకెల్ - మదనకామరాజు కథ జరుగుతూంది. మా సుధ M.sc చేస్తూ దాని యూనివర్శిటి ఏమో, దాని పనేమో వుండేది. మేము మా రమా పిల్లలు అంజు, అనంత్ ఆటపాటలతో గడిపేవాళ్ళం.

ఇక్కడ శకుంతల వివాహ జీవితాన్ని గురించి ఒకటి చెప్పాలి. శకుంతలని వాళ్ళ అత్తగారు కూతురికన్నా ఎక్కువగా చూసుకునేది. దాంతో అది మా ఇంటికెప్పుడు వచ్చినా ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా అని ఉండేది. కానీ మా అల్లుడు దానికి పూర్తిగా ఆపోజిట్. మా ఇంటికి రావడం, ఇక్కడ ఉండడం అంటే అతనికి చాలా ఇష్టం. "వెళ్ళిపోదాం.. వెళ్ళిపోదాం" అని పెళ్ళాం అంటుంటే "ఏం తొందర, రెండురోజులు వుండి పోదాం" అనేవాడు. కానీ మా సుధ విషయం వేరు. వాళ్ళ అత్తమామలు, కొడుకులు కూడా ఎవరికి వారు ఇండిపెండెంట్‌గా వుండాలనే తత్వం. బెసంత్‌నగర్‌లోనే ఉన్నా, వేరే వేరే ఇళ్ళల్లో వుంటారు. కలుస్తూనే వుంటారు. ఇక సుధ తత్వం కూడా అదే. తనెప్పుడూ ఇండిపెండెంట్‌గా ఉండాలనే తాపత్రయపడ్తుంది. ఎవరిమీదా ఆధారపడదు. ఫలానా వాళ్ళ కూతురని కాక తన ప్రతిభ మీదే నిలబడాలనే ఆలోచన.

1991వ సంవత్సరం జూలై 6వతేదీన మా శకుంతల ఒక ఆడపిల్లని ప్రసవించింది. దానికి నామకరణం చేసి స్నేహ అని పేరు పెట్టాము. పాపకి మూడవనెల. ఇంతలో విజయదశమినాటికి మా వారికి 60 ఏళ్ళు పూర్తవుతుంది. మా వారు షూటింగ్ రీత్యా బెంగుళూరులో వున్నారు. నేను ఆయనకు ఫోన్ చేసి షష్టిపూర్తి పండగ చేసుకుందామా అని అడిగాను. ఆయనుండేది బెంగుళూరు, నేను మద్రాసు. ఏర్పాట్లు ఎలా? సరేనని మా కులదైవమైన శ్రీ రాఘవేంద్రస్వామి గుడిలో ఏర్పాటు చేసుకున్నాము. అది రెండు రోజులు చేసారు. మా బంధువులు, దగ్గర ఊళ్ళ వాళ్ళు వచ్చారు. మా చిన్న చెల్లెలు రఖుమా ఫ్యామిలీ వచ్చింది. మా సుశీల రాలేదు. మామూలే కదా. తరువాత ఎవరి ఊళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కొత్త ఇంటికి వచ్చి అమ్మాయి పెళ్ళి చేసాము. మనవరాలు పుట్టి మా షష్టిపూర్తి చేయించింది. స్నేహకు అయిదవ నెల రాగానే మా శకుంతలని, పాపని అత్తవారింట్లో దింపి వచ్చాము. ఒకే కొడుకు అవ్వడం వలన అంతా కలిసే ఉంటారు. ఇప్పటికీ అలాగే ఉన్నారు. 1989లో గృహప్రవేశం, 1990లో అమ్మాయి పెళ్ళి, 1991లో మనవరాలు పుట్టింది.

విజయా హాస్పిటల్ డాక్టర్ వైద్యం వలన, మందులు ప్రభావం వలన, మా నాన్నగారు మామూలు మనిషై హైదరాబాదుకి వెళ్ళిపోయారు. అక్కడికెళ్ళి మా చెల్లెలింటికెదురుగా ఒక గదిలో అద్దెకుంటూ, మా చెల్లెలు ఇంట్లోనే భోజనం చేస్తూ కాలక్షేపం చేస్తూండేవారు. అంతకు ముందు చిక్కడపల్లిలో ఒక రూంలో వుంటూ, ఒకసారి కిందపడితే మా హనుమంతరావు బాబాయిగారు చేరదీసి చూసుకునేవారు. అలా కాదని మా చిన్న చెల్లెలు పిలిస్తే ఈ విధంగా రూంలో వుంటూ వచ్చారు. అమ్మపోయిన తర్వాత ఆయన మొండితనం వలన విడిగా వుంటూ, నానా కష్టాలనీ ఎదుర్కొన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదని యింకా ఆయన స్వతంత్రంగానే జీవించాలని ఆయన ఆశయం.

మదరాసులో నేనూ, మా వారు మాట్లాడుకుని, నేను వెళ్ళి, మా నాన్నగారిని ఒప్పించి మొత్తం ఆయన్ని, ఆయన సామానులతో పాటు పిల్చుకొచ్చేశాను. ఇక్కడికొచ్చి మళ్ళీ ప్రయత్నాలు చేసి ఐ.ఏ.ఎస్ ట్యుటోరియల్ కాలేజీలో చేరి పనిచేసేవారు. ఇలా ఉంటుండగా, కొంతమంది విద్యార్థులు ఉద్యోగ నిమిత్తం, వేరే చదువులు, ఇంటర్వ్యూలు తయారవడానికని XI, XII క్లాసులకి ఎగ్జామ్ టైమ్స్ అనే పుస్తకం ప్రింట్ చెయ్యడానికని స్క్రిప్ట్ తయారుచేసి పెట్టారు. మా వారుండి వాళ్ళూ, వీళ్ళూ ఎందుకని తనే 40 వేల రూపాయలు ఖర్చు పెట్టి ప్రింటు చేయించారు. మా నాన్నగారు కొన్ని కొన్ని పుస్తకాలు తీసుకెళ్ళి లోకల్‌గా కొన్ని షాపులకిచ్చారు. పుస్తకాల గురించి పేపర్లో ప్రకటించాము ఆ వార్తలను చూసి కొంతమంది ఇంటికొచ్చి కొనుక్కునేవారు. నేనేం చేశానంటే కొన్ని స్కూల్స్ ప్రిన్సిపల్స్‌కి లెటర్స్ రాసి

తలా ఒక కాపీ పోస్ట్ చేశాను. ఇంతలో ఆయనకి హైదరాబాదు ప్రయాణం వచ్చింది. అక్కడికి కొన్ని పుస్తకాలు తీసుకెళ్ళారు. రెండవ వాల్యూమ్ స్క్రిప్టు కూడా రెడీగా వుంది. నే వచ్చాక ప్రింటు చేద్దాం అన్నారు. తానెప్పుడు వచ్చేది తెలుపుతాను అని హైదరాబాదుకి వెళ్ళారు. కానీ ఖర్చుపెట్టిన డబ్బులో పదవ వంతు డబ్బుకూడా రాలేదు. పైగా రెండేళ్ళ తర్వాత ఆ పుస్తకం ప్రయోజనం లేదు. ఏం చేస్తాం? ఈ లోతుపాతులెవ్వరికి తెలుసు? ఏదో పెద్దాయన, ఆయనకి సహాయం చేద్దాం కదా అని ఊబిలోకి దిగాం తెలియక.

హైదరాబాదు నుంచి ఫలానా రోజున వస్తున్నానని ఫోన్ చేస్తే, మీరే రావద్దు స్టేషనుకి కారు పంపిస్తామని చెప్పాను. అలాగే స్టేషనుకి కారు పంపించాను. డ్రైవరు పేరు అర్జున్. వాడు ఉండడం, తిండి, పడుకోవడం అన్నీ మా యింట్లోనే. వాడు స్టేషను నుంచి తాతగారు స్టేషనులోను లేరు, రైలులోనూ లేరని ఫోన్ చేశాడు. తిన్నగా ట్యుటోరియల్ కాలేజీకి వెళ్ళారేమో చూడమన్నాను. అక్కడ కూడా లేరని వచ్చేశాడు. ఆ డ్రైవరు చాలా మంచివాడు. మా నాన్నగారి మనసు కూడా బాగా తెలిసినవాడు. పల్లెటూరు నుంచి వచ్చిన కొత్తవాడు. వాడు వచ్చిన తర్వాతనే మా శకుంతల పెళ్ళి అయింది. ఎందుకు రాలేదబ్బా అని నాకు కొంచెం కంగారేసింది. మా పెద్ద చెల్లెలు యింటికి పోస్టాఫీసుకి ఫోన్ చేసాను. వాళ్ళది పోస్టల్ క్వార్టర్స్. అది అందలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఆవేళంతా నాకేం తోచలేదు. మర్నాడు సావకాశంగా టెలిగ్రాం వచ్చింది. మా నాన్నగారికి కాలునొప్పిగా ఉన్నందు వలన బయల్దేరి రాలేదని. దాని విషయంగా నేను మళ్ళీ ఫోను ట్రై చేశాను. మా సుశీల భర్త చెప్పారు అసలు విషయం మా నాన్నగారు కిందపడ్డారని, ఆసుపత్రిలో చేర్పించామని చెప్పారు. ఈ విషయం ప్రొద్దుటూరులో ఉంటున్న మా చిన్న చెల్లెలు రఖుమకి ఫోన్ చేసి చెపితే, అది విని మర్నాడే హైదరాబాదుకి వెళ్తానని చెప్పింది. ఆ మర్నాడు వెళ్దామనుకున్న నేను అదే రోజున కష్టపడి రిజర్వేషన్ చేయించుకుని నేనుకూడా బయల్దేరాను. నే వెళ్ళేసరికి అప్పటికే మా రఖుమ ఆసుపత్రికి చేరుకుంది. మా నాన్నగారికి నడుముకి పెద్ద ఆపరేషన్ చేశారట, నడుముకి ఏదో బాల్ పెట్టారుట. మా సుశీల స్కూలుకి శెలవు పెట్టి చూసుకుంటోంది. నేనూ, రఖుమ వెళ్ళి దాన్ని రిలీవ్ చేశాము. మా సుశీల అప్పటికే శెలవు పెట్టి వారం రోజులైంది. నేనూ, మా చిన్న చెల్లెలు ఇద్దరూ వుంటూ వుండేవాళ్ళం. మా చెల్లెలు అత్తవారిల్లు మెహదీపట్నం. ఎప్పుడైనా ఇంటికి వెళ్ళి వస్తూండేది.

మద్రాసులో మా రఖుమ పెద్ద కూతురు మృదుల ఇంటర్ రెండు సంవత్సరాలు అన్నా ఆదర్శ్ స్కూల్‌లో చదివింది. మా సుధ అన్నా ఆదర్శ్ కాలేజ్‌లో బి.ఎస్.సి పాసవడం వల్ల దాని ఇన్‌ఫ్లుయన్స్‌తో అక్కడ చేర్పించింది. కొన్నాళ్ళకి మృదులకి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. డా.త్యాగరాజుగారు వైద్యం చేస్తున్నారు. మా రఖుమ ఒక వారం హైదరాబాదులో వుండి ప్రొద్దుటూరుకి ప్రయాణమవుతుంటే సినిమా స్క్రిప్టు డిస్కషన్‌కి హైదరాబాదు వచ్చిన మా వారు మా నాన్నగారిని చూడ్డానికొచ్చారు. రఖుమ నాన్నగారిని నేను ఎటూ మద్రాసు పిల్చుకెళుతున్నాను కదా అని ప్రొద్దుటూరుకి ప్రయాణం కట్టింది. కానీ వాళ్ళ బావగారు ప్రొద్దుటూరు టిక్కెట్టు క్యాన్సిల్ చేయించి ఇన్‌ఫ్లుయన్స్‌తో మా రఖుమకి మద్రాసు టిక్కెట్టు కొని, "ముందు మదరాసు వెళ్ళి మీ అమ్మాయి మృదులని చూసి వెళ్ళు" అని దాన్ని మద్రాసుకి పంపారు. మా వారు మా నాన్నగారికి పెద్ద అల్లుడైనా, కొడుకు లేని లోటు తీర్చేవారు.

మా నాన్నగారికి కుట్లు విప్పినతర్వాత డిశ్చార్జి చేసి ఇంటికి పిల్చుకు వెళ్ళాలి కదా. అక్కడే వచ్చింది సమస్య. మా సుశీల వాళ్ళిల్లు ఐ.డి.పి.యల్ కాలనీలో వుండేది. ఊరికి చాలా దూరం. అథవా పిల్చుకుని వెళ్ళినా, అది స్కూలు, వాళ్ళ ఆయన ఆఫీసు. మా నాన్నగారినెవరు చూసుకోవాలి? "కొన్నాళ్ళయిన తర్వాత నేను మద్రాసుకి పిల్చుకెళ్తానులే" అన్నాను మా మరిదితో. అంటే అతనంటాడు "కాదునేననేది, మామని యిక్కణ్ణుంచి మా యింటికి, మళ్ళీ అక్కణ్ణుంచి స్టేషనుకి, యిన్నిచోట్ల తిప్పడం చాలా ప్రయాస అవుతుంది కదా. అయిందేమో నడుముకి పెద్ద ఆపరేషనాయే" అన్నాడు. ఆ సమయంలో అతనే ఉద్దేశ్యంతో అన్నాడో ఆలోచించే తెలివి

లేకపోయింది. ఎంతసేపూ మా నాన్నగారి సుఖమే కోరుకునే దాన్ని కనక "అయితే డాక్టర్‌నడిగి ఇక్కడ్నుంచే మద్రాసుకి పిలుచుకు వెళ్తానులే" అన్నాను.

అప్పట్లో ఏ.సి. కంపార్టుమెంట్లు లేవు. విమానంలో కూర్చోలేరు. ఫస్ట్ క్లాసు బుక్ చేయించాను. ఆయనని స్టేషనుకి ఎలా పిల్చుకువెళ్ళాలి? హాస్పిటల్ వాళ్ళని అంబులెన్స్ అడిగితే ఖాళీలు లేవన్నారు. మా కజిన్ బ్రదర్‌ని అడిగితే మొదట ట్రై చేస్తానని చెప్పి, ఆఖరుకి మొండి చెయ్యి చూపాడు. మా వారేమో మద్రాసుకి వెళ్ళిపోయారు. మా మరిది కూడా ప్రయత్నించలేదు. చాలా నిస్సహాయురాలినయ్యాను. ఒకవైపు దుఃఖం, ఏడుపు, భయం అన్ని ముంచుకు వస్తున్నాయి. టైమ్ మించితే మళ్ళీ టిక్కెట్లు దొరకడం కష్టం. ఆస్పత్రి బిల్లు కూడా నేనే కట్టేసాను. ఏం చేయాలి? ఆస్పత్రి వాళ్ళనే ప్రాధేయపడ్డాను. "ఆడదాన్ని, ఒంటరిదాన్ని ఏమైనా కానీ మీరే ఏర్పాటు చేయాల"ని అడిగాను. నా అదృష్టం బాగుండి ఆస్పత్రి వాళ్ళే ఏర్పాటు చేసారు. రైలులో ఒక నిమిషమైనా నేను నిద్రపోతే ఒట్టు. ఆయన్ని చూస్తూ గడిపాను. నే మద్రాసు వరకు ఎలా పిల్చుకెళ్ళానో ఆ భగవంతుడికే తెలుసు. మద్రాసు స్టేషన్ చేరగానే అంబులెన్స్ రెడీగా ఉంది. మా వారు, మా పూర్ణ వచ్చి మా నాన్నగారిని జాగ్రత్తగా ఇల్లు చేర్చారు. ఇక్కడికొచ్చికూడా మా నాన్నగారు నడవలేక పోయారు. నా కష్టాన్ని చూడలేక మా నాన్నగారిని రాత్రింపగళ్ళు కనిపెట్టుకుని బాత్రూం పిల్చుకెళ్ళడానికి మా వారు ఒక పనివాడిని నియమించారు. ఒక్కోసారి అతను అక్కడే వున్నా కూడా మొండిగా బాత్రూం కెళ్ళి వస్తూ కిందపడ్తుండేవారు. కానీ నొప్పి రాను రాను ఎక్కువ అయిపోయేది. ఒకసారి విజయా హాస్పటల్‌లో చేరి ఒక వారం వుండి వచ్చారు. మోహన్ దాస్ అనే డాక్టరు ఆపరేషన్ చేస్తానంటే వయస్సు అయిపోయిందని వద్దని పిల్చుకొచ్చేసాము. కానీ మా నాన్నగారు పట్టుపట్టారు. "సూర్యా హాస్పటల్‌కైనా పిల్చుకెళ్ళండి. నేను మళ్ళీ ఆపరేషన్ చేయించుకుంటాను, నేను నడవాలి. ట్యుటోరియల్ కాలేజీకి వెళ్ళాలి" అని. కానీ మా భయం మాది, వయసు 82 ఏళ్ళు వుంది ఆపరేషన్ చేస్తే అసలుకే మోసం వస్తుందేమో అని మా భయం, ఆయన పట్టు వదల్లేదు. సూర్యా హాస్పిటల్‌లోనే చేర్పించాము. ఆపరేషన్ డేట్ ఫిక్స్ అయింది. మా చెల్లెళ్ళు ఇద్దరూ వచ్చారు. పాపం మా సుశీలైతే స్కూలుకు శెలవు పెట్టి మరీ వచ్చింది. ఆపరేషన్ అయింతర్వాత మా పంజాగుట్ట బాబాయి, రుక్మిణీ పిన్నీ, మా మరదులు ఇద్దరూ వచ్చారు రెండు రోజులు వార్డులో వుంచి మళ్ళీ కండీషన్ బాగోలేదని ఐ.సి.యుకి మార్చారు. కానీ రోజు రోజుకి విషమిస్తూ వుండేది. వంటావిడ, పై పనికి మనుషులు ఉన్నందున నేను, మా చెల్లెళ్ళు పగలంతా బయట హాల్లో కూర్చుని, అప్పుడప్పుడు అక్కడికి వెళ్ళి చూస్తుండేవాళ్ళం. పనివాడు ఆసుపత్రిలోనే పగలు, రాత్రి వుండేవాడు. పది పదిహేను రోజులు వెంటిలేటర్ పెట్టారు. అక్కడెంత ఖర్చైనా మా వారు వెనకాడలేదు. మా చెల్లెళ్ళు నెల జీతగాళ్ళాయె! ఎంతనివ్వగలరు? వాళ్ళిద్దరూ వాళ్ళ శక్తిని అనుసరించి ఇచ్చారు. మా సుశీల కొడుకులు రాజా, బాలాజి అప్పటికే ఉద్యోగస్తులైనందున వాళ్ళు కూడా తోచిన సహాయం చేసారు. మా వారి షూటింగ్ "భైరవద్వీపం" మదరాసులోనే అవుతుండడం వలన, పైగా విజయా వాళ్ళదే కనుక, వాళ్ళ స్టూడియోలోనే కనుక మా వారు మదరాసులోనే వుంటూ వచ్చారు. ఎవ్వరెన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. సెప్టెంబరు 30 వ తేదీన మా నాన్నగారు మరణించారు.

ఆయన బ్రతికున్నంత కాలం లేవలేని పరిస్థితుల్లో అందరి చేత చేయించుకుంటున్నాననే అని పైగా ఏ రక్త సంబంధం లేని రమ చేత కూడా చాకిరీ చేయించుకుంటున్నానని బాధపడేవారు. ఎవరి పుట్టిన రోజైనా సరే కనీసం పదిహేను రూపాయలు తగ్గకుండా బహుమతి ఇచ్చేవారు. నాకు ఆయనకు తోచిన డబ్బు ఇస్తూ "చూడమ్మలూ, నువ్వు డైరెక్టరు భార్యవి. ఇవాళ నీ పుట్టినరోజు కదమ్మా, ఇదిగో ఈ డబ్బు. దీని పైన వేసి చీర కొనుక్కోమ్మా" అనేవారు నేను "నాన్నగారూ మీ కూతురుని అయిన తర్వాతనే కదా ఆయన భార్యనయ్యాను" అనేదాన్ని. ఆయన బ్రతికి వున్నన్నాళ్ళు అందరికి బాగా చేసారు. చేతులు, కాళ్ళు ఆడుతున్నన్నాళ్ళు ఉద్యోగం చేస్తూనే

వుండేవారు. హైదరాబాదులో వుండేటప్పుడు వేణుగోపాల్ అనే ఒక అంధుడైన విద్యార్థికి ట్యూషన్ చెప్పేవారు. మా నాన్నగారు మదరాసు వచ్చాక కూడా అతను ఉత్తరాలు రాయించేవాడు. అతని ఉత్తరాలు చూసి మురిసిపోయేవారు.

నేను ఒక శుక్రవారం తలకు స్నానం చేసి ఆ సాయంత్రం తల దువ్వి జడ వేసుకోబోతే నాకు జడల్లుకునేందుకు రాలేదు. ఎడమ చేతి వేళ్ళకు పట్టు రాలేదు. జుట్టు బిరుసుగా వున్నందున రాలేదేమో అనుకున్నాను. మర్నాడు శనివారం స్నానానికి ముందు కూడా ఇదే పరిస్థితి అయ్యింది. ఇది ఏమిటి అనుకున్నాను. సరే పూజా, టిఫిన్ అంతా అయింది. బాగున్నాను. మధ్యాహ్నం మేమంతా భోజనం చేసేటప్పుడు ఎడమ చేత్తో వడ్డించుకునేందుకు రాలేదు. గరిటెను పట్టుకోలేకపోయాను. పక్కనే కూర్చున్న మావారు చటుక్కున పట్టుకున్నారు. మేడ మెట్ల దగ్గరకు వెళ్ళి "అబ్బా నేనిప్పుడు మేడ ఎలా ఎక్కుతాను? చేతకాదే" అంటూ మెట్ల మీద చతికల పడ్డాను.

మా రమ వుండి "అదేంటి మాటలలా ముద్దముద్దగా వస్తున్నాయి" అంది. నాకు అదోలా అయిపోతోంది. తర్వాత ఏం మాట్లాడడానికి రాలేదు. వెంటనే మా వారు డాక్టరు విజయకుమార్‌గారికి ఫోన్ చేస్తే వున్న పళాన నన్ను పిల్చుకు రమ్మన్నారు. ఆయన విజయా హాస్పటల్‌లో కార్డియాలజిస్ట్. చాలా సంవత్సరాలుగా నేను ఆయనకి పేషెంటు. ఆస్పత్రికి పిల్చుకెళ్ళగానే వీల్ కుర్చీలో పిల్చుకెళ్ళి చాలా పరీక్షలు చేసి ఐ.సి.యుకి తీసుకెళ్ళి అక్కడ జాయిన్ చేసారు. ఇంటి వారెవ్వరినీ లోనికి రానివ్వలేదు. అలా మూడు రోజులు ఐ.సి.యులో వుంచిన తరువాత వార్డుకు మార్చారు. బ్రెయిన్‌కు వెళ్ళే రక్తం క్లాట్ అయిందట. బ్లడ్ సర్క్యులేషన్ లేనందు వలన బ్రెయిన్ అటాక్ అయిందట. ఆలస్యం చేసి వుంటే హెమరేజ్ అయి పక్షవాతం వచ్చి వుండేదట.

మదరాసులోనే వుంటున్న శకుంతలకి వేసవి శెలవులు అయినందు వలన పగలు, రాత్రి వార్డులో నాతోనే వుంటూ నన్ను కనిపెట్టుకుని వుండేది. అప్పుడు అది యం.సి.ఏ పరీక్షలు రాయడానికి చదువుకుంటూ వుండేది. దాని పుస్తకాలన్నీ నా రూముకు తెచ్చి చదువుకుంటూ వుండేది. మా వారు ఆఫీసు పనులు, షూటింగుల వలన అప్పుడప్పుడు నన్ను వచ్చి చూచి వెళుతుండేవారు. అర్ధరాత్రి నేను బాత్‌రూంకి వెళ్ళవలసి వచ్చి, పాపం మా శకుంతల నిద్రని పాడుచేయడం ఎందుకని మెల్లిగా చప్పుడు చేయకుండా దిగినా కూడా ఎలా కనిపెట్టేదో, చటుక్కున వచ్చి నా చేయి పట్టుకునేది "నన్నెందుకు లేపలేదమ్మా? నేనిక్కడ ఉన్నది ఎందుకు?" అని బాధపడేది.

**రెండు మూడు** రోజులు మాట సరిగా రాలేదు. ఢిల్లీలో వున్న మా సుధ ఫోన్ చేసేది. దాంతో మాట్లాడడానికి వచ్చేది కాదు. నాకు ఏడుపు వచ్చేది. సరిగ్గా ఆ సమయానికి ఒకనాడు విజయకుమార్ గారు వచ్చి "ఏం.. మీ మదర్ ఏడుస్తున్నారు?" అని అడిగారు. మా చెల్లెలితో ఫోన్‌లో మాట్లాడడానికి రాలేదని బాధపడుతోంది అని చెప్పింది.

పది రోజులు మందులు, డ్రిప్పు, ఇంజక్షన్‌లు ఇచ్చినందు వలన బాగా నయం అయిపోయింది. జబ్బు నయం అయింది కదా అని డిశ్చార్జి చేసారు. కానీ ఇంటికి వెళ్ళిన తరువాత మళ్ళీ మాట రాకుండా చేతి వేళ్ళు వంకర పోవడం మొదలెట్టింది. మర్నాడే మధ్యాహ్నం ఆసుపత్రికి వచ్చేసరికి అదే రూం, అదే మంచం ఖాళీగానే వుంది. బాయ్స్, నర్సులు ఈసారి తొందరపడి ఇంటికి వెళ్ళొద్దని, పూర్తిగా గుణం అయింతర్వాత ఇంటికి వెళ్ళమని చెప్తుండేవారు.

చాలాకాలం తరువాత ఏదో విషయానికి శకుంతల గురించి విజయకుమార్ గారితో ప్రస్తావన వచ్చినప్పుడు, "మీరు ఆసుపత్రిలో వున్నప్పుడు పుస్తకాలు ముందేసుకుని కూర్చునేదే, ఆ అమ్మాయా?" అనడిగారు.

"అవునండీ. అది యం.సి.ఏ.కి చదువుతూంది అప్పుడు" అని చెప్పాను. ఇలాగ ఒకటేమిటి? నరాల బలహీనం అయినపుడు విజయకుమార్ గారి సిఫార్సు మీద, డా.యస్.యస్.కె అయ్యర్ గారి దగ్గరకు వెళితే తలనిండా ఏవో ట్యూబులు పెట్టి షాక్ ట్రీట్‌మెంటు ఇచ్చారు. పంటినొప్పి కారణంగా విజయా ఆసుపత్రిలోని డా.ప్రభు పన్ను పీకే ముందే ఐదురోజులు ఆ ఫలాన మాత్ర తీసుకోలేదు. దాని ప్రభావం వలనే ఏమో, పన్ను పీకగానే గుండెలో నొప్పి వచ్చింది. వెంటనే డా.ప్రభు, విజయకుమార్ గారికి ఫోన్ చేసి వీల్ చైర్‌లో ప్రభూ కూడా వచ్చి ఐ.సి.యులో దిగబెట్టి వెళ్ళారు. అక్కడ జూనియర్ డాక్టర్లు, నర్సులు "ఇంతకు ముందు మీకు హార్ట్ అటాక్ వచ్చిందా?" అని అడిగారు. ఎందుకబ్బా అలా అడుగుతున్నారనుకుని నాకు కొంచెం భయం వేసింది. ఐ.సి.యులో రెండు, మూడు రోజులు ఉంచారు. తరువాత తెలిసింది. నాకు మైల్డ్ హార్ట్ అటాక్ వచ్చిందని, వార్డుకి వచ్చిన తరువాత ఇంకా మూడు రోజులు ఉంచారు. డాక్టర్ల పర్మిషన్‌తో మా శకుంతల నాకు గంజి ఇచ్చి పోతుండేది. ఆవేళ సాయంత్రం అంతా అంజూ కూడా వాళ్ళ తాతతోనే ఉంది. ట్రీట్‌మెంటు ఇస్తూ కడుపుపై రెండువైపులా రోజుకు రెండు ఇంజక్షన్స్ ఇచ్చేవారు. నాల్గవ రోజు ఆ వేళ నా పుట్టిన రోజు ఇంటికి పంపమంటే అప్పుడు పంపారు. అప్పుడు కూడా మా వారే నాతో వుంటూ వచ్చారు. రెండు రోజులు మా సుధా వచ్చి రెండు, మూడు గంటలు వుండి వెళ్ళేది.

కొన్నాళ్ళకి డా.విజయకుమార్‌గారు మీ భార్యకి Angiogram చేయాలని, బైపాస్ సర్జరి కూడా చెయ్యాల్సి వస్తుందని మావారితో చెప్పారు. కానీ ఏం చేస్తాం? అన్నిటిని ఎదుర్కోవాలి కదా? Angiogram చేసేటప్పుడు నా కోరిక ప్రకారం విజయకుమార్‌గారు మా వారిని లోపలికి రమ్మన్నారు. ఎన్నో ఆపరేషన్లను ఎదుర్కొన్న నాకు Angiogram రోజున విపరీతంగా భయం వేసింది ఎందుకో. ఆ రిజల్టు చూచిన తరువాత డా.విజయకుమార్‌గారికి విపరీతమైన సంతోషం అయ్యింది. "సింగీతం గారూ మీ ఆవిడకు ఆపరేషన్ అవసరం లేదండి. ఏదో చిన్న బ్లాక్‌లు వున్నాయి అంతే, అది మందులతో నయం అయిపోతుంది" అన్నారు. దానికి తగిన మందులు, డయిట్ తీసుకోవలసిన తగిన జాగ్రత్తలు చెప్పారు.

అయిదేళ్ళ క్రితం ఒక కన్ను, పదేళ్ళ క్రితం ఇంకో కన్ను అలా రెండు కళ్ళు క్యాటరాక్ట్ ఆపరేషన్లు విజయవంతంగా జరిగాయి. విజయా ఆసుపత్రి డా.బాబూ రాజేంద్రన్‌గారే రెండు కళ్ళు ఆపరేషన్ చేసారు. రెండోసారి కంటి ఆపరేషనప్పుడు మా సుధ వాళ్ళు మద్రాసులో వుండటం తటస్థించింది. రెండేళ్ళ కొడుకుని వాళ్ళాయనకి అప్పచెప్పి, ఆ రెండు రోజులు నాతోనే ఆసుపత్రిలో వుంటూ, నన్ను చూసుకునేది. మేము విరుగుంబాకం ఇల్లు మారిన తరువాత, దగ్గరలో ఒక పార్కు కట్టారు. రోజూ నేనూ, మా వారు సాయంత్రం అక్కడ ఒక అరగంట వాక్‌చేసి, ఒక అరగంట పార్కులోనే గడిపి వస్తాం. ఇప్పుడు నాకు 75 సంవత్సరాలు అంటే ఎవ్వరూ నమ్మరు. అన్ని జబ్బులు, అన్ని ఆపరేషన్లు దాటుకున్న నాకు విజయా ఆసుపత్రి డాక్టర్ల సహకారం ఎంతైనా మేలు చేసింది.

ఇదేకాక వేరే ఏదైనా చికాకు వస్తే మా ఫ్యామిలీ డాక్టరు త్యాగరాజు గారిని ఇంటికి రమ్మంటే అలాగే వచ్చి చూస్తారు నన్ను కాని, మా వారిని కాని.

మా బావగారి ఆఖరి అమ్మాయి ఇందిర పెళ్ళి మే నెలలో జరిగింది. దాని పెళ్ళి అయిన పదిహేనురోజులకి మా పెద్ద చెల్లెలు రెండో కొడుకు బాలాజీ పెళ్ళి. వీడి పెళ్ళికి రిజర్వేషన్ చేయించుకున్నాను. గూడూరు పెళ్ళికి వెళ్ళాలని బట్టలు సర్దుకుంటుండగా హైదరాబాదు నుంచి సుశీల పెద్ద కొడుకు రాజా ఫోన్ చేసాడు, పిడుగులాంటి వార్త. మా సుశీలని హాస్పటల్లో చేర్చామని, బ్రెస్ట్ క్యాన్సర్ వుందని ఆరు నెలల కన్నా బ్రతకదని డాక్టర్లు అన్నారని చెప్పాడు. అప్పటికే జబ్బు ముదిరిపోయింది. వాళ్ళకి అది తెలియలేదు. నేనది విని వెక్కి వెక్కి ఏడుస్తూ వుంటే నన్ను ఓదార్చాడు. ఆస్పత్రి వాళ్ళు రెండుగంటలే పెళ్ళిరోజు అమ్మని ఇంటికి పంపడానికి అనుమతి ఇచ్చారని చెప్తూ, నన్ను పదిరోజుల ముందుగానే రమ్మని పిలిచాడు. ఇక చేసేది ఏముంది? ఇందిర పెళ్ళి నుంచి రాగానే హైదరాబాదుకు పరిగెత్తాను.

సుశీలని కుర్చీ మీద కూర్చోబెట్టి ఎలాగో పెళ్ళి అయిందనిపించారు. పెళ్ళి అయిన రెండురోజులకు మా చెల్లెలిని వదల లేక వదలలేక వచ్చేసాను.

కొన్నాళ్ళు ఆసుపత్రిలో వుండి ఇంటికి వచ్చింది. మళ్ళీ నేను వెళ్ళడానికి అవ్వలేదు. మళ్ళీ సంవత్సరానికి మా సుధ పెళ్ళి జరిగింది. సుశీల ప్రయాణం చేసే స్థితిలో లేనందున అది, దాని భర్త రాలేదు. కూతురు, అల్లుడు, కొడుకులు, కోడళ్ళు వచ్చారు. వాళ్ళ చేతనే దానికి పంపే పట్టుచీర, జాకెట్టు, దాని భర్తకు బట్టలు పంపాను. అలాగే మా సుశీల రెండు సంవత్సరాలు ఆస్పత్రికి, ఇంటికి తిరుగుతూనే వుండేది. చాలా రోజులు అయింది కదా, అని దాన్ని ఒకసారి చూసి వద్దామని ఒక వెంకటగిరి చీర, జాక్కెట్టు తీసుకెళ్ళాను. మొదట నేను మా పద్మ ఇంట్లో దిగితే వాళ్ళబ్బాయి శ్రీనాథ్ ఎయిర్‌పోర్ట్‌కి వచ్చి నన్ను కారులో మా చెల్లెలు ఇంటికి పిల్చుకెళ్ళాడు. నేను వాళ్ళ ఇంట్లోకి వెళ్ళడం తడువు మా మరిది ''అరే! ఇప్పుడొచ్చావు? ఇప్పుడు మీ చెల్లెలిని మళ్ళీ ఆస్పత్రికి తీసుకెళుతున్నాను. నువ్వు అబ్బాయితో వెళ్ళి, మళ్ళీరా,'' అన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. ''నేను దానికోసమే వచ్చాను. నే మళ్ళీ వెనక్కి వెళ్ళను'' అని శ్రీనాథ్‌ని పంపించేశాను. చీరని చూచి మా చెల్లెలు అతినీరసంగా, ''మళ్ళీ చీర ఏమిటే! పట్టుచీర పంపేవుగా సుధ పెళ్ళయినతరువాత' అంది. 'దేనికదే' అన్నాను. మా మరిది నాతో ''నువ్వు ఇంట్లో వుండు, నేను మీ చెల్లెల్ని ఆస్పత్రికి పిల్చుకెళ్తున్నాను'' అన్నాడు. 'నేనూ వస్తాను' అన్నా మొండిగా.

ఆస్పత్రిలో మా చెల్లెల్ని చేర్పించిన తర్వాత కాస్సేపుండి బయటికి వచ్చి పబ్లిక్ బూత్ నుండి మా వారికి ఫోన్ చేసి విషయమంతా చెప్పి ''నేనిప్పుడు ఇంటికి వెళుతున్నాను. మా మరిది దిగబెడ్తున్నార''ని చెప్పాను. నేను కూడా వారం పది రోజులుండి వాళ్ళ కోడళ్ళ సహాయంతో వంట వండుతూ, మదరాసు తిరిగి వచ్చేసాను.. అంతే. పదిహేను రోజులకే దాని చరిత్ర ముగిసిపోయింది పెన్షన్ పెన్షన్ అని గోలెత్తుతూ ఆస్పత్రి చేరే వరకు స్కూలుకు వెళుతూనే వుండేది. ఇంకొక ఏడాది సర్వీసు వుందనగానే కన్ను మూసింది. బతికున్నన్నాళ్ళు చాలా కష్టపడింది. సుఖపడే టైములో తనువు చాలించింది.

బాలాజీ వాళ్ళమ్మ పోయేనాటికి నిజామాబాద్ దగ్గరున్న నిజాంసాగర్‌లో టీచర్ ఉద్యోగం చేస్తుండేవాడు. అంతకు ముందు బెజవాడ దగ్గరున్న హనుమాన్ జంక్షన్‌లో చేసేవాడు. రూములో వుంటూ హాస్టల్ మెస్‌లో భోజనం చేస్తూ వుండేవాడు. నన్ను చాలాసార్లు హనుమాన్ జంక్షన్‌కి రమ్మని ఫోన్ చేసేవాడు. అప్పటికింకా వాడి పెళ్ళి అవ్వలేదు. ఒకసారి బెజవాడ పెళ్ళికి సందర్భం వుంది. అందుకు బెజవాడ పెళ్ళికి వెళ్ళి, అక్కడ్నుంచి మచిలీపట్నంలో వున్న మా పెద్దమ్మను చూసుకుని, అక్కడ్నుంచే బాలాజీ వచ్చి నన్ను పిల్చుకెళ్ళి, రెండు రోజుల తరువాత బెజవాడలో రైలు ఎక్కించేట్లుగా ప్లాను చేసుకుని, టూ అండ్ ఫ్రో టిక్కెట్లు కొన్నాను. అప్పుడు నేను 45 - 50వ పడిలో వున్నాను. కనుక రైలు ప్రయాణానికి, పైగా ఒంటిరి ప్రయాణానికి ఒప్పుకునే వారు మా వారు.

సరే, మచిలీపట్నం నుంచి హనుమాన్ జంక్షన్‌కి వాడు పిల్చుకెళ్ళాడు. తీరా అక్కడికి వెళ్ళిన మర్నాడు నాకు జ్వరం. వాడు నన్ను డాక్టరు దగ్గరికి పిల్చుకెళ్ళాడు. మర్నాడు వాడి స్కూలుకి, హాస్టల్‌కి పిల్చుకెళ్ళి అందరికి పరిచయం చేయాలని వాడి ఆశ. నేను స్తబ్ధుగా, సరిగా మాట్లాడలేకపోయాను. ఒక వైపు జ్వరంతో వుంటే ఎలా మాట్లాడను. ''అదేంటి పెద్దమ్మా? గలగలా మాట్లాడేదానివే. ఇలా స్తబ్ధుగా వున్నావ్ మా స్టాఫ్ కందరికీ నువ్వు చాలా సరదాగా మాట్లాడ్తావని చెప్పానే'' అన్నాడు. సరే మద్రాసుకు బయలుదేరాలి. జ్వరంతో వద్దంటాడు. నేను మొండిగా బయలుదేరాను. క్యాన్సిల్ చేస్తే ఆ టిక్కెట్టు దొరకదు. బయలుదేరేముందు రైలులో నేను, ప్లాటుఫాం మీద వాడు. 'జ్వరంతోనే వెళుతున్నావు పెద్దమ్మా, మా అమ్మ అయితే అలా వెళుతుందా?' అని బాధపడ్డాడు. నా బాధ వాడు అర్థం చేసుకోడు, వాడా ఒంటరివాడు, పైగా రూములో వుంటున్నాడు, నేనెలా వుండను? ''కాదురా, మాత్రలు తెచ్చుకున్నాను చూడు. పదకొండయింది. తెల్లారేసరికి మదరాసు చేరుకుంటాంగా'' అని వాణ్ణి మందలించాను.

సుధ యం.ఎల్.ఐ.ఎస్. లైబ్రేరియన్ కోర్సు పాసయ్యింది. అమెరికన్ సెంటర్లో ట్రైనింగ్ చేసింది. పెళ్ళై ఢిల్లీ, సంగ్రూర్, పాండిచ్చేరి మున్నగు ఊర్లలో తిరిగారు వాళ్ళు. మా అల్లుడు ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్‌లో ఉద్యోగం. సంగ్రూర్‌లో వాళ్ళబ్బాయిని స్కూల్లో వేసి, అది టీచరుగా చేరింది. సంగ్రూర్‌లో వుంటుండగా మా చిన్న అల్లుడు కార్తీక్ మద్రాసుకు బదిలీకి అప్లై చేసాడు. వాళ్ళ అమ్మా, నాన్నగారు పెద్దవాళ్ళు అని, వాళ్ళు ఒంటరిగా వుంటున్నారని కోరుతూ అప్లై చేసాడు. ఎటూ భర్త బదిలీకి అప్లై చేసారు కదా అని సుధ సెలవులలో కొడుకుని తీసుకుని మదరాసుకు వచ్చింది. బదిలీ ఏ టైములో వస్తుందో ఏమో అని, ఎందుకైనా మంచిదని జూన్ నెలలోనే కొడుకుని అశోక్ నగర్‌లో వున్న వేలాంకన్ని స్కూల్లో చేర్పించింది. తాను కూడా దగ్గర్లో వున్న పోలీస్ అకాడమీ లైబ్రేరీలో లైబ్రేరియన్‌గా చేరింది. కానీ అల్లుడిని పాండిచ్చేరికి బదిలీ చేసారు. మరి తానేం చేస్తుంది? రెండు సంవత్సరాలు మా ఇంట్లోనే వుంది. సెలవులకి పాండిచ్చేరి వెళుతూ, అతనిక్కడికి వస్తూ, కాలక్షేపం చేసేది. పాండిచ్చేరిలో మూడు సంవత్సరాలు అయిన తర్వాత అతన్ని మొత్తం మీద మద్రాసుకి మార్చారు. అప్పుడు వాళ్ళు మైలాపూర్‌లోని గోపాలపురంలో ఇల్లు తీసుకున్నారు. వాళ్ళబ్బాయిని వేలాంకాన్ని స్కూలు నుంచి గోపాలపురంలోని నేషనల్ పబ్లిక్ స్కూల్లో చేర్పించేందుకు ఎంట్రన్స్ ఎక్జామ్ రాయిస్తే, డబుల్ ప్రమోషన్‌తో వాళ్ళు రెండవ క్లాసులోనే చేర్పించారు. సుధ కూడా పోలీసు అకాడమీ మానేసి, ఆ స్కూల్లోనే టీచరుగా చేరింది. కొడుకు ఎక్కడ చదువుతూంటె దానికి దగ్గర్లోనే ఉద్యోగం చెయ్యాలన్నది సుధ ఐడియా. ఇంకొక అనుకూలం ఏమిటంటే స్కూలు వెనుక గేటునుంచి సుధా వాళ్ళ ఇల్లు చాలా దగ్గర.

కొన్ని నెలలకే బీసెంట్ నగర్‌లో ఒక త్రీ బెడ్‌రూం ఫ్లాటు కొనుక్కుని వెళ్ళిపోయారు. వాళ్ళ అత్తా, మామల ఇల్లు వీళ్ళ ఫ్లాటుకు చాలా దగ్గర. అక్కడికి వెళ్ళిన తరువాత కొడుకుని ఇందిరానగర్‌లోని హైయర్ సెకండరీ హిందూ హైస్కూల్లో చేర్పించింది. తాను కూడా గోపాలపురంలోని స్కూలు మానేసింది. మళ్ళీ ఏ ఉద్యోగంలోనూ చేరలేదు.

ఇప్పుడు మా అల్లుడు కార్తీక్‌కు ప్రమోషన్ వచ్చి పెద్ద ఆఫీసరు అయి తిరుచ్చీకి బదిలీ అయి వెళ్ళారు. ఇది మాత్రం కొడుకు అభినవ్ చదువు కోసరం ఇక్కడే వుండి పోయింది. వీళ్ళు వెళ్తూండడం, కార్తీక్ వస్తూపోతూ వుండడం జరుగుతోంది.

అయితే సుధ చిన్నప్పట్నుంచి చాలా క్రియేటివ్. దాంతో వాళ్ళ నాన్న స్క్రిప్టు డిస్కషన్‌లో పాల్గొనడం మొదలెట్టింది. ఆ సమయంలో స్క్రిప్టు రాస్తున్న హాలీవుడ్ రచయిత మార్క్‌జస్లోవ్‌తో కలిసి, అతను లాస్ ఏంజిల్స్ నుంచి, ఇది మద్రాసు నుంచి ఈమెయిల్స్ ద్వారా స్క్రిప్టులు రాసారు. మా వారు 'ఘటోత్కచ' ఆనిమేషన్ సినిమా తీసే సమయానికి సుధ ఆ సినిమాకి అసోసియేట్ డైరెక్టరుగా పనిచేసి కొన్నిపాటలకు తానే పూర్తి షాట్లు, స్క్రీన్‌ప్లే తయారు చేసింది. ఇక కొడుకు లెక్కల్లో చాలా బ్రిలియెంట్, స్కూలు చదువేగాక అతన్ని డాన్సు క్లాసులకి, కీ బోర్డు క్లాసులకి పంపిస్తోంది.

ఇక్కడ సుధ కొడుకు, మా మనవడు అభినవ్ గురించి మనం మాట్లాడుకోవాలి. కొన్ని సంవత్సరాల క్రితం, అంటే అభినవ్‌కి 5,6 సంవత్సరాలుంటాయి. రాత్రి 11.30 ప్రాంతాలకి మా వారికి మా అల్లుడు కార్తీక్, సుధల దగ్గర్నుంచి ఒక ఫోను వచ్చింది. దాని సారాంశము, అమెరికానుంచి సుధ మరిది ప్రశాంత్, భార్య వచ్చారని. ఆ రాత్రి వాళ్ళంతా ఒక హోటల్‌కి డిన్నర్‌కు వెళ్ళారుట. అక్కడ వాళ్ళంతా మెను ఆర్డర్ చేశారు. మెనూ రాగానే అభినవ్ టేబుల్ మీద వున్న డిషెస్, బౌల్స్ చూసి వాడి ఫేవరెట్ పన్నీర్ కోసం వెతికాడట. అది కనిపించకపోయేసరికి కోపం వచ్చి, గట్టిగా 'పన్నీర్' అని, ఆ తర్వాత ఒక తేదీ చెప్పి అది ఏ వారమో చెప్పాడట. వాళ్ళకాశ్చర్యం వేసి మరికొన్ని తేదీలడిగితే సెకండ్లలో ఆ వారమేదో చెప్పేశాడట. అప్పుడు వాళ్ళు మాకు ఫోను చేశారు. అది విని చాలాసేపటివరకు నాకు, మా వారికి ఏం తోచలేదు. ఒంటిగంట వరకూ నిద్రపట్లేదు. నాకైతే అదోరకమయిన భయం కలిగింది. అంత చిన్నపిల్లవాడు ఇలా అద్భుతంగా, సెకండ్లలో ఎలా జవాబులిచ్చాడా అని? వాడికి ఒక Extraordinary gift అన్నమాట.

అలా క్రమేపీ పెద్దవాడౌతున్నకొద్దీ అదే డెవలప్ చేసుకుంటూ వస్తున్నాడు. ఇక అక్కడ్నుంచి ప్రతి ఒక్కరికీ వాళ్ళ పుట్టిన తేదీ చెపితే, అది ఏ వారం అయిందో సెకెండ్లలో చెప్పేస్తాడు. అతనికి విపరీతమైన జ్ఞాపకశక్తి. మావే కాక మా స్నేహితులు, బంధువులు, ఆఖరకి మా పనివాళ్ళ పుట్టిన తేదీలు కూడా జ్ఞాపకం పెట్టుకుని ఆ రోజున పొద్దున్నే విషెస్ చెప్పేస్తాడు.

వాడికి ఐదు ఏళ్ళ వరకూ మాట్లాడ్డానికి రాలేదు. వాడికి Autism ఉంది. వాడిది చాలా సోషల్ నేచర్. అందరితో ఆప్యాయంగా వుంటాడు. అతని వైఖరిని అర్థం చేసుకుని వాడితో ఆప్యాయంగా మాట్లాడే వాళ్ళు ముగ్గురు. అంజు, అనంత్, స్నేహ. అందరిలో అంజు దగ్గర బాగా చనువు. అందుకనే అంజు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళేటప్పుడు వీణ్ణి వదిలి వెళ్ళడానికి చాలా బాధపడింది. నేను అభినవ్ వడుక్కి ఒక సెల్‌ఫోన్ బహుమతిగా ఇచ్చాను. మద్రాసు నుంచి వాడు, బెంగుళూరు నుంచి అంజు ఫోన్లో మాట్లాడుకుంటుంటారు. "నువ్వు అమ్మమ్మ ఇంటికి భాస్కర్ కాలనీకి వెళ్తున్నావా అభినవ్?" అని అంజూ అడిగితే, "అక్కడ నువ్వు లేవుగా, బెంగుళూరికెళ్ళావుగా, నే వెళ్ళడంలేదు" అన్నాడట.

వాడిపాటికి వాడే కంప్యూటర్ ఎదురుగుండా కూర్చుని ఏవో లెక్కలు రాసుకుంటూ, బొమ్మలు గీసుకుంటూ ఉంటాడు. వాడొక మాథమెటికల్ జీనియస్. ఒకసారి వాడు స్కూలుకి వెళ్ళినప్పుడు వాళ్ళమ్మ కంప్యూటర్లోని వాడి ఫోల్డర్స్ చూస్తే వాడు వేసుకున్న లెక్కలు చూసి స్టన్ అయిందట. వీడికింత లెక్కల పరిజ్ఞానం ఎలా వచ్చిందా అని.

అటు క్లాస్‌లో చూస్తే అన్ని సబ్జెక్టులలో చాలా మంచి మార్కులు వస్తాయి. వాడెక్కువ మాట్లాడకపోయినా, క్లాసులో వాడికి ఇద్దరు, ముగ్గురు స్నేహితులున్నారు. వాళ్ళకి వీడంటే అమిత ప్రేమ. వీడి లెక్కల జ్ఞానం గురించి అబుదాబిలో ఉంటున్న మా వారి స్నేహితుడు, గొప్ప గణితశాస్త్రజ్ఞుడు గంటి ప్రసాదరావు చూసి ఆశ్చర్యపోయారు. మా వారికి ఫోన్ చేసినప్పుడల్లా "ఇప్పుడు మీ మనవడు ఏం చేస్తున్నాడ"ని అడుగుతుంటారు. లెక్కలు తన సొంత మెథడ్‌లో చేసేస్తాడు. వాడి తెలివితేటలు ఎక్కడికి దారితీస్తాయో ఊహించుకోలేకపోతున్నాం. ఈ మధ్య వేసవి సెలవలకు అమెరికా ప్రయాణం పెట్టుకున్నారు. వాళ్ళత్త రమ "ఒరేయ్ నీ ఫ్లైట్ ఎన్ని గంటలకు రా" అని అడిగితే "అమెరికా టైమా, ఇండియా టైమా?" అని అడిగాడు.

ఇవేనా, కొన్నాళ్ళు డాన్స్ నేర్చుకున్నాడు, కీ బోర్డు నేర్చుకుంటున్నాడు. దేనికి ఒక రోజు కూడా సెలవు పెట్టడానికి ఒప్పుకోడు. స్కూలుకి కూడా సెలవు ఒప్పుకోడు. పెళ్ళైనా, ఫంక్షనైనా స్కూలుకి వెళ్ళి తీరాల్సిందే. ఇప్పుడు ఒక ఏనిమేషన్ కోర్సులో చేరాడు.

ఇక మా పెద్దమ్మాయి శకుంతల S.I.E.Tలో B.Com పాసై A.P.P.L.Fలో కంప్యూటర్ చదివి డిప్లొమా పాసయి పెళ్ళై, కూతురు స్నేహ పుట్టిన తర్వాత దాన్ని పద్మాశేషాద్రి స్కూల్లో చేర్పించి అది కూడా టీచర్‌గా చేరింది. పెళ్ళికి ముందే కొన్ని కంప్యూటర్ కంపెనీలలో ఉద్యోగం చేసేది. పెళ్ళైన తర్వాత అదే కంటిన్యూ చేసి స్కూల్లో చేరింది. క్రమేపి దాని 38వ ఏట ప్రైవేటుగా యం.సి.ఏ చదివి పాసైయింది. 44వ ఏట ప్రైవేటుగా చదివి బి.ఇడి. కూడా పాసైయింది. దానికి స్కూల్లో మంచి పేరుంది. స్టూడెంట్స్ అంతా దాన్ని బాగా ఇష్టపడతారు. దాని పెళ్ళైన కొత్తలో ఒక కథ సినిమాకని వాళ్ళ నాన్నగారికి ఇస్తే దాన్ని ఆధారంగా ఆయన ఒక సినిమా డైరెక్ట్ చేసారు. ఆ సినిమాకని పేరు 'క్షీరసాగర' కన్నడంలో తీసారు. హీరో కుమార బంగారప్ప. అప్పటి బెంగుళూరు ముఖ్యమంత్రి బంగారప్ప గారి కొడుకు. అది వందరోజులు ఆడింది కన్నడంలో. హీరోయిన్ అమల.

**మా పెద్ద అల్లుడు** సతీష్ ఇంజనీరింగ్ పాసయ్యాడు. కొన్నాళ్ళు దుబాయిలో స్టేండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌లో పనిచేసి తిరిగి వచ్చేసారు. ఇప్పుడు జెమినీలో గ్రాఫిక్స్‌లో పని చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఒకే ఒక్క కొడుకు. వీళ్ళది జాయింట్ ఫ్యామిలి. కూతురు

స్నేహ 20 ఏళ్ళది. ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతోంది. మా ఇద్దరు అమ్మాయిలు నన్నుమించి ఉన్నారని గర్వంగా చెబుతున్నాను.

మేముంటున్న వడపళిని ఇల్లు వానా కాలానికి ఇల్లుకాదు. మేము అక్కడికి వెళ్ళిన ఆరు - ఏడు సంవత్సరాలు వాన వచ్చినా ఇబ్బంది లేకుండా వుండేది. ఎందుకంటే మేము వీధిలోఎత్తుగా సిమెంటు వేయించేసాము. కానీ కార్పోరేషన్ వాళ్ళు రెండేళ్ళకొకసారి రోడ్లు ఎత్తు చేయిస్తూ తారు రోడ్డు వేయిస్తూనే వుండేవాళ్ళు. దాంతో రోడ్డు ఎత్తై మా యింట్లోకి వచ్చేసేవి. నీళ్ళు చెండాలపు వాసన వచ్చేది. అలాంటప్పుడు మేము గ్యాస్ పొయ్యి, సిలిండర్ సైతం మేడమీద లౌంజ్‌లోనే వంటగది చేసుకుని, మొత్తం మకాం మేడ మీదకే మార్చేసాము. ఒక్కోసారి కిందనుంచి పైకి వచ్చినప్పుడల్లా డెట్టాల్ నీళ్ళతో కాళ్ళు కడుక్కుని మరీ మేడమీట్లు ఎక్కేవాళ్ళం. అప్పటికే మా సుధకని కట్టిన కొత్త ఇల్లు ఖాళీగా వుంది కదా, వెళ్ళకూడదా అంది సుధ. ఆ కొత్త ఇంటికి అన్ని హంగులు కోరి కట్టించుకున్నందున అద్దెకివ్వడం మాకిష్టం లేకపోయింది. ఆ సమయంలో మా శకుంతల వాళ్ళు అప్పటికే చేరినందువలన వాళ్ళా యింటికి అలవాటైపోయారు. రెండురోజులు వాళ్ళు తిరుపతికి పెళ్ళికి వెళ్ళవలసి వుంది. మా అల్లుడు సతీష్ ఒక్కడే వున్నారు ఊళ్ళో. వడపళిని ఇంట్లోకి నీళ్ళు రావడమే కాక రెండు రోజులు కరెంటు కూడా పోయింది. ఆ రెండు రోజులు శకుంతల ఇంట్లో వున్నాము. మా అల్లుడికి హోటల్ భోజనం తప్పింది. మళ్ళీ ఏడాది విజయదశిమి నాడు మా వారి పుట్టినరోజు అయ్యింది. మా సుధ తన కొత్త ఇంట్లో మా యిద్దరిచేత సత్యనారాయణ వ్రతం చేయించి, అయిదారు కుటుంబాలను పిలిచి క్యాటరింగ్ ఏర్పాటు చేసింది. అలా విజయదశిమి నాడు అన్నాళ్ళు ఖాళీగా వున్న ఇల్లు ఆరోజు సందడిగా వుండడం దాని మనసుకు ఉల్లాసం కలిగించింది. అది నేను, మావారు కనిపెట్టాము. సుధ అంది "అలా ప్రతి యేటా ఇంట్లో నీళ్ళు వస్తుంటే, ఇంకా ఖాళీచెయ్యరేం మీరు? ఈ ఇంటికి వస్తే నేను ప్రతి సెలవులకి వచ్చి మీరు అనుకున్నట్లుగా నేనుకూడా ఈ ఇల్లు ఎంజాయి చెయ్యచ్చుకదా" అంది.

మా శకుంతల పెళ్ళవగానే మా యింట్లో చాలా పెళ్ళిచూపులు, పెళ్ళిళ్ళు జరిగాయి. మా బావగారి నాలుగో అమ్మాయి విజయ, మేమంతా విజ్జి అంటాము. దానికి పెళ్ళి చూపులు 1990 సంవత్సరంలో జరిగాయి. అబ్బాయి వరుసకి మా మేనత్త మనవడు, మా ఒదిన కొడుకు. పేరు రాజా అసలు పేరు "గురురాజ్". పెళ్ళి గూడూరులో టి.టి.డి కల్యాణ మండపంలో జరిగింది. దీని పెళ్ళి 1990 ఆగష్టులో జరిగింది. మా ఇద్దరి ఇళ్ళల్లో పిల్లలు పుట్టడం, పెళ్ళిళ్ళు డబుల్‌గా జరిగాయి. మా శకుంతల 1965 నవంబరు 9 న పుట్టింది. ఇద్దరికి ఒకనెల తేడా. పెళ్ళి ఐదునెలల తేడాతో జరిగింది. మా సత్యభామ, నర్సింగ్‌ల పెళ్ళిళ్ళు ఒకే సంవత్సరం, ఒకే నెలలో, ఒకవారం తేడాతో జరిగాయి. విజ్జి చెల్లెలు ఇందిర పెళ్ళి మళ్ళీ 1994లోనే జరిగింది. విజ్జి పెళ్ళయిన కొన్నాళ్ళకి అమెరికాకి వెళ్ళింది. ఇందిర హైదరాబాదులోనే వుంటుంది. ఈ పెళ్ళికి కూడా మేము స్పాన్సర్ చేసాము. ఇక మా యిద్దరి ఇళ్ళల్లో మా సుధ మాత్రం పెళ్ళికుంది. మా సేతమ్మక్క మాత్రం మేము చేసిన మేలు మర్చిపోకుండా అప్పటినుంచి ఇప్పటివరుకు మా పిల్లల పట్ల వాత్సల్యం చూపిస్తున్నారు. మా ఇద్దరి పిల్లల పెళ్ళిళ్ళకి ఆమె చేసిన సహాయం ఎనలేనిది. మా శకుంతలకి మా స్నేహ పుట్టినప్పుడు ఆస్పత్రిలో వుండి ఇంటికి పిల్చుకొచ్చిన తరువాత కూడా మూడు నెలలు వరకు ఇక్కడే వుండి శకుంతలని, పాపని ఆమే చూసుకొనేది. ఎందుకంటే పిల్లల్ని, ముఖ్యంగా చంటిపిల్ల స్నానం అవీ ఆవిడకి చాలా అనుభవం కనుక అన్నీ ఆవిడకే వదిలేదాన్ని. మా సుధకి కొడుకు పుట్టిన తరువాత కూడ ఒక నెల వుండి చేసి వెళ్ళింది.

ఆవిడకొక విషాదం ఎదురైంది. వాళ్ళమ్మాయి ఇందిర పెళ్ళయ్యాక నెలరోజులకే మా బావగారు చనిపోయారు. మా బావగారి హఠాత్మరణంతో ఆవిడ చాలా కుమిలిపోయి దిగులు పడిపోయారు. మానసిక బాధ ఎక్కువైంది. మా శకుంతల పెళ్ళికి ముందంజ వేసినట్లు మా సుధ పెళ్ళి పనులకి ముందంజ వేసేదికాదు, నిరాకరించేది. కానీ నేను మాత్రం "మీరు అలా వెనకాడవద్దు. నేనొప్పుకోను.

దేనికైనా మనసు ప్రధానం" అనేదాన్ని. ఆవిడ మంచి మనసే నాకు శ్రీరామ రక్ష అయింది. మా చెల్లెలు కూడా అనేది. "అక్కా! నువ్వు ఆస్పత్రిలో వుండి ఆపరేషన్లు అయినప్పుడు సేతమ్మక్కగారే కదా నిన్ను చూసుకున్నారు. మేమేమి చేయలేక పోయాము."

నేను తరుచూ ఆర్థోపెడిక్ ప్రాబ్లమ్స్ వల్ల విజయా హెల్త్ సెంటర్‌కి వెళ్తుండేదాన్ని. అప్పట్లో డా.మోహన్‌దాస్‌గారు ఉండేవారక్కడ. ఆయన అప్పటికే చాలా సంవత్సరాలనుంచీ డాక్టరు. ఆయనకి నా సమస్యలు బాగా తెలుసు. పలుసార్లు ఫిజియోథెరిపి అవీ యివీ చేయించుకున్నాను. ఆ వెయిటింగ్‌లో ఒక కన్నడ దంపతులని కలుసుకున్నాను. ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ మా రెండో అమ్మాయి పెళ్ళికి వుందని సంబంధాలు చూస్తున్నామని చెప్పాను. ఆయన వివరాలు అడిగితే చెప్పాను. ఆయనొక అడ్రస్సు ఇచ్చి వాళ్ళకొక తెలిసినాయన తిరుచ్చిలో వుంటున్నారని, ఆయన దగ్గర చాలా సంబంధాలు, జాతకాలు వుంటాయని చెప్పారు. ఆ పెద్ద మనిషికి ఏమనిపించిందో, ఆయనకి కూడా ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అమ్మాయికి పెళ్ళి అయిందని చెప్పి, అమ్మాయి ఎత్తు ఎంత అని అడిగాడు. చెప్పాను. "అరరే! మా అబ్బాయికే చేసుకొందును కానీ వాడి ఎత్తు ఆరు అడుగులు" అన్నాడు.

ఆ పెద్ద మనిషి ఇచ్చిన తిరుచ్చీ అడ్రస్సుకి మా సుధ జాతకం పంపితే, అక్కడి నుంచి కొన్ని జాతకాలు పంపితే, అక్కడినుంచి కొన్ని జాతకాలు, బయోడేటాలు వచ్చాయి. వెంటనే ఆ లిస్టు మా సుధకి చూపించాము. అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి ఎం.బి.ఎ పాసై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అబ్బాయిని సెలెక్ట్ చేసుకుంది. దాంట్లో అబ్బాయి నాన్నగారు పేరు, అడ్రస్సు ఉన్నాయి. కనీ ఫోన్ నెంబరు లేదు. అబ్బాయి పేరు కార్తీక్. తండ్రి పేరు ఎ.జి.రామారావు అని వుంది. మా వారు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కి ఫోన్ చేసి అడ్రస్సు ఇచ్చి రామారావుగారి ఫోన్ నెంబరు తెలుసుకున్నారు. ఆయనతో మాట్లాడి తాను వాళ్ళింటికి ఫలానా రోజు వస్తామని చెప్పి మేమిద్దరం బెసెంట్ నగర్‌లో ఉన్న వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళని ముఖాముఖి కలుసుకుని ప్రొసీడ్ అయ్యాము. ఆయన స్టీలు కంపెనీ భిలాయిలో పనిచేసి రిటైర్ అయి, మదరాసుకు వచ్చి, స్వంత ఇంట్లో ఉంటున్నారని చెప్పారు.

సరే, జాతకాలు జతపడడం, పెళ్ళి చూపుల తతంగం మేం రెండిళ్ళవాళ్ళం ఒకరింటికి ఒకరు వెళ్ళడం జరిగాయి. అబ్బాయి, అమ్మాయి ఒకరినొకరు ఇష్టపడటం జరిగింది. మావారు మా శకుంతల పెళ్ళి ఎలా చేసామో, ఇదీ అలాగే చేస్తామని చెప్పారు. కార్తీక్ వాళ్ళు ముగ్గురు అన్నదమ్ములు. పెద్దతను మురళి. ప్రస్తుతం మస్కట్‌లో ఉంటున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు. కార్తీక్ రెండవతను. మూడవ అబ్బాయి ప్రశాంత్. అమెరికాలోనే చదివి అక్కడే ఉంటున్నాడు. ఇప్పుడు అతనికి పెళ్ళై ఒక పాప.

ఈసారి విజయశేష్ మహల్ ఖాళీగా వున్నా, శకుంతల పెళ్ళి రాణీమహల్‌లో చేసాం గనక అదే మంటపం ఫిక్స్ చేసాం.

1995 సంవత్సరం ఫిబ్రవరి నెల 24వ తేదీన మా సుధ పెళ్ళి జరిగింది. ఈసారి కూడా పెళ్ళికి అందరికి ఉత్తరాలు రాస్తూ, రెండురోజులు ముందు పెళ్ళికూతుర్ని చేసే ఫంక్షన్ ఉందని తెలియచేశాం. పొద్దున్న పెళ్ళి, సాయంత్రం రిసెప్షన్. ఈసారి రిసెప్షన్‌కు ఎనిమిది, పదేళ్ళ అమ్మాయి 'నాగమణి' చేత మాండలీన్ కచేరి పెట్టించాం. రిసెప్షన్‌కి వచ్చిన భానుమతిగారు నాగమణి కచేరి చూసి మెచ్చుకుని ఆ అమ్మాయికి ఏదో బహూకరించి వెళ్ళారు. మా వారు ఆ అమ్మాయితో వచ్చిన ట్రూప్స్ Terms కాకుండా, ఆ అమ్మాయికి ప్రత్యేకంగా ఒక వెండి కప్పు బహూకరించారు. చాలామంది సినిమా డైరెక్టరు కదా సినిమా పాటలు పాడిస్తారనుకున్నారు. కానీ కొంతమంది పెద్ద మనుష్యులు మావారి అభిరుచిని మెచ్చుకున్నారు. ఈ వియ్యాలవారు కూడా మేం చేసిన మా సుధ పెళ్ళికి తృప్తిపడ్డారు.

మా సుధ, కార్తీక్ హనీమూన్ వెళ్ళి వచ్చిన తర్వాత దాంతో శకుంతల, నేను ఢిల్లీ వెళ్ళి మూడు నాలుగురోజులుండి వచ్చాము. ముఖ్యంగా అమ్మాయిల పెళ్ళిలో భోజనాలు అత్యద్భుతంగా ఉన్నాయని ప్రశంస వచ్చింది. సుధ పెళ్ళప్పుడు తమిళ యాక్టరు ప్రభు షూటింగులో వుండి, క్యారియర్ పంపించి, పాతిక మందికి పెళ్ళి భోజనం తెప్పించుకున్నాడు. వాణిశ్రీ భర్త, పిల్లలతో వచ్చి భోజనాలని

పొగిడింది. ఇక ముహూర్తం అయిన తర్వాత మామూలు కూల్‌డ్రింక్స్ కాకుండా, ప్రత్యేకంగా బెల్లపు పానకం చేయించి ఇస్తే అందరూ మెచ్చుకున్నారు.

మా సుధ పెళ్ళితో, మా యిద్దరి కుటుంబాల అమ్మాయిల పెళ్ళిళ్ళు పూర్తయ్యాయి. మా వారి పిల్లలు, మా బావగారి పిల్లలు. మా యిద్దరి బాధ్యతలు తీరిపోయాయి. శ్రావణ మాసం రాగానే నేను మాత్రం ఢిల్లీకి వెళ్ళి, రెండు వారాలుండి శ్రావణ మంగళవారం నోము నోయించి వచ్చేశాను. మిగతా రెండువారాలు అదే చేసుకుంది. ఒక ఏడాది తరువాత మా సుధకి కొంచెం వంట్లో నలతగా వుందని తెలిసి ఢిల్లీకి వెళితే అది నెల తప్పిందని తెలిసి కొన్నాళ్ళుండి వచ్చేశాను. నేనక్కడున్నప్పుడు మా వారు కూడా అప్పుడప్పుడు ఢిల్లీకి వస్తే, ఇద్దరూ కలిసి వచ్చేవాళ్ళం.

మా పెద్దమ్మాయి శకుంతల కూతురు స్నేహకి ఏడాది లోపుగా మా రెండు కుటుంబాలు తిరుపతికి వెళ్ళి పుట్టు వెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం అన్నీ చేసాము. మావారికి విజయా సంస్థలో అవినాభావ సంబంధం ఉంటూ వస్తోంది. చాలా సంవత్సరాల తర్వాత నాగిరెడ్డిగారి కుమారులు వెంకట్రామ రెడ్డిగారు, విశ్వనాథ రెడ్డిగారు, వేణుగోపాల్ రెడ్డిగారు విజయా చందమామా కంబైన్స్‌లో మూడు సినిమాలు తీశారు. వాటి మూడింటికీ మా వారే డైరెక్టరు. మా స్నేహని చెవులు కుట్టించడానికని కాటేజి నుంచి పిలుచుకుని వెళ్దామనుకుంటుంటే వాన వచ్చింది తిరుపతిలో. ఎలా వెళ్ళాలో అనుకుంటుంటే విజయా సంస్థ వారి సుమో కనిపించింది. వెంటనే మా వారు ఆ డ్రైవర్ని పిలిచి మమ్మల్ని మేమెళ్ళే గమ్యానికి దిగబెట్టమంటే, అతను అలాగే మమ్మల్ని వ్యాన్‌లో పిలుచుకుని వెళ్ళాడు.

స్నేహకి మొదటి పుట్టినరోజున మా వియ్యాలవారి సాంప్రదాయం ప్రకారం ఆయుష్ హోమం చేయించారు. దాని పుట్టిన రోజు వైభవంగా చేశారు. అమ్మమ్మ, తాతలుగా మేం చెయ్యవలసినవి పట్టుపరికిణి, చొక్కా కుట్టించి, వెండి కంచం, వెండి గ్లాసు మనవరాలికి బహూకరించాము.

మా సుధ పెళ్ళి నిశ్చయించుకుని ముహూర్తాలు పెట్టుకున్నాక కొన్ని బంగారు, వెండి నగలు కొనడం కూడా అయింది. ఒక బట్టల షాపింగు మాత్రం ఉండిపోయింది. కార్తీక్ అప్పుడప్పుడు శెలవులొచ్చినపుడల్లా మద్రాసుకి వచ్చి సుధని కలుసుకుంటూ వెళ్ళేవారు. అలాగే అతనికి కావలసినవి షాపింగ్ కూడా చేసుకునేటప్పుడు పెళ్ళికొడుక్కిచ్చే వజ్రపుటుంగరం అతని వేలికి సరిగా దొరకలేదు. ఇంతలో కొన్ని తప్పనిసరి పరిస్థితులలో నేనూ, మా వారు దుబాయి వెళ్ళిరావడం జరిగింది.

మా శకుంతలా వాళ్ళు స్నేహ రెండేళ్ళుగా ఉన్నప్పుడు దుబాయి వెళ్ళారు. సతీష్ ముందు వెళ్ళి మూడు నెలలుండి, స్టాండర్డ్ చార్టెడ్ బాంక్‌లో అక్కడ ఉద్యోగం దొరికిన తర్వాత, ఇల్లు చూసి పెట్టి, ఇండియాకి వచ్చి శకుంతలని స్నేహని పిల్చుకు వెళ్ళారు. అక్కడ వాళ్ళు చాలా హ్యాపీగా వుంటూ వచ్చారు. సాయంత్రం సతీష్ ఆఫీసు నుంచి వచ్చిన తర్వాత షాపింగ్, రాత్రిళ్ళు హోటల్లో భోంచేస్తూ ఉండేవారట. రెండు రోజులకొకసారి శకుంతల, సతీష్ ఫోన్లు చేస్తూ వచ్చారు. అక్కడ కూడా ఇండియన్ వెల్‌కమ్ హోటల్ ఉందనీ, ఇడ్లీ దోసె అన్నీ దొరుకుతాయని, స్నేహ ఆటపాటల గురించి ఫోన్లు తరచూ చేస్తూ ఉండేవారు. అప్పుడే మా సుధ సంబంధం విషయం, పెళ్ళి నిశ్చయించిన విషయం చెప్పాం. ఇలా ఒక సంవత్సరం గడిచింది. క్రమేణా మా సతీష్‌కి ఆఫీసులో వాతావరణం నచ్చడంలేదనీ, ఆ ఆఫీసరు ఒక బ్రిటీష్ వాడని, వాడి వైఖరి తనకి సమస్యగా వుంటోందని శకుంతల ఫోను చేసేది. పైగా మా సతీష్‌కి హ్యాపీగా ఉండటంలేదని, స్నేహకి అప్పుడప్పుడు తరచుగా జ్వరం వస్తోందని ఫోన్లు, సతీష్ కూడా మామగారికి ఆఫీసు విషయాల గురించి ఫోనులో మాట్లాడడం కొనసాగించారు. మదరాసులోనే కంప్యూటర్ కంపెనీ పెట్టుకున్న ఒక వ్యాపారి తనకి సతీష్‌లాంటి మనిషి కావాలనీ, ఇండియాకి వస్తే మంచి జీతం ఇస్తాననీ ఫోన్లు మీద ఫోన్లు చేసి వత్తిడి చేసేవాడట. మా సతీష్ సిన్సియర్ వర్కర్ అని అందరికీ తెలుసు, ఈ మెడ్రాసతను అతని మంచితనం ఉపయోగించుకోవాలని ప్లాను. ఇవన్నీ ఫోనులో మా సతీష్ మా వారికి ఏకరువు పెట్టుకునేవారు.

ఇవన్నీ చూసి మా వారికి స్వయంగా దుబాయ్‌కి వెళ్ళి చూస్తేకానీ ఏ విషయం నిర్ణయించుకోలేమని, కానీ ముందు ముందు పెళ్ళివుంది కదా, వెళ్ళడానికి అవుతుందో లేదోనని ఆలోచన. సరే, పూర్ణతో కొన్ని చెయ్యవలసిన పనులు చెప్పి, అలాగే కార్తీక్ వజ్రపుటుంగరం కొనడానికి ఏర్పాటు చేసి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాం. మేము బయల్దేరేది 5,6 తారీఖులు. డిశంబరు పదమూడున మా శకుంతల పుట్టినరోజు వస్తోంది కదా అని దానికొక డ్రెస్ కొని తీసుకెళ్ళాము.

దుబాయి వెళ్ళి పదిహేనురోజులున్నాము. ఈ పదిహేను రోజులూ చాలా సరదాగా గడిపాం. డిసెంబరు కదా చాలా చలిగా వుండేది. చాలా షాపింగ్ చేశాం. మేము వెళ్ళేసరికే మా బంధువుల పిల్లలకి గౌన్లు, కొన్ని చీరలు, మా సుధకి కొన్ని చీరలు, డ్రెస్సులు శకుంతల కొని పెట్టింది. మదరాసులో సుధ పెళ్ళి షాపింగ్ చాలామట్టుకు అయ్యాయి. మేము వెళ్ళి పట్టుచీరలకి కంచికి వెళ్ళాలి అని శకుంతలతో చెప్పాను. తరువాత ప్రధానానికి అల్లుడికియ్యవలసిన సామాన్లన్నీ అక్కడే కొనేశాము. ఇదంతా మా శకుంతల ప్రోత్సాహం. షాపింగ్ అయిన తర్వాత రాత్రి డిన్నర్‌కి హోటల్‌కి వెళ్ళేవాళ్ళం.

ఒకరోజు అబుదాబీలో చంద్రు అనే సతీష్ మామ దుబాయ్‌కి వచ్చి మమ్మల్ని ఆయన కారులో అబుదాబీకి పిల్చుకు వెళ్ళారు. అక్కడ రెండురోజులున్నాం. ఆయన భార్య రాధ కూడా చాలా మంచిది. ఆయన మమ్మల్ని షాపింగ్‌కి, సైట్‌సీయింగ్‌కి, మాల్‌కి పిల్చుకెళ్ళారు. మా సతీష్ ఉద్యోగపు వేటలో ఈయనింట్లో కొన్నాళ్ళున్నారట. వాళ్ళ బంధుత్వం మాట ఎలా ఉన్నా, చంద్రూగారికి మావారి గురించి తెలిసి, మావారన్నా, నేనన్నా విపరీతమైన గౌరవం. మదరాసుకువచ్చినపుడల్లా మా యింటికి వస్తూండేవారు. తరువాత మదరాసు వచ్చి స్థిర నివాసమేర్పరచుకున్నాడు. ఆయనకి ఇద్దరు మగపిల్లలు.

అక్కడ ఉన్నన్నాళ్ళూ మా మనవరాలు స్నేహ మమ్మల్ని ఒదిలేదికాదు. రెండవ సంవత్సరమే శకుంతల దాన్ని ప్లే స్కూల్లో చేర్పించింది. చాలా మంచి ఇంగ్లీషు మాట్లాడేది. మేము బయల్దేరిన రోజు ఎయిర్‌పోర్టులో ఒకటే ఏడుపు మేము వచ్చేస్తున్నామని. దాన్ని చూచి నాకు కూడా ఏడుపు వచ్చేది. మేమక్కడికి వెళ్ళిన తర్వాత సతీష్ మా వారితో చాలా విషయాలు చెప్పి, పైగా సతీష్ ఎన్నో రాత్రుళ్ళు నిద్రకూడా ఉండటం లేదని చెప్పారు. అన్ని విషయాలు తెలిసిన తర్వాత సతీష్ రిజైన్ చేస్తానంటే మావారు సరేనన్నారు. రిజైన్ చేసి మా వారి దగ్గరకొచ్చి మర్నాడు 'అంకుల్ ఇన్నాళ్ళకి నేను రాత్రి హాయిగా నిద్రపోయాను' అన్నారు. ఇతనిన్నాళ్ళు ఎంత నరకం అనుభవించాడా అనుకుని మా వారికి అదోలా అనిపించింది. ఇక రాజీనామా చేసిన తర్వాత వీసా ప్రకారం రిజర్వ్ చేయించుకుని సామాన్లు పంపే ఏర్పాటు చేసి, ఇండియాకి వచ్చేశారు. మా శకుంతలకి దుబాయ్ వదిలి రావడానికి ఇష్టంలేకపోయింది. వాళ్ళత్తగారు వాళ్ళు కూడా కనీసం అయిదు సంవత్సరాలైనా అక్కడ వుంటారనే అనుకున్నారు. కానీ ఒకటిన్నర సంవత్సరానికి తిరిగి వచ్చేశారు.

మేము దుబాయ్ నుంచి రాగానే కాంచీపురం వెళ్ళి కావలసినవి కొన్నాం. మా శకుంతల వాళ్ళు వచ్చినతరువాత మళ్ళీ దాని చీరకి, స్నేహ పట్టుపావడా, చొక్కాకి మళ్ళీ వెళ్ళివచ్చాం. ఇండియాకి వచ్చిన తర్వాత కొన్నాళ్ళు వరకు శకుంతల మూడ్ అవుట్‌గా ఉండేది.

శకుంతల వాళ్ళు ఇండియాకి వచ్చిన తర్వాత సతీష్ ఆ కంప్యూటర్ కంపెనీలో చేరాడు. కొంతకాలం వరకు బాగానే వుండింది. తరువాత తరువాత పనిచేయించుకుని డబ్బులు సరిగ్గా ఇచ్చేవారు కాదు. మొదట్లో మా సతీష్ పని మీద వున్న ఇంట్రెస్ట్ కొద్ది జీతం ఇవ్వకపోయినా పనిచేస్తూ వుండేవాడు. కానీ ఎవ్వరైనా ఎంతని ఓర్చుకుంటారు? ఈ కంపెనీ వదిలేశారు సతీష్, ఏది ఏమైనా కాలం నిలిచిపోదు కదా! మా శకుంతల మెల్లిగా మనసు మార్చుకునే టైములో రమ్య అనే దుబాయి స్నేహితురాలు మదరాసు వచ్చి తారసపడి "ఎందుకు వచ్చేశారు?" అంటూ దాన్ని కలియబెట్టింది. మా శకుంతలకి ఏడుపు వచ్చిందట ఆవిడ అలా అడగగానే. క్రమేపి రొటీన్ పనులల్లో పడి వాళ్ళమ్మాయిని పద్మాశేషాద్రి బాలభవన్‌లో చేర్పించి అది నుంగంబాకం మెయిన్ స్కూల్లో టీచరుగా చేరింది. మా శకుంతల అప్పటి నుండి ఇప్పటివరకు అక్కడే ఉద్యోగం చేస్తోంది. పద్మాశేషాద్రి సంస్థాపకులు వై.జీ పార్థసారథిగారని, వై.జీ మహేంద్ర

తండ్రి. ఇప్పుడు తండ్రిలేడు. తల్లి శ్రీమతి వై.జి.పార్ధసారథి స్కూలు నడుపుతోంది. శకుంతల వాళ్ళమ్మాయిని బేబి క్లాసులో చేర్పించేటప్పుడు వాళ్ళ నాన్నగారి సహాయం కోరింది. వై.జి.మహేంద్ర మావారి సినిమాల్లో అప్పటికే రెండు మూడు సినిమాలు, పైగా 'దిక్కెట్ర పార్వతి' సినిమాకి తొలి పరిచయం చేశారు. ఈలోగా స్కూల్లో చేర్పించటానికి స్కూలుకి పిలుచుకుని వెళితే ఇంగ్లీషులో దాని పేరడిగారట. స్నేహ అని చెప్పిందట. తర్వాత మీ స్కూల్లో టాయిస్ ఉన్నాయా అని అడిగిందట. రెండున్నర సంవత్సరాల పిల్ల ఇంత తెలివిగా మాట్లాడ్డం చూసి ప్రిన్సిపాల్ ఆశ్చర్యపోయింది. ఇక వాళ్ళ తాతగారి రికమండేషన్ అవసరం లేకుండానే స్కూల్ సీట్ సంపాదించుకుంది.

**దుబాయ్ నుంచి వచ్చేసిన** సతీష్ తాను చేరిన చెన్నై కంపెనీ సరిగ్గా లేనందున, అక్కడ రిజైన్ చేసి వేరే ఉద్యోగం కోసం ప్రయత్నించసాగాడు. ఆ సమయంలో మావారికి పిల్లలకుగాను భక్తిశ్లోకాలతో ఉన్న ఒక సి.డి.రాం తయారు చేయాలనిపించింది. ఇది ముఖ్యంగా మన సంస్కృతికి దూరమైపోతున్న అమెరికాలాంటి విదేశాలలో ఉండే మన దేశపు పిల్లల కోసం. ఇందులో విఘ్నేశ్వరుడు, లక్ష్మీ, వెంకటేశ్వరస్వామి, రాఘవేంద్ర స్వామి మొదలైన ఇరవై మూడు దేవుళ్ళను ఉద్దేశించిన 30 శ్లోకాలు, దీనికి తోడు వాటి అర్థాలు, తాత్పర్యాలు వగైరా. సతీష్ కంప్యూటర్స్‌లో నిపుణుడు కనుక ఈ మొత్తం పనిని అతనికే అప్పచెప్పారు. సతీష్ ఆరుమాసాలు కష్టపడి, అద్భుతమైన గ్రాఫిక్స్‌ని జతపరచి, మంచి క్వాలిటీతో సీ.డీని తీసుకొచ్చాడు. ముఖ్యంగా ఇందులోని శ్లోకాలన్నీ పిల్లలే పాడారు. వీరిలో మా మనవళ్ళు స్నేహ, అనంత్, అంజు కాక కొన్ని స్కూళ్ళ నుంచి సెలెక్ట్ చేసిన పిల్లలు కూడా పాడారు. దీని ప్రొడక్షన్ వ్యవహారాలను మా బావగారి అబ్బాయి పూర్ణ చూసుకున్నాడు.

ఆ తరువాత సతీష్ కొన్నాళ్ళకు పెంటామీడియా కంపెనీలో చేరుకున్నాడు. ఆ సమయంలో పెంటా మీడియా వాళ్ళు మా వారిని ఫైవ్ అండ్ హాఫ్ అవర్స్ టు డాన్ అనే ఒక ఇంగ్లీషు సినిమాకు డైరెక్ట్ చేయవలసినదిగా కోరారు. ఇది హాలీవుడ్‌లో చేయవలసిన సినిమా. అప్పటికే మార్కు జస్లోవ్ అనే హాలీవుడ్ రచయిత స్క్రిప్టు పూర్తిగా రాసి యిచ్చేశాడు. ఒక రెండువారాలపాటు అమెరికా వెళ్ళి, అక్కడి వారితో సంప్రదింపులు జరిపి రావాలని చెప్పారు. మా వారు అమెరికా ప్రయాణం అయ్యారు. ఆయనతో నేను కూడా వెళ్ళాను.

మా ప్రోగ్రాం ఏమిటంటే ఆ పదిహేను రోజులలో ముందు న్యూయార్క్, అక్కడ నాలుగు రోజులుండి తరువాత లాస్ ఏంజెల్స్, అక్కడ నుండి ఏటేటా అమెరికాలో జరిగే తానా, మళ్ళీ లాసెంజెల్స్, అక్కణ్ణించి శాన్‌ఫ్రాన్సిస్కో, అక్కణ్ణుంచి ఇండియా, ఇదీ మా ప్లాను. ముందుగా న్యూయార్క్ అక్కడ మా విజ్జీ, రాజా వాళ్ళు ఉన్నారు. వాళ్ళకి ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళని స్కూల్లో వదిలి, ఎయిర్‌పోర్టుకు వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకుని వాళ్ళింటికి పిల్చుకువెళ్ళారు. న్యూయార్క్‌లో మూడు నాలుగు రోజులు ఉన్నాము. వాళ్ళు మమ్మల్ని అక్కడ సైట్ సీయింగ్‌కి తీసుకెళ్ళారు. అక్కడ రాఘవేంద్రస్వామి గుడి ఉంది. మేము అక్కడ ఉన్నప్పుడే వాళ్ళ రెండో అమ్మాయి కావ్య పుట్టినరోజు అయింది. మేమంతా ఆ గుడికి వెళ్ళి వచ్చాం. తరువాత నయాగరా ఫాల్స్‌కి తీసుకెళ్ళారు. అక్కడ స్టీమర్‌లో వెళుతుంటే నీళ్ళు వాన జల్లులాగా నెత్తిమీదనుంచి పడ్తాయి. చాలా ఆనందంగా, చాలా చలిగా ఉండేది. తరువాత చాలా షాపింగ్ చేసాం. మావారు నాకొక గోల్డ్‌కోట్ ఉన్న రిస్టువాచీ నూరు డాలర్లు పెట్టి కొనిచ్చారు. ఆ స్ట్రాప్ ఎప్పటికీ నల్లబడదట. మా షాపింగ్ అంతా చూసి మా విజ్జీకి ఒక్కటే ఆశ్చర్యం. "అదేంటి పిన్నీ! ఇండియా నుంచి వచ్చిన వాళ్ళు డాలర్లను రూపాయలుగా మార్చి, ఇక్కడ అన్నీ చాలా ఖరీదుగా ఉంటాయని ఇక్కడేమీ కొనరు. మీరింతలా ఖర్చుపెడ్తున్నారే" అనేది. ఆ రిస్టువాచీ ధర అప్పటి డాలర్ల ప్రకారం 4,300 రూపాయలు. వీళ్ళ పిల్లలిద్దరూ 'అమ్మమ్మ' అని నన్ను వదిలేవారు కాదు. ఒకటేమిటి న్యూయార్క్‌లో వుండే అన్ని ప్రదేశాలకి మమ్మల్ని పిల్చుకెళ్ళారు. రాజా పాటలు పాడుతూ, మ్యూజిక్ చేస్తూ, రికార్డింగ్ చేస్తూ అదే సొంతంగా హాబీ అంటారో, ప్రొఫెషన్ అంటారో పెట్టుకున్నాడు.

న్యూయార్క్‌నుంచి ప్రస్తుతం కెనడాకెళ్ళి స్వంత ఇల్లు కట్టుకుని పిల్లలు కొంచెం పెద్దవాళ్ళై, వాళ్ళతోకూడా మరి కొంతమందికి కీ బోర్డు నేర్పుతూ ఉన్నాడు. విజ్జీ కూడా ఇంట్లో కూర్చున్నట్లు అఫీషియల్‌గా చిన్న చిన్న పనులు చేస్తూ ఉంటుంది.

ఆ మధ్య నాకు ఆర్థోపెడిక్ సమస్య వచ్చి రెండేళ్ళు చాలా సేపు కూర్చోలేకపోయేదాన్ని. ఈ సమయంలో ఇండియాలోనే ప్రయాణాలు చేయలేకపోయేదాన్ని. ఆ సమయంలో మా విజ్జీ నాకు ఫోను చేసి మేము న్యూయార్క్‌లో చిన్న ఇంట్లో ఉన్నప్పుడు నువ్వూ, బాబాయి వచ్చి ఎలాగో సర్దుకుని ఉన్నారు. ఇప్పుడు మా ఇల్లు పెద్దది. మళ్ళీ మీ ఇద్దరూ రావలసినదిగా చాలాసార్లు ఫోన్ చేసింది. దానికి నా సమాధానం కెనడా కాదు కదా, కాకినాడకు ప్రయాణం చేసే స్థితిలోకూడా లేనంటే అది ఒకటే నవ్వు.

న్యూయార్క్ నుంచి లాస్ ఏంజెల్స్‌కు వెళ్ళాం. అక్కడ ఇండియాలోని పెంటామీడియావారి తరపున ఉన్న ఆఫీసులో శ్రీరాం అనే మేనేజర్‌ని కలుసుకుని కొన్ని ఆఫీసు విషయాలు మాట్లాడి మాకు కేటాయించిన హోటల్‌కి వస్తూ ఉండేవాళ్ళం. మొదట మమ్మల్ని ఒక కొరియన్ హోటల్‌లో దించారు. అక్కడ వాతావరణం బాగా లేకపోతే మరుసటి రోజే హాలీవుడ్ బులెవార్డ్ అనే మంచి అమెరికన్ హోటల్‌కి మార్చారు (Hollywood Boulevard) రెండవసారి వెళ్ళినప్పుడు మా ముగ్గురికి, అంటే సతీష్‌తో సహా, సరిపోయేలా ఒక అపార్టుమెంటును బుక్ చేసారు. నేను కూడా మా వారితో పెంటామీడియా ఆఫీసుకు వెళ్తూ మధ్యాహ్నం అక్కడే భోజనం చేసి రూముకువచ్చేదాన్ని. రాత్రిళ్ళు ఏ బ్రెడ్డో ఏదో తిని కాలం వెళ్ళబుచ్చే వాళ్ళం. ఒకరోజు ఆఫీసు తరపున ఒకాయన కారులో పిల్చుకెళ్ళి డిస్నిలాండ్‌లో వదిలి సాయంకాలం అయిదుగంటలకి వచ్చి పిల్చుకెళ్తానని వెళ్ళిపోయారు. అప్పటికే మా వారి వయసు 65, నా వయసు 60. కానీ మేమెంతని నడవగలను? అక్కడ హైదరాబాదులో ఉంటున్న నలుగురు తెలుగు వారు మా వారిని చూసి గుర్తుపట్టి, "ఫలానా సింగీతం శ్రీనివాసరావుగారు మీరేనా? మీ పిల్లలు ఎవరైనా ఇక్కడ ఉన్నారా? వాళ్ళతో వచ్చారా?" అని అడిగారు. మేము విషయం చెపితే "ఈ వయసులో మీ ఇద్దరూ ఒంటరిగా వచ్చారా?" అని ముక్కున వేలేసుకున్నారు.

అమెరికాలో సీనియర్ సిటిజన్స్‌కి మంచి ప్రాధాన్యత ఇస్తారు. సినిమా టిక్కెట్లు కానీ మరే టిక్కెట్లు అయినా మనం అడక్కుండానే తగ్గింపు ధరకు ఇస్తారు. మన ఇండియాలో సీనియర్ సిటిజన్ అని చెప్పినా కూడా కింద బెర్తులు అలాట్ చేయరు. న్యూయార్క్‌లో రాజా ఒక సినిమాకి పిల్చుకెళ్తే వాళ్ళు కూడా కన్‌సెషన్ ఇచ్చారు.

లాసేంజెల్స్ నుంచి సిన్సినాటికి వెళ్ళాము. అక్కడ తెలుగు మహాసభలు జరుగుతున్నప్పుడు మాకొక హోటల్ రూం అలాట్ చేసి, ఫలానా టైముకి ఫంక్షన్ ప్రారంభమవుతుందని, ఆ సమయానికి అక్కడ ఉండాలని ఆఫీసులో చెప్పారు. గబగబా లోపలికి వెళ్ళాం. ఒక్కొక్క ప్రోగ్రాం జరుగుతుంది కానీ ఏదో పోటీలు పడి వెనక నుంచి ఒక్కొక్కళ్ళు స్టేజీ మీదకి వస్తున్నట్లు అనిపించింది. ఈ ఛాన్సు పోతే ఇక దొరకదన్నట్టు. తరువాత పి.సుశీలగారు స్టేజ్ మీదకు వచ్చారు. ప్రేక్షకులంతా తెలుగువారే కనుక "అమెరికా అమ్మాయి"లోని పాడనా తెలుగుపాట అనే పాట పాడమని కోరారు. సుశీల అన్నారు "ప్రతి సంవత్సరం అడుగుతారు ఈ పాటను" అంటూ పాడారు. ప్రేక్షకుల హర్షధ్వానాలు మార్మ్రోగాయి. వెంటనే ఇలా అనుకున్నాను. అసలు 'అమెరికా అమ్మాయి' దర్శకుడు ఇక్కడే ఉన్నారు అని మా వారిని పిలుస్తారేమోనని ఆశపడ్డాను. మా వారితో కలిసి పనిచేసిన ఆర్టిస్టులు, వాళ్ళు కూడా కొందరు అక్కడే ఉన్నారు. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు. అదే వాళ్ళ అవసరాలైతే మన ఇంటి చుట్టూ ఎన్నిసార్లయినా తిరుగుతారు. లేకపోతే ఇలాగే నిమ్మకు నీరు పోసినట్టు ఉంటారు. నాకు చాలా కష్టం అనిపించింది. మేము న్యూయార్కులో ఉన్నప్పుడు అమెరికాలో వేరేచోట ఉన్న మా పెద్ద వియ్యపురాలి అన్నగారు అదేపనిగా వచ్చి మావారిని కలుసుకుని వెళ్ళారు. ఆయనసలు వయసులో పెద్దవారే, అలా రావాలని రూలు లేదుగా, అభిమానం, మర్యాద. అస్తమానం మాకు మాత్రం తానాకి వెళ్ళడానికి అవుతుందా? ఇలాంటి అవకాశం దొరుకుతుందా? అదే సుశీలగారు ఆ పాట అవ్వగానే సింగీతంగారిని స్టేజి మీదకు పిలిచి ఉంటే అమెరికా ప్రజలు ఎంత ఆనందించి ఉండేవారో, మావారికి దూసుకుని వెళ్ళే

అలవాటు లేదు. ఆయన గౌరవం ఆయనది. అసలాయన దీన్ని గురించి వెంట్రుకవాసంత కూడా పట్టించుకోక, ఎవరితోనో జోకులు కట్ చేస్తున్నారు. అందుకని ఎన్ని అవార్డులు, ఎన్ని రివార్డులు సంపాదించుకున్నా కూడా, ఇండియా ప్రభుత్వం కూడా కళ్ళు మూసుకుని కూర్చుంటుంది ఒక్కొక్కప్పుడు. దాన్ని మాత్రం ఎవ్వరూ మార్చలేరు. ఇదంతా నా మనసులోని బాధ.

సుశీల గారి పాట అయిన తర్వాత స్టేజి వెనకాల నుంచి వెళ్ళి ఆమెను కలుసుకున్నాను. ఆ తరువాత రాజేంద్రప్రసాద్ గారూ, పలువురు స్టేజి మీదకు ఎక్కి మాట్లాడారు. మేము రూములో ఆ రాత్రి రెస్ట్ తీసుకుని, మర్నాడు స్నానాలు అన్ని అయిన తరువాత కిందకి వచ్చాం. అందరిని ఒక వ్యాన్ లిఫ్టు ఇచ్చి ఎయిర్‌పోర్టులో దింపారు. మేము తిరిగి లాస్‌ఏంజెల్స్ వెళ్ళి, నాలుగురోజులుండి యూనివర్సల్ స్టూడియోస్ చూసి, అక్కడే పెంటామీడియా వాళ్ళ గ్రాఫిక్స్ ఆఫీసు ల్యాబ్ కూడా ఒకరోజు చూసి శాన్‌ఫ్రాన్సిస్కోకి వెళ్ళాం. అక్కడ మా రెండో అల్లుడు కార్తీక్ తమ్ముడు ఉన్నాడు. అప్పటికింకా అతనికి పెళ్ళికాలేదు.

మావారు వేసిన ప్లాను ప్రకారం అక్కడ మూడురోజులుండి ఇండియాకి వెళ్ళేటట్లుగా. నాకు కోపం వచ్చింది. మనకి మన అల్లుడే ఇంకా అలవాటు అవ్వలేదు, తమ్ముడింట్లో ఎలా ఉంటాననుకున్నారు? అని అడిగాను. "ఏం చేయను, ప్రోగ్రాం అలా ఉంది" అన్నారు. పైగా "ఇక్కడ నేను హోటల్ బుక్ చేయలేదే, ప్రశాంత్ వద్దని తన యింటికి రమ్మని ఫోన్ చేసాడు. మనం ఇండియాలో ఉన్నప్పుడు" అన్నారు మా వారు. మేము శాన్‌ఫ్రాన్సిస్కోకి రాత్రి చేరుకున్నాం. ప్రశాంత్ ఎయిర్‌పోర్టుకు వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకున్నాడు. మేము వస్తామని తెలిసి మాకు కూడా అతను వంట చేసాడు. అయితే అనుభవం ఉన్నవాడిలా చేసాడు వంట, నాకాశ్చర్యం వేసింది. మర్నాడు అతని కారులో షాపింగ్ ఏమీ చేయలేదు. కానీ సైట్ సీయింగ్, బోటింగ్ అంతా చేయించాడు. నేనతనికి ఖచ్చితంగా చెప్పేసాను. మేమున్న మూడురోజులు వంటింట్లోకి రావద్దని. ఆఖరుకు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు కూడా ప్లేట్లు కడుగుతూనే ఉన్నాను. "అంకుల్! ఆంటీకి మా వంటిల్లు వదిలి రాబుద్ధి అవ్వడంలేద"న్నాడు. ఎంతైనా గాని ప్రశాంత్ ఇంట్లో మూడురోజులు, మూడు నిమిషాల్లా గడిచిపోయాయి. మా ఫ్లైట్ అర్ధరాత్రి. మాతో ఎయిర్‌పోర్టులో ఇంకా వెయిట్ చేస్తుంటే మా వారు బలవంతం మీద అతన్ని పన్నెండుగంటలకి ఇంటికి పంపించేసారు.

మేము ప్రశాంత్ ఇంట్లో ఉండగానే ఢిల్లీ నుంచి మా సుధ ఫోన్ చేసింది. నేను దానితో మొదట ఎలా ఫీల్ అయ్యానో, ప్రశాంత్ మంచితనం వలన నేనెలా అలవాటు చేసుకున్నానో, వాళ్ళ మరిది మమ్మల్నిద్దరినీ తన తల్లిదండ్రులలాగా ఎలా చూసుకున్నాడో చెప్పాను. ఇవే విషయాలు ఇంగ్లీషులో తరువాత దానికి ఉత్తరం రాసి కార్తీక్ దగ్గర కన్నా ప్రశాంత్ దగ్గరే ఫ్రీగా ఉన్నానని రాసాను. కార్తీక్ చూసినా పరవాలేదని. కానీ అప్పటి కార్తీక్‌కు, ఇప్పటి కార్తీక్‌కు చాలా తేడా ఉంది. అతను కూడా చాలా మారిపోయి సోషియల్‌గా ఉంటున్నాడు. మా పెద్ద అల్లుడు సతీష్ చాలా బాగా మాట్లాడుతూ కలుపుగోలు మనిషి, కార్తీక్ అలాకాదు, కొంచెం మొహమాటపు మనిషి. మితభాషి. మాసుధ అయితే వాళ్ళాయన్ని వెనకేసుకుని వచ్చి "కార్తీక్ చదువుకునేటప్పుడు, యం.బి.ఏ పూనాలో చదివేటప్పుడు ఒంటరిగా వుండి అలవాటు అయింది. తరువాత ఉద్యోగ నిమిత్తం, పెళ్ళికి ముందు ఒంటరిగా ఢిల్లీలో ఉండేవారని" చెప్పేది.

మా సుధ పురిటికి మదరాసు వచ్చింది. అనుమానంగా ఉంటే తొమ్మిదో నెల నిండిన తరువాత విజయా హాస్పిటల్లో ఒకరోజు వుండి వచ్చింది. ఇంకా టైము ఉంది. సెప్టెంబరు నెల పదిహేడవ తేదీన టైము చెప్పింది. డాక్టరు సిజేరియన్ అవుతుంది అని చెప్పింది. అయినా ఇరవై వరకు అవసరం లేకపోయింది. 20న సాయంత్రం సిజేరియన్ ఆపరేషన్ జరిగింది. మగపిల్లవాడు. భార్య ప్రసవ టైముకదా అని మా అల్లుడు కార్తీక్ పదిరోజులు సెలవు పెట్టి ఢిల్లీ నుంచి వచ్చారు. మా సుధ బాబుని ఇంటికి పిలుచుకు వచ్చాక నామకరణం చేసి "అభినవ్" అని పేరు పెట్టాము. నా సంతోషం చెప్పలేను. దౌహిత్రుడు పుట్టాడు నాకు మేనమామలు లేరు, అన్నదమ్ములు లేరు,

కొడుకులు లేరు, దౌహిత్రుడు పుడితే సంతోషం కదా మరి. బాబుకు ఐదోనెల రాగానే నేనూ, మావారు విమానంలో మా సుధని, బాబుని ఢిల్లీలో దిగబెట్టి వచ్చాం.

మా సుధ, కార్తీక్ ఏడాది లోపుగా మళ్ళీ బాబుతో మదరాసుకి వచ్చారు. తిరుపతి ప్రోగ్రాం పెట్టుకున్నాం. పుట్టు వెంట్రుకలు తీయడం, చెవులు కుట్టించడం అన్నీ సాంప్రదాయాలు, దేవుడి దర్శనం అయిన తరువాత వాళ్ళ అత్తగారూ వాళ్ళు సాంప్రదాయ ప్రకారం వాడికి కింద తిరుపతిలోని గుళ్ళో అక్షరాభ్యాసం చేయించారు. మఠానికి వెళ్ళి అన్నప్రాసన చేయించారు. మదరాసుకు వచ్చిన నెల్లాళ్ళకి వాడికి పుట్టినరోజు పండగ వచ్చింది. మేమది గ్రాండ్‌గా చేసాము. వాడికి కూడా వెండి కంచం, వెండి గ్లాసు కొనిచ్చాం, మా స్నేహకి చేసినట్లే చేసాం

మా మనవడు అభినవ్ చంటిపిల్లాడిగా ఉన్నప్పుడు కార్తీక్‌కి చండీఘర్ దగ్గర ఉన్న సంగ్రూర్ అనే ఊరికి బదిలీ అయింది. అతను ముందుగా వెళ్ళి ఆఫీసూ, ఊరు చూసుకుని వచ్చి మళ్ళీ వెళ్ళి ఇల్లు చూసుకుని మాట్లాడి వచ్చారు. వాళ్ళు సామాన్లు సర్దుకుని ఢిల్లీ నుంచి మకాం ఎత్తాలి కదా. ఊరు మారడం అంటే మాటలా? బ్యాంకు, టెలిఫోన్ బిల్సు, అడ్రస్సు మార్పిడి అన్నీ చూసుకోవాలి కదా, ఇంట్లో చూస్తే చంటిపిల్లవాడు. అందుకని సహాయానికి రమ్మని ఫోను చేసింది. వెంటనే విమానంలో వెళ్ళిపోయాను. నన్నుకూడా వాళ్ళతో సంగ్రూర్‌కి రమ్మని చెప్పింది మా సుధ. కానీ సంగ్రూర్‌కి డైరెక్ట్ రైలు లేదు. మధ్యలో మారాలి, అటు ఫ్లైట్ దారి కాదు. నేను రాలేను అన్నాను. ప్యాకింగ్ అయి నేను వాళ్ళు బయల్దేరే ముందురోజే మదరాసుకి వచ్చేసాను.

వాళ్ళు సంగ్రూర్‌లో చాలా సంతోషంగా ఉండేవారు. ఇల్లు పెద్దదని చాలా సౌకర్యంగా ఉందని ఫోన్లు చేసేది మా సుధ. ఇంతలో మా చెల్లెలు పెద్ద కూతురు మృదుల పెళ్ళి నెల్లూరులో జరిగింది. మృదులకి సంబంధం మద్రాసు సంబంధం. నేనే కుదిర్చాను. ఆ అబ్బాయి మురళి. ఇప్పటికింకా నన్ను చూసినప్పుడల్లా "మా పెళ్ళికి కారణం మీరేగా ఆంటీ" అని సంతోషంగా అంటుంటాడు. పెళ్ళి కోసరమని కొంచెం ముందుగా మదరాసు వచ్చేసింది సుధ. కార్తీక్‌కి కూడా పెళ్ళి సమయానికి వచ్చేట్టుగా ట్రైను బుక్ చేసింది. దాని అత్తగారు, మామగారు, మా శకుంతల అత్తామామలు కూడా నెల్లూరుకు వచ్చారు. శకుంతల, సతీష్, స్నేహ అందరం కలిసి నెల్లూరుకు రెండు మూడు కార్లలో వెళ్ళాము. మా గూడూరు వాళ్ళకి గంట ప్రయాణమే, వాళ్ళూ వచ్చారు.

ఇక మా బావగారి అమ్మాయిల సంగతి. పద్మ భర్తపేరు అంబర్కానా శ్రీనివాసరావు, మేనమామ కొడుకే. స్టేట్‌బ్యాంక్‌లో పనిచేస్తూ బదిలీల వల్ల అన్ని ఊర్లు తిరిగి హైదరాబాదుకు చేరి అక్కడే రిటైర్ అయి సొంత ఇల్లు కట్టుకుని స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. ఇద్దరు అబ్బాయిలు, శ్రీకాంత్ పెద్దవాడు, పెళ్ళయింది. ఒక ఆడపిల్ల. అమెరికాలో ఉంటున్నాడు. శ్రీనాథ్ రెండో అబ్బాయి వాడికీ పెళ్ళయింది, ఒక కూతురు, ఢిల్లీలో ఉంటాడు. శ్రీనివాసరావుని అందరూ 'బాబు' అని పిలుస్తాము. బాబూ తమ్ముడు ధనుంజయ తిరుపతిలో ఉంటాడు. పూర్తిపేరు ఏ.పి.రావు. ఇతను కూడా స్టే బ్యాంక్‌లో పని చేస్తూ రిటైర్ అయ్యాడు. ఇతని భార్యపేరు కూడా పద్మ కూతురు పేరు చిత్ర. అమెరికాలో కూతురు, అల్లుడు వాళ్ళ పాప ఉంటారు. వాళ్ళప్పుడప్పుడు అమెరికాకు కూతురింటికి వెళ్ళివస్తుంటారు. ధనుంజయ మావారి సినిమాలకి ఫ్యాను. మావారంటే ఎనలేని గౌరవం.

మా బావగారి రెండవ అమ్మాయి లక్ష్మి. పెళ్ళై నలుగురు, ఐదుగురు పిల్లలు. శ్రీహరికోటలో వాళ్ళ నివాసం. మూడవ కూతురు సత్యభామ. భర్తపేరు శ్రీనివాసరావు, మదరాసులోనే ఉంటుంది. నాల్గవ అమ్మాయి విజయ. అందరూ విజ్జి అంటాము. దానికి ఇద్దరు పిల్లలు, కెనడాలో ఉంటుంది. ఇందిర ఐదవ అమ్మాయి. హైదరాబాదులో ఉంటుంది. ఇద్దరమ్మాయిలు. నర్సింగ్ మా బావగారి రెండవ అబ్బాయి. గూడూరులో స్టేట్‌బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. స్వంత ఇల్లు వుంది. పెద్దబ్బాయి పూర్ణ. మాతోనే ఉంటాడు కదా, సినీ

టెక్నిషియన్స్ అసోసియేషన్ వాళ్ళు హౌసింగ్ బోర్డు ద్వారా సినిమా వాళ్ళకి కట్టించిన ఇళ్ళలో ఒక ఫ్లాటు మా పూర్ణా కొన్నాడు. రెండు బెడ్‌రూముల ఫ్లాటు. మాంగాడు అమ్మవారు చాలా శక్తివంతమైనది. ఆ ఇల్లు మాంగాడులో ఉంది.

**"పిన్నీ! సుజీ ఉందా?"**

డాబా మీదకి పాకిన సన్నజాజి తీగని వంచి మొగ్గలు కోస్తున్న నాకు శోభ గొంతు కిందనించి వినపడింది.

"పైన పూలు కోస్తోంది వెళ్ళు." అమ్మ చెప్పింది.

మెట్లమీదే శోభని కలుసుకుని ఆనందంగా చెప్పాను.

"పొద్దున బద్ధకంగా అనిపించి స్కూల్‌కి రాలేదు. ఇంపార్టెంట్ పాఠాలేమైనా చెప్పారా?"

"ఏమో ఎవరికి తెలుసు? నేనూ పోలేదు." నిర్లిప్తంగా చెప్పింది.

ఆ కంఠధ్వని తేడాగా ఉండటంతో శోభని పరిశీలించి చూసాను. పైకి మామూలుగా ఉన్నా, ఎందుకో బాధపడుతోందని అనిపించింది.

"ఏమైంది? ఎందుకలా ఉన్నావు?" అడిగాను.

దాని కళ్ళవెంట బొటబొట కన్నీరు కారింది. నేను కంగారు పడ్డాను. "మీ పిన్ని మళ్ళీ తిట్టిందా?"

శోభకి తల్లిలేదు. సవితి తల్లి. మంచిదేకాని కోపం ఎక్కువ. తనని అనవసరంగా తిడుతుందని శోభకి బాధ.

తల అడ్డంగా ఆడించి అడిగింది.

"మీ అన్నాయ్ పైకొస్తాడా?"

"ఊహూ!! వాడు గుంటూరు సినిమాకి వెళ్ళాడు." చెప్పాను.

"మీ అమ్మ?"

"రాదు. రాత్రి వంట చేస్తోంది. నాన్నకి కాళ్ళు నొప్పులు. పైకి ఎక్కరు. "

శోభ రెండు చేతులతో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. అంటువ్యాధిలా ఆ దుఃఖం నాకూ సోకి కన్నీళ్ళతో అడిగాను.

"ఏమైంది శోభా? ప్లీజ్ చెప్పు."

రెండు నిమిషాల తర్వాత మొహానికి కప్పుకున్న చేతులు తీసేసి, ఓణీతో మొహాన్ని తుడుచుకుని ఎర్రబడ్డ ముక్కుని ఎగబీలుస్తూ చెప్పింది.

"నేను ప్రెగ్నెంట్ అయ్యానే. నాకు నెల తప్పింది."

అదిరిపడ్డాను. చిన్న పల్లెటూళ్ళో పదో తరగతి చదువుతున్న నాకు నెలతప్పడం అంటే ఏమిటో, ఎందుకు తప్పుతుందో క్షుణ్ణంగా తెలుసు. కానీ శోభలాంటి తెలివైన పిల్ల ఈ పని చేయడం నచ్చలేదు.

"ఎవరు వాడు?"

"ఇప్పుడది ముఖ్యమా?" విసుగ్గా అడిగింది.

"మరి మీ నాన్నకి చెప్పి పెళ్ళి చేసుకుంటావా?" ఆరాగా అడిగాను.

"చేసుకోను. నేను చదువుకోవాలి."

మరి చంటి పిల్లతో చదువు కుదురుతుందా? అసలే ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలు కూడా." జాలిగా అడిగాను.

"నువ్వు రెండు నిమిషాలు నోర్మూసుకుని నేను చెప్పేది వింటావా?" అరిచింది.

"సరే చెప్పు."

"అద్దె పుస్తకాలషాపులో ఉంటాడే నిరంజన్. వాడు. మా పిన్నికి పుస్తకాలపిచ్చి కదా. రోజూ చదివిన వాటిని మార్చడానికి, కొత్తపుస్తకాలు తేవడానికి నన్ను పంపించేది. దాంతో వాడితో ఫ్రెండ్షిప్."

"ప్రేమ కాదా?" నిరాశగా అడిగాను.

"నిన్ను నోరు తెరవద్దన్నానా? మెల్లిగా నాతో స్నేహం మొదలుపెట్టి, తర్వాత ప్రేమ అన్నాడు. నాకు వాడిమీద అలాంటి ఫీలింగ్స్ లేవని చెప్పాకూడా. కానీ వాడు వదల్లేదు. నైన్త్ క్లాసంతా ఈ గోలే.."

"నాకెప్పుడూ చెప్పలేదే?"

"ఏమో! చెప్పాలనిపించలేదు. టెన్త్‌లోకి వచ్చాక ఓ మధ్యాహ్నం ఎవరూ లేకుండా చూసి ముద్దుపెట్టుకున్నాడు. నాకు బాగానే అనిపించింది. అదేరోజు రాత్రి మా పిన్ని మా నాన్నతో పెద్దగొడవ పెట్టుకుంది. టెన్త్ అవగానే నా పెళ్ళిచేయమని, ఖర్చులు, కట్నం మా మేనమామలని అడగాలని, మా పొలాలు అమ్మడానికి వీల్లేదని చెప్పింది. నాన్న ఏదో గొణిగినా గెలవలేక సరే అన్నాడు. నాకు ఉక్రోషం వచ్చింది. మర్నాడు నిరంజన్ దగ్గరకి వెళ్ళి 'నన్ను పెళ్ళి చేసుకుంటావా? బాగా చదివిస్తావా?' అని అడిగాను. వాడు సరే అన్నాడు, కాకపోతే టెన్త్ సెలవుల్లో మా ఇంటికి వచ్చి మా నాన్నకి చెప్తా అన్నాడు. నమ్మాను... బైటుండి రెండునెలలైందని ఇవాళ గుర్తొచ్చింది. మనూళ్ళో అయితే నేను అందరికీ తెలుసని గుంటూరు వెళ్ళి గవర్నమెంట్ హాస్పిటల్లో చూపించుకున్నాను. నెల తప్పిందని చెప్పారు. నాకు పదిహేనేళ్ళే కాబట్టి చిన్నవయసులో ఇట్లా చేసానని డాక్టర్ బాగా తిట్టింది. మా నాన్న వచ్చి సంతకం చేస్తే అబార్షన్ చేస్తానంది. నాన్నకి తెలిస్తే చంపుతాడని ఏడుస్తూంటే, నర్స్ దూరంగా తీసుకెళ్ళి, 'వెయ్యిరూపాయలు ఇస్తే అబార్షన్ చేస్తాన'ని చెప్పింది."

నేను నోరు తెరుచుకుని చూస్తూండిపోయాను.

"బస్ దిగి సరాసరి ఆ వెధవ దగ్గరకి వెళ్ళి విషయం చెప్పి వెయ్యిరూపాయలు ఇవ్వమన్నాను. దరిద్రుడు ఒక్క రూపాయికూడా లేదన్నాడు. ఇంక నీ దగ్గరకి వచ్చాను."

"వెయ్యి రూపాయలంటే మాటలా? నా దగ్గర ఎందుకుంటాయి?"

శోభ నా చెయ్యి పట్టుకుని ప్రాధేయపూర్వకంగా చెప్పింది.

"ప్లీజ్ సుజీ. నువ్వే హెల్ప్ చేయాలే. ఈ విషయం నీకు తప్ప ఎవరికి చెప్పినా ఊరంతా టాంటాం వేస్తారు. నువ్వయితే మంచిదానివి. అందుకే నీకు చెప్పాను. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి పని చేయను ప్లీజే. మా పిన్నికి తెలీకుండా మా నాన్న పదిరూపాయలకి మించి ఇవ్వలేడు. ఆ పదికి కూడా వంద ప్రశ్నలు వేస్తాడు, ఎందుకు? ఏం చేస్తావు? ఇంట్లో తిని నడిచి బడికి వెళ్తావుకదా ఇంక డబ్బులెందుకు? అని సతాయిస్తాడు. వెయ్యిరూపాయలు అడిగితే ఆయన గుండె ఆగిపోతుంది."

"వెయ్యిరూపాయలంటే నాకూ చాలా ఎక్కువ. కారణం చెప్పకుండా ఇంట్లో ఇవ్వరు. ఏం చెప్పాలి? ఐనా నువ్వు మూడొందలు ఇస్తానని బేరమాడాల్సింది." చెప్పాను.

శోభ నావంక కోపంగా చూసింది కానీ ఏమీ మాట్లాడలేదు. నేను కొద్దిసేపు ఆలోచించి చెప్పాను.

"మా అమ్మవాళ్ళూ, ఇంటికొచ్చిన చుట్టాలు ఇచ్చిన డబ్బులు ఒక కవర్‌లో వేసి దాస్తున్నాను. పిల్లకుప్పెలు కొనుక్కోవాలని కోరిక. మా అమ్మ కొనిపెట్టనని చెప్పింది. కూడబెట్టిన డబ్బులతో పిల్లకుప్పెలు, పాపిటిగొలుసు కొనుక్కుందాం అని చాలా రోజులనించి దాస్తున్నాను. అందులో చూస్తా ఎంతుందో."

శోభ మొహంలో వెలుగు కనిపించింది. ఇద్దరం కిందకి వెళ్ళాం. నా ట్రంక్ పెట్టెలో బట్టల కింద దాచిన చీరల కవర్ తీసి మంచం మీద కుమ్మరించాను. ఒకట్లు, రెండ్లు, ఐదులు, పదులు, అరుదుగా ఇరవైరూపాయలనోట్లు రాలాయి. ఇద్దరం కలిసి వాటిని విడివిడిగా విడదీసి, లెక్కపెట్టాం. ఏడువందల అరవై మూడురూపాయలున్నాయి.

అంతమొత్తం జమైందని నేను నమ్మలేకపోయాను. మా ఢిల్లీ బాబాయ్ వచ్చినప్పుడు ఇచ్చిన మూడువందల మూలంగా అయియుంటుంది.

"ఇంకా రెండువందల ఏభై కావాలి." శోభ నిరాశగా చెప్పింది.

నేను మా అమ్మ దగ్గరకి వెళ్ళి చెప్పాను.

"అమ్మా! ఇవాళ నేను స్కూల్‌కి వెళ్ళలేదుగా. పరీక్ష ఫీజ్ రేపటిలోగా కట్టాలని చెప్పారుట. నూట ఏభైరూపాయలు. శోభ వాళ్ళ పిన్ని ఇవ్వనని చెప్పిందిట. అందుకని అది ఏడుస్తోంది. పాపం దాని ఫీజు కూడా కట్టమ్మా."

అమ్మ ఎర్రబడ్డ శోభ కళ్ళు, మొహం చూసి ఏమనుకుంటుందో ఏమో బీరువాలోంచి మూడువందలు తీసి నాకిచ్చి, శోభతో చెప్పింది.

"ఇది అప్పుగా ఇవ్వడంలేదు శోభా. ఎలా తీర్చాలా అని భయపడకు. ఇద్దరూ బాగా చదివి ఫస్ట్‌క్లాస్ తెచ్చుకోండి."

సమస్య చాలా సులభంగా పరిష్కారం అవడంతో శోభ తేటగా నవ్వింది.

"నువ్వింకో సాయం చేయాలే." బయటకి వచ్చాక చెప్పింది.

"ఇంకా ఏంటి?" చిరాగ్గా అడిగాను.

అది చెప్పిన మాటలు విని గుండెల మీద చేతులు వేసుకుని చెప్పాను.

"అమ్మో! మీ ఇంటికి వచ్చి మనిద్దరం కలిసి చదువుకుంటాం అని నిన్ను మా ఇంటికి పంపమని మీ పిన్నిని పర్మిషన్ అడుగుతాను కాని నీతో గుంటూరు మాత్రం రాను. మా నాన్నకి తెలిస్తే చంపి పాతేస్తాడు."

శోభ ఏడుపుగొంతుతో చెప్పింది.

"ప్లీజే. అదెలా చేస్తారో, పొట్ట ఎంత కొస్తారో నాకు తెలీదు. ఒక్కదాన్నే బస్సెక్కి ఇంటికి రాగలనో లేదో!"

నేను మళ్ళీ కరిగిపోయాను.

మర్నాడు నేను స్కూల్‌కి రెడి అయి, మా అమ్మకి మధ్యాహ్నం లంచ్‌కి ఇంటికి రానని చెప్పి, బాక్స్‌లో అన్నం, ఆవకాయ పెట్టుకుని శోభ ఇంటికి వెళ్ళాను. వాళ్ళ పిన్ని బయటే ఆకు కూరలు కొంటూ కనిపించింది. వినయంగా అడిగాను.

"పిన్నీ నాకు లెక్కల్లో డౌట్స్ ఉన్నాయి. శోభకి లెక్కలు బాగా వచ్చు. దాన్ని రెండురోజులు మా ఇంటికి పంపిస్తావా? కంబైన్డ్ స్టడీ చేస్తాం. పరీక్షలింకా నెలకూడా లేవు."

ఏ కళనుందో ఆవిడ తలూపి చెప్పింది.

"అట్లాగే. మధ్యాహ్నం అన్నం బెల్లుకి కూడా మీ ఇంటికే తీసుకుపో."

"సరే పిన్ని" ఆనందంగా చెప్పాను.

శోభ స్కూల్ బేగ్‌తో వచ్చింది. ఇద్దరం బస్టాండ్‌కి వెళ్ళి గుంటూరు బస్సెక్కాం. బస్‌లో ఎవరైనా కనబడి అడిగితే ఏం చెప్పాలా అని దాదాపు అరడజను అబద్ధాలు ఆలోచించుకున్నాం. కానీ బాగా రష్‌గా ఉండటంతో ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు.

బస్ దిగాక రిక్షాలో ఇద్దరం గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళాం. ఆడవాళ్ళ విభాగంలో శోభ ఆ నర్స్‌ని వెదికి పట్టుకుంది.

"డబ్బులు తెచ్చావా? ఈ అమ్మాయికి కూడా కడుపు తీయాలా?" మొరటుగా అడిగిందా నర్స్.

నాకు కోపం, సిగ్గు, ఆవేశం ఒకేసారి కలిగాయి. 'ఛీ ఏమిటీ ఖర్మ' అనుకున్నాను. శోభ నా మొహం చూసి కంగారుగా చెప్పింది.

"ఛీఛీ. నా ఫ్రెండ్‌ని తోడు తెచ్చుకున్నా అంతే" బేగ్‌లోంచి డబ్బు తీసిచ్చింది.

"సరే, మధ్యాహ్నం రెండింటికి డాక్టరమ్మ భోజనానికి వెళ్తుంది. అప్పుడు పిలుస్తా. అప్పటిదాకా ఆ చెట్టుకింద కూర్చో" చెప్పి ఆ నోట్లని జేబులో పెట్టుకుని వెళ్ళిపోయింది.

"సారీనే. ఏమీ అనుకోవద్దు. నా మొహం చూసి ఊరుకో" శోభ బతిమాలుతూ చెప్పింది.

ఇద్దరం నర్స్ చూపించిన చెట్టుకిందకి వెళ్ళి కూర్చున్నాం. ఇద్దరికీ వాచీలు లేవు. దాంతో టైమెంతైందో తెలీదు. ఆకలేసినా ఆ వాతావరణంలో తినబుద్ధికాక బాక్స్‌లు బయటికి తీయలేదు. మౌనంగా కూర్చున్నాం.

సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆవిడ వరండాలోనుంచుని శోభని పిలిచింది. శోభ బిక్కమొహంతో బేగ్‌ని నాకిచ్చి వెళ్ళింది.

మా ఊరివాళ్ళు ఎవరైనా చూసి మా నాన్నకి చెప్తే ఆయన చంపేస్తాడు. ఈ శోభ కోసం ఎందుకు ఈ నరకంలోకి వచ్చాననే పశ్చాత్తాపంతో నాకు దుఃఖం వచ్చింది. ఆ వాతావరణం చీదరగా, అసహ్యంగా అనిపించింది. శోభ మీద కోపం వచ్చింది. నిస్సహాయంగా ఎవరికీ కనబడకుండా ఆ చెట్టుకింద కుర్చున్నాను. దాదాపు ముప్పావుగంట తర్వాత శోభ నీరసంగా నడుస్తూ వచ్చింది. రెండు బేగులని భుజానికి తగిలించుకుని గబగబా దాని దగ్గరకి వెళ్ళి, చెయ్యిపట్టుకుని రిక్షా మాట్లాడి ఎక్కించాను. బస్టాండ్‌లో సిద్ధంగా ఉన్న మా ఊరు బస్సెక్కి కూర్చున్నాం. బస్సు దిగి మా ఇంటికి వెళ్ళాదాకా దారిలో ఏమీ మాట్లాడుకోలేదు.

శోభని నా గదిలో కూర్చోపెట్టి మా అమ్మ దగ్గరికి వెళ్ళి చెప్పాను.

"అమ్మా! శోభ రెండు మూడురోజులు మనింట్లోనే ఉంటుంది. నాకు లెక్కలు నేర్పిస్తానంది."

"సరే, కబుర్లు చెప్పుకోకుండా బాగా చదువుకోండి" అమ్మ రెండు గ్లాసుల్లో కాఫీ పోసిచ్చి చెప్పింది.

ఆ గ్లాసులు తీసుకుని గదిలోకి వచ్చి తలుపుమూసి గడియపెట్టి, మంచం మీద నీరసంగా వాలిన శోభకి ఓ గ్లాసు ఇచ్చి అడిగాను.

"బాగా నొప్పిగా ఉందా?"

దాని కళ్ళవెంట నీళ్ళు కారాయి.

"మా అమ్మే నిన్ను పూని ఈ సహాయం చేసింది సుజీ. నిన్న మీ ఇంటికి రాబోయే ముందు మన ఊరి చెరువులో దూకుదామనుకున్నాను. జనాలు తిరుగుతూండటంతో మీ ఇంటికి వచ్చాను. ఇక జీవితంలో ఇలాంటి వెధవపని చెయ్యను. బాగా చదువుకుంటాను. సైంటిస్ట్ అవుతాను" కాఫీగ్లాస్ పక్కన పెట్టి ఏడవసాగింది.

"ఊరుకో. అంతా మంచేగా! కాఫీ తాగు. నర్స్ మందులేమైనా ఇచ్చిందా?" ఊరడించాను.

"నాకు నొప్పిలేదు సుజీ. కోపంగా ఉంది. బ్రహ్మ రాక్షసి పిన్నిమీద, చవటగా మారిన నాన్నమీద, నన్ను వాడుకున్న నిరంజన్ మీద. ఈ ప్రపంచం మీదే నాకు కోపంగా ఉంది." శోభ వెక్కి వెక్కి ఏడ్చింది.

మూడురోజులు మా ఇంట్లో విశ్రాంతి తీసుకున్నాక శోభ వాళ్ళింటికి వెళ్ళిపోయింది. నిరంజన్ అద్దెపుస్తకాల షాపుని మూసేసి ఊళ్ళోంచి పారిపోయాడు. మేమిద్దరం పరీక్షలు బాగా రాసాం. శోభ మా స్కూల్ ఫస్ట్ వచ్చింది. నేను ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. పై చదువులు చదివించనన్న తండ్రితో దెబ్బలాడి శోభ మేనమామకి ఉత్తరం రాసింది. ఆయన వచ్చి పంచాయితీ పెట్టి రెండెకరాల పొలం శోభ పేరున పెట్టించి, శోభని వాళ్ళ ఊరు తీసుకెళ్ళిపోయాడు. వెళ్ళబోయే ముందు శోభ నా దగ్గరకి వచ్చి నా చేతులు పట్టుకుని చెప్పింది.

"నేను మామయ్యతో నెల్లూరు వెళ్తున్నా సుజీ. రత్నం కాలేజీలో ఇంటర్‌లో చేరుతున్నా. ఇంక ఈ ఊరు రాను. గొప్పదాన్నవుతాను. ఎంతగొప్పదాన్నయినా నిన్ను మర్చిపోను. నేను పరువుగా వెళ్తున్నానంటే నువ్వేకారణం. సొంత అక్కా చెల్లి కూడా ఇంత సాయం చేయరు. రోజూ నిద్రలేవగానే నిన్నే తలుచుకుంటా. నువ్వూ బాగా చదువుకో. నీ మంచితనమే నీకు శ్రీరామ రక్ష."

శోభ వెళ్ళిపోయింది. నా చేతుల్లో తను పెట్టిన పన్నెండువందల రూపాయలు మిగిలాయి.

ఆ తర్వాత నేను తెలుగుమీడియంలోనే బి.ఏ చదివాను. రాజారావుతో పెళ్ళయింది. మంచివాడు, బేంక్‌లో పనిచేస్తున్నాడు అని నాన్న నా ఇరవైయ్యోఏటే పెళ్ళి చేసేసాడు. శుభలేఖని పంపడానికి శోభవాళ్ళింటికి వెళ్ళి నెల్లూరు అడ్రస్ అడిగాను. వాళ్ళ పిన్ని 'నాకు తెలీదు' అని ఇవ్వలేదు.

పెళ్ళయ్యాక హైద్రాబాద్ వచ్చేసాను. అందరూ మధ్య తరగతి ఇల్లాళ్ళలానే నా జీవితం కూడా పెద్దగా ఒడిదుడుకులు లేకుండా సాగింది. చాలామంది మధ్య తరగతి అబ్బాయిల్లా మా అబ్బాయికూడా యం.ఎస్. చేయడానికి అమెరికా వెళ్ళాడు. ఏడాదిన్నర తర్వాత వాడి చదువు పూర్తయింది. కాన్వొకేషన్‌కి అమెరికా రమ్మని, తను జాబ్‌లో చేరేలోగా మాతో గడపాలని ఉందని, తర్వాత బిజీ అవుతానని వాడు మమ్మల్ని బతిమాలి ఒప్పించాడు.

ఆమ్‌స్టర్ డేమ్‌లో మా తర్వాతి విమానానికి నాలుగ్గంటల టైం ఉంది. ఏర్‌పోర్ట్ చూద్దామని ఇద్దరం నెమ్మదిగా అన్నిగేట్లు చూసుకుంటూ తిరిగి రెండు గంటల తర్వాత మా గేట్ దగ్గరకి వచ్చాం. ఖాళీగా ఉన్న ఓ సోఫాలో కూర్చుని ఎదుటి సోఫాని చూస్తే, ఓ ఇండియన్ జంట కనిపించారు. ఆమెని చూడగానే నాకు శోభ గుర్తొచ్చింది. అవే పోలికలు. కాకపోతే మొరటుతనం తగ్గి నాజుగ్గా ఉంది. బాబ్డ్ హెయిర్. రంగుగా ఉంది. పక్కనే ఆమె భర్త హుందాగా అందంగా ఉన్నాడు.

"ష్! కొత్తవాళ్ళని అలా చూడకూడదు." రాజా నెమ్మదిగా మందలించారు.

"కాదండి. ఆమె మా శోభలా ఉంటేనూ" నేను ఆయన చెవిలో గొణిగాను.

ఇంతలో ఓ పదిహేనేళ్ళమ్మాయి మేకప్ కిట్‌తో వచ్చి ఆవిడతో చెప్పింది. "మమ్. నా కోంబ్ మర్చిపోయినట్లున్నాను."

నా సందేహం తీరిపోయింది. ఆ అమ్మాయి అచ్చం చిన్నప్పటి శోభలాగే ఉంది.

నేను లేచి ఉద్వేగంగా ఆమె దగ్గరకి వెళ్ళి పిలిచాను.

"శోభా."

శోభ ఉలిక్కిపడి నావంక తిరిగి, నన్ను పోల్చుకునే ప్రయత్నం చేస్తూ ఇంగ్లీష్‌లో అడిగింది.

"సారీ! ఎవరు మీరు?"

"నేను సుజాత. సుజీని" చెప్పాను.

తక్షణం శోభ మొహం నల్లబడింది.

"ఎలా ఉన్నావు? నెల్లూరులో నీ చదువు బాగా సాగిందా? మళ్ళీ మనూరు రాలేదే? మీ నాన్న మీద కోపం ఇంకా తగ్గలేదా? ఈ పాపని చూస్తే చిన్నప్పటి నువ్వే గుర్తొస్తున్నావు" నేను గలగల మాట్లాడుతూంటే శోభ స్పందన లేకుండా వింటూండిపోయింది.

రాజా నా చేతిని మృదువుగ నొక్కడంతో మాటలు ఆపి శోభ మొహంవైపు చూసాను. అయిష్టంగా, తిరస్కారంగా, ఇంకా పేర్లు పెట్టలేని ఎన్నో భావాలతో శోభ నావైపు చూస్తోంది. నన్ను గుర్తుపట్టిందని నాకు స్పష్టంగా తెలుసు. కానీ ఈ విధంగా ప్రవర్తిస్తుందని నేను అనుకోలేదు.

చివరికి మొక్కుబడిగా అడిగింది.

"బావున్నావా సుజీ."

శోభ భర్త పరిస్థితి గమనించి శోభ భుజం మీద మృదువుగా తట్టి నాతో చెప్పాడు.

"హలో అండీ. శోభకి తన ఊరన్నా, ఆ ఊరివాళ్ళన్నా ఎందుకో కోపం. పాపం చిన్నప్పుడు సవతి తల్లి పెట్టిన బాధలు మర్చిపోలేకపోతోంది. మీరు ఎక్కడికి వెళ్తున్నారు? యు.ఎస్.యేనా?"

"అవునండి. చిన్నప్పుడు మేమిద్దరం ప్రాణస్నేహితులం. ఇన్నేళ్ళ తర్వాత హఠాత్తుగా కనిపించడంతో నేను కొంచెం ఓవరాక్షన్ చేసాననుకుంటా."

బిడియంగా చెప్పాను.

"ఏ స్టేట్‌కి వెళ్తున్నారు?" నా మాటలు పట్టించుకోకుండా అడిగాడతను.

"మిషిగన్. ఏన్ ఆర్బర్ యూనివర్సిటీలో మా అబ్బాయి యం.ఎస్ చేసాడు. వాడి కాన్వొకేషన్‌కి వెళ్తున్నాం." రాజా చెప్పారు.

"ఓ! మేము డెట్రాయిట్‌లో ఉంటాం. శోభ, నేను ఇద్దరం అక్కడ డాక్టర్స్‌గా పనిచేస్తున్నాం." అతను చెప్పాడు.

నేను ఆనందంగా చెప్పాను.

"గొప్పదాన్నవుతానని చెప్పేదానివి శోభా. ఆ మాట నిలబెట్టుకున్నావు. నేను బి.ఏ చదివాను. తెలుగు మీడియం."

తను ముభావంగా చూసి తలూపింది.

"మా నాన్న పాము కరిచి పోయాడు. మా అన్నాయ్ గుర్తున్నాడా? సినిమా పిచ్చికదా వాడికి. సినిమాల్లోనే పనిచేస్తున్నాడు. కెమెరా డిపార్ట్‌మెంట్‌లో అమ్మ వాడి దగ్గరే ఉంది.." రాజా నా చేతిని మళ్ళీ నొక్కడంతో ఆపేసాను.

ఎటో చూస్తున్న శోభలో స్పందన లేదు. తర్వాత భర్తని అడిగింది.

"శాం! హెడేక్‌గా ఉంది. కాఫీ తాగుదామా?"

ఆ ముగ్గురూ హేండ్‌బేగేజ్‌తో కెఫ్టేరియా వైపు వెళ్ళిపోయారు. నేను అవమానంతో సోఫాలో కూలబడ్డాను. రాజా నన్ను మాట్లాడించే ప్రయత్నం చేయలేదు. కొద్దిసేపటికి బోర్డింగ్ కాల్ వినిపించింది. బిజినెస్ క్లాసువాళ్ళని ముందుగా ఎక్కమని ఎనౌన్స్ చేసారు. శోభ కుటుంబం క్యూలో వెళ్ళిపోయారు.

ఎకానమీ క్లాస్‌లో మా సీట్లలో కూర్చున్నాక రాజాకి మా టెన్త్‌క్లాస్‌లో జరిగిన ఆ సంఘటన చెప్పి బాధగా అడిగాను.

"అది వెళ్ళేప్పుడు నా బాకీ తీర్చి వెళ్ళుండచ్చు. కానీ నేను చేసిన సాయాన్ని, సేవని తిరిగి తీర్చగలదా? ఆ రోజు హాస్పిటల్‌లో మా వాళ్ళెవరైనా చూస్తే ఏమయ్యేది? ఎంత సాహసం చేశాను? నెల్లూరు వెళ్ళేప్పుడు ఏం చెప్పింది? నిద్రలేవగానే నన్నే తలుచుకుంటానంది. ఇప్పుడు ఎదురుగా కనబడినా నోరు విప్పి మాట్లాడలేకపోయింది. మనం దిగేది కూడా డెట్రాయిట్లోనే కదా. వాళ్ళింటికి రమ్మని పిలవచ్చుగా? అసలు మాట్లాడడానికే నేను పనికిరాకపోతే ఇంక ఇంటికి పిలుస్తుందా ఏంటి? అసలు అంత సాయం చేసిన దాంతో ఇలాగేనా ప్రవర్తించేది?"

రాజా చిన్నగా నవ్వి చెప్పారు.

"దాన్ని ఆత్మన్యూనతా భావం అంటారు."

"సంస్కృతం కాదు. తెలుగులో చెప్పండి" విసుక్కున్నాను.

"తెలుగే బంగారం. శోభ చిన్నప్పటి విషయాలేం మర్చిపోలేదు. ఆ కసితో బాగా చదివి డాక్టరై, మరో డాక్టర్‌ని పెళ్ళి చేసుకుని అమెరికాలో స్థిరపడింది. తెల్లకాగితంలాంటి ఆవిడ జీవితంలోని నల్లటి మచ్చని గుర్తు తెచ్చే నీతో ఎలా మాట్లాడుతుంది? నిన్ను చూసినప్పుడల్లా గిల్టీతోనో లేక సిగ్గుతోనో కుంచించుకుపోయే పరిస్థితిని ఎందుకు రానిస్తుంది? ఆ సంఘటన గురించి తెలిసిన ఏకైక సాక్షివి నువ్వు. నీ ముందు తన భర్తతో, కూతురుతో మామూలుగా ఉండగలదా? అందుకే పాపం అలా ప్రవర్తించింది" రాజా వివరించారు.

ఆ పదిగంటల విమానప్రయాణంలో ఆలోచిస్తే నాకు ఆ వాదన నిజమే అనిపించింది. శోభ మీది కోపం తగ్గిపోయింది.

డెట్రాయిట్‌లో దిగాక నా కళ్ళు శోభ కోసం వెదకలేదు. ఎదురొచ్చిన మా అబ్బాయిని ఆప్యాయంగా అల్లుకుని వాడితో బయటకి నడిచాను.

**నేను చాలాకాలం** నడుం నొప్పి, డొక్కలో నొప్పితో బాధపడ్డాను. విజయా హాస్పిటల్ డాక్టర్ సుబ్బారావుగారి దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటూ వచ్చాను. ఒకరోజు పొద్దున్న బాధ ఎక్కువై విలవిలలాడిపోయాను. తట్టుకోవడానికి కాలేదు. సుబ్బారావుగారికి ఫోన్ చేస్తే, ఆయన ఊళ్ళోలేరన్నారు. అప్పుడు రామాపురంలో యం.ఐ.ఓ.టి. అనే పెద్ద ఆర్థోపెడిక్ హాస్పిటల్ సొంతంగా కట్టుకున్న డా.మోహన్‌దాస్ వద్దకు పరుగెత్తాను. ఆయన అంతకు ముందు ఎన్నో సంవత్సరాలు విజయా హాస్పటల్‌లో పని చేసేవారు. ఆ సమయంలో నేను ఆయన పర్మనెంట్ పేషంటుని. ఎన్నో ట్రీట్‌మెంట్స్, ఎన్నో ఫిజియోథెరపీలు తీసుకునే దాన్ని. నా సమస్యలన్నీ ఆయనకు బాగా తెలుసు. చాలాకాలం తర్వాత వెళ్ళినా కూడా ఆయన నన్ను గుర్తుపట్టారు. మొదట్నుంచీ ఆయన దగ్గరే పనిచేస్తున్న డాక్టర్ బ్యారీ కూడా నన్ను బాగా రిసీవ్ చేసుకున్నాడు. అందుకని ఆలస్యం చెయ్యకుండా నన్ను లోపలికి తీసుకెళ్ళి, ఎక్సరే తీయించారు. కొన్ని స్ట్రాంగ్ మందులు, ఇంజక్షన్లు రాసిస్తే, వాటిని రెండు నెలలపాటు తీసుకున్నాను.

ఒక ఏడాదిపాటు దేవుడు, పూజ ఏమీ లేకుండా మేడ మెట్లెక్కి దిగకుండా కాలం గడిపాను. చెయ్యడానికి మనుషులున్నారు గనక సరిపోయింది. క్రితం సంవత్సరం ఒకసారి కిందపడి, పాదం వాచి అదే డాక్టరు దగ్గరికి వెళ్ళాను. ఆయనే ఫ్రాక్చర్ అయ్యుంటుందని ఊహించుకున్నారు కాబోలు. ఎక్సరే తీసి చూసి, ఫ్రాక్చర్ అవలేదని "యు ఆర్ లక్కీ, నో ఫ్రాక్చర్" అన్నాడు. ఇంజక్షన్ ఇచ్చి, బ్యాండేజ్ కట్టించాడు. "అలా అస్తమానం పడొద్దమ్మా. ఈసారి పడ్తే మీరు లేవలేరు. బెడ్ మీద ఉండవలసి వస్తుంది" అన్నారు.

అప్పటికి నా వయసు అరవై, చలాకీగా తిరిగే నాకు ఇలాంటి పరిస్థితి వచ్చిందే అని భోరున ఏడ్చేదాన్ని. ఎందుకైనా మంచిదని దగ్గర్లో ఉన్న మా ఫ్యామిలీ డాక్టరు త్యాగరాజుగారిని మా ఇంటికి పిలిపించి, మావారు ఆయనతో అన్ని విషయాలూ చెప్పారు. ఒక్క క్షణం

ఆగి, డాక్టరుగారు "ఆవిడ పడుతున్న నడుము నొప్పి బాధకన్నా, లేచి తిరగలేక పోతున్నాననే బాధ ఎక్కువగా పీడిస్తోంది" అన్నారు. ఆయన నా సైకాలజీ కరెక్టుగా కనిపెట్టారు. ఆ తర్వాత డా.సుబ్బారావుగారిని వెళ్ళి కలుసుకుంటే - వంగకూడదు, కింద కూచోకూడదు. ప్రయాణం చేస్తున్నప్పుడల్లా గంటల తరబడి కూర్చున్నప్పుడు ఉపయోగించుకోడానికి నడుము బెల్టు రాసిస్తే దానిని కొని అప్పట్నుంచి ఇప్పటి వరకు ఉపయోగిస్తున్నాను. అప్పుడు పూజలు కింద పీట మీద కూర్చుని చెయ్యకుండా ఉండేందుకు మా వారు దేవుడి గదిలో మూడు అడుగుల ఎత్తున ఒక గ్రానైట్ స్లాబ్ వేయించారు. నేను దేవుళ్ళని దానిమీద పెట్టుకున్నాను. అందువలన నేను నిల్చోనైనా పూజ చేసుకోవచ్చు. లేకపోతే ఒక ఎత్తయిన స్టూలు మీద కూర్చోనైనా పూజ చేసుకోవచ్చు.

ఈ ఇంట్లో ఉండగానే మా వారు "ఘటోత్కచ్" అనే ఏనిమేషన్ సినిమా తీసారు. నిర్మాత హైదరాబాదులోని సూర్యదేవర వినోద్. సగం పని అయిన తర్వాత ఫిలిప్పైన్స్‌కు వెళ్ళవలసి వుండింది. ఎందుకంటే ఎక్కువ ఏనిమేషన్ పనంతా ఫిలిప్పైన్స్‌లోనే జరుగుతూ ఉండింది గనక. నిర్మాత వినోద్ ముందే మనీలాకి వెళ్ళారు. మరొక ఏనిమేటరు దీపక్ అనే ఆయన కూడా అక్కడే ఉన్నారు. ఇద్దరూ ఒక ఫ్లాట్‌లో ఉండేవారు. ఇష్టమైతే వండకునేవారు. లేకపోతే బయట నుంచి తెచ్చుకునేవారు. నాన్‌వెజ్ గనక ప్రాబ్లమ్ ఉండేది కాదు. మేము వెళ్ళిన మర్నాడు వినోద్‌తో చెప్పాను. "మేం ఉన్నన్నాళ్ళు నేనే వంట వండుతా"నని, మిక్సీ, ఎలెక్ట్రిక్ స్టవ్, కొన్ని సామాన్లున్నందున నాకు ఏ ఇబ్బంది కలగలేదు. ఇన్నాళ్ళకి మళ్ళీ ఇంటివంట తినేసరికి వాళ్ళిద్దరికీ ప్రాణం లేచి వచ్చినట్లయింది. మేము ఫిలిప్పైన్స్‌లో రెండువారాలున్నాం. ఆ సమయంలో వినాయకచవితి పండగ వచ్చింది. ముందుగానే ప్లాన్ చేసి వినాయకుడి ఫోటో, పూజ కథాపుస్తకం మాతో తీసుకెళ్ళాం. పూజా విధానం, కథ చదవడం అంతా మా వారే చేసారు. వినోద్, దీపక్ కథ సమయానికి వచ్చి, చక్కగా కథ విని వెళ్ళారు. తరువాత మేము మనీలా చూడాలంటే, వినోద్ ఒక అసిస్టెంటును పంపిస్తే, అతని భార్య కూడా మాతో వచ్చింది.

మనీలాలో పని కాగానే మేము తిరుగుప్రయాణంలో బేంకాక్‌లో దిగాము. అక్కడ అంబుజమామి కూతురు జయశ్రీ అల్లుడు మమ్మల్ని ఎయిర్‌పోర్టుకు వచ్చి రిసీవ్ చేసుకున్నారు. జయశ్రీ భర్త ముకుందన్ ఒక బిస్కెట్టు ఫ్యాక్టరీలో పెద్ద ఉద్యోగంలో ఉండేవాడు. వాళ్ళ ఇల్లు ఊరికి చాలా దూరం. మూడురోజులు వాళ్ళింట్లోనే ఉన్నాం. మాకు బిస్కెట్ ఫ్యాక్టరీ, సైట్ సీయింగ్, షాపింగ్‌లకి పిలుచుకెళ్ళారు. అక్కణ్ణుంచి ఊళ్ళోకి వచ్చి మన్‌హాట్టన్‌లో హోటం రూం తీసుకున్నాం

ఆ హోటలు చుట్టూ షాపులు, మాల్స్, సూపర్ మార్కెట్లు, హోటలు ఉన్నాయి. ఇవన్నీ ఆటోకి దగ్గర నడకకి కొంచెం దూరం. కొద్ది దూరంలో దోస సెంటర్ అనే హోటల్ వుంది. దోస సెంటర్ కాక శరవణ భవన్‌లాగే మరొక హోటల్ వుంది. అక్కడ లంచ్, డిన్నర్ అంతా వుంటుంది. వాడు తమిళవాడు. మేము తమిళంలో మాట్లాడుతుంటే వాడికి సంతోషం వేసేది. సినిమావాళ్ళు షూటింగ్ నిమిత్తం వచ్చి తన హోటల్‌కి వచ్చేవాళ్ళని ఒక ఆల్బమ్ చూపించాడు. మీరు మళ్ళీ వచ్చినప్పుడు మీ ఫోటో కూడా ఈ ఆల్బమ్‌లో ఉంటుందన్నాడు. హోటల్ నుంచే ఒక టాక్సీ మాట్లాడుకుని గోల్డెన్ బుద్ధా, ప్యాలెస్, అచ్చు మనుషుల్లా వుండే బొమ్మలు, మ్యూజియంలాంటి వన్నీ చూసి ఇండియాకి తిరిగి వచ్చేసాము.

మావారు రెండోసారి అమెరికాకి వెళ్ళవలసి వచ్చింది. పెంటామీడియా వాళ్ళు ఈసారి అక్కడే పనిచేస్తున్న మా అల్లుడు సతీష్‌ని కూడా పంపించారు. లాస్ ఏంజలిస్‌లో ఒకసారి మేము పగడాలు, రూబీ, సెఫైర్, ఎమరాల్డ్ లాంటివి ఎక్కడ దొరుకుతాయి అని అడిగితే అక్కడివాళ్ళు ఒకచోటు చెప్పారు. సరేనని నేనూ, మావారు, అల్లుడు సతీష్ ఒక షాపుకు వెళ్ళాను. ఒకవైపు షాపువాడు చూపిస్తుంటే, వేరొక వైపు ఇండియన్స్, జీన్స్ ప్యాంటు షర్టు వేసుకుని నలుగురు, ఐదుగురు కూడా ఆ ముత్యాలు చూస్తున్నారు నేనూ, మావారు ఇవి చూస్తుంటే మా సతీష్‌తో అందులో ఒకామె "ఇండియాలో మదరాసులో మా అంకుల్ ఒకాయన ఉన్నారు. ఆయన పేరు సింగీతం శ్రీనివాసరావు ఆయన సినిమా డైరెక్టరు" అని చెప్పిందట.

మా సతీష్ వెంటనే "ఆయన మీ వెనకాలే ఉన్నారు" అన్నాడట. మొదట ఆమె నమ్మలేదట, మావారు వెనక్కి తిరిగి వాళ్ళున్నచోటకి వెళ్ళారు. "నేనే సింగీతం శ్రీనివాసరావు" అని చెప్పేసరికి ఆ అమ్మాయి "నేను మీ కజిన్ సిస్టర్ లలిత కూతురుని" అన్నది. మావారు "లలిత కూతురు మహాలక్ష్మి అనే అమ్మాయి ఒక్కతే" అంటే, "నేనే మహాలక్ష్మిని" అంది. అనుకోకుండా కలిసినందుకు రెండు వైపుల వారికి ఆనందం, ఆశ్చర్యం కలిగింది. ఆవిడ మరెవరో కాదు పేరు మహాలక్ష్మీ మిసెస్ యం.కె.ఆశోక్‌రావు. మా వారికి పెద్ద తల్లి మనవరాలు, ఆవిడకు మావారు మేనమామ వరస అవుతారు. చిన్నప్పుడు ఆమెను ఎత్తుకుని మావారు తిరిగేవారట. రెండు సంవత్సరాలు తరువాత తన కొడుక్కి పెళ్ళి చేసింది. కానీ చనిపోయిన ఆవిడ అమ్మ కోరిక ప్రకారం రిసెప్షన్ ఇండియాలో పెట్టుకుంది. అదీ మదరాసులోనే. మేమంతా వెళ్ళి వచ్చాం.

మేము లాస్ ఏంజలిస్‌లో ఉన్నప్పుడు మా సినిమా లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేసిన రేన్‌డీట్రో అనే అతనితో పరిచయం అయింది. అతను అప్పుడప్పుడు మా అపార్టుమెంట్‌కు వస్తుండేవాడు. అతను కొంచెం చిన్న వాడైనందున సతీష్‌తో చాలా ఫ్రెండ్లీగా వుండేవాడు. అతనికి ఇండియన్ భోజనం అంటే ఇష్టం. అతని కారులోనే తిరిగేవాళ్ళం మేము. హోటల్‌కు కూడా అతనితోనే తిరిగేవాళ్ళం. ఒకసారి ఇంగ్లీషు తేదీ ప్రకారం అతని పుట్టినరోజు, తెలుగుతేది ప్రకారం విజయదశమినాడు మావారి పుట్టినరోజు వచ్చాయి. అతను ఒక హోటల్‌కి మమ్మల్ని పిల్చుకెళ్ళి వాళ్ళ తల్లిదండ్రులను, చెల్లెళ్ళను కూడా పిల్చుకు వచ్చాడు. ఆ అమ్మాయిలు వచ్చిన ముఖ్య కారణం నేను చీర ఎలా కట్టుకుని వున్నానో చూడ్డానికి. ఒక కేకు ఏర్పాటు చేసాడు. మా వారు, రేన్‌డీ కలిసి కేకు కట్ చేసారు. వచ్చేటప్పుడు అతనికి మా సతీష్ ఒక దుప్పటి బహూకరించాడు. పెంటామీడియాలో పనిచేసే కిమ్ అనే అమ్మాయికి, హిర్మా అనే అమ్మాయికి కూడా మేము తీసుకొచ్చిన జుబ్బా, లుంగీలు, తువ్వాలు బహూకరించాము.

ప్రొడక్షన్ చూసుకుంటున్న కిమ్ అనే అమెరికా అమ్మాయి ఏర్పాటు చేసిన అపార్టుమెంటే మేమున్న బస. ఆ అమ్మాయి రోజూ పొద్దున్న 9.00గంటలకి మా వారిని, సతీష్‌ని పెంటామీడియా ఆఫీసుకు పిల్చుకెళ్ళి మళ్ళీ మధ్యాహ్నం దిగబెడ్తూ ఉండేది. మేముండే అపార్ట్‌మెంట్ ఇప్పుడు ఆస్కారు ఫంక్షన్ చేసే హాలుకు అనుకునుంది. దానికీ మేమున్న అపార్టుమెంటుకీ మధ్య ఒక గోడ అడ్డం. మేం వెళ్ళినప్పుడు ఆ భవనం కడ్తూండేవారు. మేము రోజూ వరండాకు వస్తే, ఆ కట్టడాల పనంతా కనిపించేది.

అమెరికాలో ఒక చిన్న దంపతులు పరిచయమయ్యారు. వాళ్ళది ఇండియానేనట, వాళ్ళది కర్నాటకేనట, అక్టోబరు 9న నా పుట్టినరోజు అని మాటల్లో వాళ్ళు తెలుసుకుని చాలాదూరంలో వున్న వెంకటేశ్వర స్వామి గుడికి పిల్చుకెళ్ళారు. అక్కడ అంతా నిశ్శబ్దం. ఏదో ఉపన్యాసం చెప్తుంటే, అందరూ చాలా నిమగ్నులై వింటున్నారు. ఇంతలో మేము ఏదో కొంచెం మెల్లగా మాట్లాడేసరికి "ఉష్ నో టాకింగ్" అని మా నోరు నొక్కారు. అమెరికాలో ఇలాంటి భక్తులు ఉన్నారా అనిపించింది. బహుశా ఇండియా నుండి దూరం వెళ్ళిన తరువాతే ఇక్కడి నిజమైన భక్తిని తెలుసుకుంటున్నారేమో.

తరువాత వాళ్ళను మేము గుడి నుంచి వచ్చేదారిలో వున్న దాస్‌ప్రకాస్ అనే ఇండియన్ హోటల్‌లో మేమే ట్రీట్ ఇచ్చాక మళ్ళీ మమ్మల్ని వాళ్ళు ఇంటివద్దనే దింపి వెళ్ళారు.

అమెరికాలో నివాసం ఏర్పరుచుకున్న ఇండియన్ వ్యాపారవేత్త, శైలేష్ మొహతా. అతని మేనల్లుడిని పిల్చుకుని మా అపార్టుమెంటుకు వచ్చి, అతను పాటలు బాగా పాడ్తాడని మావారికి పరిచయం చేసారు. వాళ్ళందరికీ కూల్‌డ్రింకు ఇచ్చాను. మమ్మల్ని శైలేష్ మెహతా వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించి వెళ్ళాడు. ఒకరోజు వచ్చి మమ్మల్ని వాళ్ళ ఇంటికి పిల్చుకెళ్ళి రాజ్‌భవన్‌లాంటి ఆయన ఇల్లు చూపించి మొత్తం అందులో ఉన్న గదులన్నీ చూపించి, చూచాయగా ఇది షూటింగ్ నిమిత్తం చాలా బాగుంటుందని మావారితో అన్నాడు. ఆయన ఇల్లు ఊరికి చాలాదూరం. అక్కడ్నించి మమ్మల్ని అమెరికన్ జేడ్, పగడాలు కొనాలంటే అక్కడికి పిల్చుకెళ్ళి, మేము షాపింగ్

అంతా చేసుకున్న తరువాత రాత్రి ఇండియన్ హోటల్‌కి పిల్చుకెళ్ళి, డిన్నర్ అయిన తరువాత మమ్మల్ని ఇంట్లో వదిలి వెళ్ళారు. మేమింటికి వచ్చేసరికి సతీష్, అతని కజిన్ బ్రదర్ సంజయ్ కలిసి వండుకుని తిన్నారట. శైలేష్‌గారు సతీష్‌ని కూడా పిలిచారు కానీ సతీష్, అతని కజిన్‌తో డిస్నీలాండ్ చూడాలని మాతో రాలేదు. రెండు రోజుల తరువాత మమ్మల్ని గుడికి పిల్చుకెళ్ళిన యువదంపతులు భోజనానికి పిలిస్తే వెళ్ళి వచ్చాం.

ఈ సందర్భంలోనే హిందీ సినీనటుడు రాజేంద్ర కుమార్ మా వారి "పుష్పక్ విమానం" హిందీలో "పుష్పక్" పేరుతో విడుదల చేసి, తర్వాత మా వారి దర్శకత్వంలో, "ఫూల్" అనే సినిమా నిర్మించడంవల్ల మా వారు పరిచయం అయ్యారు. రాజేంద్రకుమార్ కూతురు, అల్లుడు అమెరికాలో ఉన్నారు. ఆయన అల్లుడు అమెరికాలో మేమున్న విషయం తెలుసుకుని, ఒకరోజు వాళ్ళమ్మాయి పుట్టినరోజునాడు హోటల్‌కి ఆహ్వానిస్తే వెళ్ళివచ్చాం.

అమెరికానుంచి తిరిగి వచ్చిన కొద్దిమాసాలకే ఇదే పిక్చరు పనిమీద మళ్ళీ అక్కడికి వెళ్ళాల్సి వచ్చింది. అంటే మొదటిసారి వెళ్ళి చేసుకున్న పనులు ఫలించి, ఈసారి వివరంగా మిగతా టెక్నీషియన్లు, అంటే హాలివుడ్‌లోని కెమెరామెన్, ఆర్ట్‌డైరెక్టర్ యూనిట్ అంతా సెలెక్ట్ చేయడానికి వెళ్ళాలి. ఈసారి హాలివుడ్‌లో ఓ రెండు మాసాలన్నా వుండవలసి వస్తుంది. ఇప్పటికే సతీష్ కంపెనీలో చాలామంచి పేరు సంపాదించుకున్నారు. అందుకని సతీష్‌ని కూడా మాతో అమెరికా పంపించారు. మాకొక అపార్టుమెంటు ఇచ్చారు. వంట చేసుకోవడానికి రూము, పడకగదులు, అన్నీ వుండేలా. నేను ఇక్కడినుంచి బియ్యం దగ్గరనుంచి పిండ్లు, నెయ్యి, పైగా ఊరగాయలు అన్నీ ప్యాక్ చేసుకున్నాను. ఎవరో అన్నారు. అక్కడ ఎయిర్ పోర్టులో కుక్కలు వాసన పసిగట్టి మేము ఏం తెచ్చామో పసికడతాయని, ఇవన్నీ అమెరికాలోనికి వెళ్ళడానికి ఎయిర్‌పోర్టులో ఒప్పుకోరని పలురకాలుగా చెప్పారు. పైగా నేను ముందుగానే మా సుధ స్నేహితురాళ్ళు అమెరికాలో ఉంటున్నారు కదా అని వాళ్ళ తల్లులకు ఫోన్ చేసి, ఏమి తీసుకెళ్ళవచ్చు, ఏం తీసుకెళ్ళకూడదు అని ముందుగానే కనుక్కుని పెట్టుకున్నాను.

ఎయిర్‌పోర్టుకు వెళ్ళిన తరువాత అక్కడక్కడ తగిలించి ఉన్న కుక్కల బొమ్మల్ని చూడగానే నాకు పై ప్రాణాలు పైనే లేచిపోయాయి. చచ్చీ చెడీ ఊరగాయలు, పొడులు సైతం ప్యాక్ చేసుకొచ్చానే, ఏమవుతుందో ఏమోనని. కానీ మమ్మల్ని ఎంత భయపెట్టారో దానికి విరుద్ధంగా అయింది. ప్రాబ్లమ్ లేకుండా అమెరికా చేరాము .నా డైలీ పని కాఫీలు అయినతరువాత ఇండియా నుంచి తెచ్చిన ఇడ్లీ  ఇన్‌స్టంట్  పౌడర్‌తో ఇడ్లీలు, అవికాక  ఉప్మా, పొంగల్ చేసేదాన్ని. అప్పుడప్పుడు మా సతీష్ కార్న్‌ఫ్లేక్స్ తెస్తే అది తినేవాళ్ళం. కానీ ఇడ్లీ పిండి ఎన్నాళ్ళు వుంటుంది? సతీష్ బజారు నుండి ఒక మిక్సీ గ్రైండర్ తీసుకొచ్చారు. ఇక పెసరట్లు, దోసెలు, పచ్చళ్ళు కూడా చేస్తుండేదాన్ని మధ్యాహ్నం వంటకి. రాత్రిళ్ళు బయటికి వెళితే ఏదో తెచ్చుకుని అన్నం తినేవాళ్ళం.

మేము ముగ్గురం రోజూ సాయంత్రం పూట అలా వాకింగ్‌కి, షాపింగ్‌కి వెళ్ళేవాళ్ళం. దూరం అయితే టాక్సీ చేయించుకుని వెళ్ళేవాళ్ళం. మావాళ్ళు భోజనానికి రాకపోతే, పెంటామీడియా ఆఫీసు వాళ్ళే తెప్పిస్తే అక్కడే భోజనం చేసేవాళ్ళం.

ఒకరోజు కనిపెట్టాం. దూరాన ఒక ఇండియన్ హోటల్ ఉందని, పేరు 'పారు హోటల్' కానీ టాక్సీ ఎక్కి చాలా ఖర్చుపెట్టి వెళ్ళవలసి వచ్చేది. హోటల్ వాడు తమిళవాడు. వాడు అమిత సంతోషంలో తమిళంలో "మామి, వాంగో వాంగో (మామి రండి రండి)" అని ఆహ్వానించేవాడు. ఆ సమయంలో మా వారికి ఇండియాలో రామోజీరావుగారి నిర్మాణంలో "ఆకాశవీధిలో.." షూటింగ్ సగం పూర్తయింది. దాంట్లో నాగార్జున రవీనాటాండన్ హీరో, హీరోయిన్లు. ఇంకొక జంట రాజేంద్రప్రసాద్, కస్తూరి. ఆ సినిమాలో ఒక ఎలుగుబంటితో కొన్ని సీన్లు ఉన్నాయి. హీరో, హీరోయిన్లు ప్లేన్ క్రాష్ అయితే ఒక అడవిలో వుంటూ ఎలుగుబంటి ఎదురై నానా అవస్థలు పడతారు. దానిని మొత్తం ప్రొడక్షన్ వాళ్ళు కెనడాలో వేంకోవర్ దగ్గర షూటింగు పెట్టుకున్నారు. అందుకుగాను మావారు అమెరికాలో

ఉన్నప్పుడే పదిరోజులు కెనడా షూటింగ్‌కి కేటాయించారు. సరే, నేనూ, వారు వెళ్ళాం. అది ఒక అడవి అవడం మూలాన నేను ఒకటి రెండురోజులు వెళ్ళి మళ్ళీ వెళ్ళలేదు.

ఒకరోజు రాత్రి ఏదో ఒక చైనా షాపు వుందంటే బస్సులో వెళ్ళాం. రాత్రి పదిగంటలు దాటింది. బస్సు దిగేసరికి అక్కడ చైనా షాపు కనిపించలేదు సరికదా, అక్కడంతా నిర్జీవంగా భయంకరంగా వుంది. అక్కడక్కడ కొందరు బ్లాక్ కెనడియన్లు సిగరెట్ తాగుతూ నిలబడి ఉన్నారు. మాకేం చేయాలో తోచలేదు. ఈలోగా ఒక బస్సు వస్తే దాన్ని ఆపబోయాం. కొన్ని గజాలు పోయినతర్వాత బస్సు ఆగింది. పరిగెత్తి బస్సెక్కి మళ్ళీ హోటల్ చేరుకుని హమ్మయ్య అనుకున్నాం. ఈ సంగతి హోటల్‌లో చెబితే "అయ్యయ్యో అక్కడికి ఎందుకు వెళ్ళారు. అది చాలా డేంజరస్ ఏరియా. పది డాలర్లకు ఏమైనా చేస్తారు" అన్నారు. మేము కెనడాలో చేసుకున్న షాపింగులో మాకు బాగా నచ్చింది బొచ్చుతో ఉన్న కుక్కబొమ్మ. అదిప్పటికీ మా హాలులో ఉంటుంది. దాన్ని చూసి అందరూ నిజమైన కుక్క అని అనుకుంటుంటారు.

"ఆకాశవీధిలో" షూటింగప్పుడు ఒకసారి ఉషాకిరణ్ మూవీస్ గెస్ట్‌హౌస్‌లో మావారితోపాటు వుండి వారం అయిన తరువాత వచ్చేసాను. కొన్నిరోజుల తరువాత రామోజీ ఫిలిం సిటీలో షూటింగ్ అయితే నేను కూడా వెళ్ళి సితారా హోటల్లో వుంటూ వచ్చాను. ప్రొడక్షన్ వాళ్ళంతా బాగా చూసుకునేవారు. అయినా మా వారితో అన్ని షెడ్యూళ్ళకీ వెళ్ళకపోయినా పిక్చరు ముగిసేలోపుగా కొన్నాళ్ళు వుండి వస్తుండేదాన్ని.

రామానాయుడు గారి సినిమా 'విజయం' షూటింగ్ సమయంలో ఒకటి రెండురోజులు గ్యాప్ వస్తే 'ఐతే' సినిమా చూడ్డానికి హైదరాబాదులోని థియేటర్‌కి వెళ్ళాం. సినిమా చాలా బాగుంది. ఇంటరెస్టింగ్‌గా, సస్పెన్స్ గా ఉంది. మావారు ఇంటర్‌వెల్‌లో వెళ్ళకుండా లైట్లన్నీ ఆర్పిన తర్వాత చీకట్లో బయటికి వెళ్ళి లోపలికి వస్తుండగా మెట్లు తట్టుకుని కిందపడ్డారు. ఆ పడ్డంలో కుడిచేతివేళ్ళ మీద పడ్డంతో ఆ బరువంతా దానిమీద పడి వేలు వాచిపోయింది. కానీ థియేటర్‌లోనే కూర్చుని ఇంకా సినిమా ఒక గంటే కదా అని సినిమా పూర్తయ్యేవరకూ అక్కడే ఉన్నాం. రానురాను నొప్పి యెక్కువవడం మొదలుపెట్టింది. ప్రొడక్షన్ కారు కనుక మొదట అపోలో హాస్పటల్‌కి వెళితే డాక్టరు లంచ్‌కి వెళ్ళినందున యశోదా హాస్పటల్‌కి వెళ్ళాం. అక్కడ కూడా చీఫ్ డాక్టర్ లంచ్‌కి వెళ్ళారు. ఆయన ఆర్థోపెడిక్ డాక్టర్ కదా, వాళ్ళ అసిస్టెంట్ డాక్టర్లు మాత్రం ఉన్నారు. వాళ్ళు మా వారు ఫలానా అని తెలుసుకుని కూర్చోబెట్టి, ఒక మూల మా ఆయన నొప్పితో బాధపడుతుంటే 'విచిత్రసోదరులు' పొట్టివాడిలాగా ఎలా చేశారు? మైకెల్ మదన కామరాజు కథ, మయూరి చాలా బాగుందని, ఆదిత్య 369లాంటి వెరైటీ సినిమాలే చేస్తారని, అలాగని, ఇలాగని మావారిని పొగుడుతూ ఉన్నారు. నా పరిస్థితి ఒకవైపు మావారిని చూసి జాలి, ఆయన పడ్తున్న వేలి బాధని చూసి ఏడుపు వస్తోంది. చివరికి పెద్ద డాక్టరు వచ్చి ట్రీట్‌మెంటు యిచ్చారు. మేము సురేష్ గెస్ట్‌హౌస్‌కి వచ్చేసరికి సాయంత్రం 4.30 అయింది. అప్పుడు మా భోజనాలు, రెండు మూడురోజుల వరకు నేనే ఫీడ్ చెయ్యవలసి వచ్చింది భోజనం. ఒక్కోసారి మనకు తెలియకుండా ఇలాంటి సంఘటనలు జరుగుతూంటాయి.

**ఒకసారి** రామానాయుడిగారి సినిమా 'విజయం' షూటింగ్‌కి మావారు వెళ్ళారు. అప్పుడు మా చిన్నమ్మాయి సుధ, బాబు చదువువల్ల మా ఇంట్లోనే ఉండేది. వాళ్ళాయన పాండిచ్చేరీలో ఉద్యోగం. ఇదీ కొడుకు సెలవులకి వెళుతూ, మదరాసుకి వస్తూ కాలం గడిపేవారు. ఒకసారి శని, ఆదివారాల్లో మా పెద్దమ్మాయి శకుంతల కూతురు స్నేహ కూడా మా యింటికి వచ్చింది. మా సుధ ఏమో రాత్రిళ్ళు దాని కొడుకుని దగ్గరుండి చదివిస్తుంటే చిన్న క్లాసులలో చదువుకుంటున్న మా రమ కొడుకు అనంతు, కూతురు అంజు, స్నేహ కూడా అందరూ మేడమీద హాలులో కూర్చుని చదువుకునేవారు. అలాగే ఒకరోజు చదువుకుంటున్నారు. మా వారు ఊర్లో లేరు. నేను

మామూలు ప్రకారం నిద్రమాత్ర వేసుకుని నా రూములో ఒక్కదాన్ని పడుకున్నాను. పిల్లలందరూ మా సుధ రూములో పడుకునే ప్లాను. నేను తెల్లవారుఝామున 3.30 గంటలకి బాత్రూమ్‌కని లేచి మంచినీళ్ళు తాగి, ఈ పిల్లలు లైట్లు, ఫ్యాన్లు ఆర్పారో లేదో చూద్దామని నా గది తలుపు తీసాను. హాలులో బెడ్‌లైటు వెలుగుతోంది. లైట్లు, ఫ్యాన్లు ఆర్పివున్నాయి. తక్కున హాల్లోంచి యెవరో వెనక్కి పరిగెత్తినట్లనిపించింది. నిద్ర మత్తులో నాకేం తెలియలేదు. ట్యూబ్ లైటు ఆన్ చేశాను. హాలు వెనక వైపు తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. అక్కడ చెక్క తలుపు వెనకాల ఒక కటకటాల తలుపు కూడా ఉంది. రెండింటికి తాళం పెడతాము మేము. ఇదేంటి? సుధ ఇంత అర్ధరాత్రి తలుపు తెరిచి కొడుకు బట్టలు ఆరేస్తుందో అనుకుని 'సుధా' అని దాని రూం తలుపు తట్టాను. ఎంత తట్టినా తలుపు తీయలేదు. నాకనుమానం వచ్చి "ఎవరు? ఎవరు?" అంటూ కటకటాల తలుపు వెనకాల వరండాలోకి పరిగెత్తి చూస్తే, అప్పటికే ఒకడు మా గోడ నుంచి సన్‌షేడ్ మీదకు దూకి, పక్కవాళ్ళ ఇంటిగుండా కిందికి దూకి ఒక సంచి సైడుకి తగిలించుకుని వెళుతున్నాడు. నేను ఆతుత కొద్ది "ఎవరు? ఎవరక్కడ" అని అరుస్తున్నాను. వెనక వైపు ఉన్న వీధి లైటు వెలుగులోంచి ఒక మనిషి వెళుతుండడం చూసాను. వెంటనే మా వాచ్‌మెన్‌ని "సుబ్బయ్యా, సుబ్బయ్యా" అని పిలిచాను. అతని నుంచి సమాధానం లేదు. ఏం చేయడానికి తోచక కిందకి వెళ్ళి అతన్ని పిలుద్దామని వెనక్కి తిరిగాను. వెనక తలుపు గొళ్ళాలు ఊడపెరికి ఉన్నాయి. నేను హాల్లోకి వెళ్ళేసరికి సుబ్బయ్య పైకి వచ్చాడు వెనకాలే నా అరుపులు కింద బెడ్ రూంలోంచి విన్న మా రమా, పూర్ణా పైకి వచ్చారు. సుబ్బయ్యను అడిగాను. "నే తలుపులు తీయలేదుకదా? ఎలా వచ్చావు లోపలికి"?

"కింద వెనకాల తలుపులు తీసిపెట్టుకుని వచ్చి ఉంటాడు. ముందుగా ఈ హాలు గొళ్ళాలు పగలగొట్టి అన్ని తలుపులు తీసు ఉంటాడు" అన్నాడు మా పూర్ణా.

పోలీసులకు ఫోన్ చేస్తే అసిస్టెంట్ కమీషనర్ వెంటనే వస్తానన్నాడు. అప్పుడు టైం నాలుగుగంటలు ఉంటుంది. వెంటనే ఈ విషయం హైదరాబాదులో ఉన్న మావారికి ఫోన్ చేసి మా పూర్ణ ఏ.సి వచ్చి వెళ్ళిన తరువాత మళ్ళీ ఫోన్ చేస్తానని గాబరా పడొద్దని చెప్పాడు.

"డబ్బు పోతే పోయింది ఎవరికి ఏమీ కాలేదుకదా?" అని అడిగారు మావారు.

"అలాంటిది ఏమీ అవ్వలేదు" అనేటప్పటికి కాస్త కుదుటపడ్డారు.

ఏ.సి. కానిస్టేబుల్‌తో సహా వచ్చి అన్ని విషయాలు తెలుసుకుని "మీరు తలుపులు అన్నీ ఎందుకు ముట్టుకున్నారు? వాడి వేలిముద్రలు మేము కనిపెట్టాలి కదా?" అన్నాడు. ఏమేమి పోయాయి అడిగాడు,

"కింద భోజనాల గది డ్రాయరులో ఉన్న చిన్న పర్సులో ఉన్న 50రూ, టెలిఫోన్ దగ్గర వున్న మా వారి మొబైల్ పోయాయి" అని చెప్పాము.

నేనడిగాను ఏ.సి.ని "మరి దేవుడి గదిలోని వెండి సమ్మెలు అలాగే ఉన్నాయి సార్, మొన్న నీమధ్యనే సంక్రాంతి అయిందని అక్కడే ఉంచాము" అన్నాను

"వచ్చిన దొంగలు డబ్బు కోసరమే వస్తారండి. సామాన్లు ఎప్పుడూ తీయరు" అన్నాడు. ఏ.సి. వాళ్ళు వచ్చిన విషయం మావారికి ఫోన్ చేస్తే నేను ఇప్పుడు షూటింగుకు బయలుదేరుతున్నాను. రాత్రికి మళ్ళీ ఫోన్ చేయండి అని చెప్పారు.

నేను ఎంత తలుపు కొట్టినా తలుపు తీయని మా సుధ, వాచ్‌మెన్, పూర్ణ, రమల మాటలు విని, తలుపు తీసి యువతలకి వచ్చి, వాళ్ళంతా 12.30 గంటలవరకు మేల్కొన్నామని, పిల్లలంతా నిద్రపోయారని, దానికి ఏదో కొట్టిన చప్పుడు వినిపించి, రాను రాను పెద్ద

చప్పుడు వినిపించినందువలన తలుపు లోపల పైగా గడిపెట్టి, తాళం పెట్టి, మంచం మీదనే బిక్కుబిక్కుమంటూ కూర్చుని ఉండిందని, నిద్రపోలేదని చెప్పింది.

మా సుధ, రమా వాళ్ళు అంత అర్ధరాత్రి వేళ ఒంటరిగా వెనక వైపు ఆ చీకట్లో ఎందుకు వెళ్ళావు అని అడిగారు. "ఏమో! నాకేం తోచలేదు." అన్నాను.

"ఇంకొకరెవరైనా వెనకనుంచి నీ తల పగలకొట్టి వుంటే ఏమయేది?" అని ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కరకంగా అడిగేసరికి అప్పుడు వేసింది నాకు భయం." అవును నేను ఏమిటి అలా వెళ్ళాను కొంచెమైనా భయం లేకుండా" అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

ఆ రాత్రే మా వారు హైదరాబాదు నుంచి వచ్చారు. జరిగినదంతా చెపితే "మరి ఫోనులో ఈ విషయం చెప్పలేదే? ఎందుకెళ్ళావ్ అలా చీకటిలో?" అని అడిగారు.

"మీరు గాబరా పడ్తారని" అన్నాను.

మా రమా వాళ్ళకి మర్నాడు నెల్లూరుకు వెళ్ళే ప్రోగ్రాం ఉండింది. రెండు రోజుల తరువాత సుధాకి పాండిచ్చేరి వెళ్ళే ప్రోగ్రాం ఉండింది. మా వారు ఆయన వచ్చిన రోజు రాత్రి "ఎల్లుండి పొద్దున్న ఫ్లైట్ ఎక్కి హైదరాబాదుకు వెళ్ళాలి. నువ్వు కూడా వస్తున్నావు టిక్కెట్టు కూడా కొన్నాను. సుధా కూడా పాండిచ్చేరికి వెళుతుంది. ఇంత జరిగాక నువ్వు ఒంటరిగా ఉండకూడదు, నేను ఒప్పుకోను" అన్నారు. సడన్ ప్రయాణం. కానీ, మావారి మాటలకి ఎండాకాలంలో వాన జల్లులు తలమీద పడ్డట్టుగా ఉండింది. పాపం మా సుధ ఇంట్లో ఉండాలి. ఒక్కతే ఉండాలని కోడంబాకంలో ఉన్న వాళ్ళక్క ఇంట్లో ఒకరోజు వుండి కారులో పాండిచ్చేరి వెళ్ళిపోయింది.

గూడూరులో ఉన్న మా సేతమ్మక్కకి అన్ని విషయాల కన్నా, అర్ధరాత్రి చీకటిలో నేను ఒంటరిగా దొంగను వెతుక్కుంటూ వెనక వరండాలోకి వెళ్ళడం ఆవిడని బాగా గాబరా పెట్టింది.

నా జీవితంలో నా రోగాలు, జబ్బులేకాక, ఇలాంటి అవాంతరాలు కూడా ఎదుర్కొన్నాను.

నా పెళ్ళయ్యాక 1960లో వచ్చేనా, నే వచ్చిన పదేళ్ళకి మా వారు డైరెక్టర్ అయ్యారు. పెళ్ళికి ముందు నాకు జ్ఞానం తెలిసినప్పటి నుంచి సినిమాలు చూస్తూనే ఉన్నాను. బాగుంది, బోరుగా ఉంది, తప్పితే నాకేం చెప్పాలో తెలిసేదికాదు. 1960 నుంచి 70 వరకు మా వారిని చూసాను. సరే, 'కష్టే ఫలే' కాబోలు, అసిస్టెంట్ డైరెక్టర్ అంటే ఇంతే కాబోలు అనుకునేదాన్ని. కానీ ఆర్థికపరంగా మాత్రం ఎన్నడూ కష్టాలు ఎదుర్కోలేదు. డైరెక్టర్ అయిన తర్వాత ఆయన కూడా లేకుండానే మార్కస్‌బారట్లే, రవికాంత్ నాగాయచ్ వంటి కెమెరా మాన్లతో ట్రిక్కు చేయించుకున్నారు. పాతాళభైరవి, మాయాబజార్, మొదలగు సినిమాలు అన్నీ ట్రిక్కులే, గ్రాఫిక్సు ఎక్కడ ఉన్నాయి? విఠలాచార్యగారెన్నో జానపద హిట్స్ తీసారు. అవన్నీ విజయవంతం అయ్యాయి. అంటే ట్రిక్కులవలనకాదు. కథా బలం, మంచి సంగీతం ఉన్నందువల్ల. ఈనాడు అవే ట్రిక్కులని కంప్యూటర్ యుగం వచ్చి గ్రాఫిక్స్ ద్వారా భారీ ఎత్తున సెట్స్ వేసి సినిమాలు తీస్తున్నారు. కానీ వాటిలో కథ ఉన్నవే విజయవంతం అవుతున్నాయి. సింగీతంగారు కూడా భైరవద్వీపం, ఆదిత్యా 369లాంటి సినిమాలకి గ్రాఫిక్స్ ఉపయోగించినా కథాబలంతో విజయం సంపాదించారు. మా పెద్ద అల్లుడు కూడా జెమినీలో గ్రాఫిక్స్‌లోనో పనిచేస్తున్నారు. ఈనాటి యువ దర్శకుల సినిమాలు కూడా గ్రాఫిక్స్ లేకున్నా కూడా కథ సెంటిమెంట్ ఉన్నవి విజయం సాధించలేదా? ఏ గ్రాఫిక్స్ లేకుండా పాటలు, మాటలు, డైలాగులు కూడా లేని పుష్పక విమానం ఇటు విజయం అటు అంతర్జాతీయ ప్రశంసలు అందుకోలేదా? నాకు నచ్చేది, ఏ సినిమాలోనైనా కథతోపాటు సంగీతం, పాటలు కనీసం ఒకటి రెండైనా పాడుకునేట్లు ఉండాలి. ఏది ఉన్నా లేకపోయినా కథాంశం, సంగీతం ముఖ్యంగా ఉందంటే అది ఎవరు తీసినా వారికి విజయం ఇటు ప్రేక్షకులకి ఆనందం ఉంటుంది. వాళ్ళు టిక్కెట్టుకు ఖర్చు పెట్టిన డబ్బు వృథా అవ్వకుండా ఉంటుంది.

ఇదంతా ఒక డైరెక్టరు భార్యగా బయటి నుంచి చూస్తూ వచ్చిన అనుభవం వల్ల రాసిన మాటలు. ఇది మావారితో చెపితే "నువ్వు చెప్పేదంతా నిజమే. కానీ ఏది మంచి కథో, ఏది మంచి సంగీతమో మాకు తెలీదే?" అన్నారు.

2006వ సంవత్సరం సెప్టెంబరు 21న మావారికి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. దాన్ని పురస్కరించుకుని కిన్నెర ఆర్ట్స్ రఘురాంగారు మా యిద్దరికీ హైదరాబాద్ త్యాగరాజ భవనంలో సన్మానం చేశారు. దానికి హీరోలు బాలకృష్ణ, రాజేంద్రప్రసాద్, ఎం.ఎస్.రెడ్డి, సి.నారాయణరెడ్డి. గుమ్మడి, వేటూరి, వెన్నెలకంటి, ఆదిత్య, చౌదరిగార్లలాంటి ప్రముఖులందరూ వచ్చారు. ఆ రోజున మాధవపెద్ది సురేష్ నేతృత్వంలో మావారి సినిమాలలోని పాటల కచేరీ జరిగింది. చివరగా నేను సెంటిమెంట్‌గా ఫీలయి మా షష్టిపూర్తి శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో జరిగితే మళ్ళీ యిప్పుడు అదే పవిత్రతతో మాకు కల్యాణోత్సవం చేయిస్తున్నట్టు ఫీలవుతున్నానని సభలో ప్రసంగించాను. అక్కడే ఉన్న మంత్రాలయంతో సంబంధం ఉన్న ప్రభాకరరావుగారు మమ్మల్ని ఆరాధనలపుడు మంత్రాలయానికి పిలిపించి స్వామీజీ చేత మా కుటుంబం మొత్తానికి సత్కారం చేయించారు.

మా పిల్లల ఇళ్ళు విరుగుంబాకంలో ఉన్న భాస్కర్ కాలనీలో మా వారి ప్లాను ప్రకారం రెండిళ్ళూ ఒకేలా ఉండేట్లు కట్టించడం పూర్తయింది కానీ మావారికి అక్కచెల్లెళ్ళు ఇద్దరి మధ్య ప్రహరీగోడ ఇష్టం లేదు. అందుకని అది కట్టించలేదు. ఎప్పుడూ కట్టకూడదని మా ఇద్దరి కోరిక. కొంతమంది వద్దనుంచి కామెంట్స్ కూడా వచ్చాయి. అదేమిటో రెండిళ్ళ మధ్య అడ్డుగోడ లేకపోవడం ఏమిటి అని. ఎవరెంత గింజుకున్నా మావారి పాలసీ అదొక్కటే. ఉడ్ వర్క్, వంటియింట్లోని అధునాతన ఏర్పాట్లు, ఇంకా చిన్న చిన్న పనులు, పనివాళ్ళని కొంత అవసరపెట్టి మొత్తానికి రెండిళ్ళు పూర్తి చేశారు.

2007వ సంవత్సరం ఏప్రిల్ 23 తేదీన రెండిళ్ల అమ్మాయిలూ గృహప్రవేశం చేశారు. పిలిచిన బంధువులు, స్నేహితులు అందరూ వచ్చారు. మా యిద్దరి అమ్మాయిలు చాలా తృప్తిపడ్డారు. గృహప్రవేశం అయిన తర్వాత మిగతా పనులన్నీ పూర్తి చేసుకుని 2008వ సంవత్సరంలో మొదట శకుంతల వాళ్ళు ప్రవేశించారు. కోడంబాకంలో ఉంటున్న వాళ్ళు విరుగుంబాక్కంకి షిఫ్ట్ అయ్యారు. మా శకుంతలకి, మా మనవరాలు స్నేహకి వేసవి సెలవులైనందువలన ఇల్లు మారడానికి అనుకూలమైంది. మా సుధా వాళ్ళు బెసెంట్ నగర్ దగ్గర్లో ఉన్న ఇంద్రానగర్ స్కూల్లో మా మనవడు అభినవ్ చదువుతున్నందువలన ఇల్లు మారే అవకాశం రాలేదు. మేము మాత్రం వడపళని ఇంటినుంచి అప్పుడప్పుడొచ్చి, సుధా యిల్లు చూసుకుంటూ దేవుడి దీపం పెట్టి వెళ్ళివస్తుండే వాళ్ళం. కానీ ఇంట్లో ఎవ్వరూ లేరే, ఇంత బాగా కట్టుకుని ఇల్లంతా చీకటిగా ఉండడం చూడ్డానికి కష్టంగా ఉండేది. పక్కనే ఉంటున్న మా శకుంతలకి కూడా బాధ వేసేది. పైగా దాన్ని అందరూ అడిగేవారట "ఆ యిల్లు ఖాళీగా ఉందా? అద్దెకిస్తారా? ఎవ్వరూ లేరా? అలా లైట్లు లేకుండా చీకటిగా ఉందేం" అని లక్షా తొంబై ప్రశ్నలడిగేవారట. దానికి కూడా వాళ్ళ నాన్నగారు ఇంత డబ్బు ఖర్చు పెట్టి కట్టించిన ఆ యింట్లో ఎవ్వరూ ఉండలేదే అని బాధపడేదట.

ఈసారి వడపళని ఇంట్లో వర్షాలు వచ్చినప్పుడు మోకాళ్ళలోతు నీళ్ళు ఇంట్లోకి వచ్చి తలుపులన్నీ నానిపోయి ఫర్నీచరు, బీరువాలు సైతం నానిపోయి పెచ్చులూడి పోయాయి. ఇక ఆ ఇంట్లో ఉండలేని పరిస్థితి వచ్చేసింది. ఆ ఇల్లు ఎత్తు చేయాలన్నా కుదరలేని పరిస్థితి. అప్పుడు మా సుధతోపాటు మా అల్లుడు వాళ్ళ నాన్నగారు కూడా మమ్మల్ని కొత్త ఇంటికి మారమన్నాడు. మేము అన్నివిధాలా ఆలోచించాము. పెద్దమ్మాయి పక్కనే ఉంటుంది. చిన్నమ్మాయి అప్పుడప్పుడు వస్తూంటుంది కదా అనే ఉద్దేశ్యంతో 2009 ఫిబ్రవరి మాసంలో సుధ ఇంటికి వచ్చేసాం.

మా సుధ అప్పుడప్పుడొచ్చి ఇల్లు శుభ్రపరుస్తూ, ఇంటి ముందర పక్క ఇరువైపులా డెబ్బైవేలు ఖర్చుపెట్టి పూలమొక్కలు, క్రోటన్సు మున్నగునవన్నీ వేయించింది. ఇంటిముందర మాత్రం చూడ చక్కనిగా ఉండేది. మా శకుంతల కూడా ఇలాగే మొక్కలు వేయించి దాని

సంరక్షణ చేస్తూ ఉండేది. ఇళ్ళు కట్టినప్పుడున్న వాచ్‌మేనే ఈ రెండిళ్ళకీ జీతానికి పనిచేసేవాడు. మొక్కలకి నీళ్ళుకూడా వాడే పోసేవాడు. అందుకనే అందరూ దాన్ని "పార్కుఇళ్ళు" అనేవారు. మా శకుంతల వాళ్ళు ఒక ఆడకుక్కని పెంచేవారు, దాని పేరు ఫ్లఫీ(Fluffy) Golden retriver జాతి. చాలా విశ్వాసంగా ఉండేది. మేము సుధా ఇంటికి మారిన తరువాత రోజూ మా యింటికి వచ్చేది. వాళ్ళు కోడంబాక్కంలో ఉంటున్నప్పటినుంచి మమ్మల్ని చూస్తోంది కనుక దానికి మా యింట్లో కూడా బాగా అలవాటయింది. రోజూ పొద్దున్న పదిగంటలవడం తడవు, మా యింటికి వచ్చేసేది. ఎందుకంటే వాళ్ళింట్లో మా కూతురు, అల్లుడు, దాన్ని చాలా చాలా ప్రేమతో చూసుకునే మా మనవరాలు స్నేహ, అందరూ బయటికి వెళ్తారు కదూ? అందుకు. వాళ్ళ అత్తగారు, మామగారు ఎవరి పనుల్లో వాళ్ళుంటారు. మా యింట్లో మేమంతా యింట్లోనే ఉంటాము కదా! పైగా నా దగ్గర దానికి చాలా అలవాటు. పొద్దున్న 1,2 బిస్కెట్లు, సాయంత్రం బిస్కెట్లు ఇచ్చేదాన్ని. ఒకవేళ నేను మా వారితోనైనా, ఫోన్లోనైనా మాట్లాడుతూ దాన్ని పట్టించుకోకపోతే, దాని ముందర రెండుకాళ్ళతోనూ నా తొడమీద మెల్లిగా గీకేది. మావారి దగ్గరికెవరైనా ఇంటర్వ్యూలకు వస్తే, వీడియో తీస్తున్నప్పుడు ఆ లైట్లు అవి దానికి వింతగా ఉండేది. ఆ సమయంలో మావారి పక్కనే కూర్చునేది.

మా స్నేహ దాన్ని రోజూ సాయంత్రం షికారుకి చైనుకట్టి తీసుకెళ్తూ ఉండేది. అలాంటిది ఒకరోజు ఆ చైను బెల్టు ఎలా ఊడిపోయిందో అది వేరే వీధికి వెళ్ళిపోయింది. అది గమనించిన స్నేహ దాన్ని వెతుక్కుంటూ వెళ్ళేసరికి, మా వీధికి ఎదురు వీధిలో ఉన్న తమిళ హాస్యనటుడు సెంథిల్ యింటి మూడు కుక్కలు ఫ్లఫీని కరవడానికి వచ్చాయి. వెంటనే మా స్నేహ ఒక్క ఉదుటున ఫ్లఫీ మీద బోర్లపడుకుందిట ఫ్లఫీని రక్షించడానికి. ఆ వీధి వాళ్ళు గుమికూడి ఆ కుక్కల్ని తరిమేశారు. మా స్నేహ సాహసానికి స్టన్ అయ్యారుట. ఫ్లఫీని కాపాడాలనే తపన తప్ప స్నేహ ఇంకేమీ ఆలోచించలేదు. అయినా ఒక కుక్క ఫ్లఫీని కరిచింది. అప్పటినుంచి అది సుస్తీతోనే రెండు మూడు రోజులు బాధపడింది. ఎన్నో ఇంజక్షన్లు ఇప్పించింది స్నేహ. ఆఖరికి ఆస్పత్రికి పిల్చుకెళ్ళి, రెండు మూడు సార్లు అడ్మిట్ చేసింది. కానీ ఏమీ ప్రయోజనం లేకపోయింది. మాములుగానే దానికి ఏదైనా చికాకు వేస్తే, స్నేహ దానిమెడమీద డెట్టాల్‌తో కడిగి, దానికి ఆయింట్‌మెంట్ రాసి, తనే వెటర్నరీ డాక్టర్‌లాగా శుశ్రూష చేసేది. కానీ సెంథిల్ కుక్క కరిచిన గాయం తగ్గకపోయేసరికి, స్నేహ అమిత బాధపడ్తూ, చదువు కూడా చదవక, మనసు బాగోలేక ఉంటూ వచ్చింది. కానీ ఫ్లఫీ మాత్రం బాధ అనుభవించి, అనుభవించి ఆఖరుకి 2011 జనవరిలో కన్నుమూసింది. మా స్నేహకది పెద్ద షాక్. మేమంతా స్నేహ గురించి చాలా బాధపడ్డాం. కానీ ఏం చేస్తుంది, చిన్నపిల్ల కాదుకదా? ఇంజనీరింగ్ చదువుతోంది. కుక్కల్ని వీధిలో చూసినా టీ.వీలో చూసినా, మూడ్ అవుట్ అవుతూ ఉంటుంది.

మార్చి నెలలో మావారు చేసిన ఆనిమేషన్ సినిమా 'ఘటోత్కచ్' Cairo International Children's Film Festivalకి సెలెక్టయిందని, సింగీతంగారికి రానూపోనూ ఖర్చులు, కెయిరోలో హోటల్ రూము, హాస్పిటాలిటీ యిస్తామని కెయిరో ప్రభుత్వం దగ్గరనుంచి కబురు వచ్చింది. మాకు చాలా ఆనందం వేసింది. ఈయనకిలా సినిమా సెలక్టవడం, ఎన్నో అవార్డులు రావడం కొత్తకాదు. కానీ కొత్త యింటికి వచ్చిన నెల్లాళ్ళయినా కాకుండా ఈ శుభవార్త వచ్చినందుకు మా కందరికీ చాలా సంతోషమైంది. నా ఖర్చులు నేను భరించి, వారితో కూడా ప్రయాణం అవడం మామూలే కదా. మేము బయలుదేరే రోజున సుధ వాళ్ళబ్బాయితో మా యింటికి వచ్చింది. మేము బయల్దేరి ముందు ముంబాయి వెళ్ళి, అక్కడ ఈజిప్షియన్ ఏర్‌లైన్స్‌లో వెళ్ళాలన్నమాట. ముంబాయిలో మూడు, నాలుగు గంటల సేపు వెయిట్ చెయ్యాల్సివచ్చింది. ఇంతలో మా సుధ "మీ వద్ద నుంచి ఫోన్లు లేవు, ఎక్కడ ఉన్నారు? ఏ యిబ్బందులు పడ్తున్నారు" అని ఫోను. మేము కులాసాగా ఉన్నామని ముంబాయి ఎయిర్‌పోర్టులో ఉన్నామని దాంతో మాట్లాడాము.

**మొత్తం మీద** ఈజిప్టులోని కెయిరో కెళ్ళి ఫెస్టివల్ వాళ్ళు ఏర్పాటు చేసిన హోటల్ రూమ్ చేరుకుని ఫెస్టివల్ డెకరేట్ ఆఫీస్‌కి వెళ్ళి వివరాలు తెలుసుకుని, ప్రోగ్రాం షీట్లు తీసుకుని, ఫార్మాలిటీస్ పూర్తిచేసుకున్నాం. వాళ్ళిచ్చిన డెలిగేట్ కార్డ్స్ తీసుకున్నాం. అంటే, ఫెస్టివల్‌కి అటెండ్ అయ్యే డెలిగేట్స్‌కి వారివారి ఫోటోలు అమర్చిన కార్డులు రిబ్బన్‌కి కట్టియిస్తారు. రోజూ అవి మెడలో వేసుకుని ఫెస్టివల్ సినిమాలకి వెళ్ళాలన్నమాట. మరెవ్వరూ ఆ కార్డులు ఉపయోగించరాదన్నమాట. తరువాత మా సెల్‌ఫోన్‌లోని సిమ్ కార్డులు మార్చుకుని, ఆ షాపులోనే టెస్ట్ చేస్తే, అది ఇండియాకి కనెక్ట్ అవ్వలేదు. ఆ కార్డులు షాపువాడి మొహాన పారేసి మా డబ్బు వాపసు తీసుకుని హోటల్‌రూముకి వచ్చేసరికి ఫెస్టివల్ డైరెక్టర్ ఆఫీసు నుంచి ఒక ఆమె మా వారికి ఫోన్ చేసింది. 'ఇండియా నుంచి మీ అమ్మాయిలిద్దరూ టెన్షన్‌తో ఫోన్ చేశారని, మీ గురించి ఏ విషయమూ తెలియలేదని, మీరున్న హోటల్ పేరు, ఫోన్ నెంబరు తెలియలేదని, చాలా దిగులుగా మాట్లాడారు. నేను మీరు కులాసాగా ఉన్నారని, ఈ హోటలులోనే ఉన్నారని ఫలానా నెంబరు రూమని చెప్పమని' అంది. నాకు ఏడుపు వచ్చినంత పని అయింది. పాపం, మా అమ్మాయిలిద్దరూ ఎంత కంగారు పడివుంటారోనని. మేము కార్డులు వేయించుకోడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మొత్తం మీద ఎలాగో సాధించి సిమ్ కార్డులు వేయించుకుని మా అమ్మాయిలతో మాట్లాడాము.

అప్పుడు తెలిసింది ఇండియాలో మా అమ్మాయిలు శకుంతల, సుధల పరిస్థితి. అమ్మా నాన్నలకి ఫోన్ చెయ్యాలంటే వాళ్ళకి ఈజిప్టు కెయిరో నెంబరు, హోటల్ నెంబరు తెలియలేదు. ఆఖరుకి ఇంటర్నెట్‌లో ఫెస్టివల్ డైరెక్టరేట్ నెంబరు బట్టి, ఛాన్సు ప్రయత్నిద్దామని చేశారుట. ఇద్దరూ చాలాసేపు తంటాలు పడి పట్టారట ఈ నెంబరు.

ప్రతి యాత్రలో ఏదో ఒక అనుభవం ఉంటుంది. కానీ, కొన్ని యాత్రల అనుభవాలు ఎంతో ఉత్కంఠంగానూ, ఎప్పటికీ మరుపురానివిగానూ మిగిలిపోతాయి. అలాంటిదే ఈ పర్యటనానుభవాన్ని చెప్తాను.

'బీ ఎ రోమన్ ఇన్ రోమ్' అన్నారు. కానీ, 'బీ ఏన్ ఇండియన్ ఎనీవేర్, ఈవెన్ ఇన్ రోమ్' అని ఈ మధ్యనే తెలిసొచ్చింది. ఈజిప్టులో అడుగుపెట్టగానే నాకు అర్థమైన విషయం ఏంటంటే మనకి వాళ్ళ భాషరాదు, మనం మాట్లాడేది, వాళ్ళకి అర్థంకాదు. ఏదో ఇంగ్లీష్ తెలిసిన ఒకరిద్దరు అక్కడక్కడా తగుల్తారు.

ఆ రోజు చిత్రోత్సవ ప్రారంభ దినం, ఆ ఉత్సవం ఒపేరా హౌస్ అనే థియేటర్లో జరుగనుంది. ఇది కెయిరోలోని అతి పెద్ద థియేటర్ కాంప్లెక్స్. ఇందులో ఒకేసారి వేర్వేరు ప్రదర్శనలు జరుగుతాయి. బాగా తెలిసినవారికే ఆ లోపల కారిడార్లలో దారులు ఏవి ఎటువైపు వెళ్తాయో తెలుస్తుంది. కొత్త వాళ్ళకి అంతా అగమ్యగోచరం. పైగా అందులో బోర్డులన్నీ అరబిక్‌లోనే రాసున్నాయి. ఫంక్షన్‌కి రెండువేలమందికి పైగా హాజరయ్యారు. ఇది మూడంతస్తుల్లో బాల్కనీలున్న హాలు. వచ్చిన జనంలో ఎక్కువమంది ఈజిప్షియన్లే. నల్లటి ముసుగు, పొడవాటి గౌన్లు వేసుకున్న ఆడవాళ్ళు ఎంతోమంది వచ్చారు. విదేశాల నుంచి వచ్చిన డెలిగేట్లు ఒక వందమంది ఉంటే, భారతదేశం నుంచి వచ్చిన ఆడవాళ్ళలో నేనుగాక మరో ఇద్దరు ముగ్గురు కనిపించారు. వాళ్ళంతా ప్యాంట్లూ, సూట్లూ వేసుకుని ఉన్నారు. చీరకట్టుకున్నది నేనొక్కదాన్నే. అప్పుడు నాకో పిచ్చి ఆలోచన వచ్చింది. నేను కూడా ఏ జీన్సో, సూటో వేసుకుని ఉండాల్సింది అని.

నేనూ, మావారు మా సీట్లలో కూర్చున్నాం. ఆ రోజు కార్యక్రమానికి ఎవరో వీవీఐపీలు రానున్నారు కాబోలు, సెక్యూరిటీ ఎక్కువగా ఉంది. ఈ సమయంలోనే మరుపురాని ఓ సంఘటనకు తెరలేచింది. మరో అయిదు నిమిషాల్లో ఫంక్షన్ మొదలు కానుందనగా 'టాయ్‌లెట్‌కి వెళ్ళివస్తా'నని మావారితో చెప్పి బయటకు బయల్దేరాను. గేటు దగ్గర సెక్యూరిటీ వాళ్ళు బయటకు వెళ్ళనీయలేదు. వెంటనే వచ్చేస్తానని ఇంగ్లీష్‌లో చెప్పా. అక్కడున్న వారికి నామాట అర్థం కాలేదు. అతనేదో చెప్పాడు. అది నాకు అర్థంకాలేదు. ఈలోపల చీఫ్‌గెస్ట్ వస్తున్నారేమో.. హడావుడి మొదలైంది. ఉన్నట్టుండి సెక్యూరిటీ వాళ్ళంతా అటువైపు పరుగులు. ఇదే సందనుకుని గేటు బయటికి

వచ్చేశాను. చీఫ్‌గెస్ట్‌కి అందరూ సెల్యూట్‌లు కొట్టారు. ఆయన హాల్లోకి ప్రవేశించగానే గేటు తలుపులు మూసేశారు. నేను దారి వెతుక్కుంటూ టాయ్‌లెట్స్ వైపు వెళ్ళాను. అట్నుంచి తిరిగి హాలుకు వెళ్ళడానికి దారి మరిచిపోయాను. కాసేపు వెతికీ వెతికీ నెమ్మదిగా హాలుగేటుకు చేరుకోగలిగాను. అక్కడ అప్పటికే చాలామంది సెక్యూరిటీ వాళ్ళు తుపాకులతో నిలబడ్డారు. వాళ్ళని చూడగానే భయమేసింది. లోపలికి వెళ్ళే ప్రయత్నం చేస్తే గేట్లు తెరవడానికి వీల్లేదు అన్నట్లు సైగలు చేశారు. ఇక, కంగారు మొదలైంది. ఫంక్షను అయ్యేంతవరకూ నేను లోపలికి వెళ్ళకపోతే మా వారు చాలా కంగారుపడతారు. పోనీ ఫోన్ చేద్దామంటే నా మొబైల్ ఆయన దగ్గరుంది. మరో గేటు నుంచైనా వెళ్ళనిస్తారేమోనన్న ఆశతో అటువైపు వెళ్ళాను. ఎంతో పొడవుందా కారిడార్. ఆ హాలుకి చాలా గేట్లున్నాయి. ఏ గేటు దగ్గరకు వెళ్ళినా అదే పరిస్థితి 'లోపలికి పోరాదు' అంటూ ఎవరూ తలుపులు తీయలేదు.

అలా దాదాపు ఓ అరగంట గడిచిపోయింది. ఆ సమయంలో హాలు స్టాఫ్‌కి చెందిన ఇద్దరు అరబ్ అమ్మాయిలు కనిపించారు. వాళ్ళ దగ్గరికి వెళ్ళి "నా భర్త లోపలున్నారు. నేను హాల్లోకి వెళ్ళాలి" అని ఇంగ్లీష్‌లో చెప్పాను. వాళ్ళు తెల్లముఖాలేశారు. వాళ్ళకి ఇంగ్లీష్ అర్థంకాదు. నా పరిస్థితిని వివరించాలని సైగలు చేశాను. తరువాత తమ వెంట రమ్మంటూ వాళ్ళు సైగలు చేశారు. మెట్లమీద నుంచి తీసుకెళ్ళి, అక్కడెవరో ఉంటే వాళ్ళకి నన్ను అప్పచెప్పారు. హాలుగేటువైపు తీసుకువెళ్ళారు. లోపలికి పంపి తలుపేశారు. అసలు సమస్య అక్కడ మొదలైంది. లోపలంతా చీకటి. నెమ్మదిగా కలియజూస్తే అప్పుడర్థమైంది. అది మూడవ అంతస్థు బాల్కనీ అని. అప్పుడు కంగారు మరీ ఎక్కువైంది. నేనేమో మూడో అంతస్థులో మా వారు కింద ఎక్కడో ఉన్నారు.

కింద వేదికపై అద్భుతమైన ప్రదర్శన జరుగుతోంది. జనాలంతా మంత్రముగ్ధులై తిలకిస్తున్నారు ఆ ప్రదర్శనేంటో నేను పట్టించుకోలేదు. ఆ ధ్యాసే లేదు. ఆ చీకటి వెలుగులో మావారెక్కడైనా కనిపిస్తారేమోనని బాల్కనీ నుంచి తొంగి తొంగి చూస్తున్నాను. కానీ అన్నివేలమంది జనంలో ఎలా గుర్తుపట్టను? అప్పుడు వెనక నుంచి ఎవరో నన్ను పిలిచినట్లైంది. చూస్తే మా వారు. ఆయన్ని చూడగానే ఎంత రిలీఫో చెప్పలేను. ఏడుపొచ్చినంత పనింది. మెల్లగా ఇద్దరం గేటు తెరుచుకుని బయటకొచ్చాం.

నిజానికి ఈ చీరకట్టే మావారినీ, నన్నూ కలిపింది. ఇంతకు ముందే చెప్పుకున్నాం కదా? ఫెస్టివల్ థియేటర్‌లో తప్పిపోయి మావారిని కలుసుకున్నానని. ఆ తరువాత తనను అడిగాను? 'ఇంతకీ నేను ఆ అంతస్తులోనే ఉన్నానని ఎలా తెలిసింది' అని. అసలు కథ అప్పుడు చెప్పారు. నేను ఒపెరా హౌస్ థియేటర్ బయటికి వెళ్ళి ఇరవై నిమిషాలైనా తిరిగి రాకపోయేసరికి ఆయనకీ కంగారు మొదలైంది. ఆయనా గేటు బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. కానీ, సెక్యూరిటీవాళ్ళు ఆయన్నీ వదల్లేదు. దాంతో ఆయనకి కోపం వచ్చేసిందట. "మేం ఇండియా నుంచి ఈ దేశానికి వచ్చాం. నా భార్య బయటికి వెళ్ళి తిరిగిరాలేదు. నన్ను పంపించరేం?" అంటూ ఇంగ్లీష్‌లో గట్టిగా అరిచేశారట. ఆ అరుపులకు చుట్టుపక్కల కొంత అలజడైంది. వాళ్ళు 'ష్...ష్..మెల్లగా' అంటూ సైగలు చేసి ఆయన్ని బయటికి పంపించారు. ఇక, అక్కణ్ణుంచి మావారు కనిపించిన వాళ్ళందర్నీ సైగలతో నన్ను చూశారేమోనని అడిగారు. మూలమూలలా గాలించారు. చివరికి ఆయనకో ఆలోచన తట్టింది. అక్కడున్న ఇద్దరు స్టాఫ్ అమ్మాయిల దగ్గరకెళ్ళి ఎక్కడైనా చూశారా అని అడిగారు. 'శారీ' అనగానే ఆ అమ్మాయికి ఏదో గుర్తొచ్చినట్టు ముఖం పెట్టిందట. ఆ ఫంక్షన్ హాల్లో దాదాపు రెండువేల మందికి పైగా ఉన్నారు. వాళ్ళందర్లోనూ చీరకట్టున్న ఏకైక స్త్రీని నేనే. ఆ అమ్మాయి వెంటనే అక్కడున్న ఇతర సిబ్బందితో వాళ్ళభాషలో ఏదో చెప్పింది. ఓ అరగంటలో వాళ్ళు అంతా గాలించి చివరికి నేనున్న బాల్కనీలోకి మావారిని పిల్చుకొచ్చారట.

అప్పుడనుకున్నా చీరే నన్ను కాపాడిందని. అంతకుముందు నేను అనుకున్నట్టు ఏ జీన్సో సూటో వేసుకుని వచ్చుంటే దేశంకాని దేశంలో ఏమై ఉండేదో! అందుకే అంటాను. 'బీ ఏన్ ఇండియన్ వేర్ ఎవర్ యూ ఆర్' అని.

ఫిల్మ్ ఫెస్టివల్, సెమినార్లలో పాల్గొనడమే కాకుండా ఈజిప్ట్ సందర్శించుకునేందుకూ కొంత సమయం కేటాయించాం. పిరమిడ్‌లు చూడ్డానికి వెళ్ళాం. గిజా పిరమిడ్ ఇక్కడ చూడదగ్గది. గిజా టూర్‌కి ఫెస్టివల్ నిర్వాహకులే ఏర్పాట్లు చేశారు. కానీ, ఆ టైమింగ్స్ మాకు కుదరలేదు. కెయిరోలో ఒక భారత కుటుంబం మాకు పరిచయమైంది. వాళ్ళు ఇండియన్ అసోసియేషన్ సభ్యులు. పిరమిడ్ల దగ్గరికి వాళ్ళతోనే వెళ్ళాం. అదొక అనిర్వచనీయమైన అనుభూతి. వేలయేళ్ళ కిందట ఈ ఎడారిలోకి ఆ రాళ్ళను ఎలా తెచ్చారో! అంతంత ఎత్తు ఎలా నిర్మించారో. అప్పటి రాజులను ఫారోలు అని పిలిచేవారు. వాళ్ళు చనిపోయాక మృతదేహాలను మమ్మీలుగా చేసి ఈ పిరమిడ్లు నిర్మించేవారు. మేం వెళ్ళిన రోజే ఆ ప్రాంతంలో డస్ట్ స్టార్మ్ మొదలైంది. విపరీతమైన గాలి చేతి రుమాళ్ళు ముక్కులకు కట్టుకుని కార్లు దిగాం. గాలి రానురానూ పెరిగింది. మావారి టోపీ ఎగిరిపోయింది. పిరమిడ్ పైకి దాదాపు సగం వరకూ ఎగురుతూ కనిపించింది. టూరిస్టులు తెచ్చుకున్న కోక్‌టిన్నులూ, పేపర్ ప్లేట్లూ, గ్లాసులూ అన్నీ గాల్లోకి లేచాయి. దాంతో చకచకా ఫోటోలు తీసేసుకుని కారెక్కి కూర్చున్నాం. ఆ పక్కనే ఉన్న మరో జగత్ప్రసిద్ధ కట్టడం 'స్ఫింక్స్' కూర్చున్న సింహం దేహం, మనిషి ముఖంతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

మర్నాడు అక్కడి ప్రఖ్యాతమైన మార్కెట్‌కి వెళ్ళాం. ఇది రెండువేల సంవత్సరాల నుంచి అలాగే ఉందట. ఆ సందులూ, గొందుల్లో ఎలాంటి మార్పులేదట. దీన్ని చూస్తుంటే మన వారణాసే గుర్తుకొచ్చింది. ఆ మార్కెట్లో పిరమిడ్లు, ఫారోల నమూనాలతో పాటు కొనదగ్గది పేపరోస్. ఇది రెండువేల ఏళ్ళ నుంచి ఈజిప్ట్‌లో తయారౌతున్న కాగితం. అప్పట్లో ఓ గడ్డిమొక్కతో దీన్ని తయారుచేసేవారట. వీటిపైన గ్రంధరచనా, చిత్రలేఖనం చేసేవారు. ఆ సంస్కృతిని కొనసాగిస్తూ ఇప్పటికీ ఈ పేపరోస్ పై చిత్రాలను వేసేవారు చాలామంది ఉన్నారు. ఆ చిత్రాలు ఇక్కడ దొరుకుతాయి. కెయిరోలో పెద్ద ఫిల్మ్‌సిటీ ఉంది. అందులో పిరమిడ్‌లూ, ఈజిప్ట్ వీధులూ పిల్లలకు గేమ్ పార్క్ ఉంది. అందులో కొంతమంది ఈజిప్ట్ అమ్మాయిలు నన్ను చూడగానే కిలకిలా నవ్వుతూ దగ్గరికి వచ్చారు. నా బొట్టూ, చీరకట్టూ వింతగా చూశారు.

కెయిరో నుంచి వచ్చిన తర్వాత హైదరాబాదు డైరెక్టరు గుణశేఖర్‌గారి నుంచి మా వారికి ఫోను వచ్చింది. తాను తీసే సినిమాలో ఒక ముఖ్యమైన క్యారెక్టరుందని, దానికి సింగీతమే తగినవారని, హీరో అల్లు అర్జున్ తాత వేషమని, వెయ్యాలని కోరారు. ఎలాంటి క్యారెక్టరో కథ విని, దానికి మావారు అంగీకరించారు. షూటింగు మొదలెట్టిన తర్వాత ఆయన హైదరాబాదుకు వెళ్తూవస్తూ ఉండేవారు. ఆఖరి షెడ్యూలు రాజమండ్రి, రాజోలులో తీస్తారట అని మావారు చెప్పారు. వెంటనే గోదావరి జిల్లా షూటింగ్ అయితే నేనూ వస్తానన్నాను. కాకినాడలో పుట్టి, గోదావరి జిల్లాలో పెరిగాను కదా! ఆ మమకారం వలన నాకు ఉత్సాహం వచ్చింది. కానీ ఆ ఏరియాలలో వానలు పడ్తూండడం వలన, అక్కడ షూటింగ్ కేన్సిల్ చేశారని తెలిసి నిరుత్సాహపడ్డాను. "ఎటూ ఆఖరి షెడ్యూలికి రావాలనుకున్నావ్ కదా? హైదరాబాద్ అయితేనేం రమ్మని" అన్నారు. ఒక్క షూటింగ్ కూడా రాలేదు కదా. రామోజీ ఫిలిం సిటీలో షూటింగుట. 'ఆకాశవీధిలో', కొన్ని షూటింగ్‌లకి వచ్చావ్ కదా రమ్మన్నారు. సరేనని నేనూ వెళ్ళాను. అక్కడ సరదాగనే ఉండింది. అందరూ నన్ను, ఆఖరుకి గుణశేఖర్ గారు కూడా "పోయినసారి షెడ్యూలికి రాలేదేమండీ! సింగీతంగారు పెద్ద డైలాగు ఒకే టేక్‌లో చెప్పేశారు" అన్నారు. నాకు ఉసూరనిపించింది, రాలేదే అని. నాలుగైదు రోజులు షూటింగు జరుగుతోంది. దానిలోని ఆర్టిస్ట్ రాధాకుమారిగారు, అందరూ నాకు మంచి కంపెనీ యిచ్చారు. రాధాకుమారిగారు నాకు మదరాసులోనే చాలా పరిచయం. ఏటేటా శ్రావణమాసంలోని వరలక్ష్మీ పూజ చేసుకుని పేరంటం పిలిచేవారు. అలాగే గొల్లపూడి మారుతీరావుగారి భార్య శివానిగారు కూడా దసరాలకీ, పూజలకీ పేరంటానికి పిలుస్తూ ఉంటారు అలాగ 'వరుడు' షూటింగప్పుడు రాధాకుమారి గారు కంపెనీ యిచ్చేవారు. నాలుగైదురోజులు షూటింగయేసరికి ఇంతలో ముఖ్యమంత్రి డా.రాజశేఖర్ రెడ్డిగారి హఠాత్ మరణంతో మూడు నాలుగురోజులు షూటింగ్ కేన్సిల్ అయింది. నాలుగురోజులు తర్వాత

కంపెనీ కారు తీసుకుని పంజాగుట్టలోని మా బాబాయిగారిల్లు చూసుకుని, మా చెల్లెలు రఖుమ ఇంటికెళ్ళి, అక్కడే భోంచేసి సాయంత్రానికల్లా ఫిలిం సిటీకి చేరుకున్నాం.

చాలా సంవత్సరాల క్రితం మావారు కాశీనాధుని నాగేశ్వరరావుగారి వేషం వేసారు. "టంగుటూరి ప్రకాశం" సినిమాలో విజయచందర్ కోరగా వేసారు. అచ్చం అలాగే ఉన్నారు. నాగేశ్వరరావుగారే దిగివచ్చినట్లుగా ఉన్నారు ఆ ఫోటో ఇంకా మా డ్రాయింగ్ రూంలో అలాగే ఉంచాం.

'మైకేల్ మదనకామరాజు' కథ సినిమాలో కమల్ హాసన్ కోరిక పై, టైటిల్స్ జరుగుతున్నప్పుడు ఫిల్మ్‌లోంచి పైకి వస్తారు. ఆయన సింగీతమే. అది అందరికీ తెలిసిన విషయమే. కమలహాసన్ మొదటి పిక్చరు 'రాజాపార్వై' తీస్తున్నప్పుడు సినిమాలో రికార్డింగ్ చేస్తున్న సీనులో చటుక్కున మెరుపులా కనిపిస్తారు సింగీతం.

***

**నేను** పెళ్ళైనప్పట్నుంచీ మా వారితో కలిసి ఆయన స్క్రిప్టులో పనిచెయ్యడం, కొన్ని కొన్ని సినిమా కథలు రాయడం, ఆయన స్క్రిప్టులని ఫెయిర్ కాపీలు చెయ్యడం చేస్తున్నానా? రానురాను మా వారికి నా సహకారం తగ్గుతూ వచ్చింది. ఎలాగంటారా? పిల్లలు పుట్టడం, వాళ్ళ స్కూళ్ళు, నేను కొన్నాళ్ళు టీచరుద్యోగం చెయ్యడం, పైగా రానురాను మా వారు వెరైటీ సినిమాలు తియ్యడం వలన, ఆ స్థాయికి నేనందుకోలేకపోయాను. కొన్నాళ్ళ వరకు వాటి జోలికే వెళ్ళలేదు నేను. మా కుటుంబమే కాక ఇతరేతర బాధ్యతలు నే చేపట్టినందువలన ఈ పనులకే నా సమయమంతా కేటాయించవలసి వచ్చింది. నాకు పిల్లలిద్దరూ పెద్దవాళ్ళై, వాళ్ళ పెళ్ళిళ్ళై మమ్మల్ని అమ్మమ్మా, తాతల్ని చేశారు. ఆ సమయంలో నాకెక్కువ తీరిక దొరికింది. అయినా కూడా అంతకు ముందులాగ నేను మావారికి సహకరించకపోయేనే అని నన్ను బాధిస్తూవుండేది. ఈ మధ్యనే సింగీతంగారు 'హాసం' పత్రికకు 'క' రాజు కథలు రాయడం మొదలెట్టారు. అవి తర్వాత పుస్తకంగా ప్రచురించబడింది. ఆయన రాసిన కథలు హాస్యం, వ్యంగ్యం, కొత్తదనంతో కూడుకున్నవి. ఆయన సినిమాలలాగా! వాటిని కనీసం ఫెయిర్ కాపీ అయినా చెయ్యాలని నాకనిపించింది. ఆయన ఇరవైయొక్క కథలు రాసారు. మొత్తం నేనే ఫెయిర్ కాపీ చేసి పెట్టాను. ఆయన పనిలో మళ్ళీ పాల్గొనడం నాకు తృప్తినిచ్చింది. ఈ పుస్తకం మూడవ ముద్రణ కూడా అయింది. ఇపుడు మళ్ళీ నాలుగైదు సంవత్సరాల తర్వాత బుజ్జాయిగారు చిత్రించిన కవర్ డిజైన్‌తో బెటర్ క్వాలిటీతో, గొల్లపూడి మారుతీరావుగారి ముందు మాటతో ప్రింటయింది.

ఈ 'క'రాజు కథలు పలువురి ప్రశంసలందుకున్నాయి. మా కజిన్ సిస్టర్సు, బెజవాడ నుంచి కల్యాణి చదివి, "బావగారి 'క'రాజు కథలు చదివానక్కా చాలా ఇంటరెస్టింగ్, హ్యూమరస్‌గా ఉందని" నాకు ఫోన్ చేసింది. మారుతీరావుగారు ఈ కథల్ని Mark Twain కథల్తో పోల్చడం విశేషం.

కొన్ని సంవత్సరాల క్రితం మావారికి ఒక పెద్ద మనిషితో పరిచయమైంది. ఆ పరిచయం స్నేహంగా మారి, అది దృఢమై వారి మైత్రి అలా కొనసాగుతూనే ఉంది. ఆ పెద్ద మనిషిలో మంచితనం, సంగీత సాహిత్యాల అభిరుచి, మరొకరికి ఉపకారం చేసే గుణం అన్నీ మిళితమై ఉన్నాయి. ఆయనెవరో కాదు ఎం.ఎస్ మూర్తిగారు. మల్లాది సచ్చిదానంద మూర్తిగారు. ఆయన పేరులోనే ఉంది చిదానంద స్వరూపుడని, ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటారు. ఆయనని మన ఆంధ్రులు ఎరుగని వారెవ్వరూ ఉండరు. ఆయనొక పారిశ్రామికవేత్త, మల్లాది గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్. ఆయన భార్య లలితగారు ఆయనకి తగిన భార్య. ఆవిడ కూడా చిరునవ్వుతో అందరితో కలివిడిగా ఉంటారు. క్రమేపి వీరి కుటుంబం మా కుటుంబానికి అతి సన్నిహితమైంది. ఆయనకి మావారంటే ఎనలేని గౌరవం. ఆ దంపతులిద్దరూ మా యిద్దరి కన్నా వయసులో చిన్నవారు.

మా వారు సాలూరి రాజేశ్వరరావుగారి ఫ్యాను. చిన్నతనం నుంచీ సాలూరి వారి పాటలు ఎక్కడ వినిపించినా అక్కడికి పరుగెత్తేవారట. సాలురి వారి పాటలు పాడుకుంటూ ఉంటారు. రాజేశ్వరరావుగారి పాటలు 'చల్లగాలిలో', 'పాటపాడుమా కృష్ణా' మావారు పాడ్తుంటే ఆ కంఠం రాజేశ్వరరావుగారు పాడినట్లే ఉంటుంది. సింగీతం క్రమేపి పెద్దవారౌతూ, మదరాసు ప్రెసిడెన్సీ కాలేజీలో డిగ్రీ పొందుతూండగా తరచూ సాలూరి వారిని కలవడానికి తపనపడ్తూ చివరికి మదరాసు ఎల్డామ్స్ రోడ్డులో ఉన్న సాలూరి వారింటికి వెళ్ళేవారట. ఆయన కూడా ఈయనని సాదరాభిమానంగా రిసీవ్ చేసుకునేవారట. సింగీతానికి సాలూరి వారి సంగీతమంటే అంత మమకారం. అందుకనే ఆయన తొలిచిత్రం 'నీతి - నిజాయితీ'కి సాలూరు వారినే సంగీత దర్శకుడిగా పెట్టుకున్నారు.

ఇదిలా ఉండగా ఎంతోకాలంగా సాలూరు రాజేశ్వరరావు గారిని కీర్తిస్తూ ఒక మ్యూజిక్ ఆల్బమ్ తయారు చెయ్యాలని సింగీతానికి కోరికగా ఉండేది. దానికి కావలసిన ట్యూన్లు తయారుచేసుకుంటూ వచ్చారు. ఆ తరువాత ఒక రోజు మా వారు సాలూరి వారింటికెళ్ళి ఆయనని శాలువతో సత్కరించి, తాను చేస్తున్న ఆల్బమ్ గురించి విన్నవించుకుని, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కూడా పూర్ణని పిల్చుకు వెళ్ళారు. అప్పటికే రాజేశ్వరరావుగారి ఆరోగ్యం అంత బాగాలేదు.

ఒకరోజు ఈ విషయాన్ని మల్లాది వారికి చెప్పారు. ఇది కొత్త పంథాలో ఆలోచించిన ఆల్బమ్. ఈ ఐడియా మూర్తిగారికి చాలా నచ్చింది. ఆల్బమ్‌ని ప్రొడ్యూస్ చేసే బాధ్యత తనే తీసుకుంటానని ముందుకు వచ్చారు. ఇవి మొత్తం ఎనిమిది పాటలు. ఒక్కొక్కపాట ప్రముఖ రచయిత రాసారు. ఎస్.పి.బి, రావు బాలసరస్వతి, సుశీల, జానకిగార్ల వంటి ప్రముఖ గాయనీ, గాయకులు పాడారు. విశేషమేమంటే ఒక పాటను మల్లాదిగారు రాస్తే దాన్ని సింగీతం పాడారు. సింగీతంగారొక పాట రాస్తే దాన్ని జానకిగారు పాడారు. సాలురు వాసూరావు ఆర్కెస్ట్రా సమకూర్చారు. ఈ ఆల్బమ్ హైదరాబాదులోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో అతి వైభవంగా విడుదల చేశారు మూర్తిగారు. ఆ రోజున ఎన్నో సంవత్సరాలుగా ఇలాంటి ఆల్బమ్ చెయ్యాలనుకుంటున్న మావారి కల నిజమై నాకళ్ళయెదుట కనిపించే సరికి నాకు తెలియకుండానే ఆ ఆనందంలో ఏడుపు వచ్చేసింది. నా పక్కనే ఉన్న మా చెల్లెలు రఖుమ "అక్కా! నువ్వు చాలా అదృష్టవంతురాలివే" అనే సరికి నా ఫీలింగ్స్ మరింత ఎక్కువైంది. వెంటనే మూర్తిగారికి థ్యాంక్స్ చెప్పాను. మావారికి మాత్రం ఈ సమయంలో సాలూరు వారు లేరే అనేదొకటే కొరత.

మావారికి చిరకాలంగా ఉన్న మరొక కల. ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు శ్రీ యల్లాప్రగడ సుబ్బారావుగారి జీవిత చరిత్రను ఒక సినిమా తీయాలని. కానీ అది కుదరలేదు. చివరకు చాలా రిసెర్చి చేసి ఇప్పుడు "The Famous Unknown" అనే పేరుతో ఇంగ్లీషులో ఒక నాటకం రాసారు. ఈ రిసెర్చిలో మాకు చిరపరిచితులు, సంగీత సాహిత్యాలలో ప్రవేశమున్న అరుణ ఆయనకు ఎంతగానో తోడ్పడింది. యల్లాప్రగడ వారి గొప్పతనాన్ని చాటే ఈ నాటకం త్వరలోనే పలుచోట్ల ప్రదర్శింపబడనుంది.

2010 మార్చి 20 నాటికి మా పెళ్ళయి యాభై సంవత్సరాలయింది. గోల్డెన్ జూబ్లీ చెయ్యాలని ప్లాను వేసుకున్నాం. మా అమ్మాయిలిద్దరూ కలిసి ఏర్పాటు చేసారు. ఇతర ఊళ్ళలోని బంధువులని, ఊళ్ళోవున్న సినిమా కంపెనీలో ఉన్న ముఖ్యమైన వాళ్ళని, స్నేహితులని, సన్నిహితులని ఆహ్వానించాము. మా మీద ఉన్న గౌరవంతో అందరూ హాజరయ్యారు. పొద్దున్న అయిదు రకాల హోమాల తర్వాత సత్యనారాయణ వ్రతం, మధ్యాహ్నం భోజనాలు. మేము కింద కూర్చోలేము కనుక మా దేవుడు సత్యనారాయణ స్వామి కూడా ఒక టీపాయి యెక్కి కూర్చుని, మా పూజలందుకుని, మమ్మల్ని ఆశీర్వదించాడు. మా అమ్మాయిలు శకుంతల, సుధ దగ్గరుండి ఘనంగా జరిపించారు. సూళ్ళూరుపేట కె.వి.కృష్ణయ్య భార్య, కొడుకు, కోడలు, మనుమలతో సహా వచ్చారు. మమ్మల్ని చాలా ఆనందింపచేసారు. ఈ ఫంక్షన్ అంతా విజయా నాగిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. అదేం ఋణానుబంధమో మాకూ, విజయా వారి సంస్థకి. మా పిల్లల పెళ్ళిళ్ళు విజయ రాణిమహల్‌లో జరిగాయి. మనుమలు అక్కడే పుట్టారు. నాకెన్నో మేజర్ ఆపరేషన్లు జరిగాయి. నేను మావారు

ట్రీట్‌మెంటు తీసుకోవడం కూడా విజయా ఆస్పత్రే. మొట్టమొదట మావారి సినిమా కంపెనీలో చేరడం కూడా విజయావారి మాయాబజారే. మొత్తం మీద మేము విజయా సంస్థకే అంకితమై పోయాము. ఇపుడు మా గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్ కూడా విజయా నాగిరెడ్డి హాలే. మాకంతా అలా కలిసి వచ్చింది.

హోమాలు, పూజలు అవగానే, మా రమ, పూర్ణల కొడుకు అనంత్ మాకొక సంభ్రమాశ్చర్యం కలిగేపని చేశాడు. ఒక పెద్ద కేక్ తెచ్చి ఒక టేబుల్‌మీద ఉంచి మమ్మల్ని పిల్చుకు వెళ్ళాడు. మాకీ విషయం ముందు తెలియలేదు. నా జన్మలో కేక్ కట్‌చెయ్యడం ఇదే మొదటిసారి. మా గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్ ఇటు రెలిజియస్‌గా, అటు సోషలైజ్‌డ్‌గా జరిగింది. నిజానికి నాకా టైములో ఒంట్లో బాగాలేక కాళ్ళునొప్పులుగా, నీరసంగా ఉంటూ వచ్చింది. మా అమ్మాయిల అండవలన నెగ్గుకొచ్చాను. ఎందుకంటే ఒక వారం రోజుల క్రింద నేను బాత్ రూమ్‌కెళ్ళి వస్తూంటే, నా ankle నుంచి ఠక్‌మని చప్పుడు వేసి కాలునొప్పవడం మొదలెట్టింది. ఆ నొప్పి యెక్కువై కాలు మెదపడానికి రాలేదు. నేను ఫ్రాక్చరైందనుకున్నాను. ఎలాగో బాత్‌రూం నుంచి మెల్లిగా బెడ్‌రూం చేరుకుని, కిందనున్న మావారిని గట్టిగా పిలిచాను. ఆయన గబగబా వచ్చి చూసేసరికి నేను మంచం మీద ఏడుస్తూ కూర్చున్నాను. జరిగిన విషయం చెప్పాను. వెంటనే డా.రాజశేఖర్‌రెడ్డిగారి దగ్గరికి పోదాంరా అన్నారు. కానీ కాలు కదపడానికి రావడంలేదే మెట్లుదిగి ఎలా వెళ్ళాలి అన్నాను. మావారు మా పనిమనిషి పొన్నమ్మని పిలిచారు. దాని సహాయంతో మెట్లవరకు వెళ్ళి, అక్కడ నుంచి కిందమెట్టు వరకు దేక్కుంటూ కిందకొచ్చాను. ఇంతలో పక్క ఇంట్లోనే ఉంటున్న మా శకుంతల అత్తగారు గీత వచ్చారు. ఆవిడ, రమ, పొన్నమ్మ యింతమంది సహాయంతో ఎలాగో కార్లో కూర్చున్నాను. ఆస్పత్రికెళ్ళాక వీల్‌ఛైర్ ఏర్పాటు చేసారు కనుక సమస్య లేకపోయింది.

డాక్టరుగారు ఎక్స్‌రే తీసి ఫ్రాక్చరు లేదని, ఎముక ట్విస్ట్ అయిందని, రెండు మూడు రోజులు బెడ్‌రెస్ట్‌లోనే ఉండాలని, బాత్‌రూంకి మాత్రం ఎవరి సహాయంతోనైనా వెళ్ళమని సలహా యిచ్చారు. ఆయన రాసిచ్చిన మందుల వలన క్రమేపి బాధ తగ్గుతూ వచ్చింది. కానీ నాకా దిగులు. వారం రోజులలో మా ఫంక్షన్. ఎలా తిరుగుతానా అని సందేహం. మా అమ్మాయిలే చూసుకున్నారనుకోండి. నన్ను పక్కమీదనుండి కదలనివ్వలేదు.

సరే, కింద వంట యింటి పనులు వంటవాళ్ళ చేత దగ్గరుండి చేయించడం, రెండు రోజులు ముందు వచ్చిన బంధువులని కనుక్కోవడం ఇవన్నీ జరగాలి కదా. ఇవన్నీ మా రమ, జయ, మా సేతమ్మక్క వీళ్ళే చూసుకున్నారు. ఫంక్షనయితే సరదాపడి ప్లాను వేస్తాము కానీ దానికి పదుగురు చేతులు కలిపితే కానీ పనులు జరగవు కదా. ఆఖరుకి విశాఖపట్నం నుంచి వచ్చిన మా తోటికోడలు రాధమ్మక్క కొడుకు కూడా వంట యింట్లో కాఫీల ప్రోగ్రాంలో చేరాడు పాపం. నాకైతే ఈ యాభై ఏళ్ళ జీవితం ఎలా గడిచిపోయిందో తలుచుకుంటే థ్రిల్‌గా అనిపించింది. గాడ్ ఈజ్ గ్రేట్. కొంతమందిని రెండు కళ్ళతో చూస్తూ ఉంటాడు.

2010 వ సంవత్సరం అక్టోబరు నెల 29వ తేదీన మా మనవడు సుధ కొడుకు అభినవ్ ఉపనయం వాళ్ళ అత్తమామల కోరిక ప్రకారం నిశ్చయించారు. నాకూ, మావారికి దౌహిత్రుడి వడుగుకదా, చాలా సంతోషమైంది. మా సుధ తిరువాన్మయూరులోని వాళ్ళ కల్యాణ మండపం మూడు నాలుగు నెలల ముందే బుక్ చేసింది. షాపింగుకి చాలా టైముంది కదా అనుకున్నాం. ఇంతలో మా రమా, పూర్ణల కూతురు అంజు పెళ్ళి నిశ్చయమైంది. బెంగుళూరులో సామ్‌సంగ్ కంపెనీలో పనిచేస్తున్న కార్తీక్ అనే అబ్బాయితో సంబంధం కుదిరింది. తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు. పూర్ణ కల్యాణ మండపం కోసరం వెతుకుతూంటే సుధా సలహా ప్రకారం తన కొడుకు వడుగుకి బుక్ చేసుకున్న కల్యాణ మండపమే 27 తేదీకి బుక్ చేశాడు. పెళ్ళి అక్టోబరు 27న, వడుగుకి రెండు రోజుల ముందే పెళ్ళి. అంటే కల్యాణ మండపం 26, 27 పూర్ణకింద, 28, 29ఏదీలలో సుధ కింద బుక్ అయ్యాయి. కానీ పెళ్ళివారి తాలుకు యిద్దరి పార్టీ బంధువులు 28న కూడా ఉన్నందువలన ఇద్దరూ వాడుకున్నారు. ఒకే యింటి కుటుంబాలు కనుక సర్దుకుపోయారు. సుధ పెళ్ళితో

బాధ్యత తీరిందన్న మాకు మళ్ళీ పెళ్ళి హడావిడి కలిగింది. అంజు మేనత్తల పెళ్ళిళ్ళే జరిపిన వాళ్ళం. అంజు మా యింట్లోనే పుట్టి, పెరిగి పెద్దదై దానిపై మమకారం పెంచుకున్న వాళ్ళం కదా? మా బాధ్యత ఉండదామరి. అంజు, అనంత్ కూడా మమ్మల్ని మామ్మ, తాత అని ఆప్యాయంగా చుసుకుంటారు కదా. మొత్తం మీద అంజు పెళ్ళి జరిగిపోయింది. ముహూర్తం అయింతర్వాత కొంతమంది అంజు తల్లిదండ్రులని అభినందిస్తే, మరికొంతమంది నన్నూ, మావారిని అభినందించారు. ఏది ఎలా ఉన్నా వాళ్ళిద్దరూ కలకాలం సుఖంగా ఉండాలి. అంతేకదా మేము కోరుకునేది.

పెళ్ళికి వచ్చిన బంధువులంతా వెళ్ళిపోయారు. విశాఖపట్నం మా రాధక్క కుటుంబం, మా ఆడబడుచు, వాళ్ళ కుటుంబాలు వడుగుకి కూడా ఉండి అభినవ్‌ని దీవించి మరీ వెళ్ళారు. వడుగు ముందురోజున, అంటే అక్టోబరు 28న, సాయంత్రం మా సుధ అత్తమామల పెళ్ళి గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్ జరుపుకున్నారు. అంజూ పెళ్ళైన సాయంత్రం, అంటే 27న, మా సుధ అందరికీ గోరింటాకు డిజైన్లు వేయించింది. రాత్రి అందరూ అంత్యాక్షరి ఆడుకున్నారు. అభినవ్ వడుగు ఉంది కదా అని అంజూని వాళ్ళత్తవారు బెంగుళూరు పిల్చుకెళ్ళకుండా మద్రాసులోనే వాళ్ళ బంధువుల యిళ్ళకి ఆనవాయితి కదా అని నిద్ర చేయించి వచ్చారు .ఈ విషయం మేము అంజు నిశ్చితార్థం రోజునే వాళ్ళ అత్తవారికి చెప్పుకున్నాం. అభినవ్ వడుక్కి అంజు మద్రాసులో ఉండితీరాలని, దానికి వాళ్ళు సమ్మతించారు. అందరూ గోరింటాకు, పాటల సందడిగా ఉన్నా కూడా నాకు మా రఘుమ రాలేదే అని బాధగా అనిపించింది. దాంతో కాసేపు ఫోన్ చేసి మాట్లాడాను. మా రఘుమ వాళ్ళు పెళ్ళికి, వడుక్కి రావడానికి టిక్కెట్లు బుక్ చేసుకున్నామని ఎందుకైనా మంచిదని డాక్టరు దగ్గరికి చెకప్‌కి వెళితే అన్ని టెస్ట్‌ల్లోనూ వాళ్ళాయన E.C.Gలో లోపం ఉందని Angiogram చేయించుకోవాలని, ప్రయాణం చెయ్యొద్దని డాక్టరు చెప్పారని చెప్పింది. Angiogram చేస్తే కొన్ని బ్లాక్స్ ఉన్నాయని, దానిని ట్యూబ్ పెట్టి క్లీన్ చేస్తారని చెప్పింది. తీరా నాలుగురోజులైనతర్వాత బై-పాస్ సర్జరీ అయిందని తెలిసింది. మృదుల వాళ్ళు అమెరికాలో ఉన్నారు, మూడవ అమ్మాయి శ్రీలక్ష్మి గర్భవతిగా ఉందని దానికి తెలియచెయ్యలేదు. నేను చూస్తే యిక్కడ గాబరా పడ్తానని పైగా ఫంక్షన్‌లు ఉన్నాయి కదా అని తెలుపలేదట. పూనే నుంచి వాళ్ళ రెండవ అమ్మాయ్ కరుణ మాత్రం మూడేళ్ళ పాపని పిల్చుకొచ్చి ఆపరేషన్ సమయానికి ఉండి, వాళ్ళ నాన్నగారు ఇంటికి రాగానే ఊరెళ్ళిపోయిందని తెలిసింది. అది వినగానే నాకు ఉండబట్టక, మా వారు పనిమీద హైదరాబాదుకి వెళ్తూంటే నేను కూడా వెళ్ళి రెండు మూడురోజులుండి వచ్చాను. దీపావళి అయిన తర్వాతే నేను హైదరాబాదుకి వెళ్ళివచ్చినది.

**మా అంజు** పెళ్ళయిన వెంటనే దీపావళి పండగ వచ్చింది కదా. అంజు, కార్తీక్ బెంగుళూరునుంచి వచ్చి పండగ అయిన తర్వాత వెళ్ళిపోయారు. అంజు డిగ్రీ పూర్తిచేసి పెళ్ళికి ముందునుంచే టి.సి.యస్.లో ఉద్యోగం చేస్తూ పెళ్ళయ్యాక బెంగుళూరికి మార్చుకుంది.

వడుగునాడు మా అభినవ్ క్లాసు పిల్లలు వచ్చారు. వాళ్ళని చూడగానే వాడికి అమిత సంతోషం అయింది. నేనూ, మా వారైతే ఆ పిల్లలకి కుర్చీలు వేసి మర్యాద చేసి కూర్చోపెట్టాం. వాళ్ళు పాపం స్కూలు ఉన్నా కూడా పొద్దున్నే వడుగుకి రావడం విశేషం కదా, వాళ్ళను భోజనాల శాలకి పంపించి టిఫిన్లు అయి కిందికి వచ్చాక మ సుధ ఆ పిల్లలకి వెళ్ళేటప్పుడు స్పెషల్ గిఫ్టులిచ్చి పంపించింది. ఆ మధ్యాహ్నం భోజనాలయినతర్వాత అభినవ్ కీ - బోర్డు ప్రోగ్రాం పెట్టాడు. బాగా వాయించాడని అందరూ పొగిడారు. అంజూ భర్త, అత్తమామలతో మధ్యాహ్నం బయల్దేరి వెళ్ళింది. అంజూ, అభినవ్‌లు ఒకరికొకరు ఆప్యాయంగా ఉంటూ వుండడం వలన వీడిని వదిలివెళ్ళాలని అంజూ చాలా బాధపడింది. మేమంతా మండపం ఖాళీ చేసి సుధ వాళ్ళింటికి వెళ్ళాము. విశాఖపట్నం వాళ్ళు రాత్రి రైలైనందున సుధ వాళ్ళింటికి పిల్చుకెళ్ళి, సాయంత్రం టీ ఇచ్చి రాత్రికి వాళ్ళు రైల్లో తినేందుకు వంటవాళ్ళ చేత చేయించిన భోజనాలు ప్యాక్ చేసి ఇచ్చింది.

నాకు చాలా కాలంగా షిరిడీ సాయిబాబాని దర్శించుకోవాలని కోరిక. మా చెల్లెలు రఖుమకి రెండు, మూడేళ్ళ క్రితం ఫోను చేస్తే అందరూ కలిసి వెళ్దామని అంది. ఎందుకంటే వాళ్ళు ఏటేటా షిరిడీ దర్శనం చేసుకుంటూ ఉంటారు. వాళ్ళ పెద్దమ్మాయి మృదులా వాళ్ళు కూడా అమెరికాలో ఉన్నన్నాళ్ళూ ఇండియాకి వచ్చినపుడల్లా షిరిడి, తిరుపతి దర్శనం చేసుకుంటూ ఉండేవారు. అందువలన మా చెల్లెలు, వాళ్ళాయన, నేనూ, మా వారు నలుగురూ వెళ్ళాలని అనుకున్నాము. కానీ దానికి వాళ్ళమ్మాయి పెళ్ళి తరువాత పురుళ్ళు, వాళ్ళాయన ఆపరేషను అన్నీ ఒకదానికొకటి వస్తూండడం వలన దానికి రావడానికవలేదు. ఇలా ఆలస్యం అవుతోందని మా రఖుమకి ఫోన్ చేస్తే, అది ఒక ఐడియా ఇచ్చింది. సాయిబాబాకి పూజచేసి ముడుపు కట్టి అది బాబా ఫోటో దగ్గర ఉంచమంది. నేనలాగే చేసాను. సరే, మా సుధ సాధారణంగా వాళ్ళ టూరు ప్రోగ్రాంలు టిక్కెట్లు, హోటలు, అక్కడ తిరిగే వెహికల్స్ అన్నీ వివరంగా బుక్ చేసుకుంటుంది. ఎందుకంటే వాళ్ళు ముగ్గురూ ప్రతి డిసెంబరు సెలవులకి, మే సెలవలకి ఏదో ఊరు వెళ్తుంటారు. అందుకని దానిని నాకూ, వాళ్ళ నాన్నగారికి షిరిడీ వెళ్ళే దారి ఏదైనా చూపించమని, టిక్కెట్లు బుక్ చెయ్యమని అడిగాను. అదీ, శకుంతల మాట్లాడుకుని వేసవి సెలవులైతే మంచిది, వాళ్ళకీ, పిల్లలకీ సెలవులొస్తాయని, అమ్మా, నాన్నలని ఒంటరిగా పంపడం వద్దనుకుని, మాతో వాళ్ళ రెండు కుటుంబాలు చేరి వెళ్ళొచ్చని ప్లాను వేసారు. దాని ప్రకారం రైలు ఏ.సి సెకండ్ క్లాస్ టిక్కెట్లు, హోటలు రూమ్స్ అంటే, పూనె, షోలాపూరు, షిరిడీలలో హోటల్ రూమ్స్, అక్కడ తిరగడానికి వాహనం సైతం పక్కాగా చేసింది. మేమిద్దరం, మా శకుంతల, సతీష్, స్నేహ, సుధ, కార్తీక్, అభినవ్ మా ఎనమండుగురు చక్కగా దర్శనం చేసుకుని వచ్చాం. షిరిడీ నుంచి వచ్చేటపుడు అంబా భవానీ, శనీశ్వర దేవుని దర్శనం, పంథర్పూర్ పాండురంగ విఠల్, రుక్మిణీదేవిని దర్శనం చేసుకుని, పూనెలో షాపింగ్, షోలాపూర్‌ల్ బెడ్ షీట్స్ అవి కూడా చేసుకుని వచ్చాము. మా యిద్దరికీ ఏ మాత్రం ప్రయాస అవకుండా మా అమ్మాయిలు చూసుకున్నారు. మదరాసు నుండి బయల్దేరే రోజున మా చెల్లెలు ముడుపు జ్ఞాపకం చేసింది పాపం. అప్పటికే నేను పెట్టెలో పెట్టుకున్నానని చెప్పాను. ఆ ముడుపు కట్టుకున్న ఆరునెలలు తిరగకుండానే వెళ్ళి వచ్చాము. అంతే, మేము షిరిడీకి మే 2న బయలుదేరి 8న రాత్రి ఫ్లైట్‌లో తిరిగి వచ్చేసాము.

తరువాత మే నెల 22వ తేదీన హైదరాబాదులో పంజాగుట్టలో ఉంటున్న మా బాబాయిగారి మనుమడి ఉపనయనం, అంబుజమామి కూతురు జయశ్రీ వాళ్ళమ్మాయి సంగీత నిశ్చతార్థం మే నెల 27న ఉండింది. వెళ్దామనుకున్నాము. పైగా చాలాకాలంగా నాకు శ్రీశైలం, యాదగిరిగుట్టకి వెళ్ళాలని ఉన్నా, సందర్భం కలిసిరాలేదు. ఇవన్నీ తెములుచ్చుకోవచ్చని మా సుధని ఇంటర్‌నెట్‌లో టిక్కెట్లు బుక్ చెయ్యమంటే, "ఈ ఎండల్లో మీరు వెళ్ళకపోతేనేం? ఆ ఫంక్షన్స్‌కి చాదస్తంగా వెళ్ళకపోతేనేం? ఈ వయస్సులో మీరెళ్ళలేదని ఎవ్వరూ అనుకోరు. వెళ్ళక్కర్లేదు. మొన్ననేగా షిరిడీ అంతా తిరిగొచ్చాము. పైగా యాదగిరి కొండెక్కలేవు" అంది.

అదృష్టవశాత్తు సింగీతంగారికి అఫీషియల్ వర్క్ తగిలి హైదరాబాదుకి వెళ్ళవలసి వచ్చింది. ఇక వయసు పెరిగేకొద్దీ వెళ్ళడానికవదని నిశ్చయించుకుని మొండికేసి ఆయనతో ఫ్లైట్ ఎక్కేశాను. హైదరాబాదులో మావారి స్నేహితులు జర్నలిస్టు భరద్వాజ, రాంప్రసాద్ గార్ల సహాయం వలన శ్రీశైలం, యాదగిరి దర్శనం చేసుకుని వచ్చాము. యాదగిరి కొండపై కారు రాస్తా వేసినందువలన మాకేమీ ప్రయాసవలేదు. మాతో వచ్చిన పెద్ద మనుష్యులు పొద్దున్న టిఫిన్లు సహితం యింటినుంచి తెచ్చి, శ్రీశైలం, యాదగిరి దర్శనాలకి చాలా సహకరించారు.

ఇదిలా ఉండగా మే నెల 22న మా అత్తగారి తద్దినం వచ్చింది. మేము బర్కత్‌పురా మఠంలో ఏర్పాటు చేసుకుందామనుకుంటుండగా, హైదరాబాదులోనే సైనిక్‌పురిలో ఉన్న మా పద్మ, బాబు వాళ్ళింటికి వచ్చి కొన్నాళ్ళుండమన్నారు. రెండు మూడురోజులుకన్నా ఉండడానికవదని చెప్పాను. మా పద్మ వాళ్ళింటికి దగ్గరగా ఒక రాఘవేంద్రస్వామి గుడి వుందని, ఆ మఠంలో తిథి

ఏర్పాటు చేస్తానని, అక్కడికే రమ్మనమని ఫోను చేసింది. మా పద్మ యింట్లో రెండుమూడురోజులు గడిపి, మా అత్తగారి తిథి ఆ మఠంలోనే పెట్టాము.

తతంగం అంతా అయింతర్వాత బ్రాహ్మణులకి, ముత్తయిదువకి తాంబూలాలు ఇవ్వాలి కదా అలాగే మా పద్మా, భర్త బాబు ఒకావిడ దగ్గరికి పిల్చుకెళ్ళి "అత్తా, మేమెప్పుడూ ఈవిడకే యిస్తాము తాంబూలం. మీరు కూడా యివ్వండి" అన్నాడు. సరేనని తాంబూలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

ఇంతలో మా వారు "కల్యాణి! ఈవిడెవరో తెలుసా?" అనడిగారు.

"తెలీదు, ముత్తయిదువకి తాంబూలం ఇవ్వాలికదా అని ఈవిడకిస్తున్నాను" అన్నాను.

"ఈవిడెవరనుకున్నావ్. మా దేవి దొడ్డమ్మ కూతురు సీత" అన్నారు నవ్వుతూ సంతోషంగా.

నేనాశ్చర్యపోయాను. ఈవిడ హైదరాబాద్‌లో ఉంటోందని విన్నాను. పైగా 22 ఏళ్ళ క్రితం మా శకుంతల పెళ్ళికొచ్చి వెళ్ళింది. కానీ ఈవిడని నేను గుర్తుపట్టలేకపోయాను. 'అరే! ఆవిడా! సీత వదినా! సారీ అండీ! నేను మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను. ఎప్పుడో మా శకుంతల పెళ్ళిలో చూసినది' అన్నాను.

"చూశారా! మీ పిన్ని ప్రసాదం, ఈ తాంబూలం తీసుకునే అదృష్టం మీకెలా దక్కిందో! సమయం కలిసివస్తే యిలాగే జరుగుతుంది" అన్నాను.

మా వారితో "మీరామెను ఎలా గుర్తుపట్టారు?" అనడిగాను.

"లేదు తిథి అయినతరువాత, గుళ్ళో ప్రదక్షిణం చేస్తూ వుంటే తను ఎదురుపడింది. కాసేపు ఒకర్నొకరు చూసుకున్నాక "నువ్వు శీనువి" కదూ! అనడిగింది అన్నారు. భోజనాలయినతర్వాత గుడి ఆవరణలోనే ఉన్న తన రూముకి పిల్చుకెళ్ళి కాసేపు మాట్లాడి, నాకూ, నాతో వచ్చిన మా రమకి జాకెట్టు గుడ్డలిచ్చి పంపించింది.

ఇదిలా ఉండగా ఆమె గురించి కొంత చెప్పాలి. సీత సింగీతంకి పెద్దమ్మగారి కూతురు. లైబ్రేరియన్ కోర్సు చదివి ఢిల్లీలోని అమెరికన్ లైబ్రరీలో పనిచేసి హైదరాబాదుకి వచ్చి సెటిలయి, తనకున్న ఆస్తినంతా రాఘవేంద్రస్వామి గుడికట్టించడానికి వినియోగించింది. ఆ గుడి ఆవరణలోనే తానొక రూములో ఒంటరిగా వుంటూ, దేవుడి భజనలు పూజలు అన్నీ జరుపుతూ, తన జీవితాన్ని దేవుడికే అంకితమిస్తూ కాలం గడుపుతోంది. తాను స్వంతానికి వీసమంత ఆస్తికానీ, స్వంత ఇల్లు కానీ అట్టేపెట్టుకోలేదు.

మే నెలలో మేమున్న ఆ పదిహేనురోజులలో రెండు, మూడు రోజులు మా రఖుమ యింటికి భోజనానికి వెళ్తూ, పగలంతా వాళ్ళింట్లో గడిపాను. ఆ సమయానికి వాళ్ళ పెద్ద, రెండో అమ్మాయిలు, మనవలు, శ్రీలక్ష్మి ఆడపిల్ల పుట్టి బాలింతరాలక్కడే ఉండడం, నే వెళ్ళి కొత్తపాపనికూడా చూడ్డం జరిగాయి. మే నెలాఖరున 28రాత్రి ఫ్లైట్‌లో మద్రాసులో దిగాము. మా రమ, పూర్ణవాళ్ళు కూడా హైదరాబాదులో రెండు పెళ్ళిళ్ళకి వెళ్ళినందువలన, మేము మదరాసు చేరుకున్న ఆ రాత్రి శకుంతలా వాళ్ళింట్లో మా డిన్నరు. ఈ సందర్భంలో మా రఖుమను గురించి ఒకటి చెప్పాలి. నెల్లురులో నేనూ, మా సుశీల కర్ణాటక సంగీతం నేర్చుకుంటే మా రఖుమ తన మూడవ ఏటనే ఎదురుగా కూర్చుని తాళం వేసేది. అది చూసి మా సంగీతం మాస్టారు నందగిరి రామచంద్రరావుగారు దాన్ని మెచ్చుకునే వారు. స్కూల్లో, కాలేజీలో పాటలు పాడ్తూ డెవలప్ చేసుకుంది. ఈ మధ్య మా రఖుమ అది సంగీతం నేర్పిన ఇద్దరి శిష్యురాళ్ళతో సౌందర్యలహరి పాటలని రికార్డింగ్ చేసి సీ.డి తయారుచేసుకుంది. దాని భర్త ఏ.వి.రామకృష్ణారావుగారు దీని నిర్మాతే కాక దానికి కామెంటరీ కూడా చెప్పారు. ఇది వంద శ్లోకాలు, 50 రాగాలతో ఉన్న రాగమాలిక.

జూలై మూడవ తేదీన శ్రీలక్ష్మి కూతురుకి బారసాలయితే మళ్ళీ హైదరాబాదుకు వెళ్ళి వచ్చాము. పాప పేరు అశ్రిత అని పెట్టారు. మళ్ళీ ఫంక్షన్‌లో మా బంధువులందరినీ కలుసుకోవడం జరిగింది. ఇలా మాకు ప్రయాణాలపై ప్రయాణాలు జరిగాయి.

2011వ సంవత్సరం డిసెంబరు నెల బెంగుళూరులో మా పినమామగారి ఆఖరికొడుకు పాండురంగ పెళ్ళయితే వెళ్ళి, అక్కడే శ్రీలక్ష్మి నెల తప్పితే వాళ్ళ ఇంటికెళ్ళి దాన్ని చూసి, గాంధీ బజారులో కొంచెం షాపింగు చేసుకుని, మా సుశీల కొడుకు రాజా వాళ్ళింటికెళ్ళి, వాళ్ళనికూడా చూసుకుని, చెన్నై వచ్చి చేరాము. నెల్లాళ్ళు కూడా తిరగకముందే మా పినమామగారు పోయిన వార్త వచ్చింది. చాలాకాలంగా ఆయన ఒంట్లో బాగోలేక అందరినీ కొంత గుర్తుపట్టి, కొంత గుర్తుపట్టక ఉంటుండేవారు. కొడుకు పాండు పెళ్ళికి మేము వెళ్ళినపుడు కూడా బాగానే ఉన్నారు. పైగా 2010 మార్చి నెలలో మా గోల్డెన్ జూబ్లీకి కారేసుకుని పెద్దకొడుకు సుదర్శన్ ఆయనని పిల్చుకుని వచ్చాడు. మేమెవ్వరం ఎదురు చూడలేదు, ఆ పెద్దాయన శ్రమ తీసుకుని వస్తారని. అయినా, మా అత్తగారు, కొడుకులు, కోడళ్ళు అందరూ వచ్చారు. ఇద్దరు కొడుకులు కుటుంబాలు చెన్నైలోనే ఉన్నారు. మార్చిలో మా ఫంక్షన్‌కి వచ్చి మమ్మల్ని ఆశీర్వదించారు. డిసెంబరు నెలలో కొడుకు పెళ్ళి చేసాడి. జనవరి 5వ తేదీన ఆయన మరణ వార్త విన్నాము. పోయే నాటికి ఆయన వయసు 90దాటింది. ఆయన పేరు సింగీతం వెంకటరమణరావుగారు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్, చాలాకాలం నెల్లూరులో ఉండి కొంత పెద్దతనం వచ్చిన తర్వాత పెద్ద కొడుకు బెంగుళూరులో ఉంటే అక్కడకు వెళ్ళి సెటిల్ అయ్యారు. ఆయన మా వారికి స్వయాన పినతండ్రి. నేనూ, మావారు ఆయిన పోయిన దినవారాలకి కారులో బెంగుళూరుకి వెళ్ళివచ్చాము.

మా మనుమడి ఉపనయనం అయిన సంవత్సరం మొదట శ్రావణ పూర్ణిమ 2011 జంధ్యాల పౌర్ణమి, మా అల్లుడు కార్తీక్ తిరుచ్చిలో ఉండడం, మా సుధ అత్తమామలు అమెరికాకి వెళ్ళడం వలన మొదటి annual ఉపనయన ఫంక్షన్, హోమం, శాస్త్రుల వారిని రప్పించి వాడికి కొత్త జంధ్యం వేయించడం. సుధ వాళ్ళత్తగారి సలహా ప్రకారం మా యింట్లో ఏర్పాటు చేయించింది. నన్నూ, మా వారిని పీటల మీద కూర్చునేలా చేసింది. చూశారా! మేం చేసుకున్న పుణ్యం. దౌహిత్రుడికి చేసే భాగ్యం కలిగింది. వాళ్ళెవరూ ఊళ్ళో లేనందున. మా యిద్దరి ఆనందం విషయం నేను చెప్పక్కర్లేదనుకుంటా. సుధ, సత్యభామని, వాళ్ళబ్బాయి అశ్విన్ కుమార్ని రమ్మంటే వాళ్ళూ వచ్చారు.

మా వారికి మళ్ళీ సినిమాలో వేషం వేసే ఛాన్సు వచ్చింది. కొత్తప్రొడ్యూసరు, నిర్మాణంలో, దర్శకత్వంలో అనుభవం ఉన్న ఒక కొత్త డైరెక్టర్ సారధ్యంలో ఒక పిక్చరుకి పనిచెయ్యమని దీపావళికి ముందు వాళ్ళిద్దరూ స్వయంగా వచ్చి, కథ చెప్పి స్క్రిప్టు ఇచ్చి వెళ్ళారు. మావారు ఆ స్క్రిప్టును చదివి ఒప్పుకున్నారు. ప్రొడ్యూసర్ గారి పేరు శ్రీనివాస్, డైరెక్టరు పేరు కిరణ్. దీపావళి వెళ్ళిన తర్వాత షూటింగు మొదలుపెడ్తామని చెప్పి, మరి రెండు మూడు సార్లు మదరాసుకు వచ్చి స్వయంగా కలుసుకుని వెళ్ళారు.

నవంబరు నెలాఖరులో మా వారికి ఢిల్లీనుంచి ఫోన్ వచ్చింది. Global International Film Festival వాళ్ళు మా వారికి లైఫ్ టైమ్ అఛీవ్ మెంట్ అవార్డ్ ఇస్తున్నారని, యాక్సెప్ట్ చెయ్యమని, అది Marwa studios Delhi లో జరుగుతుందని చెప్పారు ఫోనులో, దానికి సింగీతంగారికి to and pro flight charges, hospitality యిస్తామని వచ్చింది. ఈసారి మాత్రం మా కూతుళ్ళని, మనవలని కూడా పిల్చుకెళ్దామని నిశ్చయించుకున్నాము. మా పూర్ణా, రమ కొడుకు అనంత్‌ని కూడా పిల్చుకు వెళ్ళాము. ముందు నేను, మా వారు వెళ్ళాము. పిల్లలంతా వాళ్ళ సెలవురోజు చూసుకుని శని, ఆదివారాలలో కలిసివచ్చేట్టు, సోమవారం మాత్రం సెలవు పెట్టేట్టు వచ్చారు ఢిల్లీకి. అనంత్ మాత్రం ఫంక్షన్, మావారికి అవార్డు ప్రధానం 27 రాత్రిన చూసుకుని, సోమవారం తెల్లవారుఝామున ఫ్లైట్‌లో మద్రాసు వెళ్ళిపోయాడు.

ఢిల్లీలో మా నర్సింగ్, జయల కొడుకు సుధీంద్ర ఇంజనీరింగ్ పాసయి ఐదారేళ్ళుగా ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. పద్మ, బాబు కొడుకు శ్రీనాథ్ కూడా ఉద్యోగరీత్యా భార్యా, పిల్లలతో ఢిల్లీలో ఉంటున్నాడు. వాళ్ళిద్దరూ ఫంక్షన్‌కు వచ్చి వెళ్ళేటప్పుడు వాళ్ళింటి నుంచి ఎయిర్‌పోర్టు దగ్గరని అనంత్‌ను వాళ్ళతో పిల్చుకెళ్ళారు. మేము మాత్రం 28 సోమవారం రాత్రి 11.30 చెన్నై చేరుకున్నాము.

ఢిల్లీలో Marwa studio Disabled children స్కూలు వుంది. Mr.Marwa ఆ స్కూలుకి విరాళం యిస్తూ, వాళ్ళ బాగోగులు చూసుకుంటున్నాడు. వాళ్ళచేత కల్చరల్స్ ప్రోగ్రాం పెట్టించాడు. ఆ చిన్నారులు చెవులు వినిపించకుండానే రికార్డెడ్ మ్యూజిక్‌కి కరెక్ట్‌గా డ్యాన్సులు చేసారు. ఫంక్షన్‌లో మా వారు మాట్లాడుతూ మా పిల్లలు మాతో ఎక్కడికీ రాలేదని పర్టిక్యులర్‌గా యిక్కడికే వచ్చారని Marwa చేస్తున్న సేవలు అమోఘమని ఉపన్యాసం యిచ్చారు. మార్వా సింగీతం కుటుంబ సభ్యులందరినీ స్టేజ్ మీదకి రమ్మన్నారు. నేనూ, శకుంతల, సుధ అతను చేస్తున్న కృషిని మెచ్చుకుంటూ మాకు తోచిన రెండు మాటలు మాట్లాడాము. నిజంగా మా అమ్మాయిలకి అది ఒక అనుభూతి.

చెన్నైలోనే డిసెంబరు నెలలో Hindu Metro వారి Literature for Life ప్రోగ్రాంలో కొంతమందితోపాటు మా వారు కూడా మాట్లాడారు. ఆ రోజు ఆయన speech highlight అయింది. ఆ సారాంశం హిందూ పేపర్‌లో హెడ్‌లైన్స్‌లో పడింది.

అక్టోబరు 6 విజయదశమి రోజున మావారి పుట్టిన రోజయింది. హోటలు కెళ్ధామంటే ఆ వేళ గురువారం అయింది. నా పుట్టినరోజు అక్టోబరు 9న అయింది. ఆవేళ ఆదివారం అయింది. మా అమ్మాయిలు G.R.T.Hotelకి పిల్చుకెళ్ళి ట్రీట్ యిచ్చారు. మా సుధ కేక్ తెచ్చింది. నేనూ, మావారు యిద్దరం కలిసి కట్ చేశాము. ఇద్దరి పుట్టినరోజులు కలిసి చేస్తున్నాంగా అందుకని నేను కేక్ కట్ చెయ్యడం రెండవసారి.

డిసెంబరు నెలలో మా వారిని నెల్లూరులో ఒక ప్రోగ్రాంకి ఛీఫ్ గెస్ట్‌గా పిలిచారు. దానిని వెన్నెలకంటిగారు ఎరేంజ్ చేసారు. మావారికి వేరే కారు యిస్తామన్నారు. నెల్లూరుకి కదా అని నన్ను కూడా రమ్మన్నారు మావారు. సరేనని మా కార్లోనే వెళ్ళాము. ముందు మేము సూళ్ళూరుపేట చెంగాళమ్మ దర్శనం చేసుకుని వెళ్దామని ప్లాను. ప్రతిసారి గూడూరుకి, నెల్లూరుకి వెళ్ళినపుడు వెళ్తూ చెంగాళమ్మ దర్శనం చేసుకోవడం ఆనవాయితి. అలాగే ఆ ఊర్లోనే విజయ అనే అమ్మాయితో తెలుగు టైపు పనివుంటే కె.వి.కృష్ణయ్యతో మాట్లాడాము. సరేనని సూళ్ళూరుపేటకి గుడి దగ్గరకెళ్ళేసరికి కె.వి.కృష్ణయ్య కొడుకు డా.సాయిరాం, దేవస్థాన కమిటీ సభ్యులు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి మేళతాళాలతో కలశంతో, పురోహితుల పారాయణతో సహా మమ్మల్ని గర్భగుడిలోకి పిల్చుకు వెళ్ళారు. ఎన్నో వందలసార్లు చెంగాళమ్మ దర్శనం చేసుకున్నా, గర్భగుడిలోకి వెళ్ళడం ఇదే మొదటిసారి. నాకు ఇది కలా నిజమా అనిపించింది. ఆనందంలో కళ్ళు చెమర్చిపోయాయి. మేమేదో సింపుల్‌గా పోతుందనుకుంటే పెద్ద ఆర్భాటం అయింది. తరువాత కె.వి.కృష్ణయ్య ఇంటికి వెళ్ళాము. గుళ్ళోనూ, యింట్లోనూ కృష్ణయ్య కూతుళ్ళు, కోడలు చాలా బాగా మమ్మల్ని ఆదరించారు. విజయని, భర్తని కలుసుకుని అక్కణ్నుంచి బయలుదేరాము.

సూళ్ళూరుపేట నుంచి గూడూరుకి వెళ్ళి, అక్కడ భోజనాలు చేసుకున్నాము. ఇంతలోనే టీ.వీలో క్రింద స్క్రోలింగ్ వేసారు. సింగీతం దంపతులు చెంగాళమ్మ దర్శనం చేసుకున్నారని. భోజనం అయినతర్వాత నెల్లూరికి వెళ్ళి వెన్నెలకంటిగారు రిజర్వు చేసిన హోటల్ రూం కెళ్ళాము. సాయంత్రం ఫంక్షన్‌కెళ్ళి ఆ రాత్రి హోటల్లో భోంచేసి రాత్రి పడుకుని మర్నాడు టిఫిన్ హోటల్‌లో తిని చెన్నైకి బయలుదేరాము. వెన్నెలకంటి గారిని మాతోనే రమ్మన్నారు మావారు. ఆయన అలాగే మాతోనే చెన్నై వచ్చేశారు.

**జనవరి 2012వ** సంవత్సరం అడుగిడగానే మావారికి హైదరాబాద్ నుంచి పిలుపు వచ్చింది. ఆయన యాక్ట్ చేసే సినిమా జనవరి 2వ తేదీనుంచి ఆరంభమని, మొదటి తేదీ బయల్దేరమని అన్నారు. కానీ కొత్త సంవత్సరం మొదటి తేదీన రాఘవేంద్ర స్వామి గుళ్ళో అభిషేకముందని రెండవ తేదీన వస్తామని చెప్పి 2న సాయంత్రం బయల్దేరి 7 గంటలకి చేరుకున్నాము. ఎయిర్‌పోర్టుకి స్వయానా ప్రొడ్యూసరు, డైరెక్టరు వచ్చి రిసీవ్ చేసుకున్నారు. 3వ తేదీన మేకప్ టెస్ట్ చేసి 4 నుంచి జనవరి 2 వరకు షూటింగులు సాగాయి. 13 పొద్దున ఫ్లైట్‌కి చెన్నై వచ్చేశాము. మేం 3న వెళ్ళినవాడే ప్రొడ్యూసరు శ్రీనివాస్‌గారు, తన భార్య లలితని స్టూడియోకి పిల్చుకువచ్చి పరిచయం చేశారు. షూటింగు సారథీ స్టూడియోలో జరిగింది. మావారికి పెయిర్ అయిన తులసి కూడా వచ్చింది. మేకప్‌లో మావారిని ఎవ్వరూ గుర్తుపట్టలేదు. షూటింగయి మద్రాసుకు ప్రయాణమయేటపుడు శ్రీనివాస్‌గారు, కిరణ్ కారు వద్దకు వచ్చి రెండవ షెడ్యూల్‌కి నన్ను కూడా రమ్మన్నారు.

షూటింగు జరిగినన్నాళ్ళు లలిత, తులసి నాకు మంచి కంపెనీ ఇచ్చారు. అప్పుడప్పుడు శ్రీనివాస్‌గారి తల్లి కూడా వచ్చేవారు. నేను కలివిడిగా మాట్లాడ్తానని ఆవిడ నన్ను చాలా మెచ్చుకున్నారు. రెండవ ఆదివారం షూటింగు లేనందున ప్రొడ్యూసరు గారింటికి మమ్మల్ని భోజనానికి పిలిచి మర్యాద చేశారు.

సంక్రాంతి పండుగలైన తర్వాత జనవరి 26న రిపబ్లిక్‌డే కదా. ఆవేళ మా కాలనీ అసోసియేషన్ సభ్యుల పిల్లలతో కల్చరల్స్ చేసారు. అంతకు ముందు కొంతమంది పిల్లలు, పెద్దలు స్పోర్ట్స్ పోటీలలో పాల్గొన్నారు. గెలిచిన వారికి 26న ప్రైజెస్ ఇచ్చారు. ఆవేళ జరిగిన కల్చరల్స్‌లో కొంతమంది గ్రూపు సాంగ్స్ పాడారు, కొంతమంది డ్యాన్సు చేశారు. స్నేహ ముందుగానే అభినవ్ పేరునివ్వడం వలన అభినవ్ సోలో కీబోర్డు వాయించాడు. తరువాత సోలో డ్యాన్సు చేశాడు. మూడు పాటలు డ్యాన్సులో ఆకరి డ్యాన్సు జైహూ పాట డ్యాన్సు చేసేసరికి అందరూ చప్పట్లు కొట్టారు. చాలామంది పిల్లలు షేక్‌హేండిచ్చి అభినందించారు వాడు వాళ్ళకి పరిచయం లేకపోయినా కూడా. కీ బోర్డు కూడా బాగా వాయించాడని అందరూ మెచ్చుకున్నారు ఆవేళ వాళ్ళ నాన్న కార్తీక్ తిరుచ్చి నుంచి వచ్చినందువలన లక్కీగా తన కొడుకు ప్రోగ్రాం చూశారు. Actually ఆయన ఢిల్లీ నుంచి ఆ సాయంత్రం ఫ్లైట్‌లో వచ్చారు. మర్నాడు సెలవైనందు వలన 26న రాత్రి ఫ్లైట్‌కి తిరుచ్చివెళ్ళారు.

రిపబ్లిక్ డే మా కాలనీ కల్చరల్స్, మా మనమడి ప్రోగ్రాం అయినతర్వాత మా వారు ఒకే ఒకరోజు షూటింగుందని జనవరి 27న పొద్దున్న ఫ్లైట్‌కి వెళ్ళి రాత్రి ఫ్లైట్‌కి తిరిగి వచ్చేశారు. ఒక్కరోజు కదా అని నేను వెళ్ళలేదు. ఇంతలో ఆ రోజే తులసి, లలితగారు ఫోను చేసి నాతో హైదరాబాదు నుంచి మాట్లాడారు. తర్వాత ఫిబ్రవరి 8నుంచి షూటింగు ఉందని 7వ తారీఖున పొద్దున్న ఫ్లైట్‌కి వెళ్ళి మధ్యాహ్నం భోజనం హోటల్‌లో తిన్నాము. రెండుసార్లు మేము దిగిన హోటలు ఇన్నర్ సర్కిల్. మంచి హోటలు, శాఖాహారం. ఇది మల్లాది మూర్తిగారు సజెస్ట్ చేశారు. అక్కడ మొత్తం మేము ఇరవైరోజులు గడిపాము. మధ్యాహ్న భోజనం షూటింగ్ స్థలంలో మెస్ నుంచి వచ్చేది. అది బాగానే ఉండేది, ఇంటివంటలాగా. ఈ హోటల్ వాళ్ళు మమ్మల్ని ఏం వంటలు కావాలో అడిగి వండి మరీ చేసేవారు. అందుకే మేం మదరాసుకు తిరిగి వచ్చేటప్పుడు అక్కడున్న ముఖ్యమైన వాళ్ళకి బహుమతులు యిచ్చివచ్చాము.

ఇక షూటింగు రోజులలో లలితగారు రోజూ వస్తూ నాకు కంపెనీ యిచ్చేవారు. షూటింగు విరామ సమయంలో తులసి వచ్చి కబుర్లు చెప్తూ ఉండేది. నన్నూ, మా వారిని అమ్మా, నాన్నా అని పిలిచేది. నాకైతే విసుగు లేకుండా చాలా సరదాగా గడిచింది. ఇక దూరాన షూటింగైతే, ఆ మసాలాల అన్నం అదీ, మా యిద్దరికీ పడదని ప్రొడ్యూసరుగారు ఇంట్లోనే వండించి భార్య లలిత మాకు భోజనం తెచ్చే ఏర్పాటు చేసారు. మాతోబాటు తులసికి కూడా తెచ్చేవారు. ఈ విషయంలో లలిత చాలా సహనంగా మెలిగేవారు. కొంచెం

కూడా విసుక్కునేవారు కాదు. అప్పుడప్పుడు వాళ్ళిద్దరి పిల్లల్ని షూటింగుకి పిల్చుకు వచ్చేవారు. ఇంటర్మీడియట్ చదువుతున్న అమ్మాయి, 8వ తరగతి చదువుతున్న అబ్బాయి.

హైదరాబాదులో కొంతమంది అబ్బాయిలు పరిచయం అయ్యారు. కోటీగారబ్బాయి రాజీవ్, సినిమాలో హీరోవేసిన అబ్బాయి అజయ్, ఒక కన్నడ అమ్మాయి. ఇలా భీమవరం అబ్బాయిలు కూడా తటస్థపడ్డారు. వీరందరూ ఆర్టిస్టులు. వారిలో దక్షిత్ అనే అబ్బాయి భీమవరం గురించి చెపుతూంటే నాకు చాలా సంతోషం వేసేది. అసలతనిది పాలకొల్లు భీమవరం పాలకొల్లుకి దగ్గరే అవడం వలన భీమవరంకి ఆ అబ్బాయి తరచూ వెళ్ళడం, అక్కడ పొలాలు, కోడిపందేల పోటీలు ఫోటోలు తియ్యడం అతని హాబీ. అవి నాకు కొన్ని చూపించాడు. నేను కూడా అక్కడ చదివానని, మా పెళ్ళి అక్కడే అయినది అని చెపితే అతను చాలా సంతోషించేవాడు.

తులసి "అమ్మా! మీ భీమవరం అబ్బాయి మీకు మంచి కంపెనీ యిచ్చాడా?" అని అడిగేది. భీమవరం కబుర్లు చెప్తూ ఇంకా ఒకరిద్దరూ భీమవరం వాళ్ళు కూడా ఆ యూనిట్‌లో ఉన్నారు. దక్షిత్ నాన్నగారు కూడా, ఫలానా సింగీతం శ్రీనివాసరావుగారి భార్య భీమవరం ఆవిడే అని తెలిసి సంతోషించారని చెప్పాడు నాతో. అక్కడ కొన్ని సంవత్సరాలే వున్నా పశ్చిమ గోదావరి అన్నా, తూర్పు గోదావరి ఊళ్ళ పేరు విన్నా నాకు చాలా సంతోషంగా ఉంటుంది ఇప్పటికీ. ఈ వయసులో మళ్ళీ ఆ ఊళ్ళన్నీ తిరగగలమా?

షూటింగు సమయంలో డైరెక్టర్ కిరణ్‌గారు మా వారిని, సీనియర్ డైరెక్టర్ కదూ! చాలా గౌరవంగా చూసుకునే వారు. నన్నూ, మా వారిని బాయ్స్ మొదలుకుని, శ్రీనివాస్‌గారు, కిరణ్ కూడా చాలా గౌరవంగా చూసుకునేవారు. నేను మెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అందరూ నాకు చేయూత నిచ్చేవారు. మమ్మల్నిద్దరినీ ప్రొడ్యూసర్‌గారు, భార్య వాళ్ళ కుటుంబ సభ్యులుగా చూసుకునేవారు. శ్రీనివాస్ గారైతే ఎప్పుడూ మమ్మల్నిద్దరిని పార్వతీ, పరమేశ్వరుల్లాగా వచ్చారు అంటూండేవారు. షూటింగయిన తర్వాత రెండురోజులకి మేము ఒక పెళ్ళికి అటెండ్ అవవలసివస్తే హోటల్ ఖాళీ చెయ్యనివ్వలేదు ప్రొడ్యూసర్‌గారు.

ఇకపోతే, ఒక రోజు రాత్రి బారసాల, ఉయ్యాల సీనులు వచ్చాయి. పూల అలంకరణ, ఉయ్యాల అలంకరణలో పూలదండలతో అలంకరణతో పాటు విడిపూలు కూడా నేలమీద వేసారు. రిహార్సల్సులో మా వారు ఆ పూలమీద చెప్పు జారి కిందపడబోయారు. కానీ కిరణ్ వెంటనే వెళ్ళి మా వారిని పట్టుకున్నారు. వెల్లికిలా పడవలసిన మావారు పడలేదు. కానీ మోకాలు దగ్గర ఎముక కొంచెం వంకర తిరిగి మోకాలు నొప్పి పెట్టింది. కిరణ్, మరి యిద్దరు మా వారిని రెండు వైపులా పట్టుకుని, కుర్చీలో కూర్చోపెట్టి, కాలుకింద మరొక కుర్చీవేసి, డైరెక్టర్ కిరణ్ కాలు షూస్ విప్పి, మోకాలు మర్ధనా చేస్తూ చటుక్కున తెప్పించిన Volini spray వేసి కాసేపురుద్దారు. "మీరేమిటండీ కాలు బూట్లు విప్పుతార"న్నా ఆయన వినిపించుకోలేదు. మావారిని కాసేపు అలాగే విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి, షాట్‌కి వెళ్ళిపోయారు. కాసేపుండి మావారే రెండే రెండు షాట్లుకదా చేస్తానంటూ ఇద్దరి ముగ్గురి సహాయంతో షాట్ దగ్గరికెళ్ళి ఎలాగో టేక్స్ చేసారు.

మెట్లపైన కుర్చీలో కుర్చుని షూటింగు చూస్తున్న నేను మా వారు పడగానే లేచి నిల్చుని ఆయన్ని చూడ్డానికని మెట్లవద్దకు వెళ్ళాను. నా ఉద్దేశం ఆయన వెల్లకిలా పడ్డారని ఆయన్ని చూడగానే టెన్షన్‌లో నేను కింద తూలి పడబోతుంటే యిద్దరు ముగ్గురు ఆడవాళ్ళు నన్ను ఒక కుర్చీలో కూర్చోపెట్టి, నాకు ఉపచారాలు చెయ్యసాగారు. నేను ఏడుస్తున్నాను. ఇంతలో షూటింగ్ స్పాట్‌నుంచి తులసి పరుగు పరుగున మెట్లెక్కి వచ్చి "అమ్మా! అమ్మా! సార్‌కి ఏమీ అవలేదుట. ముందు మీకు చెప్పి రమ్మన్నారు, కంగారు పడకండి. సో స్వీట్! చూడండి, సారు పడినా కూడా మీరు కంగారు పడ్తారని నన్ను చెప్పి రమ్మన్నారు" అంది. నాకు తనది చెప్పేసరికి ఏడుపు యెక్కువై తులసిని పట్టుకుని ఏడ్చేశాను. తులసి తాగడానికి నీళ్ళు తెప్పించి, నన్ను చూసి తనకి ఏడుపు వచ్చింది. "సారు కింద పడలేదమ్మా! కిరణ్ వెళ్ళి పట్టేసుకున్నాడు" అని చెప్పింది. తరువాత సినిమాలో పాల్గొనే అబ్బాయిలు, అమ్మాయిలు వచ్చి నాకు ధైర్యం

చెప్పసాగారు. షూటింగయి రూంకి వెళ్ళాలి కదా, మెట్లు దిగాలి. ఎలా? ఇంకా నా గుండె ధడధడా నాకాళ్ళు వొణుకుతునే ఉన్నాయి. ఆ సినిమాలోని హీరో అజయ్ నన్ను చెయ్యి పట్టుకుని నేను దిగడానికి సహాయం చేశాడు. హోటలు కెళ్ళి మావారి మోకాలిని Volini Zel, రాసి వేడినీళ్ళు కాపడం పెట్టాను. Dolo - 650 ఇచ్చాను. ఆయన నిద్రపోయారు. కానీ నాకు నిద్రమాత్రలు వేసుకున్నా కానీ నిద్రరాలేదు. ఆ జరిగిన దృశ్యాలే తల్చుకుంటూ ఏడుస్తు పడుకున్నాను.

మర్నాడు షూటింగు పొద్దున్న లేదన్నారు. ఆ వేళ మధ్యాహ్నం ఆ గంటకి కారు వస్తుందన్నారు కదా అని పొద్దున్న టిఫిన్ తినకుండా మధ్యాహ్నం 12.30కల్లా లంచ్ తిన్నాము. ఒంటిగంటకల్లా లిఫ్ట్‌లో కిందకు వెళ్ళి కారుకోసరం వెయిట్ చేసాము. 1.45 అయినా కూడా కారు రాలేదు. మావారు ఫోన్ చేస్తే ఇంకా గంటపడ్తుంది అన్నాడు. మేం మళ్ళీ రూంకెళ్ళి వెయిట్ చేసాము. గంటదాటినా కూడా కారు రాకపోతే మావారు కిరణ్ గారికి ఫోన్ చేస్తే, అసలు షూటింగు ఉంటుందో ఉండదో ఫోన్ చేసి చెప్తానన్నారు. మావారు వెయిట్ చేసి, నిద్రపోయారు.

అయిదుగంటలయింతర్వాత, మావారు నిద్రలేచిన తర్వాత కాఫీలయ్యాయి. మావారు కాలు చాలా వాచింది. నాకు భయం వేసింది. 'చూడండి! పక్కనే యశోదా ఆస్పత్రికెళ్ళి ఎక్స్‌రే తీయించుకుందాం. అదే మద్రాసులో ఉంటే విజయా ఆస్పత్రికి వెళ్తాం కదా'' అన్నాను. ''నాకిక్కడ ఏ డాక్టర్లు తెలియదే'' అన్నారు.

''మీరు ఫలానా అని చెపితే ఎవరు ట్రీట్‌మెంట్ ఇవ్వరు'' అన్నాను. పొద్దున్నుంచి ప్రొడ్యూసరు కానీ, డైరెక్టరు కానీ, వాళ్ళ వాళ్ళ పనులవత్తిడివల్ల రాలేదు మా రూముకి.

మావారన్నారు, ''శ్రీనివాస్ గారికి ఫోన్ చేసి కనుక్కుంటాను, ఎవరైనా డాక్టర్లు తెలుసేమోనని'', చేస్తే ఆయన ఫలానా డాక్టరు తెలుసునని ఫోన్ చేసి చెప్పారు. మేము ఆటో చేయించుకుని వెళ్ళాము. శ్రీనివాసుగారు తాను రాలేని పరిస్థితిలో ఒక మీటింగులో ఉన్నానని కారు పంపుతానని అన్నారు. కానీ కారు రావడానికి ఒక గంట పడ్తుంది. అందుకని ఆటో చేయించుకుని వెళ్ళాము. నడిచివెళ్ళేంత దగ్గరే, కానీ ఆయన కాలు నొప్పితో ఎలా నడుస్తారు? ఎక్స్‌రే తీసి, బ్యాండేజి కట్టి, ఐస్ బాగ్ యిచ్చాడు. కొన్ని మాత్రలు రాసిచ్చారు. పది నిమిషాలలో పనైపోయింది. ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను.

మావారి షూటింగు ఫిబ్రవరి 14తో పూర్తయింది. 15వ తారీఖున మాకు ఖాళీ. ఆవేళ పెళ్ళి కూతురికి యివ్వవలసిన గిఫ్ట్, నేను కొన్ని చీరలు, కొన్ని ఊరగాయలు, స్వీట్సు వగైరా షాపింగ్ చేసుకుని అక్కడే వున్న మినర్వా హోటల్‌లో భోంచేసి, షాపింగ్ కంటిన్యూ చేసి సాయంత్రం 5గంటలకి రూము చేరాము. మావారికి కొంచెం కాలు నొప్పి యెక్కువైంది. ఆస్పత్రి వాళ్ళిచ్చిన ఐస్ బాగ్‌తో కాపడం పెట్టుకున్నారు. మర్నాడు 16వతేదీ. ఆ సాయంత్రం మేము జానవాసానికి అంటే ప్రధానానికి వెళ్ళాలి. పొద్దున్న ప్రొడ్యూసర్ గారు, భార్య లలిత మా రూముకొచ్చి కాసేపు మాట్లాడి, మావారిని వెంటనే వచ్చి చూడనందుకు బాధపడి వెళ్ళారు. ఇంకాసేపటికి మా రఘుమ, వాళ్ళాయన వచ్చారు. దానికి మద్రాసునుంచి అది కోరిన ప్రకారం ఒక పట్టుచీరకొని తెచ్చాను. అది కలెక్ట్ చేసుకుని దానికైన పైకం ఇచ్చి, నే కోరిన ప్రకారం బెంగుళూరు నుంచి తెచ్చిన వడియాలు, దేవుడి వత్తులు నాకిచ్చి వెళ్ళిపోయింది.

సాయంత్రం కంపెనీ కారు తెప్పించుకుని, జానవాసానికి వెళ్ళి మండపానికి వెళ్ళాను. భోజనాలైన తర్వాత చెయ్యి కడుక్కోవడానికి వెళ్తూ మెట్టు తట్టుకుని బొక్కబోర్లా పడ్డాను. ముందే చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయిన మావారికీ విషయం తెలియదు. నన్ను నలుగురైదుగురు లేవనెత్తి, నేను కుంటుతూ రావడం చూసి నిర్ఘాంతపోయారు. కానీ మేము వెళ్ళినప్పట్నుంచీ జయశ్రీవాళ్ళ పెదనాన్నగారబ్బాయి, మాకు మదరాసులోని పరిచయం వలన బాగా కనుక్కున్నాడు. కూడానేవుండి కారెక్కేవరకు మమ్మల్ని బాగా చూసుకున్నాడు.

మర్నాడు రాగలనో లేదో ముహూర్తానికనుకున్నా, కానీ పెళ్ళికి మా రఘుమ, రామకృష్ణారావు, మా పద్మ, బాబు వస్తారు కదా అని 17 పొద్దున్న పెళ్ళికి వెళ్ళాము. రఘుమ వాళ్ళు రాలేదు కానీ పద్మ, బాబు వచ్చారు. భోజనాలైనతరాత ఎవరిదారిన వారు వచ్చేశాము.

షూటింగులో మా వారు పడగానే శకుంతల కొంచెం సెంటిమెంటల్‌గా బాధపడింది. కానీ సుధ మామీద ఉన్న ప్రేమతో వాళ్ళ నాన్న పడగానే, "ఈ వయసులో అమ్మా, నాన్నగారికి ఈ ప్రయాణాలు, అక్కడకెళ్ళి పడడాలు అవసరమా! నాన్నగారసలు యాక్టింగ్ కి ఎందుకు ఒప్పుకోవాలి? ఇద్దరూ అలా ఒంటరిగా ప్రయాణాలు చెయ్యకపోతేనేం" అని శకుంతలకి ఫోన్ చేసిందట. మొత్తం మీద 17న సాయంత్రం 6గంటలకల్లా మద్రాసు చేరుకున్నాము.

నేను రెగ్యులర్‌గా తెలుగు టి.వి సీరియల్స్ కొన్ని, రాత్రి భోజనాలయినతర్వాత రెండు తమిళ సీరియల్స్ చూస్తుంటాను. ఇవిగాక ఎస్.పి.బాలసుబ్రమణ్యంగారి "పాడుతా తీయగా", సాయికుమార్ 'వావ్', సుమవి కొన్ని, అప్పుడప్పుడు వంటల ప్రోగ్రాంలు, మిగతా ఏంకర్సు ప్రోగ్రాంలు చూస్తూ ఉంటాను. నాతోపాటు మావారు కూడా చూస్తూ ఉంటారు. చిన్నపిల్లల ప్రోగ్రాంలో, పాడుతాతీయగా ప్రోగ్రాంలో పార్టిసిపేట్ చేసిన చిన్నారి సింగీతం అంజనీ నిఖిల మా వారికి స్వయానా చిన్నాన్నగారి ముని మనవరాలు. అది చాలా ఎపిసోడ్లలో అవార్డు గెల్చుకుని, ఒక్కసారి కూడా ఎలిమినేట్ అవకుండా పైకి వచ్చింది. సింగీతం రాధాబాయి అని చాలా సంవత్సరాల క్రితం పలుసార్లు విజయవాడ రేడియోలో లలిత సంగీతం పాడ్తూ వచ్చింది. ఆవిడ నాకు తోటికోడలు అవుతుంది. ఆవిడ మనవరాలే ఈ అంజు. వాళ్ళ ఫైనల్ ఎపిసోడ్స్ అంతా అయి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంగారు వాళ్ళకి అమిత బాధపడ్తూ వీడ్కోలు పలుకుతూంటే నాకు చాలా ఏడుపు వచ్చింది. ఆ చిన్నారులని "యిప్పటితో మీ ఎపిసోడ్స్ అన్నీ అయిపోయాయి. మనం మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామో, మీరు పెద్దవాళ్ళయి మంచి పేరు ప్రఖ్యాతులు గాంచాలని వాళ్ళని దీవిస్తుంటే నా మనసు కలిచివేసింది. వెంటనే ఆయనకి ఫోన్ చేసి నా ఫీలింగ్స్‌ని, వాళ్ళని దీవించినరీతిని, ఆయన్ని అభినందించాను.

అలాగే 'వావ్' ప్రోగ్రాంలో సాయికుమార్ ఏంకరింగ్ చూసి అతనికి ఒకరోజు ఫోన్ చేసి అభినందించాను. నిజానికి అతని తల్లి, నేను హాస్పటల్‌మేట్స్. ఇద్దరూ మా ప్రెగ్నెన్సీలలో అక్కడ కలుసుకునేవాళ్ళం. ఆవిడ మా పిల్లల పెళ్ళిళ్ళకి కూడా వచ్చింది పాపం. ఒకరోజు సాయికుమార్ మా యింటికి ఫోన్ చేస్తే నేనే తీసుకున్నాను. "నేను సాయికుమార్" అని అతను చెప్పగానే "మీ అమ్మగారెలా ఉన్నారు?" అనడిగాను. బొంగురు పోయిన గొంతుతో "అది చెప్పడానికే ఫోన్ చేశాను నేను" అనేసరికి నాకు విపరీతమైన షాక్ కల్గింది. చాలా చిన్నతనంలోనే పోయింది అని బాధపడ్డాను.

మా సుధ వాళ్ళు 2012లో మే సెలవలకు అమెరికా ప్రయాణం పెట్టుకున్నారు. అక్కడ దాని కాలేజీ ఫ్రెండ్స్, స్కూల్ ఫ్రెండ్స్ నలుగురైదుగురు ఉన్నారు. వాళ్ళు ఇన్ని సంవత్సరాలైనా వాళ్ళ స్నేహితురాలు సుధని మర్చిపోకుండా ఉన్నారు. వాళ్ళు పెళ్ళయి పిల్లల్తో, భర్తతో అమెరికాలో ఉంటున్నా, సుధ కుటుంబం అమెరికా వస్తుందని తెలియగానే వాళ్ళే ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి పిల్చుకెళ్తామని, హోటల్‌లో ఉండి డాలర్లు ఖర్చుపెట్టుకోవద్దని, వాళ్ళ ఇళ్ళల్లోనే ఉండమని, వాళ్ళే అమెరికాలోని ప్రదేశాలు, సైట్‌సీయింగ్‌కి పిల్చుకెళ్తామని మెయిల్ చేస్తూ వచ్చారు. బంధువుల సంగతి ఎలా ఉన్నా, ఈ కాలంలో ఫ్రెండ్షిప్‌కి మించిన భాగ్యం ఇంకేదీలేదు. అనుకున్న ప్రకారం సుధ అమెరికాలో అందరి స్నేహితులతో కలిపి, ఆఖరి నాలుగురోజులు దాని బెస్ట్ ఫ్రెండైన సుజాతతో గడిపి వచ్చింది. మా సుధకు ఇలా గడిపిన రోజులు మాత్రం జీవితంలో మరచిపోలేని సంఘటనలు.

ఈ యాభై రెండేళ్ళ జీవిత గాథలో ఎన్నో ఒడుదుడుకులు చవిచూసాను. అయినా ఇన్ని వసంతాలు చాలా మధురంగా గడిచిపోయాయి. కానీ నేను యీ కథని రాసినన్నాళ్ళూ కొన్ని సంఘటనలు రాస్తున్నంతసేపు నా ఫీలింగ్స్, ఎమోషనల్‌గా ఫీలయ్యి కన్నీటి రూపాలుగా వదిలి నా బరువు దింపుకున్నాను. అదెందుకు అలా ఫీలయ్యానో నే చెప్పలేకపోతున్నాను. ముఖ్యంగా రెండు సంఘటనలు నా

జీవితంలో అమితంగా బాధించాయి. మొదటిది నా మొదటి ప్రసవం - అపజయం - రెండవది మావారికి ఉద్యోగం లేనప్పుడు ఆయన చేసిన ప్రయత్నాలు, ప్రయోగాలు. పెళ్ళికి ముందు ఒకటి - రెండు సంఘటనలు. నా జీవితంలో అపజయం కన్నా విజయమనే శాతమే యెక్కువ.

1991వ సంవత్సరంలో షష్టిపూర్తి చేసుకుని హోమం అదీ చేయించాము. 2010వ సంవత్సరంలో మా యాభై ఏళ్ళ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఇటు హోమం, సత్యనారాయణ వ్రతం, అటు బంధువులు, స్నేహితుల సమక్షంలో భోజన కార్యక్రమాలు ఆఖరుకి కేక్ కట్ చెయ్యడం చేసుకున్నాము. తరువాత మా వారికి 81వ ఏట అడుగిడింది. శ్రేయోభిలాషులూ, బంధువులు, మూడవసారి కూడా హోమం చేయిస్తే బాగుంటుందని అన్నారు. పైగా శతాభిషేక కూడా చేయించుకోవాలని సలహా యిచ్చారు. మార్చి 17వతేదీన 2012వ సంవత్సరం శనివారంనాడు మంచిరోజు, మా వారి నక్షత్రం కలిసి వచ్చింది అన్నారు. హోమం చేయించి, స్నేహితులని, బంధువులని, ఆహ్వానించి కన్నుల పండుగగా, ఆ వచ్చిన వారంతా మనఃపూర్వకముగా మాకు పాదాభివందనాలు చేసి, మా ఆశీర్వాదాలు తీసుకున్నారు. మా చెల్లెలు రఖుమ, వాళ్ళాయన వచ్చారని వేరే చెప్పక్కర్లేదు. ఒక్కరిద్దరు తప్ప అందరూ మా కన్నా చిన్నవాళ్ళేగా? మా యిద్దరమ్మాయిలు చి.సౌ.శకుంతల, చి.సౌ సుధ దగ్గరుండి చక్కగా జరిపించారు. ఈ శతాభిషేకం అన్నది చాలా అరుదుగా వచ్చే సందర్భం. ఆ భగవంతుడు కరుణించి మమ్మల్నిద్దర్నీ చిరంజీవులుగా దీవించి, ఇలా చేయించాడు. తర్వాత మూడురోజులకే అంటే మధ్యాహ్న భోజనాలక్కడే తీర్చేసుకుని వచ్చిచేరాము. ఏటేటా ఆ అమ్మవారికి మా పెళ్ళి రోజున చీర కట్టించే ఆనవాయితీ.

మంత్రాలయంలో వెలసిన ఈ మాంచాలమ్మ. అక్కడికి వెళ్ళిన వారందరూ ఈ మాంచాలమ్మ తల్లిని దర్శించుకునే లోపలికి వెళ్ళి శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకోవాలన్నమాట. ఇదేకాక మాకింకొక ఆచారం కూడా ఉంది. నెల్లురు జిల్లా గూడూరులో శ్రీ నారాయణమ్మ అనే దేవత కూడా ఉంది. మేము ఎప్పుడు గూడూరుకి వెళ్ళినా, ఈ అమ్మవారిని దర్శించుకుని, పూజలు, అభిషేకాలు జరిపించి, చీర కూడా కట్టిస్తుంటాము. గూడూరుకి వెళ్ళే దారిలో సూళ్ళూరుపేటలో చెంగాళమ్మ అనే దేవత గుడి కూడా వుంది. గూడూరుకి వెళ్ళినప్పుడల్లా, ఈ దేవతని కూడా దర్శించుకుని వెళ్తూంటాము.

మావారి 81 సంవత్సరం శతాభిషేకం మార్చి 17న. మా పెళ్ళిరోజు 52 వసంతాలు వెళ్ళి 53వ సంవత్సరంలో అడుగుపెట్టాము. భగవంతుడు మమ్మల్ని ఆశీర్వదించడంవలన, మా పిల్లలు చేసుకున్న అదృష్టం వలన మా జీవిత నౌక సాఫీగా ప్రయాణం చేస్తోంది. నా మాంగల్య భాగ్యం వలన చాలా ధన్యురాలనయ్యాను. ఆ దేవుని దయవలన మేమూ, మా పిల్లలు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ చల్లగా బాగుండాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నాను.

(సమాప్తం)